
నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి)

భాగం – 3



1.జాబాలి - ఏకాంక రూపకం


2. సీత జోస్యం,(పీఠిక, మరికొంత సమాచారంతో సహా)

3. నరకంలో హరిశ్చంద్రుడు, నాటకం (పీఠికతో సహా)

4. హిరణ్యకశిపుని హత్య

5.పంచరాత్రం (ద్రౌపది)

విషయ సూచి




జాబాలి

ఏకాంక రూపకం

సమర్పితము
మహాకవి, మానవతావాది
దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి
ప్రేమ గౌరవాలతో





ప్రథమ ముద్రణకు పీఠిక

నాకు తెలుసు, ఈ “జాబాలి” నాటికను చదివేవారిలో, దీన్ని చూచే వారిలో చాలామంది రామునిపట్ల నేను అపచారం చేసినట్టు భావిస్తారని, బాధపడతారని, ఇట్టి వారందరికి నా ప్రత్యుత్తర మిది. రామునిపట్ల అపచారం చేస్తున్నది నేను కాదు; మీరే! మీ రామాయణ పరిజ్ఞానం ముసలమ్మలు చెప్పగా మీరు విన్న కథలను దాటి వెళ్ళదు. బడిపంతుళ్లు చెప్పగా మీరు చదువుకున్న ప్రాథమిక వాచకాలను దాటి వెళ్ళదు. ఆ పైకి వెడితే, గిడితే హరిదాసులు చిత్రించేదే మీకు రామాయణం; పౌరాణికులు వివరించేదే మీకు రామాయణం. ఇంతకు మించి మీరు వెళ్ళరు; వెళ్ళినా, రంగనాథ, భాస్కర, మొల్ల, వరదరాజ రామాయణాల వరకే; కంబ, కృత్తివాస, తులసీదాస రామాయణాల వరకే; మీ మీ అభిరుచులనుబట్టి, అభిమానాలనుబట్టి ఇట్టి అనుసరణలలో ఏదైనా మరొకదానివరకే! ఈ రామాయణాలలో మీరు దేన్ని చదివినా, అది సంస్కృత రామాయణం మాత్రం కాదు.

“వాల్మీకి రామాయణం” అని కాక, “సంస్కృత రామాయణం” అని నేను కావాలనే అంటున్నాను. మన దేశభాషలలో ప్రస్తుతం ప్రచారంలో వున్న రామాయణా లన్నింటికి మూలగ్రంథమైన సంస్కృత రామాయణంలో వాల్మీకి కవిత్వంతోపాటు, ఇతరుల పైత్యంకూడా చాలా వున్నది. ఒక్క రామాయణమే కాదు. మహాభారతమైనా దాని తొలి రూపంతో మనవరకు రాలేదు. శ్రీహరి “అవతారంబులు దాల్చినాడు పది” అని చెబుతారు; మన రామాయణ, భారతాలు, ఒక్క పదికాక, పదిపదుల అవతారా లెత్తాయి. క్రీస్తుకు పూర్వం రెండవ శతాబ్దంలో సుంగరాజుల పరిపాలనాకాలం నుంచి, క్రీస్తు తర్వాత ఏడెనిమిది శతాబ్దాల వరకు వీటిలో మార్పులు, చేర్పులు జరుగుతూనే పోయాయి.

సంస్కృత రామాయణానికి సంబంధించినంతవరకు అది ఎంత పెరిగిందో, ఏ విధంగా పెరిగిందో, ఏ యే ఘట్టాలలో పెరిగిందో మరి కొంత దూరం పోయిన తర్వాత ప్రస్తావిస్తాను; ఈ లోపున నేను మీకు నివేదించ గోరుతున్నది ఈ నాటి మన సంస్కృత రామాయణంలో సగంలో సగమైనా వాల్మీకి రచన కాదని. ఆదికవి వ్రాసిన రామాయణాన్ని దాని ఆదిరూపంలో చదువుకొనే అవకాశం ఈనాడు మనకు లేకపోయినా, ప్రస్తుతం వాల్మీకి పేరుతో చెల్లుతున్న విస్తృత కావ్యాన్ని సయితం మీరు చదవడంలేదు. మీవలె కాక, నేను దాన్ని చదివాను. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు కాక, పదేపదే చదివాను. నాకు సంస్కృతం తెలియకపోవచ్చు. అయితే, సంస్కృతం తెలియని వారైనా సంస్కృత రామాయణాన్ని చదువుకోడానికి యథామాతృకంగా జరిగిన భాషాంతరీకరణలు లేకపోలేదు. మన తెలుగులో కూడా ఇట్టివి కొన్ని ఉన్నాయి. అయితే, వ్యావహారిక భాషలోకి ఇటీవల జరిగిన ఆంధ్రానువాదాలు నాకు నచ్చలేదు. నేను వ్యావహారిక భాషావాదిని కాబట్టి, సహజంగా ఇవే నాకు హెచ్చుగా నచ్చాలి. కాని, వీటిలో తెలిసో, తెలియకో మూలపాఠానికి భిన్నంగా వెళ్ళిన సందర్భాలు కానవస్తున్నాయి. తెలియక కాక, తెలిసే ఈ అనువాదకులు అక్కడక్కడ కప్పదాట్లు వేశారని నా నమ్మకం. ఏమైనా, కొత్త తెనిగింపులను కాక, చదలువాడ సుందరరామశాస్త్రులుగారి తాత్పర్యంతో వావిళ్ళవారు తెలుగు లిపిలో ప్రచురించిన సంస్కృత రామాయణాన్ని చదువుకొనడం మంచిది. వావిళ్ళవారే ప్రచురించిన సరస్వతుల సుబ్బరామశాస్త్రిగారి ఆంధ్రానువాదం కూడా మూలానికి చాలా చేరువగా ఉన్నది. దాని ప్రతులు ప్రస్తుతం సులభంగా లభ్యం కావడం లేదుగాని, శ్రీ మన్మథనాథ దత్తు ఆంగ్లానువాదం ఎంతో ప్రశస్తమైంది.

నావలె మీలో కొందరు మూలాన్ని తు.చ. తప్పకుండా అనుసరించిన అనువాదాలనే చదివి ఉండవచ్చు. మీలో సంస్కృత భాష వచ్చినవారు మూల పాఠాన్నే పఠించి ఉండవచ్చు. అయితే మీరు దాన్ని పఠనం అనరు; పారాయణం అంటారు. పారాయణం అనగానే జిజ్ఞాస స్థానాన్ని భక్తి ఆక్రమిస్తుంది; వివేకాన్ని ఒక ప్రక్కకు నెట్టి విశ్వాసం తిష్టవేస్తుంది.
ఈ పరిస్థితిలో రామాయణ పారాయణం రాముని అర్థం చేసుకొనడం కోసం కాదు. ఆయనను ఆరాధించడం కోసం; ఆయన వ్యక్తిత్వానికి విలువకట్టడం కోసం కాదు, ఆయనద్వారా మోక్షాన్ని సాధించడం కోసం.

మోక్షమార్గాన్ని చూపే ఒక మతగ్రంథంగా రామాయణాన్ని పారాయణం చేసేవారితో నాకు పేచీ లేదు. సంస్కృత భాషలో ఆదికావ్యంగా, మహాకావ్యంగా, మధురకావ్యంగా దాన్ని మెచ్చుకునేవారితో కూడా నేను వివాదపడను. అది కవితా సౌరభాలను గుబాళించే ఉత్తమ కావ్యం. ప్రాచీనార్వాచీనకాలాలలో భాసుడు, కాళిదాసు, భవభూతి, రవీంద్రుడు మొదలైన మహాకవుల నెందరినో అది ప్రభావితులను చేసింది. ఒక రసవత్తరకావ్యమే కాక, అది చారిత్రక గ్రంథమని వాదించేవారి అజ్ఞానమే, వారి అహంకారమే నాకు దుస్సహం.

చరిత్ర కథ కావచ్చు; కథ మాత్రం విధిగా చరిత్ర కానక్కరలేదు. పురాణంలో ఇతిహాసం జమాత్రంగా వుండవచ్చు; అంతమాత్రం చేత పురాణం ఇతిహాసం కాబోదు. కాని కావ్యం కొంతవరకు వాస్తవిక సంఘటనలపై కాలూనవచ్చు; కల్పనలో ప్రాగల్భ్యాన్ని చూపలేనిది ఉత్తమకావ్యం కానేరదు.

మన రామాయణ, భారతాలు ప్రధానంగా కథలే, గాథలే, కావ్యాలే, పురాణాలే! అవి చరిత్రలు కావు; కానేరవు, నా మాటగా దీన్ని మీరు అంగీకరించకపోతే, సర్ ఆర్.జి. భండార్కర్ తీర్పుగానైనా అంగీకరిస్తారా? ఆయన బహుభాషా పండితుడు; భారతీయ చారిత్రక పరిశోధకులలో ఇంచుమించుగా ప్రప్రథముడు. విస్మృతి గర్భం నుంచి ఎన్నో ప్రాచీన శాసనాలను ఆయన వెలుగులోకి తెచ్చాడు. మన చరిత్రను, సభ్యతను, సంస్కృతిని వివరించే వ్యాసాలను, గ్రంథాలను ఎన్నింటినో రచించి, ప్రపంచం మన్ననలను పొందాడు. పూనాలోని "భండార్కర్ ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్" ఆయన పేర వెలసినట్టిదే. అట్టి భండార్కర్ "రామాయణ, భారతాలు పురాణాలే కాని, చారిత్రక గ్రంథాలు కావు" అని చెప్పాడు. "వాటికి చారిత్రకాధారాలు ఏవైనా కొన్ని వుంటే వుండవచ్చు; వాటిలో పేర్కొనబడిన వ్యక్తులలో ఎవరో కొందరు నిజంగానే జీవించిన వారై వుండవచ్చు. అయితే ఇతర సాక్ష్యాధారాలు లేనంతవరకు వారిని చారిత్రక వ్యక్తులుగా మనం గుర్తించలే" మని చెప్పాడు. "చరిత్రలుగా భావించదగు ప్రాచీన రచనలు మనకు బహుస్వల్పంగానే వున్నాయి. ఒకప్పుడు మరింత హెచ్చుగా అవి బహుశా వుండేవేమో! ఇప్పుడు మాత్రం అవి మనకు లభ్యం కావడంలే"దని చెప్పాడు. ప్రస్తుతం మనకున్న సంస్కృత రచనలలో విక్రమాంక చరిత్ర, హర్షచరిత్ర, రాజతరంగిణి, ప్రాకృత రచనలలో గౌడవధ -ఇవి మాత్రమే చారిత్రక గ్రంథవిభాగానికి చెందుతాయని చెప్పాడు.

"ఎందుకయ్యా! వుంచినావు బందిఖానాలో" అని రామభజనచేసే పామరుడు సగరుడు 30,000 సంవత్సరాలు, దిలీపుడు మరొక 30,000 సంవత్సరాలు రాజ్యంచేశారంటే నమ్మవచ్చు. దశరథునికి 60,000 సంవత్సరాలు నిండిన పిమ్మట రాముడు పుట్టినాడంటే అతడు విశ్వసించవచ్చు. తన తండ్రి తాతల కాలం నుంచి తన కాలానికి వచ్చేసరికి సత్యయుగ ప్రభావం తగ్గినందువల్లనే కావచ్చు, రాముడు పదకొండు వేల సంవత్సరాలు మాత్రమే రాజ్యంచేసి, బ్రహ్మలోకానికి చేరినాడంటే ("బ్రహ్మలోకం గమిష్యతి" - బాలకాండ ప్రథమ సర్గ) అతడది నిజమే అనుకోవచ్చు. (రాముని రూపంలో విష్ణులోకంనుంచి భూతలానికి దిగివచ్చిన శ్రీమహావిష్ణువు తన లోకానికి తిరిగి వెళ్ళక, బ్రహ్మలోకానికి ఎందుకు వెళ్ళాడో!) ఒకే బాణాన్ని రాముడు వేయగా, అది ఏడు మద్దిచెట్లను పెకలించి, నేలలో దూరి, క్షణంలో మరింత వేగంతో వెనుకకు

వచ్చి, తిరిగి ఆయన తూణీరంలో దూరిందంటే, దాన్ని అతడు అత్యుక్తిగా సంభావించక పోవచ్చు. రావణునికి పది తలలు, ఇరవై చేతులు వుండేవంటే, దాన్ని అసంభవ విషయంగా అతడు పరిగణించకపోవచ్చు. వాలి, సుగ్రీవాదులకు వాలా లుండేవంటే "కాబో"లని అతడు సరిపెట్టుకోవచ్చు.
హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని ఒకే ఒక గంతుతో దాటినాడన్నా, ఒక పర్వతానికి పర్వతాన్నే ఒక్క ఊపుతో పెళ్ళగించుకు వచ్చాడన్నా, ఈ సంఘటనలలో విడ్డూరమేమీ అతడికి కనబడకపోవచ్చు. కాని, చదువు సంధ్యలున్నవారే, పట్టభద్రులైనవారే, పండిత ప్రకాండులుగా చెల్లుతున్నవారే, ఈ నవయుగానికి తగినట్టు నవ్యభావాలను ప్రచారంచేస్తూ, నూతన సంఘ నిర్మాణానికి ప్రాతిపదికలను వేయడంలో ప్రత్యేక బాధ్యత వహించవలసిన ప్రజానాయకులే, పత్రికా సంపాదకులే ఈ కాకమ్మ కథ లన్నింటిని కడిగిపోసిన సత్యాలుగా స్వీకరించడం మన దేశదౌర్భాగ్యం కాదా?

ఈ మేధావులే, ఈ సంఘనాయకులే ఇంత మౌఢ్యాన్ని ప్రదర్శిస్తే, శాస్త్రీయ ("సైంటిఫిక్") దృక్పథం మన ప్రజలలో ఏవిధంగా విస్తరిస్తుంది? వైజ్ఞానిక పథంలో మన జాతి ఏవిధంగా పురోగమిస్తుంది? సాంకేతిక రంగంలో మన దేశం ఏమి విజయాలను సాధించగలుగుతుంది?

ఆవేశానికి లోనై నేను ఏమేమో వ్రాస్తున్నట్టు ప్రాచీన భారతీయ సంస్కృతికి సజీవ ప్రతినిధులుగా నిలుస్తున్నామని భావించుకొంటున్న మీరు పెదవి విరవడానికి ముందు, కాస్త నిదానించి, సర్ ఆర్.జి. భండార్కర్ వ్రాసిన ఈ క్రింది వాక్యాలను ఒకసారి కాస్త సావధానంగా చిత్తగించండి: "మన విశ్వవిద్యాలయాలకు చెందినవారు చేస్తున్న అనేక రచనలను, మన పత్రికలలో వెలువడుతున్న పెక్కు వ్యాసాలను పఠించగా, మానసిక శిక్షణ పొందడంద్వారా సరైన పద్ధతులలో వాదించగల నేర్పును మనం సంపాదిస్తున్నా, మన వాదాల ప్రాతిపదికలను తులనాత్మకంగా పరిశీలించగల శక్తితోపాటు అందుకు వలసిన విశాలదృష్టి, విస్తృత పరిజ్ఞానాలు మనలో ఇంకా లోపిస్తున్నాయనే నాకు అనిపిస్తుంది. రామాయణాన్ని చారిత్రక గ్రంథంగా పరిగణించే బి.ఏ.లు, ఎం.ఏ.లు మనలో ఉన్నారు! ఇంగ్లీషు న్యాయశాస్త్రంలోని సూక్ష్మాంశాలను గురించి వీరు సక్రమంగానే వాదిస్తారుగాని, హిందూ న్యాయశాస్త్రాన్ని గురించి ఒక వ్యాసం వ్రాయమంటే, దాని పరిణామంలోని వివిధ దశలను గుర్తించలేరు. శుక్ల యజుర్వేదంలోని పెక్కు సూక్తాలను రచించిన యాజ్ఞ్యవల్క్యుడే యాజ్ఞ్యవల్క్య స్మృతిని వ్రాసినట్టు వీరు భావిస్తారు. ఈ రెండు రచనలలోని భాషా విభేదాలైనా గమనార్హమైనవిగా వీరి బుద్ధికి తోచవు".

మన బి.ఏ.లను గురించి, ఎం.ఏ.లను గురించి శ్రీ భండార్కరే ఇంకా చాలా చాలా విషయాలు వ్రాశాడు. వాటిలో మచ్చుకు మరికొన్ని :
"ఎందువల్లనోకాని వంగరాష్ట్రంలోను, మనదేశంలోని కొన్ని ఇతర ప్రాంతాలలోను జాతీయ దురహంకారం ప్రబలింది. పిన్న పెద్దల మనస్సులపై అది సమానంగా రాజ్యం చేస్తున్నది. యూరోపియన్ సాహిత్యం నుంచి, లేదా, దార్శనిక శాస్త్రం నుంచి ఏ కొత్త భావాన్ని పేర్కొన్నా, అది మన సాహిత్యానికి, మన దార్శనికాలకు కొత్తదేమీ కాదని, శతాబ్దాలనాడే అది మనవారికి స్ఫురించిందని ఉద్ఘాటించడానికి మన యువకులలోనే పెక్కుమంది తాపత్రయ పడుతున్నారు. మన పూర్వీకులకు తెలిసిన విషయాలకు మించి ఈనాడు యూరపు ఇంచుమించుగా ఏమీ తెలియదని మనవారు విశ్వసించగోరుతున్నారు. ఈ విధమైన చిత్తవృత్తి మన కున్నప్పుడు అన్యజాతుల చరిత్రను, వాటి ప్రగతిని న్యాయంగా, నిష్పాక్షికంగా వితర్కించి, వాటి మంచి చెడ్డలను తెలుసుకోగల అంతస్తుకు మనం వెళ్ళలేము".

అదేమి వైపరీత్యమో తెలియదుగాని, శ్రీ భండార్కర్ దాదాపు అర్ధశతాబ్దినాడు ఇంతగా నిరసించిన ఈ జాత్యహంకారం స్వాతంత్ర్య సంసిద్ధి తర్వాత మరింత ప్రబలింది; తార్కిక దృష్టి, విచక్షణాశక్తి ప్రస్తుతం మరింత కొరతగా వున్నాయి. అంతకంతకు అధికంగా ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలను నేర్చేవారు నేర్చుతున్నారు; వాటిలో పరిశోధనలు చేసేవారు చేస్తున్నారు. అయినా పూర్వాచార పరాయణత్వం పెరుగుతున్నది;
పూర్వసంప్రదాయాల పునరుద్ధరణ యత్నం ప్రబలుతున్నది; పూర్వకాలాన్ని గురించిన శుష్కప్రగల్భాలతో చెవులు చిల్లులుపడి పోతున్నాయి. ఇందుకుగల కారణాన్ని ఆధునిక మానసిక శాస్త్రవేత్తల పరిభాషలో చెప్పాలంటే, మన పూర్వగ్రంథాల వద్దకు, విశ్వాసాల వద్దకు, సంస్కృతివద్దకు వచ్చేసరికి "స్కిజోఫ్రీనియా" మనలను పట్టుకొంటున్నది.

ప్రాచీనమైన ప్రతిదాన్ని పవిత్రమైనదిగా భావించేవారికి, పరమసత్యమైనదిగా విశ్వసించేవారికి నే నింతవరకు వ్రాసిన విషయాలే దుస్సహమైనవిగా తోచివుంటాయి. అయినా, నాపై కోపగించి, ఇంతటితో ఈ పీఠికను చదవడం మానివేయవద్దని నా మనవి. తుదకంట దీన్ని చదివి, ఆ పిదప మీ పూర్తికోపాన్ని వెళ్ళగక్కండి; పట్టలేని మీ కోపం మరొకవిధంగా తీరకపోతే, అప్పుడు నన్ను పడదిట్టండి! అప్రియ సత్యాలను పలికి, తిట్లు తినడం నాకు కొత్త కాదు.

వ్రాతప్రతి రూపంలో వుండగా నా "జాబాలి" నాటికను నేను విజయవాడ, హైదరాబాద్లలో చదివి వినిపించగా దాన్ని విన్న కవి, పండితులలో కొందరు దానిలోని కొన్ని అంశాలు దుర్బుద్ధితో నేను కల్పించిన అబద్ధాలన్నట్టు నొసలు ఎగర వేశారు, పెదవి విరిచారు, ముఖం చిట్లించారు; "ఎంతటి పాపపు మాటలు వినవలసి వచ్చింది" అని తమ రెండు చెవులు గట్టిగా మూసుకొనడం మినహాగా తమ నిరసన భావాన్ని వీలైనన్ని విధాల వ్యక్తం చేశారు. మర్యాదగా మరి నన్ను విడిచి పెట్టరాదని భావించిన వారొకరు మాత్రం దశరథుని భార్యలను గురించి నేను తెచ్చిన ప్రసక్తి వద్ద నన్ను నిలబెట్టి "దశరథునికి మూడువందల యాభైమంది భార్యలని మీకెవరు చెప్పారు?" అని నిగ్గదీశారు. అంతట నేను "వాల్మీకి చెప్పాడు! నా మాటపై తమకు నమ్మకం లేకపోతే, ఇంటికి తిరిగి వెళ్ళగానే దయచేసి వాల్మీకి రామాయణాన్ని ఒకసారి పైకితీసి, అయోధ్యాకాండ చూడండీ" అని విన్నవించాను. ఇంటికి తిరిగి వెళ్ళిన తర్వాత వాల్మీకి రామాయణాన్ని ఒకసారి పైకితీసి చూచే శ్రమను బహుశా ఆయన పడివుండరు. ఆ మాటకువస్తే వాల్మీకి రామాయణం ఆయన ఇంటిలో లేదేమో కూడా!

ఆయనవలె మీరు కూడా నన్ను ఆక్షేపిస్తారే తప్ప, ఆడిపోసుకుంటారే తప్ప, సంస్కృత రామాయణంలోని రామునికి, మీ హృదయాలపై రాజ్యంచేసే రామునికి, అనేక విషయాలలో ఎంత వ్యత్యాసం వున్నదో స్వయంగా పరిశీలించి తెలుసుకొనడానికి ప్రయత్నించరు. అందువల్ల రాముని గురించి, రామాయణంలోని ఇతర పాత్రలలో కొందరిని గురించి, మీరు తెలుసుకోదగు విషయాలలో కొన్నింటిని మాత్రమే సంగ్రహంగా వ్రాయబోతున్నాను.

అయోధ్యాకాండలోని 34వ సర్గ ప్రకారం దశరథుని భార్యలు 350 మంది. పట్టపు భార్య లుండేవారో, దేవేరులైన కౌసల్య, కైకేయి, సుమిత్రలుకాక, ఆయనకు 350 మంది వారిని కలుపుకొని వారి సంఖ్య 350 వరకు దేకిందో ఆ వైనం మాత్రం స్పష్టంగా లేదు. నా "జాబాలి" నాటికలో నే నంతవరకు వెళ్ళలేదుగాని, రామభరతులు సయితం బహుపత్నీకులే అని సంశయించవలసి వస్తుంది. రామ పట్టాభిషేకానికి వ్యతిరేకంగా కైకేయిని రెచ్చగొట్టిన సందర్భంలో ఆమెతో మంథర "రాముడు పట్టాభిషిక్తుడైతే ఉత్తములగు రాముని స్త్రీ లందరు ఆనందంతో కులుకుతారు; భరతుడు దరిద్రుడై పోతాడు. కాబట్టి నీ కోడళ్ళు సుఖసంతోషాలకు దూరమైపోతా"రని హెచ్చరిస్తుంది. (అయోధ్యాకాండ, 8వ సర్గ) ఇక్కడ "ఉత్తములగు రాముని స్త్రీలు" అనేదానికి "సీతాదేవి చెలికత్తెలు" అని చెప్పి దాటవేయడానికి రామాయణ వ్యాఖ్యాతలు ద్రావిడ ప్రాణాయామం చేశారు. "నీ కోడళ్లు" అని స్పష్టంగా వున్నందున భరతుని విషయంలో ఏ ప్రాణాయామం చేసినా,

తాము చేయగలిగింది లేకపోయింది! కాని, సీత చెలికత్తెలను, కైకేయి కోడళ్ళను ఒకే స్థాయిలో పెట్టి మంథర మాట్లాడుతుందా? అలా నిజంగా మంథర మాట్లాడివుంటే “సీత చెలికత్తెలతో నా కోడళ్ళను జతచేస్తావా, పాపిష్టిదానా!” అని కైకేయి విరుచుకుపడేది కాదా?

“రాముని స్త్రీల”ను వ్యాఖ్యాతలు “చెలికత్తెలు”గా మార్చిన సందర్భం మరొకటి కూడా వున్నది. లంక పై దండెత్తడానికి తనకు మార్గ మీయవలసిందిగా సముద్రుని ప్రార్థిస్తూ మూడు రోజులపాటు సముద్ర తీరంలో దర్భశయ్యపై రాముడు పరుంటాడు. అప్పుడు ఆయన తలగడగా పెట్టుకున్న కుడిచేయి “ఉత్తమస్త్రీలచే పరిపరి విధాల కౌగలించు కొనబడినట్టి "దని (యుద్ధకాండ 21వ సర్గ) పేర్కొంటున్నది. ఇక్కడ “ఉత్తమ స్త్రీలను” వ్యాఖ్యాతలు “ఉత్తమ పరిచారికలు”గా సులభంగానే మార్చివేయగలిగారు. అయితే, పరిచారికలు యజమాని చేతిని పరిపరివిధాల కౌగలించుకుంటారా? ఇది వ్యాఖ్యాతల గొంతులో పచ్చివెలక్కాయ అయింది. కాని, ఎంతకైనా తగు ఘనులైనందున రాముని చేతిని ఆయన పరిచారికలు కౌగలించుకోలేదని, అదేపనిగా బాణాలువేయగా నొచ్చినప్పుడు కాబోలు, దాన్ని వారు “పరిపరివిధాల పిసికినా”రని చెప్పి, తమ గొంతులో చిక్కుకున్న పచ్చివెలక్కాయను కక్కివేశారు. ఇట్టి వ్యాఖ్యాతలకు నివ్వాళిపట్టాలా - లేక నిలువునా పాతివేయాలా? ఆ తీర్పును మీకే విడిచి పెడుతున్నాను.

అన్నట్టు, రామునికి ఏకపత్నీ వ్రతం విషయంలో ఏమంత పట్టుదల లేనట్టు సుందరకాండ 28వ సర్గలో సీత స్వయంగా ధ్వనిస్తుంది. రావణుని ఆజ్ఞ ప్రకారం త్వరలో తనకు శిరశ్ఛేదం తప్పదని భయపడిన ఘట్టంలో ఆమె భర్తను తలచుకుని "పదునాలుగేండ్ల వనవాసం తర్వాత నీవు అయోధ్యకు తిరిగి వెళ్ళి, నన్ను మరచిపోయి, పెక్కంద్రు జవరాంద్రనుగూడి సుఖంగా వుంటావు” అని దుఃఖిస్తుంది! ఇక్కడ “పెక్కంద్రు” అనే మాటను దయచేసి మీరు గమనిస్తారా?

రామాయణాంతర్గతమైన అహల్యా శాపవిమోచన కథకు ఎంత వ్యాప్తిలేదు? బహుళ వ్యాప్తిగల ఈ కథ ప్రకారం రాముని పాదస్పర్శ తగిలినంతనే అంతవరకు శిలగా పడివున్న అహల్య శాప విమోచనం పొంది, నిజరూపంతో లేచి నిలబడి రామునికి ప్రణమిల్లుతుంది. సంస్కృత రామాయణంలో ఈ “ప్రణమిల్లడం” ప్రసక్తి లేకపోలేదుగాని, ముందుగా రామలక్ష్మణులే ఆ జారిణికి ప్రణమిల్లగా, అటుపిమ్మట ఆమె వారికి పాదాభివందనం చేస్తుంది. స్వల్పమైన ఈ ఒక్క వివరంలోనే కాక, అనేక ముఖ్య విషయాలలో కూడా సంస్కృత రామాయణంలోని అహల్యా శాపవిమోచన గాథకు, బహుళ ప్రచారంలో గల కథకు సంబంధం చాలా తక్కువ. అహల్యను మోసగించి, ఇంద్రుడు ఆమెతో క్రీడించాడని, తెలియకనే పాపంచేసినా, ఆమెపై కినిసి, శిలగా పడివుండవలసిందిగా గౌతముడు ఆమెను శపించాడని బహుజనాభిప్రాయం. కాని, సంస్కృత రామాయణ కథనం ప్రకారం దేవేంద్రుడు తన భర్త వేషంలో వచ్చినట్టు గ్రహించడానికి అహల్యకు ఒక్క క్షణమైనా పట్టలేదు. అయినా, పాడు బుద్ధివల్ల సురాధిపతికి ఆమె లోబడింది. ఇంతేకాదు, స్వర్గాధిపతితో తనకు పొందు లభించడం తన అదృష్ట విశేషమని భావించింది. “నా జన్మ పావనమైంది; మనకు ప్రమాదం రాకుండా నా భర్త తిరిగి రాకముందే మీరు చల్లగా తప్పుకోండి” అని దేవేంద్రుని ఆమె హెచ్చరించింది. కాని, ఇంతలోనే తిరిగి రానేవచ్చిన గౌతముడు కుపితుడై, ముందు సురాధిపతిని శపించి, అటు పిమ్మట అహల్యవైపు తిరిగి పలికిన పలుకు లివి:

“ఈ ఆశ్రమంలో నీవు పెక్కువేల సంవత్సరాలు వాసం చేస్తావు. ఇక్కడనే వసిస్తూ, ఆహారం విడిచి, నీవు వాయుభక్షణం చేస్తావు; బూదిపోగులలో పరుండివుంటావు; ఎవ్వరికీ కనబడకుండా వుంటావు; ఇక్కడికి రాముడు వచ్చిన నాడు నీవు పరిశుద్ధవు కాగలవు” (బాలకాండ 48-49 సర్గలు).

దీన్ని బట్టి దేవేంద్రునితో వ్యభిచరించిన తన ధర్మపత్నిని గౌతముడు తన పుణ్యాశ్రమం నుంచి తరిమివేయడం వరకైనా వెళ్ళలేదనడం సువిదితమే! పై పెచ్చు, తపస్సు నెపంతో హిమాలయాలకు తానే వెళ్ళిపోయాడు. రాయిగానో రప్పగానోకాక, రమణిగానే అహల్య మిగిలింది. రామలక్ష్మణులు చూచినప్పుడు ఆమె "మోహినీ దేవత అన్నట్టు" ప్రభాసిస్తున్నదట.
ఇది ఆమె తపోబల ఫలితమని సంస్కృత రామాయణం చెబుతున్నది. ఆమె నెరపినట్టిది ప్రేమ తపస్సే కావచ్చు. ఇంద్రుడు తనకు చవిచూపించిన స్వర్గసుఖ సంస్మరణ రూపంలో అది కొనసాగి ఉండవచ్చు. ఏమైనా ఆ "మోహినీదేవత" సౌందర్య ప్రలోభం వల్లనే కాబోలు, రాముడు రానే వచ్చినందున మరి తాను లేనిపోని మాటపట్టింపులకు పోనక్కర లేదని గౌతమ మహర్షి పుంగవుడు భావించాడు; హిమాలయాల నుంచి వాయువేగ, మనోవేగాలతో బయలుదేరి, తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. ఆమెతో (ఎన్నివేల సంవత్సరాలో ఆ వైనం తెలియదుగాని) తిరిగి సుఖంగా కాపురం చేశాడు. గౌతముడు తిరిగిరాగానే (తమ ప్రభువు చెడగొట్టిన కాపురం తిరిగి కుదుటపడిందని కాబోలు) దేవతలందరు "బాగుబా" గని అహల్యను మరి మరి కొనియాడారు!

ఈ గాథను వివరించే సందర్భంలో దేవేంద్రునికి గౌతముడు పెట్టిన శాపాన్ని గురించి, దానినుంచి అతడు విముక్తి పొందిన విధాన్ని గురించి కావాలనే నేను ప్రస్తావించడం లేదు. ఇక్కడ కూడా సంస్కృత రామాయణం చెప్పే దొకటి కాగా, బహుళ ప్రజలు చెప్పుకునేది మరొకటి. అయితే అసభ్యాలలో, అశ్లీలాలలో ఒకదాని కొకటి తీసిపోవు కాబట్టి, అసలు శాపమేమిటో, ప్రచారంలో గల శాపమేమిటో, ఆ వివరాలలోకి నేను పోబోవడం లేదు. ఏమైనా, ఒక్క గౌతముని విషయంలోనే కాదు, దాదాపు అందరి విషయంలో దేవేంద్రుని ప్రవర్తన నీచమైనదే, నికృష్టమైనదే, నింద్యమైనదే! అతని బుద్ధి వంకర, అతని నడక వంకర!! నాకు తెలియదుగాని, స్వర్గాధిపత్యానికి కావలసిన అర్హతలు ఇవేనేమో! అతడెట్టి వాడై తేనేమి? పదవిలో ఉన్నవాడు, వరా లివ్వగలవాడు. రావణ వధానంతరం హుటాహుటిగా లంకకు వేంచేసిన ఆ దేవేంద్రుని ముందు బహుశా ఈ రెండు కారణాలను పురస్కరించుకునే రాముడు "చేతులు ముడుచుకొని" నిలబడతాడు; అతడిని ప్రార్థించి యుద్ధంలో కూలిన వానరులందరు తిరిగి బ్రతకగలరనే వరాన్ని పొందుతాడు!(యుద్ధకాండ, 123వ సర్గ).

రాముని బాణానికి కూలిన మారీచుడు "హా సీతా! హా లక్ష్మణా!" అని వేసిన కేకను విన్న సందర్భంలోనే దుఃఖావేశంతో సీత లక్ష్మణుని తీవ్రంగా నిందించిందని కూడా బహుజనాభిప్రాయం. కాని, అంతకంటే కూడా పరుషంగా ఆమె రాముని నొవ్వనాడిన సందర్భం సంస్కృత రామాయణంలో ఉన్నది.

అరణ్యవాస కేశాలను వివరించి, తనవెంట ప్రవాసానికి రావలదని రాముడు బ్రతిమలాడిన ఘట్టంలో "నీవు పురుష రూపంలో ఉన్న స్త్రీవే కాని, పురుషుడవు కా" వని ఆమె పలుకుతుంది.

జనకునిపై పెట్టి, ఆమె ఆ మాట అన్నట్టు సంస్కృత రామాయణంలో ఉన్నదనుకోండి. ఏమైనా ఆమె నోటివెంట ఈ మాట వచ్చింది. పైగా, తన మాటగా "సూర్యప్రతాపాన్ని నీలో చూస్తున్న ప్రజలు పరమమూరు"లని అంటుంది, అంతటితోనైనా ఆగలేదు. 'నూతన యౌవనంలో ఉన్నాను; బహుకాలంగా నీతో కాపురం చేస్తున్న పతివ్రతను. అయినా, తన భార్యను పరపురుషుల కప్పగించి జీవించే శైలూషునివలె నన్ను అన్యుల కివ్వగోరుతున్నా"వని కూడా నిందిస్తుంది (అయోధ్యా కాండ, 30వ సర్గ).

పతివ్రతా శిరోమణిగా పేరొందిన సీత ఇంత కఠినంగా, ఇంత కర్కశంగా, ఇంత క్రూరంగా భర్తను నిందించినట్టు సంస్కృత రామాయణంలోనే ఉండబట్టి సరిపోయింది కాని, కోపం వచ్చినప్పుడు ఆమె భర్తనైనా ఈ విధంగా నిందించడానికి సంకోచించేది కాదని నాబోటి వాడెవడైనా వ్రాసివుంటే, అతనిపై ఎంద రెంతగా కత్తులు నూరేవారో!
భరతుని స్వభావాన్ని లక్ష్మణుడు అపార్థం చేసుకున్నా, రాముడు మాత్రం అతని సౌజన్యాన్ని పూర్తిగా గుర్తించినట్టు మీ నమ్మకం; మీతో పాటు చాలామంది నమ్మకం కాని, ఇందుకు భిన్నంగా ఒక సన్నివేశంలో - లక్ష్మణుని తనవెంట వనవాసానికి రావలదని నచ్చచెప్పడానికి ప్రయత్నించిన సన్నివేశంలో - రాముడు ఏమన్నాడో చూడండి:

"భరతుడు స్వయంగా మంచివాడైనా, కైకేయి దుర్భోధనలకు లోనై, రాజ్యాన్ని పొంది, మిక్కిలి వగలపాలైవున్న కౌసల్యాసుమిత్రల యోగక్షేమాలను విచారించబోడు. అందువల్ల నీ విక్కడ నిలచి, స్వయంగా గాని, రాజాదరణం పొందిగాని పూజనీయులైన మన తల్లులను పోషించాలి" (అయోధ్యాకాండ 31వ సర్గ).

పోనీ, ఆదిలో అపోహపడినా, అటు తర్వాతనైనా భరతుని అంతస్తును రాముడు సరిగా, పూర్తిగా, సందేహానికి ఆవంతగానైనా ఆస్కారం లేకుండా అర్థం చేసుకున్నాడా? రామభక్తు లెంతగా విషాదాశ్చర్యాలకు లోనైనా, ఈ ప్రశ్నకు సమాధానం "లే" దనే! తల్లి తనకై సంపాదించిన రాజ్యాన్ని భరతుడు చేజేతుల వదులుకున్నాడు; అయోధ్యకు తిరిగివచ్చి పట్టం కట్టుకోవలసిందిగా అన్నను కోరడానికై చిత్రకూటం వరకు వెళ్ళాడు; "నా తల్లి చేసిన తప్పుకు నన్ను మన్నించవలసిం" దని కన్నీటితో వేడుకున్నాడు; అంతగా కాళ్ళావేళ్ళాపడినా తన మాటను అన్న త్రోసిపుచ్చగా, ఆయన పాదుకలకే పట్టాభిషేకం చేసి వాటి ప్రతినిధిగా తాను పరిపాలన సాగించాడు. ఆ బాధ్యత నిర్వహించడమైనా అయోధ్యానగరంలో ప్రవేశించక, దాని వెలుపల నందిగ్రామంలో ప్రవాసిగా వుంటూనే; ప్రమోదరహితంగా బ్రతుకుతూనే.

అయినా, రావణవధానంతరం అయోధ్యాపురికి మరలి రావడానికై పుష్పకవిమానంపై ప్రయాణమైన రాఘవుడు భరతుని నుంచి తనకు లభించగల స్వాగతం విషయమై సందేహం వెలిబుచ్చుతాడు! తనకంటే ముందుగా నందిగ్రామాన్ని చేరి, తన ఆగమనవార్తను భరతునికి తెలియజేయడానికి హనుమంతుని నియోగించి, అతనితో రాముడన్న మాటలు వినండి:
"సీతాలక్ష్మణ సమేతుడనై నేను తిరిగి వస్తున్నట్టు భరతునికి చెప్పు... శత్రువు లందరిని సంహరించి, అత్యంతమైన కీర్తి నార్జించి, బలవంతులైన మిత్రులను వెంటబెట్టుకొని నేను వస్తున్నట్టు చెప్పు... ఈ మాటలు చెబుతూ, భరతుని చూపులను, చేష్టలను జాగ్రత్తగా కనిపెట్టు; అతని ముఖ కవళికలను, మాటతీరును శ్రద్ధగా గమనించు!"

భరతుని విషయమై తాను ఈ విధంగా ప్రసంగిస్తున్నందుకు తనకే సిగ్గువేసిందో, లేక, పుష్పకవిమానంలో తనను పరివేష్టించివున్న బంధుమిత్ర పరివారం ముఖాలలో వ్యక్తమైన భావాలను చూడగా తన భయ సందేహాలను సమర్థించుకొనడం అవరసరమని తోచిందో, ఏమి జరిగిందో తెలియదుగాని, రాముడు (బహుశా ఒకక్షణం తొట్రుపాటు తర్వాత) హనుమంతునితో తిరిగి ఈ విధంగా అన్నాడు :

"నిన్నెంతగానో ప్రేమించే భరతుని మనోగతభావాలను కనిపెట్టవలసిన అవసర మేమని నీ వడుగుతావేమో! అత డెట్టివాడో అతని పూర్వప్రవర్తనవల్ల తెలియలేదా అని ప్రశ్నిస్తావేమో! కాని, ధన ధాన్యసమృద్ధి గలిగి, సకలసంపదలతో నిండి, వంశపారంపర్యంగా వచ్చిన రాజ్యం ఎట్టివానికైనా చిరకాలానుభవంవల్ల లోభాన్ని పుట్టించకపోదు" (యుద్ధకాండ, 128వ స) సమర్థించడానికి వీలులేని ఈ పలుకులను సయితం కటక, తిలకాది రామాయణ వ్యాఖ్యానాలు సమర్థించేవుంటాయి. మనశ్శాంతిని కోరితే వాటిని మీరు చూచుకోవచ్చు.

కనీసం ఆ తర్వాతనైనా భరతునిపట్ల రాముడు ఉదాత్తంగా ప్రవర్తించలేదనే చెప్పాలి. తన తమ్ములు ముగ్గురిలో పెద్దవాడు భరతుడే! పైగా కేకయ రాజుకు దశరథుడు చేసిన వాగ్దానం ప్రకారమేమి, ఆ దశరథుడే కైకేయి కిచ్చిన వరాల ప్రకారమేమి, కోసల రాజ్యసింహాసనానికి తనకంటె భరతునికే ఎక్కువ హక్కు కలదేమో! నిజానికి భరతునిలో రాజ్యప్రలోభం ఏమాత్రం వున్నా, అయోధ్యకు తిరిగివచ్చే ప్రాప్తి బహుశా తన కుండేది కాదు. అయినప్పుడు తన పునరాగమనం తర్వాత భరతునికే యువరాజు ప్రతిపత్తి నిస్తా మనడం రాముని కనీస అయినా, దాన్ని లక్ష్మణునికి కట్టబెట్టడానికే ఆయన సంకల్పించి, అతడిని బలవంతం చేస్తాడు. ఆవేశం వచ్చినప్పుడు "నరుకుతా! చంపుతా!" అంటూ చిందులు తొక్కినా, లక్ష్మణుడు ధీరోదాత్తు డైనందున "నాకంటె పెద్దవాడు భరతు డుండగా, నాకు యువరాజు పట్ట మేమిటి?"అని దాన్ని నిరాకరించి, రెండవ అన్ననే యువరాజును చేయిస్తాడు.(యుద్ధకాండ, 131వ సర్గ),ధర్మం కాదా?

సీతారామ లక్ష్మణులు శాకాహారులనేది బహుళ వ్యాప్తిలో గల మరొక విశ్వాసం. ఇతర సమయాలలో పోనీ ఏదో కక్కుర్తిపడినా, వనవాసంలో మాత్రం వారు కందమూల ఫలాలనే తిని బ్రతికినట్టు మీలో పెక్కుమంది నమ్ముతారు. శాకాహారానికి లేనిపోని ఆధిక్యత, పవిత్రత వచ్చిన తర్వాత సీతారామలక్ష్మణులను పోలిన అవతారమూర్తులు మాంసాహారాన్ని అభిమానించే వారంటే, అది వారిపట్ల ఘోరాపచారంగా మీకు తోచడం సహజమే! కాని, సంస్కృత రామాయణాన్ని పరిశీలిస్తే, మాంసం లేనిదే సీతారామ లక్ష్మణులు ముద్ద యెత్తేవారు కారని మీకు తెలుస్తుంది!

ఆడిన మాటను తప్పని వాడని కాదా రామునికి ఎంతో కీర్తి ప్రతిష్టలు! ఆడిన మాటను ఆయన ఎక్కడ నిలుపుకున్నా, మాంసాహార విషయంలో మాత్రం కాదు! వనవాసానికి బయలుదేరబోతూ రాముడు తన తల్లి కౌసల్యతో "మునివలె నే నిక మాంసం విసర్జించబోతున్నా" నని చెబుతాడు. (అయోధ్యాకాండ, 20వ సర్గ) గంగానదిని దాటనంతవరకు ఆ మాటకు ఆయన కట్టుపడి ఉంటాడు. మత్స్య మాంసాలతో గుహుడు తనకు షడ్రసోపేతంగా భోజనం పెట్టబోగా, "ఇప్పటి స్థితిలో నేను కృష్ణాజినాలనే ధరించాలి, కందమూల ఫలాలను మాత్రమే భుజించా"లని ఆయ నంటాడు. ఆ రాత్రికి కందమూల ఫలాలనైనా తినక, గంగాజలాన్ని సేవించి నిద్రపోతాడు (అయోధ్యకాండ, 50వ సర్గ) అయితే ఈ నిష్ఠ ఆ మర్నాటి సాయంత్రం వరకైనా నిలవలేదు.

గంగను దాటి కాననంలో ప్రవేశించగానే, తమ్మునితో చేరి రాముడు ఒక అడవిపందిని, ఒక ఎనుబోతును, ఒక మామూలు దుప్పిని, ఒక నల్లచారల దుప్పిని వేటాడతాడు. ఆకలిగొని వున్నారేమో, అన్నదమ్ము లిద్దరు వాటిని కోసి, వండి, సుష్టుగా భోజనం చేస్తారు. (అయోధ్యాకాండ 52వ సర్గ) వారితోపాటు ఆ క్రితంరోజున పస్తున్న సీత ఈ విందుభోజనంలో పాల్గొనలేదని మనం అనుకోనక్కరలేదు.

పందిమాంసం, దుప్పి మాంసం, దున్నమాంసాలేకాక, పిట్టమాంస మన్నా, చేపలు జెల్లలన్నా రామునికి చాలా యిష్టం! పంపాసరోవరంలో కొట్టుకుతినడానికి పిట్టలు, పట్టుకు తినడానికి చేపలు కోకొల్లలుగా దొరుకుతాయని చెప్పి, కబంధుడు రాముని నోరూరించాడు. (అరణ్య కాండ, 73వ సర్గ) తమ కాలంలో బ్రాహ్మణ, క్షత్రియుల సమేతంగా జనులందరు తిన్నట్టు, సీతారామలక్ష్మణులుకూడా ఉడుములను, కుందేళ్ళను, తాబేళ్ళను సయితం తింటూనే వుండేవారు. వాటిలో ఉడుముల ప్రసక్తి అరణ్యకాండ 47వ సర్గలో వున్నది. మారువేషంలో వచ్చిన వాడు లంకేశ్వరుడని తెలియకముందు రావణునితో సీత "మా ఆయన వేటకు వెళ్ళాడు, ఆయన జింకలను, ఉడుములను, అడవి పందులను చంపి తెస్తాడు. వాటితో మీకు ఆతిథ్య మిస్తా" నని చెబుతుంది.

గోమాంసంపట్ల రామునికి ప్రత్యేకమైన ప్రీతి కలదో, లేదో తెలియదుగాని, వైముఖ్యం మాత్రం లేదు. వనవాసానికి వెడుతూ, భరద్వాజాశ్రమాన్ని సందర్శించినప్పుడు ఆ మహర్షి ముందుకూడా తన నూతన భోజన నియమాలనుగురించి గుహునివద్ద చెప్పినమాటలనే రాఘవుడు వల్లించబోతాడు.
అంతలోనే "జిహ్వాచాపల్యానికి లోనై నీ విప్పటికే ఒకసారి మాట తప్పావుసుమీ!" అని తన అంతరాత్మ సూదితోనో, దబ్బనంతోనో చివుక్కు మనేటట్టు ఒకపోటు పొడిచివుంటుంది. ఆ బాధోపశమనానికై రాముడు తమ మాంసవిసర్జన నిష్ఠను ప్రారంభించవలసింది అప్పుడే కాదని, తాము తపోవనంలో ప్రవేశించిన తర్వాతనే అని తనకు తానే సమాధానం చెప్పుకుంటాడు. దాన్నే పైకి వెల్లడిస్తూ "తండ్రి ఆజ్ఞ ప్రకారం మేము తపోవనానికి వెడతాము; అక్కడ కందమూలఫలాలనే తింటూ, ధర్మంగా చరిస్తా"మని చెబుతాడు. అంతటి మాంసం విషయమై ఆయన మడికట్టుకోవడం ఇంకా ప్రారంభం కాలేదన్న గ్రహింపుతో భరద్వాజుడు "మధుపర్కంగా ఒక గోవును అర్ఘ్యజలాలను" తెచ్చియిస్తాడు.(అయోధ్యాకాండ, 54వ సర్గ)

ఇక్కడ "మధుపర్కం" అంటే ఈనాటి మన నిఘంటువులు పేర్కొంటున్నట్టు "పెరుగుతో కలిపిన తేనె"కాదు; "పెండ్లిలో వధూవరుల కిచ్చే వస్త్ర"మైనా కాదు. అశ్వలాయన గృహ్యసూత్రం మాంసం లేనిది మధుపర్కం కాదని చెబుతున్నది. (ఒకటవ అధ్యాయం, 24వ ఖండిక, 33వ సూక్తం) పరాశర గృహ్యసూత్రం మాంసం లేనిది అర్ఘ్యం కాదని చెబుతున్నది. (ఒకటవ కాండ, మూడవ ఖండిక, 29వ సూత్రం) హిరణ్యకౌశిక, ఆపస్తంబ గృహ్యసూత్రాల ప్రకారం అతిధికి మధుపర్కంగా గోవు నర్పించడమే ప్రశస్తం. వధించకుండా గోవును విడిచిపెట్ట వలసిందిగా అతడు ప్రత్యేకించి కోరినప్పుడు మాత్రం మరొక జీవాన్ని కోసి, విందుచేయవచ్చు. వేదాలను చూచినా, ధర్మస్మృతులను చూచినా గోమాంస సమేతంగా మాంసభక్షణం ఒకనాడు మనదేశంలో అన్నికులాలలో ఎంత సర్వసాధారణమో తెలుస్తుంది. ఇప్పుడు కొందరిళ్ళలో చుట్టపక్కాలు రాగానే కోడి తెగినట్టు, అప్పటిలో అందరిళ్ళలోను ఆవు తెగేది, అతిథికి వేదాలలో ఒక పర్యాయపదం "గోఘ్నుడు", ఎవడు యింటికివస్తే గోవు తెగుతుందో వాడు "గోఘ్నుడు", కాగా, పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారొకచోట వివరించినట్టు "మాంస భక్షణమునకు బ్రాయశ్చిత్తము చెప్పిన స్మృతిగాని, ఉల్లిపాయ (లశున) భక్షణమునకు బ్రాయశ్చిత్తము చెప్పని స్మృతిగాని కాన్పింపలేదు", ఐదు గోళ్ళున్న జంతువులన్నీ తినదగినవని ("పంచనఖాభక్ష్యాః) పతంజలి మహర్షి ప్రవచించాడు. "గోమాంసభక్షణ చేయవచ్చునా?" అని ప్రశ్నించగా "అబ్బే చేయరాదు - అది లేతమాంసమైతే తప్ప!" అనే ధోరణిలో యాజ్ఞ్యవల్క్యుడు బదులుచెప్పాడు. గోమూపుర మాంసాన్ని అతి ప్రశస్తమైందిగా ఆయన పరిగణించేవాడు. రామునికి దండకారణ్యంలో ఆతిథ్యమిచ్చిన అగస్త్యుడు తన యజ్ఞాలలో ఒకదానిలోనే నూరువృషభ రాజాలను బలియిచ్చాడు. భరద్వాజుడు రామునికి మధుపర్కంగా పెరుగుతో కలిపిన తేనెను కాక, ఒక ఆవు నిచ్చినట్టు సంస్కృత రామాయణంలో స్పష్టంగానే వున్నది. పైగా, తక్కిన ఋషులవలె భరద్వాజుడు సయితం మాంసాహార ప్రియుడన్న విషయాన్ని కూడా ఈ సందర్భంలో మీకు జ్ఞాపకం చేయడం మంచిదేమో! రాముడు సెలవు పుచ్చుకు వెళ్ళిన తర్వాత కొద్దిరోజులకే ఆయనను వెదకులాడుతూ తన పుణ్యాశ్రమానికి వచ్చిన భరతునికి, ఆయన బంధుమిత్ర పరివారానికి భరద్వాజుడు కొన్ని వేల మేకలను, పందులను, జింకలను, కోళ్ళను, నెమళ్ళను వండించి పెట్టాడు! (అయోధ్యాకాండ, 91వ సర్గ) అయినప్పుడు ఈ మహర్షి రామునికి గోవును బహుకరించడం, ఆయన దాన్ని తమ వెంట తోలుకుపోయి, తాము ప్రవేశించనున్న తపోవనంలో పాడిచేసుకొనడం కోసం కాబోదు!

నిజానికి, రాముని దృష్టిలో మాంసభక్షణ పాపం కాదు; దాన్ని చేయకపోవడమే పాపం. చిత్రకూట పర్వత ప్రాంతానికి చేరి, అక్కడ పర్ణశాల వేసుకోగానే, దానిలో ప్రవేశించడానికి ముందు ధర్మశాస్త్రం నిర్దేశిస్తున్నట్టు జంతుబలి నివ్వాలని రాము దంటాడు. అందుపై లక్ష్మణుడొక జింకను చంపి తెస్తాడు. దాన్ని కోసి, నిప్పు సెగపై చక్కగా కాల్చి, దేవతలకు నైవేద్యంగా పెట్టి, ఆ పిమ్మట సీతారామలక్ష్మణులు దాన్ని మహాప్రసాదంగా స్వీకరిస్తారు. (అయోధ్యాకాండ. 56వ సర్గ)

నిప్పు సెగపై కాల్చిన మాంసం అంటే రామునికి ప్రత్యేకించి చాలా యిష్టమైనట్టు తోస్తుంది. అయోధ్యకు తిరిగి రావలసిందిగా అన్నగారిని అర్థించడానికై బయల్దేరిన భరతుడు చిత్రకూటపర్వతాన్ని సమీపిస్తుండగా, దాని చరియపై సీతాసమేతంగా విశ్రమిస్తున్న రాముడు మాంసఖండాలను (బహుశా వాటిని తమ "పిక్నిక్ బ్యాస్కెట్" నుంచి) తీసి, "చూడు జానకీ!
ఈ ముక్క ఎంత మెత్తగా వున్నదో! ఈ కండ యెంత రుచిగా వున్నదో! ఇదేమో చక్కగా కాలింది!" అంటూ ముక్కతర్వాత ముక్కను ఆమె నోటికి ఆప్యాయంగా అందిస్తూపోతాడు. (అయోధ్యాకాండ. 96వ సర్గ)

మాంసభోజనం వలె మద్యపానంకూడా రామాయణ కాలంలో సర్వసాధారణం, రాజులతోపాటు ఋషులుకూడా నానావిధ మద్యపానీయాలను విశేషంగా సేవిస్తూ వుండేవారు. దేవతలకు మాంసంతోపాటు సుర, మైరేయం మొదలైన మద్యాలను నైవేద్యంగా పెడుతూవుండేవారు. దేవతలకు నైవేద్యం పెట్టడం మహాప్రసాదంగా భక్తకోటి దాన్ని తిరిగి స్వీకరించడానికే కాదా? వనవాసానికి వెడుతూ గంగా నదిని దాటిన సందర్భంలో "ఓ గంగమ్మ తల్లీ! మేము సురక్షితంగా తిరిగివస్తే వేయికుండల మద్యంతోను, మాంసమిశ్రమమైన మృష్టాన్నంతోను (ఆనాడుకూడా పలావ్ చేసుకునేవారు కాబోలు!) పూజిస్తానని సీత మ్రొక్కుకున్నది. (అయోధ్యాకాండ, 52వ సర్గ) ఆ తర్వాత యమునానదికి ఆమె చేసిన వాగ్దానం ఒక వెయ్యి ఆవులు, ఒక నూరు కుండల సారా! (అయోధ్యాకాండ 55వ సర్గ)

సీతాదేవి మొక్కుబడులలో కానవచ్చే ఈ "మద్యప్రసక్తి" తర్వాత కూడా, రాముడు మద్యాన్ని సేవించేవాడా అని ప్రశ్నించేవారు, లంకలో సీతను సందర్శించినప్పుడు, హనుమంతుడు ఆమెతో చెప్పిన ఈ మాటవిని, తమ సందేహనివృత్తి చేసుకోవచ్చు. "నీ వియోగ దుఃఖం వల్ల నీభర్త మాంసాన్ని తినడంలేదు; మద్యాన్ని త్రాగడంలేదు" (సుందరకాండ, 36వ సర్గ) మద్యాన్ని సేవించడమనేది లేనిదే దాన్ని విసర్జించడమనే ప్రసక్తి రాదుగదా?

రాఘవునివలె జానకి సయితం అప్పుడప్పుడు కాస్త పుచ్చుకుంటూనే వుండేది. మద్యపానీయాల రుచిభేదాలు ఆమెకు బాగా తెలుసు. తనతో లంకకు రావలసిందిగా కోరిన రావణుని నిందిస్తూ, ఆమె "సురకు, సౌవీరానికి ఎంత భేదం కలదో నీకు, నా రాఘవునికి అంత భేద" మున్నదని చెబుతుంది. (అరణ్యకాండ, 47వ సర్గ) ఇక్కడ, "సౌవీరం" అనే మాటకు పులవబెట్టిన "కడుగునీళ్ళు" అనే అర్థాన్ని వ్యాఖ్యాతలు చెప్పా రనుకోండి. కాని, వైద్యగ్రంథాలలో మాత్రం సౌవీరాన్ని ఒక మద్యంగానే వర్ణించారు.

ఏమైనా, కవి తెచ్చిన ఒక సామ్యాన్ని పురస్కరించుకొని, సీతాదేవికి తెలుసునని నేను సూచించడం భారత నారీలోకం పట్లనే మహాపచార మని నాపై విరుచుకు పడబోయేవారికి కాస్త నిదానించవలసిందిగా నా మనవి. భర్తతోపాటు మైథిలి మద్యాన్ని సేవించేదని చెప్పడానికి అనుమాన ప్రమాణం పైనే ఆధారపడ నక్కర లేదు; అందుకు ప్రత్యక్ష ప్రమాణం సయితం మీరు పరమపవిత్ర గ్రంథంగా పూజించే సంస్కృత రామాయణంలోనే వున్నది. దాన్ని పూజించడం కాస్త తగ్గించి, పరిశీలక దృష్టితో చదవడం మొదలు పెడితే, ఇట్టి విషయాలన్నింటిని, మీరు స్వయంగానే గుర్తించగలుగుతారు. ఫలపుష్పభరితమై, , శోభాయ మానంగావున్న అశోకవనంలో విహరిస్తూ (లంకలోనే కాదు, అయోధ్యలో సయితం ఒక అశోకవనం వుండేది) ఒకనాడు పట్టాభిరాముడు జానకిని చెంతకు తీసుకుని, దేవేంద్రుడు శచీదేవి నోటికి అమృతకలశాన్ని అందించినట్టు, సీతాదేవి నోటికి మధుపాత్రికను అందిస్తాడు. తోడుగా మాంసం లేకపోతే మద్యం అంత రుచిగా వుండదు కాబట్టి, ఆ సందర్భంలో వారిద్దరు మాంసభక్ష్యాలను ఆరగిస్తారు కూడా. (ఉత్తరకాండ, 42వ సర్గ)

మద్యాల రుచిభేదాలు: సీతారాముల రాణ్మందిరంలోని ఉద్యానవనాలలోనే కాక, వారి రాజధాని నగర వీథులలో కూడా మద్యం మధురస్రవంతులై నిత్యం ప్రవహిస్తూ వుండేది. రాముని పాదుకలతో చిత్రకూట పర్వతం వద్ద నుంచి తిరిగివచ్చిన భరతుడు రాముడు లేని కారణాన చిన్నవోయిన అయోధ్యానగరాన్ని చూచి, వాపోతూ ఏమన్నాడో వినండి :

"మద్య పరిమళాలతో, పుష్పసౌరభాలతో, అగరుధూపాలతో ఈ అయోధ్యానగరం ఘుమఘుమ లాడుతూవుండేది. ఇప్పుడు వాటి గుబాళింపు మచ్చుకైనా కానరావడం లేదు"(అయోధ్యాకాండ,114వ సర్గ).

లంకేశ్వరుని జయించివచ్చిన రాఘవుడు పట్టాభిషిక్తుడై రామ రాజ్యాన్ని సుస్థాపితం చేసిన తర్వాత అయోధ్యానగర వీధులలోని మద్య పరిమళాలు భూనభోంతరాళాలను తిరిగి పులకరింప జేసినవనే మనం అనుకోవచ్చు!

కపటవేషంతో పంచవటికి వచ్చిన తనను, తన ప్రేమను తిరస్కరించిన వైదేహిని చూచి కుపితుడై లంకేశ్వరుడు భయంకరమైన తన నిజరూపాన్ని చూపగానే ఆమె మూర్ఛపోయిందని, ఆ మహాపతి వ్రతా శిరోమణిని స్పృశిస్తే తాను భస్మీపటలమై పోగలనన్న భయంతో ఆమె మూర్ఛలో మునిగివున్న ప్రదేశాన్ని తన గోళ్ళతో ఒక పెళ్ళగా పెకలించి, రావణుడు దాన్ని తన రథంపై పెట్టుకు వెళ్ళాడని కోటమ రాజు నాగయామాత్యుడు ఆధ్యాత్మ రామాయణంలో వ్రాసినట్టే, ఇతర కవులు పెక్కుమందికూడా ఈ సన్నివేశాన్ని మూలానికి విరుద్ధంగా చిత్రించడానికి తమ కల్పనా చాతుర్యాన్ని పూర్తిగా వినియోగించారు. అన్నను వెతకడానికై వెడుతూ లక్ష్మణుడు గీసి వెళ్ళిన గీతనుదాటి, రావణునికి బిచ్చం వేయడానికి సీత వెలుపలికి వచ్చినందుననే ఆమెను అపహరించుకు వెళ్ళడం అతడికి సాధ్యపడిందన్న గాథ మరొకటి కూడా బహుళ ప్రచారంలో వున్నది.

ఇట్టి గాథలెన్ని ప్రచారంలోవున్నా, వీటిలో మీకెంత విశ్వాసం వున్నా, ఇవి సంస్కృత రామాయణంలో కానరానట్టివే! తాను చెప్పినంతనే రాముని సహాయానికై మరిది వెళ్ళలేదని సీత నానాదుర్భాషలాడగా, రెండు చేతులతో ఆమె తన కడుపును బాదుకొనగా (ఆరణ్య కాండ, 45వ సర్గ) ఆమె మాటలు వినలేక, ఆమె పిచ్చిచేష్టలు మరిచూడలేక, కదిలివెళ్ళిన లక్ష్మణుడు ఏదో గీతగీసి వెళ్ళలేదు; మొత్తం స్త్రీ జాతినే నిందించి వెళ్ళాడు. "స్త్రీలు న్యాయం తప్పి నడుస్తారు. చపలమైంది వారి చిత్తం; క్రూరమైంది వారి మనస్సు; స్నేహితుల మధ్యనైనా వారు చిచ్చు పెడతారు" ఇంత తీవ్ర ధోరణిలో జరిగింది ఆ నింద కాగా, రావణుని భీకర రూపాన్ని చూచి సీత మూర్ఛపోలేదు; ఆమెను స్పృశిస్తే తాను భగ్గున మండిపోయి, బూదిపోగు కాగలనని అతడు భయపడనూలేదు. బలప్రయోగంతో తప్ప తాను సీతను లంకకు తీసుకు వెళ్ళలేనని రూఢపడినంతనే రావణుడు ఆమెను సమీపించి, ఎడమ చేతితో ఆమె తల వెంట్రుకలను, కుడిచేతితో ఆమె తొడలను పట్టుకుంటాడు. ఆ విధంగా యెత్తుకు వెళ్ళి, ఆమెను తన రథంపై కూర్చో బెడతాడు. (ఆరణ్యకాండ. 49వ సర్గ) కిందికి దూకి పారిపోకుండా, ఆమెను తన తొడపై కీడ్చి, అదిమిపట్టుకుంటాడు. (ఆరణ్యకాండ, 51వ సర్గ) ఈ సంగతుల పునశ్చరణ 52వ సర్గలోకూడా వున్నది.

సుందరకాండకు వెళ్ళితే, అక్కడ ఈ సంఘటనల ప్రసక్తి తిరిగి కొంత కనబడుతుంది. తన వీపుపై కూర్చుంటే, లంకనుంచి రాముని సన్నిధికి తాను సీతను ఒక్కగంతులో చేర్చగలనని హనుమంతుడనగా, ఆ ప్రతిపాదనను నిరాకరిస్తూ, వైదేహి ఈవిధంగా పలుకుతుంది : "నా భర్తను తప్ప నేను మరొకరిని తాకను. ఇక్కడికి రావణుడు నన్ను తెచ్చినప్పుడు అతడి దేహస్పర్శ నాకు తగలలేదా అని ప్రశ్నిస్తావేమో! అది వేరే విషయం. అప్పుడు నేను నిస్సహాయను; దుఃఖపరవశురాలనై వున్న నే నప్పటిలో చేయగలిగింది ఏమీ లేదు" నే (సుందరకాండ. 37వ సర్గ) మీ మనస్సులలోగల రామాయణానికి,

సంస్కృత రామాయణానికి ఎన్నో వ్యత్యాసాలున్నట్టు రుజువు చేయగల ముఖ్యాంశాలు మరి పెక్కు లున్నా, ఇంతవరకు నేను పేర్కొన్నవే నా వాదనిరూపణకు సరిపోగలవని భావిస్తున్నాను.

తక్కిన రామాయణా లన్నింటిని విడిచిపెట్టి, వాటి సంస్కృత మూలాన్ని విమర్శకదృష్టితో పరిశీలించినా, దానిలో ఎక్కడి కక్కడ పరస్పర వైరుధ్యాలే కానవస్తాయి. అసంభవ విషయాలు, అద్భుత సంఘటనలు, అభూత కల్పనలు - వీటి సంగతి విడిచి పెట్టండి. మన పురాణాలలోనే కాదు, ఏ జాతి పురాణాలలోనైనా ఇవి తప్పవు. అయితే తక్కినవారు వీటిని వాస్తవిక విషయాలుగా, చారిత్రక సంఘటనలుగా గుర్తించరు, మనం గుర్తిస్తాము ఇదే మనకు, వారికి వున్న ప్రధాన భేదం.
మానవాతీత మహిమల జోలికి పోకుండా, సామాన్య విషయాలను చూడబోయినా, సంస్కృత రామాయణాలలో ఒకచోట చెప్పిన మాటకు మరొకచోట చెప్పినదానికీ ఎంతమాత్రం సంబంధం కానరాని సందర్భాలనేకం. ఇందుకు ప్రథమతార్కాణంగా రాముని వయస్సునే తీసుకోండి.

వనవాసానికి బయల్దేరిన నాటికి రాముని ప్రాయ మెంత? కౌసల్య లెక్కప్రకారం ఆనాటికి రాముడు పదిహేడేళ్ళవాడు. యౌవరాజ్య పట్టాభిషేకానికి విఘాతం కలగడమే కాక, కన్నకొడుకు వనవాసానికి వెళ్ళవలసి వచ్చినందుకు విలపిస్తూ కౌసల్య “నీవు పుట్టి పదిహేడు సంవత్సరాలైంది” అని పేర్కొంటుంది. (అయోధ్యకాండ, 20వ సర్గ) ని, బ్రాహ్మణవేషంలో వచ్చిన రావణునికి తమ వృత్తాంతాన్ని వివరించిన సన్నివేశంలో జానకి “మా వివాహానంతరం పన్నెండేళ్ళు అత్తవారింటిలో ఉన్నాను. అరణ్యవాసానికి వచ్చేనాటికి మా ఆయన వయస్సు 25 సంవత్సరాలు కాగా, నాకు పద్దెనిమిది సంవత్సరాలు” అని చెబుతుంది. (అరణ్యకాండ, 47వ సర్గ) ఈ అత్తాకోడళ్ళ మాటలకు ఎలా పొత్తు కుదురుతుంది?

తన కుమారుని వయస్సు కౌసల్యకు తెలియదనుకోవాలా? తన భర్త వయస్సు సీతకు తెలియ దనుకోవాలా? తన పద్దెనిమిదవ యేట వనవాసానికి వచ్చిన సీత అంతకుముందు పన్నెండు సంవత్సరాలు అత్తవారింట ఉన్నదంటే, ఆరేళ్ల ప్రాయంలో ఆమెకు వివాహం జరిగివుండాలి. అగ్నిప్రవేశానికి ముందు రామునితో నిష్ఠూరంగా మాట్లాడుతూ, తా నిద్దరు పనివారై వుండగా తమకు పరిణయం జరిగినట్టు జానకి పేర్కొన్నందున (యుద్ధకాండ,119వ సర్గ) బాల్యవివాహాలే ఆనాటి సాంఘికాచారం కాబోలని సరిపెట్టుకొనగోరితే, ఆరేళ్ళు నిండీనిండక ముందే సీత భర్తతో కాపురం చేయడం ప్రారంభించినట్టు తీర్మానించుకోవలసి వస్తుంది. తమ వివాహాలైనంతనే దశరథుని నలుగురు కోడళ్ళు అత్తవారింట భర్తలతో సంసారం చేసినట్టు బాలకాండ, 77వ సర్గ స్పష్టం చేస్తున్నది. (ఇక్కడ మూలంలోని మాటలకు తర్జుమా: 'ఏకాంతముగా తమ ప్రియులను గూడి, సుఖాలు పొందారు”) అత్తవారింట తన జీవితాన్ని గురించి లంకేశ్వరునికి చెబుతూ జానకి “పండ్రెండు సంవత్సరాలపాటు భోగములన్నింటిని నే ననుభవించాను” అని పేర్కొంటుంది. (అరణ్యకాండ, 47వ సర్గ) సరిగా ఈ మాటనే ఆమె లంకలో హనుమంతునికి చెబుతుంది. (సుందరకాండ, 33వ సర్గ) ఇదే నిజమైతే, భర్తతో సంసారం మొదలు పెట్టినప్పుడు సీత ఆరేళ్ళ ముక్కుపచ్చలారని పిల్ల. ఆ సత్యకాలంలో ఏమైనా సంభవమంటే, అది వేరే విషయం! లేకపోతే మాత్రం ఆరేళ్ళ పిల్ల మగనితో కాపురం చేయడం విడ్డూరమే.

అయితే, మరొక సందర్భంలో జానకి స్వయంగానే తనకు యుక్తవయస్సు వచ్చిన తర్వాత వివాహమైనట్టు చెబుతుంది. నిజానికి ఈడు మీరుతున్నా తనకు తగినభర్త లభించడం లేదని తన తండ్రి వ్యసనపడినట్టు అనసూయతో ప్రసంగిస్తూ ఆమె సూచిస్తుంది. (అయోధ్యకాండ, 118వ సర్గ) ఈ విధంగా సీత పలుకులలోనే పరస్పర వైరుధ్యా లున్నందున, కౌసల్య పేర్కొన్నట్టు, వనవాసానికి బయలుదేరిన నాటికి రాముని వయస్సు పదిహేడు సంవత్సరాలుగా భావించడమే సముచితం కాగలదు. బహుశా అంతకు కొన్ని నెలలకు ముందే సీతారాముల వివాహం జరిగివుంటుంది. వివాహాలను చేసుకువచ్చిన

తన కుమారులలో భరతుని (శత్రుఘ్నుని తోడుగా పెట్టి) అతని మేనమామ యింటికి దశరథుడు పంపించి వేయడం జరిగివుంటుంది. నా "జాబాలి" నాటికలో నేను సూచించినట్టు, ఈ విధంగా భరతుని అయోధ్య నుంచి దశరథుడు తప్పించడం రామునికి యౌవరాజ్య పట్టాభిషేకాన్ని జరిపించాలన్న సంకల్పంతోనే అయివుండాలి.

అయితే, ఈ సంగతులను గుర్తిస్తే, సీత రావణునితో చెప్పిన మాటలు అర్థరహితమైనవిగా పరిణమిస్తాయి. ఈ చిక్కును తొలగించడానికి సంస్కృత రామాయణ వ్యాఖ్యాతలు కౌసల్య పలుకులలో "జాతస్య" అనే దానికి "నీకు ఉపనయన మైనది మొదలు ఇప్పటికి" అనే అర్థం చెప్పారు. దీన్ని "అతి తెలివి" అనాలి. తనబిడ్డ భూమిపై పడిననాటి నుంచి కాక, అతడికి వడుగు జరిగిన నాటి నుంచి ఏ తల్లి అయినా వయస్సును లెక్క కడుతుందా?

దశరథనందనుల వివాహాల ప్రసక్తి రానే వచ్చింది కాబట్టి, లక్ష్మణునికి వివాహమైందా, లేదా అనేది సంస్కృత రామాయణం ప్రకారం సందిగ్ధ విషయమని ఇక్కడనే చెప్పవచ్చు. సీతారాముల వివాహమైన వెంటనే జనక మహారాజు రెండవ కుమార్తె ఊర్మిళను లక్ష్మణుని కిచ్చి పెళ్ళిచేసినట్టు బాలకాండ పేర్కొంటున్నది. అయితే, ఈ రెండు చోట్ల తప్ప మరెక్కడ ఊర్మిళ ఊసెత్తినవారే లేరు. ఈ మాటే సీత అనసూయతో చెబుతుంది. (అయోధ్యాకాండ, 118వ సర్గ) అన్నవెంట వనవాసానికి - ఒకటి, రెండేళ్ళపాటు కాదు, పదునాలుగేండ్ల దీర్ఘకాలం పాటు - వెళ్ళే సందర్భంలో లక్ష్మణుడు ఊర్మిళతో లాంఛనంగానైనా ఒకమాట చెప్పి పోడు! రాముడైనా "ఓ లక్ష్మణా! వెళ్ళి, నీ మిత్రులందరికీ చెప్పిరా!" అంటాడే తప్ప, "నీ భార్యతో చెప్పిరా!" అనడు. ఆ మాటపై లక్ష్మణుడు తన స్నేహితుల వద్ద సెలవు పుచ్చుకొని వస్తాడుగాని, భార్యవద్దకు వెళ్ళడు. (అయోధ్యాకాండ, 31వ సర్గ) వనవాసానికి సీతారాములతో బయలుదేరేముందు లక్ష్మణుడు తన తల్లి సుమిత్రకు ప్రణమిల్లి, ఆమె దీవెనలు పొందుతాడని స్పష్టంగా పేర్కొంటున్న సంస్కృత రామాయణం (అయోధ్యాకాండ, 40వ సర్గ) ఊర్మిళ విషయమై పూర్తి మౌనాన్ని వహిస్తున్నది. దీన్నిబట్టి భార్యపట్ల అతడు ప్రేమాదరాలు లేనివాడని అనుకోవాలా? ఆమె అస్తిత్వాన్ని సయితం గుర్తించకపోవడానికి ఆమె పొడ సయితం గిట్టని స్థితికి వచ్చాడని అనుకోవాలా? అసలు ఊర్మిళతో అతని పెండ్లిమాట అబద్ధమని అనుకోవాలా?

సంస్కృత రామాయణంలోని అన్యఘట్టాలను కొన్నింటిని పరికించగా, ఈ చివరిమాటే రూఢమైందని తీర్మానించుకో వలసి వస్తుంది. వనవాసానికి తాము బయలుదేరుతుండగా కన్నీళ్ళు కార్చుతూ నిలబడివున్న దాసదాసీ జనులను చూచి, రాముడు "మేము తిరిగివచ్చే వరకు నా నగరు, లక్ష్మణుని నగరు పాడుపడిపోకుండా, జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూ ఉండండి" అని హెచ్చరిస్తాడు. (అయోధ్యాకాండ, 32వ సర్గ) లక్ష్మణునికి నిజంగా ఇల్లాలే వుంటే, అతడి ఇంటి ప్రసక్తిని తెచ్చిన రాముడు ఇల్లాలి ప్రసక్తిని తీసుకురాడా? ఇల్లా లున్నప్పుడు ఇంటి భద్రత విషయం ఆమెకు చెప్పకుండా నౌకర్లకు, చాకర్లకు మాత్రమే చెబుతారా?

తర్వాత ఒక సన్నివేశంలో తన తమ్ముని కిల్లాలు లేదని స్పష్టంగానే రాము డంటాడు. జనస్థానంలో తనను చూచి మోహించి, తనతో వివాహానికై తహతహలాడిన శూర్పణఖతో "నన్ను కాదు; నా తమ్ముని పెండ్లి చేసుకో! అతడు పెండ్లికాని వా"డని ఆయన చెబుతాడు. "మా వాడు భార్య సుఖ మెరుగని వా"డని ఈ సంగతినే మరింత నొక్కి చెబుతాడు. ఇంకా ముందుకు వెళ్ళి "నా తమ్ముని కట్టుకుంటే నీకు సవతి పోరు వుండ'దని చెబుతాడు (అరణ్యకాండ, 18వ సర్గ) నవ్వులాటగా ఆయన ఈ మాట లనివుంటే, పరిహాసానికైనా అనృతం పలకని సత్యసంధుడుగా ఆయన కున్న ఖ్యాతి దెబ్బతినదా?

శూర్పణఖతో రాముని పలుకులు నిజంగానే నవ్వులాట కాడిన బొంకులైతే, దీనికి ముందు సర్గలోనే" బొంకు లాడుట రాముని స్వభావానికి విరుద్ధం. పైగా, ఆయన తపోవనంలో ఉంటున్నాడు. అంతేకాక, ఆడదానితో (శూర్పణఖతో) మాట్లాడుతున్నాడు. ఆ పరిస్థితిలో అతడు బొంకులాడునా?" అని ప్రత్యేకించి చెప్పడం ఎందుకు జరిగింది?

మరొక ఘట్టంలో - బ్రాహ్మణ వేషంలో తనను మోసగించడానికై వచ్చినవాడు లంకేశ్వరుడని తెలియక, అతడు కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి, పీటవేసి కూర్చోబెట్టి, అతడితో ముచ్చటలాడిన ఘట్టంలో - సీతకూడా లక్ష్మణుని బ్రహ్మచారిగా పేర్కొన్నదట. సంస్కృత రామాయణ పాఠా లన్నింటిలో ఈ విషయం లేకపోయినా, కొన్నింటిలో ఉన్నదట. ఆరణ్యకాండ 47వ సర్గలో 19 శ్లోకం. వావిళ్ళవారి ప్రచురణలో "సభ్రాతా లక్ష్మణ్ నామ ధర్మచారీ దృఢవ్రతః" అని వున్నా, "ధర్మచారీ" అనే ప్రయోగానికి మారుగా "బ్రహ్మచారీ" అనే పాఠాంతరం కూడా అక్కడక్కడ కానవస్తున్నదట.

నాకు తెలిసినంతవరకు ఇంతకు మున్ను మరెవ్వరు యెత్తిచూపని మరొక విషయం కూడా లక్ష్మణుడు బ్రహ్మచారి అనే సంగతిని ధ్రువపరుస్తున్నది. ఇంద్రజిత్తు తీవ్రంగా గాయపరచగా మూర్ఛపోయిన రామలక్ష్మణులలో రాముడు ముందు తేరుకుని, నెత్తురు మడుగులో కదలిక లేకుండా పడివున్న తన తమ్ముని చూచి, అతడు చనిపోయినట్టుగా భ్రమపడి, దుఃఖ వివశుడైనాడు. ఆ సన్నివేశంలో "నా కుమారు డెక్కడ?" అని సుమిత్ర ప్రశ్నిస్తే, ఆమెకు నేనేమి సమాధానం చెప్పగల"నని రాముడు వాపోతాడు గాని. ఊర్మిళ ప్రసక్తి తీసుకురాడు. కేవలం సుమిత్రనే కాక, "కౌసల్య ప్రశ్నిస్తే", "కైకేయి ప్రశ్నిస్తే", "భరతుడు, శత్రుఘ్నుడు ప్రశ్నిస్తే" అంటూ ఇందరిని పేరు పేరున తలుచుకొన్న రాముడు ఊర్మిళను తలవనే తలవడు. (యుద్ధకాండ, 49వ సర్గ). లక్ష్మణుడు అవివాహితుడని తీర్మానించుకొనడానికి ఇంతకంటె ప్రబల తార్కాణం కావాలా?

పరస్పర విరుద్ధాంశాలతో పాటు హాస్యాస్పద విషయాలనేకం సంస్కృత రామాయణంలో వున్నాయి. ఉదాహరణకు సీతాపహరణకై రావణుడు బయల్దేరి వెళ్ళిన తీరునే చూడండి : రామాయణం కథనం ప్రకారం, రావణుడు కుబేరుని సంకుల సమరంలో పరాభూతిని చేసి, ఆ యక్షేశ్వరుని లంక నుంచి పారద్రోలి, అతడి రాజ్యంతోపాటు పుష్పక విమానాన్ని స్వాధీనపరచుకున్నవాడు గదా! అది సామాన్యమైన విమానమా? అది కామరూపంతో ? కూడిన విమానం, కామగమనంతో పోగల విమానం. మనోవేగంతో పయనించే విమానం. మనస్సును సుఖ పెట్టే విమానం, అంత శీతలం కాకుండా అంత ఉష్ణం కాకుండా, అన్ని ఋతువులలో మహోల్లాసంగా విహరించడానికి వీలైన విమానం! (ఈనాటి మూర్ఖులు "ఎయిర్ కండీషనింగ్" తాము కొత్తగా కనిపెట్టినట్టు భ్రమపడతారు!!) సర్వ కామ్యాలతో బ్రహ్మదేవుడు దాన్ని స్వయంగా నిర్మించినందున అది క్షయంలేని విమానం ("స్పేరు పార్టు"లతో దానికి అవసరం రానే రాదు!) అది బంగారు స్తంభా లున్న విమానం, వజ్ర వైడూర్యాల ణా లున్న విమానం! ఎక్కడానికి దానికి బంగారుమెట్లు, కూర్చోవడానికి దానిలో బంగారు అరుగులు! (ఉత్తరకాండ, 15వ సర్గ) చోదకునితో దానికి పనిలేదు; రమ్మనగానే రయంగా అది వస్తుంది; పొమ్మన్న చోటుకు పొమ్మన్నంతనే పోతుంది (యుద్ధకాండ. 130వ సర్గ). ఇట్టి పుష్పక విమానం తనకున్నా సీతాపహరణ యత్నంలో ఎందువల్లనో రావణుడు దాన్ని వినియోగించలేదు! ఆమెను అపహరించుకు రావాలని, అందుకు మారీచుని సహాయం పొందాలని నిర్ణయించుకోగానే, ఎవ్వరికీ చెప్పకుండా, ఎవ్వరు తనను చూడకుండా అతడు తన "రమ్యమైన అశ్వశాల"కు వెడతాడు; రథాన్ని వెంటనే సిద్ధపరచు!" అని సారథిని ఆదేశిస్తాడు. క్షణంలో ఆ సారథి ఒక దివ్య రథాన్ని తెచ్చి ముందు పెడతాడు. అయితే, అది దివ్య వారువాలను పూన్చిన రథం కాదు; దయ్యపుమోరల గాడెలను కట్టిన రథం! (అరణ్యకాండ, 35వ సర్గ) ఆ గాడేలకు బంగారం తొడవు లున్నవట! బంగారం తొడవులు కాక, వజ్రవైడూర్య గోమేధికాల తొడవులున్నా గాడ్దెలు గాడేలేకాని గుర్రాలు కావు, కాలేవు!

తన "రమ్యమైన అశ్వశాల"లో రావణుడు గాడేలను ఎందుకు కట్టివేయించాడో మనకు తెలియదు! శీఘ్రంగా, క్షేమంగా, సుఖంగా ఎక్కడికైనాసరే ఇచ్ఛామాత్రాన తీసుకు పోగల పుష్పక విమానం తనకున్నా, గాడ్దెలబండిలో ఎందుకు బయల్దేరాడో అంతకంటే తెలియదు! దీనిలో నిగూఢమైన వేదాంత సమస్యయేదైనా కలదేమో! అన్నట్టు, గాదెలను కట్టిన రథంలో కూర్చుండి, దక్షిణదిశగా ప్రయాణిస్తున్నట్టు రావణుడు తనకు కలలో కనబడినాడని, ఇది అతనికి త్వరలో తప్పక వినాశాన్నే సూచిస్తున్నదని అశోకవనంలో సీతకు త్రిజట చెబుతుంది. (సుందర కాండ, 27వ సర్గ) దీన్ని బట్టి కేవలం రావణునికి వినాశ కాలం దాపురించినట్టు సూచించడానికే గాడెల బండిలో ఆ లంకేశ్వరుని ప్రయాణం చేయించారని అనుకోవాలి కాబోలు!

గాదెలను పూన్చిన రథమైనా రావణు దెక్కింది పుష్పకవిమానం వలె ఆకాశమార్గం వెంటనే ప్రయాణం చేసింది! ఎగిరి వెడుతుండగా అది "మెరుపులతో, కొంగలతో కూడిన ఆకాశంలో మబ్బువలె" కనబడిందట! అయితే, దానికి పూన్చినవి రెక్కలున్న గాదెలు కాబోలు!

ఎవ్వరికీ చెప్పకుండా, ఎవ్వరికీ కనబడకుండా సీతాపహరణకు పోదలచిన రావణునికి కామరూపవిద్య తెలుసు, కామగమన విద్య తెలుసు. అయినప్పుడు గాడ్దెలబండి తగలాటం తానెందుకు పెట్టుకున్నట్టు? ఎగిరివెళ్ళి, ముందు మారీచునివద్ద, తర్వాత సీత సమ్ముఖంలో ఎందుకు వ్రాలలేదు? సీతను యెత్తుకు వస్తుండగా తనను ఢీకొన్న జటాయువు తన గార్దభాలను, తన సారథిని చంపనే చంపాడు; తన రథాన్ని శిథిలం చేయనే చేశాడు. అందువల్ల సీతను తానే మోసుకుంటూ గగనమార్గాన ఎగురుతూ రావడం తనకు తప్పనే లేదు! (అరణ్యకాండ 52వ సర్గ) అయినప్పుడు గాడ్దెలబండి బెడదను వృథాగా తా నెందుకు కల్పించుకున్నాడో?

అసంగతాలు, అసందర్భాలు, అనుచితాలు, హాస్యాస్పద విషయాలు సంస్కృత రామాయణంలో విశేషంగా కానరావడం (ఇంతకు పూర్వమే నే నొకసారి సూచించివున్నట్టు) నే అది ఏదో ఒక కవి, ఏదో ఒక కాలంలో వ్రాసిన కావ్యం కాకపోవడంవల్లనే! వాల్మీకి పేర చెల్లుతున్నా, దానిలో ఆయన చెప్పింది బహు తక్కువ, వివిధ కాలాలలో విభిన్నకవులు దానికి కలుపుతూ, పోయింది చాలా హెచ్చు.

రామాయణాన్ని గురించి ప్రత్యేక శ్రద్ధాసక్తులతో పరిశోధనలు జరిపిన జర్మన్ దేశ సంస్కృత పండితుడు డాక్టర్ హెచ్.ఎఫ్. జాకోబి వివరించినట్టు, ప్రతిష్ఠాపన తర్వాత కొన్ని తరాలపాటు క్రమంగా పెరుగుతూపోయే దివ్యక్షేత్రంవలె రామాయణ కావ్యం పెరుగుతూ పోయింది. ఆదిలో ఒక రెవరో మూలవిరాట్టును ప్రతిష్ఠచేసి, దాని కొక గర్భాలయాన్ని నిర్మిస్తారు. ఆ తర్వాత మరొకరు దానిముందు మండపాన్ని నిలబెడతారు; ఆ వెనక వేరొకరు ప్రాకారాలను తీర్చుతారు; పిమ్మట మరికొందరు పూనిక వహించి, గాలిగోపురాలను లేవనెత్తుతారు; అంతటితోనైనా సంతృప్తి పడక, కొత్త భక్తులు కొంద రెవరో చేరి, ఉపదేవతల ప్రతిష్ఠాపనచేసి, వాటికి ఉపదేవాలయాలను వెలిపిస్తారు; కొలనొక్కటే తక్కువగా వున్నదని దాన్ని త్రవ్వించడానికి మరెవరో ముందుకు వస్తారు. ఒక చిన్న దేవళంగా ప్రారంభమైంది ఈ విధంగా కాలక్రమాన ఒక మహాక్షేత్రంగా రూపొందుతుంది. రామాయణమే కాక, మహాభారతం, మహాభాగవతం కూడా ఈ విధంగా పెరుగుతూపోయినట్టివే!

వాల్మీకి మహాకవి చెప్పిన రామాయణ కావ్యం చాలా చిన్నదే! ఇక్కడ కావాలనే "చెప్పిన" అనే మాటను నేను ప్రయోగిస్తున్నాను. దాన్ని ఆయన వ్రాయలేదు; ఒక పాటగా చెప్పాడు.

అనుష్టుప్ అనే ఛందస్సు వాల్మీకితోనే పుట్టినట్టు జనశ్రుతివున్నా, వేదవేదాంగాలలోనే అది కానవస్తుంది. వాల్మీకి దాన్ని మరింత చిత్రిక పట్టి సాఫీ చేశాడు - అంతే! నడకకు సంబంధించినంతవరకు మన ద్విపదకు, మంజరీద్విపదకుమధ్య కానవచ్చే భేదం వైదికపు అనుష్టుప్ కు, వాల్మీకి అనుష్టుప్ కు, మధ్యవున్నట్టు స్థూలంగా చెప్పవచ్చునేమో! ఏమైనా, ఆ ఛందోరీతికి మెరుగులు దిద్దినవాడు, దానిలో తేనె లొలికించినవాడు, దానికి కావ్య గౌరవాన్ని చేకూర్చినవాడు ఆయనే!

పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం మొదలైన వీరగాథలను కొందరు పాడి వినిపించినట్టే రామ, రావణ యుద్ధగాథను సయితం ఆదిలో పాడి వినిపిస్తూ వుండేవారు. వాల్మీకి కూర్చగా దీన్ని మొట్టమొదట పాడినవారు కుశలవులు గనుకనే "కుశీలవుడు" అనే మాటకు ఊళ్ళవెంట తిరిగి వీరగాథలను పాడి వినిపించేవాడన్న అర్థం వచ్చినట్టు చెబుతారు. అన్నట్టు, "కుశీలవుడు" అంటే వాల్మీకి అని కూడా నిఘంటువులు పేర్కొంటున్నాయి.

ఆదిలో వాల్మీకి చెప్పిన గాథను కుశీలవులు కొంతవరకు పెంచి వుండాలి. వీరగాథలను పాడి వినిపించేవారు ఏయే ఘట్టాలు శ్రోతలను ఎక్కువగా కదిలిస్తాయో, ఏవి హెచ్చుగా వారిని కరిగిస్తాయో, వాటిని చిలవలు, పలవలుగా పెంచుకుపోతారు. ఈ విధంగా పెరిగినవే రామ వనవాసానికి కౌసల్యా దశరథుల విలాపాలు, పరస్పర వియోగానికి సీతా రాముల విలాపాలు, తమ భర్తల దుర్మరణానికి తారామండోదరుల విలాపాలు. అచ్చులో చదువుకొంటున్నప్పుడు "అబ్బ! చెప్పినదాన్నే తిరిగి ఎన్నిసార్లు చెబుతా"రన్న చికాకు తప్పనంత మేరకు ఈ విలాపఘట్టాలు పెరిగిపోయాయి!

రాముని శౌర్యప్రతాపాలు, హనుమంతుని బలదర్పాలు, లంకాపురి సౌందర్యవిభవాలు, విభిన్న ఋతువులలో ప్రకృతి శోభా విలాసాలు - పదే పదే వీటి వర్ణనల పునశ్చరణకు సయితం శ్రోతల హర్షామోదాలను మరింతగా సంపాదించ డానికై కుశీలవులు పడిన తాపత్రయమే ముఖ్య కారణం.

గ్రంథస్థం కాకముందే కుశీలవులద్వారా కొంత పెరిగిన రామాయణం ఆ తర్వాత కవి పండితుల చేతులలో పడి మరింతగా పెరిగి, చివరికి ఇంచుమించుగా 24,000 శ్లోకాల మహాకావ్య రూపాన్ని ధరించింది. ఈ 24 వేల శ్లోకాలను ఏడు కాండలుగా, ప్రతి కాండను అనేక సర్గలుగా విభజించారు. వాల్మీకి రామాయణమే ప్రథమ సర్గబంధకావ్యమనే ఒక ప్రథ వున్నది. అయితే, ఈ సర్గవిభజన భవభూతి కాలం తర్వాతగాని జరగలేదేమో! తన ఉత్తర రామచరితలో వాల్మీకంలోని ఒక శ్లోకాన్ని ఉదహరిస్తూ, అది ఫలానా అధ్యాయంలోనిదని భవభూతి పేర్కొంటాడు. దీన్నిబట్టి క్రీస్తు తర్వాత ఏడవ శతాబ్దిలోనో, ఆ తర్వాతనో వాల్మీకి రామాయణానికి ప్రస్తుతరూప మేర్పడినట్టు భావించాలి. రామాయణం సర్గబంధ కావ్యమైన తర్వాతనే అట్టి కావ్యలక్షణాలను పూర్తిగా పాటించాలన్న పట్టుదలతో ప్రతిసర్గ చివర క్లిష్ట చ్ఛందోరీతులతో, సుదీర్ఘ పాదాలతో ఇప్పుడున్న శ్లోకా లన్నింటిని కలపడం జరిగినట్టు శ్రీ సి వి. వైద్యా అభిప్రాయ పడుతున్నారు.

మనదేశ పండితులలో రామాయణ, భారతాలను గురించి విశేషంగా పరిశోధనలు జరిపినవారిలో శ్రీ వైద్యా ప్రథమ శ్రేణికి చెందుతారు. మహాభారతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి "మహాభారత్; ఎ క్రిటిసిజం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు; రామాయణాన్ని పరిశీలించి, "ది రిడిల్ ఆఫ్ ది రామాయణ" అనే పుస్తకాన్ని ప్రచురించారు; ఈ రెండు మహాకావ్యాలను గురించి తాను జరిపిన పరిశోధనలన్నింటిని క్రోడీకరిస్తూ "ఎపిక్ ఇండియా" అనే మరొక రచన ఆయన చేశారు. ఈ మూడు పుస్తకాలను శ్రద్ధగా చదివిన నేను శ్రీ వైద్యా తేల్చిన ప్రతి సారాంశంతో ఏకీభవించ లేకపోయినా, మొత్తం పై ఆయన కృషి సరైన పద్ధతులలో కొనసాగినట్టు నమ్ముతున్నాను.

రామాయణాన్ని ఏనాటివరకు పెంచుతూ పోయారో తేల్చి చెప్పడం కష్టమైనట్టే, తొలిరూపంలో వాల్మీకి దాన్ని ఎప్పుడు కూర్చినాడో చెప్పడంకూడా కష్టమే! వాల్మీకికి ఏడు వెనకల తలయెత్తిన కాళిదాసు కాలనిర్ణయం విషయంలోనే సంస్కృత సాహిత్య చరిత్రకారులు ఈనాటికి కూడా తలలు బద్దలు కొట్టుకొంటున్నారు. అయినప్పుడు వాల్మీకి ఎప్పటి వాడో నిర్ధారణగా ఎవరు చెప్పగలరు ఎలా చెప్పగలరు?

రామాయణం బాలకాండ ప్రథమసర్గ ప్రకారం నారదమహర్షి చెప్పగా విని, రామకథను వాల్మీకి వ్రాశాడు. మన పౌరాణిక సాహిత్యవ్యవసాయం నారదుని ప్రమేయం లేకుండా అడుగైనా ముందుకు సాగదు! కొన్ని పౌరాణిక గాథలకు విత్తనాన్ని ఆయనే చల్లుతాడు; కొన్నింటికి ఆయనే నీరు పెడతాడు; కొన్నింటికి కలుపుకూడా ఆయనే తీస్తాడు; కొన్నింటిలో కలుపు మొక్కలను తానై పాతి పెడతాడు; కొన్నింటిని ఆయనే కోసి, కుప్పవేసి, నూర్చుతాడు; కొన్నింటిని పంటమీద వుండగా తన చేతులతో చెరిపి, మట్టిపాలు చేస్తాడు. ఈ విచిత్రవ్యక్తి అస్తిత్వమే సందేహాస్పదం. ఒక వేళ ఈ పేరుగల వ్యక్తివుంటే, అతడొకడో, అనేకులో ఆ విషయం కూడా తెలియదు. ఏమైనా, నారదుని వద్దనుంచి కాక పోతే, మరొకరి వద్ద నుంచి రామగాథను విని, దాన్ని ఒక కావ్యంగా వాల్మీకి కూర్చినట్టు రామాయణం ప్రథమసర్గనుంచి మనం తీర్మానించు కోవలసి వుంటుంది.

కాని, ఉత్తరకాండకు వెడితే, దశరథుడు, జనకుడు తనకు సుపరిచితులైనట్టుగా అక్కడ వాల్మీకి చెప్పినట్టుగా వున్నది. సీతారాముల కథ తనకు సుపరిచితమని ఆయన వాకొన్నట్టుగా అక్కడ వున్నది. అకారణంగా అనుమానపడి రాముడు పరిత్యజించగా సీత తన ఆశ్రమానికి రానున్నట్టు తనకు ముందే తెలుసునని ఆయన వివరించినట్టుగా అక్కడ వున్నది. ధర్మసమాధివల్ల ముల్లోకాలలో జరిగే సంగతులు తనకు ముందుగానే తెలుస్తాయని వాల్మీకి ప్రగల్భాలు పలికినట్టుగా కూడా అక్కడ వున్నది. (ఉత్తరకాండ, 49వ సర్గ) అయితే జరిగినదాన్ని, జరుగబోయేదాన్ని తన దివ్యదృష్టితో ముందుగానే తెలుసుకోగల వాల్మీకి రామకథను నారదునిద్వారా ఎందుకు వినవలసివచ్చిందో! సంస్కృత రామాయణంలో అత్యధికంగా వున్నట్టు నేను పేర్కొన్న పరస్పర వైరుధ్యాలలో ఇది మరొకటి.

సరిగా ఏ శతాబ్దికి చెందినవాడో తెలియకపోయినా, వాల్మీకి మహా కవి అతి ప్రాచీనుడు. తైత్తిరీయ ప్రాతిశాఖ్యలో, వాజసనేయ సంహితలో వాల్మీకి ప్రసక్తివున్నట్టు శ్రీ వైద్యా పేర్కొన్నారు. వందనీయుడైన ఒక మహర్షిగా వాల్మీకిని మహాభారతం ప్రస్తుతిస్తున్నది. రామాయణంలోని కొన్ని శ్లోకాలను యథాతథంగా మహాభారతంలో ఉటంకించారు కూడా.

రామాయణ, మహాభారతాలలో మొదటిదే ముందు రూపొందింది. అయితే, మహాభారతం ముందు గ్రంథస్థంకాగా, రామాయణాన్ని వ్రాతరూపంలో పెట్టడం అటుపిమ్మట జరిగినట్టు పెక్కుమంది పరిశోధకులు నిర్ణయిస్తున్నారు. సంస్కృత భాషాపరిణామంలో మూడు దశలున్నట్లు జాకోబి సూచిస్తున్నారు. వాటిలో మొదటిది వేదవేదాంగాల భాష; ఇదే వైదిక భాష. కాగా, మూడవది రామాయణం ఓంప్రథమంగా ప్రవేశ పెట్టిన కావ్యభాష.

ఈ రెండింటి మధ్యకాలానికి చెందిన దానికి జాకోబి “ఆర్ష” భాషగా నామకరణం చేస్తున్నారు. ఏది వైదికమైనదో అదే ఆర్షమైనదని ఒక అభిప్రాయం వున్నా, వైదిక భాష కావ్యభాషగా పరిణమించడానికి ముందు అది “ఆర్ష” దశగుండా పయనించినట్టు జాకోబి పండితుని వాదం. మహాభారతం భాషలోకంటె రామాయణం భాషలోనే కావ్యభాషా లక్షణా లధికం. అందువల్ల, వైదిక భాష దాని క్రమపరిణామంలో “ఆర్ష" దశలో వుండగా మహాభారతాన్ని గ్రంథస్థం చేశారని, అటుపిమ్మట కావ్యభాష ఒకరూపాన్ని ధరిస్తున్న ఘట్టంలో రామాయణాన్ని అక్షరబద్ధం చేశారని జాకోబి చెప్పిన

సారాంశాన్ని చాలామంది పండితులు సమర్థిస్తున్నారు. జర్మనీకి చెందిన మరొక సంస్కృత భాషాపండితుడు డాక్టర్ మారిస్ వింటర్ నిట్ విశదీక రించినట్టు, రచనా శిల్పాన్ని పరిగణించినా మహాభారతం గ్రంథస్థమైన తర్వాతనే రామాయణం, కుశీలవులు పాడి వినిపించే వీరగాథ రూపాన్ని వీడి, అక్షరబద్ధకావ్యరూపాన్ని ధరించినట్టు అనుకోవలసివస్తుంది. “యుధిష్ఠిరు దన్నాడు”, “దుర్యోధనుడన్నాడు", "కుంతి అన్నది” - ఈ విధంగా వచనంతో శ్లోకాలకు లంకె పెట్టడం మహాభారతంలో కానవస్తుంది. అన్నంలో కలిసిన ఇసుక రేణువులవలె చీకాకు పెట్టే ఈ లంకెలు రామాయణంలో లేవు. తిరిగి వింటర్ట్ పేర్కొన్నట్టు, మహాభారత పాత్రలలో కానవచ్చే ఆవేశకావేషాలు, వారి క్రౌర్యకాఠిన్యాలు, ఒక్క మాటలో, వారి “పచ్చితనం” రామాయణ పాత్రలలో అంతగా లేదు, మహాభారతం తర్వాతనే, సభ్యతా సంస్కృతులు మరికొంత పరిణతిచెందిన తర్వాతనే, రామాయణం గ్రంథస్థ మైనదనే అభిప్రాయాన్ని ఇది మరింత బలపరుస్తున్నది.

గ్రంథస్థమైన కావ్యంగా మహాభారతమే ప్రాచీనమైన దనడానికి ఇంతకంటె కూడా ప్రబలమైన కారణం మరొకటి వున్నది. ముందు రామావతారమని, తర్వాత కృష్ణావతారమని చెప్పబడినా, కృష్ణార్జునులను, యుధిష్ఠిరుని పేర్కొన్న పాణిని కాని, పతంజలి కాని రాముని పేరెత్తలేదు. క్రీస్తుకు పూర్వపు శాసనాలలో దేనిలో కూడా రాముని ప్రసక్తి లేదు. వింటర్ నిట్ ఊహిస్తున్నట్టు, కృష్ణ వాసుదేవుని భూతలానికి దిగివచ్చిన మహావిష్ణువుగా పూజించడంతో భగవదవతారాల సిద్ధాంతం ప్రారంభమై వుండవచ్చు. క్రీస్తుశకానికి పూర్వం ఒకటవ శతాబ్దికి చెందిన ఒక గ్రీక్ దేశస్థుడు (అతని పేరు హెలియోడోరస్. అతడు సుంగరాజు భాగభద్రుని ఆస్థానంలో యవనరాయబారి) కృష్ణవాసుదేవునికి మహాభక్తుడై, తన భక్తికి చిహ్నంగా ఒక స్తంభాన్ని విదిశవద్ద ప్రతిష్టాపనచేశాడు. కాగా, కొందరు చరిత్రకారుల పరిశోధనల ప్రకారం దాదాపు గుప్త రాజుల కాలంవరకు (క్రీస్తు తర్వాత అయిదవ శతాబ్ది వరకు) రామాలయాలనేవి లేనే లేవు. అప్పటివరకు తాను రామభక్తుడనని చెప్పుకొన్న రాజు ఒక్కడైనా లేడు. (ఈ విషయంలో ఆసక్తిగలవారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రతిభాపూర్వకంగా రచించిన “రామాయణ విశేషములు అనే గ్రంథంలో 76వ పుటను చూడవచ్చు)

కడపటి మౌర్యచక్రవర్తిని హత్యచేసి, క్రీస్తు పూర్వం 178లో సుంగ సామ్రాజ్యాన్ని స్థాపించిన పుష్యమిత్రుని రాజ్యకాలంలో పతంజలి నాయకత్వాన భగవదవతారాల సిద్ధాంతం తలయెత్తిందని నా నమ్మకం. పతంజలి ప్రధాన పాత్రగా ఒక చారిత్రక నాటకాన్ని రచించాలనే కోర్కె నా కున్నది. అది సఫలమైతే, దాని పీఠికలో ఈ విషయాన్ని విపులీకరిస్తాను.

- వాల్మీకి పేర చెల్లుతున్న సంస్కృత రామాయణం ప్రాంతానికి ఒక తీరులో, ప్రదేశానికి ఒక తెన్నులో వున్నది. తెలుగు లిపిలో మొట్టమొదటగా 1856లో అచ్చుకెక్కిన రామాయణం మహేశ్వర తీర్థుల, గోవిందరాజుల వ్యాఖ్యానంతో కూడివున్నది. దీన్ని ఇద్దరు పండితులు - అనంతనారాయణ శాస్త్రులు, రామస్వామి శాస్త్రులు - ముద్రణకు సిద్ధంచేసి, మద్రాసు నుంచి ప్రకటించారు. పరమ పవిత్రమైన సంస్కృత రామాయణం వ్రాతప్రతిని అచ్చుకూర్చడం కోసమైనా ద్విజేతరుల చేతిలో పెడితే అది మైలపడిపోగలదని, “కంపోజింగ్” నేర్చుకొనవలసిందిగా కొందరు భూసురోత్తమ యువకులను ప్రోత్సహించి, వారి సహాయంతో వావిళ్ళవారు తమ తొలిముద్రణను వెలువరించారు! ఈ సంగతి విన్నప్పుడు కులతత్త్వాల కుళ్ళుతో మన సంఘం ఈనాటికి సయితం ముక్కులను బద్దలుకొడుతున్నా, పోయిన నూరేళ్ళలో కనీసం కొన్ని విషయాలలోనైనా కులతత్త్వప్రాబల్యం కొంత తగ్గకపోలేదన్న సంతోషం నాకు కలిగింది. తర్వాత 1863లో బెంగుళూరు నుంచి కన్నడ లిపిలో వెలువడిన రామాయణం మద్రాసు ముద్రణ పాఠాన్నే చాలావరకు అనుసరించింది.
ఈ ఈ దక్షిణాది పాఠానికి చెప్పబడిన తొలి వ్యాఖ్యానాన్ని కటక వ్యాఖ్యాన మంటారు. వ్యాఖ్యానకర్త ఏ ప్రాంతంవాడో సరిగా తెలియదు. అయితే, కాళహస్తీశ్వరుని స్తోత్రం చేశాడు కాబట్టి, ఇతడు చిత్తూరు జిల్లావాడు కావచ్చు.

దక్షిణాది పాఠానికి బొంబాయి పాఠం చాలా చేరువగానే వుంటుంది. ఉత్తరాది పాఠంగా చెల్లుతున్న దీన్ని కటక వ్యాఖ్యాన సహితంగా 1859లో మొదటితూరి, 1888లో రెండవతూరి అచ్చువేశారు. కాగా, వంగదేశ పాఠం మరొకటి వున్నది. దక్షిణాది, ఉత్తరాది పాఠాలకు పెక్కుచోట్ల ఇది విభిన్నంగా వున్నది. వీటితోపాటు కాశ్మీర్ ప్రాంతానికి చెందిన మరొక పాఠం వున్నది; దీన్ని లాహోర్ నుంచి ఈ శతాబ్ది ప్రారంభంలో ఓంప్రథమంగా ప్రచురించారు. పశ్చిమ ప్రాంత పాఠంగా దీన్ని పేర్కొంటున్నారు.

ఇదేవిధంగా మరికొన్ని పాఠాలుకూడా లేకపోలేదుగాని, మూడింటిని మాత్రమే - బొంబాయి, బెంగాల్, కాశ్మీర్ పాఠాలనే - ప్రధాన మైనవిగా భావిస్తున్నారు. ఈ మూడింటిని శ్రద్ధగా పరిశీలించిన జాకోబి తేల్చిన సారాంశం ప్రకారం దాదాపు మూడవవంతు - అనగా సుమారు 8,000 శ్లోకాలు ఏ ఒక్కదానిలో వున్నట్టుగా మిగిలిన రెండింటిలో లేవు. పదాలకూర్పులో చిన్న పెద్ద మార్పులేకాక, అంతకు మించిన పెద్ద పెద్ద వ్యత్యాసాలే వీటిలో వున్నాయి. సర్గలకు సలే ఒకదానిలో వున్నవి మరొకదానిలో లేవు. ఒకే విధమైన శ్లోకాలున్న సందర్భాలలో సయితం అవి మూడు పాఠాలలోను ఒకే క్రమంలో లేవు. ఏదో ఒక కథాఘట్టానికి సంబంధించిన శ్లోకాలను ఒకే పాఠంలో రెండు మూడు చోట్ల జొప్పించడం సయితం జరిగింది. పునశ్చరణ చేయబడిన ఈ శ్లోకాలలో తిరిగి కొన్ని పాఠభేదాలున్నాయి. ఈ పాఠభేదాలను గురించి జాకోబి వ్రాసిన విషయంలోకి విపులంగా వెళ్ళకుండా, మన ఆదికావ్యం దాని ఆదిరూపంలో మిగిలిలేదని చెబితే సరిపోతుంది. జాకోబి అభిప్రాయం ప్రకారమే కాక, వైద్యా, వింటర్ నెట్ ప్రభృతుల అభిప్రాయం ప్రకారంకూడా నేడు మనకు లభిస్తున్న సంస్కృత రామాయణం వివిధ పాఠాలలో నాల్గింట ఒకవంతు మాత్రం వాల్మీకి చెప్పింది కాగా, మిగిలిన మూడువంతులు తక్కినవారు వేర్వేరు కాలాలలో మూలపాఠానికి జత చేర్చినట్టిదే!

తిమ్మిని బొమ్మి చెయ్యాలంటే, అందుకు మాటనేర్పు మాత్రమే చాలదు; ఊహాపటిమ, కల్పనా చాతుర్యాలు మాత్రమే చాలవు; అడుగడుగుకు ఎంతో మెలకువ చూపించాలి; గారడీవానిని మించి హస్తలాఘవాన్ని ప్రదర్శించాలి; వేయికళ్ళతో కనిపెట్టి చూస్తున్నా పట్టుపడని విధంగా ఇంద్రజాల, మహేంద్రజాలాన్ని చెయ్యాలి. రామాయణాన్ని పెంచివేసినవారు ఇంతటి ప్రతిభావంతులు కానందున, ఎక్కడి కక్కడ వారు ఇట్టే దొరికిపోతున్నారు.

“అడుగులోనే హంసపాదు” అన్నట్టు, ప్రథమ కాండలోని మొదటి సర్గనుంచి, మూడవదానికి వెళ్ళేసరికే వాల్మీకి రామాయణంలో వేలు పెట్టిన వారు తమ అజాగ్రత్తను బయట పెట్టుకున్నారు. మొదటి సర్గలోని రామాయణ కథాక్రమం పునశ్చరణను మూడవసలో మనం చూస్తాము. వీటిలో మొదటి కథాక్రమం “దశరథ మహారాజు తన ప్రజల యోగక్షేమాలను కాంక్షించి. తన కుమారులలో పెద్దవాడైన రాముని యువరాజుగా చేయగోరి...” అంటూ ప్రారంభమౌతుంది; కాగా, రెండవదాని ప్రారంభం రామజననంతో! ఈ వ్యత్యాసం ప్రత్యేకించి గమనించ దగినట్టిది. రామునికి యౌవరాజ్య పట్టాభిషేకయత్నంతో రామాయణం ప్రారంభమైతే, మొత్తం బాలకాండ పేలపిండి వలె గాలికి ఎగిరిపోతుంది! ఆ కాండలోగల అసంభవ విషయాలు, అభూత కల్పనలు, అనవసర ప్రస్తావనలు మొదలైనవన్నీ ఎగిరిపోతాయి. మొదలైన పండితుల దృష్టిలో బాలకాండలో అయిదవ సర్గను,

జాకోబి, మాక్రోనెల్, వైద్యా ఇతరసర్గలు రెండు, మూడింటిలో కొద్దిపాటి భాగాలను మినహాయిస్తే, ఆ కాండ వాల్మీకి రచన కావడానికి వీలే లేదు. ఈ కర్కోటకపు కలికాలంలోనైనా పౌరాణిక గాథలను కావ్య వస్తువుగా చేసుకునే కవులకు బ్రహ్మదేవుడు, ఆయన భార్యారత్నం, ఆయన మానసపుత్రుడు, లేదా, దివ్యలోకాలనుంచి దిగివచ్చిన మరొకరు కనీసం కలలోనైనా సాక్షాత్కరించి "పాప పంకిలంలో పడి కొట్టుకులాడుతున్న మానవాళికి మోక్షమార్గాన్ని చూపించడానికై, మీరు

కావ్య రచన చేయండి" అని చెప్పిపోతా రనుకోండి! అయితే వారైనా "శ్రీ వాల్మీకి మహర్షి తాను సర్వజ్ఞుడైనా, జనులందరు తనవలెనే తాపత్రయ విముక్తిని పొందుదురు గాక! అని తలంచి... "ఈ ధోరణిలో తమ కావ్యాన్ని ప్రారంభించరు. అయినప్పుడు వాల్మీకి మహాకవి ఈ విధంగా రామాయణాన్ని ప్రారంభించి వుంటాడా? ఆదికవి పట్ల ఏపాటి గౌరవమున్న వారైనా కేవలం ఈ కారణాన్ని పురస్కరించుకునే బాలకాండలోని మొదటి నాలుగు సర్గలను ప్రక్షిప్తాలని కొట్టిపారవేయక తప్పదు.

అయిదవ సర్గను విడిచి కాస్త ముందుకు వెడితే, బాలకాండలో తిరిగి ఎక్కడి కక్కడ కలిసీ కలవని అతుకులే; తిరిగి తెలిసీ తెలియని అవకతవకలే! సప్తర్షులలో ముఖ్యుడైన వసిష్ఠుడే తనకు కులగురువు. ఆయనకు ఈడురాగల వామదేవుడు, జాబాలి, సుయజ్ఞుడు, కాశ్యపుడు తన ఋత్విజశ్రేష్ఠులు. అయినప్పుడు అశ్వమేధ యాగానికి ఆధ్వర్యం వహించడానికి దశరథునికి ఋష్యశృంగునితో అవసర మేమిటి? ఆయనతో నిజంగానే అవసరం రానున్నట్టు దశరథుడు పుట్టకముందే వ్రాసి పెట్టబడివుంటే, ఆ సంగతి తెలిసిన వసిష్ఠాది మహర్షులు దశరథునికి ఆ సంగతిని తామై చెప్పకపోవడ మేమిటి? ఆ మహర్షులు తమలో తాము పూర్వమెన్నడో చెప్పుకున్న ఈ సంగతిని కాకతాళీయంగా విని, దీన్ని జ్ఞాపకం పెట్టుకున్న దశరథుని సారథి ఏకాంతంగా దీన్ని ఆయన చెవిలో వేయవలసి రావడమేమిటి? వసిష్ఠునికి చిరకాలంగా తెలిసినట్టుగా తన సారథి ద్వారా తాను విన్న సంగతినే దశరథుడు తిరిగి వసిష్ఠునికి నివేదించడ మేమిటి? తనకు పడవలసిన పెద్దపీట మరొకరికి పడబోతున్నదన్న దుగ్ధతో అన్నట్టుగా, కనీసం అప్పుడైనా వసిష్ఠుడు "ఔను! నిజమే సుమీ!" అని అనకపోవడ మేమిటి? అపార తపోధనుడైన మహాజ్ఞాని ఋష్యశృంగుడు దశరథునిచే పుత్రసంతాన ప్రాప్తికై ముందు అశ్వమేధాన్ని జరిపించి, తీరా అది ముగిసిన తర్వాత పొరపాటు జరిగినట్టు వేలు కరచుకుని, పుత్రకామేష్టిని చేయించడ మేమిటి? (15వ సర్గలో ఈ మతిలేని పనిని వివరించే మాట లివి : "అంతట మహామేధావి, వేదార్థాలు చక్కగా తెలిసినవాడు, ఆ ఋష్య శృంగుడు కొంతతడ వాలోచించి, ఆతర్వాత జ్ఞప్తికి తెచ్చుకున్నవాడై ") పురోహితులకు ఒకసారికి రెండుసార్లు పుష్కలంగా సంభావన లిప్పించడానికే ఋష్యశృంగునికి ఈ మతిమరుపు వచ్చిందా? (అశ్వమేధం తర్వాత వసిషాదులు తమకు "దొరికిన ధనాన్ని వంతుల ప్రకారం న్యాయంగా పంచుకుని, మనస్సులో పొంగి, ఒకరినొకరు స్తోత్రం చేసుకున్నారని 14వ సర్గ పేర్కొంటున్నది. పైకికాక, మనస్సులో పొంగడం, తమను తామే పొగడుకోవడం దశరథుని శుంతను చేయగలిగినామన్న సంతోషంతో కాదు గదా?)

అన్నట్టు పన్నెండవ, పదమూడవ సర్గలను పరిశీలనగా చూస్తే పుత్రసంతాన ప్రాప్తికి సంబంధించినంతవరకు నిష్ఫలమైనదిగా పరిణమించిన అశ్వమేధాన్ని ఋష్యశృంగు డొకసారి చేయించగా, దాన్నే వసిష్ఠుడు మరొకసారి చేయించినట్టు అనుమానించవలసి వస్తున్నది! ఇంకొకతూరి సంభావనలు పుచ్చుకొనడానికే ఆయన ఈ పని చేయించాడా? ఋత్విజు లందరు చేరి, దశరథుడు తమకు మొత్తంగా దక్షిణ యిచ్చిన ధనాన్ని తమ మధ్య పంచి పెట్టడానికి ఋష్యశృంగ మహర్షికి, బుద్ధిమంతుడైన వసిష్ఠమహర్షికి సమర్పించారట (14వ సర్గ) దీన్ని బట్టి ఏ దోపిడి చేసినా ఆ ఋషు లిద్దరు ఏకమై చేశారనే అనుకోవాలా?

వితర్కిస్తూపోతే, ఈ విధంగా బాలకాండలో నూటికి తొంభై తొమ్మిది వంతులు అసందర్భ విషయాలే, అభూతకల్పనలే. వాటిలో నైనా కొంత చాతుర్యాన్ని చూపితే, ప్రాగల్భ్యాన్ని ప్రదర్శిస్తే, గుడ్డిలో మెల్ల అని సరిపెట్టుకోవచ్చు. అందుకైనా వీలులే దనడానికి ఈ కింది తార్కాణం సరిపోగల దనుకుంటాను :

రావణవధకై మానవరూపంలో ధరాతలంపై అవతరించబోతున్న విష్ణుమూర్తి సహాయార్థం బ్రహ్మదేవుడు స్వయంగానే మరి కొంత శ్రమపడితే సరిపోయేది కాదా? ఆయ నొకసారి ఆవలించగా, ఆయన నోటినుంచి జాంబవంతుడు తటాలున

ఊడిపడ్డాడట! ఆయనే మరికొన్ని సార్లు ఆవలించి, వాలి సుగ్రీవాదులను సృష్టించక, అప్సరల, గంధర్వ స్త్రీల ద్వారా వారిని పుట్టించవలసిందిగా యక్ష గంధర్వ సిద్ధ విద్యాధర పన్నగులతోపాటు ఋషీశ్వరులకు సలహా చెప్పాడు. ఆ సలహా ప్రకారం వారందరు, ఎవరి ఓపికనుబట్టి వారు, వానర సంతానాన్ని కనిపారవేశా రనుకోండి. ఏమైనా, పురుళ్లు అనేవి ఆవలింత లంత తేలిక కావుగదా!

మొత్తంపై ఈ స్థాయిలో బాలకాండను సృష్టించి, దాని పితృత్వాన్ని వాల్మీకి మహాకవికి అంటగట్టినవారు పూర్వాపరాలను సరిగా చూచుకోని సందర్భాలలో మరొక్కదాన్ని ఇక్కడ పేర్కొంటాను.

రామావతారం యెత్తనున్న విష్ణుమూర్తి సహాయార్థం వానరబలాన్ని సృష్టించవలసిందిగా బ్రహ్మ సూచించగా, దేవేంద్రుడు వాలి అనే వానరశ్రేష్ఠుని సృష్టించినట్టు బాలకాండ 17వ సర్గలో వున్నది. ఈ ప్రక్షిప్తాన్ని ప్రవేశపెట్టిన ప్రబుద్ధుడు వాలివల్ల రాముడు ఏమీ సహాయం పొందకపోగా, లోకనిందకు లోనుగావలసివచ్చిన సంగతిని మరిచి పోయాడు!
పోనీ, నేను వ్రాసిన తక్కిన విషయాలతో మీరు ఏకీభవించక పోయినా, బాలకాండలోగల విశ్వామిత్రుని పుట్టు పూర్వోత్తరాలు, వసిష్ఠునితో ఆయనకు కలహం, నగరచక్రవర్తి, ఆయన పుత్రులవృత్తాంతం, గంగావతరణ గాథ మొదలయిన వన్నీ రామకథ ముందుకు సాగడానికి ఏవిధంగాను తోడ్పడవని గుర్తిస్తారా? కథాగమనాన్ని నిరోధిస్తున్న ఈ భాగాలన్నీ ప్రక్షిప్తాలనుకోవడం ఏ విధంగా తప్పు?

బాలకాండలో ఏకొంచెమో వాల్మీకి చెప్పింది కావచ్చుగాని, ఉత్తరకాండ పూర్తిగా ప్రక్షిప్తమే! వావిళ్ళవారు తెలుగు లిపిలో తాము ప్రచురించిన సంస్కృత రామాయణం ఉత్తరకాండలో మొత్తం 13 సర్గలను ప్రక్షిప్తాలుగా చూపించారు. రామాయణాన్ని ఒక పవిత్ర గ్రంథంగా దానిలోని ప్రత్యక్షరాన్ని కళ్ళ కద్దుకునేవారే, ఉత్తరకాండ వద్దకు వచ్చేసరికి, దానిలో కొన్ని భావాలు వాల్మీకి విరచితాలు కావని గుర్తించక తప్పలేదనికాదా దీని తాత్పర్యం? బాలకాండ ప్రథమ సర్గలోని కథాక్రమం రావణవధానంతరం రామపట్టాభిషేకంతో రామాయణాన్ని ముగిస్తున్నది. మూడవ సర్గలోని కథాక్రమంలో రామపట్టాభిషేకం పిమ్మట "ఉత్తరకాండలోనివి ఆ తర్వాత నడిచే రామచరిత్రలోని వృత్తాంతాలు" అని చిట్టచివరి మాటలుగావున్నా, ఇవి "ఆ తర్వాత" కలిపిన మాటలన్నట్టు వాటి ముఖానే వ్రాసివున్నది. ఉత్తరకాండలో రామపట్టాభిషేకం తర్వాత విశేషంగా వున్నట్టిది రావణుని వృత్తాంతమే! అతని జననం, మండోదరితో అతని వివాహం, అతని లంకా విజయం, యమునితో అతని యుద్ధం, సూర్య చంద్ర వరుణ లోకాలకు అతని యాత్రలు, రంభతో అతని బలాత్కార శృంగారం, స్వర్గంపై అతని దండయాత్ర ఈ విధంగా అతని సంగతులే ఉత్తరకాండలో హెచ్చుగా వున్నందున "రావణాయణం"గా దానికి నామకరణం చేయడం సముచితం కాగలదేమో!

పారాయణం చేసేవారే, రావణుని పుట్టుపూర్వోత్తరాలను వివరించగోరితే, ఆ పనిని రావణవధకు పూర్వమే వాల్మీకి చేసివుండేవాడు. తన కావ్యాన్ని ఒక కొలికికి తెచ్చిన తర్వాత ఆయన వెనుకకు వెళ్ళి, వెర్రిమొర్రి కల్పనలు చేశా డనడం ఆ మహాకవిపట్ల ఘోరాపచారమే.

యుద్ధకాండ చివరి సర్గలోగల ఫలశ్రుతి "ఈ రామాయణం పూర్తిగా విన్నవాడు" దీర్ఘాయువు మొదలుకొని, సర్వపాపాలనుంచి విముక్తివరకు సమస్త లాభాలను పొందగల దన్న ఆశ చూపుతున్నది. అక్కడితో రామాయణం "పూర్తి" అయివుండకపోతే, దాన్ని పూర్తిగా వినడం" ఎవరికైనా ఏవిధంగా సాధ్యం? ఈ కారణానకూడా ఉత్తర కాండను వాల్మీకి రచనగా భావించలేము. ఇంతేకాక, శైలినిబట్టి చూచినా అది వాల్మీకి రచన కాదు.

ఈ ఫలశ్రుతిలో గమనించదగు మరొక విశేష మిది : "కవులందరిలో ఉత్తమోత్తముడైన వాల్మీకి రచించిన ఈ రామాయణ ఆది కావ్యాన్ని ఎవరు చదివినా, ఎవరు విన్నా..." అనే ముక్కలు దీనిలో వున్నాయి. వీటినిబట్టి రెండు విషయాలు సువిదిత మౌతున్నాయి : మొదటిది, ఈ ఫలశ్రుతిని చెప్పినవాడు వాల్మీకి కాదు. ఆయన దీన్ని చెప్పివుంటే "కవు లందరిలో ఉత్తమోత్తముడైన వాడ"నని స్వోత్కర్ష చేసుకొని వుండేవాడు కాదు. పైగా, తనదే ఆది కావ్యమైతే, తానే ఆదికవి కూడా అయివుండాలి. అయినప్పుడు తనతోను, తన కవనంతోను పోల్చుకొనడానికి ఇతర కవు లెవరు? కావ్యా లేవి? రెండవ విషయం; "దీన్ని విన్నవారు" అనే మాటతో పాటు "చదివినవా"రన్నది కూడా వున్నది కాబట్టి, ఈ ఫలశ్రుతిని రామాయణానికి పరులెవరో కలిపిననాటికి అది గ్రంథస్థమై వున్నది; గ్రంథస్థమై లేని దాన్ని "పఠించడం" జరగదు. కాగా, బాలకాండను, ఉత్తరకాండను ప్రక్షిప్తాలుగా తిరస్కరిస్తే, సంస్కృత రామాయణంలో మిగిలేవి అయిదు కాండలే! వాటినైనా పూర్తిగా వాల్మీకి రచనలుగా గుర్తించలేము. విమర్శాత్మకంగా పరిశీలిస్తే, వీటిలో సయితం అనేక ప్రక్షిప్తాలు - కొన్ని పూర్వాపరాలను దృష్టిలో పెట్టుకుని చేసినట్టివి, కొన్ని తద్భిన్నమైనట్టివి - కానవస్తాయి.

మొత్తంపై చూస్తే, ఒక్క అయోధ్యాకాండలోనే ప్రక్షిప్తాలు తక్కువ. రామాయణగాథకు ఏ కొంచెమో చారిత్రక ప్రాతిపదిక వుంటే, అది ఈ కాండలోనే వున్నది. అసంభవ విషయాలు, అద్భుత సంఘటనలు, అభూత కల్పనలు దీనిలో దాదాపు లేవు. మనలను పోలిన మానవులనే ఇది మనకు పరిచయం చేస్తుంది; వారి మానవతనే ఇది చిత్రిస్తుంది.

ఈ కాండలోగల రెండు, మూడు ప్రక్షిప్తాలలో ప్రధానమైనది నూరవ సర్గ. చిత్రకూట పర్వతం వద్దకు వచ్చి అన్నను కలుసుకున్న భరతుడు దీనకంఠంతో "అన్నా!" అని పిలిచి, ఆ పై మాట పెగలక, తిరిగి "అన్నా! అన్నా!" అంటూ అన్న పాదాలపై పడి, వాటిని తన కన్నీటితో తడుపుతూ వుండడంతో 99వ సర్గ సమాప్తి చెందుతుంది. రాము డంతట తమ్ముని ఆప్యాయంగా లేవనెత్తి, గట్టిగా కౌగలించుకుని, కుశల ప్రశ్నలు వేస్తాడు. నూరవ సర్గ ప్రారంభం ఇంతవరకు సమంజసంగానే వున్నది. కాని, తన కుశల ప్రశ్నలకు సమాధానాలకు వేచివుండక రాజధర్మాన్ని గురించి, దండనీతిని గురించి రాముడు ఒక దీరోపన్యాసమిస్తాడు! ఆ సన్నివేశంలో ఇది పూర్తిగా అసందర్భం కాదా?

ఈ దీర్ఘోపన్యాసం మహాభారతంలోని సభాపర్వం నుంచి సంగ్రహించబడినదని శ్రీ వైద్యా వ్రాస్తున్నారు. "అయోధ్యా కాండలో నుంచి సభాపర్వంలోనికే దీన్ని సంగ్రహించారేమో!"అని వాదించడానికి అక్కడ దీనికున్న సందర్భశుద్ధి ఇక్కడ లేదు.

మహాభారతంలో మత ధర్మాల చర్చ, రాజధర్మాల చర్చ విశేషంగా వున్నది. అవి వాల్మీకి కావ్యంలో లేకపోవడం ఒక లోపంగా భావించినవారు, సందర్భ శుద్ధినైనా గమనించకుండా, వాటిని రామాయణంలో అక్కడక్కడ ప్రవేశపెట్టారు. ఇట్టివాటిలో మరీ "సిల్లీ"గా కనిపించేది బౌద్ధం ప్రసక్తిని తీసుకురావడం! రామాయణ కాలం తర్వాత - ఛాందసుల లెక్కప్రకారమైతే కొన్నివేల సంవత్సరాల తర్వాత తలయెత్తిన బౌద్ధం ప్రసక్తిని రామాయణంలో తీసుకురావడం "సిల్లీ"గా వున్నదనడం చాలా మృదువైన విమర్శే! "కాదు : ఇది తూలుమాట!" అంటారా? అయితే, మీకు తెలియకపోవచ్చుగాని, అయోధ్యా కాండ 109వ సర్గలో రామునినోట బుద్ధుని గురించి ఇంతకంటే "తూలుమాట"లను పలికించారు. జాబాలితో నాస్తికమతాన్ని గురించి చర్చించే సందర్భంలో గౌతమబుద్ధుని ఇక్కడ రామునిచేత "చోరు" డనిపించారు.
అయోధ్యాకాండనుంచి ఆరణ్యకాండకు దృష్టిని మరల్చితే, దానిలో శరభంగ మహర్షికి సంబంధించిన భాగం నిశ్చయంగా ప్రక్షిప్తం; మాయామృగం రూపంలో మారీచుడు రావడం కూడా బహుశా ప్రక్షిప్తమే, శరభంగుని వద్దకు రెక్కల గుర్రాలను కట్టిన రథంలో ఇంద్రుడు రావడం, నేలను తాకకుండా గాలిలోనే దాన్ని నిలిపి, దానిలోనుంచి అతడు దిగడం, శరభంగునితో ఏదో పనివున్నట్టు వచ్చిన దేవేంద్రుడు పెద్దగా అతడితో ఏమీ మాట్లాడనైనా మాట్లాడకుండా వచ్చిన దారినే

వెళ్ళిపోవడం, ఆ తర్వాత "నా తపస్సుచేత , బ్రహ్మలోకాన్ని గెల్చుకున్నా, నిన్ను ఒకసారి చూచిపోదామని వేచివున్నా"నని చెప్పి, శరభంగుడు అగ్ని ప్రవేశం చేయడం ఇది కథాగమనానికి పూర్తిగా అనవసరమైన శుష్క సంఘటన కాగా, మాయామృగ వృత్తాంతం ప్రక్షిప్త మనడానికి ముఖ్యకారణమిది : రాముని బాణానికి కూలిన మారీచుడు "హా సీతా! హా లక్ష్మణా!" అని వేసిన కేకవిని, ఎంతగానో భయపడిపోయి, భర్త సహాయార్థం వెంటనే బయల్దేరి వెళ్ళవలసిందిగా లక్ష్మణునికి చెప్పిన సీత, తాను చెప్పినంతనే కదలి వెళ్ళనందుకు మరదిని నానామాట లన్న సీత, ఆ వెనువెంటనే కపట బ్రాహ్మణరూపంలో వచ్చిన రావణునితో, తన మనస్సులో లవలేశంగానైనా కలత లేనట్టు సంభాషిస్తుందా?

"ఓ ద్విజోత్తమా! ఇదిగో ఆసనం! దీనిపై కూర్చోండి! ఇవిగో మీ కాళ్ళకు నీళ్ళు!" అని పలుకుతుందా? (46వ సర్గ) "జింకలు, ఉడుములు, అడవిపందులు మొదలైన వన్యమృగాలను వేటాడి తీసుకురావడానికై మా ఆయన వెళ్ళాడు, ఆయన తన వెంట కందమూల ఫలాలనుకూడా తెస్తాడు. వాటితో తమకు ఆతిథ్యమిస్తా"నని చెబుతుందా! (47వ సర్గ) పోనీ, తనవారు తిరిగి వచ్చేవరకు తనకు అపాయం జరగకుండా మంచిమాటలు చెప్పి, ఆగంతకుని కూర్చోబెట్టడానికి ఆమె ప్రయత్నించినట్టు అనుకోడానికి అతడు మాయవేషంలో వున్న రావణుడని (అతడు తానై చెప్పినంతవరకు) ఆమెకు తెలియదుగదా!

పోతే, అక్కడ రాముని ప్రవర్తన సయితం కొంతవరకు చిత్రంగానే తోస్తుంది. తన బాణం దెబ్బకు కూలిన మారీచుడు దొంగ అరుపు అరిచినంతనే పర్ణశాలలో తాను విడిచివచ్చిన తనవారి యోగక్షేమాలను గురించి ఆందోళన చెందిన రాముడు వెంటనే వెనుకకు తిరగాలి. "నా వెనకప్రక్క నక్క కూస్తున్నది. దారుణమైన ఇతర అపశకునాలు కూడా కనబడుతున్నాయి. సీతను ఏ రాక్షసుడో మ్రింగివేయలేదుగదా!" అని చలించిపోయేవరకు ఆయన ఆందోళన వెళ్ళింది. (57వ సర్గ) అయినా, మరొక జింకను చంపి, దాన్ని మాంసాన్ని తీసుకుని, ఆ తర్వాతనే రాముడు ఇంటిముఖం పడతాడు (44వ సర్గ).

మారీచుడు చాలాదూరంవరకు రాముని తీసుకు వెళ్ళినట్టు ఒకటికి రెండుసార్లు 57వ సర్గ నొక్కి చెబుతున్నది. మరి అంతదూరం నుంచి మారీచుడు వేసిన కేక పర్ణశాలవరకు ఎలా వినబడింది? ఎట్టి మాయోపాయమైనా పన్నగల రాక్షసుడు కాబట్టి, అతడికి ఏదైనా సాధ్యమంటే మాత్రం మరి మాట్లాడ్డానికి వీలులే దనుకోండి!

మాయామృగ వృత్తాంతం కల్పితమైనదని భావిస్తే మాత్రం ఆ ఘట్టంలో సీతారాముల ప్రవర్తన ఎంతమాత్రం వింతగా తోచదు. తాము వేటకు వెడుతున్నట్టు రామలక్ష్మణులిద్దరు సీతతో చెప్పి వెళ్ళారని అనుకోండి. ఆ వెనుక రావణుడు వచ్చివుంటే అతడితో సీత పలికిన ప్రతిపలుకు సహజమైనదిగానే ధ్వనించదా? ఇదే బహుశా నిజమై వుండాలి. ఒకరికొకరు తోడుగా వారిద్దరు కలిసి వేటకు వెడుతూ, జటాయువును సీతకు కాపుగా పెట్టి వెళ్ళేవారని అనుకోవడానికి కూడా వీలున్నది. పంచవటి ప్రాంతంలో రాముని మొట్టమొదటిసారి కలుసుకున్నప్పుడు జటాయువు "నీవు, లక్ష్మణుడు వేటకు వెళ్ళిన సమయాలలో సీతకు తోడుగా నేను మీ పర్ణశాలవద్ద కనిపెట్టుకు వుంటా"నని చెప్పినట్టు ఆరణ్యకాండలోనే వున్నది.

ఈ ఊహ సరైన దనడానికి ఇతరులు చూపించని సాక్ష్యాధార మొకటి నాకు కిష్కింధాకాండలో (ఆరవ సర్గ) కనబడింది. సీతాపహరణ ఏ పరిస్థితులలో జరిగిందో రామలక్ష్మణు లిద్దరిలో ఎవరో ఒకరు చెప్పివుంటే తప్ప హనుమంతునికి తెలియడానికి వీలులేదు. వారి నుంచి తాను విన్నమాటలనే హనుమంతుడు సుగ్రీవునికి వినిపించాడు.

రావణుడు యెత్తుకు పోతుండగా సీత గుడ్డమూటకట్టి పారవేయగా తనకు దొరికిన ఆమె నగలను రామునికి చూపుతూ సుగ్రీవుడు ఏమన్నాడో చూడండి;

"ఓ రామా! నీవెందుకు మా నిర్జనవనానికి వచ్చావో హనుమంతుడు చెప్పగా విన్నాను. ఒంటిగా సీతను విడిచి, నీవు నీ తమ్మునితో అడవిలో తిరుగుతుండగా, రావణుడు సందు నీ కనిపెట్టివుండి, జటాయువును సంహరించి, నీ భార్యను యెత్తుకుపోయాడు గదా! భార్యా వియోగానికి నీ విక దుఃఖించ నక్కరలేదు. ఆమె పాతాళంలో వున్నా, స్వర్గంలో వున్నా వెదకి తెచ్చి నీ కిస్తాను."

ఇక్కడ మారీచుని ప్రసక్తి లేకపోవడం ప్రత్యేకించి గమనార్హమైన విషయం కాదా?
ఇప్పటికే సుదీర్ఘంగా కొనసాగిన ఈ ప్రక్షిప్తాల చర్చను మరి ముగించేముందు కిష్కింధ, సుందర, యుద్ధ కాండలను గురించి క్లుప్తంగా కొన్ని విషయాలను చెబుతాను. కిష్కింధలో 40-41-42-43-46 సర్గలు నిస్సందేహంగా ప్రక్షిప్తాలే! ఇవి సుగ్రీవుని భూగోళ పరిజ్ఞానాన్ని వివరించే సర్గలు, సీతను వెదకడానికై నాలుగు వానరబృందాలను నేల నాలుగు చెరగులకు పంపుతూ తన అత్యద్భుత భౌగోళిక పరిజ్ఞానాన్ని ఈ మొదటి నాలుగు సర్గలలో సుగ్రీవుడు ప్రదర్శిస్తాడు; అయిదవదానిలో అంతటి విస్తృత పరిజ్ఞానం తనకు ఎలా లభించిందో అతడు వివరిస్తాడు. ఇక్షు సముద్రం, క్షీరసముద్రం, ఉదయాద్రి, అస్యాద్రి, నాగలోకం, గంధర్వలోకం మొదలైనవాటి ప్రసక్తితోపాటు భూమండలాన్ని తన తలపై మోసే ఆదిశేషుని ప్రసక్తి, ఆదిశేషుడు తన ధ్వజంగా చేసుకున్న మూడుతలల బంగారం తాటిచెట్టు ప్రసక్తి, ఆ తాటి చెట్టునే తూర్పు దిక్కుకు పొలిమేరగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నిర్ణయించారన్న ప్రసక్తి - ఇట్టివి సుగ్రీవుని వర్ణనలో కోకొల్లలుగా వున్నందునే ప్రక్షిప్తాలుగా వాటిని నేను కొట్టివేయడం లేదు. ఇక్షు, క్షీర, దధి, సురాది సప్త సముద్రాలలో దేవ, దానవ, యక్ష, కిన్నర, గంధర్వాది లోకాలలో పరిపూర్ణ విశ్వాసం చూపుతున్న ప్రబుద్ధులు ఈనాటి మన పట్ట భద్రులలోనే వుండగా, శతాబ్దాలనాటి వాల్మీకి మహర్షికి ఈ సముద్రాలలో, ఈ లోకాలలో విశ్వాసం లేదని ఎవరు చెప్పగలరు?

అయితే, తన భౌగోళిక పరిజ్ఞాన ప్రదర్శనకు ఉపక్రమించడానికి చాలా ముందుగా కిష్కింధాకాండలోనే రావణుడు ఎక్కడ వుంటాడో, అతని కులగోత్రా లేవో, వారి బలపరాక్రమా లేవో తనకు తెలియవని సుగ్రీవుడు రామునికి చెబుతాడు (ఏడవ సర్గ). రావణుని లంక ఎక్కడున్నదో తెలియదని అంతకుముందు స్పష్టంగా చెప్పిన సుగ్రీవుడే హఠాత్తుగా యవద్వీపాన్ని, సువర్ణ ద్వీపాన్ని వర్ణించ నారంభించాడంటే, ఆ భాగాలన్నీ ప్రక్షిప్తాలని మెదడున్నవాడెవడైనా తీర్మానించుకొనడా? ఇట్టి తీర్మానానికి ఒకసారి వచ్చిన మీదట, తనపై పగబూనిన వాలి, ప్రాంతం నుంచి ప్రాంతానికి, దేశం నుంచి దేశానికి, లోకం నుంచి లోకానికి తన వెంటబడి తరిమిన సందర్భంలో తాను వర్ణించిన వాటి నన్నింటిని తాను స్వయంగా చూచినట్టు సుగ్రీవుని నోట చెప్పించబడిన మాటను అభూతకల్పనల సమర్ధనకై వెదకబడిన అసంబద్ధ సాక్ష్యంగా మెదడున్నవా డెవడైనా త్రోసివేయడా?

సీత నపహరించిన రావణుడు దక్షిణాభిముఖంగా పయనమై వెళ్ళినట్టు పెక్కు నిదర్శనాలు కానవచ్చినందునే రామలక్ష్మణులు సీతాన్వేషణకై అదే దిశకు వెళ్ళారు. సీతతో లంకాధిపతి దక్షిణదిశగా పయనించడాన్ని సుగ్రీవుడు స్వయంగా చూచాడు. అయినప్పుడు ఆ దిక్కుకు తప్ప తక్కిన మూడు దిక్కులకు సీతాన్వేషణకు వానర బృందాలను పంపించడం అసలు జరగలేదని భావించడమే సమంజసం కాదా? దక్షిణదిశకు పయనమైన హనుమంతుని చేతికి మాత్రమే సీతకు గురుతుగా చూపడానికి రాముడు తన అంగుళీయ మివ్వడం ఈ భావాన్ని బలపరచడం లేదా?

పోతే, సుందరకాండలో లంకాదహన వృత్తాంతం ఆది నుంచి అంతం వరకు పూర్తిగా ప్రక్షిప్తం. వాలి, సుగ్రీవ, హనుమదాదులకు వాలాలను తగిలించిన తర్వాత వారిచేత ఏవో కొన్ని కోతి పనులను చేయించక తప్పదు. ఇందుకోసం కల్పించబడిన పనులే లంకాదహనమైనా, మధువన విధ్వంసమైనా!

సుందరకాండ వర్ణిస్తున్నట్టు హనుమంతుడు రావణుని అశోకవనాన్ని నిజంగా పాడుచేసివుంటే, రావణపుత్రుని, అతని సేనానులను, అతని మంత్రులను నిజంగా చంపివుంటే, రావణునితో ముఖాముఖిగా నిజంగా ప్రసంగించివుంటే, రావణుని రాజధానికి నిజంగా నిప్పు పెట్టి వుంటే, ఒక్క విభీషణుని గృహాన్ని మాత్రం విడిచి తక్కిన నగరాన్ని నిజంగా భస్మీపటలం చేసివుంటే, ఇంతటి ముఖ్యవిషయాలను తన పునరాగమనం తర్వాత రామునికి అతడు నివేదించి ఉండే వాడు కాదా? లంకకు తాను పయనమై వెళ్ళిన క్షణం నుంచి, అటునుంచి తిరిగివచ్చిన క్షణం వరకు తన సర్వాను భవాలను అంగద, జాంబవంత ప్రభృతులకు పూసగుచ్చినట్టు చెప్పినవాడు రాముని వద్ద లంకాదహనానికి సంబంధించిన ఈ విషయాలను దాచిపెట్టవలసిన అగత్య మేమిటి?

మరొక్కసంగతి : హనుమంతుడు లంకనుంచి తిరిగి వచ్చిన తర్వాత ఒక నెలరోజులకే దానిపై దండయాత్ర జరిగింది. అప్పుడు లంకానగరం చెక్కుచెదరకుండా నిలచి వున్నది. హనుమంతుడు బూదెపోగులుగా విడిచివెళ్ళిన నగరాన్ని రావణుడు తన మంత్రశక్తిచే దాని యథాపూర్వస్థితికి నెల లోపలనే తిరిగి తెచ్చాడు కాబోలు!

ప్రక్షిప్తాల కారణంగా యుద్ధకాండలో కోకొల్లలుగా కానవచ్చే అసంబద్ధ విషయాలలో, పరస్పర వాటి ప్రసక్తిని ముగిస్తాను.

వైరుధ్యాలలో కొన్నింటిని మాత్రం పేర్కొని, మరి కేకలు వేసి, చప్పట్లు కొట్టి, శంఖా లూది, దుందుభులు ప్రయోగించి, పిడికిళ్ళతో గుద్ది, ములుగర్రలతో పొడిచి, రోకళ్ళతో మోది, గదలతో మర్దించి, చెవులలో నీళ్లుపోసి, తలవెంట్రుకలను పీకి, పైగా గుర్రాలను పరుగెత్తించి, ఏనుగులతో తొక్కించి, ఎట్టకేలకు నిద్ర లేపగా, ఆవలిస్తూ లేచిన కుంభకర్ణుడు తన నెందుకు లేవగొట్టవలసి వచ్చిందని అడుగుతాడు. అంతట రావణుని మంత్రి యూపాక్షుడు భార్యాపహరణానికి కుపితుడై, వానర సేనతో రాముడు దండెత్తి వచ్చినందున లంకకు చేటు వచ్చిందని చెబుతాడు. ఆ మాట విన్నంతనే “అయితే ముందు ఆ రాముని, అతని సేనను చంపి, ఆ తర్వాతనే మా అన్నను చూడ్డానికి వెడతా"నని కుంభకర్ణుడంటాడు (60వ సర్గ). ఆ ఆ కుంభకర్ణుడే అన్న వద్దకు వెళ్ళి, తనకేమీ తెలియనట్టు “అన్నా! నన్ను అకాలంగా నిద్రనుంచి ఎందుకు లేపించావు? అని ప్రశ్నిస్తాడు. పిమ్మట “నీకు ఎవడి వల్ల వెరపు కలిగింది? ఎవడికి చావు మూడిందో చెప్పు! వాడిని చంపివస్తా” నని అన్నపలుకే తనకు శాసనమైనట్టు ప్రసంగిస్తాడు (62వ సర్గ). అయినా, రామునిపై యుద్ధానికి పొమ్మని అన్న కోరినంతనే పరదారాపహరణాన్ని మించిన పాపం లేదని ఒక ధర్మోపన్యాస మిస్తాడు; రాజధర్మాలను గురించి మరొక దీర్ఘోపన్యాస మిస్తాడు. ఇంత కంఠశోష తర్వాత ఒక్కసారిగా తిరిగి ధోరణి మార్చి, “ఇదుగో! చూడు నా ప్రతాపం! ఒక్క పిడికిటిపోటుతో నేను రాముని యమసదనానికి పంపుతాను. అప్పుడు సీత నీకు వశమౌతుంది!” అనిచెబుతాడు (63వ సర్గ). ఎన్ని ప్రక్షిప్తాలు జరిగివుండకపోతే, నాలుగు సర్గల లోపల ఇన్ని పరస్పర వైరుధ్యాలు దొర్లుతాయి?

నూరవ సర్గలో రామరావణ యుద్ధం ప్రారంభ మౌతుంది. అయినా, 101వ సర్గలో రావణుడు ప్రయోగించిన శక్తికి వక్షస్థలం ప్రయ్యలు కాగా నేలకూలిన లక్ష్మణుని చూచి కోపోద్దీపితుడై రాముడు “ఓ వానరోత్తములారా! ఎవని నిమిత్తం నే నిక్కడికి దండెత్తి వచ్చానో, ఆ రావణుడిప్పుడు నా కంట బడినాడు” అని లంకేశ్వరుని తాను అప్పుడే మొట్టమొదటిసారిగా చూస్తున్నట్టు పలుకుతాడు! “ఈ లోకంలో ఇప్పుడిక రామరావణులలో ఎవరో ఒక్కరే మిగలగలరు!” అంటూ లంకాధిపతి

పైకి దూకుతాడు. పోనీ, ఇక్కడ పరస్పర వైరుధ్యం పెద్దగా లేదని సరిపెట్టుకు పోదామంటే, ఇందుకు చాలా ముందుగా 59వ సర్గలోనే రామరావణులు తొలిసారి ఢీకొన్నట్టుగా వున్నది.

రావణుడు భయంకరమైన శక్త్యాయుధాన్ని ప్రయోగించగా వక్షస్థలం ప్రయ్య లక్ష్మణుడు నేలకూలినట్టు 59వ సర్గలో ఒకసారి వుండగా, దాదాపు ఇవే పలుకులతో ఇదే సన్నివేశం 101వ సర్గలో కూడా వున్నది!

ఇట్టివి మరి చాలా వున్నా, యుద్ధంలో ఒకసారి చచ్చినవారే తిరిగి లేచివచ్చి, తిరిగి యుద్ధంచేసి, తిరిగి చచ్చిపోయే సంఘటనలను కొన్నింటిని మీ దృష్టికి తెచ్చి రామాయణంలోని ప్రక్షిప్తాల ప్రస్తావన మరిచాలిస్తాను.

లంకాదహన సందర్భంలో హనుమంతుడు కూల్చిన పెక్కుమంది ముఖ్యులలో యూపాక్ష, విరూపాక్షు లున్నారు (సుందరకాండ 46వ సర్గ). కాని, ఒకసారి మృతినొందిన వా రుభయులు తిరిగి యుద్ధకాండలో ప్రత్యక్షమై, తిరిగి పోరులో పాల్గొని, తిరిగి నేల కొరుగుతారు! (76-97 సర్గలు) యుద్ధకాండలోనే 56వ సర్గలో నీల్గిన అకంపనుడు, 58వ సర్గలో చచ్చిన నరాంతకుడు 59వ సర్గలో మరలపోరుకు నిలిచి, మరల గాయపడి, మరల మరణిస్తారు! వీరిద్దరిలో అకంపనుని విషయంలో "ముందు హతుడైన అకంపనుని కంటె ఇతరుడైన అకంపునుడితడు" అని వ్యాఖ్యాతలు చెప్పినా రనుకోండి. నరాంతకుని విషయంలో కూడా ఇలా సరిపెట్టుకు పోవలసిందేనా? జనస్థానంలో రాముని బాణానికి కూలిన త్రిశరుడు (ఆరణ్యకాండ, 27వ సర్గ) లంకా యుద్ధంలో హనుమంతుని పిడికిటిపోటుకు నీల్గిన త్రిశరుడు (యుద్ధకాండ, 70వ స) ఒక్కరా, ఇద్దరా? యుద్ధకాండ 70వ సర్గలో ప్రాణాలు వీడిన మహోదర, మహాపార్శ్వులు, అదేకాండ 98-99 సర్గలలో మృత్యు ముఖానపడినవారు ఒకే వ్యక్తులా, విభిన్న వ్యక్తులా?

మౌనమే ఈ ప్రశ్నలకు టీకాకారుల సమాధానం!

సంస్కృత రామాయణంలోని ప్రక్షిప్తా లన్నింటిని తొలగిస్తే ఆదికవి పేర ఫోర్జరీ చేసి ఇతరులు దానిలో జొప్పించిన భాగాలన్నింటిని ఏరివేస్తే, అప్పుడు వాల్మీకి మహాకవికి న్యాయం జరుగుతుంది; అప్పుడే ఆయన కావ్యనాయకునికి సయితం న్యాయం జరుగుతుంది. కవిగా వాల్మీకి ఊహాసంపన్నుడు, భావోన్నతుడు, కల్పనా చతురుడు, రసాత్మక హృదయుడు, అపశ్రుతి లేనిది ఆయన కంఠం; అపూర్వమైనది ఆయన సృష్టి, భారత కవికులానికే ఆయనది గురుపీఠం. ఒక అతుకుల బొంతగా తయారైన సంస్కృత రామాయణాన్ని, ఒక అవకతవకల పుట్టగా పెరిగిన సంస్కృత రామాయణాన్ని ఆయనకు అంటగట్టడం కంటె ఆయనపట్ల మనం చేయగల మహాపరాధం లేదు!

ప్రకృతి విలాసాలను, మానవ ప్రవృత్తులను ఎట్టి శ్రద్ధాసక్తులతో ఎంత నిశితంగా, ఏయే కొత్త దృక్కోణాల నుంచి ఎంతటి మౌలిక ప్రతిభతో ఆయన పరిశీలించాడో సంస్కృత రామాయణంలో నిశ్చయంగా ఆయన రచించిన ఘట్టాలుగా భావించదగు వాటినుంచి మనం తెలుసుకోవచ్చు. పలుకు పలుకులో అవి తేనెలను చిందుతూ వుంటాయి; శ్లోకం శ్లోకంలో అవి సుమధుర సంగీతాన్ని వినిపిస్తూవుంటాయి. అందంతోపాటు ప్రాగల్భ్యం వాటిలో తొణికిస లాడుతూ వుంటుంది. కల్లోలిత సముద్రాన్ని మూర్ఛరోగితో పోల్చడం ఆయనకే తగు! నడినెత్తి కెక్కగానే చురచుర లాడించే ప్రొద్దును నడమంతరంసిరి వచ్చినవానితో పోల్చడమైనా ఆయనకే తగు!

ప్రియభర్తకు దూరమై లంకలో అశోక వృక్షం కింద దీనవదనంతో కూర్చున్న సీతను పువ్వులు లేని తీగతోను, తంత్రులులేని వీణతోను, వర్షాకాలం తర్వాత శరత్కాల మేఘాలతో క్రమ్మబడిన చంద్రరేఖతోను, నిరాధార నిందతో అణిగిపోయిన

కీర్తితోను, ఫలాపేక్ష కొరవడిన శ్రద్ధతోను, కార్యానుకూలత పొందని ఆశతోను, ఆవృత్తి లేకపోవడంచేత మరచిన విద్యతోను పోల్చడం ఆయనకే చెల్లు! తనను లంకకు యెత్తుకుపోతున్న రావణుని పట్టునుంచి తప్పించుకొనడానికి ప్రయత్నం చేస్తున్న జానకిని నల్లని మేఘాల మధ్య చలించిపోతున్న చంద్రబింబంతో పోల్చడమైనా ఆయనకే చెల్లు! సీతను కానక దురపిల్లుతున్న రాముని అడుసులో దిగబడిన ఏనుగుతోను, నిద్రపోతున్న రాముని గంగానదీజలాలమధ్య విశ్రమిస్తున్న ఏనుగుతోను పోల్చడం ఆయనకే సాధ్యం. వెన్నెల రాత్రిని తెల్లని చీర కప్పుకున్న చానవలె, వర్షాకాలంలో పర్వత శిఖరాలనుంచి కిందికి దూకుతున్న సెలయేళ్ళను ముత్యాల హారాలవలె చూడగలగడం కూడా ఆయనకే సాధ్యం! మానవాతీత వ్యక్తిని సృష్టించగోరితే, అతనిలో సామాన్యమానవుని ఇట్టి వాల్మీకి మహాకవి దౌర్భల్యాలను ప్రవేశపెడతాడా?ఒక మానవునే సృష్టించగోరితే, అతనికి మానవాతీత? మహిమలను ఆపాదిస్తాడా? జగన్నాటక సూత్రధారి మానవరూపాన్ని ధరించినప్పుడు మానవునివలెనే తాను సయితం రాగవిద్వేషాలకు, ఆశానిరాశలకు సంతోష విచారాలకు లోబడినట్టు నటిస్తాడని ఈ కృత్రిమ సృష్టిని సమర్ధించవచ్చు ననుకోండి! కాని, సీతారాములు కష్టాలకు, కన్నీటికి అతీతులని, అయినా కష్టాలు పడుతున్నట్టుగా, కన్నీరు కురిపిస్తున్నట్టుగా వారు కేవలం పైపై నటన చేస్తున్నారని చెబితే, వారి కష్టాలకు మనమెందుకు చలించాలి? వారి కన్నీటికి మన మెందుకు కరగాలి?

ఈ వాదాన్ని మీరు అంగీకరించినా, లేక త్రోసిపుచ్చినా, ప్రక్షిప్త రహితమైన రామాయణాన్ని విమర్శకదృష్టితో పరిశీలిస్తే మాత్రం దాని నాయకుడు మానవాతీతవ్యక్తి కాదన్న విషయం స్పష్టపడుతుంది.

ప్రక్షిప్తరహితమైన వాల్మీకి కావ్యనాయకుడు లేకలేక పుట్టిన తొలిబిడ్డ. తల్లిదండ్రులు ఎంతో గారాబంగా పెంచుకొన్నట్టి వాడు. ముఖ్యంగా తండ్రికి పంచప్రాణాలవంటివాడు. తమ్ములు ముగ్గురిలో ఒకనితో హెచ్చుగా చెలిమిచేసినా, తక్కిన వారిద్దరి ప్రేమగౌరవాలను పూర్తిగా నిలుపుకున్నట్టివాడు. చిన్నతనంలో విలువిద్యలో విశేష కౌశలం ఆర్జించినట్టివాడు. తమది గొప్ప రాజవంశమని, దాని గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టడం తన ప్రథమకర్తవ్యమని ఆబాల్యంగా విశ్వసించి నట్టివాడు. కుటుంబ సంప్రదాయాలలోవలె, వంశగౌరవంలోవలె, తరతరాలుగా వస్తున్న సాంఘికాచారాలలో, మత సిద్ధాంతాలలో నిశ్చల విశ్వాస మున్నట్టివాడు. అందరి పిల్లలతో చేరి ఇసుకతోనో, మట్టి తోనో ఆడుకున్న కృష్ణునిగా, ఉట్టి లెక్కి వెన్నముద్దలను దొంగిలించిన కృష్ణునిగా, జలకమాడుతున్న గోపికల వస్త్రాలను దొంగిలించిన కృష్ణునిగా, ఇంద్రుని సంతోష పెట్టడానికై యజ్ఞయాగాదు లెందుకని, వాటిని మాన్పించిన కృష్ణునిగా రాముని మనం ఊహించుకోలేము. తండ్రిని ధిక్కరించి, గురువులను ధిక్కరించి, సమకాలిక మత విశ్వాసాలను ధిక్కరించి, ఒక నూతన ధర్మాన్ని నెలకొల్పిన సిద్ధార్థుని వలె కావాలన్నా ఆయనను చిత్రించుకోలేము. పితృవాక్య పరిపాలనే ఆయనకు పరమధర్మం; గురూపదేశమే ఆయనకు శిరోధార్యం; వంశగౌరవంతోపాటు సనాతన ధర్మపరిరక్షణమే ఆయన జీవిత లక్ష్యం. యథాస్థితికి ("స్టేటకో" అనేదానికి) ఆయన పెట్టనికోట. "కొత్త"ను ఆయన ఆహ్వానించలేదు; ఆయన కది అర్థమైనా కాదు.

అందరు రాజుల జ్యేష్ఠపుత్రుల వలెనే రాముడు కూడా పెరిగాడు; వారివలె ఆయనకూడా ముమ్ముందు రాజ్యభారం వహించడానికి తగిన శిక్షణ పొందాడు. ఇంతకుమించి ఆయన బాల్యజీవితాన్ని గురించి మనకు తెలియదు. తల్లి చంకలో పసివాడై వుండగా నిండు జాబిల్లిని చూచి, ఆడుకోడానికి బంతిగా తనకు కావాలని పోరు పెట్టి ఏడ్చినాడని, అద్దంలో దాని ప్రతిబింబాన్ని చూపగా, అది తనకు దొరికినట్టే సంబరపడినాడని ఒక కట్టుకథ ప్రచారంలో కలదుగాని, అంతటి మందబుద్ధిగా రాముని నేను సంభావించను. తల్లిచాటున, తండ్రి చాటున పదిలంగా పెరిగే బిడ్డలలో చాలామందికి వలె ఆయనకుకూడా ఒడుదుడుకులు లేకుండానే బాల్య, కౌమారదశలు గడిచాయి. యౌవనం పొటమరిస్తుండగా సీతను

ఆయన పెండ్లాడాడు. తుప్పుపట్టిన ఒక పాతవిల్లును విరవడంలో బలదర్పాలను చూపించినందువల్లనే ఆయనకు సీత నిచ్చి పెళ్ళిచేశారని నే ననుకోను. మత్స్యయంత్ర ఘట్టమొకటి మహాభారతంలో కలదు కాబట్టి, వాల్మీకి రామాయణాన్ని పెంచి వ్రాసినవారు బాలకాండలో ధనుర్భంగ గాథను కల్పించి పెట్టినారని తొలిగా నే ననడంలేదు; విమర్శకదృష్టితో సంస్కృత రామాయణాన్ని పరిశీలించినవారు ఎప్పుడో ఆ మాట చెప్పారు!

రాముడు బహుపత్నీకుడనే అభిప్రాయాన్ని కలిగించే మూడు శ్లోకాలు సంస్కృత రామాయణంలో వున్నా, ప్రక్షిప్తాలుగా వాటిని మనం పరిగణించవచ్చు. కృష్ణునికి అరవైవేల మంది పత్నులుగాక, అరవై లక్షలమంది వుండేవా రన్నా "అంతటి శృంగార పురుషుడే!" అనిపిస్తుంది కాని, రామునికి మరొక పత్ని వుండేదన్నా, ఆయన ప్రవృత్తిని బట్టి - అది విడ్డూర మన్నట్టే తోస్తుంది.

కార్యసాధనలో కరకుతనంలేని దశరథుడు, - వృద్ధాప్య ప్రవేశంతో జవసత్వా లుడిగిపోగా, మరింతగా మనోబలం క్షీణించిన దశరథుడు - కైకేయిని చూచి, ఆమె తండ్రిని చూచి భయపడుతూ భయపడుతూ రామునికి యౌవరాజ్య పట్టాభిషేకాన్ని తల పెట్టడంతో వాల్మీకి కావ్యనాయకుని జీవిత స్రవంతిలో తొలిసారిగా పెద్ద అలలు లేస్తాయి. సరైన పట్టులో కావ్యారంభాన్ని చేయలేనివాడు మహాకవి కాడు గనుక, ఈ పట్టాభిషేకయత్న ఘట్టంతోనే వాల్మీకి తన కావ్యాన్ని ప్రారంభించినట్టు మనం అనుకోవచ్చు. లేదా, పాతకథలను తవ్విపోసే పద్ధతిలో "అనగనగా ఒక వూరు, ఆ వూరులో ఒక రాజు" అనే పద్ధతిలో అయోధ్యాపుర వర్ణనతో ప్రారంభించి ఆ వెంటనే ఈ ఘట్టానికి వచ్చివుండవచ్చు.

తండ్రి తనకు యౌవరాజ్య పట్టాభిషేకాన్ని తల పెట్టినట్టు తెలియగానే రాముడు సహజంగానే సంతోషిస్తాడు. ఈ వార్తవింటే తనతల్లి కౌసల్య మహదానంద పడుతుందని ఆయనకు తెలుసు. తన కుమారునికి న్యాయంగా దక్కవలసిన సింహాసనం, కైకేయి కారణంగా, భరతునికి ఎక్కడ చెందుతుందో అని ఆమె భయపడుతున్నది. కైకేయి కుట్రలను భగ్నం చేయడానికై రాజాస్థానంలో రామ పక్షపాతు లందరిని ఆమె కూడగట్టుకొంటున్నది. వారిని సంతృప్తి పరచడానికి, వారి సంఖ్యను పెంచడానికి ధనాన్ని విశేషంగా విరజిమ్ముతున్నది. తన తల్లి భయం, ఆమె ఆందోళన, ఆమె చేస్తున్న విశ్వ యత్నాలు - అన్నీ రామునికి తెలుసు. అందువల్లనే తనకే యౌవరాజ్య పట్టాభిషేకమని నిర్ణయించినట్టు తండ్రినోట వినగానే విప్పారిన ముఖంతో ఆయన సరాసరి తల్లి వద్దకే వెళ్ళాడు. అంతకుముందే రాముని స్నేహితులద్వారా ఆమె ఈ శుభవార్త విన్నది. దాన్ని తన చెవిని వేసినందుకు వారిపై ఆమె కనక వర్షాన్ని కురిపించింది. (అయోధ్యాకాండ, మూడవ సర్గ). తర్వాత కొద్ది సేపటిలో రాముడు స్వయంగా తనవద్దకు రాగా, పట్టలేని ఆనందంవల్ల గొంతు తడబడుతుండగా కుమారుని చెంతకు తీసుకుని "నాయనా! నేటితో నీ శత్రువు లందరు నశించారు. నన్ను, నా బంధువులను, సుమిత్రను, ఆమె బంధువులను మరి సంతోషపెట్టు!" అని పలుకుతుంది. (నాల్గవ సర్గ) ఇక్కడ "నేటితో నీ శత్రువు లందరు నశించారు" అనే మాటలు మీరు ప్రత్యేకించి గమనించ దగినట్టివి. ఒక్క కైకేయి మాత్రమేకాక, దశరథుని ఆస్థానంలో రామునికి పెక్కుమంది శత్రువులుండేవారని ఇది స్పష్టం చేయడం లేదా?

ఇంత వివరంగా రాముని జీవితాన్ని పూర్తిగా సమీక్ష చేయడం ఇప్పుడు సాధ్యపడదుగాని, ప్రక్షిప్త రహితమైన వాల్మీకి రామాయణం ప్రకారం ఆయన మానవాతీత ప్రవృత్తితోగాని, మహిమలతోగాని జన్మించినట్టు భావించనక్కర లేదన్న విషయాన్ని నిరూపించడానికి తన పట్టాభిషేక విఘాతానికి మానవసహజమైన ఆశాభంగాన్నే, బాధా విచారాలనే ఆయన ప్రకటించాడన్న భాగాలను మాత్రం మీ ముందు పెడతాను.

కైకేయి తనను పిలిపించి, దశరథుడు పూర్వ మెప్పుడో తనకు రెండువరా లిచ్చినట్టు చెప్పి, "నీ తండ్రి నీకు భయపడి, తనమాట తప్పకుండా చూడవలసిన బాధ్యత ఇప్పుడు నీదే సు" అని చెప్పినప్పుడు, రాముడు తన స్వభావానుసారంగా "ఆయన నాకు తండ్రి, గురువు, రాజు, ఆయన కోర్కె ఏదైనాసరే దాన్ని చెల్లిస్తా"నని ప్రతిజ్ఞ చేస్తాడు. తీరా ఆ ప్రతిజ్ఞ చేయించుకున్న తర్వాత "నీవు పదునాలుగేండ్లు అరణ్యవాసం చేయా లనడం, నీ స్థానంలో భరతునికి యౌవరాజ్య పట్టాభిషేకం జరగాలనడం నీ తండ్రి అభిమత"మని కైకేయి చెబుతుంది. అందుపై "అలాగే కానివ్వ వలసింది"గా రాముడు వెంటనే పలికినా, ఆశాభంగం మాత్రం, మనస్సును పీడిస్తూనే వుంటుంది. దాచిపెట్టుకోవాలని ప్రయత్నించినా అది దాగదు. అయినా, "భరతునికే పట్టాభిషేకం చేయదలచుకున్నట్టు నాతో తానే చెప్పక నృపాలుడు ఆ మాటను దాచిపెట్టడం నా మనస్సును దహిస్తున్న"దనే పలుకులద్వారా అది బహిర్గత మౌతుంది! అంతలోనే కొంత తెప్పరిల్లి, "పూజ్యుడైన తండ్రి నాతో ఈ మాట చెప్పకపోయినా లోపం లేదు; నీవు చెప్పిందేవా" లని రాము డంటాడు. (19వ సర్గ). అక్కడినుంచి తిరిగి తల్లివద్దకే సరాసరి వెళ్ళి "అమ్మా! పెద్ద విపరీతం పుట్టింది; గొప్ప విపత్తు వచ్చింది" అని దాదాపుగా ఆవురు మంటాడు! (20వ సర్గ). బలప్రయోగంతోనైనా సరే ఈ ఘోరాన్యాయాన్ని ప్రతిఘటించాలని, కౌసల్య సమ్మతితో, లక్ష్మణుడు ప్రతిపాదించగా, తన స్వభావానికి విరుద్ధంగా వెళ్ళ నిచ్చగించని రాముడు "దైవనిర్ణయాన్ని ఎవరు తప్పించగల"రనే శుష్క వేదాంతంతో వారిని శాంతింప జేయడానికి ప్రయత్నిస్తాడు (22వ సర్గ).

తల్లికి, తమ్మునికి ఈ వేదాంతం చెప్పిన తర్వాత భార్య వద్దకు వెళ్ళిన రాముడు "మనస్సులో గల చింత నణచుకోలేక, ఆ దుఃఖాన్ని బయలుపరిచాడు" (26వ సర్గ). ఆయన దుఃఖ కారణం తెలియని సీత "ఎందు కింతగా వ్యసనపడుతున్నా" రని ప్రశ్నిస్తుంది. "దశరథుడు యౌవరాజ్య పట్టాన్ని శాశ్వతంగా భరతుని కిచ్చా"దని ఆయన జవాబు చెబుతాడు. (అదే స). "శాశ్వతంగా" తనకు సింహాసనం పోయినట్టు అప్పటిలో రాముడు నమ్మివుండవచ్చు. ఏమైనా, తీవ్రమైన ఒక ఆశాభంగానికి తలవని తలంపుగా లోనైన వ్యక్తి మానసిక కల్లోలాన్ని ఇక్కడ వాల్మీకి మహాకవి ప్రతిభావంతంగా చిత్రించలేదా?

తాము కోసలరాజ్యాన్ని వీడి వెళ్ళిన మొదటి రాత్రి గంగానది ఆవలి గట్టున ఒక చెట్టుకింద కటికనేలపై పరున్నప్పుడు లక్ష్మణునితో ముచ్చటలాడుతూ రాముడు "భరతుడు రాగానే అతనితో కలిసి కుట్రచేసి, మహారాజు ప్రాణాలను కైకేయి తీయించదుగదా!" అనే భయాన్ని వ్యక్తం చేస్తాడు. కాని, అంతలోనే తనకు ఘోరాన్యాయం చేసిన తండ్రి ఏమైతే తన కేమన్న భావంకూడా స్ఫురించివుంటుంది. కాకపోతే, తండ్రిని గురించిన భయాన్ని వెల్లడించిన మరుక్షణంలోనే "ఆడదాని మాట విని, నావంటి కుమారుని యెడం చేసుకునే బుద్ధిమాలిన తండ్రి ఈ ప్రపంచంలో మరొకడు వుంటాడా?" అని పలికివుండడు!

తమ వనవాసం ప్రారంభమైన ఆ తొలిరాత్రి, చీకటిని దుప్పటిగా కప్పుకొని చెట్టుకింద తాము పరున్న ఆ సన్నివేశంలో, తమ పలుకులనే అలలు తప్ప, మరి చలనం లేకుండా ప్రవహిస్తున్న నిశ్శబ్ద స్రవంతి పై తాము తేలిపోతున్నట్టుగా తోస్తున్న ఆ సమయంలో, మార్గాయాసంచేత దస్సిపోయి, మేను భూతలంపై వాల్చినంతనే బహుశా నిద్రపోయిన మైథిలి తనకు తెలియకుండానే నిద్రలో విడిచిన నిట్టూర్పును విన్న రాముడే "భార్యాసమేతుడై భరతుడు సకల సంపదలతో నిండిన కోసలరాజ్యాన్ని పాలిస్తూ సర్వసుఖా లనుభవిస్తాడుగదా!"

అని ఇంచుక అసూయతో, ఇంచుక బాధతో కూడిన పలుకులను పలికి వుండాలి! ఇంతలోనే ఆయనకు తన తల్లి జ్ఞాపకం వస్తుంది! రాజమాత కావాలని తాను పెట్టుకున్న ఆసలన్నీ , అడియాసలై పోయినందుకు ఆమె ఎంతగా దురపిల్లుతున్నదో

అని బాధ కలుగుతుంది. ఇంతే కాదు. "ఈ చేతకాని కొడుకు కాక మరొకడు తన కుండివుంటే అతడైనా తన ముద్దు ముచ్చటలు తీర్చేవాడేమో!" అని ఆమె భావిస్తున్నదేమో అన్న సంశయం పుదుతుంది. వెంటనే తమ్మునితో "లక్ష్మణా! నా తల్లి ఒక గోరువంకను పెంచుతున్నది. అది తన ప్రక్క పంజరంలోని చిలుకను ఓ చిలుకా! శత్రుపాదాలను కొరుకు!" అని హెచ్చరిస్తూవుంటుంది. ఆ గోరువంక పిట్టపాటి కూడా నేను చేయకపోయానని నా తల్లి అనుకుంటుందేమో!" అంటూ నిట్టూర్చుతాడు!

కేవలం తన చేతకానితనంవల్లనే తనకు, తనవారికి ఈ కష్టాలన్నీ రాలేదని చెప్పుకొనడం (తన ఆత్మవిశ్వాసాన్ని, గౌరవాన్ని నిలుపుకొనడం కోసం) అంతలోనే మునికి అవసర మౌతుంది. అందువల్ల తిరిగి తమ్మునితో "లక్ష్మణా! నాకు కోపంవస్తే అయోధ్యాపురాన్నే కాక భూమండలాన్నే ఒంటిగా గెలవగలను. అయినా నా ప్రతాపం చూపించడానికి ఇది తరుణం కాదు; తండ్రిమాట మీరితే, ధర్మలోపం జరుగుతుంది. పరలోకహాని ప్రాప్తిస్తుంది! అందుకోసమే నేనిప్పుడు పట్టాభిషేకం చేసుకోలేదు" అని చెబుతాడు.

మనస్సులో గల బాధ నంతటిని ఈ విధంగా రాముడు తమ్మునితో వెళ్ళబోస్తుండగా భళ్ళున తెల్లవారుతుంది! కంటికి కూర్కు లేకుండా తెల్లవారేవరకు మాట్లాడుతూపోయిన రాముడు - తరచు కన్నుల నీరు నించుతూ పోయిన రాముడు - "మంటలులేని అగ్నివలె, అలలులేని సముద్రంవలె" అయిపో రాజ్యాన్ని కోల్పోయినందుకు రాముడు పొందిన ఆశాభంగ తీవ్రత, ఆయన పొందిన విచారోద్వేగం గంగానదీ తీరం నుంచి చిత్రకూట పర్వత ప్రాంతానికి చేరిన పిమ్మట కొంతవరకు తగ్గినట్టు కనబడతాయి. ఆ పర్వతసౌందర్యాన్ని చూచి, దాని పరిసరాల సోయగాన్ని చూచి, ముగ్ధుడైన రాముడు "మనోహరమైన ఈ పర్వతాన్ని చూచినపిమ్మట రాజ్యాన్ని కోల్పోయిన దుఃఖం నన్ను ఎంతమాత్రం బాధించడంలే"దని సీతతో పలుకుతాడు. "రమ్యమైన ఈ పరిసరాలలో ఎన్ని సంవత్సరాలున్నా రాజ్యభ్రంశ విచారం నన్నేమీ చేయజాల"దని కూడా ఆయన పలుకుతాడు. అయితే, ఇది తాత్కాలికంగానే!

తర్వాత కొద్ది రోజులకే అన్నను అయోధ్యకు ఆహ్వానించడానికై బంధుమిత్రపరివార సమేతంగా వస్తున్న భరతుని అంతస్తును గ్రహించలేక, అతనిపై యుద్ధానికి దూకబోయిన లక్ష్మణుని వారిస్తూ, అందుకు రాముడు చెప్పిన కారణం, దురుద్దేశంతోనే భరతుడు కదిలివస్తున్నట్టు త్వరపడి నిర్ణయించుకొనరాదని కాదు; భ్రాతృవధ ఎంతమాత్రం తగదనీ కాదు. "ఇప్పుడు భరతుని మనం చంపితే, తండ్రి భరతుని కిచ్చిన రాజ్యాన్ని అపహరించడానికే ఆ పని చేశామన్న జననింద రాదా?" అనేదే ఆయన చెప్పిన కారణం! (97వ సర్గ)

అయోధ్యాకాండనుంచి ముందుకు సాగితే, అక్కడ కూడా తాత్కాలికంగానైనా రాజ్యాన్ని కోల్పోయినందుకు రాముడు లోలోపల ఖిన్ను డౌతున్నట్టుగానే విదిత మౌతుంది. సీతాపహరణ తర్వాత ఆమెకై దుఃఖిస్తూ రాము డన్న మాట లివి : "నీ నాశంతో కైకేయి కోర్కె లీడేర గలవు" (ఆరణ్యకాండ, 62వ సర్గ). .సీతాన్వేషణకు తగు ప్రయత్నాలను ప్రారంభించడంలో తన మాటను సుగ్రీవుడు నిలుపుకొనడం లేదన్న బాధ కలిగినప్పుడు రాముని మనస్తాప మిది : "శత్రుబాధ తొలగించుకొని, భార్యను పొంది, గొప్ప రాజ్యాన్ని పొంది, సమస్తసుఖాలను అతడనుభవిస్తున్నాడు. ఇక నేనో, భార్యను కోల్పోయి, విస్తారమైన రాజ్యాన్ని కోల్పోయి, ప్రవాహం కోసివేస్తున్న ఏటిగట్టువలె నానాటికి క్రుంగిపోతున్నాను" (కిష్కింధకాండ, 28వ సర్గ),

గ్రంథాన్ని మరింత పెంచ నవసరం లేకుండా ఇంతవరకు నేను పేర్కొన్న ఉదాహరణలే చాలనుకుంటాను తన జీవితంలోని మొట్టమొదటి పరీక్షలో తనకు కలిగిన గాయంనుంచి రాముడు పూర్తిగా ఎన్నడూ కోలుకోలేదని నిరూపించడానికి! ఇది మానవాతీత లక్షణమేమో రామాయణ వ్యాఖ్యాతలే చెప్పాలి. రామభక్తులే చెప్పాలి!! -

ఇంతకు మరింత వ్రాసినా "రామనామ మను మిఠాయి" తినే వారిని నేను మార్చలేనని నాకు తెలుసు. మెద డనే పదార్థాన్ని - అట్టిది నిజంగా ఎన్నడైనా తమ కుండివుంటే - ఎక్కడో జారవిడుచుకున్నందునే తమ పరమేశ్వరుని సయితం మిఠాయి పొట్లం రూపంలో తప్ప వారు చూడలేరు, ఆరాధించలేరు! అట్టివారి నుద్దేశించి కాక, ఆలోచనాశక్తిని, తార్కిక బుద్ధిని, విచక్షణ దృష్టిని, యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని ప్రదర్శించగలవారి నుద్దేశించే విపులమైన ఈ వీఠికను నేను వ్రాస్తున్నాను. ఈ వర్గాల వారిలో మొదటి దానికి చెందినవారు ఈ మేరవరకు చదివి వుండరు. కాగా, ఇంతవరకు వచ్చిన రెండవ వర్గంవారిలో కనీసం ఒక పదిమందినైనా నావైపు త్రిప్పుకొనగలిగివుంటే నేను కృతార్థుడనైనట్టే!

మానవాతీత వ్యక్తులను కాక, లేదా మానవులవలె నటిస్తున్న మానవాతీతవ్యక్తులను కాక, మానవులైవుండి, కొన్ని ఆశానిరాశలకు, రాగవిద్వేషాలకు, కష్టసుఖాలకు, జయాపజయాలకు నావలె, మీవలె, మరొకరివలె లోనైన వ్యక్తులను మాత్రమే పాత్రలనుగా తీసుకొని, వాల్మీకి తన మహాకావ్యాన్ని రచించాడు. ఆ పాత్రల స్వరూపాన్ని ప్రక్షిప్తాలెంతగా మరుగుపరుస్తున్నా, వాటిలోనుంచి మానవత తొంగిచూస్తూవుంటుంది కనుకనే, మనలోని మానవతను ఆత్మబంధువువలె ఆదరంగా అది పలకరిస్తూ వుంటుంది కనుకనే, ఇన్ని శతాబ్దాల తర్వాతైనా వాల్మీకి రచన తన సమ్మోహనశక్తిని కోల్పోలేదు!

వాల్మీకి రామాయణాన్ని గురించి నా అభిప్రాయాలను ఇంతగా విపులీకరించిన తర్వాత నా "జాబాలి" నాటికలోని మూడు పాత్రలను సమర్థిస్తూ ఏమంతగా వ్రాయనక్కర లేదనే భావిస్తున్నాను. దానిలో ముఖ్యపాత్రలైన జాబాలిద్వారా, రామునిద్వారా నేను పలికించిన పలుకులలో కీలకమైనవన్నీ సంస్కృత రామాయణంలోని అయోధ్యాకాండ నుంచి నేను పరిగ్రహించినట్టివే! నా రచనకు మొత్తం అయోధ్యాకాండను నేను వినియోగించినా, నాటిక ఇతివృత్తానికి ఆయువుపట్టులుగా చెప్పదగినవి 108-100 సర్గలు. ఈ రెండు సర్గలను అనుబంధంగా నాటిక చివర ప్రచురించాలని ఆదిలో నే ననుకున్నా, అందువల్ల ప్రత్యేక ప్రయోజనమేమీ సిద్ధించబోదని ప్రస్తుతం భావిస్తున్నాను. కోరినవారు సంస్కృత రామాయణాన్ని తీసి, వాటి నొకసారి చదువుకోవచ్చు.

అయోధ్యాకాండలోని ఈ రెండు సలు ప్రక్షిప్తాలనే కొందరు పండితులు అభిప్రాయ పడుతున్నారు. కథామట్టానికి సంబంధించినంత వరకు, పాత్రల మనఃప్రవృత్తులకు సంబంధించినంతవరకు ఈ సర్గలు ఇక్కడ వుండడంలో ఔచిత్యమే కానవస్తున్నందున, ఇవి ప్రక్షిప్తాలు కావని మరికొందరు వాదిస్తున్నారు. ఒక వేళ ఇవి నిజంగా ప్రక్షిప్తాలైనా, అందువల్ల నా నాటిక విలువ (దానిలో నిజంగా విలువ అనేది వుంటే) తగ్గబోదు. నాది చారిత్రకనాటిక కాదు; పౌరాణిక నాటకం, కొన్ని వైఖరులకు, కొన్ని సిద్ధాంతాలకు నా ముగ్గురు పాత్రలను కేవలం నేను ప్రతినిధులుగానే భావిస్తున్నాను. "అయితే, వారికి రామాయణ పాత్రల పేర్లు దేనికి? ఏ పేర్లు పెట్టినా సరిపోయేదికదా?" అని మీరు నన్ను నిగ్గదీయవచ్చు. ఆ వైఖరులకు, ఆ సిద్ధాంతాలకు రామాయణం ఒక ప్రామాణిక గ్రంథంగా పూజింపబడుతున్నది. అందువల్ల వాటిని చర్చించే సందర్భంలో రామాయణంలోని సన్నివేశాన్నే, దానిలోని పాత్రలనే వినియోగించడం, నేను కాంక్షిస్తున్న ప్రయోజన సాధన దృష్ట్యా సర్వోత్తమం.

నాకు తెలిసినంతవరకు మన ప్రాచీన వాఙ్మయంలో "జాబాలి" అనే పేరుగలవా రొకరు, "సత్యకామ జాబాలి" అనే పేరుగలవారు మరొకరు వున్నారు. వీరిలో సత్యకామ జాబాలి పుట్టుపూర్వోత్తరాల ప్రసక్తి ఛాందోగ్యోపనిషత్తులో కన్పిస్తుంది. ఇతడు జాబాలి కుమారుడు. పొట్టకూటికై ఆమె దాసీపని చేసుకుని బ్రతుకుతూ వుండేది. అప్పుడెవరో "పుణ్యం" కట్టుకున్నందున ఆమె కొక కొడుకు పుట్టాడు. బాలుడుగా వుండగానే అతడికి బ్రహ్మవిద్యను నేర్చుకోవాలనే బుద్ధి పుట్టింది. అప్పుడతడు తన తల్లిని తన తండ్రి పేరేమిటని ప్రశ్నించాడు. ఆమె జరిగిన వృత్తాంతాన్ని బయటపెట్టి, గురువువద్దకు వెళ్ళినప్పుడు ఆ మాటలనే చెప్ప మంటుంది. తర్వాత గౌతమగోత్రోద్భవుడైన హరిద్రుమతునివద్దకు వెళ్ళిన ఆ బాలుడు తన తల్లిద్వారా విన్నదాన్ని ఆయనకు నివేదిస్తాడు. దాపరికం లేకుండా సత్యాన్ని చెప్పిన ఆ జబాల పుత్రుడు అటు పిమ్మట "సత్యకామ జాబాలి"గా ప్రసిద్ధి చెందాడు.

పెక్కేండ్లు గురుశుశ్రూష చేసినా, చివరికి హరిద్రుమతుడు సత్యకామునికి చెప్పింది తక్కువే! అయినా, ఒక వృషభం నుంచి, అగ్ని నుంచి, ఒక హంస నుంచి, ఒక నీటి పక్షినుంచి ("ప్రకృతి పరిశీలన ఫలితంగా" అని దీని తాత్పర్యం) బ్రహ్మజ్ఞానాన్ని పొందిన సత్యకామ జాబాలి "ప్రాణవిద్య" అనేదాన్ని బోధించాడు.

కాగా, నా నాటికలోని ప్రధానపాత్ర దశరథుని పురోహితులలో ఒకడైన జాబాలి. ఈయన ప్రసక్తి బాలకాండలోని ఎనిమిదవ, పన్నెండవ సర్గలలో, అయోధ్యాకాండలోని 108-109-110 సర్గలలో కానవస్తుంది. ఋత్విజుడైన వేదవేత్తగా బాలకాండ ఈయనను వర్ణించగా, ఒక మునిగా, బ్రాహ్మణోత్తమునిగా అయోధ్యాకాండ పేర్కొంటున్నది. ఇంతకుమించి ఈ జాబాలి జీవిత వివరాలు రామాయణంలోగాని, మరొక గ్రంథంలోగాని కానరావు.

తన తోటి పురోహితులలో పెక్కుమందివలె దశరథునికి ఒక మంత్రిగా జాబాలి వ్యవహరించేవాడో, లేదో, ఆ వైనం స్పష్టంగా తెలియదు. ఏమైనా ఆ రోజులలో మంత్రులే పురోహితులని, పురోహితులే మంత్రులని స్థూలంగా చెప్పవచ్చునేమో! మంచికి, చెడ్డకు అప్పటిలో రాజు లొక యజ్ఞాన్ని, యాగాన్ని, లేదా, క్రతువును చేస్తూపోయేవారు. అందువల్ల రాచకార్యాలలో ఇవే ప్రధాన భాగాన్ని వహిస్తూవుండేవి. ఇట్టి పరిస్థితులలో పురోహితునికి, మంత్రికి ఏమంత భేదం లేకుండా పోవడం సహజమే! యజ్ఞయాగాదులను పోలిన కర్మకాండలు జాతీయ జీవితంలో ప్రాధాన్యం వహించినప్పుడు రాజు అధికారం, అతని ప్రతిపత్తి నామమాత్రమైనవి కాగా, పురోహితుని పలుకే శాసనంగా చెల్లడంకూడా సహజమే! రాజును కేవల మొక బొమ్మగా నిలబెట్టి పురోహితులే రాజ్యచ్ఛత్రాన్ని త్రిప్పిన సందర్భాలు మనదేశ చరిత్రలోనే కాదు, అక్కడియా, సుమేరియా, బాబిలోనియా, ఈజిప్టు, క్రీట్, ఫోనీసియా, గ్రీసు, రోమ్, చైనా మొదలైన దేశా లన్నింటి చరిత్రలలో కూడా ఎన్నెన్నో వున్నాయి.

ఈ విషయాన్ని విపులంగా చర్చించాలన్న కుతూహలాన్ని నిరోధించుకుని, ఇక్ష్వాకు వంశ రాజులలో ఒక రిద్దరు తప్ప మిగిలినవారందరు తమ పురోహితుల చేతులలో దాదాపు కీలుబొమ్మలుగా వ్యవహరించి నట్టివారని మాత్రం మీకు నివేదించ గోరుతున్నాను. ఈ వంశానికి పారంపర్యంగా వసిష్ఠులే పురోహితులు. ఒకే వసిష్ఠుడు ఇక్ష్వాకు లందరికి . పురోహితు డనేది కేవలం పుక్కిటి పురాణం. వసిష్ఠుడనేది గోత్రనామం. ఆ గోత్రానికి చెందిన వివిధ వ్యక్తులు వివిధకాలాలలో అయోధ్యా ప్రభువులకు పురోహితులైనారు. ఈ విషయంలో ఆసక్తిగలవారు ఎఫ్.ఇ పార్టిటర్ "ఏన్ షెంట్ ఇండియన్ హిస్టారికల్ ట్రెడిషన్" అనే పేరుతో రచించిన ప్రసిద్ధ గ్రంథాన్ని చూడవచ్చు.

చిత్రకూట పర్వతంవద్ద అందరి సమక్షంలో జాబాలి తన మతాన్ని లేదా, దార్శనికాన్ని రామునికి వివరించినట్టు రామాయణంలో వున్నది. ఇందుకు భిన్నంగా వెళ్ళి, మందాకినీ నదీతీరాన ఏకాంత ప్రదేశంలో రాఘవునికి తాను చేయగోరిన బోధను ఆయన చేసినట్టు నేను చిత్రించడం రెండు ముఖ్యోద్దేశాలతో. వాటిలో మొదటిది నాటికను మూడు పాత్రలకు పరిమితం చేయగోరడం, రెండవది నాటకీయత తక్కువైన ఒక సన్నివేశంలో కొంత జిగిని, బిగిని ప్రవేశపెట్టగోరడం.

రామాయణంలో వున్నట్టు అందరి సమక్షంలోనే జాబాలి తన మనోగత భావాలను వెల్లడించాడంటే, ఇప్పటి మూడు పాత్రలకు తోడుగా కనీసం సీతాదేవిని, భరత లక్ష్మణ శత్రుఘ్నులనైనా ప్రవేశపెట్టాలి. అప్పుడు కేవలం మూకపాత్రలుగా వారిని నిలపక, వారిచేత కొంతవరకైనా మాట్లాడించాలి. ఈ నాటిక పలుచబడిపోకుండా ఈ పని చేయడం అన్యులకు సాధ్యమైతే కావచ్చు గాని, నాకు మాత్రం కాదు. పైగా సాంప్రదాయిక మతవిశ్వాసాలకు, సాంఘికాచారాలను ప్రాతినిధ్యం వహించే వసిష్ఠుని పరోక్షంలో మాట్లాడినంత నిర్భయంగా, నిష్కర్షగా ఆయన సమక్షంలో జాబాలి మాట్లాడలేదని నే నూహించడం అసమంజసం కాదనుకుంటాను.

జాబాలి వసిష్ఠుని విమర్శించినట్టు రామాయణంలో లేదు. కాని, జాబాలికి, వసిష్ఠునికి వారి దృక్పథాలలో, వారి విశ్వాసాలలో ఎంత మాత్రం సామ్యం లేకపోగా, విశేష వైరుధ్య మున్నది. అందువల్ల వసిష్ఠుని జాబాలి విమర్శించినట్టుగా నేను చిత్రించడం సమర్థనీయమే! తీవ్రంగానే వున్నా, ఆ విమర్శ పరుషంగా వుండకుండా నేను జాగ్రత్త వహించాను.

తర్కానికి ఉక్కిరి బిక్కిరైన రాముడు నోరు పారవేసుకునే ధోరణిలో "బుద్ధుడొక దొంగ కాడా? బౌద్ధానికి, నాస్తికత్వానికి ఎంతమాత్రం భేదం లేదు. నాస్తికుని ఎల్లప్పుడు (బహుశా ఒక దొంగను కనిపెట్టి వుంచినట్టుగానే) ఒక కంటితో కనిపెట్టి వుంచాలి" అని పలికినట్టు రామాయణం పేర్కొంటున్నది. (అయోధ్యాకాండ, నూరవ సర్గ, 109వ శ్లోకం) ఇదివరలోనే నేను వివరించినట్టు, ఇది నిస్సందేహంగా ప్రక్షిప్త శ్లోకం. అయినా, వాల్మీకి పేరు శ్లోకాలకు శ్లోకాలనే, సర్గలకు సర్గలనే ఫోర్జరీ చేసి, వాటిని రామాయణంలో జొప్పించిన వారు వైదిక మతేతరులను దూషించడంలో సభ్యతను ఎంతవరకు మరచిపోయేవారో దీనినుంచి మనం తెలుసుకోవచ్చు.

వసిష్ఠుని వైదికమతంవలె జాబాలి వైదికేతరమతంకూడా అతిపురాతనమైనదే! దాన్ని కొందరు లోకాయత మన్నారు, కొందరు చార్వాక మన్నారు, కొందరు బార్హస్పత్య మన్నారు, కొందరు దేహాత్మ వాద మన్నారు, కొందరు స్వభావవాద మన్నారు, కొందరు నాస్తిక మన్నారు, నేను మాత్రం దాన్ని మానవతావాద మంటాను. అభౌతిక, పారలౌకిక తత్త్వాలను నిరాకరించిన ఈ మతాన్ని గురించి, జన్మ పునర్జన్మల సిద్ధాంతాన్ని ఖండించిన ఈ మతాన్ని గురించి, ప్రత్యక్ష ప్రమాణానికి విరుద్ధమైన అనుమాన ప్రమాణాల ప్రాతిపదికపై దార్శనిక శాస్త్ర నిర్మాణాన్ని ప్రతిఘటించిన ఈ మతాన్ని గురించి, సాంఖ్య వైశేషికాది దార్శనికాలను ఎంతగానో ప్రభావితం చేసిన ఈ మతాన్ని గురించి, జైనానికి, బౌద్ధానికి పూర్వమే తలయెత్తి, వాటి భావపరిణతికి దోహదం కూర్చిన ఈ మతాన్ని గురించి, ఒకనాడు మనదేశంలో అత్యధిక సంఖ్యాకులకు ఆదరపాత్రమైన ఈ మతాన్ని గురించి ఇప్పు డిక్కడ చర్చించను. చార్వాకమహర్షి ప్రత్యేక పాత్రగా ఒక నాటకాన్ని వ్రాయాలనే సంకల్పం నా కున్నది. అది సిద్ధిస్తే, ఆ నాటక పీఠికను ఈ మత సిద్ధాంతాల విశదీకరణకే పూర్తిగా వినియోగిస్తాను.

రామాయణానికి సంబంధించినంతవరకు రామ, జాబాలి సంవాదంలోనే కాక, నాకు జ్ఞాపకం వున్నంతవరకు మరి రెండు చోట్ల నాస్తికత్వ ప్రసక్తివున్నది. అయోధ్యాపురవర్ణన సందర్భంలో బాలకాండ ఆరవ సర్గ ఆ నగరంలో "చదువురాని వాడేమి, ఈశ్వరుడు లేడని వాదించే వాడేమి మచ్చుకైనా లే"దని ఉద్ఘాటించింది. అదే సర్గ వేరొకచోట "దేవుడు లేడనే నాస్తికుడుగాని, అసత్యా లాడేవాడుగాని ఆ పురంలో లే"దని పునరుద్ఘాటించింది. ఇక్కడి నుంచి లే అయోధ్యాకాండకు వెడితే, అయోధ్యాపురవాసులలో - పైగా, అక్కడి బ్రాహ్మణులలో - కొందరు నాస్తికులని నిర్ణయించుకోవలసి వస్తుంది. అయోధ్యలో మచ్చుకైనా నిరీశ్వరవాదులు లేరని బాలకాండ పేర్కొనగా, అయోధ్యాకాండ, నూరవసర్గ రాముని ద్వారా భరతునికి ఈ కింది హెచ్చరికను చేయిస్తున్నది!

"లోకాయతికులైన బ్రాహ్మణులను నీవు సేవింపవుగదా! వారు అజ్ఞానులు. తమ కేమీ తెలియకపోయినా, పండితుల మని విర్రవీగుతారు. వారు చేసేవన్నీ దుర్బోధనలే! వాటివల్ల ధర్మలోపం కలుగుతుంది. అనర్థాలు కలుగుతాయి. సజ్జను లాచరించదగు ధర్మా లుండగా, వాటిని విడిచి, అన్వేక్షి బుద్ధి (తార్కికబుద్ధి) కలిగిన లోకాయతికులు నిష్ప్రయోజనమైన మాటలు చెబుతారు"

ఇదే సర్గలో మరొకచోట అనృతాన్ని, నాస్తికత్వాన్ని రాముడు "బ్రాకెట్" చేశాడు. ఏమైనా ఈ లోకాయత ఖండనలో రెండు ముఖ్యాంశాలను ప్రత్యేకించి గమనించాలి. ధర్మశాస్త్రాలకు అది విరుద్ధంగా వెళ్ళినా, అది తర్కవిరుద్ధమైనది కాదనడం మొదటి విషయం; ఆ కాలంలో "బ్రాహ్మణోత్తము"లైన వారిలోనే కొందరు లోకాయత ప్రబోధకు లనడం రెండవ విషయం.

ఇంతకు మించి ప్రస్తుతానికి యీ చర్చలోకి వెడితే, దీని నుంచి త్వరగా బయటపడలేని ప్రమాదం వున్నందున ఇక్కడితో దీన్ని సరిపుచ్చుతాను.

దీర్ఘకాలంపాటు సంతానప్రాప్తి లేకపోయిన దశరథుడు కైకేయిని పరిణయ మాడగోరగా ఆమెకు కుమారుడు కలిగితే అతనికే రాజ్య మివ్వాలన్న వాగ్దానాన్ని అశ్వపతి పొందినట్టు, ఈ వాగ్దానం సంగతిని మొట్టమొదటిసారిగా జాబాలినుంచి రాముడు విన్నట్టు నా నాటికలో నేను సూచించాను. వ్రాతప్రతిగా వుండగా దీన్ని చదివిన ఒక మిత్రుడు "దశరథుడు ఈ వాగ్దానం చేసినట్టు రామాయణంలో లేదు. దీన్ని మీరు కల్పించారా?" అని ప్రశ్నించాడు. అయోధ్యాకాండ 107వ సర్గను చూస్తే, ఇది నా కల్పన కాదని మీకే తెలుస్తుంది. భరతునితో ప్రసంగిస్తూ అతనికి కూడా ఈ సంగతి తెలియదన్నట్టు, ఓం ప్రథమంగా తానే తెలియజెప్పుతున్నట్టు, రాముడు దీని ప్రసక్తి తెస్తాడు. ఇంతకు ముందుగాని, ఇటు తర్వాతగాని రామాయణంలో ఈ వాగ్దానం ప్రసక్తి లేదు. అయినప్పుడు భరతునికి సయితం తెలియనీయకుండా అతిగోప్యంగా వుంచబడిన ఈ వాగ్దానాన్ని చిత్రకూట పర్వతం వద్ద మొట్టమొదటిసారి జాబాలి ద్వారా రాముడు విన్నట్టు నేను పేర్కొనడం సమంజసమే కాదా? పోతే, మరొక్క సంగతి : తన మాటలకు రాముడు కుపితుడు కాగా, "అబ్బే! నా మతం సమయానుకూలంగా మారుతూ వుంటుంది. వీలునుబట్టి ఈ క్షణం నేను నాస్తికుడను, మరుక్షణం ఆస్తికుడను. నీ మనస్సు మార్చి, నిన్ను అయోధ్యకు తోడ్కొని పోవడానికే నీకు నాస్తిక బోధ చేశా"నని జాబాలి పలికినట్టు రామాయణంలో వున్నా, ఆ విధంగా ఆయన జారిపోలేదన్నట్టు చిత్రించడం ఆ పాత్రకు ఉదాత్తతను సిద్ధింపజేస్తుందని శ్రీ గోపరాజు రామచంద్రరావు నాతో గట్టిగా వాదించి కూడా నా మనస్సు మార్చలేక పోయారు. తమ మానసిక విశ్వాసాలు బహుజన విశ్వాసాలకు విరుద్ధంగా వున్న సందర్భాలలో ధైర్యంగా వాటికి కట్టువడి వుండేవారి సంఖ్య - ఈ దేశంలోనే కాదు, ఏదేశంలోనైనా - దురదృష్టవశాని.

అతిస్వల్పం. కొన్ని శతాబ్దాలకొకసారి అట్టివారెవరైనా కానవస్తే, సోక్రటీస్ కు విషం పెట్టి చంపినట్టు, ఏసుక్రీస్తును శిలువ నెక్కించినట్టు, బ్రూనోను పొట్టబెట్టుకున్నట్టు, గాంధీజీని హత్యచేసినట్టు, వారిని హతమార్చడానికి వెనుదీయరు. రామాయణం పేర్కొన్నట్టే కాక, నా దృష్టిలో కూడా తమ విశ్వాసాల కోసం కష్టాల నాహ్వానించలేని, ప్రాణాల నర్పించలేని విస్తృతవర్గానికి చెందినవాడే జాబాలి.

అయితే, తన విశ్వాసాలు తనవి కానట్టు తనకు ప్రమాద నివర్తికై జాబాలి నటన చేశాడే తప్ప, వాటిని మార్చుకొనలేదని నేను భావిస్తున్నాను. రాముని భావనకూడా ఇదే కావచ్చు ననడానికి రామాయణంలో కొంత ఆధారం కనబడుతున్నది. "అబ్బే! నేను చేసింది కేవలం నటన" అని జాబాలి చెప్పినతర్వాత "జాబాలి పలుకులకు రాము డలిగినట్టు గుర్తించిన వసిష్ఠ మహర్షి రాముని చూచి..." అంటూ అయోధ్యాకాండ 110వ సర్గ ప్రారంభ మౌతున్నది. జాబాలి కేవలం నటన చేసినట్టు రాముడు నమ్మివుంటే ఆయనపై కోపం మిగిలివుండనక్కర లేదు గదా?
నా నాటిక ముగింపు ఘట్టంలోని జాబాలి పలుకులు ఆయన తన విశ్వాసాలను నిజంగా మార్చుకోలేదని, వాటిని మార్చుకొన్నట్టు కేవలం నటన చేశాడని వ్యంగ్యంగా సూచిస్తున్నట్టు నేను నమ్ముతున్నాను. ఈ భావాన్ని అవి మీకు స్ఫురింపజేయలేకపోతే ఆ మేరకు నేను విఫలుడ నైనట్లే!

నా నాటిక చిన్నదైనా, దానికి పెద్ద పీఠిక అవసరమని దీన్ని ప్రారంభించాను. అయితే, ఇంత పెద్దదిగా ఇది పెరిగిపోతుందని మాత్రం ఊహించలేకపోయాను. ఇది మీ కెంతవరకు ప్రయోజనకారి కాగలదో తెలియదుగాని, దీనివల్ల నామట్టుకు నేను పెద్ద లాభమే పొందాను. పెక్కేండ్లుగా సంస్కృత రామాయణాన్ని, రామాయణ వ్యాఖ్యానాలను, రామాయణంపై పరిశోధక గ్రంథాలను చదువుతున్నాను. ఈ విస్తృతపఠనం స్పష్టాస్పష్టమైన భావాలను ఎన్నింటినో నాలో రేపుతూవచ్చింది. ఏపుగా పెరిగిన ఒక కీకారణ్యంవలె వున్న ఈ భావజాలానికి ఒక తీరు దిద్దడానికి, ఒక తెన్ను కూర్చడానికి ఈ పీఠికా రచన నాకు విశేషంగా తోడ్పడింది. ఇట్టి ప్రయోజనాన్ని మీలో ఏ కొందరు దీనినుంచి పొందగలిగినా, ఆరోగ్యం అంత ససిగా లేని రోజులలో దీన్ని వ్రాయడానికి నేను పడిన శ్రమ వృథా కాలేదని సంతోషిస్తాను.

దీన్ని చదివి నన్ను తిట్టేవారిమాట ఏమంటారా? అట్టివారు లేకపోతే, వారికి పట్టరాని పాన్ని ఇది కలిగించకపోతే, వారిచేత గట్టిగా ఇది నన్ను తిట్టించకపోతే, నేను నా లక్ష్యాన్ని (1974) లవకేశంగానైనా సాధించలేకపోయినట్టే!

జాబాలి

ద్వితీయ ముద్రణకు పీఠిక

నేననుకొన్న దొకటి, జరిగినట్టిది మరొకటి. నా "జాబాలి" నాటిక ప్రథమ ముద్రణ పీఠికపై ఎక్కువమంది విరుచుకు పడగల రనుకొన్నాను. అది జరగలేదు. నా "జాబాలి" నాటిక అంతగా విమర్శకు గురికా దనుకున్నాను. అది జరిగింది. పైగా, జరిగిన విమర్శ రామభక్తుల ద్వారా కాక, హేతువాదుల ద్వారా జరిగింది; ఆస్తికుల ద్వారా కాక నాస్తికుల ద్వారా జరిగింది. ఇది నన్ను ఆశ్చర్యపరిచిందని ప్రత్యేకించి చెప్ప నక్కరలేదు.

నా పీఠిక పై విమర్శ రాలేదు సరిగదా, ప్రశంస వచ్చింది. ఆ ప్రశంస చేసిన వారిలో రామభక్తులు సయితం ఎన్నదగు సంఖ్యలో వున్నారు. వారిలో నా పీఠిక కొత్త ప్రశ్నలను రేకెత్తించింది, కొత్త ఆలోచనలను పురికొల్పింది. ఇంతేకాదు, వారిలో

కొందరిని అది పరిశోధనకు సయితం ప్రేరేపించింది. ఇందుకు తార్కాణంగా నాకు వచ్చిన పెక్కు లేఖలలో ఒకదాన్ని మాత్రం ఇక్కడ ఉటంకించ గోరుతున్నాను. ఆ లేఖ వ్రాసింది బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన ఒక యువ వైజ్ఞానిక శాస్త్రజ్ఞుడు. ఆయన పేరు - శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి. ఆయన లేఖ పూర్తి పాఠమిది.

మీరు వ్రాసిన "జాబాలి" పుస్తకాన్ని నేను, మా మిత్రులు చదివి ఎంతగానో సంతోషించాము. ఇలాటి విమర్శనాత్మక పుస్తకములు మూడులకు ఎంతైనా కనువిప్పు గలుగ జేస్తాయని మా దృఢ నమ్మకం. అలాటి సంఘటన మా గ్రామములో జరిగినది జరిగినట్లుగా తెల్పుటకు సంతోషిస్తున్నాము.

"మాది సత్తెనపల్లి తాలుకా చాగంటివారి పాలెం గ్రామము. నేను ప్రస్తుతము బాపట్ల వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగకు మా గ్రామము వెళ్ళినాను. వెళ్తూ మీ "జాబాలి" పుస్తకమును సనాతన రామభక్తులకు వినిపిద్దామని తీసుకెళ్ళినాను. అక్కడ నా మిత్రులకు "జాబాలి"ని చదివి వినిపించటం జరిగింది. విన్న తరువాత వారిలో కొంతమందికి "యివి అన్నియు నిజమా: కాదా?" తేల్చుకోవలెనని ఆవేశం కలిగింది. దాని ఫలితంగా సంక్రాంతి పండుగ రోజున దాదాపు 300 మంది స్త్రీ పురుషులు మా గ్రామంలోని ఉపాధ్యాయులొకరు "జాబాలి"ని చదవగా వినుట జరిగినది. దానితో "రాముడు మాంసాహారియా! బహుపత్నీ వ్రతాన్ని సమ్మతించాడా?" అని వారికి అనుమానం కలిగింది. మా రాముడు అలాటివాడు కావటానికి వీలులేదనే ఆత్మఘోషతో వారు సతమతమై మిమ్మల్ని వెయ్యి రూపాయలు ఖర్చయినా మా గ్రామమునకు పిలిపించమని కోరటం జరిగింది. ఒక వృద్ధుడు మిమ్ములను కమ్యూనిస్టు అని అన్నాడు కూడా.

మా గ్రామం రామభక్తుల నిలయం. వావిలకొలను సుబ్బారావుగారు, వారి శిష్యులు సుబ్బదాసుగారి ప్రభావంతో మా వూరిలో చాలమంది గురుకారణం పుచ్చుకొన్నారు

రామభక్తికి కోటగా నిలచిన గ్రామం. అక్కడ యిలాటి పుస్తకం చదవటంతో పెద్ద కలకలం రేగింది. గ్రామస్తులు రామాలయం ధర్మకర్తను "ఈ విషయాలు నిజమేనా?" అని నిలదీసి అడిగారు. ఆయన ఆ క్రితంరోజే "జాబాలి" పుస్తకమును దీసికొని, వారికి సుబ్బారావు విరచిత రామాయణములో సంశయాత్మక విషయములు వెదకినాడు. ఆయన కూడా యథార్థమన్నాడు. మరొక మా గ్రామవాసి ఆంధ్ర వాల్మీకి రామాయణం 108 సార్లు పారాయణంజేసినాడు. ఆయన కూడా యీ విషయములను మా కెందుకు చెప్పలేదని ప్రజలు తమ ఆవేశాన్ని వెల్లడించారు. యీలాటి పుస్తకములు యింకా కావలెనన్నారు. పై సంఘటన మా స్నేహితులను, ముఖ్యంగా మా గ్రామవాసులను ఎంతో విజ్ఞానము వైపు మళ్ళించినదని చెప్పుటకు సందేహము లేదు. మీరు యికపై కూడా యీలాటి విమర్శ నాత్మకమైన పుస్తకాలు వ్రాసి, గ్రుడ్డి నమ్మకాలతో దోచబడే అమాయక ప్రజల్ని సరియైన దారిలో పెట్టడానికి సహకరిస్తారని తలుస్తూ, మీ సరికొత్త పుస్తకాలకు ఎదురు చూస్తూ, శలవు తీసుకుంటాను.

రామభక్తికి, రామ భజనకు ప్రధాన కేంద్రమైన ఒక గ్రామాన్ని "ఆంధ్ర వాల్మీకి"గా చెల్లిన వావిలకొలను సుబ్బారావుగారిని గురు స్థానంలో నిలుపుకొన్న ఒక గ్రామాన్ని నా పీఠిక ఇంతగా కదిలించినట్లు విన్నమీదట దాన్ని వ్రాయడం కోసం నేను చేసిన కృషి, నేను పడిన శ్రమవృథా కాలేదన్న సంతోషం నాకు కలిగింది.

పోతే, నా నాటిక విషయమై ప్రధానంగా వచ్చిన విమర్శ "నేను నాస్తికుడను కాదు, మొర్రో!" అని జాబాలి నెత్తీ నోరూ బాదుకొంటూ వుండగా; "కాదు, నీవు నాస్తికుడవే" అని నేను చెప్పడం ఎంతవరకు సమంజసమనీ, ఏ విధంగా సమర్థనీయమని? ఈ విధమైన సందేహాన్ని వెలిబుచ్చే వారికి పురోహితవర్గం కౌటిల్యం, దాని ప్రాబల్యం, దాని నైచ్యం, దాని క్రౌర్యం ఎంత మాత్రం తెలియదని చెప్పాలి. ఇంతేకాదు. ఈ దేశంలోనే కాక, దేశదేశాలలో పురోహితవర్గం కారణంగా నవభావ వికాస చరిత్ర ఎన్ని హింసలతో, మరెన్ని హత్యలతో, ఎంత రక్తపాతంతో మరెంత రాక్షసత్వంలో నిండివున్నదో వీరికి తెలియదని కూడా చెప్పాలి. పురోహితవర్గ చరిత్రనుగాని, నవభావవికాసంపై దాని యుద్ధ చరిత్రను గాని సవివరంగా నేను చర్చించబోవడం లేదు. ఈ విషయమై ఆసక్తిగలవారు "హిస్టరీ ఆఫ్ కాన్ఫ్లిక్ట్ బిట్వీన్ సైన్సు అండ్ రెలిజియన్" అనే పేరుతో జాన్ విలియం డ్రైవర్ వ్రాసిన పుస్తకాన్ని చదువుకోవచ్చు. ఇది 1885 నాటి ప్రచురణ కాబట్టి, ఇప్పుడు చెదురుగా తప్ప లభించదు గాని, ఇది నావద్ద వున్నది. నేను దీన్ని శ్రద్ధగా చదివాను. ఇట్టిదే మరొక పాత పుస్తకం వున్నదట. దాని పేరు "వార్ ఫేర్ ఆఫ్ సైన్స్ విత్ రెలిజియన్". దాన్ని నేను చూడలేదు, దాని గ్రంథకర్త పూర్తి పేరు సయితం నాకు తెలియదు. వైట్ రచనగా ఒకటి, రెండుచోట్ల ట్రెండ్ రస్సెల్ దాన్ని ప్రశంసించాడు. ఆయన ప్రశంస లందుకొన్నట్టిది కాబట్టి, అది ఉత్తమ గ్రంథమై వుండాలి. పోతే, ఈ విషయమై నేను చదివినవి మరి మూడు పుస్తకాలున్నాయి. వాటిలో మొదటిది రసెల్ రచన "రెలిజియన్ అండ్ సైన్స్". రెండవది జె.బి. బూరీ వ్రాసిన "ఎ హిస్టరీ ఆఫ్ ఫ్రీడమ్ ఆఫ్ థాట్." ఇవి "హోం యూనివర్సిటీ" లైబ్రరీ ప్రచురణలు. ఇప్పటికీ ఇవి అచ్చులో వున్నాయనే నా నమ్మకం. ఇక, నేను నా చదివినవాటిలో మిగిలిన పుస్తకం "థింకర్స్ లైబ్రరీ" ప్రచురణలలో ఇరవై మూడవది. వీటి ప్రచురణను కొంత కాలంగా నిలిపివేశారు. వీటి స్థానంలో "న్యూ థింకర్స్ లైబ్రరీ" అనే పేరుతో కొత్త గ్రంథాలు వెలువడుతున్నాయి. అయినా, సర్ జాన్ మేకొనెల్ రచన "హిస్టారికల్ ట్రయల్స్" ప్రతి ఏమంత కష్టం లేకుండానే దొరకవచ్చు. ఇట్టి గ్రంథాలు నేను చదవనివి కనీసం పేరైనా విననివి - మరికొన్ని వుండవచ్చు. వీటి ప్రసక్తిని నేను తీసుకురావడం ఈ గ్రంథాలలో ఏ కొన్నింటిని చదివిన వారైనా పురోహితవర్గాన్ని గురించి ఇంతకుముందు నేను చేసింది నిందకాదని, అది చరిత్రపుటల కెక్కిన సత్యమని అంగీకరించగలరన్న విశ్వాసంతోనే.

మన దౌర్భాగ్యవశాన ఈ విధమైన గ్రంథాలు మన దేశాన్ని గురించి ఇటీవల తప్ప వెలువడ లేదు. పైగా, వాటిని వ్రాసింది, వ్రాస్తున్నట్టిది - కేవలం ఒక్కరనే చెప్పవచ్చు. ఆయన పేరు - దేవీప్రసాద్ చటోపాధ్యాయ. ఈ ఛటోపాధ్యాయ ఇదివరలో కొంతకాలంపాటు ఇందిరాగాంధి ప్రభుత్వంలో మంత్రిపదవి వెలగబెట్టిన దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ కాదు. ఈయన రాజకీయాలు ఎంత నికృష్టమైనవో దార్శనికుడుగా ఈయన వ్రాసిన -- వ్రాస్తున్న పుస్తకాలు అంత నిస్సారమైనట్టివి. వాటిలో పాత ఊకదంపుడు తప్ప, ఒక కొత్త భావమైనా కనబడదు. కాగా, నేను గౌరవించే దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ "లోకాయత" "ఇండియన్ ఎథీయిజం" "వాట్ ఈజ్ లివింగ్ అండ్ వాట్ ఈజ్ డెడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ" మొదలైన మౌలిక గ్రంథాలను రచించిన దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ. ఈయన సరికొత్త రచనలలో ఒకటి "సైన్స్ అండ్ సొసైటీ ఇన్ ఏన్ షెంట్ ఇండియా" దీనిలో అధికంగా ఆయుర్వేద చరిత్రకు సంబంధించిన చర్చ వున్నది. ఇందుకు కారణం - ప్రాచీనకాలాన ఇండియాలో అధికంగా పురోభివృద్ధి చెందినట్టిది వైద్యశాస్త్రం కావడమే. అయితే, సందర్భోచితంగా ఇతర శాస్త్రాల ప్రసక్తి కూడా ఛటోపాధ్యాయ తీసుకు వచ్చాడు. ఈ పుస్తకం పుటలను ఒకసారి తిరగవేసిన, పురోహిత వర్గం ఎన్ని విధాల ఎంతగా - ఇండియాలో వైజ్ఞానికశాస్త్ర వికాసానికి, సత్య సంశోధనకు అవరోధంగా నిలిచిందో బోధపడుతుంది. ఇంతే కాదు. పురోహితవర్గానికి భయపడి, వైజ్ఞానికులు, దార్శనికులు ఎన్ని సాముగరిడీలు చేశారో అర్థం కాగలదు కూడా.

వేదాంతం ప్రకారం కృపణబుద్ధులైనవారే పరిణామవాదాన్ని గుర్తిస్తారు. కాగా, జ్ఞానులైన వారు మాయావాదాన్ని అనుసరిస్తారు. మాయావాదం ప్రకారం జగత్తు మిథ్య, జీవితం మిథ్య, సమస్తం మిథ్య, ఆత్మ ఒక్కటే నిత్యమైనది. దానికి

రోగం లేదు, రొష్టు లేదు, దానికి జరలేదు, మృతి లేదు. అయినప్పుడు ఆయుర్వేదం పనికిమాలిన శాస్త్రం కాదా? మయావాదాన్ని పూర్తిగా తిరస్కరిస్తేనే, భౌతికవాదాన్ని దానితో పాటుగా పరిణామవాదాన్ని గుర్తిస్తేనే, ఆయుర్వేదానికి ప్రపంచంలో స్థానమైనా సార్థక్యమైనా! దీన్నే మరింత స్పష్టంగా చెప్పాలంటే, భౌతికవాదాన్ని అనుసరించేవారే, దాన్ని ఔదల దాల్చేవారే ఆయుర్వేదాచార్యులు కాగలరు. ఛటోపాధ్యాయ ప్రతిభాపూర్వకంగా నిరూపించినట్లు, చరకుడు (అది నిజంగా ఒక వ్యక్తి నామమైతే) అగ్నివేశుడు, దృఢబలుడు, సుశ్రుతుడు మున్నగువారు భౌతికవాదంలో, పరిణామవాదంలో విశ్వాసం వున్నవారే. కాని, ఆ విషయాన్ని బాహాటంగా చెబితే తమకు నాస్తికులన్న నింద తప్పదు, పాషండులన్న దూషణ తప్పదు. చివరికి సంఘం నుంచి బహిష్కరణ సయితం నటించారు, మాయావాదాన్ని మన్నిస్తున్నట్టు నటించారు, మరి ఏమేమో చేశారు. ఏమి చేసినా భౌతికవాదాన్ని, పరిణామ వాదాన్ని గుర్తించి, వాటి ప్రకారం తమ చికిత్సా విధానాలను నిర్ణయించక పోతే, తామునుగాని, తమ శాస్త్రంగాని రాణించడం జరగదని వారికి తెలుసు. అందువల్ల కొన్ని కొన్ని సందర్భాలలో మద్యపానాన్ని వారు నిర్దేశిస్తారు. మరికొన్ని సందర్భాలలో గోమాంసభక్షణకు సయితం నిర్దేశిస్తారు. ఆయుర్వేదశాస్త్రంలో నాకు పరిచయం తక్కువ. నిజానికి దానిపట్ల ఏమంత ఆసక్తి సయితం లేదు. అందువల్ల ఛటోపాధ్యాయ పుస్తకాన్ని తగినంత శ్రద్ధతో నేను చదవలేక పోయాను. ఏమైనా, ఇక్కడ ముఖ్య విషయం ఒక్కటి మాత్రమే. వేదపండితులకు భయపడి, పురోహితవర్గానికి భయపడి ఆయుర్వేద శాస్త్రవేత్తలు ఎంతో నటన చేశారు. ఏవేవో, నాటకాలాడారు. దేవీప్రసాద్ పుస్తకం ఈ విషయాన్ని తిరుగులేని తార్కాణాలతో నిరూపిస్తున్నది.

ఆయుర్వేద శాస్త్రవేత్తలవలె ఖగోళశాస్త్రజ్ఞులు కూడా సత్యాలుగా తాము నమ్మినవాటిని అన్ని సందర్భాలలో సూటిగా చెప్పడానికి బెదిరి పోవడమే జరిగింది. పృథ్విగోళాకృతిలో వున్నదని వారికి తెలుసు; అది సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నదని వారికి తెలుసు; సూర్యచంద్ర గ్రహణాలకు అసలు కారణం వారికి తెలుసు; అయినా, పాతపుస్తకాలలో వ్రాసివున్నదాన్ని పురాణాలలో చెప్పి వున్నదాన్ని ఖండిస్తే, ఛాందసులు, అంతకంటె మిన్నగా, ఛాందసులను జ్ఞాననిధులుగా నమ్మే పామరులు తమ పీక పిసికి వేయగలరన్న భీతిలో వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు గ్రహణాల సందర్భంలో రాహుకేతువుల ప్రసక్తిని ప్రవేశ పెట్టి, దాన్ని సమర్థించడానికి ద్రావిడ ప్రాణాయామం చేశారు.

ఇట్టి విశేషాలు దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ పుస్తకంలో (సైన్స్ అండ్ సొసైటీ ఇన్ ఏన్ షెంట్ ఇండియా) కోకొల్లలుగావున్నాయి. వేదాంతంలో తప్ప న్యాయం వైశేషికంలో తప్ప మరి ఏ భారతీయ దార్శనికశాస్త్రంలో ఈశ్వరునికి ఆదిలో స్థానం లేదు. వేదాంతులకు భయపడి, ధర్మశాస్త్రకారులకు భయపడి, పౌరాణికులకు భయపడి, ఒక్కమాటలో, పురోహితవర్గానికి భయపడి తర్వాత తర్వాత అన్ని ప్రధాన దార్శనిక శాస్త్రాలలోకి ఈశ్వరుడిని దొడ్డిదారివెంట ప్రవేశపెట్టారు.

ఈ విధమైన పరిణామానికి భారతీయ చరిత్రలో కంటె పాశ్చాత్య దేశ చరిత్రలో స్పష్టమైన నిదర్శనాలు విశేషంగా కనబడతాయి. అందువల్లనే చదవదగు గ్రంథాలుగా కొందరు పాశ్చాత్యుల రచనలను ముందుగానే నేను పేర్కొన్నాను. ఎక్కువగా వివరాలలోకి పోకుండా పురోహిత వర్గం విశ్వాసాలకు, వారి విధినిషేధాలకు, ఇంతకంటె కూడా నిష్కర్షగా చెప్పాలంటే, వారి అజ్ఞానానికి, వారి మౌఢ్యానికి వ్యతిరేకంగా వెళ్ళిన కొందరు పాశ్చాత్య ప్రముఖులు ఎన్ని భయసందేహాలకు, ఎన్ని దూషణ తిరస్కారాలకు, ఎన్ని కష్టనష్టాలకు గురి కావలసివచ్చిందో, కొన్ని సన్ని వేశాలలో వారు ప్రాణత్యాగం సయితం చేయవలసి వచ్చిందో సూచన ప్రాయంగా పేర్కొనడానికి ఇక్కడ ప్రయత్నిస్తాను. ఈ వాక్యం ఇంత దీర్ఘమైనది కావడానికి కారణం ఈ హింసాచరిత్ర అతి దీర్ఘమైనది కావడమే కావచ్చు.

మున్ముందుగా రోజర్ బేకన్ విషయాన్నే తీసుకోండి. ఆయన క్రీస్తుశకం పదమూడవ శతాబ్దికి చెందినవాడు. కొందరి దృష్టిలో ఆధునిక యుగం ఆయనతోనే ప్రారంభమైంది. (మరి కొందరు ఈ ఘనతను మరొక బేకన్ కు, 1561-1626 సంవత్సరాల మధ్య జీవించిన బేకన్ కు చెందుతుందని నమ్ముతారు) కావడానికి రోజర్ బేకన్ ఒక క్రైస్తవ మతశాఖకు ఫ్రానిస్కన్ శాఖకు చెందిన పరివ్రాజకుడు. అయినా, రసాయన శాస్త్రంతో కొన్ని నూతన ప్రయోగాలను ఆయన చేశాడు. ఈ ఘోరనేరానికి ఆయనను ఆక్స్ఫర్డ్ నుంచి పారిస్కు పిలిపించి, ఆ నగరం నుంచి పదేళ్ళపాటు కదలరాదన్న ఆంక్ష విధించారు. తాను కనుగొన్న నూతన శాస్త్రీయ సత్యాలనుగురించి గ్రంథం వ్రాయడానికి ఆయనకు సాహసం లేకపోయింది. పోప్ స్వయంగా కోరినమీదట దాన్ని వ్రాయగా, ఆ పాపానికి తిరిగి మరొక ఘట్టంలో నిర్బంధంలో గడపవలసి వచ్చింది.

పధ్నాలుగు సంవత్సరాలపాటు ఆయన రోజర్ బేకన్వలె నికొలస్ కోపర్నికస్ క్రైస్తవ పురోహిత వర్గానికి చెందినవాడే. (ఈయన జీవిత కాలం 1473 నుంచి 1543 వరకు) పృథ్వి విశ్వానికి కేంద్రమని బైబిల్ చెబుతున్నది; సూర్యుడు పృథ్వీచుట్టూ పరిభ్రమిస్తున్నాడని అది చెబుతున్నది; ఇట్టి వెర్రి మొర్రి మాటలను మరెన్నింటినో అది చెబుతున్నది. అయితే, ఈ విధమైన వెర్రిమొర్రి ఒక్క బైబిల్ లోనే కాదు, అన్ని మత గ్రంథాలలోనూ వున్నాయి. పృథ్వి విషయమై, సూర్యుని విషయమై, ఖగోళానికి సంబంధించిన ఇతర విషయాలపై, బైబిల్ చెబుతున్న మాటలు సత్య విరుద్ధాలని కోపర్నికస్ గుర్తించాడు. అయితే, దీనిలో ఆయన ఆద్యుడు కాడు. అతి ప్రాచీన కాలంలోనే - క్రీస్తుకు పూర్వమే - కొందరు గ్రీక్ శాస్త్రజ్ఞులు దీన్ని గుర్తించారు. క్రీస్తు తర్వాత ఆరేడు శతాబ్దాలనాటికి భారతీయ శాస్త్రజ్ఞులు సయితం దీన్ని గుర్తించారు. గ్రీక్ శాస్త్రజ్ఞులలో ప్రత్యేకించి పేర్కొన దగువారు పై తాగొరస్ అనుయాయుడైన ఫిలోలేస్, సెమోస్ దీవికి చెందిన అరిస్టార్కస్ ముఖ్యులు. వీరిద్దరిలో ఆరిస్టార్కస్ సత్యానికి మరింత చేరువగా రాగలిగాడు. అయితే, నాటి మతాచార్యుల కన్నెర్రకు జడిసి, తాను తప్పుడు సిద్ధాంతాలు చేసినట్లు ఆయన చివరికి లెంపలు వేసుకొనవలసి వచ్చింది.

ఈ విధంగా లెంపలు వేసుకొనకపోయినా, తన ఖగోళ సిద్ధాంతాలను ప్రచురిస్తే తనకు ఏమి కీడు మూడగలదో అని కోపర్నికస్ ఎంతగానో భయపడ్డాడు. భయంభయంగానే తన సిద్ధాంతాల సారాంశాన్ని 1514 ప్రాంతంలో వ్రాతప్రతి రూపంలో ఆయన బయటపెట్టాడు. దాన్ని చూచిన లూథర్ "ఆప్ స్టార్ట్ ఎస్ట్రాలజర్" అని, "ఫూల్" అని కోపర్నికస్ పై నోరు పారవేసుకొన్నాడు. పోతే, బైబిల్ నుంచి ఒక వాక్యాన్ని ఉదాహరించి, ఇందుకు విరుద్ధమైనవి కాబట్టి, కోపర్నికస్ సిద్ధాంతాలకు గడ్డిపోచ పాటి కూడా విలువ లేదు పొమ్మని కాల్విన్ అన్నాడు. ఈ పరిస్థితిలో మౌనమే తనకు క్షేమమని కోపర్నికస్ భావించాడు. అయితే, నాటి పోప్ పదవ లీయో, లూథర్ కంటె, కాల్విన్ కంటె, కొంత విశాల దృష్టి గలవాడు. "తగు నిరూపణలతో నీ సిద్ధాంతాలను మాకు వివరించు!" అని కోపర్నికస్ ను ఆయన ఆదేశించాడు. పోప్ ఆదేశానుసారంగా తన సిద్ధాంతాలను వివరిస్తూ ఒక గ్రంథాన్ని సిద్ధం చేసినా, ధైర్యం చాలక, దాని ముద్రణను పదమూడు సంవత్సరాలపాటు కోపర్నికస్ విలంబన చేశాడు. అప్పుడైనా తనవి నూతన సిద్ధాంతాలని ఆయన చెప్పుకో లేదు, పరిశీలించదగు కొన్ని కొత్త ప్రతిపాదనలుగా వాటిని అభివర్ణించాడు. ఏమైనా, ఆయన పుస్తకం తొలిప్రతి ఆయన హస్తాలకు చేరింది. ఆయన మరణ శయ్య పై ఉండగా, దాన్ని చూడగా ఆయన పెదవులపై ఒక చిరునవ్వు మెరిసిందట. తర్వాత కొన్ని క్షణాలకే శాశ్వతంగా ఆయన కన్ను మూశాడట. లోలోపల తనను పీడిస్తూ వచ్చిన భయంవల్లనే తన మరణానంతరమే తన గ్రంథం లోకానికి అందగల విధంగా కోపర్నికస్ జాగ్రత్తపడి ఉండవచ్చు. దీనితోపాటు మరొక జాగ్రత్త కూడా ఆయన తీసుకొన్నాడు. ఎందుకైనా మంచిదని, పదవ లీయో తర్వాత పోగా ఎన్నికైన మూడవ పాలకు తన గ్రంథాన్ని ఆయన అంకితం చేశాడు. అయినా, కొన్నేళ్ళ లోపలనే దాన్ని పోప్ పీఠం నిషేధించింది. అప్పటికి మరి లేడుకాబట్టి సరిపోయింది కాని, లేకపోతే కోపర్నికసను కారాగారానికి పంపించేవారో, కాల్చి వేసేవారో! ఇది అల్లరిచిల్లరి విసురు కాదు. కోపర్నికస్

గ్రంథ బహిష్కరణ తర్వాత, దానిలోని సిద్ధాంతాలను సమర్థించిన వారిని బంధించారు, బాధించారు; వేధించారు, వధించారు. ఇంతకుముందు వాక్యంలో "వేధించారు, వధించారు" అని నేను వ్రాయడం యమకం కోసం కాదు. వేధించడమేమి, వధించడమేమి వాస్తవంగా జరిగింది. కోపర్నికస్ సిద్ధాంతాలను మున్ముందుగా సమర్థించిన వారిలో ఒక ప్రముఖుడు ఇటలీకి చెందిన జోర్డానో బ్రూనో. ఇందుకు ఆయనను పెక్కేళ్ళపాటు వేధించడం, చివరికి వధించడం జరిగింది.

ఏ దృష్టి నుంచి చూసినా, బ్రూనో విలక్షణ వ్యక్తి. మతాధికారిగా జీవితాన్ని ప్రారంభించినా, ఆ ఉద్యోగంలో ఎంతో కాలం ఆయన ఇమడ లేక పోయాడు. ఆయన స్వాతంత్ర్య ప్రియుడు, ఉత్తమకవి, తత్త్వవేత్త, మహోపన్యాసకుడు. స్నేహం చేస్తే ప్రాణమిచ్చేవాడు, విరోధిస్తే దుమ్ము దులిపేసేవాడు. బైబిల్ ను పుక్కిటి పురాణంగా కొట్టివేసినందుకు కోపర్నికస్ సిద్ధాంతాలను బలపరచినందుకు, ఆయనను అరెస్టు చేయడానికి ప్రయత్నించగా స్వదేశం నుంచి తప్పించుకొని వెళ్ళిపోయాడు. అటు తర్వాత ఆయన ఎన్ని దేశాలు తిరిగినాడో, ఎన్ని నగరాలలో నివసించాడో, ఎందరితో స్నేహం చేశాడో, మరెందరితో విరోధం పెట్టుకున్నాడో, ఎన్ని సిద్ధాంత రాద్ధాంతాలు చేశాడో లెక్క లేదు. ఇటలీలో తిరిగి అడుగు పెట్టకపోతే, బ్రూనోకు బహుశా ప్రాణాపాయం కలిగేది కాదు. కాని, ఒక కపటమిత్రుని నమ్మి, ఆయన వెన్నిస్ వెళ్ళాడు. అక్కడ అరెస్టు చేసి, రోమ్ లో విచారణ తతంగం జరిపి, సజీవదహనం శిక్ష విధించారు. ఒకప్పుడు ఏదో ఒక పద్యంలో "నేను బలవన్మరణం చెందవచ్చు. అయితే, పెక్కుమంది జీవితాలకంటె నా మరణమే ఉత్తమమైనది కాగలదన్న ధోరణిలో ఆయన వ్రాసుకొన్నాడు. 1548లో జన్మించి 1600లో బలవన్మరణం చెందిన బ్రూనో విషయంలో ఇది అక్షరాలా నిజంగా పరిణమించింది.

ఇదే విధంగా మరి పెక్కు మందిని వారి స్వతంత్ర భావాలకు కినిసి పురోహితవర్గం పూజారిమూక - సజీవదహనం చేయడం జరిగింది. వీరందరిని గురించి ఇక్కడ వ్రాయడం సాధ్యం కాదు. అయితే, ఒకసారి స్మరించనైనా స్మరించకుండా విడిచిపెట్టరాని ఒక ప్రముఖుడు లూఛిలో వ్యానినీ (1585 - 1619) సజీవదహనానికి ముందు ఈయన నాల్కను కోసివేశారు. ఆయన చేసిన పాపం మతం పేర మతాచార్యులు, మఠాధిపతులు చెప్పే కల్ల బొల్లులను వెల్లడి చేయడమే!

కోపర్నికస్ సిద్ధాంతాలను వాదం ద్వారా బ్రూనో బలపరిచినాడు తప్ప, ప్రయోగాల ద్వారా వాటిని రుజువు చేయలేదు. ఘనత దక్కించు కొన్నవాడు గెలీలియో (1564-1642) ఆయన ఇటాలియన్ వైజ్ఞానిక శాస్త్రవేత్త, న్యూటనకు గురుతుల్యుడుగా ఎన్నదగు మహామేధావి. కొందరి తీర్పు ప్రకారం ఆధునిక యుగకర్త రోజర్ బేకన్ కాదు, ఫ్రాన్సిస్ బేకన్ కాదు, అతడు గెలీలియో. వైజ్ఞానికసత్యాల నిరూపణకు విధిగా ప్రయోగాలను జరపడం ఆయనతోనే ప్రారంభమైనట్టు చెప్పవచ్చునేమో! శక్తివంతమైన టెలిస్కోపను కనిపెట్టి, దానితో ఖగోళాన్ని సంశోధించి, కోపర్నికస్ సిద్ధాంతాలు వాస్తవమైనవని ఆయన నిరూపించాడు. ఒకసారి గెలీలియో టెలిస్కోప్ తో ఆకాశాన్ని అవలోకిస్తే, బైబిల్ చెప్పింది నిజమో, కోపర్నికస్ చెప్పిందే నిజమో క్షణంలో తేలిపోయేది. కాని, ఏ మతాచార్యుడు, ఏ పీఠాధిపతి ఆ పని చేయలేదు. అనేక శతాబ్దాలుగా తాము ప్రచారం చేస్తున్నవి కాకమ్మ కథలన్న నిరూపణ తమ ప్రతిష్ఠకు ఎంత దెబ్బ! అంతకు మించి, తమ మనసును అది ఎంతగా గాయపరుస్తుంది!! అందువల్లనే సైన్సను, దాని పరికరాలను, వాటితో జరిపే ప్రయోగాలను పురోహితవర్గం వ్యతిరేకించింది. పూజారిమూక వెటకారం చేసింది. ఈ ప్రయోగాలకు మూలపురుషుడుగా పేర్కొనదగు గెలీలియోను పోప్ ప్రతినిధులు ఒకసారి రోమ్ కు రప్పించి, తలవాచేటట్టు గట్టిగా చివాట్లు పెట్టారు. ఇకమీదట నీ పిచ్చికళలను కట్టి పెట్టకపోతే, సహించబోమని, క్షమించబోమని హెచ్చరించారు. అందుమీదట కొంత కాలం పాటు

మిన్నకున్నా, తన పరిశోధనలను గెలీలియో విరమించ లేకపోయాడు, వాటి ఫలితాల ప్రచురణను సంక్షేపించ లేకపోయాడు.

ఇందుకు ఆగ్రహోదగ్రులై, పోప్ ప్రతినిధులు "రా!! తిరిగి దోషిగా మాముందు నిలబడ్డానికి రోమ్ నగరానికి రా!" అని తాకీదు పంపించారు. "అయ్యలారా! బాబులారా! నేను పండు ముదుసలిని కూర్చుంటే లేవలేను, లేస్తే కూర్చోలేను. పైగా, జబ్బుమనిషిని, మంచాన పడివున్నాను. నన్ను మన్నించండి, నేను ప్రయాణం చేయగల స్థితిలో ఎంతమాత్రం లేను" అని లబలబ మొత్తుకొన్నా వినక, ఫ్లారెన్స్ నుంచి గెలీలియోను రోమ్ కు రప్పించారు. విషప్రాయమైన విషయాలను ప్రచారం చేస్తున్నాడన్న నేరాన్ని మోపి, విచారణ జరిపారు. ఇంతే కాదు. "ఇదివరలో నీవు చేసిన వాగ్దానాన్ని అతిక్రమించావు" అని మరొక నేరారోపణ చేశారు. ఈ రెండవ ఆరోపణను తప్పించుకొనవలెనన్న తాపత్రయంతోనే తాను కనుగొన్న ఖగోళ రహస్యాలను ఒక శాస్త్ర గ్రంథం రూపంలో వ్రాయక, ఇద్దరు వ్యక్తుల మధ్య, ఒకరు బైబిల్ లోని వృత్తాంతాలను, మరొకరు కోపర్నికస్ సిద్ధాంతాలను తమ దృక్పథాలనుంచి సమర్థించడానికి చర్చ జరిపిన ధోరణిలో గెలీలియో వ్రాశాడు. పైకి మాత్రం ఆయన బైబిల్ వైపుకే మొగ్గుతున్నట్టు కనబడుతుంది. కాని, తరచి చూస్తే ఇది కేవలం నాటకం మాత్రమే అని స్పష్టపడుతుంది. పోప్ ప్రతినిధులముందు ఈ యెత్తు పారలేదు. అందువల్ల పృథ్వి స్థిరంగా ఉంటుందని, సూర్యుడే పృథ్వి చుట్టు పరిభ్రమిస్తూ ఉంటాడని, బైబిల్ చెప్పిన విషయాలే నిజమైనవని, తాను కనుగొన్నవి సత్యాలు కావని, అవి కేవలం తన భ్రమలని గెలీలియో బాహాటంగా చాటవలసి వచ్చింది. అతి వృద్ధుడన్న కారణాన కాబోలు, సజీవదహనశిక్షను విధించక, ఫ్లారెన్స్ సమీపంలో ఆయనను జీవితాంతం వరకు గృహనిర్బంధంలో ఉంచారు. అప్పటికి ఆయన అతివృద్ధుడే కాదు, అంధుడు కూడా! బ్రూనో విషయమై చెప్పబోయి మరచిపోయిన ఒక మాటను ఇక్కడ చెప్పవచ్చునేమో!

గెలీలియోవలె పూర్తిగా జావ కారిపోలేదు గాని, బ్రూనో సయితం కొంత మనోదౌర్బల్యాన్ని చూపకపోలేదు. తనకు మరణశిక్ష విధించిన పిమ్మట న్యాయాధీశులను ఉద్దేశించి "మరణదండన పొందిన నాకంటె, దాన్నీ నాకు విధించిన మీరే బహుశా ఎక్కువ గజగజలాడుతున్నా" రని ధీరోదాత్తంగా పలికినా, ఏళ్ళతరబడి కొనసాగిన తన విచారణలో తాను చేసింది తప్పిదమే అని బ్రూనో అచ్చుకొన్న సందర్భాలు రెండు, మూడు ఉన్నాయి. ఇట్టి సంఘటనలను మరి కొన్నింటిని పేర్కొనవచ్చు. పైత్ర పోంపొనాట్సీ (1462-1515) దేహాత్మవాదాన్ని పోలిన దర్శనాన్ని రూపొందించాడు. అయితే, పోప్ అంటే తనకు చెడ్డ భయం, పోప్ పీఠం అంటే మరింత భయం, అందువల్ల తాను రూపొందించిన దర్శనాన్ని అరిస్టాటిల్ కు అంటగట్టడానికి పోంపొనాట్సీ ప్రయత్నించాడు. జరా మరణాలు లేని ఆత్మ లేదంటే, శాశ్వతమైన ఆత్మ లేదంటే, క్రైస్తవంతో పాటు అనేక ముఖ్యమతాలు గాలికి దూదిపింజలవలె ఎగిరిపోతాయి. పోంపొనాట్సీ సరిగా ఇంతే అన్నాడు. అయితే, ఇది తాత్త్విక సత్యమని, ఇది మతానికి వర్తించదని, మతవిషయాలకు సంబంధించినంతవరకు ఆత్మను, దాని శాశ్వతత్వాన్ని గుర్తించాలని - ఏవేవో పిల్లి మొగ్గలు వేశాడు. అయితే, ఇవి పని చేయలేదు. "నీ అతితెలివిని కట్టి పెట్టు; క్రైస్తవ సిద్ధాంతాలలో నీకు పరిపూర్ణ విశ్వాసం కలదో, లేదో. తేల్చి చెప్పు!" అని పోప్ నిగ్గదీయగా. "ఉన్నది స్వామీ! నిశ్చయంగా ఉన్నది" అని కల్లలాడి, కఠిన శిక్షను తప్పించుకొన్నాడు. చూడబోతే, పోంపొనాట్సీ పిట్టంత మనిషి. అయితే తల చాలా పెద్దది, పెద్ద తలకు తగినట్టు ఆలోచనలు పెద్దవి, ప్రజాప్రాభవాలు పెద్దవి. దేశికోత్తముడుగా ఆయన విద్యార్థులు ఎంతగానో ఆయనను గౌరవించేవారు. అయినా పోపు భయపడి, ఆయన కల్లలాడక తప్పలేదు. ఇది ఆయనను లోలోపల ఎంత క్రుంగదీసిందో తెలియదు. రుగ్మత తర్వాత రుగ్మతతో ఆయన క్రమంగా కృశించిపోయాడు.

చివరికి బ్రతుకు పైనే రోతపుట్టగా నిరాహారదీక్ష పూని, ప్రాణాలను విడిచాడు. ఇట్టి పరాభవాన్ని భరించవలసి వచ్చిన మరొక మేధావి ఫ్రాన్సుకు చెందిన బుఫాన్. పోంపొనాట్సీవలె పదహారవ శతాబ్దానికి కాక, ఈయన పద్దెనిమిదవ శతాబ్దానికి

చెందినవాడు. అయినా, ఈయన సయితం మతమౌఢ్యానికి తల వంచవలసి వచ్చింది. వృక్షశాస్త్రాన్ని గురించి, జంతు శాస్త్రాన్ని గురించి, మరికొన్ని ప్రకృతి శాస్త్రాలను గురించి కొందరు సహచరుల సహకారంతో, ఈయన ఒక బృహత్తర గ్రంథాన్ని అనేక సంపుటాలలో ప్రచురించాడు. బైబిల్ లోని పిట్టకథలకు భిన్నమైన కొన్ని శాస్త్రీయ సత్యాలు దీనిలో ఉన్నాయి. సార్ బోన్ యూనివర్శిటీ నాడు మతాచార్యుల ప్రాబల్యంలో ఉండేది. వారి కోపాగ్ని నుంచి తప్పించుకొనడానికి "నేను బైబిల్ లో చెప్పిన దాన్ని దేన్నీ కాదనను. భగవంతుడు ఏ విధంగా సృష్టిని చేశాడో, ఎప్పుడు సృష్టిని చేశాడో, ఎన్నాళ్ళలో చేశాడో - ఈ అన్ని విషయాలనుగురించి బైబిల్ చెప్పిందే నిజం. ఇందుకు విరుద్ధంగా నేను వ్రాసిన సమస్తాన్నీ నేను ఉపసంహరించుకొంటున్నాను. నా తప్పిదాన్ని మన్నించండి" అనే ధోరణిలో క్షమాపణపత్రాన్ని వ్రాసి సమర్పించుకోవలసి వచ్చింది. బైబిల్ కథనం ప్రకారం భగవంతుడు ఆరు రోజులలో సృష్టికి సంబంధించిన కార్యకలాపాలను పూర్తిచేసి, ఏడవ రోజున (ఆదివారం నాడు కావచ్చు) విశ్రాంతి పుచ్చుకొన్నాడు. ఆయన మానవుని సృజించింది క్రీస్తుకు పూర్వం 4004 సంవత్సరంలో అక్టోబరు 23వ తేదీని, ఒక ప్రబుద్ధుడు ఘడియలను, విఘడియలను లెక్క కట్టి, మానవుని సృజన ఉదయం సరిగా తొమ్మిది గంటలకు జరిగినట్టు తేల్చాడు! అది క్రైస్తవమతం కావచ్చు, మరొక మతం కావచ్చు, దాని పేరు ఏదైనా, పుట్టుక ఎక్కడైనా, మతం పేరుతో చెల్లుతున్న దానిలో నూటికి 99 వంతులు ఈ విధమైన నాన్ సెన్స్ మాత్రమే! దీన్ని కాదనేందుకే, దీన్ని ఖండించినందుకే కొన్ని వేల సంవత్సరాలుగా హేతువాదులు, వైజ్ఞానికవేత్తలు, తాత్త్వికులు, ఇతర మేధావులు, కష్టనష్టాలకు, లేదా తలవంపులకు గురికావలసి వస్తున్నది.

ఇదే విధంగా వ్రాసుకొంటూ పోతే, ఇదొక పెద్ద గ్రంథమై కూర్చుంటుంది. అందువల్ల దీన్ని మరి పొడిగించను. ఇప్పటికి నేను వ్రాసిందే చాలు కొన్ని ముఖ్యాంశాలను నిర్ధారించడానికి. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా, మత విశ్వాసాల ప్రాబల్యం హెచ్చు,.

మత మౌఢ్యాల ప్రాబల్యం మరింత హెచ్చు. ఆ విశ్వాసాలు సడలినా, ఆ మౌఢ్యాలు సమసినా, మొత్తం మతాచార్యులు బోర్లపడతారు. మతపీఠాలు కదిలి పోతాయి. పూజారుల పొయ్యిలో నుంచి పిల్లి లేవదు. పురోహితులు పస్తులు పడుకొన వలసి వస్తుంది. అందువల్లనే మతవిశ్వాసాలను నిరసించినా, మతమౌఢ్యాలను నిందించినా, ఈ వర్గాలన్నీ కలిసి యుద్ధం చేస్తాయి. వాటికి నాయకత్వం వహించడానికి ఒక్కొక్క మతానికి ఒక్కొక్క పేరుతో నా "జాబాలి" నాటికలోని వసిష్ఠుని పోలిన వారున్నారు, వారిని చూసి గజగజలాడేవారు జాబాలిని పోలినవారు - మరింత హెచ్చుగా ఉన్నారు. కోపర్నికస్, గెలీలియో, పోంపొనాట్సీ, బుఫాన్ ప్రభృతులతో జాబాలి పోలికకు నిలవ లేనివాడు. ఆ మహామహులే మతాచార్యులకు, మతాధిపతులకు భయపడి, తాము నిజమని నమ్మినదాన్ని - నిజమని నిరూపించిన దాన్ని కప్పిపుచ్చి, కల్లలాడగా, కపటం చేయగా, జాబాలి అదే పనిని చేయడంలో వింత లేదు, విడ్డూరం మొదలే లేదు. ప్రాణత్యాగం చేయవలసి వచ్చినా, తాము నిజమని నమ్మినదాని విషయంలో కడవరకు నిబ్బరంగా, నిశ్చలంగా నిలిచినవారు - సోక్రటీజ్ ను పోలినవారు - మానవ చరిత్ర మొత్తంలో ఎందరో లేరు.

నిజానికి జాబాలి నాస్తికుడే. అతడు నా దృష్టిలోనే కాదు, జర్మన్ పండితుడు వాల్టర్ రూబెన్ దృష్టిలో సయితం నిశ్చయంగా నాస్తికుడే. తనకు అవకాశం దొరికినప్పుడు రాముని తనవైపుకు, తన విశ్వాసాల వైపుకు తిప్పుకొనగల నేమో అని ఒక ప్రయత్నం చేసి చూశాడు. అది ఫలించలేదు. పైగా తాను చేసిన పనివల్ల తనకు ముప్పు తప్పదన్న బెదురు పుట్టింది. వెంటనే ధోరణి మార్చివేసి "అబ్బే! నేను ఆడింది నాటకం మాత్రమే! నీ ఆస్తిక విశ్వాసాలను పరీక్ష చేయడానికి ప్రయత్నం చేశాను" అని అబద్ధా లాడాడు. ఇది అతడి జీవితం పూర్వాపరాలకు, అతడి మానసిక ప్రవృత్తికి సహజమైన ప్రవర్తన. దాన్ని సహజంగా చూపక, అతడిని సోక్రటీజ్ వలె నేను చిత్రిస్తే, అది తప్పు కాదా? నిజానికి నాస్తికుడైన వ్యక్తిని ఆస్తికునివలె చిత్రించడమైనా తప్పు కాదా?

నన్ను, నా పీఠికను విమర్శించినవారిని ఇంత దీర్ఘంగా నేను వ్రాసిన విషయాలు మార్చ లేకపోతే, మరింతగా నేను వ్రాసినా, వారు మారరు. అందువల్ల ఇంతటితో విరమిస్తాను.

అయితే! చెప్పవలసిన మాట మరొక్కటి మిగిలింది. “జాబాలి" నాటికను నా యువమిత్రుడు, రచయిత "హరిహరప్రియ” కన్నడ భాషలోకి అనువదించాడు. తక్కిన భారతీయ భాషలలోకి కూడా ఇది వెళ్ళితే, అది నాకు ఎంతైనా సంతోషాన్ని కలిగించగలదు. ఏ విప్లవమైనా ప్రారంభం కావలసింది మనసులోనే. అట్టి మానసికవిప్లవానికి ఈ రచన రవ్వంత తోడ్పడగలదని నేను నమ్ముతున్నాను.

“లుంబిని" బంజారా హిల్స్,హైదరాబాద్,16-10-1981, నార్ల వెంకటేశ్వరరావు

ఏకాంక రూపకం

పాత్రలు : రాముడు : కోసల దేశాధిపతి దశరథుని జ్యేష్ఠపుత్రుడు
జాబాలి : దశరథుని పురోహిత వర్గానికి చెందిన వ్యక్తి
వసిష్ఠుడు : దశరథుని ప్రధాన పురోహితుడు

రంగం : చిత్రకూట పర్వత సమీపంలో మందాకినీ నదీతీరాన రసాలసాలం నీడలో.

సమయం: చైత్రమాసంలో ఒక ప్రాతఃకాలం.

రాముడు పదిహేడు సంవత్సరాల నవయౌవనుడు. ఆజానుబాహుడు, స్ఫురద్రూపి. పురాతన వ్యవస్థలో, దాని పరిమిత లక్ష్యాలలో ప్రగాఢ విశ్వాసమున్న వ్యక్తిత్వం. మనస్సులో చెలరేగుతున్న సంక్షోభాన్ని సూచించే మానవదనం. నారపంచె, ఉత్తరీయం, కోదండం, తూణీరం - ఇవి రాముని వేషభూషలు.

జాబాలి షష్టిపూర్తి చేసుకున్న వయోవృద్ధుడు. తెల్లని పంచె, ఉత్తరీయం, గోష్పాదమంత జుట్టు, ముఖాన గంధతిలకం. వసిష్ఠుడు జాబాలికంటె పదేళ్ళు పెద్ద. అయినా, ఆరోగ్యంలో, శరీరదార్ఢ్యంలో జాబాలిని మించినవాడు. భుజాలపైకి వాలుతున్న తెల్లనిజుట్టు, పొడుగు పాటి బవిరిగడ్డం, మెడలో రుద్రాక్షమాలలు, చేతిలో కమండలం, కాళ్ళకు పావుకోళ్లు, తెల్లనిపంచె, ఉత్తరీయం.

తెర లేచినప్పుడు జాబాలి మందాకినీతీరంలో నవపల్లవ శోభిత రసాలసాలం నీడలో నిలిచివుంటాడు. ఎవరి రాకకోసమో దారికాస్తున్నప్పటి ఆతురత ఆయన ముఖంలో కానవస్తూవుంటుంది. దృష్టి మాంద్యం ప్రవేశించినందున, అరచేతిని దొప్పగా చేసి, కంటి నొసల పైగా వుంచుకొని, మునివేళ్ళపై కొద్దిగా లేచి, రెండు, మూడుసార్లు చిత్రకూట పర్వతంవైపు తేరిపారజూస్తాడు. మధ్యమధ్య తన పరిసరాల పైకి ఆయన దృష్టి పోతూవుంటుంది.

రాముడు అల్లంత దూరాన కనబడగానే విప్పారిన ముఖంతో జాబాలి నాలు గడుగులు ముందుకు వేస్తాడు.

జాబాలి : (చెట్టు నీడలోకి దారితీస్తూ) రా, నాయనా! ఇటురా! ప్రొద్దున్నే నిన్నెంత దూరం రప్పించాను! ఇటు ఈ రసాలసాలం నీడలోకి రా! బాలార్క కిరణాలలో దీని నవపల్లవాలు ఎలా మిలమిల మెరిసిపోతున్నాయో చూడు! (రాముడు దగ్గరకు రాగా) అటు చూడు, రాఘవా! ఆకుపచ్చ మేలిముసుగు కప్పుకున్న పదహారేళ్ళ పడుచులా చిత్రకూట పర్వతం ఎన్ని సొగసులు చూపుతున్నదో, ఎన్ని వయ్యారాలు పోతున్నదో! (మరొక పక్కకు వేలెత్తి చూపుతూ) ఈ మందాకిని సంగతి సరేసరి! తల్లి కాళ్ళను చుట్టవేసుకునే పసిదానివలె నవ్వుతూ, కేరుతూ రాళ్ళ గుండా ఎలా ప్రవహిస్తున్నదో! చూడగల కళ్లుంటే, ఇదే స్వర్గం కాదూ? ఏ స్వర్గమైనా ఇంతకంటే అందంగా వుంటుందా, ఆనంద దాయకంగా వుంటుందా?

రాముడు : (చికాకుగానే) ఈ సంకేత స్థలానికి నన్ను మీరు రమ్మన్నది వసంతశోభ వర్ణనకేనా? ఇదేనా మీరు చెప్పగోరిన పరమ రహస్యం?

జాబాలి : నాకు తెలుసు రామచంద్రా! నీ మనస్సు ఎంత భేదపడుతున్నదో! శిశిరశైథిల్యం నీ వదనంలో ప్రస్ఫుట మౌతున్నది. శిశిరం పోకమానదు; వసంతం రాకమానదు. ప్రకృతి పదే పదే చాటే ఈ నిత్యసత్యాన్ని గుర్తు పెట్టుకుంటే ఎంతటి కష్టకాలంలోనైనా మన కర్తవ్యాన్ని మనం శాంతంగా నిర్ణయించుకోగలం!

రాముడు : మా ప్రియజనకుల ఆకస్మిక నిర్యాణంతో సంక్షోభపడుతున్న నా మనస్సుకు అంత సులభంగా శాంతి లభించదు లెండి! మీరు చెప్పగోరిన రహస్య మేమిటి?

జాబాలి : పెద్ద రహస్య మేదీ లేదు, రాఘవా! నీకు హితాన్ని చెప్పగోరాను - అంతే! నీకు హితమైంది, అన్యులకు అహితం కావచ్చు; ముఖ్యంగా, మన వసిష్ఠులవారికి. ఆయన సామాన్యుడా? కోసల దేశంలోనే కాదు, మొత్తం ఆర్యావర్తంలోనే ఆయన కెదురు లేదు. ఆయన పగబడితే నాకు, నా కుటుంబానికి తలదాచుకోడానికైనా చోటు మిగలదు.

రాముడు : ఆయన పరమ శాంతస్వభావులు. ఆయ నేమిటి? పగపట్టడ మేమిటి? జాబాలి : ఆయన సంగతి నీకు తెలియదులే, నాయనా!

రాముడు : మీరు చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు!

జాబాలి : నీ వింకా చిన్నవాడివి, రాఘవా! నీకు జీవితానుభవం తక్కువ. తెల్లని వన్నీ పాలు కావు; నల్లని వన్నీ నీళ్లు కావు.

రాముడు : (నిగ్గదీస్తున్నట్టు) ఇంతకూ మీరు చెప్పగోరిన దేమిటి?

జాబాలి : మరేమీ లేదు, నాయనా! నా మాట విని, భరతుని ప్రార్థన మన్నించు! అయోధ్యకు మరలి రా! పట్టాభిషేకం చేసుకో! ప్రజలను న్యాయంగా, ధర్మంగా పరిపాలించు!

రాముడు : (చికాకుగా) ఇంతేనా మీరు చెప్పగోరింది? ఇందుకేనా ఏకాంతాన్ని అభిలషించింది? అందరి సమక్షంలోనే ఈ మాట చెప్పవచ్చునే! వసిష్ఠులవారైనా నిన్న మా భరతుని విన్నపాన్ని బలపరచలేదా?

జాబాలి : (చిరునవ్వుతో) కిటుకు అక్కడే వున్నది, నాయనా! నీవు దాన్ని గ్రహించడం లేదు. భరతుని మనస్సు తెలుసుకొన్న మీదటనే కాదా ఆయన బయటపడింది? అంతకు ముందు ఎటూ చెప్పకుండా గుంభనగా వుండలేదా?

రాముడు : మీకు తెలియకపోవచ్చుగాని, నారచీర కట్టుకు తీరాలని సీతను నిర్బంధించిన మా పినతల్లిని వసిష్ఠ మహర్షులు గట్టిగా మందలించారు.

జాబాలి : ఆ కోపం ఆమె నిన్ను వనవాసానికి పొమ్మన్నప్పుడు ఏమై పోయిందో!

రాముడు : మీ మాటల కేమిలెండి? వసిష్ఠపుత్రులు సుయజ్ఞులు ఆది నుంచీ నన్ను అభిమానిస్తూనే వున్నారు.

జాబాలి : ఔనౌను! ఆయన మరొక కుమారుడు కైకేయిని సమర్థిస్తూ వచ్చినట్టే!

రాముడు : వసిష్ఠ మహర్షుల సమ్మతితో అది జరిగివుండదు.

జాబాలి : (నవ్వి) ఎంతటి అమాయకుడవు, నాయనా! రామభరతులలో ఎవరు రాజ్యానికి వచ్చినా, రాజపౌరోహిత్యం తమ కుటుంబంలోనే మిగలవద్దా? అందుకే తాను తటస్థంగా వుంటూ, తన కుమారులను ఉభయపక్షాల మధ్య ఆయన సమానంగా పంచారు!

రాముడు : పరమ పూజ్యులైన వసిష్ఠ మహర్షులు అంతపని చేశారంటే నేను నమ్మను.

జాబాలి : నీవు నమ్మినా, నమ్మకపోయినా నిజ మంతే! సాటిలేని లోకజ్ఞుడు కనుకనే ఎప్పటికప్పుడు ఆయన నట్టిల్లు బంగారమౌతున్నది.

రాముడు : అదేమిటి?

జాబాలి : ఏమీ తెలియనట్టు మాట్లాడతావేమి, నాయనా? వనవాసానికి నిర్ణయించుకోగానే సుయజ్ఞుని పిలిపించి అతడిని నీవెంత ఘనంగా సత్కరించలేదు! అర్ఘ్యపాద్యాలతో స్వయంగా పూజించి, అతడికి సువర్ణ కేయూరా లిచ్చావు;

రత్నకుండలాలిచ్చావు; వజ్రహారా. లిచ్చావు. అతడి భార్యకు కాన్కగా జానకి దివ్యాభరణాలన్నీ మూటగట్టి పంపించావు. మేనమామ నీకు బహూకరించిన గజేంద్రాన్ని వారి వాకిటిలో కట్టివేయించావు. చివరికి మీ ముత్యాల పందిరిపట్టెమంచాన్ని కూడా వారికి ముట్టజెప్పావు.

రాముడు : వారికే కాదు; ఇతరులకు సయితం మేము యాత్రాదానాలను విశేషంగానే చేశాము.

జాబాలి : నిజమే! యాత్రాదానాల పేరుతో ఈ జాబాలికే ఏమంత దక్కలేదుగాని, అగస్త్య, కౌశికులకు కూడా పుష్కలంగానే ముట్టింది.

రాముడు : సరే! ఇప్పటికి తెలిసింది - మీకు పుష్కలంగా ముట్టలేదన్న బాధే మీ పలుకు లన్నింటికి మూలం! -

జాబాలి : లేదు, రాఘవా! లేదు. రాజాస్థానంలో నా స్థానం నాకు తెలుసు! వసిష్ఠుల వారికున్న పేరు నాకు లేదు; అగస్త్య, కౌశిక, సుయజ్ఞులకున్న బలం నాకు లేదు. ఎవరైనా నన్నెందుకు కూడగట్టుకోవాలి?

రాముడు : బలవంతులైన వారిని కూడగట్టుకొనడానికే వారికి నేను విరివిగా యాత్రాదానాలు చేశానంటారా? ఇది నాకు దురాలోచన అంటగట్టడమే కాదా?

జాబాలి : దురాలోచన కాదు, నాయనా, దూరాలోచన! ఈ విషయంలో నీకంటే మా జానకి చాలా దిట్ట. తన దివ్యాభరణాలను సుయజ్ఞుని పత్నికి పంపించవలసిందిగా ప్రక్కనుండి నీకు ప్రేరణ చేసింది ఆమె కాదా? అప్పటికి భరతుని వైఖరి తెలియదయ్యె! వనవాసానంతరమైనా సింహాసనం మీకు సంక్రమిస్తుందో, లేదో తెలియదయ్యె! ఆ పరిస్థితిలో అయోధ్యలో శక్తిమంతులైన వారిని మీకు సుముఖులుగా నిలుపుకువెళ్ళడం ఎంత ముఖ్యావసరమో ఆమె గుర్తించింది.

రాముడు : (తీవ్రంగా) వసిష్ఠ మహర్షులకే దుశ్చింత లంటగట్టుతున్న మీరు మాబోంట్ల విషయంలో ఏమైనా అనగలరులెండి!

జాబాలి : నన్ను అపార్థం చేసుకోబోకు, రాఘవా! మీ కుటుంబ కలహాలు.... రాముడు : మా కుటుంబంలో కలహాలు లేవు.

జాబాలి : ఈనాడు లేకపోవచ్చు గాని, ఇంతకు ముందు లేవా? కైకేయీ కౌసల్యల వైషమ్యాలు మీ తండ్రికి, మీ రాజ్యానికి ఎన్ని తిప్పలు తేలేదు?

రాముడు : సపత్నుల మధ్య ఎంతో కొంత సంఘర్షణ ఎక్కడైనా తప్పదు.

జాబాలి : మీ తండ్రికి మున్నూట యేబదిమంది భార్యలుండగా, కైకేయీ కౌసల్యల మధ్యనే విరోధా లెందుకు ప్రబలాలి? అవి మీ తండ్రి ప్రాణా లెందుకు తియ్యాలి? ఏమైనా ఆయన విషాదానుభవం నిన్ను ఏకపత్నీవ్రతుని చేస్తుందనే నా నమ్మకం!

రాముడు : మీరింత చిత్రమైన వ్యక్తులని నాకింతకు ముందు తెలియదు సుమండీ!

జాబాలి : నా మాట కేమిలే, నాయనా! బ్రతికి నన్నాళ్ళు మరి బ్రతకబోతానా? సిరి సంపత్తులకు నా కెట్టి కొదవా లేదు. వసిష్ఠుల వారివలె కుబేరుడను కాకపోయినా, ఒక పది తరాలవరకు అన్నవస్త్రాలకు లోటు రాదు. ఇంకా కూడబెట్టాలన్న ఆరాటం నాకు లేదు. నేను కోరేది నీవు, నీ ప్రజలు సుఖంగా వుండాలనే! నీవూ, నీ రాజ్యమూ కీర్తి ప్రతిష్ఠలతో.... (తుళ్ళిపడి మాట మధ్యలో ఆగిపోతాడు.)

రాముడు : త్రుళ్ళిపడ్డా రేమిటి?

జాబాలి : (కలవరపాటుతో వెనుదిరిగి చూస్తూ) అది పావుకోళ్ళ చప్పుడు కాదూ? రాముడు : (ఆలకించి) కాదు. వడ్రంగి పిట్ట-అదుగో ఆ వెనక-ఆ చెట్టుకొమ్మను ముక్కుతో పొడుస్తున్నది.

జాబాలి : (తెప్పరిల్లి) అలాగాఁ! వసిష్ఠులవారి పావుకోళ్ళ చప్పుడేమొ అనుకున్నాను. రాముడు : ఆయనంటే మీకింత భయం దేనికి?

జాబాలి : ఆయన ప్రతాపం ఎలా వెలిగిపోతున్నదో నీకు తెలియదు రాఘవా! (తల పంకించి) ఈ పిట్టలవలె నిశ్చింతగా బ్రతకగల స్థితికి నరుడెప్పటికి రాగలడో ! గొంతెత్తి ఆ కోకిల ఎంత మధురంగా పాడుతున్నదో ! పురి విప్పి ఆ నెమలి ఎంత అందంగా ఆడుతున్నదో! వాటికి మత మౌఢ్యాలు లేవు. స్వర్గ ప్రలోభం లేదు; నరక భీతి లేదు. జీవితంలో ప్రతిక్షణం వాటికి ఒక మధురానుభూతి, ఒక మహదానంద గీతి!

రాముడు : తిరిగి మీరు ప్రకృతి ప్రశంసలో పడుతున్నారు. అందుకిది సమయం కాదు.

జాబాలి : మన్నించు, రాఘవా! ఇది నా దౌర్బల్యం. సరే! - ఏమంటూవుంటిని? ఆc ! (పాతమాట జ్ఞాపకం తెచ్చుకోవడానికి కొన్ని క్షణాలు ప్రయత్నించి మరిలాభం లేదనుకొని) సరే! అదేమైతే నేమిలే! భరతుడు మంచిగుణాన వుండబట్టి, రాజ్యాన్ని నీకు అప్పగించడానికి వచ్చాడు. అందుకు నీ విప్పుడు సమ్మతించకపోతే, అతని మనస్సు మారవచ్చు. అందువల్ల నీ లేనిపోని చిక్కులు, చికాకులు కలగవచ్చు.

రాముడు : భరతుని విషయంలో మీ కున్న సందేహం నాకు లేదు.

జాబాలి : మానవచిత్రాలు చంచలాలు, నాయనా! ఇది నామాట కాదు; మీ తండ్రి మాటే! ఆయన దీన్ని నీకు చెప్పింది కూడా భరతుని ప్రసక్తి వచ్చినప్పుడే! "నీ తమ్ముడు భరతుడు నీ అభిషేక వార్త వింటే సంతోషించక పోడుగాని, అతడు మేనమామ యింటినుంచి మరలి వచ్చేలోగానే నీ యౌవరాజ్య పట్టాభిషేకాన్ని ముగించడం ఎందుకైనా మంచిదని ఆయన నిన్ను హెచ్చరించ లేదా?

రాముడు : ఎవరికైనా భరతుని స్వభావం ఇప్పటికిగాని పూర్తిగా తెలిసి రాలేదు.

జాబాలి : భరతుడు స్వయంగా మంచివాడే! కాని, పదునాలుగేండ్లు రాజ్యం చేసినతర్వాత దాన్ని చేజేతుల విడిచి పెట్టుకొనడం ఎంతవానికైనా కష్టం. పైగా, ఈలోపల కైకేయి అతనికి దుర్బోధలు చేయవచ్చు.

రాముడు : ఆమె మనస్సు ఇప్పుడు పూర్తిగా మారింది.

జాబాలి : కాని, ఇంతకాలంగా ఆమె పక్షం వహించి, ఆమెద్వారా విశేష ధనలాభం పొందుతూ వచ్చినవారు తిరిగి ఆమెకు దుర్బోధలు చేయవచ్చు; భూపతిగా భరతునే స్థిరపరచడానికి ప్రయత్నించవచ్చు. అప్పుడు మీ సోదరుల మధ్య అంతర్యుద్ధం ప్రజ్వలించవచ్చు.

రాముడు : మా సోదరుల స్వభావం మీకింత చక్కగా తెలుసు నన్నమాట.

జాబాలి : రాజ్య ప్రలోభం చాలా చెడ్డది, రాఘవా! అన్నదమ్ముల మధ్యనైనా అది విషం చిలక గలదు, తండ్రి బిడ్డల మధ్యనే చిచ్చు పెట్టగలదు.

రాముడు : మా విషయంలో మాత్రం కాదు.

జాబాలి : అంత నిశ్చయంగా చెప్పడానికి వీలులేదు, నాయనా! స్వలాభాపేక్షతో కాకపోవచ్చు; కేవలం నీపట్ల ప్రేమ విశ్వాసాలతోనే కావచ్చు. అయినా, నీకు రాజ్యాన్ని కట్టబెట్టడానికై లక్ష్మణుడు మీ తండ్రిని వధిస్తాననలేదా? భరతుని సంహరిస్తాననలేదా? అవసరమైతే అయోధ్యా నగరాన్నే నిర్మానుష్యంచేస్తా ననలేదా?

రాముడు : అతడు మహోద్వేగి.

జాబాలి : అయితే, మీ తల్లి సంగతి? మీ తండ్రిని తుదముట్టించి, నీకు పట్టాభిషేకం చేస్తానని లక్ష్మణుడంటే ఆమె హర్షించలేదా?

రాముడు : (తీవ్రంగా) చాల్చాలు! మీ నిందలు మితిమీరి పోతున్నాయి.

జాబాలి : ఆగ్రహింపకు, రాఘవా! మీ తండ్రి కాలు చేతులు విరిచికట్టి, పగతుని చంపినట్టు చంపి, రాజ్యం నీకు కట్టబెడతానని లక్ష్మణు డనగా-నీతల్లి అతడిని వారించిందా? - పై పెచ్చు, "నీ తమ్ముని పలుకులు నీకు సమ్మతమైతే ఆ విధంగానే జరిపించు!" అని నీకు హితబోధ చేయలేదా?

రాముడు : తాత్కాలిక దుఃఖోద్వేగంతో ఆమె పలికిన పలుకులకు మీరు దుష్టతాత్పర్యం తీస్తున్నారు.

జాబాలి : ఆ దుష్టత్వం రాజ్య ప్రలోభంలోనే వున్నది, నాయనా! అదెంత చెడ్డదో తెలిసినవాడు కాబట్టే, మీ తండ్రి నీకు యౌవరాజ్య పట్టాభిషేకాన్ని తలపెట్టడానికి ముందు భరతుని మేనమామ యింటికి పంపించివేశాడు. బాగా

రాముడు : ప్రతివ్యక్తిలో, ప్రతిచర్యలో దుశ్చింత తప్ప అన్యం మీకు కనబడదా?

జాబాలి : ఆయన భరతుని పంపించివేయడం దుశ్చింతతో కాదు, సచ్చింతతోనే! “నా కుమారునికే రాజ్య” మంటే “నాకుమారునికే రాజ్య” మని కైకేయీ కౌసల్యల మధ్య కక్షలు ఎంతగా పెరిగిపోయినవో ఆయనకు తెలుసు. కక్షలు రాణివాసం నుంచి రాజాస్థానానికి, అక్కడనుంచి రాజధాని నగరానికి, అంతటితోనైనా ఆగక, మొత్తం కోసలదేశానికి చిలవలు పలవలుగా అల్లుకు పోయాయని ఆయనకు తెలుసు. అందువల్లనే ఎందుకైనా మంచిదని ముందుగా మేల్కొన్నారు!

రాముడు : మీ దురూహల కేమిలెండి! భరతుని కేకయ పురానికి పంపినప్పుడు నాకు యౌవరాజ్య పట్టాభిషేకం చేయాలన్న తలంపైనా ఆయనకు లేదు. తర్వాత దుస్స్వప్నం కలిగినందున ఒక నిర్ణయానికి వచ్చారు.

జాబాలి : మనస్సులో ఏదో పెద్ద కలత లేకపోతే దుస్స్వప్నం కలుగుతుందా? రాముడు : అది మీకే తెలియాలి?

జాబాలి : పోనీ - నాయనా! - ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు! నీ యౌవరాజ్య పట్టాభిషేకాన్ని గురించి అందరు రాజులకు వర్తమానం చేసిన మా తండ్రి కేకయ మహారాజు అశ్వపతిని ఎందుకు విడిచి పెట్టారు?

రాముడు : అంత దూరం వర్తమానం చేయడానికి వ్యవధి లేనందునే! అదే కారణాన జనక మహారాజు వద్దకు కూడా వార్తాహరులను పంపలేదు.

జాబాలి : (నవ్వి) అదే కారణాన! పదిహేడేళ్ళు వచ్చినా నీ కింకా పసితనం పోలేదు!

రాముడు : (తీవ్రంగా) అయితే, మీ విపరీత బుద్ధికి తోస్తున్న విపరీత కారణ మేదో సెల విస్తారా?

జాబాలి : అశ్వపతి మహారాజుకు వర్తమానం చేరితే, ఆయన భరతుని వెంటబెట్టుకుని అయోధ్యకు హుటాహుటిగా రావచ్చునని, వచ్చి, నీ పట్టాభిషేకానికి విఘాతం కలిగించవచ్చునని నీ తండ్రి భయపడ్డాడు.

రాముడు : మరి జనక మహారాజుకు ఎందుకు వర్తమానం చేయలేదు? ఆయన వచ్చి, పట్టాభిషేకం నిలిపివేయించే ప్రమాదం లేదే!

జాబాలి : ఈయనను పిలువనంపి ఆయనను విడిచి పెడితే, అది లోకానికి విడ్డూరంగా కనబడుతుందని ఉభయులను విడిచి పెట్టారు!

రాముడు : మీ కుశాగ్రబుద్ధికి చాలా సంతోషం! కేకయ పురానికి ఉత్తమాశ్వాల పై వార్తాహరులను పంపించినా ప్రయాణానికి హీనపక్షం ఏడు రాత్రులు పడుతుంది. వార్త నందుకొన్నవారు వెంటనే బయల్దేరినా, అయోధ్యకు చేరడానికి మరొక వారం కావాలి. అనుకొన్న మర్నాడు జరగవలసిన పట్టాభిషేకానికి కేకయ మహారాజును పిలవడం ఎలా సాధ్యం?

జాబాలి : అంత అవ్యవధిగా పట్టాభిషేకానికి ముహూర్తాన్ని నిర్ణయించడాన్ని బట్టి తెలియడం లేదా? నాయనా! విఘ్నాలను గురించిన సంకోచా లేవో మీ తండ్రి మనస్సును పీడించాయని! “ఇట్టి కార్యాలు తల పెట్టినప్పుడు విఘ్నాలనేకం సహజంగానే సంభవించవచ్చు” నన్న భయాన్ని ఆయన నీ వద్ద వెల్లడించలేదా? అన్నట్టు, మరొకమాట మర్చిపోయాను. కేకయపురం, పోనీ, అందుబాటులో లేదనుకో! కైకేయినగరు కూడా అందుబాటులో లేదా? అయోధ్యావాసు లందరు విన్న తర్వాతనే మంధర ద్వారా నీ పట్టాభిషేక వార్తను కైకేయి ఎందుకు వినవలసి వచ్చింది? -

రాముడు : (కోపంగా) మీ పలుకులు రానురాను మరింత దుస్సహంగా పరిణమిస్తున్నాయి. మరిచాలు! నేను పోయివస్తాను! (రాముడు వెనుకకు తిరిగి నాలుగడుగులు వేస్తాడు).

జాబాలి : కోపగించి వెళ్ళిపోబోకు, నాయనా! (రాముడు ఆగుతాడు) మనస్ఫూర్తిగా నీ హితాన్నే నేను కోరుతున్నాను. నీ

నుంచి నాకు రత్నాభరణాలు వద్దు; గజేంద్రాలు వద్దు; హంసతూలికా తల్పాలైనా వద్దు. నీవూ, నీవారూ పదికాలాలపాటు సుఖంగా వుంటే నా కదే పదివేలు.

రాముడు : (దూరంగా నిలిచి) ఎవరి ప్రసక్తి వస్తే వారికి దుశ్చింత లంటగట్టడం తప్ప మీరు నా కేమి చెప్పగోరుతున్నారో తెలియడం లేదు.

జాబాలి : నీ ధనుర్విద్యాభ్యాసం, నీ మృగయావినోదం - ఇవి తప్ప నీ కింతవరకు వేరొక ధ్యాసే లేదు. అందువల్లనే రాజాస్థానాలలో ఎంత కల్మషం ఉంటుందో నీకు తెలియదు, రాఘవా!

రాముడు : (కఠినంగా) మీ పలుకులను బట్టి ఆ కల్మషం మీ నరనరంలో జీర్ణించిపోయినట్టు తోస్తున్నది.

జాబాలి : (కొంత బాధతో) అంత పని జరిగివుంటే వసిష్ఠుల వారివలె నిమ్మకు నీరెత్తినట్టుగానే ఉండేవాణ్ణి. కల్లపట్ల, కపటంపట్ల, కాలుష్యం పట్ల నాకు ఈ జుగుప్స దేనికి, ఈ బాధ దేనికి?

రాముడు : సరే! మీరు చెప్పగోరుతున్నది మూడే మూడు ముక్కలలో చెప్పండి.

జాబాలి : నీ వింత తొందరపడితే నేను మాత్రం చేయగలిగిన దేమున్నదిలే! వెళ్ళిరా, నాయనా!

రాముడు : కాదు, చెప్పండి!

జాబాలి : అయితే, దగ్గరికి రా!

రాముడు : (రెండడుగులు మాత్రం ముందుకు వేస్తూ) చెప్పండి!

జాబాలి : సరే! నాయనా! తిరిగి కుటుంబ కలహాలు తలయెత్తరాదంటే, రాజధానికి మరలివచ్చి, పట్టాభిషేకం చేసుకో!

రాముడు : (కొంత చులకనగా) వస్తానులెండి - పదునాలుగేండ్ల తర్వాత, అప్పుడు తమరే నాకు పట్టాభిషేకం చేయించవచ్చు.

జాబాలి : వనవాసం విషయమై నీవంత పట్టుదలగా వుంటే, పట్టాభిషేకాన్ని చేసుకొన్న తర్వాత దాన్ని ముగించరాదా? నేను చెప్పినట్టు చేస్తే, రాజ్యానికి కనీసం నీ వారసత్వం ధ్రువపడుతుంది.

రాముడు : అన్యథా కాదా?

జాబాలి : కాకపోవచ్చు.

రాముడు : ఎందువల్ల?

జాబాలి : కేకయరాజు అశ్వపతికి మీ తండ్రి చేసిన వాగ్దానం వల్ల,

రాముడు : ఆయనకు ఈయన వాగ్దాన మేదీ చేయలేదే!

జాబాలి : చేయకేమి?

రాముడు : ఎప్పుడు? ఏమని?

ఆ జాబాలి : నీకు తెలుసు గదా మీ తండ్రికి చాలాకాలంపాటు సంతాన భాగ్యం లేదని. లోపం తీర్చుకోవడానికే ఆయన కైకేయిని చేపట్టగోరాడు. అందుకు సమ్మతించడానికి ముందు, తనకు దౌహిత్రుడు కలిగితే, అతనికే రాజ్య మిస్తానన్న వాగ్దానాన్ని అశ్వపతి కోరాడు. అందుకు మీ తండ్రి సమ్మతించాడు.

రాముడు : (ఆశ్చర్యంగా) ఈ మాట నా కెవ్వరూ చెప్పలేదే! ఇది నా తల్లికి తెలుసా?

జాబాలి : ఆమెకు తెలియకపోవచ్చుగాని, కైకేయికి తెలుసు.

రాముడు : అయితే, ఏదో యుద్ధంలో మా తండ్రి తన కిచ్చిన రెండు వరా లంటుందే తప్ప, దీని సంగతి ప్రస్తావించదేమి?

జాబాలి : దీన్ని బయట పెట్టనని ఆమె మీ తండ్రికి ఏదైనా సందర్భంలో మాట యిచ్చి ఉండవచ్చు.

రాముడు : ఆమె సయితం ఈ వాగ్దానాన్ని ఇంత గోప్యంగా ఉంచగా, మీ కెలా తెలిసింది?

జాబాలి : వసిష్ఠులవారు చెప్పగా తెలిసింది.

రాముడు : ఎప్పుడు?

జాబాలి : పరమ రహస్యమంటూ పదేళ్ళనాడు నా చెవిని వేశారు.

రాముడు : ఆయన నా కెందుకు చెప్పలేదో!

జాబాలి : అది నన్నడగ వలసిన ప్రశ్న కాదు.

రాముడు : (ఆలోచనా ముద్రతో) నేను జ్యేష్ఠుడనైనా నాకు యౌవరాజ్య పట్టాభిషేకం చేయాలనే నిశ్చయానికి రావడానికి మా తండ్రి భయసంకోచాలను ఎందుకు చూపుతూ వచ్చారో ఇప్పుడు నాకు తెలుస్తున్నది!

జాబాలి : ఔను, నాయనా! భయసంకోచాలతోనే, శోక విచారాలతోనే పాపం! ఆ మహారాజు జీవితం వెళ్ళమారిపోయింది. పుత్రులు కలగనంత వరకు వారు కలగలేదని ఆయన పరితాపపడగా, వారు కలిగిన తర్వాతనైనా ఆయనకు సుఖ సంతోషాలు కరవైపోయాయి! ఒక వైపున నీపట్ల ప్రత్యేకానురాగం, మరొకవైపున - వాగ్దానభంగభీతి - ఈ మానసిక సంఘర్షణతో ఆయ నెంత వ్యధ చెందేవారో నాకు తెలుసు! ఈ విషయం తెలియనివారు ఆయన చపలచిత్తు డనేవారు, కామాంధు డనేవారు. దౌర్భాగ్యవశాన ఆయన చిక్కుకున్న ప్రత్యేక పరిస్థితులలో ఒక స్థిర నిర్ణయానికి త్వరగా రావడం మాటలా? నిన్ను గురించి నీ తల్లి పట్టుపడితే, ఆయన కైకేయి నగరులో తలదాచుకునేవారు; అక్కడ భరతుని విషయమై ఆమె నిగ్గదీస్తే, తిరిగి నీ తల్లి నగరుకు పారిపోయి వచ్చేవారు. కామాంధుడై అంతఃపురాలలోనే పొద్దుపుచ్చు తున్నాడన్న నింద వస్తున్నదని కొలువు తీర్చి కూర్చుంటే, అమాత్య, పురోహిత బృందాల లోని ఇరువర్గాల వారు చెరొక ప్రక్కకు ఆయనను గుంజుతూ ఉండేవారు. సుమంత్ర, సిద్ధార్థులు, అగస్త్య, కౌశిక, సుయజ్ఞులు ఆయనను నీవైపుకు గుంజగా మరికొందరు భరతునివైపుకు! ఇంటా, బయటా ఎక్కడా శాంతి సౌఖ్యాలకు నోచుకోలేక ఆయన లోలోపల కుమిలిపోతుంటే చూడలేక నా గుండె తరుక్కుపోయేది! వసిష్ఠుల వారు మాత్రం ఏమీ గమనించనట్టే నటించేవారు.

రాముడు : (గాద్గదికంగా) నే నెంత మందబుద్ధినో! - ఆయన మనోవ్యధను గుర్తించలేక పోయాను.

జాబాలి : గుర్తించడానికి ఆయన నీ కవకాశ మిచ్చిన దెక్కడలే! అంతకుముందు నీవు కళ్ళముందు మసలకపోతే ఆయనకు తోచేది కాదు. కాని, యౌవరాజ్య పట్టాభిషిక్తుడవు కావడానికి నీకు యుక్తవయస్సు దగ్గరపడిన కొద్దీ నిన్ను చూస్తేనే చాలు, అశ్వపతికి తాను చేసిన వాగ్దానం ఆయనకు జ్ఞాపకం వచ్చేది, కళ్ళు చెమ్మగిలేవి, ముఖం ప్రక్కకు త్రిప్పుకుని చెక్కిళ్ళ తడి తుడుచుకునేవారు. నీకు ఘోరాన్యాయం చేయక తప్పదేమో అన్న దుఃఖంతోనే పోను పోను నిన్ను దగ్గరికి పిలవడాన్ని సయితం ఆయన తగ్గించివేశారు. లేకలేక కలిగిన బిడ్డవైనందున అన్నదమ్ములు నలుగురిపట్ల ఆయనకు ప్రేమానురాగా లున్నా నిన్నే తన పంచప్రాణాలుగా చూచుకొనేవారు. చివరికి ఎలాగో మనస్సు తెగించుకొని ఆయన చేసిన పట్టాభిషేకయత్నం విఫలమై పోగా, నీ వియోగాన్ని భరించలేక "రామా! రామా!" అంటూ నిన్నే తలచుకుంటూ ఆయన కన్నుమూశారు. (రాముని చెక్కిళ్ళ వెంట కన్నీరు కాల్వలు కట్టగా) వద్దు, రాఘవా! వద్దు! విలపించవద్దు! నీ వంటి ధీరోదాత్తుడు ఎంత కష్టకాలంలోనైనా కంట తడి పెట్టరాదు. (దగ్గరికి వెళ్ళి తల నిమురుతూ) గుండె చెదరక నీ విప్పుడు నీ కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలి. (తన ఉత్తరీయం చెంగుతో రాముని చెక్కిళ్ళ నద్దుతూ) కళ్ళు యెర్రబడి పోయాయి, నాయనా! ముఖం పాలిపోయింది.... ఊరుకో! నాయనా! ఊరుకో!

రాముడు : ఆయన కడసారి చూపైనా నాకు దక్కలేదు.

జాబాలి : ఆయన కడసారి కోర్కెను చెల్లిస్తే, ఆ లోటు కాస్తా తీరిపోతుంది. వెనుకకు వచ్చి పట్టాభిషేకం చేసుకో!

రాముడు : (నిశ్చయంతో) అశ్వపతికి మా తండ్రి చేసిన వాగ్దానం తర్వాత నాకు పట్టాభిషేకాధికారం లేనేలేదు.

జాబాలి : ఆ అధికారం జ్యేష్ఠునిదే; దాన్ని మీ తండ్రి భరతునికి మార్చడం న్యాయం కాదు. రాముడు : న్యాయమైనా, కాకపోయినా, ఆయన మార్చారు. ఆయన మాటను నేను గౌరవించాలి.

జాబాలి : దాని విషయమై భరతునికి పట్టింపు లేనప్పుడు నీకు దేనికి?

రాముడు : మా తండ్రి వాగ్దానం చేసింది భరతునికి కాదు, అశ్వపతికి.

జాబాలి : ఆయన దాన్ని కోరింది తన పుత్రికకోసం, తన దౌహిత్రుని కోసం. వారిద్దరు దానినుంచి నిన్ను విముక్తుని చేస్తున్నారు గదా?

రాముడు : మీ రేమైనా చెప్పండి. నేను వనవాస దీక్షను విరమించ రాదని నా అంతరాత్మ ప్రబోధిస్తున్నది.

జాబాలి : ఇందుకే నీవంటే నాకు ప్రేమ, నాయనా! ... నీ ముఖంపై ఎండ తెర పడుతున్నది. ఇవతలికి జరుగు! ఆఁ!! మరి కాస్త! ... దేనిలోనైనా సరే, ఒకసారి నీకు నమ్మకం కుదిరితే, దాని కోసం ఎంత త్యాగమైనా చేస్తావు; ఎన్ని కష్టాలైనా పడతావు. నిన్ను శిష్యునిగా పొందిన వసిష్ఠ, విశ్వామిత్రుల అదృష్టమే అదృష్టం!

రాముడు : మీ శిష్యరికం చేయడానికైనా నా కభ్యంతరం లేదు.

జాబాలి : అంత మహద్భాగ్యం నాకు లభిస్తుందా? నీ వనవాస దీక్ష నీకూ, నీ ప్రజలకు ప్రమాదకరమని నే నెంతదూరం చెబుతున్నా నీవు నా మాట వినడం లేదయ్యే!

రాముడు : మీ రింతగా భయపడవలసిన ప్రమాద మేదీ నాకు కానరావడం లేదు.

జాబాలి : నీకు పూర్తిగా తెలియదు, నాయనా! ఈ కైకేయీ కౌసల్యల మధ్య వైషమ్యాలను పెంచి, అమాత్య, పురోహిత వర్గాల వారు రాజ్యాన్ని, ప్రజలను ఎంతగా దోచుకుతిన్నారో! వా రిద్దరికి పోటీ పెట్టి, ఎక్కువ మొత్తం యెవరు చెల్లిస్తే, వారికి తమ తోడ్పాటును అమ్ముతూ పోయారు! చివరికి దాసదాసీజనం వరకు ఈ జాడ్యం పాకింది. ఈ సంగతి నీ తండ్రికి తెలుసు. నీ యౌవరాజ్య పట్టాభిషేక ముహూర్తానికి ముందు రాత్రి నిన్ను సతీసమేతంగా ఉపవాస వ్రతం చేయవలసిందిగా నిన్ను కోరిన నీ తండ్రి "నీ మేలుకోరే మిత్రు లందరు జాగరూకులై కూర్చుండి, నీ చుట్టూ కావలి కాయాలి" అని నీ నీకు చెప్పడం ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకో! అప్రమత్తంగా ఉండకపోతే, నీ నగరులోనైనా నీకు క్షేమంలేని పరిస్థితులేర్పడి ఉండకపోతే, ఆయన ఈ హెచ్చరిక చేయవలసి వచ్చేదా?

రాముడు : నా తల్లు లిద్దరి మధ్య పూర్వపు వైషమ్యా లిప్పుడు లేవు.

జాబాలి : ఏమో, ఎలా చెప్పడం? భర్త శవం పైగా తన కుమారుని గద్దె నెక్కించడానికి కైకేయి సిద్ధపడింది. తండ్రిని చంపి నీవు రాజ్యాన్ని చేజిక్కించుకున్నా సంతోషించే స్థితికి కౌసల్య వచ్చింది. ఇంతగా వెర్రితలలు వేసిన ఈ వైషమ్యాలు అంత తేలికగా సమసిపోతాయా? సమసిపోకుండా వాటిని నిలపడానికి ఇంతవరకు వాటి ద్వారా విశేషలాభం పొందుతున్న వారు తప్పక ప్రయత్నిస్తారు; అరాజక చిహ్నాలు, దుర్భిక్ష సూచనలు ఇప్పుడిప్పుడే తలయెత్తుతున్న కోసలరాజ్యం అధోగతి పాలైపోతుంది.

రాముడు : ఎట్టి పరిస్థితులనైనా యెదుర్కొనగలపాటి సమర్థుడే మా భరతుడు.

జాబాలి : ఏమో, నాకు నమ్మకం లేదు రాఘవా! అత డెంత సజ్జనుడో అంత సాధువు.

రాముడు : నాకు సరిగా తెలియకపోవచ్చు అతడు సకల ధర్మశాస్త్ర పారంగతుడు; శాస్త్రానుసారంగా పరిపాలన సాగించగల దక్షుడు.

జాబాలి : అతని ధర్మశాస్త్ర పాండిత్యం, ఆ శాస్త్రాలపట్ల అతనికున్న భక్తి - ఇవి తెలియబట్టే వసిష్ఠులవారి పంట మరింత పండుతుందని నా భయం.

రాముడు : అదేమిటి?

జాబాలి : ఔను, రాఘవా! ప్రజలను కొల్లగొట్టి తమకు దోచి పెట్టాలని ధర్మశాస్త్రాలను వ్రాసి పెట్టింది వసిష్ఠులవారు కాదా?

రాముడు : వాటిని వ్రాసింది ఈ వసిష్ఠులు కారే!

జాబాలి : ఈ వసిష్ఠులు కాకపోతే, మరొక వసిష్ఠులు! ఈయనవలె వారుకూడా తమ సుఖజీవనం కోసం మతమౌఢ్యాలు పెంచినవారే!

రాముడు : (తీవ్రంగా) కేవలం తమ సుఖజీవనానికే మహర్షులు ధర్మశాస్త్రాలను వ్రాశారని మీ తాత్పర్యమా?

జాబాలి : రాజ పురోహితులు కాని మహర్షు లెవరు, నాయనా? పురోహితులుగా రాజాస్థానాలలో చేరి, రెండు చేతులతోనూ దోచుకు తినడానికి మహర్షిత్వం ఎంతగానో తోడ్పడుతుంది. అఖండ మేధాసంపన్నులు, అపార లోకజ్ఞులు - ఆపాటి నటన చేయలేరా? -

రాముడు : (తీవ్రంగా) ఎంత పాపపు మాటలాడుతున్నారు! చూడగా, నాకు వైదిక ధర్మాలలోగాని, వైదిక కర్మలలోగాని ఎంత మాత్రం విశ్వాసం లేనట్టున్నది!

జాబాలి: లేకేమి, రామచంద్రా! పూర్తిగా వున్నది. నేనూ పురోహిత వంశంలోనే జన్మించాను. వైదిక ధర్మాలు సడలినా, వైదిక కర్మలు సమసినా నా బ్రతుకుతెరువు పడిపోదా?

రాముడు : (చులకనగా)అయితే, బ్రతుకు తెరువు కోసం కపట నటనలో మీరు వసిష్ఠ మహర్షిని మించుతున్నా రన్నమాట.

జాబాలి : నిస్సందేహంగా, నాయనా! అయితే, నేను మాత్రం నాది కపట జీవితమని అంగీకరిస్తాను; ఆయన అంగీకరించరు - అంతే మా కిద్దరికీ భేదం.

రాముడు : మరి, మీరు నా కిప్పుడు చెప్పే హితం కూడా కపట హితమేనా?

జాబాలి : కాదు, రాఘవా! కాదు! ముమ్మాటికీ కాదు! నాది ఎంత కపట జీవితమైనా, నాలో మానవత్వం పూర్తిగా చావలేదు. నీ మేలు కోరి, నీ ప్రజల మేలుకోరి నీకు మనస్సు విప్పి చెబుతున్నాను నా మాట విను!

రాముడు : మీరు నిజంగా నా మేలు కోరుతున్నవారైతే, వైదిక కర్మలను నిరసిస్తారా? వాటిని అనుష్ఠించకపోతే దుర్గతులు కలగవా?

జాబాలి : వృషభాలను, మత్తేభాలను మేపినట్టు తమను మేపకపోతే దుర్గతులు తప్పవని "భయపెట్టడంలోనే ఉన్నది, నాయనా, పురోహితుల కపటం. ఇంద్రాది దేవతలకు హవ్యాల పేరుతో, పితృదేవతలకు కవ్యాల పేరుతో, వారు తమ పొట్టలు నింపుకుంటారు.

రాముడు : (తీవ్రంగా) మీ విపరీత ధోరణి మరి చాలు! పితృదేవతలకు పిండప్రదానాలు చేయకపోతే పరలోకంలో వారు క్షుత్పిపాసలతో మిగలరా?

జాబాలి : పరలోకం, కలదో, లేదో ఆ చర్చ మనకిప్పుడు వద్దు. పోనీ, వాదానికి కలదే అనుకో! అయినా, మరొక లోకంలోని వారికి ఈ లోకంలో పెట్టే పిండ ప్రదానాలు ఏ విధంగా చేరతాయి, నాయనా? ఇంటివద్ద బిడ్డలు తిండి తింటే పొరుగూరులో వున్న తండ్రికి కడుపు నిండుతుందా?

రాముడు : మీ విపరీత ధోరణి చూడగా నాకు స్వర్గ నరకాలలో కించిత్తు విశ్వాసమైనా లేనట్టున్నది!

జాబాలి : ఆ లోకాలు కలవో, లేవో నేను చూచిరాలేదు; నీవు చూచి రాలేదు; వసిష్ఠులవారైనా చూచిరాలేదు. అయినా, చూచివచ్చినట్టే ఆయన మాట్లాడతారు. ఆయన మాట నీవు నమ్ముతావు.

రాముడు : వాటిని మీరు నమ్మ రన్నమాట! భూసురవరంలో జన్మించి, దానికి మీరు కళంకం తెస్తున్నారు.

జాబాలి : సురవరం, కలదో, లేదో కాని, భూసురవర్గం మాత్రం నిశ్చయంగా ఉన్నది, నాయనా! ఈ ఆర్యావర్తంలోనే కాదు; అన్ని దేశాలలోనూ ఉన్నది. పరలోకంలో శాశ్వత సుఖాలను సమకూర్చగల శక్తి తమ కున్నదన్న నటనతో జన బాహుళ్యాన్ని

మోసగించవచ్చునని ఏనాడు కొందరు తెలుసుకొన్నారో, ఆనాడే ఆ వర్గ మేర్పడింది. భావి సౌఖ్యాలను ఇతరుల ప్రగా చూపించి, ప్రస్తుత సౌఖ్యాలను తా మనుభవించడం ఆ వర్గం ప్రత్యేకత. ఆ సౌఖ్యానుభూతికే వైదిక కర్మల పేరుతో వారు ధన కనక వస్తువాహనాలను కానుకలుగా స్వీకరిస్తారు.

రాముడు : వారు కానుకలు స్వీకరించడం స్వసౌఖ్యాల కోసం కాదు; పుణ్యాశ్రమాల నిర్వహణ కోసం; వైదిక ధర్మ ప్రచారం

కోసం.

జాబాలి : కాదు, రామచంద్రా! కాదు! తాము కల్పించిన ధర్మాన్ని తమ వర్గ ప్రయోజనాల రక్షణకై నిలబెట్టడం కోసం!

రాముడు : ధర్మశాస్త్రాలన్నీ వర్గ ప్రయోజనాల రక్షణకే పుట్టినవని మా తాత్పర్యమా?

జాబాలి : అవి మరెందుకు పుట్టినవి, రాఘవా? కొందరు ద్విజు లన్న నాడే సంఘంలో వర్గా లేర్పడినాయి; వర్గ ప్రయోజనా లేర్పడినాయి. ద్విజవర్గం ధర్మశాస్త్రాలను వ్రాసినప్పుడు ద్విజవర్గం ప్రయోజనాల రక్షణ దృష్టినుంచే వాటిని వ్రాయడం సహజం కాదా?

రాముడు : (కోపంగా) మరి సందేహం లేదు, మీరు నాస్తికులు. ఈ మృషావాదాన్ని ఇక నేను వినబోవడం లేదు. (గిర్రున వెనుకకు తిరిగి వెళ్ళబోతాడు)

జాబాలి : కోపగించకు, నాయనా! కాస్త నిదానించి మరొక్కమాట విను. (రాముడు ఆగిపోతాడు) నా విషయంలో పురోహితనింద ఆత్మనింద కాదా? పురోహిత వంశంలో పుట్టినా, దాని సంప్రదాయాలలో పెరిగినా, స్వతంత్రంగా ఆలోచించుకొన్న కొద్దీ నా అబద్ధపు బ్రతుకు పై నాకే రోత పుట్టింది. నా మాట విని, పురోహితవర్గం మాయలోనుంచి నీవు బయటపడితే... ఆ వస్తున్నవారెవరు? (అరచేతిని దొప్పగా చేసి, కంటి నొసల పైగా నిలిపి, దూరానికి చూస్తాడు).

రాముడు : (జాబాలి ఎటు చూస్తున్నదీ వెంటనే నిర్ణయించుకొనలేక) ఎక్కడ?

జాబాలి : (వేలెత్తి చూపుతూ) అక్కడ, నాయనా! ఆ చెట్ల గుంపు చాటుగా! రాముడు : (అటు నిదానించి చూస్తూ) వసిష్ఠులవారు కాదు, మరెవరో!

జాబాలి : (వెంటనే కొంత తెప్పరిల్లి) నీకు తెలియదుగాని, ఆయన చండశాసనుడు, నాయనా! ఆయనను చూస్తేనే నాకు ముచ్చెమటలు పోస్తాయి. అయినా, నీ హితం కోరి... రాముడు : ఏమైనా, మీ నాస్తిక బోధనలు మరి నేను వినను!

జాబాలి : (అనునయంగా) నీకు బాధాకరమైతే వైదిక ధర్మచర్చ మరి చేయనులే! కనీసం రాజధర్మాన్ని పాటించైనా నీవు నామాట వినవచ్చునే!

రాముడు : (చికాకుగా) రాజధర్మమా? ఏమిటది?

జాబాలి : ప్రజాభీష్టాన్ని మన్నించడం.

రాముడు : ధర్మ సూత్రానికి విరుద్ధంగా ఉన్నప్పుడు ప్రజాభీష్టాన్ని మన్నించ నక్కరలేదు. ధర్మం తర్వాతనే ప్రజలు.

జాబాలి : అక్కడే పొరపడుతున్నావు, నాయనా! క్షత్రియులైనవారు ప్రజలకే అగ్రస్థాన మివ్వాలి. వారి విశ్వాసమే మిమ్ము రాజులను చేస్తుంది, వారి కాయకష్టమే మీ కోశాగారాలను నింపుతుంది, వారి సమ్మోదమే మిమ్ము చరితార్థులను చేస్తుంది. వారిని, వారి అభీష్టాలను గౌరవించడం మీరు నేర్చుకోవాలి. వారందరు నిన్ను అయోధ్యకు తిరిగి రమ్మంటున్నారు. నీవు రాజధాని నగరాన్ని విడిచి వస్తుంటే, "మమ్ము నట్టేట విడిచి పోవద్దు, రామచంద్రా!" అంటూ వారు నీ రథం వెంట ఎంత దూరం పరుగులు పెట్టలేదు! ఎంతగా నిన్ను ప్రాథేయపడలేదు! "జన వాక్యంతు కర్తవ్యం". ఏ క్షత్రియుడు, ఈ సూక్తిని విస్మరించరాదు, రాఘవా!

రాముడు : క్షత్రియ ధర్మం నెపంలో నా కర్తవ్య పథం నుంచి నన్ను తప్పించడానికి మీ రిప్పుడు చూస్తున్నారు. లోభులు, క్రూరులు అవలంభించే నీచ క్షత్రియధర్మాన్ని నేను విసర్జిస్తాను.

జాబాలి : నేను నిన్ను పాటించ మంటున్నది త్యాగధనులు, కరుణాత్ములు పాటించే ఉత్తమ క్షత్రియధర్మం.

రాముడు : జనవాక్యం నెపంతో ఆడినమాట తప్పడం ఉత్తమ క్షత్రియ ధర్మ మౌతుందా? వనవాసం చేస్తానని తండ్రి ముందు నేను చేసిన ప్రతిజ్ఞను తప్పడం ఆడినమాట తప్పడమే రాజు నీతి తప్పితే, ప్రజలు నీతి తప్పరా? ఒకసారి నీతి తప్పిన తర్వాత ప్రజలకు మరి నే నేమి నీతి బోధిస్తాను? ఏ విధంగా స్వర్గాన్ని పొందుతాను? కాదా?

జాబాలి : అయితే, స్వర్గసుఖ లోభమే నిన్ను ప్రజల కష్టాలను, వారి కన్నీటిని నిర్లక్ష్యం చేసే క్రూరునిగా చేస్తున్న

దన్నమాట! లోభ, క్రౌర్యాలతో కూడిన క్షత్రియ ధర్మం నీ చధర్మమని ఇప్పుడే నీ వన్నమాటను ఇంతలోనే మరచిపోయావా?

రాముడు : (చికాకుగా) మీ తర్కంతో నన్ను తికమక పెడుతున్నారు. యుక్తి ప్రధానంగా మీరు చేస్తున్న వాదం శ్రుతి, స్మృతి విరుద్ధం. పైకి మంచివిగా కనబడుతున్నా, మీ పలుకులు యుక్తమైనవి కావు.

జాబాలి : నా పలుకులు శ్రుతి, స్మృతి విరుద్ధాలైతే కావచ్చుగాని, తర్కవిరుద్ధాలు కావుగదా? రాముడు : (ఆవేశంతో) శ్రుతి, స్మృతులకు విరుద్ధమైంది ఏదైనాసరే తర్కసమ్మతమైనా, సత్యం కానేరదు. మన ధర్మ శాస్త్రాలన్నింటికి ప్రాతిపదిక తర్కాతీతమైన నిత్య, నిగూఢ సత్యమే! మనం చేసే దానాలు, జరిపే యాగాలు, వేల్చే హోమాలు, సాగించే తపస్సులు, పట్టే వ్రతాలు, పఠించే వేదాలు-అన్నీ ఆ నిత్య, నిగూఢసత్యంలోనే నిలిచి వున్నాయి. దాన్నేఋషులు, దేవతలు పరమ సత్యంగా సంభావిస్తారు. ఇహలోకంలో దాన్ని పాటించే వారే అంతంలో ఉత్తమ లోకాలను పొందుతారు.

జాబాలి : ఆవేశపడకు, నాయనా! శాంతంగా ఆలోచించి నాకొకమాట చెప్పు! మనకు, జంతువులకు ఒక ప్రధాన భేదమేమిటి? మనకు ఆలోచనాశక్తి వున్నది; వాటికిలేదు-అంతే కాదూ?

రాముడు : కావచ్చు.

జాబాలి : మానవులుగా మన కున్న ఆలోచనాశక్తిని మనం వినియోగించుకొనకపోతే, జంతువులతో జతకామా? తర్కానికి విరుద్ధంగా, లేదా నీ వంటున్నట్టు, తర్కాతీతంగా నేను పలికితే, నా పలుకులను నీవు ఉన్మాదప్రలాపాలుగా భావించవా?

రాముడు : (ఆగ్రహావేశాలతో) మీవి నిస్సందేహంగా ఉన్మాద ప్రలాపాలే! మీకు వేద వేదాంగాలు లేవు; ధర్మాధర్మాలు లేవు; పాపపుణ్యాలు లేవు; స్వర్గనరకాలు లేవు. మీకు కావలసింది ఇహలోకంలో తుచ్ఛ సుఖాలు మాత్రమే! నశ్వరమైన ఆ తుచ్ఛ సుఖాలను నేను కాల దన్నుతాను. సత్యవ్రతుడనై స్వర్గలోకంలో శాశ్వత సౌఖ్యాలను పొందుతాను. సత్యవ్రతుడు కానివాడు సమర్పించే హవ్యకవ్యాలు దేవతలుగాని, పితరులుగాని స్వీకరించరని పెద్దలు చెప్పగా మీరు వినలేదా?

జాబాలి : (అనునయంగా) వినకేమి, నాయనా? విన్నాను. ఆ పెద్దలు మీ ప్రధాన పురోహితులు వసిష్టులను పోలినవారే! వారి మాయలో పడవద్దనే నేనింత సేపుగా నిన్ను హెచ్చరిస్తున్నాను. అయినా, నీవు తిరిగి మొదటికే వస్తున్నావు. వారి మాయాజాలంలో పడి మోసపోకు, నాయనా! పతిని బాసిన పడతి ఒంటి జడతో, కంటతడితో నాధుని రాకకై దారితెన్నులు కాచినట్టే అయోధ్యాపురి నీకోసం ఎదురు చూస్తున్నది. అయోధ్యకు మరలిరా! పట్టాభిషేకం చేసుకో ! నీతిగా, ధర్మంగా, ప్రజారంజకంగా పరిపాలన సాగించు ! రామరాజ్యాన్ని స్థాపించు! అదే స్వర్గ మౌతుంది. మానవుడు మానవుడుగా జీవిస్తే భూతలమే స్వర్గం కాగలదని చెప్పడమే నాస్తికమతమైతే, నాది నిశ్చయంగా నాస్తికమతమే!

రాముడు : (పట్టరాని కోపంతో) ఆ మాట మీరు చెప్పనక్కరలేదు. మీది పచ్చి నాస్తిక . మతం. నాస్తికుని ముఖం చూడ్డమైనా పాపం! హితబోధ పేరుతో చెబుతున్న మీ పాపపు మాటలను మరి కట్టి పెట్టండి! సద్రాహ్మణు డెందుకో రమ్మన్నాడని ఈ సంకేత స్థలానికి రావడం ఈ దుర్బోధలు వినడానికా? మీ కొక నమస్కారం ! (నమస్కరించడానికి పైకెత్తబోయిన చేతులను అంతలోనే కిందికి దించివేసుకుంటూ) పరిపాటి చొప్పున చేతులు జోడించబోయానుగాని, మీరు నా నమస్కారానికి తగరు. (కోపంతో వెనుకకు తిరిగి నాలుగడుగులు వేస్తాడు)

జాబాలి : (చిరునవ్వుతో) బ్రాహ్మణనింద మీ స్వర్గద్వారాలను మూసి వేస్తుంది, నాయనా! తొందరపడకు! ఒక్కక్షణం నిలిచి, మరొక్కమాట విను! (రాముడు ఆగుతాడు) ప్రజలు నీ బిడ్డలు కారా? రామరాజ్యం కావాలని వారు ఏకవాక్యంగా కోరడంలేదా? ప్రజా భీష్టాన్ని పాలించడంవల్ల వచ్చే పుణ్యఫలాన్ని మించింది వేరొకటి వుంటుందా? నేను పచ్చి నాస్తికుడనే కావచ్చు; నీదృష్టిలో పరమపాపినే కావచ్చు. అయినా, ప్రజల పక్షాన నేను

బతిమాలుతున్నాను. కష్టాలనుంచి వారిని తప్పించు. వారిని నీ ఒడిలో చేర్చుకో! వారి కన్నీరు తుడువు! ప్రజల కన్నీటితో తడిసే నేలపై ఏ ధర్మమూ నిలవదు; చివరికి నీ వైదిక ధర్మమైనా! అయోధ్యకు తిరిగివచ్చి.... (అల్లంత దూరాన వసిష్ఠుడు కంటబడగా) వసిష్ఠులవారు వస్తున్నారు! ఆయన వర్గీయులు చిరకాలంగా మిమ్ము మోసగిస్తున్నారు, నాయనా! వారి మోసంలో పడి నీ రాజ్యాన్ని నరకంగా చేయబోకు! (కంఠం తగ్గించి) ప్రజల గొంతు కోయబోకు! (కంఠం మరింత తగ్గించి) పుణ్యలోకాల భ్రమలో పడబోకు! పురోహితుల చేతిలో కీలుబొమ్మవు కాబోకు ! వారు గోముఖ వ్యాఘ్రాలు! పయోముఖవిషకుంభాలు! (వసిష్ఠుడు సమీపించగా, గొంతెత్తి) వసిష్ఠ మహర్షిచంద్రులకు నమస్కారం!

రాముడు : (తలవంచి చేతులు జోడిస్తూ) కుల గురువులకు నమస్కారం!

వసిష్ఠుడు : (జాబాలివంక ప్రశ్నార్థకంగా చూస్తూ, రాముని సమీపించి) దీర్ఘాయుష్మాన్ భవ! గురు బంధుమిత్ర పరివారాన్ని విడిచి ఈ నిర్జన ప్రదేశానికి నీ వెందుకు వచ్చినట్టు, ఇక్కడేమి చేస్తున్నట్టు? ప్రాతస్సంధ్యావందనం తర్వాత నీవు కనబడక పోవడం మాకే ఆందోళన కలిగించింది; తక్కినవారి మాట వేరే చెప్పాలా?

జాబాలి : మహర్షిపుంగవులు నన్ను మన్నించాలి. నా కోర్కెపైనే రాఘవు డిటు వచ్చాడు. రాముడు : ఔను! ఏదో పరమ రహస్యం చెబుతానని ఈయన నన్నిక్కడ ఒంటరిగా కలుసుకో మన్నారు.

జాబాలి : (వసిష్ఠునితో) పరమరహస్య మేమీ లేదు, మహర్షీ! తాము స్వయంగా సెల విచ్చలేదా? -వనవాస దీక్ష విరమించి, రామచంద్రుడు అయోధ్యకు తిరిగి రావాలని, పట్టాభిషేకం చేసుకోవాలని, ప్రజారంజకంగా పరిపాలించాలని. ఆ మాటే నేనూ చెబుదామని....

వసిష్ఠుడు : దానికి ఏకాంతాన్ని అభిలషించడం దేనికి?

రాముడు : (జాబాలివంక చురుకుగా చూస్తూ) నాస్తికత్వ బోధనకు ఏకాంతం కావలదా, మహర్షీ!

(జాబాలివంక వసిష్ఠుడు ఆశ్చర్యంగా చూస్తాడు)

జాబాలి : (వసిష్ఠుని ఒక కంట కనిపెడుతూ, రామునితో) నాది ఆస్తికమతమో, నాస్తికమతమో మహర్షి సత్తములకు తెలియదా, నాయనా? వారు దివ్యదృష్టిగల మహాత్ములు. ఈ త్రిలోకాలలో వారికి తెలియని దేమున్నది? నీవిక్కడున్నట్టు దివ్యదృష్టితో చూడబట్టేగదా సరాసరి వారిక్కడికి వేంచేశారు! (రాముడు ఏదో అనబోగా, మాట చొరనీయకుండా, వసిష్ఠునితో) రాఘవుని ధార్మిక విశ్వాసాలను పరీక్షించడానికి ప్రయత్నించాను- అంతే, మహర్షీ! నా విషమ పరీక్షకు చలించకుండా, స్థిరంగా నిలిచింది రాఘవుని ఆస్తికవిశ్వాసం.

రాముడు :నా విశ్వాస పరీక్షకేనా మీరు నాకు దుర్బోధలు చేసింది? అందుకేనా మా కులగురువులను దూషించింది?

జాబాలి :గురుదూషణ కూడా నా పరీక్షలో ఒక భాగమే, నాయనా!

రాముడు : (వసిష్ఠునితో) మహర్షి! ఈయన మాటలు తమరు నమ్మబోకండి! ఈయన మునిరూపంలో వున్న పరమ నాస్తికుడు! భూసుర వర్గానికే ఈయన కళంకం తెస్తున్నాడు. తర్కబలంతో అహితాన్ని హితంగా చిత్రిస్తున్నాడు; అసత్యాన్ని సత్యంగా ప్రతిపాదిస్తున్నాడు; అధర్మాన్ని ధర్మంగా నిరూపిస్తున్నాడు. వేదవేదాంగాలకు ఈయన ప్రబల విరోధి, వైదికధర్మాలకు గర్భశత్రువు. కపట నటనతో ఈయన తమరిని పూర్తిగా వంచించాడు; మా పితృపాదులను వంచించాడు; లోకాన్నే వంచిస్తున్నాడు. ఈ లోక వంచకుని....

వసిష్ఠుడు : నీమాటలు చిత్రంగా వున్నాయి, రాఘవా! జాబాలి నాస్తికుడా? వేదవేదాంగాలను నిరసిస్తున్నాడా? మమ్ము నిందిస్తున్నాడా?

జాబాలి : రాఘవుని మాటలనుబట్టే తమరు తెలుసుకోవచ్చు-రాకుమారుని నేనెంత కఠినపరీక్షకు గురిచేశానో! నా ధార్మికవిశ్వాసాలేవో తమకు తెలియవా? నేను వేద ప్రామాణ్యాన్ని అంగీకరిస్తానో, లేదో తమకు తెలియదా? (రామునితో) నీ ప్రవృత్తి ఎంత నిర్మలమైంది, నాయనా! వైదికకర్మలపట్ల నీ కున్నభక్తి ఎంత నిశ్చలమైంది! నిశిత పరీక్షకు లోను జేసి, నీ మెత్తని మనస్సుని నొప్పించి నట్టున్నాను! నేనేమి చేసినా, నీ మేలు కోసమే! అన్యథా భావించకు!

రాముడు : ఇంతవరకు మీరు చెప్పిన మాటలు నిజమా, ఇప్పుడు చెబుతున్నవి నిజమా?

జాబాలి : (నవ్వుతూ) నేనంత నేర్పుగా నాటక మాడానో ఇప్పుడు నాకు తెలుస్తున్నది, నాయనా!

రాముడు : (తీవ్రంగా) నాటకం కాదు, బూటకం!

జాబాలి : నేను నిజంగా బూటకం చేస్తే దాన్ని వసిష్ఠమహర్షులు ఇట్టే తెలుసుకోలేరా? ఆయన త్రికాలజ్ఞులు కారా?

రాముడు :అయితే, ఇంతకు ముందు ఆయనను గురించి మీరు....

జాబాలి : ఏమన్నా, నిన్ను పరీక్షించడానికే, నీ విశ్వాసాలను పరీక్షించడానికే. వసిష్ఠమహర్షి నాకు అగ్రజునివంటివారు, మావైదిక వర్గానికే ఆయన అగ్రజుడు. ఆయన నాయకత్వమే నాస్తికత్వపు దుష్టశక్తులనుంచి మమ్మ కాపాడుతున్నది, మిమ్ము కాపాడుతున్నది, మీతో పాటు, మీ ప్రజలను కాపాడుతున్నది. నాకు తెలుసు - మహర్షి సత్తమునికి ముఖస్తుతి ఎంతమాత్రం మనస్కరించదని. అయినా ఒకమాట చెప్పక తప్పదు. అంతటి మహాత్ముడు ఈ ముల్లోకాలలో ఇదివరకులేడు, ఇప్పుడు లేడు, ఇక ముందైనా వుండబోడు.

రాముడు : అయితే....అయితే....

వసిష్ఠుడు : ఇతడిని నీవు శంకించ నక్కరలేదు, రాఘవా! ఇతడు చిరకాలంగా మా సన్నిహిత వర్గంలో వుంటున్నాడు. ఇతడు నాస్తికుడు కాదు; ఆస్తికుడే. ఇతడు చతుర్వేది; వైదిక కర్మకాండలో నిష్ణాత; ఋత్విజులలో ఎన్నదగువాడు; మాపట్ల భక్తి విశ్వాసాలున్నవాడు.

రాముడు : (అయోమయ స్థితిలో పడిపోయి) ఏదినిజం, ఏది అబద్ధం? ఏది వాస్తవం, ఏది కపటం?

జాబాలి : దాన్ని తెలుసుకొనడానికే వసిష్ఠమహర్షి సత్తములు కఠోర తపస్సు చేస్తున్నారు, నాయనా! ఈ సృష్టి సర్వస్వం ఆ జగన్నాటక సూత్రధారికి రంగస్థలం కాదా?


రాముడు : అయితే, ఆ రంగస్థలంపై తమరు నటరాజులు!


జాబాలి : కావాలన్నా, నేను నటరాజును కాగలనా? ఆ బిరుదు ఆ పరాత్పరునకే చెల్లు! పద, నాయనా, పద! బంధుమిత్ర పరివారం నీకై ఎంతగా కలతపడుతున్నదో! వసిష్ఠుడు :ఔను, రాఘవా! పద!

(దారి తీసిన వసిష్ఠుని రాముడు, జాబాలి అనుసరిస్తుండగా - తెర).

సీత జోస్యం

సమర్పితము
విద్వాన్ విశ్వం గారికి
ప్రేమ గౌరవాలతో






సీత జోస్యం







Chhatarpur
छतरपुर
చిత్రకూటం
Rewa
रीवा
Mirzapur
मिर्ज़ापुर
AH1
Sagar
सागर
Damoh
दमोह
Katni
कटनी
18 hr 2 min
867 km
Shahdol
शहडोल
Jabalpur
जबलपुर
Ambikapur
अंबिकापुर
AH43
Korba
कोरबा
CHHATTISGARH
Raigarh
रायगढ़
Gondia
गोंदिया
Nagpur
नागपुर
Bhilai
भिलाई
AH46
Atal Nagar-Nava Raipur
नया रायपुर
Bhandara
भंडारा
Chandrapur
चंद्रपुर
Bhawanipatna
Rayagada
బస్తరా
Jeypore
Karimnagar










दिल्ली
PRADESH
అయోధ్య
Jaipur
जयपुर
BIHAR
Patna
पटना
MADHYA PRADESH
India
JHARKHAND
WEST BENGAL
CHHATTISGARH
Kolkata
কলকাতা
Nagpur
नागपूर
ODISHA
TELANGANA
Hyderabad
హైదరాబాద్
Bengaluru
ಬೆಂಗಳೂರು
Bay of Bengal
TAMIL NADU
KERALA
శ్రీ లంక
Laccadive Sea
Colombo









పీఠిక

ఉపక్రమణిక

"జాబాలి" నా రామాయణ నాటకాలలో మొదటిది కాగా, ఈ "సీత జోస్యం" రెండవది. ఆ మొదటి నాటకానికి విపులమైన పీఠిక వ్రాస్తూ, రామాయణానికి సంబంధించిన అనేక ముఖ్యాంశాలను దానిలో చర్చించాను. వాల్మీకి ఏ రూపంలో రామాయణాన్ని చెప్పివుండవచ్చు? తర్వాత ఎప్పటివరకు దాన్ని పెంచారు? ఏ మేరకు పెంచారు? ఆదికావ్యంలోని ప్రక్షిప్తాలను పట్టివేయగలమా? వాటిని తొలగిస్తే, వాల్మీకి రచనగా చెల్లుతున్న సంస్కృత రామాయణంలో ఏ పాటి మిగులుతుంది? వాల్మీకి తన కావ్యనాయకుని నిజంగానే ఒక మానవాతీతవ్యక్తిగా చిత్రించాడా? సంస్కృత రామాయణానికి, దాని అనువాదాలకు, లేదా అనుసరణలకు ఏయే వ్యత్యాసా లున్నాయి, ఎక్కడెక్కడ వున్నాయి? సంస్కృత రామాయణం ప్రకారం దశరథునికి భార్య లెందరు? రాముడు ఏకపత్నీ వ్రతుడేనా? లక్ష్మణుడు వివాహితుడా, అవివాహితుడా? వనవాసానికి వెళ్ళిననాటికి సీతారాముల వయస్సు లెంత? ఏ పరిస్థితులలో సీతాపహరణం జరిగింది? లంకాదహన వృత్తాంతం ఎంతవరకు విశ్వసించదగింది? రామాయణ కాలంనాటి సాంఘికాచారా లేవి? ఆహార నియమా లేవి? సీతారామలక్ష్మణులు మద్యమాంసాలను ముట్టనివారా?... ఇట్టి ప్రశ్నలు మరి పెక్కింటికి కూడా ఆ పీఠికలో సమాధానాలను చెప్పడానికి నేను ప్రయత్నించాను.

ఈ సమాధానాలను చెప్పడంలో నేను ఊహపై ఆధారపడలేదు. సంస్కృత రామాయణం నుంచే నా సమాధానా లన్నింటికి సాక్ష్యాధారాలను చూపించాను; నా వాదాన్ని మరింత బలపరచడం కోసం రామాయణాన్ని విమర్శాత్మకంగా పరిశీలించిన జాతీయ, విజాతీయ పండితులను సాక్షులుగా పిలిచాను.

పీఠికలో సవిస్తరంగా చెప్పిన విషయాలను తిరిగి దీనిలో నేను తడవబోవడం లేదు. ఇక్కడ కొత్త విషయాలనే వ్రాస్తాను. అయితే, ఈ "సీత జోస్యం" నాటకాన్ని, దీని ప్రధాన పాత్రలను మీరు సవ్యంగా అవగాహన చేసుకోవాలంటే, "జాబాలి" పీఠికను ఒకసారి చదవడం అవసరమని భావిస్తున్నాను.

నా రెండు పీఠికలలో ఏదీ మీకు నచ్చకపోవచ్చు, నా రెండు నాటకాలలో దేన్నీ మీరు మెచ్చకపోవచ్చు. అంతే జరిగితే, అందుకు నే నెంత మాత్రం బాధపడను. నాకు కావలసింది మీ ఆమోదం కాదు, మీలో ఆలోచన; నేను కోరేది మీ ప్రశంస కాదు, మీలో జిజ్ఞాస. ఎప్పటికప్పుడు పాత విషయాలను కొత్త దృష్టితో చూడ్డానికి మనం ప్రయత్నించాలి, పాత విశ్వాసాలను కొత్త పరీక్షలకు పెట్టుకోవాలి, పాత గాథలకు కొత్త వ్యాఖ్యానాలను చెప్పుకోవాలి. అప్పుడుగాని మనలో కొత్త ఆలోచనలు రేకెత్తవు; అప్పుడుగాని మనలో కొత్త చైతన్యం పెల్లుబికదు; ఏదో ఒక పక్షం అప్పుడుగాని కొత్త తేజస్సులో, ఓజస్సుతో ఒక జాతిగా మనం ముందుకు సాగలేము. మనలో స్తబ్ధత పోవాలి, సంచలనం రావాలి; మనలో ఔదాసీన్యం గతించాలి. వహించాలన్న పట్టుదల పెరగాలి. మనలో "విస్సన్నల" పట్ల, వారి "వేదాల" పట్ల గౌరవం తగ్గాలి, తిరిగి "ప్రశ్నోపనిషత్తులు" విరివిగా వెలువడాలి. నాటకాలను కూర్చి, వాటికి పీఠికలను చేర్చి, నేను సాధించగోరుతున్నది ఈ మానసిక పరివర్తననే, ఈ నవ చైతన్యాన్నే, ఈ పురోగతినే. మీలో కొందరికి కష్టం కలిగించడం ద్వారానే నా లక్ష్యాన్ని సాధించవలసివస్తే, అందుకు నేను వెనుదీయ ననడానికి నా నాటకాలే, వాటికి నా పీఠికలే తార్కాణాలు.

నాది ఆర్య, ఆర్యేతర దృష్టి కాదు; బ్రాహ్మణ, బ్రాహ్మణేతర దృష్టి అసలే కాదు. అవి సంకుచిత దృష్టులు. అవి నాకుంటే, నన్ను చూచి నేనే సిగ్గుపడాలి. జాతి మత కుల వర్గ విభేదా లన్నీ సమసిపోవాలి; సమతాస్వాతంత్ర్యాలు సర్వత్రా నెలకొనాలి; దారిద్ర్యం, దైన్యం ఈ భూతలంనుంచి మటుమాయమైపోవాలి; అణ్వస్త్ర యుద్ధం ద్వారా నరజాతి, దాని నాగరికత సర్వనాశం కాగల ప్రమాదం పూర్తిగా తొలగాలి; వివేకవిజ్ఞానాలు వర్ధిల్లాలి; మానవునికి, అతడి మానవతకు పట్టాభిషేకం జరగాలి - ఇదే నా ఆరాటం, ఇందుకే నా పోరాటం. ఈ పోరాటంలో మీరు నా సరసను నిలిస్తే సంతోషిస్తాను; నా సమ్ముఖంలో నిలిచినా సంతోషిస్తాను; ఇదే మీకు నా ఆహ్వానం : నా పక్కనో, నా యెదుటనో బారు తీరండి, పోరులో దూకండి!

ఇంతవరకు నేను వ్రాసింది 1965లో. అంతకు రెండు, మూడేళ్ళకు ముందుగానే “జాబాలి”, “సీత జోస్యం” నాటకాలతోపాటు వాటి కోవకే చెందినవాటిని మరి మూడింటిని సయితం పూర్తిచేశాను. వాటిని అప్పటిలో విజయవాడ, గుంటూరు, హైదరాబాదు, మద్రాసు, న్యూఢిల్లీ నగరాలలో నా మిత్రబృందాలకు చదివి వినిపించాను. కాని, వాటిని ప్రచురించడం జరగలేదు. ఇందుకు కారణం నా నాటకాల సదవగాహనకు సుదీర్ఘ పీఠికలు ముఖ్యావసరమని భావించిన నేను వాటిని వ్రాయలేకపోవడమే. 1964 డిశెంబరులో నాకు రెండవతూరి గుండెపోటు హెచ్చుగా వచ్చినప్పుడు, చచ్చిపోతున్నట్టుగా నేను నమ్మినప్పుడు, నాకు కలిగిన రెండు చింతలలో ఒకటి - “అయ్యో! నా నాటకాలను అముద్రితంగా విడిచి వెళ్ళిపోతున్నానే!” అని. అయినా, వాటి ప్రచురణ కార్యక్రమం ఇప్పటికైనా పూర్తి కానేలేదు.

1964 నాటి రుగ్మతనుంచి పూర్తిగా కోలుకొనకముందే, ఎలాగో ఓపిక తెచ్చుకొని, 1965 మే, జూన్ నెలలలో “జాబాలి” పీఠికను వ్రాసి, వెనువెంటనే “సీత జోస్యం” పీఠికను మొదలు పెట్టాను. ఇంతలో తిరిగి ఆరోగ్యం చెడిపోయిందో, మరేమి జరిగిందో ఇప్పుడు జ్ఞాపకం లేదుగాని, ప్రారంభఘట్టంలోనే అది నిలిచిపోయింది. అంతే నా అముద్రిత నాటకాలను గురించి తిరిగి నేను శ్రద్ధ వహించింది నవోదయ ప్రచురణ సంస్థవారి పట్టుదలపై 1974లోనే.

ఆ సంవత్సరంలో నా “జాబాలి”ని ప్రచురించిన మీదట “సీత జోస్యం” నాటకాన్ని ముద్రణకు సిద్ధపరచవలసిందిగా వారు ఎంతగా పోరినా ఇప్పటివరకు (1976 మే నెల వరకు) అందుకు నేను ఉద్యమించనైనా లేదు. నాలుగైదు నెలల క్రితం తిరిగి గుండెపోటు వచ్చిన మీదట (అది నాల్గవతూరి) దాన్ని చిట్టచివరి “వార్నింగ్”గా పరిగణించకపోతే, నా నాటకాలు మరి వెలుగుముఖం చూడబోవని రూఢపరచుకొన్నందునే 1965లో నిలిచిపోయిన ఘట్టం నుంచి “సీతజోస్యం” పీఠికను తిరిగి ఇప్పుడు వ్రాయబోతున్నాను.

అయితే, పదేళ్ళనాటికంటె ఇప్పుడు ఆరోగ్యం తక్కువ, దార్ఢ్యం తక్కువ.

అప్పటి "ఫైటింగ్ మూడ్” ఇప్పుడు లేదేమో కూడా! ఇంతే కాక, రామాయణాన్ని గురించి పదేళ్ళనాడు చదివిన విషయాలను ఇప్పుడు నెమరుకు తెచ్చుకోవలసి వస్తున్నది. ఈ పదేళ్ళలో రామాయణాన్ని గురించి వెలువడిన కొత్త పరిశోధక వ్యాసాలను, గ్రంథాలను చదవవలసి వస్తున్నది. అందువల్ల ఏ మేరకు నా కృషి జయప్రదం కాగలదో చెప్పలేను. అయినా, శక్తివంచనలేని ప్రయత్నం చేస్తాను.

ఈ "సీత జోస్యం" పీఠికలో నేను ప్రత్యేకించి చర్చించగోరుతున్న ముఖ్యాంశాలివి:

1 రామాయణగాథకు చారిత్రకాధారం ఏ కొంచెంగానైనా వున్నదా?

2 రాముని వనవాసం ఏ ప్రాంతంలో?

3 రాక్షసు లెవరు? వారి స్థితిగతు లెట్టివి?

4 ఋషు లెవరు? తమ యజ్ఞ యాగాదులకు వారు జనస్థానాన్ని ఎన్నుకొనడం దేనికి?

5 రామాయణ కాలంనాడు ఎవరి ఆయుధా లెట్టివి?

ఈ అయిదు ప్రశ్నల చర్చను అయిదు ప్రకరణాలలో జరుపుతాను. మరొక ప్రకరణాన్ని నా నాటకంలోని పాత్రలను గురించిన చర్చకు వినియోగిస్తాను. ఇతర విషయాలను తడవవలసివస్తే, అందుకు మరొక, లేదా మరికొన్ని ప్రకరణాలను ప్రత్యేకిస్తాను. అయితే, ఇట్టి అగత్యం బహుశా కలగదు.

రామాయణంలో నిజమెంత?

రామాయణగాథకు చారిత్రకాధారం ఏ కొంచెంగానైనా వున్నదా? ఈ ప్రశ్నవేయడమే కోటానుకోట్ల రామభక్తుల దృష్టిలో ఒక పెద్ద నేరం, ఒక ఘోరపాపం. ఈ ప్రశ్నవేసేవాని నాల్క చీల్చాలి, గొంతు నులమాలి, అతడిని నిలువునా పాతి పెట్టాలి. రామాయణం నిజం కాకపోతే, ఏది నిజం? ఎంత దూరమో పోవడం దేనికి? ఒక కుటీరాన్ని వేసుకొని, కొంత కాలంపాటు మన భద్రాచలం సమీపాన సీతారామలక్ష్మణులు వనవాసం చేసినందునే ఆ ప్రాంతాన్ని ఈనాటికీ "పర్ణశాల" అంటున్నారు. దానివద్ద సీత ఋతుస్నానాలు చేసిన ఉష్ణగుండాలు ఈనాటికీ వున్నాయి. బట్టలు ఉతుకుకొనడానికి ఆమె వాడిన రాతిబండలను ఇప్పటికీ అక్కడ చూడవచ్చు. ఆమె అపహరణ వార్తను గుంటూరు జిల్లాలోని ఒక కొండవద్ద మొట్టమొదటగా రాముడు విన్నందునే దానికి "వినుకొండ" అనే పేరు వచ్చింది. పాషండులు ఏమన్నా, రావణాసురుని కాష్ఠ మిప్పటికీ భగభగ మండుతూనే ఉన్నది. ఇప్పుడు లంకను శ్రీమతి సిరమావో బండారనాయకే పరిపాలిస్తున్నా, విభీషణుడు ఆ దీవిలోనే ఎక్కడో ఒకచోట ప్రచ్ఛన్నంగా కూర్చుని ఈనాటికీ రామభజన చేస్తూనే ఉన్నాడు. ఆయనవలె హనుమంతుడు సయితం చిరంజీవి. నాస్తికుల పాపిష్టి కళ్ళకు ఆయన కనబడకపోవచ్చుగాని, "శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం, ప్రకీర్తిప్రదాయం, భజే వాయుపుత్రం, భజే వాలగాత్రం, భజేహం! "అంటూ ప్రార్థించినంతనే భక్తుల రక్షణకై ఈనాటికీ ఆయన ఒక గంతులో వచ్చి, భూత ప్రేత పిశాచాలను చీల్చి చెండాడుతున్నాడు.

పాషండులు, ఇతర నాస్తికులు నమ్మకపోయినా, రామజననం దాదాపు పది లక్షల సంవత్సరాల క్రితం జరిగింది. మరింత ఖచ్చితంగా చెప్పాలంటే, క్రీస్తుకు పూర్వం 8, 67, 102 సంవత్సరాలనాడు త్రేతాయుగంలో జరిగింది. రామాయణంలోనే ఒకచోట (ఉత్తరకాండలో 74వ సర్గ) రామజననం త్రేతలోకాదని, ద్వాపరంలో అని వున్న దనుకోండి. రావణవధానంతరం పరమేశ్వరునివెంట రామునివద్దకు వచ్చిన దశరథుడు "కాహశుడను బ్రాహ్మణుని అష్టావక్రుడు తరింపజేసినట్టు నీవు నా వాక్యపరిపాలనద్వారా నన్ను తరింపజేశావు" అని అష్టావక్రుని ప్రసక్తి తెచ్చినట్టు యుద్ధకాండలో (122వ స) వున్నందున రాముడు కలియుగ ప్రారంభానికి చెందిన వాడని తీర్మానించుకోవా లనుకోండి. 1 అయితే, ఇవి పొరపాటు మాటలు. రామునికి, రామాయణానికి సంబంధించినంతవరకు ఎంత వెనకకు వెడితే, నిజానికి అంత చేరువగా మనం జరుగుతాము! తిరుగులేని ఈ సూత్రాన్ని పాటించే ఒక జ్యోతిషశాస్త్ర పండితుడు రామరావణ యుద్ధం క్రీస్తుకుపూర్వం 1,25, 67, 101వ సంవత్సరంలో జరిగిందని చెప్పాడు. ఒక విధంగా ఇది కూడా తగినంతగా వెనకకు

వెళ్ళడం కాదు. ఈ భూమి పుట్టినప్పుడే, ఆ మాటకు వస్తే, ఈ భూమి పుట్టకముందే, వేదా లున్నాయి. వాటిలో వున్నది, సీతారామలక్ష్మణుల పేర్లు వున్నాయి. వేదాంగాలైన బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో విదేహరాజు జనకుని పేరు వున్నది, కేకయరాజు అశ్వపతి పేరు వున్నది. ఇక్ష్వాకుని పేరు ఈ ధోరణిలో రామభక్తులు ఏమేమో చెబుతూపోతారు, అంతూపొంతూ లేకుండా చెబుతూపోతారు. వారి మాటలకు విలువ యిస్తే, రావణునికి పది తలలని, ఇరవై చేతులని నమ్మవలసి వస్తుంది; హనుమంతునికి తోకవున్నట్టు, అతడు నూరు యోజనాల సముద్రాన్ని (బహుశా తన తోక తోడ్పాటుతోనే) అవలీలగా లంఘించి, లంకను తగలబెట్టి వచ్చినట్టు నమ్మవలసివస్తుంది; కుంభకర్ణుని నిద్రనుంచి మేల్కొలపడానికి అతడిని వెయ్యి యేనుగులతో రావణుడు తొక్కించినట్టు నమ్మవలసివస్తుంది; రామాయణంలో కోకొల్లలుగా వున్న ఇట్టి కాకమ్మకథ లన్నింటిని కడిగిపోసిన సత్యాలుగా గుర్తించవలసివస్తుంది. అందువల్ల రామాయణానికున్న చారిత్రక ప్రాతిపదిక విషయమై జరిపే చర్చ సందర్భంలో రామభక్తులను మన దరిదాపులకైనా చేరనీయరాదు. వారిని, వారి సోదెను ఎంతమాత్రం పట్టించుకోరాదు.

కట్టుకథకు, గట్టి చరిత్రకు భేదం తెలియని రామభక్తులను ఒక పక్కకు నెట్టి, వేదాలను చారిత్రక దృష్టితో పరిశీలిస్తే, వాటిలోని ఇక్ష్వాకునికి, రామాయణంలోని ఇక్ష్వాకునికి ఏమీ సంబంధం లేదని తెలుస్తుంది. ఋగ్వేదంలో ఒకసారి, అధర్వణ వేదంలో ఒకసారి, మొత్తం రెండుసార్లు వేదాలలో ఇక్ష్వాకుని ప్రసక్తి వున్నది. అయితే, ఇతడు వైవస్వత మనువు కుమారుడు కాదు, రాముని వంశానికి మూలపురుషుడు కాదు. పోతే, ఋగ్వేదంలోని సీత నాగేటి చాలు గాని, రామాయణనాయిక కాదు. ఋగ్వేదంలోనే ఒక ఋక్కులో "రామమ్" అనే మాట తగిలేసరికి, "మరి సందేహం దేనికి? ఇదిగో! ఇక్కడ రామకథ బీజరూపంలో ఉన్నది" అంటూ శ్రీ బి.వి. కామేశ్వర అయ్యర్ ఎగిరి గంతువేశాడు. అయితే, సాయనాచార్యుడు ఈ "రామమ్" పదానికి ఈ సందర్భంలో చెప్పిన అర్థం "రాత్రి" అని. సరిగా ఇదే అర్థాన్ని తన ఋగ్వేదం అనువాదంలో ఆర్.టి. హెచ్. గ్రిఫిత్ స్వీకరించాడు. హెచ్. గ్రాస్మన్ సయితం ఋగ్వేదానికి తన జర్మన్ అనువాదంలో ఇంతే చేశాడు. ఇక, లక్ష్మణుని ప్రసక్తి మిగిలింది. ఋగ్వేదంలోని "లక్ష్మణ" శబ్దం "వేదిక్ ఇండెక్స్" వివరణ ప్రకారం ఒక దానశీలి తండ్రి పేరును సూచిస్తున్నది. "

ఇక్కడ మరొక విషయాన్ని కూడా గమనించాలి. వేదవాఙ్మయంలో రాముని ప్రసక్తిని, ఇతర రామాయణ పాత్రల ప్రసక్తిని తీసుకురాగోరితే ఆ పనిని సందేహానికి ఆస్కారం లేకుండా చేసేవారు కాదా? ఒక రాముని చూచి, మరొక రాముడని పొరపడ్డానికి ఎంతమాత్రం వీలు లేకుండా " రామ ఔపతస్విని" " రామక్రాతుజాతేయుడు", "రామమార్గవేయుడు" అంటూ బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో చెప్పినట్టు, "రామదాశరథి" అని స్పష్టంగా, నిర్ద్వంద్వంగా చెప్పేవారు కాదా? వేదాలను, వేదకాలాన్ని విడిచిపెట్టండి; కనీసం పాణిని వ్యాకరణంలోనైనా రాముని ప్రసక్తి లేదు. ఆయన వాసుదేవ కృష్ణుని పేరెత్తాడు, యుధిరుని పేరెత్తాడు, అర్జునుని పేరెత్తాడు, రాముని తలవనైనా లేదు. ఇంతే కాదు. పతంజలి రచనలలో సయితం రాముని ఊసు పొరపాటుగానైనా రాదు. అసలు క్రీస్తుశకానికి పూర్వపు ఏ శాసనంలోను రాముని ప్రసక్తి కనబడదని హెరిట్స్ వింటర్ నిట్స్ వ్రాశాడు.

అయినా, ఋగ్వేదంలోని దివోదాసు, రామాయణంలోని దశరథుడు సమకాలికులని, శంబరునిపై యుద్ధంలో దివోదాసుకు దశరథుడు బాసటగా నిలిచాడని, ఈ ధోరణిలో ఏమేమో పండిట్ ద్వారకాప్రసాద్ మిశ్రా చాలా చాలా చెప్పాడు. ' రాజకీయ రంగంలోని తన బుద్ధిచాతుర్యాన్ని, తన వాదనైపుణ్యాన్ని సాహిత్య రంగానికి వర్తింపజేయడానికి ఈయన గట్టి ప్రయత్నం చేయకపోలేదు గాని, అది కేవలం ఒక "సర్కస్ ఫీట్"గా పరిణమించింది.

ఏ "సర్కస్ ఫీట్" చేయకుండా రామాయణాన్ని విచక్షణాపూర్వకంగా పరిశీలించిన జాతీయ, విజాతీయ పండితులు దానికి ఏ పాటి గా చారిత్రకాధారం కలదన్న విషయమై విభిన్నాభిప్రాయాలను వెల్లడించారు. వాటిని స్థూలంగా రెండు వర్గాలకింద విభజించవచ్చు:

1 రామాయణం పూర్తిగా కల్పితగాథ.

2 రామాయణంలో అసంభవ విషయాలు, అభూతకల్పనలు పెక్కు లున్నా, దానికి చారిత్రకాధారం ఏ స్వల్పంగానో లేకపోలేదు.

ఈ రెండు వర్గాల అభిప్రాయాలలో తిరిగి అనేక విభేదా లున్నాయి. వాటిలో ప్రధానమైన వివి:

అ) రామాయణగాథకు మూలబీజం వేదవాఙ్మయంలో వున్నది.

ఆ) ఉత్తర భారతానికి చెందిన కొన్ని బౌద్ధ జాతకకథల, దక్షిణ భారతానికి చెందిన కొన్ని జానపదగాథల కలగాపులగమే రామాయణం.

ఇ) ఎప్పుడు ఏ రూపంలో ఆవిర్భవించినా రామాయణం పై గ్రీక్ పౌరాణిక గాథల ప్రభావం బలీయంగానే ఉన్నది.

ఈ) ఖగోళశాస్త్రాన్ని కథారూపంలో చెప్పడానికి జరిగిన ప్రయత్న ఫలితమే రామాయణం. పోతే, రామాయణానికి ఎంతో కొంత చారిత్రకాధారం లేకపోలేదని చెప్పేవారిలో...

ఎ) కొందరు దాన్ని సింహళం వరకు ఆర్యసామ్రాజ్య విస్తరణగా పేర్కొంటారు.

బి) మరికొందరు ఆర్యజాతికి చెందిన రాముని జైత్రయాత్ర వింధ్యపర్వతాలను దాటి వెళ్ళలేదని వాదిస్తారు.

సి) వేరొక కొందరు ఆర్య సామ్రాజ్య విస్తరణయత్నం ఎంతమాత్రం లేదని, ఆర్యసంస్కృతిని, నాగరికతను దక్షిణాపథానికి వ్యాపింప జేయడానికి మాత్రమే కృషి జరిగిందని సిద్ధాంతీకరిస్తారు.

డి) రామాయణానికి రంగస్థలం ఇండియా కాదు, ఈజిప్టు అని వాదించేవారు సయితం కొంద రున్నారు.

కేవలం ఇవి మాత్రమేకాక, మరికొన్ని సూచన లున్నాయి, సిద్ధాంతాలున్నాయి, వాదా లున్నాయి, ప్రతివాదా లున్నాయి. ఒకే రచయిత "ఇది కావచ్చు, అది కావచ్చు, మరొకటి కావచ్చు, అన్నీ కావచ్చు" అని చెప్పిన సందర్భాలు సయితం వున్నాయి. వాటి వివరాలలోకి నేను అంతగా వెళ్ళను; వివిధ పండితులు, విభిన్న పరిశోధకులు వెల్లడించిన విరుద్ధాభిప్రాయాలలో కొన్నింటిని మాత్రమే సంగ్రహంగా నివేదిస్తాను.

రామాయణగాథను అంకురప్రాయంగా వేదవాఙ్మయంలో పరికించవచ్చునని 1872లో జర్మనీకి చెందిన సంస్కృత పండితుడు ఆల్ బ్రెక్ట్ వేబర్ సూచించాడు; తర్వాత పదకొండు సంవత్సరాలకు మన రమేశ్ చంద్ర దత్ ఇది పూర్తిగా నిజమని ఉద్ఘాటించాడు. ఈ తరంవారికి దత్ అపరిచితుడు కావచ్చుగాని, ఒకనాడు ఆయన మన జాతీయనాయకుడు. ఐ.సి.ఎస్. ఆఫీసర్ గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, బరోడా దివానుపదవి సమేతంగా, ఉన్నత పదవులను పెక్కింటిని ఆయన నిర్వహించాడు. ఆర్థికశాస్త్రవేత్తగా కొన్ని గ్రంథాలు రచించాడు. బహుభాషా పండితుడుగా ఋగ్వేదాన్ని బెంగాలీలోకి, రామాయణ, భారతాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. కవిత్వం చెప్పాడు, నవలలు వ్రాశాడు. కాంగ్రెసుకు ఒకసారి అధ్యక్షుడైనాడు. వేబర్ వివిధ సమయాలలో రామాయణాన్ని గురించి విభిన్నాభిప్రాయాలను వెల్లడించగా, దత్ ఒకే సూచనను స్పష్టంగా చేశాడు, నిష్కర్షగా చేశాడు. అందువల్ల ముందుగా ఆయన సూచనను వివరించడమే సమంజసం.

విపుల పరిశోధనతర్వాత, దీర్ఘాలోచనపిదప దత్ చేసిన సూచన - ఋగ్వేదంలోని సీత మారి. మారి, రామాయణం సీతగా పరిణమించిందని. ఋగ్వేదంలోని సీత ఒక వ్యక్తి కాదు, నాగేటిచాలుకు వేదఋషులు చేసిన రూపకల్పన మాత్రమే. ^ ఒక దేవతామూర్తిగా నాగేటిచాలును సంభావించుకొని, తక్కిన అనేక దేవతలనువలె ఆమెను సయితం వేదకాలంలో ఆరాధించారు. కాలక్రమాన ఆమెను గురించి ఎన్నెన్నో కథ లల్లి, నారీలోకానికే శిరోమణిగా ఆమెను చేశారు. అంతటి

నారీశిరోమణిని ఒక మహాపురుషుని పుత్రికను చేయాలి కనుక, ఆమె పితృత్వాన్ని ఉపనిషత్తుల కాలంలో రాజర్షిగా ప్రఖ్యాతినందిన జనకునికి అంటగట్టారు. అయితే ఋగ్వేదాన్ని, దానిలోని నాగేటిచాలు ప్రసక్తిని పూర్తిగా త్రోసివేయడానికి వీలులేక, నాగేటి చాలులో జనకునికి దొరికిన శిశువుగా సీతను అభివర్ణించారు. నాగేటి చాలు (వ్యవసాయం) ఉత్తర భారతం నుంచి దక్షిణాపథానికి నెమ్మదిగా విస్తరించినప్పుడు సీతను గురించిన కథలు చిలవలు, పలవలు వేయడం సహజంగానే జరిగింది.

సీత వ్యావసాయిక దేవత అయితే, మరి రాము డెవరు? ఇందుకు రమేష్ చంద్రదత్ జవాబు "ఆయన ఇంద్రుడే" అని, పురాణాల ప్రకారం రాముడు శ్రీమహావిష్ణువు కాని, ఇంద్రుడు కాదు. అయితే, వేదయుగంలో ఇంద్రుడే దేవాధిదేవుడు; అప్పటిలో విష్ణువుస్థానం ఇంద్రుని తర్వాత ఏడు వెనకలు గానే, ఈనాడు బహుళ ప్రజలకు తెలియకపోవచ్చు గాని, ధర్మసూత్ర వాఙ్మయం ప్రకారం, సీత ఇంద్రుని భార్య. ఒకనాటి తన ప్రథమస్థానం నుంచి ఇంద్రుడు కేవల మొక దిక్పాలుడుగా డిమోట్ కావడం, విష్ణువు ఇంద్రుని స్థానానికి ప్రమోట్ కావడం, రాముడు విష్ణ్వవతారం కావడం, సీత రాముని భార్యకావడం ఈ మార్పు లన్నీ జరిగింది పౌరాణికయుగం ప్రవేశించిన పిదపనే. అయితే, ఇట్టి మార్పు లెన్ని జరిగినా, దత్ పలుకులలో, రాముడు ఇంద్రునికి "ఒక కొత్త మార్పు" ("న్యూ ఎడిషన్") మాత్రమే; రామరావణ యుద్ధం ఇంద్రవృత్రాసురుల యుద్ధానికి ఒక కొత్త రూపుమాత్రమే.

ఈ విషయాలను వేబర్ కాదనడుగాని, ఆయన మతం ప్రకారం ఋగ్వేదంలో కంటె స్పష్టంగా తైత్తిరీయ బ్రాహ్మణంలో రామాయణ గాథ బీజాలను చూడవచ్చు. ఆ బ్రాహ్మణంలోని ఒక గాథలో చంద్రునిపట్ల సీత ప్రేమప్రసక్తి వున్నది. రాముని "రామచంద్రుడు"గా కూడా పేర్కొనడం ఈ గాథ కారణంగానే కావచ్చునని వేబర్ ఊహ చేశాడు. ఇది పరిశీలనైనా లేకుండా త్రోసివేయదగు ఊహకాదు. "హరి" కున్న నానార్థాలలో "చంద్రు" డొకటి. ఇంతే కాక, చంద్రుని కున్న నామావళిలో "ఓషధీశుడు" అనేది కూడా వున్నది. అతడు ఓషధులకు ఈశుడైనందున, అతడిని సీత (వ్యావసాయిక దేవత) ప్రేమించడం సహజమే.

సీతకు వ్యవసాయంతోగల సన్నిహిత సంబంధానికి మరొక సాక్ష్యంగా పారస్కర గృహ్యసూత్రాన్ని చూపించవచ్చు. పొలం పైరుపై వుండగా "సీతయజ్ఞం" జరపాలని అది నిర్దేశిస్తున్నది. గృహ్యసూత్రాలనుగురించి ప్రత్యేక పరిశోధనలు జరిపిన డాక్టర్ వి.ఎమ్. ఆప్టే వివరించినట్టు, ఈ యజ్ఞానికి సంబంధించిన ఒక మంత్రం సీతను ఇంద్రుని భార్యగా సంబోధిస్తున్నది. కేవలం గృహ్యసూత్రాలలోనే కాక, జైనమత గ్రంథాలలో సయితం "సీత జన్మం" ప్రసక్తి వున్నట్టు జగదీశ్ చంద్ర జైన్ వ్రాశాడు.

ఋగ్వేదం సీత కాలక్రమాన రామాయణం సీతగా మారినట్టు చెప్పినవారిలో మరొక ప్రముఖుడు రామాయణాన్ని కూలంకషంగా పరిశీలించిన జర్మన్ పండితుడు హెర్మన్ యాకోబీ. ఆయన వ్రాసినట్టు, విష్ణువుకు మరొక పేరు "ఉపేంద్రుడు" (ఇంద్రుని సోదరుడు). "హరి" విష్ణువుమాత్రమే కాదు, ఇంద్రుడుకూడా. ఇందు వల్ల ఋగ్వేదంలోని ఇంద్రునికి సంబంధించిన పెక్కు గాథలను పౌరాణికయుగంలో విష్ణువుకు అంటగడుతూపోయారు. ఈ విషయంలోకి మరింత లోతుగా వెళ్ళి, ఎ.ఎ. మెకైనల్ ఈ కింది ముఖ్యాంశాలను పేర్కొన్నాడు: వృత్రాసురునికి ఋగ్వేదంలో ఒక పేరు "ఇంద్ర శత్రువు". రామాయణంలో ఈ పేరు రావణునికి లేదుగాని, అతని కుమారులలో ఒకనికి ("ఇంద్రజిత్తుకు") వున్నది. వృత్రాసురుడు చేసిన మహాపరాధం గోగ్రహణం కాగా, రావణుడు చేసింది సీతాపహరణం. వృత్రాసురునితో జరిగిన యుద్ధంలో ఇంద్రునికి తోడ్పడినవారు మరుత్తులు కాగా, రావణునిపై యుద్ధంలో రామునికి తోడ్పడినవాడు

మారుతి. 10 వృత్రాసురుడు హరించిన గోవుల జాడను తెలుసుకొనడానికి ఇంద్రునిబంటుగా సరమ (దేవతల శునకం) తోడ్పడినట్టుగా, సీత జాడను తెలుసుకొనడంలో మారుతి తోడ్పడ్డాడు. పైగా, యాకోబీ సంభావించినట్టు, హనుమంతుడు ఆదిలో దక్షిణాదివారికి వ్యవసాయాధిదేవత కావచ్చు. ఇంత గట్టిగా కాకపోయినా, ఋగ్వేదంలోని సీత కాలక్రమాన రామాయణం సీతగా రూపొందివుండవచ్చునని చెబుతూ, ఆదిలో దశరథరాముడు, హలధరుడైన బలరాముడు ఒక్కరే అయివుండవచ్చునని పారిస్ కు చెందిన సంస్కృత పండితుడు ఎ. బార్త్ సూచించాడు". ఆయనకంటే ముందుగా వేబర్ సరిగా ఇదే సూచన చేశాడు. పోతే, ఏ.బి.కీత్ కు సంబంధించినంతవరకు వ్యవసాయ గాథలే మారి మారి పెరిగి పెరిగి చివరికి రామాయణంగా పరిణమించాయి. రామాయణం ఆవిర్భావం విషయమై జరిగిన విభిన్న సూచనలలో "ఇదే అత్యంత విశ్వసనీయమైనది"గా ఆయన భావించాడు. వ్యవసాయాధిదేవతలు, వారికి సంబంధించిన కథలు, గాథలు, వారికి పూజాపురస్కారాలు - ఇవి కానరాని ప్రాచీన సంఘం లేనే లేదు. విల్ డూరెంట్ వివరించినట్టు, తక్కిన జంతుజాలం నుంచి వేరుపడి, నాగరికతాపథం వెంట నరుడు వేసిన తొలి మూడడుగులలో మొదటిది వాక్కు, రెండవది వ్యవసాయం, మూడవది లిపి. " వ్యవసాయాన్ని కనుగొనడానికి ముందు . నరుడు ఆటవికుడు, దేశదిమ్మరి. ఎక్కడ వేటకు జంతువులు దొరకగలవో అక్కడికి అతడు కదిలిపోతూ వుండేవాడు; ఎక్కడ పశువులకు మేత దొరకగలదో అక్కడికి తన నివాసం అతడు మార్చుతూవుండేవాడు. ఒకేచోట అతడు స్థిరపడిందీ, నాగరికతాభివృద్ధి కేమి, సంస్కృతీ వికాసాని కేమి ముఖ్యావసరమైన విభూతిని, విరామాన్ని అతడు సమకూర్చుకొన్నదీ వ్యవసాయం ప్రారంభమైన పిమ్మటనే. ఆలోచనా ఫలితంగా కాక, ప్రయోగాల ఫలితంగా కాక, మట్టిలో మానెడు గింజలు పోస్తే, అవి పుట్టెడు కాగలవన్న సంగతిని ఆరేడు వేల సంవత్సరాల క్రితం యాదృచ్ఛికంగా ఈజిప్టులో నరుడు కనుగొన్నాడు. 16 ఇది అతడి కంటికి ఒక వింతగా కనబడింది, అతడి బుద్ధికి ఒక అత్యద్భుత విషయంగా తోచింది. దీన్ని కేవలం ఏదో ఒక దేవత, లేదా కొందరు దేవతల మహిమగా అతడు విశ్వసించాడు; ఈ ప్రాచీన విశ్వాసం నుంచి ఉత్తర భారతంలో వ్యవసాయాధి దేవతలుగా ఇంద్రుడు, పర్జన్యుడు, అశ్వినులు, మరుత్తులు, ఉద్దాలకాశ్యపుడు, స్వాతికారి, సీత, అనుమతి - ఇందరు దేవతలు పుట్టుకువచ్చారు.

ఇండియాలోనే కాదు, దేశదేశాలలో ఇంతే జరిగింది. ఉదాహరణకు, ఈజిప్టులో ఓ సైరిస్, ఐసిస్ మున్నగువారు వ్యవసాయాధి దేవతలు; గ్రీసులో డైయొనైసెస్, డిమీటర్, పర్సెఫని మున్నగువారు వ్యవసాయాధి దేవతలు; శాటర్నస్, సెయ్, సెగెటియా, యాటిస్ తదితరులు రోమన్ వ్యవసాయాధి దేవతలు. వీరిలో కొందరి ఒకప్పుడు సంప్రీత్యర్థం దేశదేశాలలో నరబలులు సాగుతూవుండేవి. బ్రిటిష్ వారు జోక్యం కలిగించుకొని, దాన్ని నిషేధించడానికి పూర్వం మన దేశంలో ఖోండ్ తెగవారు, గోండ్ తెగవారు నరబలి తర్వాతనే కొత్త పైరును పెడుతూవుండేవారు. వారిలో గోండ్ జాతివారికి బ్రాహ్మణ బాలుని బలిపెడితే, పంట మరింతగా రాలుతుందని ఒక వెర్రి నమ్మకం వుండేదట. తెలుగు, తమిళ, కన్నడ గ్రామాలలో ఒకప్పుడు - చెదురుగా బహుశా ఇప్పుడు కూడా - పోతురాజుకు బలిగా ఎనుబోతులను, మేకపోతులను నరకడం అతడు పైర్లను కాపాడతాడన్న విశ్వాసంతోనే." ఇప్పుడు తిరిగి అసలు విషయానికి వస్తే, చెప్పవలసిన మాట లివి; ఋగ్వేదంలో నాగేటి చాలుకు ప్రతిరూపమైన సీత మహాభారతంలో ధాన్యలక్ష్మిగా మారింది. అందువల్ల రామాయణం పుట్టుపూర్వోత్తరాలను గురించి రమేశ్ చంద్ర దత్ వ్రాసినదాన్ని ఒక ఆంగ్ల మానసపుత్రుని వెర్రిమొర్రి ప్రేలాపనగా త్రోసిపుచ్చడం సాధ్యం కాదు. వేబర్, యాకోబీ, బార్త్, కీత్ , మున్నగు పాశ్చాత్య పండితులు చేసిన సూచనలను "ఈ కిరస్తానీలు ఇంతకంటె ఏమి అనగలరులే!" అని నిరసించడానికి సయితం వీలులేదు. వేబర్ ను బలపరుస్తూ వింటర్ట్స్ అన్నట్టు; ఋగ్వేదం సీతకు, రామాయణం సీతకు కొన్ని యోజనాల దూరం ఉండవచ్చు. అయినా, ఆ సీత లిద్దరికి ఎంతో కొంత రక్తబాంధవ్యం నిశ్చయంగా ఉన్నది.

తక్కిన పాశ్చాత్య పండితులను చులకనచేసే మన రామభక్తులు సయితం మాక్స్ ముల్లర్ ను మెచ్చుకొంటారు; మామూలుగా మెచ్చుకొనడమైనా కాదు, "మోక్ష ముల్లర్" అంటూ నెత్తిన పెట్టుకొంటారు. ఔను! వారి దృష్టిలో ఆయన అంతగా గౌరవించదగువాడే! సమస్త విద్యలకు, సర్వశాస్త్రాలకు, సకలకళలకు ప్రాచీన భారతం నిలయమని ఆయన చెప్పలేదా? నాగరికతను ప్రపంచానికి భిక్షగా పెట్టింది భారతదేశమే అని ఆయన చాటలేదా?
భారతావనిపట్ల తనకున్న భక్తిలో శతాంశమైనా తన మాతృదేశమైన జర్మనీపట్ల తనకు లేదని ఆయన ఉద్ఘాటించలేదా? అట్టి "మోక్ష ముల్లర్" రామాయణానికే కాక, భారతానికి కూడా చారిత్రకాధారం లేదని వ్రాశాడంటే, అది మన రామభక్తులకు విద్యుదాఘాతం కావచ్చు. కాని, ఆయన అంతే వ్రాశాడు. ఈనాడు నోముల, వ్రతాల సందర్భంలో వాటిని జరిపించే పురోహితులు ఏవేవో కట్టుకథలు చెప్పడం కద్దు. వేదయుగంలో యజ్ఞయాగాదుల సందర్భంలో ఋత్విజులు ఇదేవిధంగా కథలు, గాథలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు మొదలైన వాటిని చెప్పేవారని, అవే అటు తర్వాత రామాయణ, భారతాల రూపాన్ని ధరించాయని మాక్స్ ముల్లర్ సూచించాడు. సరిగా ఇవే మాటలను వాడకపోయినా, ఆయన తాత్పర్యం వేదయుగంనాటి జానపద వాఙ్మయం రామాయణ, భారతాల రూపంలో కావ్యగౌరవాన్ని సంపాదించు కొన్నదని.

అయితే, ఎందరు పండితులు - ఎంత టెంతటి విద్వాంసులు - రామాయణం అంకురప్రాయంగా వేదవాఙ్మయంలోనే వున్నట్టు చెప్పినా, ఈ విషయాన్ని గుర్తించడానికి పూర్తిగా నిరాకరించిన భారతీయ పరిశోధకులలో ప్రథమగణ్యుడు దినేశ్ చంద్రసేన్. ఆయన వంగ ప్రజలను గురించి, వారి జానపద సాహిత్యాన్ని గురించి, వంగభాషను గురించి, దానిలోని వాఙ్మయాన్ని గురించి, చైతన్యుని గురించి, ఆయన మతాన్ని గురించి అనేక గ్రంథాలను రచించి కీర్తి కెక్కినవాడు. వంగభాషలోని రామాయణాలను గురించి, ముఖ్యంగా కృత్తివాస రామాయణాన్ని గురించి, ఉపన్యాసాల రూపంలో తాను వ్రాసిన గంథంలో వాల్మీకి రామాయణానికి ఏపాటి చారిత్రకాధారం కలదన్న విషయాన్ని విపులంగా చర్చించి, ఎంతమాత్రం లేదన్న తీర్మానానికి ఆయన వచ్చాడు. ఈ సందర్భంలో ఆయన చేసిన వాదంలో ప్రధానాంశా లివి:

1 ముఖ్యంగా దశరథ జాతకకథ, కొంత తక్కువ స్థాయిలో సామ, వెస్సంతర జాతకకథలు - వీటి కలగాపులగమే రామాయణంలోని బాల, అయోధ్యాకాండలు.
2 ఆరణ్య, సుందరకాండలకు మూలాధారం ఒకనాడు మధ్య అమెరికా, జపాన్ మొదలైన కొన్ని ప్రాంతాలలోను, ఈ నాటికి సయితం ఇండియాలోను బహుళ వ్యాప్తిలోగల ఆంజనేయారాధన.
3 పోతే, యుద్ధకాండకు, ఉత్తరకాండకు ప్రాతిపదికలు రామునితో ఏమీ సంబంధం లేకుండా ఒకప్పుడు రావణుని గురించి దక్షిణ భారతంలో ప్రచారంలో గల గాథలు.

దినేశ్ చంద్ర సేన్ పేర్కొన్నట్టు, రాముని వనవాసగాథకు, దశరథ జాతక కథకు కొంత హెచ్చుగానే పోలిక లున్నాయి. అయితే, వాటి మధ్య కొన్ని వ్యత్యాసాలు కూడా వున్నాయి. రామాయణానికి మూలాధారాల చర్చ సందర్భంలో ఈ జాతకకథకున్న అధిక ప్రాధాన్యం దృష్ట్యా పాళీ భాష నుంచి దానికి స్వామి శివశంకరశాస్త్రి సరళమైన భాషలో సుందరంగా చేసిన ఆంధ్రానువాదాన్ని ఈ పీఠిక చివర మొదటి అనుబంధంగా ప్రచురిస్తున్నాను. దాన్ని చదివితే వాల్మీకంలోని రాముని వనవాస గాథతో ఈ కింది ముఖ్యాంశాలతో అది విభేదిస్తున్నట్టు స్పష్టపడుతుంది:
1 దశరథుడు కోసలదేశం రాజు కాదు, కాశీప్రాంతం రాజు.
2 రామలక్ష్మణుల పేర్లు రామపండిట్, లక్ష్మణకుమారుడు. సీత వారిద్దరి సోదరి. వారు ముగ్గురు దశరథుని పట్టపుదేవేరి సంతానం.
3 పట్టపుదేవేరి మరణించిన వెనుకనే దశరథుడు రెండవ పెళ్ళి చేసుకొంటాడు. ఆమెకు కలిగిన కొడుకు భరతుడు.

(కౌసల్య, కైకేయి పేర్లు జాతకకథలో కానరావు. దానిలో సుమిత్ర, శత్రుఘ్నుల ప్రసక్తి రానేరాదు).

4 ఆడినమాట తప్పరాదన్న బాధతో కాక, సీతారామలక్ష్మణులకు కైకేయి వల్ల ముప్పు కలగవచ్చునన్న భయంతోనే దశరథుడు పన్నెండు సంవత్సరాలపాటు వనవాసం చేయవలసిందిగా వారికి సూచిస్తాడు.

(జ్యోతిషులు మరి పన్నెండేళ్ళు మాత్రమే ఆయనకు ఆయుర్దాయమని చెప్పినారట).

5 సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళ్ళింది దండకారణ్యానికి కాదు, హిమాలయాల ప్రాంతానికి.

6 పుత్రవియోగ దుఃఖంతో దశరథుడు వెంటనే చనిపోడు; రాముడు వనవాసానికి వెళ్ళిన తర్వాత తొమ్మిదేళ్ళ తర్వాతనే. అప్పుడుగాని అన్న వద్దకు వెళ్ళి, వెనుకకు వచ్చి పట్టాభిషేకం చేసుకొనవలసిందిగా భరతుడు అభ్యర్థించడు.

7 తండ్రి మరణవార్త విన్నపిమ్మట సీత, లక్ష్మణుడు వారణాసికి తిరిగి వచ్చినా, రామపండితుడు మాత్రం మొత్తం పన్నెండేళ్ళు వనవాసం చేస్తాడు. ఆ గడువుపిమ్మట తమ రాజ నగరానికి తిరిగివచ్చి, సీతను పరిణయమంది, పట్టాభిషేకం చేసుకొంటాడు.

రామాయణగాథతో ఇన్ని వ్యత్యాసాలే కాక, ఒక వైపరీత్యం కూడా ఈ దశరథ జాతకంలో వుండగా, ఇది రామాయణం ప్రథమ భాగానికి ఆధారభూతమని చెప్పడం "హరిహరీ! ఎంతటి పాపపు మాట!" అని రామభక్తులు ఒక్కుమ్మడిగా పైకి దూకుతారనుకోండి. కాని, దినేశచంద్ర సేన్ కంటే పెక్కు దశాబ్దాలకు ముందు వేబర్ ఇంతే అన్నాడు; ఇటీవల సునీతికుమార ఛటర్జీ అంతే అంటున్నాడు. వీరు కేవలం దశరథ జాతకకథ మీదనే ఆధారపడితే, వీరి వాదంలో పస లేదని కొట్టిపారవేయవచ్చు. కాని, దానికి సామ, వెస్సంతర జాతక కథలను కలిపితే, రామాయణగాథ ప్రథమ ఘట్టాలు స్థూలంగా రూపొందుతాయి.

అయితే, అన్నచెల్లెళ్ళ పెళ్ళి వైపరీత్య మేమి టన్న ప్రశ్న వెంటనే వస్తుంది. ఒకనాడు ఈజిప్టు రాజవంశంలో ఇది విపరీతం కాదు; బాబిలోనియన్ రాజవంశంలో విపరీతం కాదు; ఇరానియన్ సంఘంలో విపరీతం కాదు; ఇండియాలో శాక్యవంశీకులలోనైనా విపరీతం కాదు. గౌతమబుద్ధుని పూర్వీకులలో అన్నచెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు పరిపాటిగా జరుగుతూ వుండేవట. వివాహాది సాంఘికాచారాల విషయంలో కాలం నుంచి కాలానికి, దేశం నుంచి దేశానికి, జాతి నుంచి జాతికి, తెగ నుంచి తెగకు విధి నిషేధాలు మారడం కద్దు. ఒకరికి మహా విపరీతమైనదిగా తోచే సాంఘికాచారం మరొకరికి అతి సహజమైనదిగా తోచడం కద్దు. ఎంత దూరమో పోవడం దేనికి? మన దేశంలో ఇటీవలి వరకు సహగమనం విద్యుక్త ధర్మం కాదా? రజస్వలానంతర వివాహం పాపహేతువు కాదా? వితంతు వివాహాలు, వర్ణాంతర వివాహాలు నిషిద్ధాలు కావా? కొంత వెనుకకు వెడితే, భర్త ద్వారా సంతానాన్ని పొందలేకపోయినప్పుడు అన్యపురుషుని ద్వారా పొందడం సదాచారమే కాదా? (**దీన్ని "నియోగం" అనేవారు. "శబార్థచంద్రిక" వివరణ ప్రకారం "నియోగం" అంటే "పుత్రులు లేని విధవను దేవరుని వలననో, సపిండుని వలననో పుత్రుని పడయుటకై నియమించుట", "శబ్దరత్నాకరము" ఈ వివరణను దాటవేయడానికి నియోగంపట్ల ఇప్పటి వైముఖ్యం కారణం కాబోలు!**)

దశరథ జాతకకథ నుంచి రామాయణగాథ పుట్టలేదని, రామాయణగాథను స్వప్రయోజనాల కోసం బౌద్ధ మతస్థులు వికృతం చేసి పెట్టి నారని సి.వి. వైద్య సిద్ధాంతీకరించడానికి ప్రయత్నించాడు. 25 అయితే, ఇది నిష్పాక్షిక పరిశీలనకు తాళగల సిద్ధాంతం కాదని దినేష్ చంద్ర సేన్ రచనను చదివితే స్పష్టపడుతుంది. పోతే, నా దృష్టిలో జాతక కథలను బుద్ధునికి అంటగట్టడం ఆయనపట్ల ఘోరాపచారం చేయడమే! మొదటినుంచి చివరివరకు అవి స్వోత్కర్షతో కూడిన కథలే.

తన పరినిర్వాణసమయంలో తన ప్రియశిష్యుడు ఆనందుడు తనను స్తోత్రం చేయడానికి ప్రయత్నించగా బుద్ధుడు అతనిని మృదువుగా మందలించాడు.

అట్టి బుద్ధుడు తన ఘనతను తానే చాటుకొనడానికి కట్టుకథలను, పిట్టకథలను కొన్ని వందలు కల్పించి చెబుతాడా? ఆయన తదనంతరం మతిలేని ఆయన శిష్యు లెవరో ఆనాడు ప్రజా సామాన్యంలో ప్రచారంలోగల జానపదగాథలను జాతకకథల పేరుతో ఆయనకు అంటగట్టారు. బౌద్ధరచయితల పద్ధతిలో ఆనాటి జానపద గాథలలోనే కొన్నింటిని వాల్మీకి తన రామాయణం కోసం ఎన్నుకొన్నాడని ఎందుకు అనుకోరాదు? కవి కాబట్టి, ఆ కథలకు వీలైనంతగా ఆయన మెరుగులు దిద్దినాడని ఎందుకు అనుకోరాదు? ఏమైనా, ఒక జాతిగా మన దౌర్భాగ్యం జానపదగాథకు, చారిత్రక సంఘటనకు వ్యత్యాసాన్ని, ఆ నాడే కాదు, ఈనాటికీ గుర్తించలేకపోవడమే! పోతే, దినేశ్ చంద్ర సేన్ వివరించినట్టు, ఒకప్పుడు వానరపూజ దేశదేశాలలో వుండేది.? ఈజిప్షియనుల, బాబిలోనియనుల దృష్టిలో వానరం ఒక పవిత్రమైన జంతువు. తమది వానర వంశమని టిబెటనులు గొప్పలకు పోతారు. జపానులో ఒక వానర దేవాలయం వున్నది. మధ్య అమెరికాలో వానర విగ్రహాల శిరస్సులు కనిపించాయి. పోతే, మన దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతంలో రామాలయాల కంటె ఆంజనేయుని గుడులే ఎక్కువ వున్నట్టు చెప్పవచ్చు. అన్నట్టు, ఆంజనేయునికి ఆలయా లున్నవి కాని, భరతునికి లేవు, లక్ష్మణునికి లేవు! కొందరు శైవుల విశ్వాసం ప్రకారం శివుడే హనుమంతుడుగా అవతరించాడు. బౌద్ధ జాతకకథల ప్రకారం ఒక పూర్వజన్మలో బుద్ధుడు వానరుడు. నిజానికి వైష్ణవంలోనే ఆంజనేయుని స్థానం తక్కువ. దానిలో అతడు రామునికి నమ్మిన బంటు మాత్రమే. దినేశ్ చంద్ర సేన్ కంటే చాలా ముందుగానే హనుమంతుని గురించి సర్ ఆల్ ఫ్రెడ్ సి. లియెల్, హెర్మన్ యాకోబీలు కొన్ని ఆసక్తిదాయకమైన విషయాలు వ్రాశారు. లియెల్ వివరించినట్టు కోతులతోపాటు ఒకప్పుడు పెద్దపులులను, తోడేళ్ళను కూడా ఇండియాలో పూజిస్తూ ఉండేవారు. వీటికంటె మిన్నగా త్రాచుపాములను పూజిస్తూ ఉండేవారు. ఇప్పుడు పెద్దపులుల, తోడేళ్ళ పూజ ఆటవిక జాతులలో తప్ప మిగలలేదేమో! పాముల పూజ నాగులచవితికి ప్రస్తుతం విశేషంగా పరిమిత మౌతున్నది.

పోతే, హనుమంతుని రూపంలో వానరపూజ మాత్రం నానాటికీ పెరుగుతున్నది. ఇండియాలో పూజ లందుతున్న జంతువులలో అగ్రస్థానం వానరానిదే అని లియెల్ నూరేళ్ళ క్రితం చెప్పిన మాట నేడు మరింత నిజం.

ఆదిలో హనుమంతుడు నిశ్చయంగా అనార్యుల వేల్పు. అతడి పూజ రామపూజకంటె కనీసం ఒకటి, రెండువేల సంవత్సరాలకు ముందుగానే ప్రారంభమై వుండవచ్చు. ఋగ్వేదంలో ఒకే ఒకచోట వానర ప్రసక్తి వున్నది. అక్కడ (పదవ మండలంలో) ఇంద్రుని మిత్రుడుగా వృక్షకపిని పేర్కొనడం జరిగింది. ఈ వృక్షకపి కాలక్రమాన హనుమంతుడుగా మారివుండవచ్చునని బార్త్ వ్రాశాడు. ఇది అర్థంలేని వ్రాత. ఋగ్వేదకాలంలో చివరికి గోవునైనా ఇప్పటివలె పూజించే వారు కాదు. దాన్ని చక్కగా పోషించేవారు, సుష్ఠుగా ఆరగించేవారు. బార్త్ ఉదాహరించిన ఋక్కులలోనే సేవించడానికి సిద్ధంగావున్న సోమరసాన్ని పాడుజేసిన వృక్షకపి తలను ఉత్తరించాలని ఇంద్రాణి అన్నట్టుగా వున్నది. అప్పటిలో వానరపూజ ఈ రూపంలో, ఎంత స్వల్పంగా వున్నా ఇంద్రాణి నోట ఈ మాట వచ్చేది కాదు గదా! పైగా, యాకోబీ దృష్టిలో ఈ వృక్షకపి ఋక్కులు అశ్లీలంగా వున్నాయి, అస్పష్టంగానూ వున్నాయి. బార్త్ వలె కాక, లియెల్ సరిగా ఊహించినట్టు, ఏదో ఒక ఆటవిక జాతిలో హనుమంతుడు ఒక వీరపురుషుడు అయివుండవచ్చు. అతడికి సంబంధించిన వీరగాథలకు, వానర పూజకు సంబంధించిన విశ్వాసాలకు లంకె ఏర్పడి వుండవచ్చు. అందుమీదట అవతారపురుషుని ప్రతిపత్తికి అతడు పెరిగివుండవచ్చు."

ఇంతకంటె ముందుకు వెళ్ళి, గ్రామగ్రామంలో హనుమంతునికి పూజ జరగడానికి అతడిని సేద్యానికి, ప్రత్యేకించి ఋతుపవనాలకు, సంబంధించిన దేవతగా గ్రామీణులు భావించడమే కారణం కావచ్చునని యాకోబీ ప్రతిపాదించాడు. హనుమంతుని కున్న వివిధ నామధేయాలలో "పావని" అనేది ఋతుపవనాలతో అతడి సంబంధాన్ని సూచిస్తున్నది. ఋతుపవనాల వెంట ఎన్ని వందల, ఎన్ని వేల యోజనాల దూరమైనా మేఘాలు అవలీలగా పయనిస్తాయి. ఈ శక్తి హనుమంతునికి కూడా వున్నది. మేఘాలు ఈ క్షణంలో బృహత్తర రూపంలో వుండవచ్చు, మరుక్షణంలో అతిసూక్ష్మ రూపాన్ని ధరించవచ్చు. ఇదే విధంగా హనుమంతుడు కోరిన రూపాన్ని ధరించగలడు. ఈ పద్ధతిలో మరికొన్ని శక్తులను, మహిమలను ఎవరికి తోచినట్టు వారు హనుమంతునికి ఆపాదిస్తూ పోయారు. వర్షాధిదేవతగా అదివరకే గ్రామీణులలో, ముఖ్యంగా వ్యవసాయదారులలో, అతడిపట్ల వున్న భక్తి ప్రపత్తులు రామాయణంలో అతడి ప్రధాన పాత్రతర్వాత ఇబ్బడిగా, ముబ్బడిగా పెరిగిపోయాయి. అందువల్లనే రామునికంటె మిన్నగా అతడికి ప్రజాసామాన్యంలో భక్తులున్నారు. అతడి భక్తులలో ప్రత్యేకించి పేర్కొనదగువారు హిందూ వస్తాదులు."

నాది చిలిపిమాటగా కొందరికి తోచవచ్చుగాని, దాన్ని అనకుండా వుండలేక పోతున్నాను. ఎప్పుడు, ఎవరు, ఎందుకు, ఏ రూపంలో వానరపూజను ప్రారంభించినా, ఇప్పటికీ దాన్ని జరిపే నరుని మానసిక వికాసం నానరస్థాయిని దాటిపోదు, పోలేదు.

ఉత్తరాది కట్టుకథలు కొన్ని, దక్షిణాది పిట్టకథలు మరికొన్ని, వాల్మీకి ఇంద్రజాలంతో రామాయణ మహాకావ్యం రూపాన్ని ధరించినట్టు దినేశ్ చంద్ర సేన్ చెప్పగా, ఈ కథలన్నీ ప్రాచ్యభారతానికి, ప్రత్యేకించి నిషాదజాతివారికి చెందిన వని సునీతి కుమార్ ఛటర్జీ సంభావిస్తున్నాడు. ఆయన మతం ప్రకారం వాల్మీకి పై హోమర్ కావ్యాల ప్రభావం నిశ్చయంగా వున్నది.

రామాయణం విషయంలో మొట్టమొదటగా హోమర్ ప్రసక్తి తెచ్చినవాడు వేబర్. పుట్టుపూర్వోత్తరాలనుగురించి ఆయన చేసినన్ని సిద్ధాంతాలు మరెవ్వరు చేయలేదు. వాటిలో పరస్పర వైరుధ్యా లుంటే వాటిని అనివార్యం చేసినట్టిది రామాయణమే. దానిలోని ప్రత్యక్షరాన్ని పరమపవిత్రమైనదిగా కళ్ళ కద్దుకొనే రామభక్తులను విడిచిపుచ్చితే, సుందరకాండను ఎంతగా పారాయణం చేస్తే స్వర్గ ద్వారాలు అంత నిశ్చయంగా తమకోసం తెరుచుకొని వుంటాయని నమ్మేవారిని విడిచిపుచ్చితే, రామాయణంలో పరస్పర వైరుధ్యాలు ఎక్కడ లేవు, ఎంతగా లేవు? వాటిని కప్పి పుచ్చడం కోసమే తిలక, కతక, శిరోమణి, భూషణాది వ్యాఖ్యానాలను వ్రాసినవారు కప్పదాట్లు వేశారు, పీతనడక నడిచారు, పిల్లి మొగ్గలు వేశారు, కోతి చేష్టలు చేశారు, కాకి గోల పెట్టారు, కొక్కిరాయి వేషాలు వేశారు. పడరాని పాట్లు మరెన్నో పడ్డారు. అయినా, రామభక్తులు మాత్రం "ఆహా!", "ఓహో!" అంటూ వారిని మెచ్చుకొంటారు. లేకపోతే, తమను పాపం చుట్టుకోదా, తాము నరకాన పడిపోరా?

రామాయణగాథలోని ప్రథమ ఘట్టాలకు మూలం బౌద్ధ జాతక కథలు కాగా, ధనుర్భంగం, సీతాపహరణం, లంకపై దండయాత్ర గ్రీక్ పురాణాలనుంచి వాల్మీకి పరిగ్రహించిన ఘట్టాలు కావచ్చునని వేబర్ ప్రతిపాదించాడు. రామాయణంలో రెండుచోట్ల యవనుల ప్రసక్తి వస్తుంది. వారు గ్రీకుకు చెందినవారు కావచ్చు, కాకపోవచ్చు. మన ప్రాచీన గ్రంథాలలో బాహ్లిక ప్రాంతంలో (మధ్య ఆసియా) స్థిరపడిన గ్రీకులను యవనులనేవారు; కేవలం గ్రీకులనే కాక, శ్వేత జాతివా రందరిని యవను లన్న సందర్భాలు సయితం కొన్ని లేకపోలేదు. ఏమైనా, రామాయణంలో గల యవనుల ప్రసక్తినిమాత్రమే పురస్కరించుకొని, హోమర్ నుంచి వాల్మీకి కొన్ని ఘట్టాలను పరిగ్రహించినట్టు వేబర్ చెప్పలేదు. అనువాదాల రూపంలో హోమర్ కావ్యాలు ఇండియాలో ప్రచారంలో వున్నట్టు దియోన్ క్రిసా సమస్, క్లాడియస్ ఈలియన్లు

క్రీస్తుశకం ప్రథమ శతాబ్దిలో వ్రాశారు. వీరిమాట ఎంతవరకు నిజమో చెప్పలేమని వేబర్ స్వయంగా గుర్తించాడు. కాని, ఆయన ఊహ హోమర్‌ను గురించి, హోమర్ కావ్యాలనుగురించి వాల్మీకి కర్ణాకర్ణిగా వినివుండ వచ్చునని. తన ఊహను బలపరచడం కోసం సీతాపహరణకు, లంకపై దండయాత్రకు "ఇలియడ్" మూలం కావచ్చునని, శివధనుర్భంగ గాథ "ఆడెసీ" నుంచి స్వీకరించినట్టిది కావచ్చునని ఆయన సూచించాడు.

అయితే 1873 లోనే కె.టి. తెలాంగ్ తన సవిస్తర సమాధానంలో పేర్కొన్నట్టు, వేబర్ సూచనలో ధనుర్భంగం, పరదారాపహరణ ఇట్టి సంఘటనలు గ్రీసు, ఇండియాలకే పరిమితం కావు; అన్యదేశాల చరిత్రలలో సయితం ఇట్టివి కానవస్తాయి. ఇంతేకాక, యులిసి తో రామునికి పోలికలు తక్కువ; హెలెతో సీతకు పోలికలు మరింత తక్కువ. నిజానికి సీత కాలిగోటికైన హెలెన్ దీటు రాదు. తెలాంగ్ తో పాటు యాకోబి, వింటర్ నిట్స్ వైద్య, బుల్కే ఈ విషయంలో వేబర్ వాదాన్ని తిరస్కరించారు. బలం లేదు.

ఇద్దరి రచనలమధ్య పోలికలు కనబడినప్పుడు, వా రిద్దరిలో ఎవరు ఏ కాలానికి చెందినవారో స్పష్టంగా తెలియనప్పుడు, ఎవరికి ఎవరు ఋణపడివున్నారో చెప్పలేము. హోమర్ ప్రభావం వాల్మీకి పై అధికంగా కనబడుతున్నట్టు వేబర్ వ్రాయగా, వాల్మీకి రామాయణాన్ని ఫ్రెంచి భాషలోకి అనువదించిన ఇపోలిట్ పోష్ వాల్మీకినుంచి హోమర్ కాపీ కొట్టినట్టు బల్లగుద్ది వాదించాడు. ఆయన వాదం ప్రకారం ఎగమెమ్ నకు సుగ్రీవునితో, పెట్రాక్లెస్ కు లక్ష్మణునితో, నెష్టరు జాంబవంతునితో, ఒడిసియూస్ కు హనుమంతునితో ఎంతటి దగ్గరి పోలిక లున్నాయంటే, ఆ హోమర్ పాత్రలను ఈ రామాయణ పాత్రలకు ప్రతిరూపాలుగా అభివర్ణించవచ్చు. అయితే, కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీలో ఇటీవలనే ప్రసంగిస్తూ, సునీతి కుమార్ ఛటర్జీ తెలాంగు కాదని, యాకోబీ, వింటర్ ్స్‌లను కాదని, వైద్య, బుల్కేలను కాదని, వేబర్ తో పూర్తిగా ఏకీభవించాడు. వాల్మీకిపై హోమర్ ప్రభావం అత్యధికంగా కలదని ఆయన ఉద్ఘాటించాడు. గ్రీక్ పురాణగాథలలోని బ్రెయేరియకు యాభై తలలు, నూరు చేతు లుండగా, రావణుని విషయంలో వాల్మీకి వాటిని పదితలలకు, ఇరవై చేతులకు తగ్గించినట్టు చెప్పాడు. ఛటర్జీ బహు భాషాకోవిదుడు, మహాపండితుడు, అఖండ విజ్ఞాని. ఆయన స్వతంత్రంగా ఆలోచించగలడు, సాహసోపేతంగా వ్రాయగలడు. అయినా, ఈ విషయంలో ఆయన పొరపడుతున్నట్టుగా చెప్పక తప్పదు.

ఇక, ఆర్. శ్యామశాస్త్రి వాదం రామాయణం అంటే కథారూపంలో ఖగోళశాస్త్రమే అని. రాముడు సూర్యుడు కాగా, భరతుడు శుక్రుడట, లక్ష్మణ శత్రుఘ్నులు బృహస్పతి, బుధు లట. అయితే, సీతనుమాత్రం మరొక గ్రహంగా మార్చక, నాగేటి చాలుగానే ఈయన మిగిల్చాడు. సూర్యాయణంతో, గ్రహచలనంతో రామాయణంలోని ప్రధాన ఘట్టా లన్నింటికి ఏదో ఒక ముడి పెట్టడానికి ఈయన ప్రయత్నించాడు. ఇందుకై తాను చేసిన మొదటి ప్రయత్నం తనకే నచ్చనందున ఈయన రెండవ ప్రయత్నం చేయగా, అది సయితం మొదటిదానివలె వృథా శ్రమగానే పరిణమించింది. శ్రీ శ్యామశాస్త్రి ఎంత పండితుడైనా మోకాటికి, బట్టతలకు ముడి వేయలేదుగదా;

కాగా, రామాయణానికి చారిత్రకాధారం నిస్సందేహంగా కలదని వాదించే వారిలో వాదబలంకంటె విశ్వాసబలం హెచ్చుగా కానవస్తుంది. రాముడు చారిత్రక పురుషుడైతే ఆయన ఏ కాలంవాడు? ఈ విషయమై వారి మధ్య ఏకాభి ప్రాయం లేదు. ఆయన ఇక్ష్వాకు వంశవృక్షం విషయమై కూడా ఏకాభిప్రాయం లేదు. ప్రాచీన భారత రాజ వంశాలనుగురించి ప్రత్యేక పరిశోధనలు చేసిన ఎఫ్.ఇ. పార్టిటర్ రామాయణంలోని ఇక్ష్వాకు వంశవృక్షం తప్పుల తడకగా వున్నదని, అందువల్ల దాన్ని త్రోసిపుచ్చి, పురాణాలలో గలదాన్ని స్వీకరించాలని ప్రతిపాదించాడు. తన కథానాయకుని వంశవృక్షం విషయంలోనే విశ్వసించరాని రామాయణాన్ని అన్యవిషయాలలో విశ్వసించవచ్చునా? ఈ ప్రశ్న పార్జిటర్కు తోచనైనా

లేదు. కనుకనే రాముడు సింహళంవరకు వెళ్ళి, దాన్ని జయించినట్టు ఆయన వ్రాశాడు. హెచ్. హెచ్. విల్సన్ కూడా ఇంతే వ్రాశాడు. భారతీయ చరిత్రకారులలో సి.వి. వైద్య, " వి. రంగాచార్య, " ఆర్.సి. మజుందార్, ' ఎన్.కె. సిద్ధాంత ' మొదలైనవారు కొన్ని వందలమంది ఇంతే వ్రాశారు. లంక అంటే విధిగా సింహళమే కాకపోవచ్చునని వారిలో ఒక్కరికైనా తోచలేదు. రాముడు వింధ్యపర్వతాలను దాటి . దక్షిణాపథంలో అడుగు పెట్టలేదని చెప్పడానికి రామాయణంలోనే వున్న ప్రబలాధారాలలో ఒక్కటైనా వారి కంటబడలేదు. ఈ విషయాన్ని మరొకచోట చర్చించనున్నాను కనుక, ఇక్కడ మరి దీన్ని గురించి ప్రస్తావించను.

పోతే, రాముడు నిజంగా వింధ్య పర్వతాలను దాటివచ్చినా, సింహళంవరకు పురోగమించినా, కిష్కింధను కాని, లంకను కాని తన కోసల రాజ్యంలో ఆయన అంతర్భాగాలను చేసుకోలేదు; వాలిని కూలవేసిన తర్వాత కిష్కింధను సుగ్రీవునికి, రావణ వధానంతరం లంకను విభీషణునికి ఆయన అప్పగించాడు. అందువల్ల రాముడు సాధించింది లంకవరకు ఆర్యనాగరికత విస్తృతిని కాని, ఆర్యసామ్రాజ్య విస్తరణ కాదని కొందరి మతం. వీరిలో ఒక ప్రముఖుడు రాధాకుముద్ ముఖర్జీ.

ఈ విభిన్న సిద్ధాంత రాద్ధాంతాలతో పాటు తప్పక పేర్కొనవలసినవి మరికొన్ని కూడా వున్నాయి. వాటిలో మొదటిది పి.టి. శ్రీనివాస అయ్యంగార్ చేసిన విచిత్ర సిద్ధాంతం. వేదకాలంలో ఒక వాల్మీకి వుండేవాడట; తర్వాత పాణినికి సమకాలికుడుగా మరొక వాల్మీకి వుండేవాడట. ఆ మొదటి వాల్మీకి కావ్యంలో ఈ రెండవ వాల్మీకి చేర్పులు, మార్పులు చేశాడట. అందువల్ల రాముని కొన్నిచోట్ల అవతారమూర్తిగా, కొన్ని చోట్ల మానవమాత్రుడుగా రామాయణంలో మనం చూస్తున్నామట!" ఈ ఒక్క దెబ్బతో రామాయణంలోని పరస్పర వైరుధ్యాలన్నింటిని తాను తొలగించివేసినట్టు శ్రీనివాస అయ్యంగార్ ఎంత సంతోషించాడో మనకు తెలియదుగాని, ఆయన వాదంలో పస లేదు. రామాయణాన్ని వ్రాసింది ఇద్దరు వాల్మీకులు కాదు; ఒక అసలు వాల్మీకితోపాటు, ఒక నూరు, లేదా రెండు వందల మంది (ప్రక్షిప్తాల పాపానికి వొడిగట్టుకొన్న) నకిలీ వాల్మీకులు!

పి.టి. శ్రీనివాస అయ్యంగార్ తెలివికి పోతే, జె. టాల్ బాయ్స్ వీలర్ అతి తెలివికి పోయాడు. దక్షిణ భారతంలో బ్రాహ్మణ, బౌద్ధ మతాల సంఘర్షణనే రామాయణ యుద్ధంగా వాల్మీకి చిత్రించాడని ఆయన సూచించాడు. దీనిలో కొంత సత్యం వుండవచ్చునని ఆదిలో నమ్మిన వేబర్ తర్వాత తన మనస్సు మార్చుకొన్నాడు. బుద్ధునిపట్ల దూషణతిరస్కారాలు రామాయణంలో ఒకచోట లేకపోలేదు గాని, అవి వాల్మీకి రచనలో ఎవడో తుంటరి దూర్చిన తూలుమాటలు! బౌద్ధమత విస్తరణను ప్రతిఘటించడానికే హిందూమతంలో అవతారసిద్ధాంతాన్ని లేవనెత్తినా రనడంలో సందేహం లేదు; ఆ సిద్ధాంతాన్ని బలపరచడానికే పురాణాలను సృష్టించారనడం కూడా సందేహానికి ఆస్కారం లేని విషయమే. కాని, రామాయణంలో రాముని అవతారమూర్తిగా చిత్రించే భాగా లన్నీ ప్రక్షిప్తాలే. వాల్మీకి పేరుతో ఎవరో ఫోర్జరీ చేసిన బాల, ఉత్తర కాండలలోనే అవి కోకొల్లలుగా వున్నాయి.

వేబర్ కు సమకాలికుడైన క్రిస్టియన్ లా సెన్ రామాయణ కావ్య పరిణామంలో నాలుగు దశలను గుర్తించాడు. మొదటి దశలో అది హిమాలయ ప్రాంతంలో సీతారామలక్ష్మణుల వనవాసానికి, అందుకు దారితీసిన పరిస్థితులకు మాత్రమే పరిమితం. రెండవ దశలో వారి వనవాసం గోదావరి తీరానికి మారింది. మూడవ దశలో దక్షిణాదివారిని లొంగదీసు కొనడానికి జరిగిన ప్రయత్నాలు వచ్చి కలిశాయి. పోతే, నాల్గవ దశనాటికి దక్షిణ భారత భౌగోళిక పరిజ్ఞానం.

మరింత పెరిగినందున సింహళ ద్వీపంపై దండయాత్రను కలపడం జరిగింది. దీన్ని చూడగా మొదటి దశకు సంబంధించినంతవరకు వేబర్ తో లాసెన్ పూర్తిగా ఏకీభవించినట్టు అనిపించవచ్చు. కాని, లాసెన్ దృష్టిలో సీత రాముని సోదరి కాదు; వారిద్దరికి ఆ సంబంధాన్ని కల్పించడం అసలు కథను బౌద్ధులు అపార్థం చేసుకొనడం వల్లనే సంభవించినట్టు ఆయన భావించాడు.

కాగా, రాముడు మరెవ్వరో కాదు, ప్రాచీనకాలంలో ఈజిప్టును పరిపాలించిన ఫేరో రాజులలో అతి ప్రసిద్ధుడైన రెండవ రామ్ సైజ్ అని వ్రాసిన ఘనత మన ఆంధ్రునిదే. ఆయన మల్లాది వెంకటరత్నం. తన సిద్ధాంత నిరూపణకు ఆయన రెండు సంపుటాలలో "రామ, దిగ్రేటెస్ట్ ఫేరో ఆఫ్ ఈజిప్ట్" అని ఒక గ్రంథాన్ని 1934లో ప్రచురించాడు. రామాయణంలోని లంక సింహళం కాదని కొక్కొండ వెంకటరత్నం పంతులు ఒకసారి తనతో అన్నాడట. అందుపై ఈ విషయంలోకి మరింత లోతుగా వెళ్ళాలన్న కోర్కె తనకు కలిగిందట. ఇది నిస్సందేహంగా మెచ్చదగు కోర్కె అయితే, ఇది వెంకటరత్నం విషయంలో వెర్రితలలు వేసింది. సాక్ష్యాధారాలతో ఒక తీర్మానానికి రావడానికి మారుగా, ఒక తీర్మానికి వచ్చిన మీదట దాన్ని సమర్ధించగల సాక్ష్యాధారాలను ఆయన వెతకడం ప్రారంభించాడు. ఫేరో రాజులలో పెక్కుమంది పట్టపుదేవేరులు వారి అక్కలు, లేదా చెల్లెళ్ళు, ఫేరో రాజుల శవాలను "మమ్మీ"ల రూపంలో శాశ్వతంగా వదిలపరిచేవారు. దశరథ జాతకకథ ప్రకారం సీత రాముని సోదరి. దశరథుడు కోసల దేశపురాజు కాగా, దశరథుని పట్టపుదేవేరి కౌసల్య, కేకయ రాజపుత్రిక కైకేయి అయినట్టు, విదేహ రాజపుత్రిక వైదేహి అయినట్టు, పాంచాల రాజపుత్రిక పాంచాలి అయినట్టు, కోసల రాజపుత్రిక కౌసల్య కావాలి. అయినప్పుడు దశరధుడు తన మేనత్తను, లేదా సోదరిని వివాహమాడినట్టు తీర్మానించుకొనవలదా? *నాకు తెలిసినంతవరకు ఈ విషయాన్ని గురించి ప్రస్తావించిన మొట్టమొదటి రచయిత ఎ.కె.సుర్. ఈయన వ్రాసిన "సెక్స్ అండ్ మ్యారెజ్ ఇన్ ఇండియా" అనే గ్రంథం 52వ పుటను చూడండి.*

పోతే, దశరథుని శవాన్ని - భరతుడు కేకయపురం నుంచి తిరిగి వచ్చే వరకు - తైలద్రోణంలో పదిలంచేశారు. ఈ రెండు విషయాలకు తోడుగా రాముని పేరుకు రామ్ సెజ్ పేరుకు ధ్వని సామ్యం అధికంగా ఉన్నది. అయినప్పుడు -మరి సందేహం దేనికి? - రాముడు రూఢిగా రామ్ సెజ్ అయివుండాలి. రామ్ లు ఒకరు కాదు, ఇద్దరు కాదు, పన్నెండుగురు. అయితే, వీ రందరిలో ఎక్కువ ప్రసిద్ధి కెక్కినవాడు రెండవ రామ్ సైజ్ కాబట్టి, ఆయనే రాము డనడం సముచితమని వెంకటరత్నానికి తోచింది.

కేవలం రాముడు, రామ్ సైజ్ పేర్ల మధ్యనే కాక, మరి పెక్కింటిలో ధ్వని సామ్యాన్ని గుర్తించి, రామాయణ గాథతో ఈజిప్టుకే కాక, లెబనాన్, సిరియా, ఇజ్రాయెల్, పర్యా, గ్రీసు మొదలైన దేశా అన్నింటికి వెంకటరత్నం ముడిపెట్టాడు. ఆయన వాదం ప్రకారం రాముడు రామ్ సెజ్ కాగా, అగస్తుడు అగస్టస్ సీజర్, అగస్త్యుని సతీమణి లోపాముద్ర అగస్టస్ సీజర్ భార్య లివియా; పౌలస్తుడు ఫిలెవీన్. అయోధ్య "ఆగన్" అనే ఈజిప్షియన్ నగరం(ఒకప్పుడు ఈజిప్టుకు

రాజధానిగా వున్న మెంఫిసు గ్రీకుల వ్యవహార నామం ఆన్షన్). గంగ అంటే విధిగా ఇండియాలోని గంగానది మాత్రమే కానక్కరలేదు; ఏ జలప్రవాహమైనా గంగ కావచ్చు, కేవలం జలమైనా గంగ కావచ్చు, అయితే, మరి సీత ఎవరు? ఆమెకు ప్రతిగా విదేశాల చరిత్ర నుంచి ఒక్కరైనా కానరానందున కాబోలు, సీతకు సముద్ర తీరంలోని ప్రాంతంగా వెంకటరత్నం అర్థం చెప్పాడు. లెబనాన్‌కు చెందిన ఒక రాజు రెండవ రామ్ సెజ్ పై తిరుగుబాటు చేసి, సముద్రతీరంలోని ఈజిప్షియన్ ప్రాంతాన్ని చేజిక్కించుకొనగా, అతడి పై యుద్ధమే రామాయణ యుద్ధ మన్నాడు! మొదటి నుంచి చివరి వరకు ఇంత

అసంబద్ధంగా ఉన్నందునే వెంకటరత్నాన్ని గురించి కాని, ఆయన విశేషంగా శ్రమపడి వ్రాసిన గ్రంథాన్ని గురించి కాని అంతగా పట్టించుకొన్నవారు లేరు.

మల్లాది వెంకటరత్నంవలె డాక్టర్ బుల్కే క్రైస్తవుడు. ఆయన పూర్తి పేరు ఫాదర్ కామిల్ బుల్కే ఆయనకు డాక్టరేట్ వచ్చింది రామాయణాన్ని గురించి "రామ్ కథ" అనే పేరుతో హిందీలో పరిశోధక వ్యాసం వ్రాసినందువల్లనే కావచ్చు. ఒక క్రైస్తవుడు, పైగా ఒక "ఫాదర్", రామాయణానికి చారిత్రక ప్రాతిపదిక కలదని నొక్కి చెప్పిన తర్వాత వేబర్, యాకోబీ వగైరాలను తుంగలో తొక్కవలసిందే అన్న ధోరణిని ఎ.డి. పుసా? కర్ అవలంభించాడు.'

రామాయణానికి చారిత్రకాధారం ఎంతవరకు కలదన్న చర్చలో ఇటీవల కొందరు పురాతత్త్వశాస్త్రవేత్తలు ప్రవేశించారు. ఇది ఆహ్వానించదగు పరిణామమే. ఇంతకుముందు ఈ చర్చ సంస్కృత భాషా పండితులకు, చరిత్రకారులకు పరిమితమై ఉండేది. మన సంస్కృత భాషాపండితులకు సంప్రదాయం పట్ల భక్తిశ్రద్ధలు మెండు. పైగా, రామాయణంలో రాముడు, భారతంలో కృష్ణుడు ప్రముఖపాత్ర వహిస్తారు కాబట్టి, వా రిద్దరు అవతార పురుషుల జాబితాలోకి ఎక్కినవారు కాబట్టి, రామాయణ, భారతగాథలను తార్కిక దృష్టితో పరిశీలించడానికి వారికి గుండెలు చాలవు. వారిలో రామకృష్ణ భండార్కర్, సునీతి కుమార ఛటర్జీలను పోలిన సాహసోపేత జిజ్ఞాసువులను బహు కొద్దిమందిని విడిచిపుచ్చితే, తక్కినవారు రామాయణ, భారతగాథలను దాదాపు పూర్తిగా చారిత్రక సంఘటనలుగానే పరిగణిస్తారు. పోతే, మన చరిత్రకారులలో అత్యధిక సంఖ్యాకులకు సయితం రామాయణ, భారతాల వద్దకు వచ్చేసరికి మతిపోతుందేమో అనిపిస్తుంది. వారిలో నూటికి 99 మందికి, నేను ఇంతకుముందు కూడా ఒకసారి చెప్పినట్టు - రావణుని లంక, ఇప్పటి శ్రీలంక ఒక్కటే అని చెప్పగలమా అనే సందేహమైనా రాదు. పైగా, ఒక్కటే అని చెప్పడానికి వారు పడరానిపాట్లు పడతారు. ఇట్టి వారిలో ప్రత్యేకించి పేర్కొనదగు చరిత్రకారులు హేమచంద్రరాయ్ చౌధురి, వి.ఆర్. రామచంద్ర దీక్షితార్, విశుద్ధానంద్ పాథక్ , మన వైజ్ఞానిక శాస్త్రవేత్తలలో పెక్కుమందికి శాస్త్రీయ దృష్టి నామమాత్రమైనందున, మన బాబాలు, భగవాన్లు తమ పారలౌకిక శక్తులతో శూన్యం నుంచి "భగవద్గీత" ప్రతులతోపాటు స్విస్ చేతిగడియారాలను నిజంగానే తెప్పిస్తున్నట్టు నమ్ముతున్నారు. మన చరిత్రకారులలో చారిత్రక దృష్టి బహుస్వల్పం కాబట్టే, రామచంద్ర దీక్షితార్ ఇప్పటి శ్రీలంక రావణుని లంక కాదన్న పక్షంలో లంకాపురిపై దండయాత్రకు తనకు దారి నివ్వనందుకు సముద్రునిపై అలిగి, ప్రాయోపవేశం పేరుతో దర్భశయ్యపై రాముడు మూడురోజులపాటు పరుండడం, నీలుని తోడ్పాటుతో లంకకు వారధిని ఆయన కట్టడం మొదలైన పరమ సత్యా లన్నీ అర్థరహితమై పోగలవని యగలిగాడు; సముద్రుని పై రాముడు అలగడం "కుర్రతనం"గా దీక్షితారకు తోచనట్టే, హనుమంతుడు సముద్రం పైగా ఎగిరివెళ్ళడం విడ్డూరంగా పాథక్ కు తట్టలేదు. ఇట్టి శాస్త్రజ్ఞులు, ఇట్టి చరిత్రకారులు మన దేశంలో యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా వున్నంతవరకు, ఇట్టివారు గౌరవ ప్రతిష్ఠలు పొందుతున్నంతవరకు మనకు ప్రగతి లేదు, భవిష్యత్తు లేదు.

మన పురాతత్త్వ శాస్త్రజ్ఞులలో సయితం శాస్త్రీయ దృష్టి ప్రదర్శించగల వారు చాలా చెదురుగానే కనబడతారు. వారిలో కొందరిది ఆర్యదృష్టి కాగా, మరి కొందరిది ద్రావిడ దృష్టి, మొదటివర్గంవారు ఆర్యేతరమైన ప్రతిదాన్ని అనాగరికమైన దాన్నిగా కొట్టి పారవేస్తారు. ద్రావిడేతరమైనదానిపట్ల రెండవ వర్గంవారు సరిగా ఇదే వైఖరిని ప్రదర్శిస్తారు. అందువల్లనే సింధులోయ నాగరికతవిషయమై ఒకరు చెప్పినదాన్ని మరొకరు కాదంటున్నారు; దాన్ని తమ నాగరికతగానే జమకట్టుకొనడానికి ఒకరితో ఒకరు గట్టిగా పోటీ పడుతున్నారు. రామాయణం విషయంలో కూడా వారి మధ్య గల ఈ ఆర్య, ద్రావిడ దృష్టిభేదాల దుష్ప్రభావం విశేషంగానే వ్యక్తమౌతున్నది. ఏమైనా, ఇటీవల కొందరు పురాతత్త్వ శాస్త్రజ్ఞులు పాక్షిక దృష్టినుంచి కాక, సమగ్ర దృష్టితో, శాస్త్రీయ దృష్టితో రామాయణగాథను ఏ మేరకు చారిత్రక సంఘటనగా

పరిగణించవచ్చునన్న విషయమై శ్రద్ధాసక్తులను చూపుతున్నారు. వారిలో బి.బి. లాల్, హెచ్.డి. సంకాలియాలు ముఖ్యులు. తక్కిన వారివలె రామాయణ కావ్యం పై, ఇతర ప్రాచీన రచనల పై ఆధారపడి, వీరిద్దరు ఏవో కొన్ని తీర్మానాలకు రావడం లేదు; అన్య సాక్ష్యాధారాలకు వీరు ప్రాధాన్య మిస్తున్నారు. ఇది సమంజసం. అది రామాయణం కానివ్వండి, భారతం కానివ్వండి, లేదా, అవి పురాణాలు కానివ్వండి, వేద వేదాంగాలే కానివ్వండి; వాటిలో ఒక్కటైనా ఏదో ఒక కాలంలో ఎవరో ఒకరు వ్రాసినట్టిది కాదు. ఒక రెవరో వ్రాయగా, పెక్కుమంది మూలానికి తమ చిత్తం వచ్చినదాన్ని చేర్చుతూ పోయారు, మూలాన్ని మార్చుతూపోయారు, మొత్తాన్ని తిరిగి కూర్చుతూపోయారు. అందువల్ల ప్రాచీన గ్రంథాలుగా ఈనాడు మన దేశంలో చెల్లుతున్న వాటిలో ప్రక్షిప్తాలు లేకుండా ఏదీ మనవరకు రాలేదు. పైగా, ఈ ప్రక్షిప్తాలు కొన్ని శతాబ్దాల మీద జరిగాయి. అందువల్ల మన ప్రాచీన గ్రంథాలకున్న చారిత్రక ప్రామాణికత అతిస్వల్పం; కొన్ని కొన్ని సందర్భాలలో అసలే పూజ్యం. అయినప్పుడు కేవలం సాహిత్య సంబంధమైన సాక్ష్యాధారాలతో ఎవరేమి చెప్పినా, అది సందేహాలను మిగుల్చుతుంది; నిజానికి అది తొలగించగల సందేహాలకంటె, కలిగించగల సందేహాలే హెచ్చుగా వుంటాయి.

సరిగా ఇదే విధమైన సంకట పరిస్థితి ఒకప్పుడు విదేశాలలో సయితం వుండేది. గ్రీస్ పౌరాణిక గాథలలో ఎంత నిజం, ఎంత కల్పన? గత కాలాన్ని గురించి హీరాడొటస్, థుసిడైడెజ్ మున్నగు చరిత్రకారులు క్రీస్తుకు పూర్వం వ్రాసిన చరిత్రలలో ఎంత చరిత్ర వున్నది? బైబిల్ చారిత్రకాంశాలుగా వివరిస్తున్నట్టివి ఎంతవరకు వాస్తవంగా జరిగినట్టివి? ఈ ప్రశ్నలకు పూర్తిగా కాకపోయినా, ఎన్నదగు మేరకు గట్టి సమాధానాలను చెప్పడం టర్కీలో, గ్రీలో, క్రీట్లో, ఇరాక్ లో, ఇరాన్ లో, ఇజ్రాయెల్ లో, ఈజిప్టులో పాతకాలపు మట్టి దిబ్బలను త్రవ్విన మీదటనే సాధ్యపడింది. ఉదాహరణకు హిన్ రిచ్ షెలీమాన్, విల్ హెల్మ్ డర్ఫ్ ఫెల్ట్, సర్ ఆర్థర్ జాన్ ఎవెంజ్ టర్కీలో, క్రీ లో, గ్రీస్ లో జరిపిన త్రవ్వకాల తర్వాతనే గ్రీక్ పౌరాణిక గాథలలో కొంత సత్యం లేకపోలేదని రూఢపడింది. సర్ అస్టిన్ హెన్రీ లెయొర్డ్, డబ్లియు. ఎం. ఫ్లిండర్ల్ సైటీ, సర్ గార్డెనెర్ విల్కిన్సన్, కార్ల్ రిచర్డ్ లెప్ సీయూస్ ప్రభృతులు మధ్య ప్రాచ్యంలో త్రవ్వకాలు కొనసాగించిన పిమ్మటనే క్రీస్తుకు పూర్వంనాటి చారిత్రక గ్రంథాలలో కొంతవరకు చరిత్ర కలదని, బైబిల్ లోని కథలలో చాలా భాగం అల్లిబిల్లి కథలైనా, కొన్నింటిలో స్వల్పంగా చరిత్ర లేకపోలేదని ధ్రువపడింది.

మన ప్రాచీనగాథలలో చరిత్ర ఏపాటిగా కలదో కచ్చితంగా తేల్చుకొనడానికి మన ప్రాచీన నగరాలు కొన్నింటిలోనైనా త్రవ్వకాలు శాస్త్రీయ పద్ధతులలో విస్తృతంగా జరగాలి, క్షుణ్ణంగా జరగాలి. రామాయణానికి సంబంధించినంతవరకు ముఖ్యంగా అయోధ్యలోని 'జన్మభూమి" దిబ్బను త్రవ్విచూడాలి; “కనకభవనం" ప్రాంతంగా ప్రస్తుతం చెల్లుతున్న ప్రాంతాన్ని త్రవ్విచూడాలి; సీతారాముల వనవాసకాలంలో కోసలరాజ్యానికి తాత్కాలిక రాజధానిగా పేర్కొనబడుతున్న నందిగ్రామాన్నికూడా త్రవ్వి చూడాలి. ఇంతే కాక, లక్ష్మణునితో సన్నిహిత సంబంధం వున్న నగరమన్న ప్రతీతి లక్నోకు (దాని ప్రాచీన నామం లక్ష్మణపుర మట) కలదు కాబట్టి, అక్కడ సయితం త్రవ్వకాలు జరగాలి. గుహుని రాజధాని శృంగిబేరపురంలోను, వాల్మీకి, భరద్వాజుల ఆశ్రమాల ప్రాంతాలలోను త్రవ్వకాలు జరగాలి. ఒక్క అయోధ్యలో వినా తక్కిన ఈ ప్రాంతాలలో ఇంతవరకు త్రవ్వకాలు జరగనేలేదు. అయోధ్యలో జరిగిన త్రవ్వకాలైనా పేరుకు మాత్రమే. భారతానికి సంబంధించిన ముఖ్య ప్రాంతాలను సయితం ఇదే విధంగా నిర్లక్ష్యం చేయడం సంభవించింది. రామాయణ, భారతాలకు మన రెండు కళ్ళతో పోలిక పెట్టడం కద్దు; అవి లేకపోతే మనకు గుడ్డితనం తప్ప దనడం కద్దు. అయినా, వాటికి సంబంధించిన ప్రాంతాలను త్రవ్వి చూడలేదేమి? ఏది అబద్ధమాడినా, పురాతత్త్వశాస్త్రవేత్త చేతిలోని పార అబద్ధమాడదు, పలుగు అబద్ధమాడదు. తీరా అయోధ్య, నందిగ్రామం, లక్ష్మణపురం, హస్తినాపురం, కురుక్షేత్రం, మధుర మొదలైన చోట్ల త్రవ్వకాలు జరిపితే, రామాయణ, భారతగాథలు కట్టుకథలుగా తేలిపోవచ్చునేమో అని భయపడి నందువల్లనే ఇక్కడ జరగవలసిన పరిశోధనలు ఇంతకుముందు జరగలేదని అనుకోవలెనా?

ఇదివరలో ఏమి జరిగినా, కొన్ని నెలల క్రితం బి.బి. లాల్ పుణ్యమా అని రామాయణ, భారత గాథలలో ప్రాధాన్యం వహిస్తున్న అన్ని ప్రాంతాలలో త్రవ్వకాలు ప్రారంభమైనాయి. ఇవి పూర్తి కావడానికి అయిదేళ్ళు పట్టవచ్చు. అందువల్ల మరి అయిదేళ్ళ పాటు ఓపిక పడితే, మన రామాయణ, భారతగాథలకు చారిత్రకాధారాలు ఏ పాటిగా కలవో చాలావరకు తేలిపోగలదు.

ఈలోపున లాల్, సంకాలియాలు రామాయణాన్ని గురించి చెబుతున్న మాట అది చాలావరకు పుక్కిటి పురాణమని; దానిలో లవలేశంగా చరిత్ర వుంటే, అది ఒక స్వల్పరాజ్యానికి (కోసల రాజ్యానికి), ఒక సామాన్య రాజకుటుంబానికి (దశరథుని కుటుంబానికి) పరిమితమైనట్టిదని. కాగా, లాల్ దృష్టిలో రామరావణ యుద్ధంకంటె కురుక్షేత్ర సంగ్రామమే ప్రాచీనమైనది. అన్యులు పెక్కుమందివలె సంకాలియా సయితం ఈ విషయాన్ని అంగీకరించడం లేదు. కాగా, సంకాలియా పరిశోధనల ప్రకారం, రావణుడు ద్రావిడజాతికి చెందినవాడు కాడు; రావణుని రాజధాని ఈనాటి శ్రీలంక కాదు. వీరిద్దరి అభిప్రాయాలను సందర్భానుసారంగా ముస్ముందు వివరిస్తాను. ఈలోపుగా నేను చెప్పగోరుతున్నది నాకు సయితం ఈ విషయమై కొన్ని అభిప్రాయా లున్నాయని.

1 రామాయణంలో నూటికి 75 వంతులకు పైగా పుక్కిటి పురాణమే.

2 తక్కిన 25 వంతుల కథకు కీలకం - సింహాసనానికి దాదాపు అన్ని రాజకుటుంబాలలో కొనసాగుతూవుండే కుట్రలు, కుహకాలు మాత్రమే.

3 రాముడు వింధ్యపరిసరాలను దాటి రాలేదు.

4 రావణుడు గోండ్ రాజు కావచ్చు; లేదా, మరొక ఆదివాసితెగ రాజు కావచ్చు.

5 రావణుని లంక, ఈనాటి శ్రీలంక ఒక్కటి కావు.

6 రామరావణ యుద్ధాన్ని రెండు విభిన్న జాతుల మధ్య సంఘర్షణ అనడం కంటె ఆహారోత్పత్తి వ్యవస్థకు (ఫుడ్ ప్రొడక్షన్ ఎకానమీకి), ఆహార సేకరణ వ్యవస్థకు (ఫుడ్ - గేదరింగ్ ఎకానమీకి) సంఘర్షణ అనడమే ఎక్కువ సమంజసం.

7 దండకారణ్య ప్రాంతానికి వ్యవసాయ విస్తరణతో రామునికి కొంత సంబంధం కలదు కనుక, రాముని భార్య పేరు సీత కనుక, వేదకాలపు సీత మారిమారి, రామాయణం సీతగా పరిణమించినట్టు చెప్పడానికి వీలు కలిగింది.

ఈ అభిప్రాయాలు మౌలికమైనవి కావు; రామాయణాన్ని తార్కిక దృష్టితో పరిశీలించినవారు వెల్లడించిన విభిన్నాభి ప్రాయాలలో నా బుద్ధికి సమంజసమైనవిగా తోచినవాటిని నేను స్వీకరించాను. ఈ పీఠికను చివరివరకు చదవండి; మీకు నచ్చితే, నావలె మీరు సయితం వీటిని స్వీకరించండి, లేదా త్రోసిపుచ్చండి. ఏమి చేసినా, ఆలోచనతో చేయండి; భక్తిపారవశ్యంతో అంధప్రాయంగా సంచరించకండి. నరుడు ఆలోచన చేయగలడు, తక్కిన జంతువులు చేయలేవు. ఆలోచన చేయగల శక్తి వాటికి లేనందునే అవి జంతువులుగా మిగిలిపోయాయి.

ఏది జనస్థానం? ఎక్కడిది లంక?

ఆలోచన చేయగలవారిని రామాయణం జాగ్రఫీ ఎంతగానైనా తికమక పెడుతుంది. దానిలోని ఇతర వికారాలు పెక్కింటికివలె ఇందుకు కూడా మూలకారణం దానిలోని ప్రక్షిప్తాలే అని చెప్పవచ్చు. వనవాసానికి అయోధ్యలో బయల్దేరిన రాముడు సుతీక్ష్ణమహర్షి ఆశ్రమానికి చేరుకొనడానికి దారుల వెంట, ఏయే దిక్కులలో పయనించాడో, ఏయే నదీ నదాలను, ఏయే పర్వతాలను, లోయలను దాటినాడో, మార్గమధ్యంలో ఎక్కడెక్కడ, ఎంత కాలంపాటు విశ్రమించాడో ఈ వివరాలలో దొసగులు లేవు. ఉత్తర, వాయవ్య, ఈశాన్య భారతాలకు సంబంధించిన భౌగోళికవివరాలు సయితం మొత్తంపై సవ్యంగానే వున్నాయి. అయినప్పుడు దక్షిణభారతంవద్దకు వచ్చేసరికి తప్పులు విశేషంగా దొర్లడం ఎందువల్ల జరిగింది? వాల్మీకి

రచనకు “మెరుగులు” దిద్దిన ప్రబుద్ధులే ఇందుకు బాధ్యు లనుకొనడానికి బలీయమైన కారణాలు కొన్ని వున్నాయి. దక్షిణభారతం ముక్కుముఖాలైనా వారికి సరిగా తెలియవు. అయినా, సర్వం తెలిసినట్టు వారు వాల్మీకి రచనలో వేలు పెట్టారు. వారి కారణంగా మరీ హెచ్చుగా తప్పులు దొర్లింది కిష్కింధాకాండలోని 40, 41, 42, 43 సర్గలలో, రామాయణాన్ని విమర్శకదృష్టితో పరిశీలించిన పండితు లందరు ఇవి ప్రక్షిప్తాలని నిర్ణయించారు. భూలోకాన్ని గురించి మాత్రమే కాక, నాగలోకాన్ని గురించి, నరకలోకాన్ని గురించి, ఆదిశేషునిగురించి, ఉదయాద్రి, అస్తాద్రులనుగురించి సుగ్రీవునిచేత వీటిలో ఉపన్యాసం చెప్పించడం జరిగింది కనుక, వీటిని “సుగ్రీవుని జాగ్రఫీ సర్గ” లనవచ్చు.

ఒక ముఖ్య విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. సీతను చెరబట్టిన రావణుడు దక్షిణంగా వెళ్ళినట్టు రామలక్ష్మణులకు జటాయువు స్పష్టంగా చెప్పాడు. (ఆరణ్యకాండ, 68వ సర్గ). అందువల్లనే వారిద్దరు సీతాన్వేషణకై దక్షిణాభి ముఖంగా వెళ్ళారు. అదే దిశలోగల ఋశ్యమూకను దాటి రావణుడు వెళ్ళడాన్ని తాను చూచినట్టు సుగ్రీవుడు స్వయంగా రామునితో చెప్పాడు. అయినా, సీతాన్వేషణకై తక్కిన మూడు దిక్కులకు కూడా సుగ్రీవుడు తన వానరబలగాలను ఎందుకు పంపించాలి? అది కేవలం మతిలేని పని కాబట్టి, దాన్ని అతడు చేయలేదనే మనం అనుకోవాలి. కాని, వాల్మీకికి “మెరుగులు” దిద్దినవారికి తమ భూలోక పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకొనడానికి ఒక సాకు కావాలి. అది ఈ పట్టులో దొరకనే దొరికింది కాబట్టి, దాన్ని వారు పూర్తిగా వినియోగించుకొన్నారు.

ఏమైనా, సుగ్రీవుని జాగ్రఫీ ప్రకారం భూమి గుండ్రంగా లేదు, చదునుగా వున్నది; బొంగరం వలె శూన్యంలో అది గిరగిర తిరగడం లేదు, ఆదిశేషుని శిరస్సుపై స్థిరంగా నిలిచివున్నది. తూర్పుదిక్కుగా మనం పయనిస్తూ పోగాపోగా, బయల్దేరిన చోటుకే మనం తిరిగి రాము, ఇలాతలం తూర్పుపొలిమేరను చేరుకొంటాము. ఆ పొలిమేరలో గల పసిడికొండపై తాపీగా కూర్చుని, ఆదిశేషుడు భూభారాన్ని మోస్తూ వుంటాడు. (మరి ఆ పసిడికొండ దేనిపై బైరాయించిందో!) పసిడికొండ నడినెత్తిని ఒక పసిడి తాడిచెట్టు ఉన్నది. దానివి మూడు తలలు. (దాన్ని అక్కడ పాతింది ఇది తూర్పుపొలిమేర అని చెప్పడం కోసమట; దాన్ని పాతిన వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరు లట). ఆ తాటి చెట్టు వరకు వెళ్ళేలోగా మనం సగం పులిరూపంలో ఉన్న నరులను చూస్తాము; ఒంటికాలితో నడిచేవారిని, పెదవులలో చెవు లున్నవారిని, ఉక్కుకంటె గట్టి ముఖాలున్నవారిని చూస్తాము. పర్వత శిఖరాల నుంచి తలక్రిందులుగా వ్రేలాడుతున్న రాక్షసులను చూస్తాము. (ఆ రాక్షసుల పేరు “మందేహులు”. ప్రతిదినం అరుణోదయవేళ భూసురోత్తములు జపిస్తున్న గాయత్రీమంత్ర ప్రభావంవల్ల మందేహులు సముద్రంలో పడిపోతూవుండబట్టి మనం బ్రతికిపోతున్నామట; లేకపోతే, వారినుంచి మనకు ఘోరప్రమాదాలు తప్పేవి కావట). పోతే, ఈ తూర్పుదిశలోనే మనం ఇక్షు, లవణ, లోహిత, శుద్ధజల, క్షీర సాగరాలను చూస్తాము. క్షీరసాగరంలో జలక్రీడ లాడుతున్న యక్ష గంధర్వచారణాప్సరాది లావణ్యవతులను చూస్తాము.

తూర్పుదిక్కులోవలె తక్కిన మూడు దిక్కులలో సయితం ఇంతటి వింతలను, ఇంతకు మించిన విడ్డూరాలను మనం చూడవచ్చు. ఉదాహరణకు, దక్షిణాన ఒక వెండి కొనతో, ఒక బంగారం కొనతో పెద్ద కొండ ఉన్నది. పశ్చిమాన రెక్కలున్న సింహా లున్నాయి. ఉత్తరాన రంగురంగుల బట్టలను కాసే చెట్లు, ముత్యాల, వజ్రాల నగలను కాసే చెట్లు, బంగారు పాన్పులను కాసే చెట్లు వున్నాయి! సుగ్రీవుని పేర ఈ జాగ్రఫీని సృష్టించిన ప్రబుద్ధులను “ఈ వింతలు, ఈ విడ్డూరాలు మా కంటికి కనబడ వేమి?” అని ప్రశ్నించేవారి నోరు మూయించడానికి తిరుగులేని సమాధానాన్ని వారు ముందుగానే చెప్పివేశారు. ఇట్టివి భక్తులకే తప్ప నెనరులేనివారికి, క్రూరులకు, నాస్తికులకు కనబడవట!

భక్తికి ప్రాతిపదిక మౌఢ్యం కాబట్టి, మౌఢ్యం పెంచకపోతే కొందరికి భుక్తి జరగదు కాబట్టి, పురాణాలలోని కల్లబొల్లులను ఇక్కడ పోగు పోసినా, కనీసం సుప్రసిద్ధమైన జనపదాలను గురించి, నదీనదాలను గురించి, పర్వతాలను గురించి సరిగా చెప్పివుంటే, అదొక దారి. కాని, అది కూడా లేదు. సీతాన్వేషణకు తన వానరబలగాలను సుగ్రీవుడు పంపింది కిష్కింధ నుంచి. అది వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్నట్టు బహుజనాభిప్రాయం. కాని, రామాయణాన్ని నిశితంగా పరిశీలించినవారి వాదం ప్రకారం వింధ్య పర్వతాలకు ఉత్తరంలోనే కిష్కింధ ఉన్నది. ఈ విషయమై మత భేదా లున్నా, విదేహ, మాళవ, కాశి, కోసల ప్రాంతాలకు అది దక్షిణంగా వున్నదనడంలో ఉభయవర్గాలు ఏకీభవిస్తున్నాయి. అయినప్పుడు, ఆ ప్రాంతాలను చేరాలంటే కిష్కింధ నుంచి ఉత్తరంగా వెళ్ళాలి. కాని, సుగ్రీవుని జాగ్రఫీ ప్రకారం వాటిని చేరాలంటే కిష్కింధ నుంచి ఉత్తర ముఖంగా కాక, లేదా పశ్చిమోత్తరంగా కాక, తూర్పుగా వెళ్ళాలి! తిరిగి అతడి జాగ్రఫీ ప్రకారం కిష్కింధ నుంచి దక్షిణంగా వెడితే తగిలే ప్రాంతాలలో వంగ, అతడి జాగ్రఫీలో నర్మద తర్వాత తపతి ప్రసక్తి రాదు; కృష్ణతర్వాత కళింగా లున్నాయి.

తుంగభద్ర ఊసులేదు. దాని ప్రకారం కిష్కింధకు దక్షిణంగా ఒక అవంతి, పశ్చిమంగా ఇంకొక అవంతి వున్నది. ఈ తప్పులన్నింటిని చూచిన మీదట, సుగ్రీవుని పేరిట జాగ్రఫీని ఫోర్జరీ చేసిన ప్రబుద్ధులు మధ్య దేశానికి, ముఖ్యంగా కురు - పాంచాల ప్రాంతానికి, చెందినవారు కావచ్చునని కొందరు భావిస్తున్నారు. ఇదే నా భావం కూడా!

అయినా, ఆ సుగ్రీవుని జాగ్రఫీ ప్రకారం రావణుని లంకను* (లంక ఎక్కడ కలదో అటు పిమ్మట వివరిస్తాడు. (కిష్కింధాకాండ 41వ సర్గ) ఎవరికి తోచినదాన్ని వారు వ్రాసి, రామాయణంలో దూర్చినందునే, దానిలో ఇట్టి పరస్పర వైరుధ్యాలు కొల్లలుగా కనబడతాయి.) చేరాలంటే కిష్కింధ నుంచి దక్షిణంగా బయల్దేరి, వింధ్య పర్వతాలను దాటాలి; నర్మద, గోదావరి, మహానది, కృష్ణ, వరద, మేఖల, ఉత్కళ నదులను దాటాలి; ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య దేశాలను దాటాలి; కావేరిని దాటాలి; తామ్రపర్ణిని దాటాలి; అటుపైన నూరు యోజనాలు సముద్రయానం చేయాలి. దక్షణదిశకు అంగదుని నాయకత్వాన బయల్దేరిన వానరులు చివరికి వింధ్య పర్వతాలనైనా దాటరు; సుగ్రీవుడు పెట్టిన ఒక నెల గడువు దాటిపోయినా, ఆ పర్వతాలలోనే వారు తిరుగుతారు. దిక్కుతోచక వాటిమధ్య తిరుగుతూ వుండగా వారికి సంపాతి తటస్థపడతాడు. లంక ఎక్కడ ఉన్నదో ఆతడు వారికి వివరిస్తాడు. రెక్కలు కాలినపిదప వింధ్య ప్రాంతాన్ని తన నివాసస్థానంగా చేసుకొన్నానని అనేక పర్యాయాలు పేర్కొన్న సంపాతి ఒకే ఒకసారి "దక్షిణ సముద్ర తీరంలోని వింధ్య పర్వత భాగం" ప్రసక్తిని తెస్తాడు. (కిష్కింధాకాండ, 60వ సర్గ) మనకు తెలిసిన వింధ్య పర్వత శ్రేణి దక్షిణ సముద్రం వరకు విస్తరించదు కాబట్టి, ఆ తీరంలో మరొక వింధ్య పర్వత శ్రేణి ఉన్నదని అనుకోవాలి కాబోలు!

సీతాన్వేషణకై అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడు మొదలైనవారు వెళ్ళిన దారివెంటనే లంకపై దండయాత్రకు రాముడు వెళ్ళివుండాలి కదా! అయినా, ఆయన వింధ్య పర్వతాలను దాటినట్టు యుద్ధకాండ మనకు చెప్పడం లేదు. నర్మద, గోదావరి, కృష్ణ, కావేరి మున్నగు నదులను దాటినట్టు చెప్పడం లేదు. సహ్య, మలయ పర్వతాలను దాటి, మహేంద్రపర్వతాన్ని చేరినట్టుగా మాత్రమే చెబుతున్నది. (యుద్ధకాండ, 4వ సర్గ). ఈ మహేంద్రపర్వతం సమీపంలోనే సముద్రతీరం ఉన్నదట. హనుమంతుడు మహేంద్ర పర్వతశిఖరం నుంచే లంకకు ఎగిరి వెళ్ళాడట (కిష్కింధాకాండ, 67వ సర్గ). అయినప్పుడు, దక్షిణ సముద్ర తీరంలోని వింధ్య పర్వత శ్రేణిలో ఒక మలయపర్వతం, సహ్యపర్వత పంక్తిలో మరొక మలయపర్వతం ఉన్నదని మనం అనుకోవలెనా? ఇదే విధంగా రెండు ప్రస్రవణ పర్వతాల ప్రసక్తి కూడా ఉన్నది. వీటిలో ఒక ప్రస్రవణ కిష్కింధ సమీపంలో ఉండగా (కిష్కింధాకాండ, 27వ సర్గ) రెండవది సముద్ర తీరంలో ఉన్నదట (కిష్కింధాకాండ, 53వ సర్గ). అరణ్య కాండ ఆరవసర్గలో పంప ఒక నది కాగా, 73వ సర్గలో అది ఒక సరస్సు,

దండకారణ్యం అంచులో చిత్రకూట పర్వత పరిసరాలలోని లంక ఉనికి తనకు తెలియదని రామునితో తన తొలి సమావేశంలో పలికిన సుగ్రీవుడే (కిష్కిందాకాండ, 7వ సర్గ) మందాకినీ నది కాక (అయోధ్యాకాండ, 93వ సర్గ), దండకారణ్యంలో పంచవటి దరిదాపులలో మరొక మందాకిని వున్నదట. (ఆరణ్యకాండ, 64వ సర్గ)

ఈ విధంగా రామాయణంలోని జాగ్రఫీ, ముఖ్యంగా దక్షిణ భారతం జాగ్రఫీ, ఎన్నెన్నో సందేహాలు కలిగిస్తున్నది, ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. అయితే, సందేహాలైనా, ప్రశ్నలైనా ఆలోచనాపరులకే, జిజ్ఞాసువులకే; రామభక్తులకు ఈ బాధ ఎంతమాత్రం లేదు. భక్తి పారవశ్యం వారిని ఆలోచనారహితులను చేస్తుంది, అంధప్రాయులను చేస్తుంది. నిజానికి, ఆ మేరకు వెళ్ళనిది సిసలైన భక్తి కానే కాదు! ఎఫ్.ఇ. పార్జిటర్ రామభక్తుడు కాదుగాని, పౌరాణిక గాథలలో చారిత్రక సత్యాలు చాలా హెచ్చుగా దాగివున్నాయని ఆయన గట్టి నమ్మకం. అందువల్ల రామాయణం జాగ్రఫీలోని అవకతవకలను ఆయన ఎంతమాత్రం కానలేకపోయాడు. 1894లో తాను ప్రచురించిన ఒక పరిశోధక వ్యాసంలో మధ్య, దక్షిణ భారతాలకు సంబంధించిన, సింహళ ద్వీపానికి సంబంధించిన భౌగోళిక వివరాలను రామాయణ కావ్యకర్త మొత్తంపై నిర్దుష్టంగా పేర్కొన్నట్టు ఆయన వ్రాశాడు. ' ఈ ప్రాంతాలలో పర్యటన చేసి ఉండకపోతే, ఇంతటి సమగ్ర భౌగోళిక పరిజ్ఞానం ఆ కావ్యకర్తకు లభించివుండేది కాదని వ్రాశాడు. పార్జిటర్ పాశ్చాత్యుడు; ఐ.సి.ఎస్. ఆఫీసర్ కూడా. సంస్కృతం క్షుణ్ణంగా నేర్చుకొన్నట్టివాడు. అట్టి ప్రముఖుడు చెప్పిన మాటను, అంతటి పండితుడు చేసిన తీర్మానాలను త్రోసివేయడం తప్పు కాదా? పాశ్చాత్య పండితు లందరినీ నమ్మడానికి వీలులే దనుకోండి. వారిలో పెక్కుమంది జాత్యహంకారం కొద్దీ మన ప్రాచీన చరిత్రను, దాని వైభవాన్ని చులకన చేయడానికి ప్రయత్నిస్తారు. పోతే, పార్టిటర్‌ను పోలిన న్యాయాభిలాషులు, ధర్మపరులు నూటికి నూరు పాళ్ళు నిజం వ్రాస్తారు. వారి వ్రాతలను మనం కళ్ళ కద్దుకోవాలి.

పార్జిటర్ వ్రాతలను కళ్ళ కద్దుకొనడం జరిగినందువల్లనే రామభక్తులవలె మన సంస్కృత పండితులలో, మన చరిత్రకారులలో దాదాపు నూటికి 99 మంది రావణుని లంక, ఈనాటి శ్రీలంక అభిన్నమైనవని ఉద్ఘాటిస్తున్నారు. పార్టిటర్ వాదంలోని ఈ కింది ముఖ్యాంశాలను సయితం పరమసత్యాలుగా వారు స్వీకరిస్తున్నారు:

1 బళ్ళారిలో, లేదా దాని సమీపంలో కిష్కింధ ఉండేది.

2 సంపాతి "దక్షిణవింధ్యలుగా" పేర్కొన్న పర్వతాలు దక్షిణ మైసూరులోని కొండలు అయివుండాలి.

3 ఈ దక్షిణ మైసూరు కొండల సమీపాన సముద్రం లేదనుకోండి. కాని, ఈ కొండల వరసలు కెరటాలను జ్ఞప్తికి తెస్తూ వుంటాయి. అందువల్లనే రామాయణ కవి ఈ కొండ లున్న ప్రాంతాన్ని సముద్రంతో పోల్చివుండాలి.

పార్జిటర్ వాదంలోని తక్కిన విషయాల చర్చ మరికొంత దూరం వెళ్ళిన తర్వాత చేస్తాను. ఈలోగా మతిగలవారికి ఎవరికైనా తోచవలసిన సందేహం ఒకటి వున్నది. తమ్ముడు జటాయువు మరణవార్త విన్న సంపాతి అతడి ఆత్మశాంతికై పార్జిటర్ పేర్కొంటున్న దక్షిణ మైసూరు కొండల వద్ద సముద్రజలాలను విడుస్తాడు. మరి అతడు అలంకార ప్రాయమైన సముద్రంలోని అలంకారప్రాయ జలాలను అలంకారప్రాయంగా విడిచాడు కాబోలు!

తమ విశ్వాసాలను బలపరుస్తున్నవన్న కారణాన పార్జిటర్ వ్రాతలను కళ్ల కద్దుకొన్నవారు పార్జిటర్ కంటె పెద్ద పండితుడైన యాకోబీ - పార్జిటర్ కంటె ఒక సంవత్సరం ముందుగా 1893 లోనే - "లంక ఎక్కడిది?" అనే ప్రశ్నను గురించి జరిపిన చర్చను "గమనించనైనా లేదు. ఆ చర్చ సందర్భంలో ఆయన మన దృష్టికి తెచ్చిన కొన్ని ముఖ్యాంశా లివి:

- ❖ సింహళ ద్వీపానికి ప్రాచీన నామం సింహళం కాదు, తామ్రపర్ణి. అలెగ్జాండర్ సమకాలికులు దాన్ని "తామ్రప" అన్నారు; అశోకునికి సయితం అది "తామ్రపర్ణి'గానే తెలుసు.
- ❖ అటుపిమ్మట టోలెమిక్ (ఈజిప్టు) రాజుల కాలంలో "సింహళం" అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. ఏదో ఒక ఓడరేవు పేరు "సింహళం" కాగా, దాన్ని మొత్తం దీనికి పేరుగా ఉపయోగించడం ఈ కాలంలో జరిగివుండవచ్చు.
- ❖ అటుపిమ్మట వరాహమిహిరుడు లంకను, సింహళాన్ని రెండు విడివిడి ద్వీపాలుగా పేర్కొన్నాడు. భవభూతి, మురారి, రాజశేఖరుడు అంతే చేశారు.
- ❖ సింహళానికి చెందిన ఒక ప్రాచీన బౌద్ధ గ్రంథం "దీపవంశ". (దీని రచన క్రీస్తుశకం 302-477 సంవత్సరాల మధ్య). సింహళానికి పర్యాయ పదంగా "లంక" అనే మాటను ఈ గ్రంథంలో ప్రయోగించారు. అయితే, రామాయణం ప్రభావమే ఈ ప్రయోగానికి ప్రేరణ కూర్చివుండవచ్చు.
- ❖ ఏదో పరభాష నుంచి "లంక" సంస్కృతంలో ప్రవేశించిన శబ్దం. అది తెలుగు మాట కావచ్చు. "లంకకు" సి.పి. బ్రౌన్ నిఘంటువులో "దీవి, ఏటి నడుమ దిబ్బ" అనే అర్థాలు కనబడతాయి.

ఈనాటి శ్రీలంక రావణుని లంక కాకపోవచ్చునని సూచించడంతోనే సరిపుచ్చినాడే తప్ప, ఏది లంకాద్వీపమో నిర్ధారించడానికి యాకోబీ ప్రయత్నించలేదు. ఇందుకు ప్రయత్నించినవారిలో విపరీత సిద్ధాంతాలను చేసినవారు కొంద రున్నారు. వారిలో అగ్రతాంబూలాన్ని దివాన్ బహదూర్ సి.ఎన్. మెహతాకు అందించాలి. ఈయన అద్భుత పరిశోధనల ప్రకారం ఆస్ట్రేలియాలో మెల్ బోర్న్ దరిదాపులలో లంక ఉన్నది. ఒక మోనో ప్లే లో మంటల బాంబులను దండిగా వేసుకొని, పూరీజగన్నాథానికి, విజయనగరానికి మధ్యలోగల మహేంద్రగిరినుంచి బయల్దేరి, అండమాన్, నికోబార్ దీవుల పైగా, సుమిత్రా, జావాల పైగా, న్యూగినీ పైగా, లంకానగరానికి హనుమంతుడు వెళ్ళాడు. అది మహాశక్తివంతమైన మోనో ప్లేన్ కాబట్టి, సూర్యోదయం వేళకు బయల్దేరిన హనుమంతుడు సూర్యాస్తమయానికి ముందుగానే లంకను చేరగలిగాడు. తన విమానం నుంచి మంటల బాంబులను జోరుగా విసిరి, లంకాపురిని ధ్వంసం చేశాడు. అయితే, రాముడు తన వానర సైన్యాన్ని ఇంత దూరాన వున్న లంకకు ఎలా తరలించగలిగినాడన్న సందేహం రానక్కరలేదు. ఇండియా నుంచి ఆస్ట్రేలియా ఖండం వరకు ఒకప్పుడు ప్రకృతిసిద్ధమైన వారధి ("ఆడమ్స్ బ్రిడ్జి") వుండేది. అక్క డక్కడ దానిలోగల గండ్లను పూడ్చివేస్తూ, వానర సైన్యం నిరాటంకంగా ముందుకు సాగింది. రామాయణం, మహాభారతం, పురాణాలు మొదలైన మన ప్రాచీన గ్రంథాల వద్దకు వచ్చేసరికి మనలో కొందరికి ఎంతగా మతిపోతుందో ఈ రచనను ' కొన్ని నిమిషాలపాటు తిరగవేసినా తెలుస్తుంది.

రావణుని లంకను మెహతా ఆస్ట్రేలియా తీరానికి జరపగా, ఎన్.ఎస్. అధికారి సుమత్రావరకు మాత్రమే దాన్ని జరిపాడు. వి. హెచ్. వడెర్ దాన్ని మరింత దగ్గరకు తెచ్చి, భూమధ్యరేఖ సమీపాన, మాల్దీవులలో అది వున్నదన్నాడు. పోతే, డేనియల్ జాన్ రావణుని లంక ఇప్పటి శ్రీలంక కాదని, శ్రీలంకకు దక్షిణంగా, లేదా, ఆగ్నేయంగా హిందూమహాసముద్రంలో గల ద్వీపాలలో ఒకటి కావచ్చునని సూచించాడు. హనుమంతుడు విమానంలో కాక, తెరచాప పడవలో లంకకు ప్రయాణం చేసినట్టు ఆయన వ్రాశాడు. ' డచ్ పండితుడు రూఫర్ దృష్టిలో రావణుని లంకకోసం చూడవలసింది మలేసియాలో, దాని ఉనికి జొహోరు, సింగపూర్‌కు మధ్యగల సముద్రంలో. ఈ అభిప్రాయాన్ని వాయుపురాణం బలపరుస్తున్నట్టు కె.వి. నీలకంఠ శాస్త్రి వివరించాడు.. అయితే, దీన్ని ఆయన ఆమోదించ లేదు.

పోతే, ఎస్.బి. రాయ్ సరికొత్త సిద్ధాంతం ప్రకారం లంక అంటే మరేదో కాదు, మొహెంజోదారో మాత్రమే. ' నాలుగు వేల సంవత్సరాల క్రితం రామరావణ యుద్ధం జరిగింది. అప్పటిలో ఒక లంకగా వున్న మొహెంజదారోలోనే. రావణుడు

రాక్షసరాజు. అతడి రాజ్యం సింధు, కచ్, గుజరాత్ ప్రాంతాలలో వుండేది. మొహెంజోదారో దాని రాజధాని. రావణుని ఈ రాక్షస రాజ్యానికి ఉత్తరదిశలో దానవరాజ్యం వుండేది. హరప్ప దాని ముఖ్యపట్టణం. ఈ రాక్షస, దానవ రాజ్యాలకు ఉమ్మడి పేరు హరప్పా సామ్రాజ్యం. ఆ సామ్రాజ్యానికి పశ్చిమంగా బలూచిస్తాన్లో కిష్కింధ వుండేది. ఇప్పటి కలాత్ ఒకనాటి కిష్కింధ కావచ్చు. ఇందుకు ఆధారం పశ్చిమోత్తర భారతంలోగల జనపదాలలో ఒక దాన్నిగా కిష్కింధను పాణిని పేర్కొనడమే. రాయ్ ప్రతిపాదిస్తున్న ఈ నూతన సిద్ధాంతాన్ని హర్షిస్తూనే కొందరు పాక్ ప్రొఫెసర్లు ("సమాచార్"
కథనం ప్రకారం) దీనిలో కొన్ని సవరణలు జరగాలంటున్నారు. హైదరాబాద్ (సింధు) యూనివర్శిటీకి చెందిన హిస్టరీ ప్రొఫెసర్లు ముజఫర్ ఆలీ, ఆలీ మహమ్మద్ సోమూల వాదం ప్రకారం సీతారాములు వనవాసం చేసింది దండకారణ్యంలో కాదు; పశ్చిమోత్తర భారతంలో. కావాలని కొందరు బ్రాహ్మణ పండితులు ఈ సత్యాన్ని మరుగుపరిచారు. రామాయణం వర్ణిస్తున్న అత్యున్నత ప్రమాణాల నాగరికత ప్రాచీన కాలంలో ఒక్క సింధులోయలోనే ఉండేది. ఆర్యజాతికి చెందిన రాముడు సంఘర్షించింది మొహెంజాదారో - హరప్పల నాగరికతతోనే అయివుండాలి. అయితే, రావణుని లంక మొహెంజోదారో కాదు, పాక్ ప్రధాని భుట్టో స్వస్థలమైన లార్కానా. చిత్రకూటం రావీనది పరిసరాలలో, పంచవటి, కిష్కింధలు జీలం - చినాబ్ నదుల మధ్య ప్రాంతంలో, అయోధ్య రావి - సట్లెజ్ నదుల మధ్య ప్రాంతంలో ఉండేవి. ఇందువల్ల రామాయణానికి రంగస్థలం దాదాపు పూర్తిగా ఇప్పటి పాకిస్తాన్ అని చెప్పవచ్చు. కుశలవులు సంస్థాపించిన రెండు నగరాలు (లాహోర్, కసూలు) పాకిస్తాన్ లోనే ఉన్నాయి. ఈ వాదాన్ని మొత్తం పై బలపరుస్తూ, పెషావర్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ జెయూర్ ఒకటి, రెండు విషయాలలో మాత్రం కొంత విభేదించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం అయోధ్య కాబూల్, పెషావర్ మధ్య ఎక్కడో వుండేది. ఈ ప్రాంతాన "అజ్వాన్" అనే పేరుతో ఇప్పుడున్న కుగ్రామమే ప్రాచీన కాలంలో అయోధ్య అయివుండవచ్చు. రాముడు వానరబలాలతో సింధు తీరంలోని లంకపై దండయాత్ర చేసింది కాబూల్ నది పరిసర ప్రాంతాల నుంచి కావచ్చు. రావీనది ప్రాచీన నామం "రామి". రాముని జీవితంలో ప్రత్యక్ష సంబంధం ఎంతో కొంత ఉన్నందునే దానికి ఈ పేరు వచ్చివుండాలి.

అనేకు లున్నారు. రామాయణానికి రంగస్థలం పాకిస్తాన్ అనే ఈ వాదం మనకు ఎంతమాత్రం ఆశ్చర్యాన్ని కలిగించ నక్కరలేదు. థాయ్ లెం లో ఒక అయోధ్య ఉన్నది. దాని రాజులలో రాములు తమది ఇనవంశమని వారు చెప్పుకొంటారేమో కూడా! పోతే, ఇండోనేసియనులు రామరావణ యుద్ధం తమ దేశంలోనే జరిగినట్లు ఉద్ఘాటిస్తారు. ఇది అయోధ్య, అది మిథిల, ఇది కిష్కింధ, అది లంక అని రామాయణ నగరా లన్నింటిని తమ దేశంలోనే వారు చూపిస్తారు.

రామాయణం విషయమై, అంతకంటే ముఖ్యంగా లంక విషయమై జరిగిన - జరుగుతున్న - ఈ విభిన్న వాదాలలో ఏదీ నాకు నచ్చలేదు. నాకు నచ్చిన వాదం - ఇదే ఎవరైనా శ్రద్ధాసక్తులతో పరిశీలించదగు వాదం రావణుని లంక వింధ్య పర్వత పరిసరాలలోనే ఎక్కడనో వున్నట్టు చెప్పేది మాత్రమే. ఈ వాదాన్ని చేసిన వారిలో అగ్రగణ్యులు సర్దార్ ఎమ్.వి. కిబే, టి. పరమశివ అయ్యర్, హెచ్.డి. సంకాలియా, డి.ఆర్. మన్కడ్. ఈ నలుగురి వాదంతో కొంతవరకు భిన్నించినా, రాముడు వింధ్య పర్వతాలను దాటలేదనే పండిట్ ద్వారకా ప్రసాద్ మిశ్రా అభిప్రాయం. వీరి వాదాలను వివరించడానికి ముందు డి. ఆర్. భండార్కర్ దండకారణ్యం ఉనికిని గురించి చెప్పిన విషయాలను కొంత తడవాలి.

"ఏది దండకారణ్యం?" అనే ప్రశ్నకు "నిస్సందేహంగా అది మహారాష్ట్ర" అని భండార్కర్ ప్రత్యుత్తరమిచ్చాడు. " మహారాష్ట్రులు సంధ్యావందనం సందర్భంలో "అస్మిన్ దండకారణ్యే దేశే" అని చాటుకొంటారట. దీన్ని తన వాదానికి తిరుగులేని సాక్ష్యంగా ఆయన పేర్కొన్నాడు. ఆయన చెప్పినట్టు, మరాఠీ భాష ప్రచారంలోగల ప్రాంతం దండకారణ్యంలో భాగమై ఉండవచ్చు. కాని, ఆ భాషా ప్రాంతానికే దండకారణ్యం పరిమితమై ఉండేదనడం ఎంతవరకు సబబు?

దక్షిణ భారతం జాగ్రఫీ విషయంలో పార్జిటర్ వాదాన్ని భండార్కర్ బలపరుస్తున్నాడు. ఆ పార్జిటర్ వ్రాతల ప్రకారం ఉత్తరాన బుందేల్ ఖండ్ నుంచి, దక్షిణాన కృష్ణానదీ తీరం వరకు మొత్తం భూభాగం దండకారణ్యమే. బుందేల్ ఖండ్ దాదాపు అలహాబాద్ వద్ద ప్రారంభమౌతున్నది. పోతే, “దక్షిణాన కృష్ణానదీ తీరం వరకు” అంటే, కర్నూలు, బళ్ళారి, రాయచూర్ జిల్లాలవరకు. అయినప్పుడు దండకారణ్యాన్ని కేవలం మరాఠీప్రాంతానికి పరిమితం చేయడం సబబు కాదు. రామాయణం ప్రకారం ఉత్తరాన దండకారణ్య ప్రారంభం అత్రి మహర్షి ఆశ్రమాన్ని దాటినంతనే. ఆయన ఆశ్రమం చిత్రకూట పర్వతానికి ఒకనాటి పయనంలో ఉన్నది. అది కాలినడక పయనం; కాలిబాటవెంట పయనం; పైగా, సీతను పోలిన సుకుమారి వెంట రాగా, రామలక్ష్మణులు చేసిన పయనం. అందువల్ల చిత్ర కూటానికి అత్రి ఆశ్రమం, " పన్నెండు మైళ్ళలో వుండేదని అనుకోవచ్చు. పరమశివ అయ్యర్ అంచనా ప్రకారం సీతారామలక్ష్మణుల ప్రయాణమార్గంలో వారు గంగానదిని దాటిన తర్వాత 27 మైళ్ళలో యమున వుండగా, దానితర్వాత 29 మైళ్ళలో చిత్రకూట పర్వతం, దానికి పన్నెండు మైళ్ళలో అత్రి ఆశ్రమం ఉన్నాయి. ఇందువల్ల గంగకు 70 మైళ్ళలోపలనే, యమునకు 45 మైళ్ళలోపలనే దండకారణ్యం ప్రారంభ మౌతుంది.

నిజానికి అయోధ్యకు, దండకారణ్యానికి మధ్యప్రాంతంలో అరణ్యం లేదనుకొనడానికి ఎంతమాత్రం వీలులేదు. యమునానదిని దాటిన వెంటనే సీతారామలక్ష్మణులు నెమళ్ళగుంపులతో, కోతులతో, ఏనుగులతో, వేటాడి తినడానికి తగిన మృగాలతో నిండివున్న కాననంలో ప్రవేశించారు (అయోధ్యకాండ, 55వ సర్గ). వేటకు వెళ్ళాలంటే, కోసలరాజులకు సరయూనదీతీరంలోనే అరణ్యం వుండేది. పొరపాటున అంధముని పుత్రుని దశరథుడు చంపింది సరయూనదీ తీరంలోని అరణ్యంలో వేటాడుతూనే. (అయోధ్యకాండ, 63వ సర్గ). రాముడు సయితం ఇదే అరణ్యానికి వేటకు వెడుతూవుండేవాడు (అయోధ్యకాండ, 49వ సర్గ). ఇక్కడ మరొక విషయాన్ని కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. కైకేయి పెట్టిన షరతు ప్రకారం రాముడు వెళ్ళవలసింది అరణ్యవాసానికి. అందుకై బయల్దేరిన రాముడు ఆదిలో కొంతకాలం పాటు చిత్రకూట పర్వతం వద్ద నివసించినాడంటే, అది అరణ్య ప్రాంతమై వుండాలి కదా?

ఇంతగా అరణ్యాలను గురించి, వాటి విస్తృతిని గురించి నేను ముచ్చటించడం రాముని కాలంలో - దాన్ని క్రీస్తుకు పూర్వం పదవ శతాబ్దిగా పరిగణించినా మన దేశం అడవుల మయమని చెప్పడం కోసమే ఆ కాలంలో దాదాపు ప్రతి జనపదం అరణ్యం మధ్యలోనే ఉండేదని ఐతరేయ బ్రాహ్మణం సూచిస్తున్నట్టు వేదవేదాంగాలలో మహాపండితుడైన ఎస్.ఎమ్. కుందే వ్రాశాడు. " అరణ్యాల మధ్యలోగల ఋష్యాశ్రమాలలో రూపొందినవి కనుకనే కొన్ని వైదిక గ్రంథాలకు “ఆరణ్యకాలు” అనే పేరు వచ్చింది.

బౌద్ధయుగంలో సయితం అరణ్యాలు విస్తారంగానే ఉండేవి. బుద్ధుని జననం లుంబినీవనంలో, ఆయన ధర్మచక్ర ప్రవర్తనను ప్రారంభించింది మృగదానంలో, ఆయన చాతుర్మాస్యం తరచుగా జేతావనంలో, ఆయన మహాపరినిర్వాణం సాలవనంలో ఈ విధంగా ఆయన జీవితంలోని ప్రతి ముఖ్యఘట్టానికి ఏదో ఒక వనంతో ప్రత్యక్ష సంబంధం ఉన్నది. “వనం” అంటే కేవలం ఉద్యానం కాదు. ఆ పదానికి “శబ్దార్థచంద్రిక” చెబుతున్న నానార్థాలలో మొట్టమొదటిది “అడవి" అని. బౌద్ధ యుగంలో కపిలవస్తు పరిసరాలలో ఒక మహావనం, వైశాలి దరిదాపులలో మరొకటి వుండేదని, ప్రతి గ్రామం చేరువలో పశువుల మేతకై చిన్నదో, పెద్దదో ఒక అడవి ఉండేదని రీస్ డేవిడ్జ్ వ్రాశాడు. జాతక కథలలో అరణ్యాల ప్రసక్తి పదే పదే కానవస్తున్నది.బౌద్ధకాలం నాటి ఆర్థిక వ్యవస్థలో అటవీ సంపదకున్న ప్రాధాన్యాన్ని సంతోష్ కుమార్ దాస్ విశదీకరించాడు.

మొత్తం దేశం ఇంతగా అరణ్యాలతో నిండివున్న కాలంలో, ఉత్తర దక్షిణ భారతాల మధ్య 'కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి" ధోరణిలో దండకారణ్యం ఉన్నకాలంలో, రాముడు (పార్జిటర్ చెప్పగా, భండార్కర్ బలపరుస్తున్నట్టు) బళ్ళారి జిల్లా వరకు వచ్చి సుగ్రీవుని, స్నేహం చేశాడని, లంకపై దండయాత్రకు మరింత ముందుకు సాగిపోయినాడని ఎలా అనుకోగలము? గంగకు ఉత్తర దిశలోనే, కోసల రాజ్యంలోనే అప్పటిలో రాజమార్గాలు బహుస్వల్పం. అవి సయితం పేరుకే రాజమార్గాలు. బహుశా వాటి పై ఒకే ఒక రథం ధారాళంగా నడప గలిగేది. వనవాసానికి బయల్దేరిన రాముడు అయోధ్యనుంచి శృంగిబేరపురం వరకు (ఇంచుమించుగా నూరుమైళ్లు) ఒకే ఒక రథంలో ప్రయాణం చేశాడు. సకల బంధుమిత్ర పరివారంతో భరతుని ప్రయాణానికి ఆ మార్గాన్ని వెడల్పు చేయవలసి వచ్చింది. ఇందుకోసం కొన్నివేల మందిని భరతుని ఉత్తరువుపై నియోగించారట. (అయోధ్యకాండ 80వ సర్గ). అయినప్పుడు చిత్రకూట పర్వతం నుంచి సింహళం వరకు (అదే రావణుని లంకాద్వీపమైతే) 1500 మైళ్ళకు పైగా రాముడు ఏవిధంగా పురోగమించగలిగాడు? ఇంతకంటె కూడా ముఖ్యమైన ప్రశ్న - సింహళ ద్వీపంలోని రావణుడు 1500 మైళ్ళలోగల జనస్థానం పై తన ఆధిపత్యాన్ని ఏ విధంగా సంస్థాపించుకొనగలిగాడు? సింహళానికి, జనస్థానానికి మధ్య ఇతర రాజ్యాలు లేవా? వాటిని విడదొక్కుకొని రావణుడు ముందుకు ఎలా వెళ్ళగలిగాడు? అశోకుని సామ్రాజ్యం నెల్లూరుదాటి విస్తరించలేదు; గుప్త, హర్ష సామ్రాజ్యాలు నర్మదానదినైనా దాటలేదు. మరి మూడువేల యేళ్ళనాడు రావణుడు యమునానది వరకు ఎలా విస్తరించగలిగాడు? రాముడు సింహళంపై జైత్రయాత్ర ఎలా జరపగలిగాడు? ఈ ప్రశ్నలు రామభక్తులకు, ఆయన భజనపరులకు తోచకపోవచ్చు. కాని, ఇవి కనీసం పార్జిటరు తోచవలదా? భండార్కరకు తోచవలదా? ఈ విషయంలో కుమారునికి లేని హేతుదృష్టిని తండ్రి చూపించడం ఒక విశేషం. డి.ఆర్. భండార్కర్ పంచవటి నాసిక సమీపంలో ఉండేదని చెప్పగా, 15 ఆయన తండ్రి ఆర్. జి. భండార్కర్ వాల్మీకి తన కావ్యనాయకుని వింధ్య పర్వత ప్రాంతానికి పశ్చిమంగా ఎంతో దూరానవున్న నాసిక్ వరకు తెచ్చివుండడని వ్రాశాడు. 16 "వాల్మీకి తన కావ్యనాయకుని" అనే మాటలను ఆర్.జి. భండార్కర్ నిర్నిమిత్తంగా వాడలేదు. ఆయన దృష్టిలో ("జాబాలి" పీఠికలో నేను వివరించినట్టు) రామాయణం కావ్యమే కాని చరిత్రకాదు. ఏమైనా, ఇరవయ్యో శతాబ్దంలో పైకివచ్చిన భారతీయ మేధావులు పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలో పేరొందిన మేధావులు చూపుతూ వచ్చిన పాటిగానైనా హేతుదృష్టిని చూపలేకపోవడం మన దేశ దౌర్భాగ్యమే! ఒక జాతిగా మన మనస్సు వికసించడానికి మారుగా ముడుచుకుపోతున్నట్టుగా అనుమానించవలసి వస్తున్నది.

దండకారణ్యంలో రాముడు విడిది చేసిన ఆశ్రమాల మధ్య, ఆయన నివసించిన ప్రాంతాల మధ్య దూరాలను మదింపు చేయడానికి టి. పరమశివ అయ్యర్ టోపోగ్రాఫికల్ మ్యాపులు సహాయంతో ప్రశంసాపాత్రమైన ప్రయత్నం చేశాడు. ఆయన మదింపు ప్రకారం అయోధ్యకు 100 మైళ్ళలో శృంగిబేరపురం, 169 మైళ్ళలో చిత్రకూట పర్వతం, 178 మైళ్ళలో అత్రి ఆశ్రమం, 185 మైళ్ళలో శరభంగుని ఆశ్రమం, 279 మైళ్ళలో సుతీక్షుని ఆశ్రమం, 297 మైళ్ళలో అగస్త్య భ్రాత ఆశ్రమం, 306 మైళ్ళలో అగస్త్యుని ఆశ్రమం, 315 మైళ్ళలో పంచవటి, 349 మైళ్ళలో మతంగవనం, 373 మైళ్ళలో లంక వున్నాయి. (కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం యోజనం అంటే దాదాపు నాలుగున్నర మైళ్ళు, క్రోసు అంటే 2000 గజాలు. ఇందుకు అనుగుణంగానే రామాయణంలోని యోజనాలను, క్రోసులను పరమశివ అయ్యర్ మైళ్ళలోకి మార్చాడు).

ఇక్కడ మనం రెండు విషయాలను ప్రత్యేకించి గమనించాలి. పరమశివ అయ్యర్ అంచనాల ప్రకారం అయోధ్యకు 190 మైళ్ళ లోపలనే దండకారణ్యం ప్రారంభమౌతుంది; అయోధ్యకు 315 మైళ్ళలో పంచవటి వున్నది. ఈ అంచనాలు నిజమైతే (భండార్కర్ చెప్పినట్టు) దండకారణ్యం కేవలం మరాఠీ భాషాప్రాంతానికి పరిమితం కావడానికి వీలు లేదు; పంచవటి నాసిక్ ప్రాంతంలో ఉండడానికి సయితం వీలులేదు.

పోతే, ఇక్కడ గమనించదగు మరొక విషయ మిది : పరమశివ అయ్యర్ అంచనా ప్రకారం అయోధ్యకు 373 మైళ్ళలో లంక వున్నది. ఘోరారణ్య ప్రాంతాల గుండా 373 మైళ్ళు ప్రయాణం చేయడం నిజంగా ఒక గొప్ప విశేషం. అయితే రామభక్తులకు, ఆయన భజనపరులకు ఇది చాలదు. అందువల్ల ఆయన 1500 మైళ్ళకు పైగా పురోగమించినట్టు వారు ఉద్ఘాటిస్తారు; వారిలో సి.ఎస్. మెహతాను పోలినవారు ఆయన ఆస్ట్రేలియా వరకు పురోగమించినట్టు బల్లగుద్ది వాదిస్తారు. రావణుని లంకకోసం చూడవలసింది వింధ్య పరిసరాలలోనే అని పరమశివ అయ్యర్ కంటె ముందుగా సర్దార్ ఎమ్.వి. కిబే చెప్పాడు. అసలు ఈ సిద్ధాంతాన్ని లేవనెత్తిందే ఆయన. దాన్ని మన సంస్కృత పండితులు, మన చరిత్రకారులు పరిశీలనైనా లేకుండా త్రోసివేశారు.

కాని, రామాయణ పరిశోధనలో అగ్రగణ్యుడైన యాకోబీ దానివైపు మొగ్గు చూపించాడు. "రావణుని లంక అస్సాంలో ఉండేదని ఒకప్పుడు నే ననుకొన్నాను. ఇప్పుడు మీ సిద్ధాంతమే మరింత సమంజసమైనదని నాకు తోస్తున్నది" అనే ధోరణిలో ఆయన కిబే పేర లేఖ వ్రాశాడుకూడా. " తర్వాత కొంతకాలానికి జె.సి. ఘోష్", డాక్టర్ హీరాలాల్', జి. రామదాసు 20 మున్నగు మరికొందరు కూడా కిబేను సమర్ధించారు.

రావణుని లంక వింధ్య పరిసరాలలో ఉండేదన్న విషయంలో ఏకీభవించినా, తక్కినవాటిలో పరమశివ అయ్యర్, కిబేలకు అన్నీ విభిన్నాభిప్రాయాలే. మ్యాపుల జోలికి పోకుండా, కేవలం రామాయణంపై ఆధారపడితే కిబే వేసిన అంచనాల ప్రకారం చిత్రకూట పర్వతానికి, కిష్కింధకు మధ్యదూరం 96 మైళ్ళు కాగా, కిష్కింధకు, లంకకు మధ్య దూరం ఏడు మైళ్ళు మాత్రమే. చిత్రకూటం నుంచి వింధ్య పర్వతాలు ఇంచుమించు 96 మైళ్ళలోనే వున్నాయి. అందువల్ల కిష్కింధ వింధ్య పర్వతాలకు ఉత్తరపు చరియలలో ("షాప్స్"లో) ఉండేది; లంక వాటి దక్షిణపు చరియలలో ఉండేది - ఇదే కిబే సిద్ధాంతం. దీని సమర్ధనకై ఆయన చెప్పిన కారణాలలో ముఖ్యమైన వివి:

1చిత్రకూట ప్రాంతాన్ని విడిచిన పిమ్మట పదేళ్ళపాటు రాముడు వనవాసం చేసింది సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంలో, లేదా దాని పరిసరాలలో, ఈనాటి సత్నాలో అది వుండేది. మధ్యప్రదేశ్ లోని కట్ని నుంచి అలహాబాద్ కు రైలు ప్రయాణం చేస్తుండగా దారిలో తగిలే పట్టణం సత్నా. ఇక్కడ అతి సుందరమైన ఒక నది వున్నది. ఈ నదీ తీరంలోనే సుతీక్ష్ణుని ఆశ్రమం ఉండేది. *ఈ మాట కిబే చెప్పలేదుగాని, సత్నాకు మరొక పేరు "రఘురాజనగర్" అని ఇంపీరియల్ గెజెటీర్ 12వ సంపుటం 130వ పుటలో ఉన్నది. రాముడు సత్నాలో పదేళ్ళు నివసించినందునే దానికి ఈ పేరు వచ్చిందా?*

2 దక్షిణ భారతంలోని గోదావరికాక, వింధ్య పర్వతాలకు ఉత్తరదిశలో పంచవటి సమీపాన దాదాపు ఇదే పేరుతో మరొక నది వుండేది. పురాతత్త్వశాస్త్రవేత్త హీరాలాల్ వివరణ ప్రకారం, ఈ రెండవ నది "గోదా".

3 వింధ్య పర్వత శాఖలలో ఒకదాని పేరు "కిజువా". దాని పరిసరాలలోని అరణ్యాన్నే వాల్మీకి "క్రౌంచారణ్యం" అని వుండవచ్చు,

4 వరాహమిహిరుడు భారతదేశాన్ని తొమ్మిది భాగాలు చేశాడు. (ఎనిమిది దిక్కులలో ఎనిమిది భాగాలు, వాటి మధ్య ప్రాంతంలో తొమ్మిదవ భాగం). ఈ తొమ్మిదవదానికి ఆగ్నేయభాగంలో కిష్కింధ కలదని ఆయన చెప్పాడు. అది త్రిపుర సమీపంలో (జబల్పూర్ దరిదాపులలో) కలదని సూచించాడు. దీని తాత్పర్యం కిష్కింధ వింధ్యకు ఉత్తరదిశలో కలదని.

5 శబరభాషలో విశేష పాండిత్యాన్ని గడించిన జి. రామదాసు వివరణ ప్రకారం, ఆ భాషలో "లంక" అంటే ఎత్తు, ఎగువ, కొండ (స్వర్గం); "జైతాన్" అంటే దిగువ, "దండకం" అంటే జలమయ ప్రాంతం. ఎత్తైన కొండపై ఉన్నందునే రావణుని రాజధాని "లంక" అయి ఉండాలి. ఆ లంకకు దిగువగల ప్రాంతం పేరును "జైతాన్" నుంచి జనస్థానానికి రామాయణ రచయిత మార్చి ఉండాలి. (ఎగువ తిరుపతి, దిగువ తిరుపతి ఈనాడు మనకున్న పద్ధతిలో) పోతే, లంక సమీపంలోగల

ప్రాంతంలో సాంద్రారణ్యంతో పాటు జలాశయాలు పెక్కు లున్నందువల్లనే దాన్ని "దండకారణ్యం" అనే పేరు వచ్చివుండాలి.

6 రావణుని లంక త్రికూట పర్వతంపై ఉండేది. అది ఇప్పటి "అమరకంటక" పర్వతం. దీనికి ఏడు మైళ్ళ దూరంలో ఇప్పుడు శబరినారాయణ అనే గ్రామం ఉన్నది. రాముడు శబరి నుంచి అర్ఘ్యపాద్యాలను స్వీకరించింది ఈ గ్రామంలోనే కావచ్చు.

7 "అమరకంటక" అనే పదానికి రావణుని వంశనామమైన "సాలకటంకట"తో కొంత ధ్వనిసామ్యం కానవస్తున్నది. పైగా, అమరకంటక ప్రాంతంలో గల ఆదివాసులు తాము రావణ వంశీయులమని చెప్పుకొంటారు.

8 వింధ్యపర్వత శ్రేణిలో కైమూర్ అనే భాగానికి చెందింది అమరకంటక. ఇక్కడ ప్రాచీన కాలపు గుహ లున్నాయి; ఆ గుహలలో ప్రాచీనకాలపు కుడ్యచిత్రా లున్నాయి, ప్రాచీన జనపదాల చిహ్నా లున్నాయి.

9 అమరకంటక పరిసరాలలో అనేక సరస్సు లున్నాయి. "సాగరం" అనే పేరు వాటిలో కొన్నింటికి వున్నది. నందలాల్ డే వివరించినట్టు "సాగరం" అనే పదానికి సరస్సు, సముద్రం, మహాసముద్రం అనే నానార్థాలున్నాయి.

హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, నిజాం సాగర్, నాగార్జున సాగర్ - ఆంధ్రప్రదేశ్ లో ఇన్ని సాగరా లున్నాయి. వీటిలో ఒక్కటైనా సముద్రం కాదు.

10 విభీషణుడు సముద్రం అవతలిగట్టునుంచి గట్టిగా మాట్లాడగా, ఇవతలి గట్టుపై విడిసివున్న వానర సేనానాయకులకు అతడి మాటలు వినబడినట్టు యుద్ధకాండ 17వ సర్గ స్పష్టం చేస్తున్నది. అది నిజంగా నూరు యోజనాల వెడల్పుగల సాగరమైతే, ఇది జరిగేది కాదుగదా?

11 క్రీస్తుశకం 1080 నాటి ఒక సంస్కృత తామ్రశాసనం రీవాసంస్థానంలో దొరికింది. వింధ్య ప్రాంతంలోని "లవణాకరం" ప్రసక్తి దీనిలో వున్నది. దీన్నిబట్టి ఆ ప్రాంతంలోని ఒక పెద్ద నీటిమడుగు నడుమ ఉప్పుగని వుండేదని మనం ఊహించవచ్చు. రావణుని లంక ఈ మడుగులో వుండేదేమో!

12 రీవా సంస్థానంలో బిలాస్ పూర్, కట్నీల మధ్య పెండ్రారోడ్ అనే రైలు స్టేషన్ కు పదిమైళ్ళ దూరంలో ఒక కొండమీద "రాణి బకావళికోట" వున్నది. "భృగుమహర్షి ఆశ్రమం"గా పేరందిన స్థలంనుంచి ఈ కోట స్పష్టంగా కనబడుతుంది. ఈ ఆశ్రమం నర్మదానది జన్మస్థానానికి రెండు మైళ్ళలోపల వున్నది. ఇక్కడి నేల బాడవ. ఇది రొచ్చు రొచ్చుగా వుంటుంది. దాదాపు నూటపదేళ్ళనాడు ఈ బాడవ దాటి "రాణి బకావళికోట"కు వెళ్ళాలని సర్ రిచర్డ్ టెంపుల్ ప్రయత్నించాడు. కాని, ఊబిలో దిగబడి, తన ఏనుగు మరి ముందుకు నడవలేక పోయినందున, ఆ ప్రయత్నాన్ని ఆయన విరమించవలసి వచ్చింది. బాడవ ఈవలి అంచునుంచి కోటను చూస్తే, మంచు తెరలమధ్య మసకమసకగా ఎంతో దూరాన వున్నట్టు అది కనబడుతుంది. ఇదే రావణుని లంకాపురి అయివుండవచ్చు.

సర్దార్ కిబే చేసిన ఈ సిద్ధాంతానికి భిన్నంగా వెళ్ళి, ఇప్పటి జబల్పూర్-దామో రోడ్డుపైగల ఇంద్రానా పర్వతంపై *ఇది ప్రస్తుతం దాని వ్యవహార నామం. అసలు పేరు "ఇంద్రాణి పర్వతం" కావచ్చు.* రావణుని లంక వుండేదని పరమశివ అయ్యర్ తీర్మానించాడు. నర్మద, హిరన్ (హిరణ్య?) నదుల లోయలోగల "హవేలీ" (మైదానం) నుంచి ఈ పర్వతం 650 అడుగుల యెత్తుకు లేస్తున్నది. దీని మూడు పార్శ్వాలలో హిరన్ ప్రవహిస్తున్నది. వర్షాకాలంలో హిరన్ పొంగి పొరలినప్పుడు హవేలి ఒక పెద్ద సముద్రంవలె కనబడుతుంది. రామాయణం పేర్కొంటున్న దక్షిణసముద్రం ఇదే కావచ్చు. ఇంద్రానా దరిదాపులలో సువేలవున్నది. రామాయణం పేర్కొంటున్న సువేల అదే కావచ్చు. (రావణుని లంకాపురి త్రికూట పర్వతం పై వుండగా, దాని సమ్ముఖంలో సువేల అనే మరొక పర్వతం కలదని, సువేల శిఖరం పై నుంచి లంకాపురిని రాముడు మొట్టమొదటగా చూచినాడని యుద్ధకాండ 38వ సర్గ వివరిస్తున్నది). ఇంద్రానా పర్వతప్రాంతాన్ని పశ్చిమోత్తర దిశనుంచి చేరాలంటే, వింధ్యపర్వత పంక్తి మధ్యగల ఒక సందుగుండా వెళ్ళాలి. (దీన్ని హిందీలో "కటావ్" అంటారు).

వింధ్యపర్వతం పంక్తికి చెందిన కైమూర్ శాఖ కటంగీ అనే ప్రదేశానికి తూర్పుగా ఒక మైలులో హఠాత్తుగా నిలిచిపోయినట్టు కనబడుతుంది. ఈ కటంగీ జబల్పూర్ - దామోరోడ్డులో ఇరవై నాల్గవ మైలు రాయి వద్ద ఉన్నది. వింధ్యపర్వత పంక్తిలో కటంగీవద్ద గల ఈ "కటావ్"నే రామాయణం మహేంద్రపర్వత ద్వారంగా పేర్కొనివుండాలి. ఈ పర్వత ద్వారం గుండా కైర్ నది ప్రవహిస్తున్నది. సీతాపహరణ తర్వాత రావణుడు లంకకు తిరిగి వెడుతూవుండగా మహేంద్రపర్వత ద్వారం వద్ద చేపలు పడుతున్న సుపార్శ్వుడు (సంపాతి కుమారుడు) లంకాధిపతిని చూచినట్టు రామాయణంలో వున్నది (కిష్కింధాకాండ, 59వ సర్గ). సుపార్శ్వుడు చేపలు పట్టింది ఈ కైర్ నదిలోనే కావచ్చు. రామయణం పేర్కొంటున్న ఋక్షబిలం, ఋష్యమూక, పంప, కిష్కింధ, మహేంద్రగిరి, మలయపర్వతం మొదలైన వాటిని కూడా మ్యాపుల తోడ్పాటుతో, గెజిటీర్ల తోడ్పాటుతో గుర్తించడానికి ఇదే ధోరణిలో పరమశివ అయ్యర్ " రామాయణ అండ్ లంక" అనే తన గ్రంథంలో గట్టి ప్రయత్నం చేశాడు. ఆయన చేసిన ఈ ప్రయత్నం సర్దార్ కిబే చేసిన దానికంటే శ్రద్ధగా, క్షుణ్ణంగా జరిగినట్టు కనబడుతుంది. ఇందువల్లనే కావచ్చు, కిబే సిద్ధాంతం వైపుకుకాక, పరమశివ అయ్యర్ వాదంవైపుకు డి.ఆర్. మనకు మొగ్గు చూపించాడు. ఈయన పేరందిన సంస్కృత విద్వాంసుడు. వల్లభ్ - విద్యానగర్ లోని వి.పి. మహావిద్యాలయానికి ప్రిన్స్ పల్ గా పనిచేసిన విద్యావేత్త. బరోడా విశ్వవిద్యాలయానికి చెందిన ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యాన వాల్మీకి రామాయణానికి ప్రామాణిక పాఠాన్ని నిర్ణయించిన పండితవర్గంలో ఈయన సభ్యుడు. కిష్కింధాకాండ ఎడిటింగ్ బాధ్యతను జి. హెచ్. భట్ నాయకత్వాన ఈయన ఎంతో సమర్థంగా నిర్వహించాడు. నాకు ప్రత్యేకించి నచ్చినట్టిది కిష్కింధాకాండ ప్రామాణిక పాఠం సంపుటానికి ఈయన ఇంగ్లీషులో వ్రాసిన పీఠిక. దానిలో ఈయన స్వతంత్ర ప్రవృత్తి, ఈయన శాస్త్రీయ దృష్టి, ఈయన సత్యప్రియత్వం విశేషంగా గోచరిస్తున్నాయి.

మనకడ్ తీర్పు ప్రకారం, "సుగ్రీవుని జాగ్రఫీ సర్గలు"గా నేను పేర్కొన్న నాల్గింటిలో 39,41,42 సలు దాదాపు పూర్తిగా వాల్మీకి పేరుతో జరిగిన ఫోర్జరీలు. పోతే, 40వ సర్గలో సయితం (వావిళ్ళవారి వచన రామాయణంలో ఇది 41వ సర్గ) ఒకటవ శ్లోకం నుంచి ఎనిమిదవదాని వరకు, తొమ్మిదినుంచి పదకొండువరకు, 21 నుంచి 26 వరకు వాల్మీకి వ్రాసినవి కావచ్చు; తక్కినవి నిశ్చయంగా ప్రక్షిప్తాలే. సీతాపహరణ తర్వాత దక్షిణదిశగా రావణుడు వెళ్ళడాన్ని సుగ్రీవుడు స్వయంగా చూచిన మీదట సీతాన్వేషణకై తక్కిన మూడు దిక్కులకు అతడు తన వానర బృందాలను పంపించడం మతిలేని పని కాబట్టి, అతడు దాన్ని చేసివుండడని నావలెనే మన్కడ్ అభిప్రాయపడుతున్నాడు. అంగదుని నాయకత్వాన దక్షిణానికి వెళ్ళిన బృందానికి సుగ్రీవుడు చెప్పిన మొదటి మాట "దక్కినంపువైపునకు దిరిగిన వెంటనే" వేయి శిఖరాలున్న వింధ్య పర్వతాలు వారికి కనబడతాయని, వాటిని దాటిన వెంటనే నర్మదానది తగులుతుందని. దీన్నిబట్టి కిష్కింధ వింధ్యకు ఉత్తరంలోనే ఉండేదని స్పష్టంగానే తెలియడం లేదా అని మన్కడ్ ప్రశ్నిస్తున్నాడు. మతిగలవారికి ఎవరికైనా ఈ ప్రశ్న విధిగా తోచాలి.

సంస్కృత సాహిత్యంలో తనకున్న ప్రత్యేక పాండిత్యాన్ని పురస్కరించుకొని "సుగ్రీవుని జాగ్రఫీ సర్గల" లోని శ్లోకాలలో పెక్కింటిని మత్స్యపురాణం నుంచి యెత్తి, రామాయణంలో దూర్చినారని మన – నిరూపించగలిగాడు. కేవలం ఇక్కడనే కాక, ఇతర ఘట్టాలలో సయితం మత్స్యపురాణం నుంచి చౌర్యం జరిగిందని ఆయన రుజువు చేశాడు. వాయుపురాణం నుంచి, బ్రహ్మాండపురాణం నుంచి ఇదే విధంగా మరికొంత చౌర్యం జరిగినట్టు ఆయన నిరూపణ చేశాడు. వాల్మీకి పేర ఎంద రెందరో ఇన్ని తప్పుడు పనులు చేయబట్టే ఆయన పేర చెల్లుతున్న సంస్కృత రామాయణం 24,000 శ్లోకాలకు పెరిగింది!

అయోధ్య నుంచి చిత్రకూట పర్వతం, అక్కడి నుంచి పంచవటి, అటుపైన కిష్కింధ, లంకాపురి ఎంతెంత దూరాలలో కలవో రామాయణ పాఠమే ఆధారంగా చర్చించిన మీదట, పరమశివ అయ్యర్ తీర్మానాలతో మన్కడ్ మొత్తం పై ఏకీభవిస్తున్నాడు.

ఒకే ఒక విషయంలో మాత్రం అయ్యర్ తో ఈయన విభేదిస్తున్నాడు. శరభంగుని ఆశ్రమం నుంచి సుతీక్షుని ఆశ్రమానికి 94 మైళ్ళు అని అయ్యర్ చెప్పగా, ఇంత స్పష్టంగా చెప్పడానికి తగు ఆధారం లేదని, "బహుదూరం" అని మాత్రమే చెప్పగలమని మనకు వ్రాస్తున్నాడు. ఏమైనా, ఇంద్రానా పర్వతం పైనే లంకాపురి ఉండేదన్న అయ్యర్ వాదాన్ని మన్కడ్ పూర్తిగా బలపరుస్తున్నాడు. ఇంద్రానా పర్వతం వద్ద సింగల్ దీప్ అనే గ్రామం కలదని చెప్పినా, అది ఇటీవలి కాలంలో ఆ గ్రామానికి వచ్చిన పేరు కావచ్చునని అయ్యర్ సూచించాడు. కాని, మన్కడ్ దృష్టిలో సింహళం ద్వీపంగా సంపాతి . ని పేర్కొన్నది ఈ గ్రామమే కావచ్చు. ఇంతే కాక, ఇంద్రానాపర్వత ప్రాంతంలో "తికుడి" అనే మరొక గ్రామం ఉన్నది. దీనికి 'త్రికూట"తో గల ధ్వనిసామ్యం గమనార్హమైనదని కూడా మన – భావిస్తున్నాడు.

మనకడ్ వలె సంకాలియా సయితం పరమశివ అయ్యర్ వైపుకు ఆదిలో మొగ్గు చూపించాడు. అయితే, ఇటీవల ఇంద్రానాపర్వత ప్రాంతాన్ని పరిశీలించివచ్చిన మీదట ప్రాచీనకాలంలో ఇక్కడ జనపదా లున్న సూచనలు ఎంతమాత్రం తనకు కానరాలేదని, అందువల్ల లంకకై చూడవలసింది జబల్పూరు ప్రాంతంలో కాక, నర్మదకు ఉత్తరంగా మధ్యప్రదేశ్ ఆగ్నేయభాగంలో, లేదా దాని పొరుగునవున్న ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతాలలో అని ఆయన ప్రకటించాడు.

వింధ్య పరిసరాలలోనే లంకకై చూడాలని అనేవా రందరు నొక్కి చెప్పే మొట్టమొదటి సంగతి - సీతాన్వేషణకై బయల్దేరిన అంగదబృందం కాని, సీతను చూచిన తర్వాత లంక నుంచి తిరిగివచ్చిన హనుమంతుడు కాని, వానర సేనతో లంకపై దండెత్తి వెళ్ళిన రాముడు కాని నర్మదా నదిని దాటినట్టు రామాయణంలో లేకపోవడమే. వింధ్య పర్వత పంక్తికి దక్షిణంగా, దానికి అనతిదూరంలో నర్మద ప్రవహిస్తున్నది. అయినప్పుడు నర్మదను దాటకుండా ఎవరైనా దక్షిణ సముద్రతీరాన్ని ఎలా చేరగలరు? ఈ ప్రశ్నకు ద్వారకా ప్రసాద్ మిశ్రా ప్రత్యుత్తరం నిజమే, ఎవరైనా నర్మదను దాట చేరలేరు. కాని, తూర్పు సముద్రతీరాన్ని చేరవచ్చు" నని. చిత్రకూటం నుంచి సత్నా, రీవా, శహడోల్, బిలాస్ పూర్, రాయపూర్, బస్తర్ జిల్లాలగుండా ప్రయాణంచేసి, గోదావరి గట్టుపై వున్న పంచవటిని చేరవచ్చు. నర్మదను దాటకుండా గోదావరిని చేరవచ్చునన్న విషయాన్ని గుర్తిస్తే, కిబే వాదంలో పస తగ్గుతుంది, పరమశివ అయ్యర్ సిద్ధాంతం దెబ్బ తింటుంది. "అయితే, మరి ఆశ్రమం నుంచి, ఆశ్రమానికి దూరాల లెక్కలను త్రోసివేయవలసిందేనా?" అని నిలదీస్తే, "జై" నని సమాధానం చెప్పడానికి మిశ్రా సందేహించడం లేదు. ఆయన వాదం ప్రకారం ఈ దూరాల విషయమై రామాయణంలో పరస్పర వైరుధ్యాలు కనబడుతున్నాయి. పదునాలుగేళ్ళ వనవాసంలో రాముడు ప్రదేశం నుంచి ప్రదేశానికి తన నివాసాన్ని మార్చాడు. ఆ ప్రదేశాల మధ్య దూరాలను గురించి ఎవరైనా నిర్ధారణగా ఏమి చెప్పగలరు, ఎలా చెప్పగలరు? పైగా, రాముడు ఏ కాలిబాటల వెంట పయనించాడో తెలియదు. ఆయన తిరిగిన ప్రదేశాలు చాలావరకు ఈనాటి మధ్యప్రదేశ్ కు చెందిన వనడం నిజమే. అందువల్లనే రామాయణానికి సంబంధించిన స్థలపురాణాలు మధ్యప్రదేశ్ లో బహుళ ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఇట్టి పురాణాలు ఇంద్రానా ప్రాంతంలో ప్రచారంలో లేవు, అమరకంటక ప్రాంతంలో సయితం లేవు. పైగా, రామాయణంలోగల లవణ సముద్రం ప్రసక్తిని త్రోసివేయడానికి ఎంతమాత్రం వీలులేదు. సముద్రం మధ్యలోనే లంక బహుశా వుండేది. ఆ సముద్రం బంగాళాఖాతం కావచ్చు. ఒరిస్సాలోని మహానది ముఖద్వారానికి, ఆంధ్రప్రదేశ్ లోని గోదావరి ముఖద్వారానికి మధ్యలో ఎక్కడనో ఒకచోట అది ఉండేదని అనుకోవచ్చు. హనుమంతుడు లంకకు వెళ్ళింది మహేంద్రగిరినుంచి. గంజాం సమీపంలోగల తూర్పు కనుమలలో ఒక భాగాన్ని ఇప్పటికి సయితం మహేంద్రగిరి అనే పిలుస్తారు. ఇంతేకాక, సీతాన్వేషణకై రాముడు తిరిగిన ప్రాంతాలలో శబరుల నివాసస్థానం ఉన్నది. ఇప్పటికి కూడా శబరజాతివారు ఒరిస్సాలో హెచ్చుగా వున్నారు. బస్తర్ లో శబరి పేరుతో ఒక నది ఉన్నది. ఈ కారణా లన్నింటివల్ల రావణుని లంకకై చూడవలసింది మధ్యప్రదేశ్ లో కాదని, ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలోనే అని మిశ్రా గట్టిగా నమ్ముతున్నాడు.

"సీతాన్వేషణకై వెళ్ళిన వానర బృందం కాని, లంకపై దండెత్తిన రాముడు కాని వింధ్యపర్వత ప్రాంతాలను దాటినట్టు రామాయణాన్ని నిశితంగా పరిశీలించిన వారెవ్వరు అనలేరు. మరి మీ వాదం నిజమైతే, ఆంధ్ర ఒరిస్సాల సరిహద్దుకు వింధ్య పర్వతాలను జరపవలసి వస్తుంది" అనే ఆక్షేపణకు మిశ్రా సమాధాన మిది: ఓఢ్రులు వింధ్య ప్రాంతం ప్రజలని మత్స్యపురాణం చెబుతున్నది. చోటానాగపూర్ లోని కొండలను ప్రాచీనకాలంలో వింధ్యపర్వతాలని అనేవారట. అందువల్ల వింధ్య పర్వతాలు మహేంద్రగిరి వరకు విస్తరిస్తున్నట్టుగా ఒకప్పుడు భావించేవారని ఎందుకు అనుకోరాదు?

మిశ్రాతో, పూర్తిగా కాకపోయినా, చాలావరకు ఏకీభవిస్తున్న పరిశోధకుడు ఆర్.ఎన్. చక్రవర్తి. అంగదుని నాయకత్వాన సీతాన్వేషణకై వెళ్ళిన వానరులు ఋక్షబిలంలో ప్రవేశించి, కొంతదూరం వెళ్ళగా, వారికి అతిసుందరమైన ఒక లోయ తగులుతుంది. ఇది మన విశాఖజిల్లాలోని అరకులోయ అని చక్రవర్తి నమ్మకం. ఇదే స్వయంప్రభ అనే తాపసి నివాసస్థానం (కిష్కింధాకాండ, 50-51 సర్గలు). అరకులోయకు వాయువ్యంగా దాదాపు నూరుమైళ్ళలోగల గోండ్ ప్రాంతమే వానరరాజ్యం. అరకులోయకు ఈశాన్యంగా నూరుమైళ్ళలోపల మహేంద్రగిరి ఉన్నది. ఈ పర్వతానికి తూర్పుగా అనతిదూరంలో తూర్పుసముద్రం (బంగాళాఖాతం) ఉన్నది. దానికి ఉత్తరదిశలో రెండువందల మైళ్ళ దూరాన మలయగిరి ఉన్నది. ఈ మహేంద్ర, మలయగిరుల మధ్య మహానది లోయ ఉన్నది. ఈనాటి ఒరిస్సా మ్యాపులో ఈ కొండలను, ఈ లోయను చూడవచ్చు. "మరి ఆ మ్యాప్ లో లంకలేదేమి?" అనే ప్రశ్న (చక్రవర్తి దృష్టిలో) అర్థరహితం. రామ, రావణులు ఈనాటి వారో, నిన్నటివారో కారు; కొన్నివేల సంవత్సరాల క్రితం వారు. ఈ దీర్ఘకాలంలో సముద్రం ఎంతగానో ముందుకు కోసుకొని వచ్చివుండవచ్చు. అందువల్ల రావణుని లంక కనబడకుండా పోయివుండవచ్చు. "

లంక కోసం చూడవలసింది జబల్పూర్ పరిసరాలలో కాదన్న తీర్మానానికి చేసుకొన్న మీదట, దానికై అమరకంటక, బస్తర్ ప్రాంతాల మధ్య అన్వేషించాలన్న నిర్ణయానికి సంకాలియా వచ్చాడు. జబల్పూర్ నాకు కొత్త కాదు. నిజానికి, అది నా జన్మస్థానం. మధ్యప్రదేశ్ లోని కట్నీ, సత్నా వగైరాలు నాకు తెలిసిన పట్టణాలే. అయితే, రామాయణానికి ఈ పట్టణాలతో, లేదా ఈ ప్రాంతాలతో ఏపాటి సంబంధం కలదన్న దృష్టితో వాటిని నేను చూడలేదు. అందువల్ల నేను గట్టిగా ఏమీ చెప్పలేను గాని, జనస్థానం, కిష్కింధ, లంక మొదలైనవి ఈనాటి మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, ఆంధ్రప్రదేశ్ ల ఉమ్మడి సరిహద్దుల ప్రాంతాలలో, ప్రత్యేకించి చోటా నాగపూర్ ప్రాంతంలో ఉండేవన్న నమ్మకం అంతకంతకు నాలో బలపడుతున్నది. చోటానాగపూర్ లో ఇప్పటికి కూడా నూటికి 38.04 వంతులు అడవులమయం. ఇది ముండా, ఓరోన్, సంతాల్, హో, అసుర మొదలైన ఆదివాసులకు ప్రధాన కేంద్రం. కొన్ని కొన్ని ప్రాంతాలలో ఈ ఆదివాసులు మొత్తం జనాభాలో నూటికి దాదాపు 66 వంతుల వరకున్నారు. ఏమైనా, ఒక్కటి మాత్రం ముమ్మాటికీ నిశ్చయం. రాముడు నర్మదానదిని దాటలేదు. రామభక్తులకు, భజనపరులకు, సీతారాముల బొమ్మలకు ఏడాది కొకసారి పెళ్ళిచేసి, స్వర్గద్వారాలు తమకోసం తెరుచుకొని ఉండగలవని విశ్వసించే ప్రబుద్ధులకు ఎవరేమి చెప్పినా, ఎంతగా చెప్పినా, అది కంఠ మాత్రమే కాగలదు. అందువల్ల వారిని ఉద్దేశించి కాక, ఆలోచనాశక్తిని కొంతగానైనా మిగుల్చుకొన్న వారిని ఉపలక్షించి, ఈనాటి శ్రీలంక రావణుని లంక కావడానికి ఎంత మాత్రం వీలులేదని వ్రాసిన టి. అమృతలింగం పరమశివ అయ్యర్ తమ్ముడు. ఆదిలో ఈయన గొప్ప రామభక్తుడు. ఒక పుణ్యగ్రంథంగా రామాయణాన్ని పారాయణ చేస్తూ వుండేవాడు. అన్నగారి పుస్తకాన్ని చదివిన మీదట ఆలోచనలో పడి, అన్నను మించి ఈయన చాలా దూరం వెళ్ళాడు. ఈయనకు రాముడు దేవుడు కాడు, మనిషి మాత్రమే. మనిషిగానైనా, భరతుని తర్వాతనే. ఇంతేకాక, రామాయణ వ్యాఖ్యాతలంటే ఈయనకు చెడ్డ కంటగింపు; గోవిందరాజు అంటే మరింత ఒళ్ళుమంట. విష్ణవతారంగా రాముని చిత్రించడానికి, శైవంపై వైష్ణవం ఆధిక్యతను నెలకొల్పడానికి గోవిందరాజు సిగ్గుబిడియాలు ఎంత మాత్రం లేకుండా ఎంత నాన్ సెన్స్ వ్రాశాడో అమృతలింగం వివరించాడు.

రామాయణాన్ని గురించి వ్రాసినవారిలో ఇంత నిష్కర్షగా, ఇంత నిర్భయంగా, ఇంతగా నిజం ముఖాన్ని చూస్తూ వ్రాసినవారు నాకు కనబడలేదు. ఈయన " రామాయణ విమర్శ" ఈయన జీవితకాలంలో అచ్చుకాకపోవడం శోచనీయం. అటుతర్వాతనైనా నిర్దుష్టంగా కాక, కొన్ని వేల అచ్చుతప్పులతో దాని ప్రచురణ జరగడం మరింత శోచనీయం. రామాయణంలోని ప్రాంతాలతో, దానిలోని సంఘటనలతో సాలవృక్షాని (వృక్షశాస్త్రంలో దీని పేరు Shorea Robusta.) "కున్న ప్రాధాన్యాన్ని సంకాలియా కంటే చాలా ముందుగా గుర్తించినవాడు అమృతలింగం. ఆయన వివరించినట్టు, బాలకాండ అయిదవసర్గ అయోధ్యను "సాలమేఖలామ్" అని వర్ణిస్తున్నది; రాజగృహం నుంచి అయోధ్యకు తిరిగి వస్తున్నప్పుడు భరతుడు సాలవనాన్ని దాటతాడు (అయోధ్యాకాండ, 71వ సర్గ), బంధువర్గాన్ని పురోహిత బృందాన్ని, సైనిక దళాలను వెంటబెట్టుకొని చిత్రకూట పర్వతాన్ని భరతుడు సమీపిస్తున్న ఘట్టంలో బయల్దేరిన 'పెద్ద రొదను విని, అందుకు కారణాన్ని కనుగొనవలసిందిగా రాముడు చెప్పినప్పుడు లక్ష్మణు డెక్కింది సాలవృక్షాన్నే (అయోధ్యాకాండ, 96వ సర్గ); రామునితో ఖరదూషణులు జరిపిన యుద్ధంలో వారు సాలవృక్షాలను ఆయుధాలుగా ఉపయోగించారు (ఆరణ్యకాండ, 25వ సర్గ); ఋశ్యమూకలో రామునితో స్నేహం చేసినప్పుడు సుగ్రీవుడు ఒక సాలవృక్షం శాఖను విరిచి, దాని ఆకుల పై కూర్చుండవలసిందిగా తన కొత్త మిత్రుని ఆహ్వానిస్తాడు (కిష్కింధాకాండ, 5వ సర్గ); సుగ్రీవునికి తన ప్రతాపాన్ని ప్రదర్శించడానికి రాముడు ఏడు సాలవృక్షాలను ఒకే బాణంతో చీల్చుతాడు (కిష్కింధాకాండ, 12వ సర్గ); వాలి సుగ్రీవుల యుద్ధం సాలవృక్షాలతోనే (అదే కాండ, అదే సర్గ); అశోక వనంలో హనుమంతుడు చూచిన చెట్లలో సాలవృక్షాలున్నాయి (సుందరకాండ, 14వ సర్గ); లంకాదహనానికి ముందు రావణుని సేనానులతో తాను చేసిన యుద్ధంలో ఆంజనేయుడు ఆయుధంగా వినియోగించింది సాలవృక్షాన్నే (సుందరకాండ, 46వ సర్గ); రామాయణంలో మరి పెక్కు తావులలో సయితం సాలవృక్షం ప్రసక్తి ఉన్నది. " వావిళ్ళవారి రామాయణంలో దీన్ని "మద్దిచెట్టు"గా తెనిగించారు. "సూర్యరాయాంధ్ర నిఘంటువు"ను చూడగా "మద్ది" అనే మాటకు అది చెప్పిన ఒక అర్థం "సాలము" అని. కాని, మద్దిచెట్టు సాలవృక్షం కాదు. మద్దిలో చాలా రకాలున్నట్టు చెప్పి, "ఇనుమద్ది", "పూదుమద్ది", "అర్జునము", "నదీసర్జము" అనే వాటిని నాల్గింటిని సి.పి. బ్రౌన్ పేర్కొన్నాడు. 28 మద్ది, "తెల్లమద్ది, నల్లమద్ది, కర్పూరపుమద్ది యని త్రివిధ భేదములు గలది" అని దేవిడి జమీందార్ వ్రాశాడు. వృక్షశాస్త్రంలో తెల్లమద్ది పేరు "టెర్మినాలియా అర్జున". అయినా, సాలవృక్షాన్ని మద్దిచెట్టుగా పేర్కొన్నవారికి ఆ రెండు చెట్లలో దేన్ని గురించీ తెలియదని మనం అనుకోవాలి.

మద్ది దక్షిణ భారతంలో సమృద్ధిగా పెరుగుతుంది; మధ్య భారతంలో పెరుగుతుంది; ఉత్తర భారతంలో అయోధ్య వరకు పెరుగుతుంది. అయోధ్యకు ఆవలగా ఉత్తర దిశలో, పంజాబ్ లో, పశ్చిమోత్తర భారతంలో ప్రత్యేకించి శ్రద్ధ చూపితేనే తప్ప, అది తేలికగా యెక్కిరాదు. కాగా, సాలవృక్షం హిమాలయాలలో పెరుగుతుంది; గంగ, దాని ఉపనదుల లోయలలో పెరుగుతుంది; మధ్య భారతంలో పెరుగుతుంది; సంతాల్, రీవా, చోటానాగపూర్, ఒరిస్సాలలో పెరుగుతుంది; ఉత్తర సర్కార్లలో కూడా పెరుగుతోంది. కాని, విశాఖ జిల్లాలో పాలకొండ అనే పర్వత పంక్తికి దక్షిణదిశలో అది పెరగదు. 82 విశాఖ జిల్లాకు దిగువ సాలవృక్షమే లేనప్పుడు ఈనాటి హంపి - విజయనగర ప్రాంతంలో కిష్కింధ ఉండేదని వి. ఆర్. రామచంద్ర దీక్షితార్ వ్రాయడం తప్పు కాదా?" పార్గిటర్, దీక్షితార్లు చెప్పినట్టు కిష్కింధ బళ్ళారి జిల్లాలోనే వున్నా, హంపి - విజయనగరం వద్ద కాక, తుంగభద్ర ఎడమగట్టుపై ఆనెగొందెలో ఉండేదని డి.ఆర్. భండార్కర్ తీర్మానించడం బేసబబు కాదా? ఈ ఈనాటి శ్రీలంకే ఒకనాటి రావణుని లంక అని హేమచంద్ర రాయ్ చౌధురి నొక్కిచెప్పడం "పదుగు రాడుమాట"నే వల్లించడం కాదా? వీరు ముగ్గురూ హిస్టరీ ప్రొఫెసర్లుగా పనిచేసినవారే! అయితే మాత్రమేమి? రైతుగా కొంత కాలం, ప్లీడరుగా కొంతకాలం పనిచేసిన అమృతలింగం చూపినపాటి హేతుదృష్టిని వీరు చూపలేక పోయారు! సాలవృక్షం పెరగనిచోటు కిష్కింధ కాబోదని, లంక కాబోదని వీరికి అనుమానమైనా తోచలేదు. ఇంద్రానాపర్వత ప్రాంతం

లంక కావడానికి వీలు లేదని ముందు ద్వారకాప్రసాద్ మిశ్రా, తర్వాత సంకాలియా చెప్పడానికి ఒక్క ప్రబల కారణం అక్కడ సాలవృక్షాలు లేకపోవడమే!

భక్తునివలె రామాయణాన్ని పారాయణం చేయడాన్ని విరమించి, సత్యాన్వేషిగా దాన్ని పఠించడాన్ని, పరిశీలించడాన్ని ప్రారంభించినందునే “ఇది హేమంతరుపు వర్ణన. దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఏమీ లే”దని రామభక్తులు భావించే ఒక సర్గలోగల (అరణ్యకాండ, 16వ సర్గ) ఒకే ఒక మాటలో - “పడమటి గాలి” అనే మాటలో ఒక భౌగోళిక సత్యాన్ని అమృతలింగం గుర్తించగలిగాడు. మనది సువిశాల దేశం; దాన్ని ఒక ఉపఖండం అనవచ్చు. అందువల్ల మన దేశంలోని అన్ని ప్రాంతాలలో ఋతుపవనాలు ఒకే రీతిగా ఉండవు. మన తెలుగుగడ్డపై పడమటి గాలి మండువేసవిలో, ముఖ్యంగా రోహిణీ కార్తెలో వీస్తుంది. వడగాలి, వడగాడుపు అనేవి దానికి మరి రెండు పేర్లు. ఒక్కొక్క యేడు అది నిప్పులను చెరగడం కద్దు. ఈ “పడమటి గాడుపు”, లేదా “గాడ్పు"కు "పడమటి దిక్కునుంచి వచ్చు గాలి”, “వేడిగాలి” అని సూర్యరాయాంధ్ర నిఘంటువు అర్థాలను చెప్పి, “జాహ్నవీ మాహాత్మ్యము" నుంచి “పడమటి గాడుపుల్ విసరె బాటలము ల్వికసించె” అనే ప్రయోగాన్ని చూపుతున్నది. మన తెలుగుసీమకే కాక, వింధ్య దక్షిణ ప్రాంతం మొత్తానికి పడమటిగాలి వేడిగాలి కాగా, వింధ్యకు ఉత్తరాన అది చల్లనిగాలి. అక్కడ అది వీచేది గ్రీష్మంలో కాదు, హేమంతంలో. అందువల్లనే హేమంత రువు ప్రశంసచేస్తూ, “స్వభావం వల్లనే చల్లనైన పశ్చిమ వాయువు, మంచుచే మరింత చల్లనైనందున, రెండింతలు చల్లదనంతో వీస్తున్న" దని లక్ష్మణు డంటాడు. అతడు ఈ మాట లన్నది పంచవటివద్ద. అది వింధ్యపర్వతాలకు ఉత్తరంలో కాక, దక్షిణంలో ఉంటే, హేమంతంలో పడమటి గాలి వీచేదికాదు; అది చల్లగా ఉండేది కాదు. మన చరిత్రకారులకు, ఇతర పరిశోధకులకు ఎందువల్లనో ఇట్టి విషయాలు సకృత్తుగా తప్ప స్ఫురించవు. వారి సాంప్రదాయిక విశ్వాసబలమే ఇందుకు ఒక కారణం కావచ్చు. ఏమైనా, అమృతలింగం వలె ఇతర రామాయణ విమర్శకులు ఒకసారి ఇంపీరియల్ గెజిటీరను తిరగవేసివుంటే ఉత్తర, దక్షిణ భారతాలలో పశ్చిమ పవనం స్వభావంలోగల ఈ వ్యత్యాసాన్ని తెలుసుకొనగలిగి ఉండేవారు. రామాయణానికి వింధ్య దక్షిణ ప్రాంతంతో ఏమీ సంబంధంలే దనడానికి ఈ పశ్చిమ వాయువు ప్రసక్తి ఒక్కటే నిజానికి చాలదా?

ఇది చాలదనే వారికి అమృతలింగం మరి కొన్ని సాక్ష్యాధారాలను చూపిస్తున్నాడు. ఇప్పటి శ్రీలంకనే రావణుని లంకగా విశ్వసించేవారు రాముడు శివలింగాన్ని రామేశ్వరంలో స్వయంగా ప్రతిష్ఠించినట్టు చెబుతారు. కాని, రామేశ్వరం క్రీస్తు తర్వాత పది, పదమూడు శతాబ్దాల మధ్య ఆవిర్భవించిన క్షేత్రం. మహాభారతంలో కనీసం మూడుచోట్ల పుణ్యక్షేత్రాల పట్టిక లున్నాయి. ఈ మూడింటిలో రామేశ్వరం పేరు కనబడదు. కంచి, శ్రీరంగం, మధురై, చిదంబరం, తిరుపతి మొదలైన వాటి ప్రసక్తి సయితం వాటిలో కానరాదు. దక్షిణ భారతానికి సంబంధించినంత వరకు పశ్చిమ సముద్రతీరంలోని ఒక దీవిలోగల గోకర్ణ క్షేత్రాన్ని, "సముద్ర తీరంలోని కన్యాతీర్థాన్ని” మాత్రమే మహాభారతం పేర్కొంటున్నది. ఈ “కన్యాతీర్థం” ఇప్పటి “కన్యాకుమారి” అయివుండాలి. రామాయణాన్నివలె భారతాన్ని కూడా పెంచి పెంచి, మహాభారతం కింద మార్చారు. దాన్ని పెంచడం క్రీస్తుశకం అయిదవ శతాబ్దివరకు జరిగింది. అయినా, మహాభారతంలో రామేశ్వరం ప్రసక్తి లేదంటే అది క్రీస్తుశకం అయిదవ శతాబ్ది నాటికి ఉద్భవించలేదని తీర్మానించుకోవలదా? అయిదవ శతాబ్దం మాట విడిచిపుచ్చండి; పది, పదకొండవ శతాబ్దాలలో పుట్టిన పురాణాలు సయితం రామేశ్వరం పేరెత్తడం లేదు. అందువల్ల పదకొండు, పదమూడు శతాబ్దాల మధ్యకాలంలో చోళరాజులు రామేశ్వర దేవాలయాన్ని నిర్మించారని విధిగా తీర్మానించుకోవాలి. చోళరాజులు శైవులు. రామేశ్వరం శివలింగాన్ని వారు ప్రతిష్ఠ చేయించినందున, విష్ణుభక్తులు మరింత దక్షిణానికి వెళ్ళి, ధనుష్కోటిని వైష్ణవ క్షేత్రంగా పెంపొందించారు.

అమృతలింగం వాదం ప్రకారం క్రీస్తుశకం పది, పదమూడు శతాబ్దాల మధ్య తమిళులు సముద్రాంతర దేశాలను జయించారు. సింహళం ఉత్తర భాగంలో, దాని ఈశాన్యభాగంలో వారు తమ వలస కేంద్రాలను నెలకొల్పారు.

అప్పటిలో వారి ప్రాబల్యం త్రింకోమలీ వరకు విస్తరించింది. త్రికూటకు, త్రింకోమలీకి వున్న ధ్వని సామ్యం వల్లనే రావణుని త్రికూట పర్వతం సింహళంలో ఉండేదన్న భ్రమ ప్రబలి ఉండవచ్చు. అయితే, రామాయణం ప్రకారం త్రికూట పర్వతం లంక అంచులోనే (కోస్తా పైనే) ఉండాలి. కాని, ఈనాటి శ్రీలంకలో ఉత్తర తీరం నుంచి దాదాపు నూరు మైళ్ళు వెళ్ళిన మీదటనే, అనురాధపురాన్ని చేరిన మీదటనే, మనకు మొట్టమొదటి పర్వతం తగులుతుంది. అయినప్పుడు ఈనాటి శ్రీలంకను రావణుని లంకగా పరిగణించడం రామాయణానికి విరుద్ధంగా వెళ్ళడమే కాదా?

మానవల్లి రామకృష్ణకవి పరిష్కరించి ప్రచురించిన "కౌముదీ మహోత్సవం' అమృతలింగం దృష్టికి రాలేదని అనుకోవాలి. లేకపోతే పంపాసరోవరం వింధ్యపర్వత ప్రాంతంలోనే ఉండేదని చెప్పడానికి ఆ నాటకాన్ని ఒక సాక్ష్యాధారంగా ఆయన చూపించి ఉండేవాడు. దాన్ని వ్రాసింది స్త్రీయో, పురుషుడో స్పష్టంగా చెప్పలేకున్నారు. రామకృష్ణకవి సమేతంగా పండితులలో పెక్కుమంది దాన్ని విజ్జిక రచనగా భావిస్తున్నారు. తక్కినవారిలో కొందరు దాన్ని అనంత నారాయణ రచనగా పరిగణించగా, మరికొందరేమో "కాదు, నీలకంఠకవి దాన్ని వ్రాశా"దని వాదిస్తున్నారు. ఏమైనా, నిశ్చయంగా అది ప్రాచీన రచన. శైలినిబట్టి అది క్రీస్తుశకం అయిదవ, లేదా ఆరవ శతాబ్దం నాటి రచన కావచ్చునని మొత్తం పై అందరు పండితులు అంగీకరిస్తున్నారు.

పంపాసరోవరం వింధ్య పర్వత ప్రాంతంలో ఉండేదని "కౌముదీ మహోత్సవం" నిర్ద్వంద్వంగా పేర్కొంటున్నది. ఆ సరోవరానికి సమీపంలోనే వ్యాధకిష్కింధ ఉండేదని అది స్పష్టం చేస్తున్నది. అక్కడికి చేరువలోనే "వింధ్య వాసిని" దేవాలయం సయితం ఉండేదని అది వివరిస్తున్నది. పంపాసరోవరం, వ్యాధకిష్కింధ, వింధ్యవాసిని దేవాలయం - ఇవి బందా జిల్లాలోని చిత్రకూట పర్వతానికి ఏమంత అధిక దూరంలోనివి కావట.

"కౌముదీ మహోత్సవం" కిష్కింధ విషయమై చెబుతున్నదాన్ని వాయు, మార్కండేయ పురాణాలు బలపరుస్తున్నాయి. వాటి ప్రకారం "కిష్కింధకులు" అనే ఒక తెగవారు వింధ్యపర్వత ప్రాంతంలో నివసిస్తూ ఉండేవారు. కిష్కింధ ఉజ్జయినికి ఆగ్నేయంలో ఉన్నట్టు వరాహమిహిరుడు వ్రాయగా, అది పాంచలదేశానికి ఆగ్నేయంగా ఉన్నట్టు రాజశేఖరుడు చెప్పాడు. కాగా, సర్ అలెగ్జాండర్ కన్నింగ్ హాం అభిప్రాయం ప్రకారం మనకు తెలిసిన గోదావరి కాక, చిత్రకూట పర్వతానికి నైరుతి దిశలో తొమ్మిది మైళ్ళ దూరాన ఒక గుహలో పుట్టి "గుప్త గోదావరి" అనే ఒక సెలయేరు ప్రవహిస్తూ ఉండేది. 38 దీన్నిబట్టి, పంచవటి గోదావరీ తీరాన నాసిక వద్ద కాక, వింధ్య పర్వత పంక్తికి ఉత్తర దిశలోగల "గుప్త గోదావరి" గట్టున ఉండేదని అనుకోవచ్చు.

లంక కోసమైనా మనం చూడవలసింది వింధ్య పర్వతాలకు దక్షిణ ప్రాంతంలో కాదని ఇటీవలి కాలంలో దొరికిన రెండు శాసనాలు సూచిస్తున్నాయి. వీటిలో ఒకటి క్రీస్తుశకం 1703 నాటి శాసనం. అందువల్ల దాన్ని పరిగణనలోకి తీసుకోనక్కరలేదు. పోతే, రెండవది క్రీస్తుశకం పదవ శతాబ్దం నాటి శాసనం. దాన్ని వేయించిన వాడు గుప్తరాజుల వంశానికి చెందిన సోమేశ్వరుడు. అతడు దాన్ని వేయించింది సువర్ణపురంలో. ఇప్పుడిది బస్తర్ లోని సోన పూర్. ఈ ప్రాంతం ప్రభువును "పశ్చిమలంకాధిపతి"గా ఈ శాసనం పేర్కొంటున్నది.

తక్కిన విషయా లన్నింటిని విడిచి పుచ్చి, కేవలం సాంఘికాచారాలనే పరిగణనలోకి తీసుకొన్నా, కిష్కింధ కాని, లంక కాని దక్షిణాదిలో ఉండేవి కావని తీర్మానించుకోవాలి. హెచ్.డి. సంతాలియా వివరించినట్టు, రామాయణం మూలరచయితకువలె, దానిలో ప్రక్షిప్తాలను ప్రవేశ పెట్టిన వారికి కూడా దక్షిణ భారత ప్రజల ఆచార వ్యవహారాలు ఎంతమాత్రం తెలియవు.
దీన్ని నిరూపించడానికి ఒకే ఒక తార్కాణం చాలునని చెప్పి, సంకాలియా ఉత్తర దక్షిణ భారతాలలో ప్రాచీనకాలం, నాటి అంత్యక్రియలను పేర్కొన్నాడు. గోదావరికి దిగువ మొత్తం దక్షిణ భారతంలో క్రీస్తుశకం మూడవ శతాబ్దికి పూర్వం ఖననం తప్ప, దహనం లేదు. అయినా, వారి దహనక్రియ వర్ణనకు కిష్కింధకాండలో ఒక సర్గకు సర్గ (25వ సర్గ) పూర్తిగా ప్రత్యేకించబడింది!

ఇంతకు నేను మరింత వ్రాసినా, రామభక్తుల విశ్వాసాలు మారబోవని నాకు తెలుసు. పోతే, విచక్షణా దృష్టిని, ఆలోచనాశక్తిని తమ మత మౌఢ్యాలకు బలి పెట్టనివారు జనస్థానం వలె, పంచవటి వలె, కిష్కింధ వలె లంక సయితం వింధ్య పర్వతపంక్తికి, నర్మదానదికి ఉత్తరదిశలోనే ఎక్కడనో ఉండేదన్న తీర్మానానికి వచ్చివుండాలి. ఏమైనా, కొత్త విషయాలను మరి చెప్పడానికి ప్రయత్నించక, ఇంతవరకు చెప్పినవాటిని సంక్షిప్తంగా పునశ్చరణ చేసి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను.

1 రెండు, రెండున్నర వేల సంవత్సరాల నాటి గ్రీక్ రచయితలు సింహళాన్ని "తామ్రపర్ణి"గా పేర్కొన్నారు, లంకగా కాదు.
2 అశోకుని కాలంనాటి భారతీయులకు తెలిసింది కూడా "తామ్రపర్ణి' మాత్రమే; లంక కాదు.
3 క్రీస్తుశకం ఆరవ శతాబ్దికి చెందిన భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుడు వరాహమిహిరుడు లంకను, సింహళాన్ని రెండు విడి విడి ద్వీపాలుగా పేర్కొన్నాడు. ఇంతేకాక, కిష్కింధ ఉజ్జయినికి ఆగ్నేయదిశలో ఉండేదని ఆయన వ్రాశాడు; పదవ శతాబ్దికి చెందిన విఖ్యాతకవి, నాటకకర్త రాజశేఖరుడు అది పాంచాల దేశానికి ఆగ్నేయదిశలో కల దన్నాడు.
4 "లంక" తెలుగులోనుంచి సంస్కృతంలోకి వెళ్ళిన మాట అని భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.
5 సీతాన్వేషణకై అంగదుని నాయకత్వాన బయల్దేరిన వానరబృందం కాని, రాముని నాయకత్వాన లంకపై దండెత్తిన వానర సేనలు కాని, వింధ్య పర్వత పంక్తిని దాటినట్టు, నర్మదానదిని దాటినట్టు రామాయణం చెప్పడం లేదు.
6 సాలవృక్షాలులేని చోట కిష్కింధ వుండడానికి వీలులేదు, లంక వుండడానికి వీలులేదు. గోదావరినదికి దిగువలో సాలవృక్షాలు పెరగవు.
7 "కిష్కింధకులు" వింధ్య ఉత్తరప్రాంతానికి చెందిన వారని వాయు, మార్కండేయ పురాణాలు చెబుతున్నాయి.
8 వింధ్యకు దక్షిణాన పడమటి గాలి వడగాడ్పుకాగా, ఉత్తరాన అది చల్లని గాలి, పంచవటివద్ద పడమటి గాలిని చల్లనిగాలిగా రామాయణం పేర్కొంటున్నది కాబట్టి, అది వింధ్యకు ఉత్తరదిశలో గల ప్రాంతమై వుండాలి.
9 క్రీస్తుశకం అయిదవ, లేదా ఆరవ శతాబ్దానికి చెందిన "కౌముదీ మహోత్సవ నాటకం" కిష్కింధ, పంచవటి మొదలైన వన్నీ వింధ్య పర్వత ప్రాంతంలో వున్నట్టు వివరిస్తున్నది. 10 క్రీస్తుశకం అయిదవ శతాబ్దివరకు మార్పులు చేర్పులు జరుగుతూ పోయిన మహాభారతంలో రామేశ్వరం ప్రసక్తి లేదు. దానిలో ధనుష్కోటి ప్రసక్తి సయితం లేదు.
11 లంకాపురి సముద్రతీరాన త్రికూట పర్వతంపై వున్నట్టుగా రామాయణం వివరిస్తున్నది. సింహళం ఉత్తర తీరంలో ఒక్క పర్వతమైనా లేదు.

సింహళం రావణుని లంక కాదనడానికి ఇన్ని కారణాలు కనిపిస్తున్నా, వీటిని కాదనే వారి విషయంలో నేను చేయగలిగింది "అయ్యలారా! మీకు పదివేల నమస్కారాలు!" అంటూ నా దారిని నేను ముందుకు సాగడమే!!

రాక్షసు లెవరు?

ఋగ్వేదంలో, అధర్వవేదంలో, మరికొన్ని వైదిక గ్రంధాలలో రాక్షసుల ప్రసక్తి విశేషంగా వున్నది. దీన్ని అవినాశచంద్ర దాస్ "ఋగ్వేదిక్ కల్చర్"' అనే గ్రంథంలో క్రోడీకరించారు. ఆయన క్రోడీకరణ ప్రకారం, రాక్షసులు కుక్కల, రాబందుల, గుడ్లగూబల ఆకృతులలో వుంటారు. ఒక చోటునుంచి మరొక చోటుకు పిట్టల వలె వారు ఎగిరిపోతూవుంటారు. సోదరునిరూపం, భర్తరూపం, ప్రియుని రూపం ధరించి, స్త్రీలను సమీపించి, వారి సంతానాన్ని రాక్షసులు నాశనం చేస్తూ వుంటారు. కపిరూపంలో, లేదా శునకరూపంలో స్త్రీలకై వారు పొంచి వుండడం కద్దు. గర్భవతులై ఉన్నప్పుడు, ప్రసవసమయంలో స్త్రీలకు మరింత ప్రమాదకరంగా వారు పరిణమిస్తారు. పశుపక్ష్యాదుల రూపాలను అప్పుడప్పుడు ధరించినా, మానవాకృతిలోనే వారు అధికంగా వుంటారు. అయితే, ఏదో ఒక వైకల్యం తప్పదు, వికారం తప్పదు, వైపరీత్యం తప్పదు. వారిలో కొందరికి మూడుతలలు, కొందరికి రెండు నోళ్ళు, కొందరికి నాలుగు కళ్ళు, కొందరికి ఎలుగుగొడ్డు మెడ, కొందరికి అయిదు కాళ్ళు, కొందరికి చేతులపై కొమ్ములు! యజ్ఞయాగాదులను రాక్షసులు ధ్వంసం చేస్తారు; దుర్భాషలకు, దుశ్చర్యలకు వారికి పెట్టింది పేరు. ఆవు పొదుగు నుంచి పాలను దొంగచాటుగా వారు తాగివేస్తారు, పచ్చి మాంసం తింటారు. నరమాంసాన్ని మరింత పసందు చేస్తారు. నరులను చంపి తినడానికై వారిలో ప్రవేశిస్తారు. ఒక్క అగ్ని దేవుడంటేనే రాక్షసులకు చెడ్డ భయం. రాక్షసుల పీడ తప్పించడానికై అగ్నిదేవునికి చాలిన వాడు మరి లేడు.

రాక్షసులకు జ్ఞాతులుగా చెప్పదగువారు పిశాచులు. వారు శవాలను తింటారు. ఋగ్వేదంలో పిశాచులప్రసక్తి ఒకే ఒక చోట వున్నా, అధర్వవేదంలో, తైత్తిరీయ సంహితలో వారు హెచ్చుగా తారసిల్లుతారు. రాక్షసులకువలె పిశాచులకు "క్రవ్యాదులు" పర్యాయపదం కావడం ఉభయవర్గాలవారికి నరమాంసం పట్లగల ప్రీతివల్లనే.

"అసురు"లనేవారు రాక్షసులకు, పిశాచులకు అన్నలవంటివారు. అసురులకు వైరం దేవతలతో, రాక్షసులకు విరోధం నరులతో, పిశాచులకు వైమనస్యం పితరులతో. వీరి నుంచి పీడ తొలగించడానికే శవాలను దహనం చేయడం. పైగా, మృతదేహాన్ని దహించివేస్తే, చెఱనుంచి బయటపడిన తీరులో, ఆత్మ పుణ్య లోకాలకు సునాయాసంగా చేరుకో గలుగుతుంది! అన్నెం పున్నెం తెలియనివారు కాబట్టి, శిశువుల మృతదేహాలను చితిపై పెట్టనక్కరలేదు; అరిషడ్వర్గాలను జయించినవారు కాబట్టి, సర్వసంగపరిత్యాగులకు సయితం దహన సంస్కారంతో నిమిత్తం లేదు.

రాక్షసులకు, పిశాచులకు జ్ఞాతులస్థానానికి అసురులను దిగదీయడానికి ముందు మిత్ర, వరుణులను అసురులుగా ఆర్యులు ప్రశంసించారు. ఈ దేవత లిద్దరిని ఏకంచేసి, "మిత్ర-వరుణ" అనే పేరుతో కొన్ని చోట్ల సంస్తవించారు. "అసుర" అనే పదాన్ని దుష్టార్థంలో ఋగ్వేదంలో ప్రయోగించింది (రమేశ్ చంద్రదత్ వివరించినట్టు") దాని చిట్టచివరి మండలంలోనే. ఆర్యులలో ఇండియాకు చేరిన శాఖవారికి "అసుర' శబ్దం దుష్టమైనదిగా మారిపోయిన తర్వాత కూడా ఇరాన్లో స్థిరపడిన శాఖవారికి "అహుర" అనే పేరుతో అసురుడు దేవాధిదేవుడుగానే నిలిచాడు. " (ఇరానియన్ దేశస్థులు "స"ను "హ"గా పలుకుతారు. తమకు తెలిసిన భారత దేశాన్ని - సప్తసింధు ప్రాంతాన్ని వారు "హప్తహిందు" అనేవారు. "ఇండియా" అనే మాట ఆ "హjహిందు" నుంచి వచ్చినట్టిదే.) అనంతప్రసాద్ బెనర్జీ-శాస్త్రి వాదాన్ని ఆమోదిస్తున్నవారు ప్రస్తుతం దాదాపుగా లేరుగాని, దాని ప్రకారం ఇండియాకు తొలిగా వలసవచ్చిన ఆర్యులు తమ వరుణదేవుని చలవతో సముద్ర మార్గం వెంట వచ్చారు; వారు వచ్చింది అసీరియా నుంచి కాబట్టి, వారికి "అసురు"లనే పేరు వచ్చింది; వారు

నిర్మించిన అసురనాగరికతే హరప్ప, మొహెంజొదారోలు ప్రధాన కేంద్రాలుగా సింధులోయలో పరిఢవిల్లింది. ఆయన చేసిన ఈ వాదంపట్ల ఆసక్తిగలవారు “అసుర ఇండియా' అనే పేరుతో ఆయన వ్రాసిన గ్రంథాన్ని చదవవచ్చు.

అసురులు ఆర్యజాతికి చెందిన ఒక శాఖ వారైనప్పటికీ, రాక్షసులు మాత్రం నిశ్చయంగా ఏదో ఒక జాతికి, లేదా దాని శాఖకు చెందిన ప్రజలు ఎంత మాత్రం కారు. ఇదే మాట పిశాచులకు వర్తిస్తుంది.' పరజాతులవారిపట్ల ఆర్యుల వైరవిద్వేషాలనుంచి, వారి భయవిభ్రాంతులనుంచి పుట్టుకువచ్చినవారే రాక్షసులైనా, పిశాచులైనా, వేదకాలంనాటి ఆర్యులు అంతకు పూర్వమే ఇక్కడ స్థిరపడిన వివిధ జాతులవారితో హోరాహోరీగా సంఘర్షించ వలసివచ్చింది. ఆయుధబలంలో ఆధిక్యం తమదే, యుద్ధపద్ధతులలో పైచేయి తమదే. అయితే, సంఖ్యాబలం తక్కువ. అందువల్ల పైకి ఎంత ధైర్యంగా కనబడినా, లోలోపల భయం వారిని పీడిస్తూనే వుండేది. ఆ భయాన్ని తగ్గించుకొనడానికి ముప్పొద్దుల వారు సోమ రసాన్ని సేవిస్తూ వుండేవారని అనుకోవచ్చు; ఆ భయాన్ని తొలగించుకొనడానికే "అసురుడు”గా తాము ఒకప్పుడు సంస్తవిస్తూ వచ్చిన వరుణదేవుని వెనుకకునెట్టి, తమవలెనే కడవలకొలది సోమరసాన్ని గడగడ తాగి, కయ్యానికి కాలుదువ్వే ఇంద్రుని దేవాధిదేవునిగా ఎన్నుకొన్నారని కూడా అనుకోవచ్చు. చారిత్రకవ్యక్తులలో ఋగ్వేదం ఇంద్రుని పోల్చవలసింది కాలిగా యూలొతో, జెంఘిస్ తో, ఆటిలాతో, నాదిర్‌షాతో, హిట్లర్ తో. ఏకోశానా అతడికి దయాదాక్షిణ్యాలు లేవు. గర్భవతుల సమేతంగా అనార్యజాతులకు చెందిన ఆబాలగోపాలాన్ని అతడు ఊచకోత కోసేవాడు. పురాలకు పురాలనే నేలమట్టం చేసి, “పురందరుడు” అనే బిరుదనామాన్ని అతడు గడించుకొన్నాడు. ఋగ్వేదకాలంలో “ఇంద్రుడు” అనే పేరుతో ఒక “వార్ లార్డ్" (యుద్ధనాయకుడు) వుండేవాడో, “అసురుణానికి ఒక పర్యాయపదం “పూర్వదేవుడు". ఇంద్రుని ప్రథమ స్థానానికి “ప్రమోట్” చేయడానికి ముందు ఆర్యులు వరుణుని దేవాధిదేవునిగా సంభావించే వారనడాన్ని ఇది సూచిస్తున్నది.

లేక తాము దేవాధిదేవునిగా ఎన్నుకొన్న ఇంద్రుని పేరుతో హత్యాకాండను ఋగ్వేదకాలంనాటి ఆర్యులు స్వయంగా కొనసాగించేవారో చెప్పలేము. ఏమైనా హేతుదృష్టితో, చారిత్రక దృక్పథంతో ఋగ్వేదాన్ని పరిశీలించగలవారికి దానిలో కొట్టవచ్చినట్టు కానవచ్చేవి దార్శనిక సత్యాలు కావు, హత్యల ప్రశంసలు, హంతకుల సంస్తవాలు మాత్రమే.

ఇది అవధు లెరుగని క్రౌర్యం ద్వారా అన్యజాతులవారిని జయించ గోరినప్పుడు, వారిని చిత్రవధ చేసి, వారి దేశాన్ని భుక్తంచేసుకొన గోరినప్పుడు, ఆ జాతుల వారిని అసహ్యించుకోవాలి. కేవలం అసహ్యించుకొనడమైనా చాలదు, వారిపట్ల జుగుప్స పెంచుకోవాలి. మానవస్వభావం. ఇందుకు అనుగుణంగానే ఋగ్వేద కాలంనాటి ఆర్యులు ప్రవర్తించారు. తమతో పోల్చినప్పుడు ఇక్కడి అనార్యజాతులవారే అన్నివిధాల ఎక్కువ నాగరికులు. అయినా, లేనిపోని ఘనతను తమకు తామే ఆపాదించుకొని, ఇక్కడివారి రూపురేఖలను, వేషభాషలను, ఆచారవ్యవహారాలను, వారికి సంబంధించిన సమస్తాన్ని నిరసించారు, నిందించారు. ఇక్కడి వారు నల్లనివారట; వారివి బొట్ట ముక్కులట. వారి భాష అయోమయమైనదట; వారు యజ్ఞయాగాదులను చేయ రట; వారు శిశ్నదేవుని ఆరాధిస్తారట; ఏ విధంగా చూచినా, వారు నీచజనులట, నికృష్టమానవులట; మానవులుగా సంభావించడానికైనా తగనివారట!

ఆర్యులు వలసకు రావడానికి పూర్వం ఇక్కడ స్థిరపడినవారిలో నీగ్రోలున్నారు, నిషాదులున్నారు, కిరాతులున్నారు, ద్రావిడులున్నారు, వీరందరినీ కలగా పులగం చేసి, దాసులని, దస్యులని వీరికి ఆర్యులు నామకరణం చేశారు. “దాసుడు” అనే పదానికి క్రమంగా “బానిస”, “శూద్రుడు”అనే అర్థాలేర్పడినాయి; “దస్యుడు” అనే దానికి “శత్రువు”, “చోరుడు" అనే అర్థా లేర్పడినాయి. ఆర్యులు ఇక్కడికి చేరకముందే నీగ్రోలు (బహుశా నిషాదుల చేతిలో) పరాస్తులై, న్యూగినీకి,

ఫిలిప్పీనకు, మలయా పీఠభూములకు, అండమాన్ దీవులకు తరలిపోయారు. ఇండియా నడిగడ్డపై ఈనాటికీ వారు సకృత్తుగా మిగిలింది కొచ్చిన్, తిరువాన్కూర్ కొండలలో. ఇంతేకాక, వైనాడ్ ప్రాంతంలోని ఇరులా తెగవారిలోను, నాగభూమిలోని అంగామా నాగజాతివారిలోని వారు చెదురుగా కనబడతారు.
ఇక్కడ కాలూనడానికి కిరాతుల పై కంటె, ద్రావిడులపై కంటె నిషాదులపై మరింత భీషణంగా, మరింత దీర్ఘకాలంపాటు ఆర్యులు పోరాడవలసి వచ్చినట్టు అనుకోవాలి. ఈ కారణానే కావచ్చు రాక్షసులుగా, పిశాచులుగా వారు వర్ణించిన వారిలో నిషాదుల కవళికలు హెచ్చుగా కనబడతాయి. ఇది నా మాట కాదు; మౌలిక చింతన చేసిన మానవవికాసశాస్త్రవేత్త రామప్రసాద్ చాందా మాటలు.' వైదిక వాఙ్మయం నిషాదులుగా పేర్కొన్నవారు వింధ్యపరిసరాలలో, చోటా నాగపూర్ ప్రాంతంలో, బస్తర్ లో, ఒరిస్సాలో, ఆంధ్రప్రదేశ్ ఈశాన్యదిశలో నివసిస్తున్న మూండా, గోండ్, సవర, సంతాల్, జువంగ్, కొర్వా, చెంచు, పర్జా, ఖోండ్ మున్నగు తెగలవారు; దక్షిణాదిలోని తోడాలు, బడగాలు మొదలైనవారు. ° ఇరుగు పొరుగువారితో సాహచర్యంవల్ల ఈ తెగలవారిలో కొందరు ఆర్య, ద్రావిడ కుటుంబాల భాషలను తమ తమ యాసలతో మాట్లాడుతున్నా, తక్కినవారివి స్వభాషలే. వాటి పేర్లు - ముండారీ, హో, కొర్కు సవర, గడం వగైరాలు.

వేదకాలంనాటి ఆర్యుల ఉద్ధతి పౌరాణిక కాలంనాటికి సన్నగిలింది. అనాగరికులుగా వచ్చినవారికి, ఇక్కడికి చేరిన పిదప, నాగరికతావాసనలు కొంతవరకు అంటడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఏమైనా పౌరాణిక కాలంనాటికి అన్యజాతులవారి విషయమై - ముఖ్యంగా నిషాదులవిషయమై - భయం పెరిగి నందువల్లనే కావచ్చు, రాక్షసులను గురించి అతిగా కథలల్లడం, అతి భీకరులుగా వారిని చిత్రించడం తటస్థించింది. రామాయణాన్నే చూడండి. దానిలోని రాక్షసులలో ఒకడు ఖరుడు (గాడెద), ఒకడు దూషణుడు (బండబూతు తిట్టేవాడు), ఒకడు మకరాక్షుడు (మొసలి కన్నులవాడు), ఒకడు మహోదరుడు (బానపొట్టవాడు), ఒకడు త్రిశిరుడు (మూడు తలలవాడు), ఒకర్తుక వికట, ఒకర్తుక దుర్ముఖి, ఒకర్తుక అజాముఖి (మేకముఖం వున్నట్టిది) ఇంతటితో సరిపుచ్చక, రామాయణంలో రావణునికి పది తలలు, ఇరవై చేతులు పెట్టారు; కుంభకర్ణునికి పర్వతాన్ని పోలిన కాయాన్ని, బండి చక్రాలవంటి పెద్ద కళ్ళను పెట్టారు; కబంధునికి యోజనం నిడివిగల చేతులతోపాటు కడుపులోనే ఒంటికంటిని, పెద్దనోటిని పెట్టారు. ఇ డబ్లియు. హాప్కిన్స్ “ఎపిక్ మైథాలజీ”లో వివరించినట్టు, మహాభారతంలోని రాక్షసులతో పోల్చినప్పుడు, రామాయణంలోనివారే కొంత నయం. ఉదాహరణకు, భారతంలోని బకాసురుడు నరమాంస భక్షకుడు. అతడి తిండికి రోజుకు ఒక మనిషి కావాలి. హిడింబాసురుడు సయితం నరమాంస భక్షకుడే.

కాగా, పురాణాలలో రాక్షసులను మరింత ఘోరంగా చిత్రించారు. తారకాసురునిది ఏనుగుతల కాగా, అతడి తమ్మునిది సింహంనోరు. కార్తవీర్యార్జునునివి వేయి చేతులు. బాలకృష్ణుని చంపడానికి ప్రయత్నించినవారిలో పూతనతోపాటు తృణావర్తుడు, శకటాసురుడు మొదలైన రాక్షసులు పెక్కుమంది వున్నారు. వీరిని గురించి ప్రచారంలో ఉన్నట్టివి కట్టు కథలని, పిట్ట కథలని మన మెదడుకు ఏ కొద్దిపాటిగా పని పెట్టినా స్పష్టపడుతుంది. ఈ పని టి.కె. వెంకటరామన్ కొంతవరకు చేశాడు. సుశ్రుతుడు పేర్కొన్నట్టు, “పూతన” ఒక బాలారిష్టం. దానినుంచి కృష్ణునికి ప్రాణాపాయం తప్పడమే “పూతన" అనే రాక్షసి వచ్చి, చను బాలివ్వడం కట్టుకథగా మార్పు చెందినట్టు అనుకోవచ్చు. పోతే, శిశుపాలుడు ఒకానొక సందర్భంలో ఎత్తిపొడిచినట్టు, కృష్ణుడు ఒక బండిని తన్నడం, ఒక రాబందును చంపడం రాక్షసులను సంహరించడం కానక్కరలేదు. అన్ని పాపాలను రాక్షసుల నెత్తిని రుద్దడానికే వారిని మాయావు లనడం, అందుకే వారు కామరూపధారు లనడం!

రాక్షసుల పుట్టుపూర్వోత్తరాలను గురించి, యక్షులతో వారి బాంధవ్యాన్ని గురించి, దానవులతో, దైత్యులతో వారి సమైక్యతను గురించి, అసురులతో వారి ఆత్మీయతను గురించి రామాయణ, భారతాలలో, భాగవతాది పురాణాలలో ఒక లక్ష కట్టుకథ లున్నాయి. “అమరకోశం” మొదలుకొని, “ఆంధ్ర వాచస్పత్యం" వరకు నిఘంటువులు వారందరినీ కలగాపులగం చేస్తున్నాయి. ఆ వివరాలలోకి నేను ప్రవేశించను. అట్టి పొరపాటు పని చేస్తే, ఆ కారడవిలో నుంచి నేను బయటపడలేను. ఈ విషయాలను గురించి తెలుసుకొనగోరేవారు ఇంతకు ముందు నేను పేర్కొన్న “ఎపిక్ మైథాలజీ"ని చూడవచ్చు. అంతటితో తృప్తిపడనివారు ఈ మధ్యనే ద్వారకా ప్రసాద్ మిశ్రా ప్రచురించిన 'స్టడీస్ ఇన్ ది ప్రోటో - హిస్టరీ ఆఫ్ ఇండియా” చదవవచ్చు. ఈనాటి మధ్య ఆసియా ఒకనాటి దేవలోకమని మిశ్రా నమ్మకం. దేవలోకంపై ఆధిపత్యానికి కశ్యప ప్రజాపతి సంతానం మధ్య జరిగినవే దేవాసుర యుద్ధాలని ఆయన నమ్మకం. ఆ యుద్ధాలలో దితికుమారులు (దైత్యులు), దనువు కుమారులు (దానవులు) ఏకమై, తమ సవతితల్లి అదితి పుత్రులతో (దేవతలుగా చెల్లిన ఆదిత్యులతో) అనేక యుద్ధాలు సాగించారట. అదితి పుత్రులతో పరాజయం చెందిన దైత్యులే, దానవులే (వారి ఉమ్మడి పేరు “అసురులు”) దేవలోకం నుంచి తరలివచ్చి, హరప్పన్ నాగరికతను పెంపొందించారట. ఈ ధోరణిలో సాగింది మిశ్రా రచన.

భారతీయ నాగరికత “ఆర్యులభిక్ష” అనే దురభిప్రాయం ఒకప్పుడు బలంగా ఉండేది. ఋగ్వేదకాలానికి పూర్వం ఇది అనాగరిక దేశమన్న దురభిప్రాయం మరింత బలంగా ఉండేది. హరప్పన్ నాగరికత అవశేషాలు బయల్పడ్డంతో ఋగ్వేదకాలానికి అనేక శతాబ్దాలకు పూర్వమే ఇక్కడ ఒక గొప్ప నాగరికత పరిఢవిల్లినట్టు స్పష్టపడింది. కొన్నేళ్ళ క్రితం ఈ నాగరికత కేవలం సింధులోయకు పరిమితమై ఉండేదని అనుకొన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన తవ్వకాల తర్వాత ఒక వైపున జమ్మూ వరకు, మరొక వైపున గుజరాత్ వరకు, వేరొక వైపున హర్యానా, రాజస్థాన్ వరకు ఇది విస్తరించి ఉండేదని తెలిసి వచ్చింది. ఇంతేకాదు అహమ్మద్ నగర్ జిల్లాలోని గోదావరి ఉపనదీతీరం వరకు ఇది పాకినట్టు కొత్తగా తెలిసింది. మరింతగా పరిశోధనలు జరిగితే, మరింత మేరకు ఇది విస్తరించినట్టు రుజువు కావచ్చునని పురాతత్త్వ శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. హరప్పన్ నాగరికత వెలుగులోకి వచ్చి, ఆర్యనాగరికత బండారాన్ని బయటపెట్టడం ఆర్యాభిమానులకు బాధ కలిగించింది. అందువల్ల హరప్పన్ నాగరికత నిర్మాతలు సయితం ఆర్యులన్న వాదాన్ని వారు లేవనెత్తారు. వారిలో కొందరేమో ఒక్కసారిగా కాక, దఫాలవారీగా ఆర్యులు ఇక్కడికి వలస వచ్చారని, తొలిదశలో ఇక్కడికి వచ్చినవారే హరప్పన్ నాగరికత నిర్మాతలని చెబుతున్నారు. మిగిలినవారు "హరప్పన్ నాగరికత నిర్మాతలు ఆర్యులు కాకపోవచ్చునని, వారి జ్ఞాతులైన అసురు”లని వాదిస్తున్నారు. ఈ అసురులు అసీరియానుంచి వచ్చినట్టు బెనర్జీ - శాస్త్రి ఎలుగెత్తి చాటగా, “కాదు, మధ్య ఆసియా నుంచి” అని ద్వారకాప్రసాద్ మిశ్రా బల్ల గుద్దుతున్నాడు. వీరుభయులు తాపత్రయం ఆర్యుల ఆధిక్యతను ఎలాగైనా నిలబెట్టాలనే! వీరేకాదు, మరి పెక్కుమంది కూడా హరప్పన్ నాగరికత నిర్మాతలు ద్రావిడులన్న పాశ్చాత్య పురాతత్త్వశాస్త్రవేత్తల సిద్ధాంతాన్ని ఖండిస్తున్నారు; కనీసం అది ఏదో ఒక అనార్యజాతి నిర్మాణమన్న ప్రతిపాదనను సయితం త్రోసిపుచ్చుతున్నారు.

ఆర్యు లెవరైనా, దాసులను ఆర్యులని ద్వారకాప్రసాద్ మిశ్రా అనబోడు, బెనర్జీ-శాస్త్రి అనబోడు, ఆర్యాభిమానాన్ని ప్రదర్శించే అన్యులైనా అనబోరు. ఇదే రీతిగా దస్యులు ఆర్యులని వారు అనబోరు. అయినప్పుడు ఋగ్వేదంలో పురాల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి దాసులవే ఎందుకు కావాలి, దస్యులవే ఎందుకు కావాలి? దుర్గాల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి తిరిగి వారివే ఎందుకు కావాలి? సిరిసంపదల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి సయితం దాసదస్య జనులకు చెందినవే ఎందుకు కావాలి? పిప్రు అనే దస్యనాయకునికి తొంభై తొమ్మిది పురాలు, శంబర అనే దస్యనాయకునికి నూరు పురాలు ఉండేవని ఋగ్వేదం చెబుతున్నది. వీ రిద్దరితో పాటు ధుని, శు, చుమరి అనే దాసదస్యులకు ఎన్నెన్నో దుర్గాలు వుండేవని అది చెబుతున్నది. తన స్నానానికి నీరైనా కరువు కాగా, కువయ అనే దాసుని భార్యలు పాలలో ఓలలాడు తున్నారని కుత్స

అంగిరసుడు వాపోయినట్టు అది చెబుతున్నది. శంబరుని దుర్గాల భాగ్యరాసులతో మూల్గుతున్నట్టు అది చెబుతున్నది. 13 దీన్నిబట్టి హరప్పన్ నాగరికత దాసులుగా ఋగ్వేదం . నిరసించిన, దస్యులుగా అది నిందించిన అనార్యజాతులలో ఏదో ఒకటి -లేదా, ఏవో కొన్ని సృష్టించినట్టిదే అని విదితం కావడం లేదా?

హరప్పన్ నాగరికతకు సంబంధించిన “సీల్స్” (ముద్రలు) కొన్ని వందలు దొరికాయి. వాటిలో ఒక్కదాని పైనైనా ఇంద్రుడు లేడు. అగ్ని, వరుణాది దేవతలు లేరు; ఆర్యుల వెంట వచ్చిన గుఱ్ఱం సయితం లేదు.
కాగా, వాటి పై ద్రావిడులకు దేవుడైన శివుడు పశుపతి రూపంలో వున్నాడు. అన్య ద్రావిడదేవతలున్నారు. ఈ కారణాలను బట్టి కూడా హరప్పన్ నాగరికత ఆర్యేతరమైనదని తీర్మానించుకొనవలదా?

అయితే, అది హరప్పన్ నాగరికత కానివ్వండి; అక్కడియన్, సుమేరియన్, బాబిలోనియన్, ఈజిప్షియన్, క్రిటన్, ఫెనిసియన్, హిటైట్ ఆదిగాగల ప్రాచీన నాగరికతలలో మరేదైనా కానివ్వండి; ఆ కాలానికి అవి గొప్ప నాగరికతలైనా, వాటికి ఈనాటి నాగరికత మానదండాలను వర్తింపజేయరాదు. అది శిలాయుగం చివరిదశలోని నాగరికతలు, లేదా లోహయుగం ప్రారంభదశలోని నాగరికతలు. అందువల్ల వాటి విస్తృతి వలె వాటి వైభవం బహు పరిమితమైనట్టిది. క్రీస్తుకు 3000 సంవత్సరాల క్రితం సుమేరియాలోని ఉర్ నగరం విస్తీర్ణం 200 ఎకరాలు, క్రీస్తుకు 1500 సంవత్సరాల క్రితం అసీరియా రాజధాని అసుర్ విస్తీర్ణం 120 ఎకరాలు. హోమర్ కవి వర్ణించిన ట్రోజన్ యుద్ధానికి కేంద్రమైన ట్రాయ్ విస్తీర్ణం ఒక అంచనా ప్రకారం ఒకటిన్నర ఎకరాలు కాగా, మరొక అంచనా ప్రకారం " దాదాపు నాలు గెకరాలు. విదేశాల నుంచి మన దేశానికి వస్తే, క్రీస్తుకు 2500 సంవత్సరాలకు పూర్వం మొహెంజొదారో విస్తీర్ణం ఒక చదరపుమైలు. ఉర్, ట్రాయ్ వగైరాలతో పోల్చినప్పుడు ఇది కొంత హెచ్చుగా కనబడుతున్నా, ఇప్పటి అనేక గ్రామాలే ఇంతకంటె విస్తీర్ణమైనవి కావా? ఈ చారిత్రక సత్యాలను దృష్టిలో పెట్టుకొన్న పక్షంలో ఆర్యులను ఆశ్చర్యచకితులను చేసిన -అసూయాపరులను చేసిన - హరప్పన్ నాగరికత సమకాలిక ప్రపంచంలోని గొప్ప నాగరికతలలో ఒకటైనా, ఈ కాలపు ప్రమాణాల ప్రకారం అది ఆటవికస్థాయికి నాలుగైదు మెట్లు పైకి ఎక్కివచ్చినట్టిది మాత్రమే. అయితే, ఆర్యుల కళ్ళకు అదే మహావైభవోపేతమైనదిగా కనబడింది; కేవలం మాయాజాలంవలెనే అది వారికి తోచింది. అప్పటికి వారంతటి అనాగరికులు! తక్కిన విషయాలు విడిచి పుచ్చండి, పచ్చి ఇటుకలు చేయడమైనా అప్పటికి వారికి తెలియదు. కుదురుగా ఒకచోట నిలపక, ప్రాంతం నుంచి ప్రాంతానికి, దేశం నుంచి దేశానికి తమ ఆలమందల వెంట తరలి వెడుతున్న కాలంలో బహుశా వారు చుట్టు గుడిసెలలో, పూరి పాకలలో కాలక్షేపం చేస్తూవుండేవారు. అటు తర్వాతనైనా వారికి చేతనైన విద్య మట్టితో, కలపతో ఇళ్లు కట్టుకొనడమే. మహాభారత కాలం నాటికైనా వాస్తువిద్యలో వారు ప్రవీణులు కాలేదు. ఇందువల్లనే పాండవులు తమ ఇంద్రప్రస్థం నిర్మాణానికి మయుడనే దైత్యుని నియమించారు.

(అయితే, మయసభను గురించి మహాభారతంలో చెప్పినవి నూటికి నూరుపాళ్ళు అత్యుక్తులే; రామాయణంలో అయోధ్యను గురించి చెప్పినవి తిరిగి నూటికి నూరు పాళ్ళు అతిశయోక్తులే. అయోధ్య నిడివి పన్నెండు యోజనాలట, వెడల్పు మూడు యోజనా లట! (బాలకాండ, అయిదవ సర్గ). క్రీస్తుశకం ఒకటవ శతాబ్దిలో అలెగ్జాండ్రియా విస్తీర్ణం 2250 ఎకరాలు మాత్రం; అప్పటిలో ఒక మహా సామ్రాజ్యానికి రాజధాని నగరమైన రోం విస్తీర్ణం 3600 ఎకరాలు మాత్రం. మరి ఇందుకు కనీసం వెయ్యి సంవత్సరాలకు పూర్వం వెలసిన అయోధ్య విస్తీర్ణం 36 చదరపు యోజనాలంటే, దీన్ని నిజమని తల లూపగల వారు రామభక్తులు మాత్రమే, పురాణాలలోని అబద్దాలను, అభూత కల్పనలను తిరుగులేని నిజాలుగా ఔదలదాల్చగల పరమఛాందసులు మాత్రమే.

హరప్పన్ నాగరికత ఆవిర్భావం వలె దాని అభివృద్ధి సయితం నగరాలలోనే. అయితే వాటిని ఋగ్వేదకాలం నాటి ఆర్యులు ధ్వంసం చేసినందున తిరిగి మన దేశంలో నగరాలు నెలకొనడం కొన్ని శతాబ్దాల తర్వాతగాని జరగలేదు. అయోధ్య విస్తీర్ణాన్ని గురించి రామాయణంలోని మాటవలె మిథిల, వారణాసి, ఇంద్రప్రస్థం విస్తీర్ణాలను గురించి జాతక కథలలోని మాటలుకూడా "లేత సొరకాయ కోతలు"గా కొట్టివేయదగినవని ప్రసిద్ధ పురాతత్త్వశాస్త్రవేత్త ఎ. ఘోష్ తెగవేసి చెప్పాడు.
అయోధ్య విస్తీర్ణం 36 చదరపు యోజనాలని చెప్పిన రామాయణమే దానిలో రత్నాలతో పొదిగిన రాజప్రాసాదాలు వున్నట్టు చెప్పింది (బాలకాండ, అయిదవ సర్గ). కాని, అయోధ్యాకాండకు వెడితే, అవి రత్నాలు పొదిగిన దివ్యహర్మ్యాలు కావని, మట్టితో మెత్తిన మిద్దెలని అనుమానించ వలసివస్తుంది. తన కుమారుని కైకేయి వనవాసానికి పంపిస్తున్నట్టు విన్నంతనే కౌసల్య స్పృహ తప్పి పడిపోతుంది. తిరిగి తెలివి రాగానే విచారాన్ని పట్టలేక నేలపై దొర్లుతూ రోదిస్తుంది. "విశేషముగ నేలమీద బొరలిన" మీదట "లేచి, దుఃఖపడుచుండునదియు, విశేషముగ బరువువేసి మొయించిన యాడుగుఱ్ఱమువలె డస్సినదియు, నేలమీదబడి పొరలుటచే నొడ లంతయు దుమ్మంటుకొన్నదియునైన తన తల్లియగు కౌసల్యను (రాముడు) లేవనెత్తి కూర్చుండబెట్టి యొడలి దుమ్మంతయు దుడిచెను" (అయోధ్యా కాండ, 20వ సర్గ). అది గచ్చునేల సయితం లేనట్టి మట్టి మిద్దె కాకపోతే, అది తివాచీలు నేలమీద పరవని చావడి కాకపోతే, కిందపడి దొర్లి నంత మాత్రాన ఎంతో బరువుతో నేలమీద పొర్లిన గుఱ్ఱానికి అంటుకొన్నంత దుమ్ము కౌసల్యకు అంటుకొని వుండేదా? హెచ్.డి. సంతాలియా సరిగా ఇదే ప్రశ్న వేసి, ప్రాచీన కాలపు ఆర్యనగరాలను ఎక్కడ తవ్వి చూచినా, మట్టి మిద్దెలే బయల్పడినట్టు వివరించాడు. పునాదులకు కొండరాతిని రెండు చోట్ల వాడినా, అక్కడ సయితం గోడలు రాతితో కట్టినవి కావట; వెదురు అల్లిక పై మట్టి గిలాబాతో ఏర్పరచినట్టి వట. కప్పు ఆకులతోనో, గడ్డితోనో కూర్చినట్టిదట.

ఒకప్పుడు వాస్తుశాస్త్రంలో, ఇతర విద్యలలో ఎన్నదగు ప్రవీణులైనా, ఆర్యుల చేతిలో పరాజయపరంపర తర్వాత, ప్రాంతం నుంచి ప్రాంతానికి పలాయనం తర్వాత, పర్వతపంక్తుల మధ్య, దుర్గమారణ్యాల మధ్య స్థిరపడ వలసి వచ్చిన హరప్పన్ నాగరికతనిర్మాతలు తమ పూర్వవిద్యలను మరచిపోయి వుండాలి, వాటిలో తమ ప్రావీణ్యాన్ని కోల్పోయి వుండాలి. నాగరిక శిఖరం నుంచి అనాగరికస్థాయికి దిగజారి పోవడానికి నాలుగైదు తరాలు చాలు. లిపి లేని, గ్రంథాలు లేని కాలంలో ఇందుకు బహుశా రెండు, మూడు తరాలైనా సరిపోయేవి. నిషాదులు హరప్పన్ నాగరికత నిర్మాతలు కాకపోవచ్చు. కాని, ఒకప్పుడు ఆటవికుల స్థితికి కొన్ని మెట్లు పైగానే వారు బ్రతుకుతూవుండేవారు. వారిని సింధు, గంగ, యమున పీఠభూములనుంచి పర్వత ప్రాంతాలకు, కాననాల మధ్యకు ఆర్యులు తరిమి కొట్టినపిదప వారు త్వరితగతిని ఆటవికుల స్థితికి దిగజారిపోయినట్టు వారిని గురించి ప్రత్యేక పరిశోధనలు చేసిన శరత్ చంద్ర రాయ్ వ్రాశాడు."

రామాయణాన్ని చూస్తే, అయోధ్య కంటే లంకాపురి మరింత ధగ ధగాయమానంగా వుండేదన్న అభిప్రాయం కలుగుతుంది. రావణుని నగరు (అంతఃపురం) పొడవు ఒక యోజనం, వెడల్పు అర్ధయోజనం, దానిలోనివి "వార్షకమేఘము వలె తేజరిల్లు భవనపంక్తులు" ఆ భవనాలలోనివి వెండి, బంగారాల స్తంభాలు, పచ్చలు పొదిగిన కిటికీలు, పసిడి మెట్లు, నీలాలు పరచిన తిన్నెలు వగైరాలు, వగైరాలు (సుందరకాండ, ఏడవ సర్గ). పురాతత్త్వశాస్త్రం దృష్టిలో ఇది స్వచ్ఛమైన "నాన్ సెన్స్" ప్రాచీనకాలంలో ఇట్టి భవనాలు, ఇట్టి నగరులు ఈ ప్రపంచంలో లేనే లేవు. క్రీస్తుకు 2500 సంవత్సరాలకు పూర్వం మొహెంజొదారోలో శ్రీమంతుని భవనం.
నిడివి 97, వెడల్పు 83 అడుగులు (రెండు అంతస్తులు), క్రీస్తుకు 2000 సంవత్సరాలకు పూర్వం ఉర్ నగరంలో అట్టి భవనం నిడివి 40, వెడల్పు 33 అడుగులు (మండువాకు నలుగడలలో ఏడు గదులు); క్రీస్తుకు 600 సంవత్సరాలకు పూర్వం బాబిలోనియాలో దాని నిడివి 98, వెడల్పు 82 అడుగులు (నడుమ మండువాతో 19 గదులు). ఇవి శ్రీమంతుని భవనాలే కాని, రాణ్మందిరాలు కావంటే, ఎష్ నున్నా అనేచోట ఒక ప్రాచీన రాణ్మందిరం కనబడింది. ఇది క్రీస్తుకు పూర్వం

2300 సంవత్సరాలనాటిది. దీని నిడివి 230, వెడల్పు 85 అడుగులు. దీనిలో గదులు, మండువాలు కలిపి, మొత్తం 36 మాత్రం వున్నాయి. సుందర కాండను పారాయణం చేస్తే స్వర్గద్వారాలు తమకోసం తెరచుకొని వుండగలవని గట్టిగా నమ్మేవారికోసం ఈ వివరాలను నేను పేర్కొనలేదు; ఆలోచనాశక్తిని, విజ్ఞతాదృష్టిని కోల్పోవనివారికోసమే.

ఇంత దూరం వచ్చినా, రాక్షసు లెవరో నేను తేల్చి చెప్పకపోవడానికి కారణం - కచ్చితంగా చెప్పగలిగింది ఏమీ లేకపోవడమే. అయితే, ఒకటి మాత్రం నిశ్చయం. వారు ఆర్యులు కారు. రావణుడు పౌలస్త్యు డనడం కల్ల; అతడు వేదవేదాంగాలలో పండితు డనడం బొల్లు; అతడిని వధించినందున తనకు చుట్టుకొన్న బ్రహ్మహత్య పాపపరిహారం కోసమే రాముడు రామేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేశాడనడం కాకమ్మకథ. ఒక వైపున రాక్షసులను, రాక్షసేశ్వరులను మాయావులని, క్రూరులని నిందిస్తూనే, మరొక వైపున వారితో ఏదో పొత్తు కల్పించుకొనడానికి ఆర్యులు ఎందుకు ప్రయత్నించారు? ఈ ప్రయత్నం వెనుకగల చిత్తవృత్తి దురూహ్యమైనది కాదు, కానక్కరలేదు. ఎంతో దూరం పోవడం దేనికి? మన రక్త మాంసాలను పీల్చుకు తింటున్నారని ఒక వైపున ఆంగ్లేయులను నిందిస్తూనే, మరొక వైపున రైలు బండి, టెలిగ్రాఫ్, టెలిఫోన్, మోటారు కారు మొదలైన వాటిని “తెల్లోడి మాయ”లని మెచ్చుకొన్నవారు నలభై, యాభై యేళ్ళనాడు మనలో ఎందరు లేరు? “మావలె మీరు కూడా ఆర్యజాతికి చెందినవారే!” అని సర్ విలియం జోన్స్, మాక్స్ ముల్లర్ మున్నగువారు చెప్పినప్పుడు మురిసిపోయినవారు మనలో ఎందరు లేరు? అంతటితో ఆగక మన వేదాలను, అన్య ప్రాచీన గ్రంథాలను తస్కరించి, వాటి సహాయంతోనే రైలు, విమానం వగైరాలను తెల్లవారు కనిపెట్టగలిగినారని చాటినవారు ఎందరు లేరు? ప్రాచీనకాలపు ఆర్యులు సయితం అనార్యజాతుల బలదర్పాలకు, వారి ప్రజాప్రాభవాలకు మూలం బ్రహ్మవిష్ణు మహేశ్వరుల నుంచి వారు పొందిన వరాలే అని చెప్పారు, వేద వేదాంగాలలో వారి పాండిత్యమే అని చెప్పారు!

రాక్షసులు ఆర్యులు కారంటే, మరి వారెవరు? ఆర్యమతాన్ని, సంప్రదాయాలను వ్యతిరేకించి నందున, ఆర్య సంఘం నుంచి వెలి వేయబడినవారా? ఇట్టి వారిని వ్రాత్య లనేవారు. వ్రాత్యులను ఎంతగా విద్వేషించినా, వారిని రాక్షసులుగా వర్ణించినవారు లేరు.

పోతే, ఇక్కడి ఆదివాసులలో మొట్టమొదటి వారుగా పేర్కొనబడుతున్న నీగ్రో జాతివారు రాక్షసులు కావడానికి వీలు లేదు. ఆర్యులను అసూయాపరులను చేసినంతటి గొప్పది రాక్షస నాగరికత. సుందరకాండను చదువుతూ వుంటే, లంకాపురి ముందు అయోధ్య వెలవెలబోతూవున్నట్టు కనబడుతుంది. ఒక్క రామాయణమే కాదు, తక్కిన ప్రాచీన గ్రంథాలు సయితం ఆర్యనాగరికత కంటె రాక్షస నాగరికత -కనీసం సిరిసంపదలకు సంబంధించినంత వరకు మహోజ్జ్వల మైనదని వారిని గుర్తిస్తున్నాయి. ఆ నాగరికత నీగ్రోజాతి సృష్టి కానేరదని నిష్కర్షగా చెప్పవచ్చు.

నీగ్రోల కంటె కిరాతులు నాగరికతలో కొంతవరకు ముందుకు వెళ్ళినట్టి వారు. గురించి, వారి నాగరికతను గురించి తెలుసుకొనగోరేవారు "కిరాత జనకృతి” అనే పేరుతో సునీతి కుమార ఛటర్జీ ఇంగ్లీషులో వ్రాసిన పుస్తకాన్ని చదవవచ్చు. " ఆర్యుల తర్వాతనే కిరాతులు ఇక్కడికి వలస వచ్చినట్టు అనుకొనడానికి అవకాశం కలదని ఛటర్జీ సూచిస్తున్నాడు. పైగా, కిరాతుల చరిత్రలో సుప్రసిద్ధ ఘట్టాలు క్రీస్తుశకం పధ్నాల్గవ శతాబ్దం అనంతరకాలానికి చెందినవని ఆయన వివరిస్తున్నాడు. ఇంతే కాక, కిరాతుల ముఖ్య స్థావరాలు ఇండియా తూర్పు, ఉత్తర సరిహద్దు ప్రాంతాలు. అవి జాతీయ జీవన స్రవంతికి సుదూరంలో గల ప్రాంతాలు. ఈ కారణా లన్నింటి వల్ల రామాయణ భారతా లేమి, భాగవతాది పురాణా లేమి రాక్షసులుగా వర్ణించినట్టివారు కిరాతులు కావడానికి వీలు లేదు.

ఇప్పుడిక మిగిలినవారు నిషాదులు, ద్రావిడులు మాత్రమే. రామాయణాన్ని విమర్శకదృష్టితో పరిశీలించినవారిలో అది పేర్కొంటున్న రాక్షసులు ద్రావిడులు కావచ్చునని అధికసంఖ్యాకులు, కాదు, నిషాదు"లని తక్కినవారు తీర్మానిస్తున్నారు. ఈ అధిక సంఖ్యాకుల దృష్టిలో సింహళ ద్వీపమే రావణుని లంక. అయినప్పుడు ద్రావిడులే, లేదా ద్రావిడులలో ఒక తెగవారే, రాక్షసులని వీరు తీర్మానించడం సహజమే.

అయితే, ద్రావిడులలో రాక్షసు లెవరు? ఈ ప్రశ్నకు సి.వి. వైద్య సమాధానం "తెలుగువా" రని! పంచవటి నాసిక్ వద్ద వుండేదా, లేక భద్రాచలం వద్ద వుండేదా? ఎక్కడైనా, అది గోదావరి తీరంలోనే వుండేదట.

రాక్షస రాజ్యం గోదావరి తీరానికి సమీపంలోనే, దానికి దక్షిణదిశలో ప్రారంభమయ్యే దట. నాసిక్ ప్రాంతంవారు ఆర్యభాషాకుటుంబానికి చెందిన మరాఠీని మాతృభాషగా చేసుకొన్న వారు కాబట్టి, వారు రాక్షసులు కావడానికి వీలు లేదట. పోతే, తెలుగువారిది ద్రావిడభాష కాబట్టి, వారే రాక్షసులు కావాలట! అయితే, మనకు ఎక్కడ కోపం రాగలదో అని కాబోలు, ఆయన ఒక మాట కలుపుతున్నాడు. తెలుగు వారు రాక్షస సంతతి వారైనా, ఇప్పుడు మాత్రం రాక్షసులు కారట.

వైద్య అభిప్రాయాన్ని సురవరపు ప్రతాపరెడ్డి బలపరుస్తున్నాడు. అధర్వణ కారికల ప్రకారం రావణుడు ఆంధ్రుడట. ప్రాచీనాంధ్ర లక్షణవేత్తలలో బృహస్పతి, కణ్వుడు, హేమచంద్రుడు, పుష్పదంతుడు, గౌతముడు, ధర్మరాజులతో పాటు రావణుడు సయితం వున్నాడట. దీని ప్రకారం లంకాధిపతి ఆంధ్రుడైనా, "రావణుడు" అనే పదం "బహుశా పేరు కాదేమో!" అనే సందేహాన్ని "రామాయణ విశేషములు" అనే తమ గ్రంథంలో ఆయన వెల్లడించాడు. ఆయన మతం ప్రకారం తమిళంలో "ఇరైవాన్" అంటే దేవుడు కావచ్చు, రాజు కావచ్చు. దాన్ని సంస్కృతీకరించగా వచ్చినదే "రావణ" శబ్దం కావచ్చు. పోతే, "రో" లేక "రై" అంటే తెలుగులో " ధనం". 'రైవాన్" అంటే ధనవంతుడు కావచ్చు, రాజు కావచ్చు. ఈ "రైవాన్" పదంనుంచే "రావణ" పదం వచ్చి వుండవచ్చు, ఈ చర్చ మరికొంత సాగించిన తర్వాత ఆయన తేల్చిన సారాంశ మిది : "ప్రాచీనాంధ్ర వ్యాకర్తలలో నితడొకడని ప్రతీతి యుండుటచేత (రావణుడు) ఆంధ్రుడే యైయుండు ననుటకు కొంత యాధార మెక్కువగా నున్నది." (రామాయణ విశేషములు, పుటలు 315-16). రాక్షసు లెవరన్న ప్రశ్నను మరొక చోట చర్చించి, ఆయన చెప్పిన మాట లివి : "వింధ్య నుండి దక్షిణాపథ మంతయు నుండిన అనార్యులలోని ఒక తెగయె రాక్షసుల తెగ."

ఇక, రామాశ్రయ శర్మ వాదం ప్రకారం రాక్షసులలో రెండు వర్గాల వారుండేవారు. ఒక వర్గం వారేమో జన్మవల్ల రాక్షసులైనవారు. రెండవ వర్గంవారు ఏదో శాపంవల్ల రాక్షసులైనవారు! శాపాలలో నమ్మకం వున్న ఈ రచయిత అభిప్రాయాలను నేను చర్చించబోను. వాటివల్ల ఆసక్తిగలవారు వాల్మీకి రామాయణం వివరిస్తున్న సాంఘిక, రాజకీయ వ్యవస్థలను గురించి ఈయన వ్రాసిన విపుల గ్రంథాన్ని పఠించవచ్చు. " ఇట్టి గ్రంథాలను మరి రెండింటిని కూడా నేను తిరగవేశాను. వాటిలో మొదటిది కుమారి పి.సి. ధర్మ రచన"; రెండవది డాక్టర్ ఎస్.ఎస్. వ్యాస్ రచన. వీరు ఆధునిక యుగంవారు; ఆధునికవిద్య నభ్యసించినవారు. అయినా, వీరి చిత్తవృత్తి మాత్రం ఆధునికమైనది కాదు. ఇట్టివారి సంఖ్య తరగడానికి మారుగా నానాటికి పెరగడం మన దేశ దౌర్భాగ్యం!

నేను ఆలోచించ గలిగినంత వరకు రాక్షసులు ఏదో ఒక తెగకు, లేదా ప్రాంతానికి చెందినవారు కారు. ఎక్కడ వైరవిద్వేషా లుంటే, ఎక్కడ భయ విభ్రాంతు లుంటే, అక్కడ రాక్షసు లుంటారు. ఈ విషయాన్ని గుర్తించినప్పుడు రామాయణ, భారతాలలోని, భాగవతాది పురాణాలలోని రాక్షసులు ఒకే ప్రాంతంవారు కానక్కర లేదు, ఒకే తెగకు చెందినవారు సయితం కానక్కర లేదు. పైగా, రాక్షసులు దేశ దేశాలవారి కున్నారు. రావణునివి పది తలలుకాగా టూటోనిక్

పురాణాలలోని టిర్ నాయనమ్మవి 900 తలలు; గ్రీక్ పురాణాలలోని క్రోనస్ తన బిడ్డలను తానే తిని వేశాడు; బాబిలోనియన్ పురాణాలలోని ఇయా పాములు, మొసళ్ళు, కుక్కలు వగైరాలను కనింది; సుమేరియాన్ పురాణాలలో ఉడుగ్ అనే పేరుతో అతి భయంకరులైన సప్తరాక్షసు లున్నారు.

ఇప్పుడు మనం వేసుకొన వలసిన ప్రశ్న : రామాయణం రాక్షసులు ఎక్కడి వారని? సింహళద్వీపం రావణుని లంక కాదన్న విషయాన్ని గుర్తిస్తే రాక్షసరాజ్యం కోసం చూడవలసింది.

వింధ్యపర్వతాలకు ఉత్తరదిశలో, లేదా ఆ పర్వతాల పరిసరప్రాంతాలలో. ఈ పీఠిక మూడవ ప్రకరణంలో నేను వివరించినట్టు, ఎమ్. వి. కిబే, జి.ఎస్. హీరాలాల్, టి. పరమశివ అయ్యర్, టి. అమృతలింగం, డి.ఆర్. మన్కడ ప్రభృతులు ఇంతే చేశారు. అరుణకుమార్ ఘోష్ అభిప్రాయం కూడా రామాయణంలోని రాక్షసులు మధ్యభారత ప్రాంతానికి చెందినవారనే. ఈయన వివరణ ప్రకారం, క్రీస్తుకు పూర్వం అయిదవ శతాబ్ది ప్రాంతాలలోనే ఆర్యులు దక్షిణ భారతంలో కాలూన గలిగారు. అంతకు కొన్ని శతాబ్దాలకు పూర్వమే రామరావణ యుద్ధం జరిగివుండాలి. పైగా, సింహళం ప్రాచీన చరిత్రను తెలిపే “మహావంశ”లో రావణుని ప్రసక్తి లేదు. రామాయణంలోని అతిశయోక్తులను, అభూత కల్పనలను తొలగిస్తే, ఒక కోసల రాకుమారునికి, ఒక అనార్యజాతి రాజుకు జరిగిన యుద్ధానికి సంబంధించినట్టిదే రామాయణం మూలగాథ.

రామాయణ యుద్ధానికి రంగం మధ్యభారత మని, ప్రత్యేకించి వింధ్య పరిసర ప్రాంతమని గుర్తించిననాడు ఆ యుద్ధం జరిగింది. నిషాదజాతికి చెందిన ఏదో ఒక తెగతో అని సంభావించడానికి ఎక్కువ అవకాశా లున్నాయి. ఒకప్పుడు ఉత్తర భారతంలో అధిక భాగం నిషాదుల ఆక్రమణలో వుండేది. అప్పటిలో వారిని మూడు పేర్లతో పిలిచేవారు. వాటిలో మొదటిది నిషాదులు కాగా, రెండవది శబరులు, మూడవది పులిందులు. క్రీస్తుశకం ప్రారంభం తర్వాత వారి ప్రసిద్ధ నామాలు భిల్లులని, కోల్లలని. ఇక్కడ ఆర్యుల తాకిడికి తట్టుకోలేక వారు మెలనీసియాకు, పోలినీసియాకు, ఆస్ట్రేలియాకు, న్యూజిలెండ్ కు, ఇండోనీసియాకు, ఫిలిప్పీనకు, మలయాకు, ఇండో-చైనాకు, బర్మాకు, నికోబార్ దీవులకు, మరికొన్ని దూరప్రాంతాలకు తరలిపోయారు. తరలి పోయినవారు పోగా, మిగిలినవారు వింధ్య పరిసర ప్రాంతాలలో తలదాచుకొన్నారు. ఆ ఆర్యుల చేతిలో దెబ్బ తర్వాత దెబ్బతిని చెల్లా చెదరుకాకముందు భారతీయ సంస్కృతిపై నిషాదులు తమ ముద్రను బలంగానే వేశారు. కోశల-తోశల, అంగ-వంగ, కలింగ-త్రిలింగ, ఉత్కల-మేకల, పులింద-కులింద అనే పేర్లను మన దేశంలో కొన్ని ప్రాంతాలకు పెట్టినవారు నిషాదులే. జంటమాటలుగా వుండే కొన్ని జాతుల పేర్లు కూడా (ఉదాహరణకు అచ్చ-వచ్చ, తక్కోల-కక్కోల మొదలైనవి) వారు పెట్టినవే." అన్నట్టు, ఇక్కడ మరొక మాట ' చెప్పాలి. కోసల ఒకప్పుడు నిషాద ప్రాంతం. ఇక్కడ వర్ణ సాంకర్యం కొంతవరకు జరిగివుండాలి. అందువల్లనే ఆర్యజాతికి చెందిన రామునికి నల్లనిరంగు వచ్చివుండాలని అరుణకుమార్ ఘోష్ వ్రాశాడు. " వర్ణసాంకర్యంతో పాటు కులసాంకర్యం సయితం కోసలలో వుండేదని అనుకోవాలి. సుప్రసిద్ధ సాంఘిక శాస్త్రవేత్త జి.ఎస్. ఘుర్యే వివరణ ప్రకారం దశరథునిభార్య సుమిత్ర శూద్రాంగన.

మన దేశంలో కొన్ని ప్రాంతాలకు, జాతులకు మాత్రమే కాక, కొన్ని నదులకు సయితం వాటి పేర్లు నిషాదులు పెట్టినట్టివే. ఇక్కడ ఒక నదికి “గంగ” అని వారు పేరు పెట్టబట్టే, ఇక్కడ నుంచి వారిలో ఇండో-చైనాకు వలసవెళ్ళిన వారు అక్కడ ఒక నదికి “మెకాంగ్” (మా-గంగ) అని పేరు పెట్టడం జరిగింది. కాగా, సునీతి కుమార ఛటర్జీ అభిప్రాయం ప్రకారం కర్మసిద్ధాంతం, స్వీకరించినట్టివి.

జన్మ, పునర్జన్మల సిద్ధాంతం నిషాదులనుంచి హిందూమతం నిషాదులలో ఒక తెగవారైన ఖోండ్ల మధ్య (వీరికి "కూయీ"లని మరొక పేరు కూడా వున్నది) అనేక సంవత్సరాలపాటు నివసించి, వారి వేషభాషలను గురించి ఆచారవ్యవహారాలను గురించి పరిశోధనలు చేసిన జి. రామదాసు పంతులు రావణుడు ఈ తెగకు చెందినవాడన్న తీర్మానానికి వచ్చాడు. ఈ తెగవారి ఊరు వెలుపల "నిశాన్ పెన్ను" అనే దేవి వుంటుందట. ఆరు మొదలు తొమ్మిది అంగుళాల రాయిని కోడి గుడ్డును పోలిన రాయిని - ఈ దేవీ మూర్తిగా ఒక చెట్టుకింద గ్రామద్వారం వద్ద ప్రతిష్ఠ చేస్తారట. ఇది పగిలిపోయినా, దీన్ని ఎవరైనా దాని స్థానం నుంచి తొలగించినా, తమకు కీడు కలగగలదని ఖోండులు నమ్ముతారట. ఈ నమ్మకం తెలిసినవాడు కాబట్టే హనుమంతుడు లంకలో ప్రవేశిస్తూ ఈ రాయిని కదిలించి వుండా లట. లంకాదేవితో హనుమంతుని సంఘర్షణగా రామాయణం వర్ణించినట్టిది ఈ సంఘటనే కావచ్చు నట. యుద్ధానికి బయల్దేరుతూ ఖోండులు భయంకరంగా కనబడ్డంకోసం మృగాల ముఖాలను (మారు ముఖాలుగా) తగిలించుకొంటారట. రాక్షసులను వికృతరూపులుగా రామాయణం వర్ణించడం ఇందువల్లనే జరిగివుండవచ్చునట. ఖోండుభాషలో దియ-గీవ అంటే చికాకు పరచడం, దశ-గీవ అంటే కీడు చేయడం, వేప-గీవ అంటే కొట్టడం, చంపడం. ఈ భాషలోని "దశ-గీవ"ను రామాయణంలో "దశగ్రీవుడు"గా మార్చడం, రావణునికి పదితలలని చెప్పడం జరిగివుండవచ్చునట. రామాయణంలోని రాక్షసులు ఖోండులు కావచ్చునని చెప్పడానికి ఇట్టి వివరాలను పెక్కింటిని రామదాసు పంతులు ప్రచురించాడు.'

రామాయణంలోని రాక్షసులు ఖోండ్ తెగవారు కాకపోతే వారికి సన్నిహితులైన గోండ్ తెగవారు కావచ్చునని రామదాసు సూచించాడు. ఆ తెగవారు రావణుని భక్తి గౌరవాలతో సంస్మరిస్తారట; పూర్వకాలంలో తమ ప్రభువుగా అతడిని కీర్తిస్తారట. గోండ్ జాతివారు ప్రతి ముఖ్య ప్రదేశాన్ని "లక్క" అంటారట. దీన్నే రామాయణం "లంక"గా మార్చి వుండవచ్చునని గోండ్ జాతివారి మధ్య దాదాపు ఒక జీవితకాలాన్ని గడిపిన వి.ఎస్. పట్వర్ధన్ సంకాలియాకు చెప్పినాడట.

ఇందరు పండితులు, ఇందరు పరిశోధకులు, ఇందరు విభిన్న శాస్త్రవేత్తలు చెప్పిన ఈ విషయాలను "ఇవి నాస్తికుల ప్రేతాసనలు" గా కొట్టి పారవేయగలవారు ఎంద రెందరో వుండగలరని నాకు తెలుసు. ఇదివర కొకసారి వీరికి పదివేల నమస్కారాలు చెప్పినట్టున్నాను; ఈసారి లక్ష నమస్కారాలు చెప్పి, నా దారిని నేను ముందుకు సాగుతాను.

ఋషులెవరు?

నిజమే ఒక లోకోక్తి హెచ్చరిస్తున్నట్టు, ఋషిమూలాన్ని విచారించరాదు. ఆ పని చేస్తే, కనబడేది ఏదో బూతు, లేదా ఏదో బొంకు! ఈ రెండింటిలో ఒకటి కాకపోతే, కనీసం దంభం కనబడుతుంది. లేదా దర్పం కనబడుతుంది! ఒక్క మన దేశంలోనే కాదు, అన్ని దేశాలలో, ఒక్క మన నాగరికతలోనే కాదు, అన్ని నాగరికతలలో - మంత్రవేత్తలుగా చెల్లినవారి విషయంలో చెల్లుతున్నవారి విషయంలో నా మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం.

మంత్రాలకు చింతకాయలు రాలనిది ఇప్పుడే కాదు, ఎప్పుడైనా, ఎక్కడైనా కాని, అవి రాలతాయన్న నమ్మకాన్ని ప్రజలలో పాదుకొలపకపోతే, మంత్రవేత్తలకు ఆధిక్యత దక్కదు సరిగదా, అన్నపానీయాలైనా దక్కవు. అందువల్ల ఎన్నెన్నో వేషాలు వారు వేయాలి, మోసాలు చేయాలి గొప్పలు చెప్పుకోవాలి, ఘనతలు ఆపాదించుకోవాలి.

అయితే, ఇదే సమయంలో ఒక సత్యాన్ని నేను గుర్తిస్తాను. దేశదేశాల నాగరికతల చరిత్రలను చదివిన నేను దాన్ని గుర్తించకపోతే, అది క్షమించరాని తప్పిదమే కాగలదు. ఈనాడు మనం డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఎస్ట్రానమ గా (ఖగోళ శాస్త్రజ్ఞులుగా), ఇతర సైన్టిస్టులుగా చెప్పుకొంటున్నవారు ఒకనాడు మంత్రవేత్తలే. మానవచరిత్రలో పశుపోషణ వ్యవస్థ వ్యావసాయిక వ్యవస్థ ఒకదాని తర్వాత మరొకటి నెలకొన్నంతనే, విద్యావైజ్ఞానిక విషయాలను గురించి ఆలోచనలు చేయడానికి, పరిశోధనలు జరపడానికి కొందరికి విరామం లభించింది. వీరిలో అధిక మేధావులైనవారే దేవతలకు పూజారులైనారు, రాజులకు పురోహితులైనారు, అగ్రవర్ణాల, లేదా వర్గాల పౌరులకు విద్యాగురువు లైనారు. వీరే మనకు తొలి సైటిస్టులు. నిప్పును రగల్చడం మొదలుకొని కుండను చెయ్యడం వరకు; కుక్కను, ఆవును, గుర్రాన్ని మచ్చికచేయడం మొదలుకొని నాగలిని కనిపెట్టడంవరకు;
ఎప్పుడు వరద పొడవగలదో చెప్పడం మొదలుకొని, ఎప్పుడు గ్రహణం వదలగలదో సూచించడం వరకు - అన్నీ ఒకనాడు విప్లవాత్మకమైన వైజ్ఞానిక, సాంకేతిక విజయాలే. వీటిని దాదాపు పూర్తిగా సాధించినవారు దేవతల పూజారులే, రాజుల పురోహితులే. అగ్రవర్ణాల, లేదా వర్గాల విద్యాగురువులే. అయితే, ప్రజా బాహుళ్యానికి సంబంధించినంతవరకు తమకు తెలిసిన విద్యలను వీరు గుప్తంగా వుంచారు. తమ ప్రధాన పోషకులకు సయితం తమకు తెలిసిన సమస్తాన్నీ విడమర్చి చెప్పలేదు. దీనికితోడు వీరు తమకు సర్వజ్ఞతను ఆపాదించుకొన్నారు, తమకు అలౌకికశక్తులున్నట్టు, అమోఘ మహిమ లున్నట్టు కపటనటన చేశారు. అందువల్లనే వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల పురోగతి దేశదేశాలలో కొన్ని వేల సంవత్సరాలపాటు స్తంభించిపోయింది. కొత్త సత్యాలను కొత్తవారు కనుగొనగలిగితే, తమ ఘనత ఎక్కడ దెబ్బతినగలదో అని, తాము పొందుతున్న గౌరవమర్యాదలు ఎక్కడ తగ్గిపోగలవో అని "ఎందువల్ల?" అనే ప్రశ్నపైనే వీరు ఆంక్షవేశారు. దేశదేశాలకు సంబంధించిన ఈ పూజారివర్గం వైఖరికి, ఈ పురోహితవర్గం వర్తనకు భిన్నమైనది కాదు మన ఋషుల నడవడి. "ఋషి" అనగానే అతడు "సర్వసం పరిత్యాగి" అని మనం భావిస్తాము. ఇది మన పౌరాణిక ఋషుల విషయంలోవలె మన వైదిక ఋషుల విషయంలో సయితం ఎంతమాత్రం నిజం కాదు. అంగిరసుడు, అగస్త్యుడు, భృగుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు వేదవేదాంగాలలోవలె పురాణేతిహాసాలలో మనకు తగులుతారు.

ఇవి వంశ నామాలు కాబట్టి, వీరికి సంబంధించిన ఏ వృత్తాంతమైనా, ఏ విశేషమైనా ఒకే వ్యక్తికి సంబంధించింది కావడానికి వీలు లేదు. ఏమైనా, వీరి పుట్టుపూర్వోత్తరాలను గురించి మన పురాణాలలోగల కథలను పుణ్యగాథలుగా

భావించే వారి మానసిక స్వాస్థ్యాన్ని శంకించవలసి వుంటుంది. నా పలుకులు ఋషులపట్ల ద్వేషంతో కూడినవి కావని రుజువు చేయడానికి వారికి సంబంధించి పురాణాలలోగల కొన్ని గాథలను (అయిష్టంగానే) ఇక్కడ పేర్కొనక తప్పదు.

అగస్త్యునికి, వసిష్ఠునికి తల్లి ఊర్వశి కాగా, తండ్రులు మిత్రవరుణులు. ఈ " జాయింట్" తండ్రులు ఊర్వశిద్వారా తమ సుపుత్రద్వయాన్ని లోకోద్ధరణకై ఏ తీరున ప్రసాదించారో ఆ కథ అసహజమైనదే కాదు, అశ్లీలమైనది కూడా. ఇందుకు ఏమంత భిన్నమైనది కాదు ఘృతాచి తల్లిగా భరద్వాజుడు తండ్రిగా ద్రోణాచార్యుని జననం. ఏవో మహిమ లని, ఏవో వరా లని "మసిపూసి మారేడు కాయ" చేయడానికి ప్రయత్నం జరగకపోలేదు గాని, మత్స్యగంధితో పరాశరుడు జరిపినట్టిది పచ్చి వ్యభిచారం. ఈ వ్యభిచారం ద్వారా జన్మించిన వేదవ్యాసుడు వంశోద్ధరణ పేరుతో అంబిక, అంబాలికలతో పొత్తు కలిపి, ధృతరాష్ట్ర పాండు రాజులను కన్నాడు; వారి దాసితో కత్తు కలిపి, విదురుని కన్నాడు! దేవతలకే గురువైన బృహస్పతి భార్య తారను చంద్రుడు తగులుకొనగా, తన సోదరునిభార్య మమతను (ఆమె నిండు గర్భవతిగా వున్నదన్న సంకోచమైనా లేకుండా) బృహస్పతి "రేప్" చేశాడు. ఈ విధమైన కథలను పెక్కింటిని చదివినమీదటనే "ఏ పురాణమైన ఏమున్న దందులో నీతిముసుగుతోడ బూతుకాక?" అని నేను ఇదివరలో వ్రాశాను. ఈ "బూతు" పనులలో హిందువుల ఋషులతో వారి దేవతలు గట్టిగా పోటీపడినట్టు చెప్పవచ్చు. ఇట్టి కథలతో కూడిన ఒక సంకలనం "లౌస్ ఆఫ్ హిందూ గాడ్స్ అండ్ సేజెస్" అనే పేరుతో ఇటీవల వెలువడింది. మరింత వివరంగా ఈ కథలు వేమూరి శ్రీనివాసరావు సంకలనం చేసిన "పూర్వ గాథాలహరి"లో వున్నాయి.

కామవికారాలను, ప్రకోపాలను విడిచి పుచ్చండి; అన్యవిధాల చూచినా, ఋషు లన్నవారిలో అల్పత్వం విశేషంగానే గోచరిస్తుంది. దుర్వాసునికి ముక్కుపై కోపం; కదిలినా, మెదిలినా అతడు ఒక శాపం తగిలించేవాడు. వసిష్ఠునికి, విశ్వామిత్రునికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండేది. గౌతముని సంపద చూచి అసూయాపరులైన అన్యఋషులు అతనికి మాయోపాయం ద్వారా గోవధపాపాన్ని అంటగట్టారు. భృగుడు బ్రహ్మను, శివుని శపించిన తర్వాత, విష్ణువును వక్షస్థలంపై తన్నాడు.

సోనీ, ఇవి పురాణాలకు సంబంధించిన కాకమ్మ కథలని త్రోసివేయడానికి వేదఋషు లన్నవారు ఇంతకంటె ఏమంత భిన్నమైనవారు కారు. ఋగ్వేదకాలం ప్రారంభదశలలో యజ్ఞాలు, యాగాలు పెద్ద యెత్తున జరిగేవి కావు; జరిగినా, ఎవరికి వారు వాటిని స్వయంగా జరుపుకొనేవారు. కాలక్రమాన మంత్రద్రష్టలమన్న ఘనతతో ఒక ఋషివర్గం ఏర్పడింది. వీరు యజ్ఞయాగాల సంఖ్యను పెంచారు. వాటి కాలపరిమితిని పెంచారు. "ఆంధ్రవాచస్పత్యము" వివరణ ప్రకారం పాకయజ్ఞాలు ఏడు; హవిర్యజ్ఞాలు ఏడు, సోమయజ్ఞాలు ఏడు. ఇవి కాక, అశ్వమేధయాగం, రాజసూయం, పౌండరీకం, బృహస్పతిసవం, చైనం మొదలైన ప్రత్యేక యజ్ఞాలు అనేకం వుండేవి. "మొదలైన' అనే ముసుగుకింద "ఆంధ్రవిజ్ఞానము" మభ్యపరచిన యజ్ఞాలలో ఒకటి "పురుష మేధం". బలిపశువుగా నరుని నరకడానికి ఇది ఘనంగా ధ్వనించే పేరు. వేదకాలం ప్రారంభదశలలో (తక్కిన ప్రాచీన దేశాలలో వలె) ఇక్కడ కూడా పురుష మేధాలు జరుగుతూ వుండేవని వ్రాసింది ఒక మ్లేచ్ఛుడు కాదు, ఒక హిందూపండితుడే. ఆయన రాజేంద్రలాల్ మిత్ర.

కాగా, అది ఏ యజ్ఞమైనా, యాగమైనా సోమరసం లేకుండా బహుశా జరిగేది కాదు. ప్రత్యేకించి సోమయజ్ఞాలైన ఏడింటిలో సోమరసానికి అగ్రప్రాధాన్యం వుండేదని చెప్పనక్కరలేదు. ఈ పీఠిక నాల్గవ ప్రకరణంలో ఋగ్వేదంలో "కొట్ట వచ్చినట్టుగా కానవచ్చేవి దార్శనికసత్యాలు కావు. హత్యల ప్రశంసలు, హంతకుల సంస్తవాలు" అని నేను వ్రాశాను. వాటి తర్వాత ఋగ్వేదంలో ప్రాధాన్యం వహించేవి సోమరసం సంకీర్తనలే, సోమయజ్ఞాల మహిమలే! ఇది కేవలం నా మాట మాత్రమే కాదు, ఎ.బి. కీత్ మాట కూడా. ఋగ్వేదం తొమ్మిదవ మండలం పూర్తిగా సోమయజ్ఞాన్ని గురించే. తక్కిన

మండలాలలో ఆరు చోట్ల దాని ప్రస్తావన వున్నది. పైగా, ఇంద్రునితో కలిపి, అగ్నిదేవునితో కలిపి, పూషునితో కలిపి, రుద్రునితో కలిపి సోమస్తోత్రాలు పెక్కుచోట్ల వున్నాయి. ఇది సోమదేవుని (చంద్రుని గురించిన స్తోత్రాలు కావచ్చు, లేదా సోమరసాన్ని గురించినవి కావచ్చు. ఈ కారణాన ఋగ్వేదంలో మొత్తం ఎన్ని చోట్ల సోమరసం ప్రత్యక్షమౌతున్నదో తేల్చి చెప్పలేమన్న తీర్మానానికి కీత్ వచ్చాడు.

సోమలత, లేదా సోమవల్లి ఏదో నిర్ధారణగా ఈనాడు మనకు తెలియదు. మాక్స్ ముల్లర్, రూడల్ఫ్, ఫాన్ రాల్, జె.జి. బేకర్ మున్నగువారు 1884లో ఈ విషయమై దీర్ఘచర్చ జరిపి, ఏకాభిప్రాయానికి రాలేక పోయారు. క్రిస్టియన్ లా సెన్, ఆల్ ఫ్రెడ్ హిల్ బ్రాంట్, రాజేంద్రలాల్ మిత్రా ప్రభృతుల మధ్య కూడా ఈ విషయమై విభిన్నాభిప్రాయాలే. ఇందువల్ల ప్రస్తుతం సోమవల్లిని గుర్తించడం బహుశా సాధ్యం కాదన్న అభిప్రాయానికి మెక్డానెల్, కీలు వచ్చారు. ' అయితే, మన తెలుగు నిఘంటుకారులు మాత్రం (ఒక్క సి.పి. బ్రౌన్ మినహాగా) దీన్ని గురించి గట్టిగా ఆలోచనైనా చేయకుండా "తిప్పతీగ', 'పొన్నగంటి" అనే అర్థాలు వ్రాసివేశారు.

సోమవల్లి ఋగ్వేదకాలంలోనే పుష్కలంగా గాని, సులభంగా గాని లభించేది కాదేమో! అందువల్లనే దానికి ప్రత్యేకపు విలువ వుండేదేమో! అది పర్వత ప్రాంతాలలోనే (ముఖ్యంగా హిమాలయాలలోనే) ఏపుగా పెరిగేదట. దాన్ని కిరాతులనుంచి ఆర్యులు కొంటూవుండే వారట. కిరాతులను హీనంగా చూచినా, వారిపట్ల హేయంగా ప్రవర్తించినా, వారినుంచి కొన్న సోమవల్లిని ఆర్యులు మహాపవిత్రమైనదాన్నిగా పరిగణించేవారు. అనంత, అమృత, ఇందులేఖ, కుండలి, కుల్వ, చంద్రిక, చక్రలక్షణ, ఛిన్న, ఛిన్నరుహ, జీవంతి, తంత్రిక, దేవ నిర్మిత, నిర్జర, మధుక, మధుపర్జి, వత్సాదని, వయస్థ, విశల్యాది ఘనాఘనమైన పేర్లతో పిలుస్తూ, దాన్ని వారు కళ్ళకు అద్దుకొంటూ వుండేవారు.

ఎంతైనా వెచ్చించి, ఏదో ఒక విధంగా సోమవల్లిని కొనవలసిందే; దాన్ని వినియోగించి, ప్రతిగృహస్థు తన శక్త్యనుసారం ఏదో ఒక యజ్ఞాన్ని జరిపించవలసిందే. ప్రత్యేకించి సోమయజ్ఞాలు ఏడు వుండేవి. అవి :-
అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్ష్యము, షోడసి, అతిరాత్రం, ఆప్తోర్యామం, వాజపేయం. వీటికంటె రాజసూయం, అశ్వమేధం గొప్ప యజ్ఞాలు కాబట్టి, వీటి సందర్భంలో యాజకు లేమి, ఋత్విజు లేమి సోమంలో ఓలలాడే వారని అనుకోవచ్చు.

సోమం మద్యం కాదని కొందరి వాదం. వేదకాలంలో మద్యాన్ని "సుర" అనేవారట. ఒక సుర మాత్రమే కాదు, దానితోపాటు "మధువు వుండేది, "పానం" వుండేది, "పరిస్రుతి వుండేది. "సౌవీరం" వేదకాలంలో లేదను కొంటే, పురాణాల కాలానికి అది వాడుకలోకి వచ్చింది. ఏదో ఒక సందర్భం కల్పించుకొని, ఈ మద్యా లన్నింటిని సేవిస్తూనే వుండేవారు, తక్కినవాటికి లేని ఘనత ఏదో సోమానికి వుండేది. దాన్ని నీళ్ళతో, పాలతో, పెరుగుతో, నేతితో, తేనెతో కలిపి తాగుతూ వుండేవారు. అందువల్ల అది సురవలె ఎక్కువ మత్తు కలిగించేది కాదని అనుకోవాలి. దాన్ని పోల్చవలసింది బహుశా బీర్, వైన్, షాంపేన్ వగైరాలతో; విస్కీ, బ్రాందీ, రమ్, వోడ్కా వగైరాలతో కాదు. సురను ఋగ్వేదంలో కొన్ని చోట్ల ప్రశంసించారు, కొన్ని చోట్ల నిరసించారు. దాన్ని నిరసించడానికి ఒక ముఖ్యకారణం ద్యూతగృహాలలో (వీటిని "సభలు" అనేవారు) దాన్ని మితిమీరి సేవించడం కావచ్చు. అయితే, కొన్ని యజ్ఞాలలో సోమంతోపాటు సురకు స్థానం వుండేది; సౌతామణి యజ్ఞంలో కేవలం సురనే వినియోగించేవారు.

మాంసం లేనిదే మద్యం రుచి సగం చస్తుంది. ఏదో ఒక రూపంలో మద్యపానం విశేషంగా జరిగిన వేదకాలంలో మాంసభక్షణ సయితం విశేషంగా కొనసాగిందని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. గోమాంసం సమేతంగా అన్ని మాంసాలను అప్పటిలో ఆరగించేవారు. ఇవి ఒక పాషండుని పాపపు మాటలు కావు; సి. కున్హన్ రాజా వ్రాసిన మాటలు. ఆయన కేరళ రాజకుటుంబానికి చెందిన వాడు. సాంప్రదాయిక పద్ధతులలో సంస్కృతంలో పాండిత్యం సంపాదించిన పిమ్మట మద్రాసు, ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలలో చదివి, డాక్టరేట్ పొందినట్టివాడు. వైదిక వాఙ్మయంలో ప్రత్యేక పరిశోధనలు జరిపి, కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకొన్నట్టివాడు. మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలలోనే కాక, టెహరాన్ యూనివర్సిటీలో సయితం సంస్కృతం ప్రొఫెసర్ గా పనిచేసినట్టి వాడు. వేదాలను గురించి, వేదకాలం ప్రజలను గురించి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడేవారి మాటలకు విరుద్ధంగా, ఆర్షవిజ్ఞానాన్ని గురించి, దానిలోగల ఆధ్యాత్మిక సంపదను గురించి లేనిపోని గొప్పలకు పోయేవారి వ్రాతలకు వ్యతిరేకంగా, ఆయన అనేక విషయాలు వ్రాశారు. ఆయన వ్రాసిన ప్రతిదానితో నేను ఏకీభవించలేను గాని, కొన్ని నిజాలను కుండ బద్దలగొట్టినట్టు చెప్పినందుకు ఆయనను నేను హర్షిస్తాను. వాటిలో (ఆయన పలుకులలోనే ఒక నిజమిది; "వారు (వేదకాలంనాటివారు) తినేవారు, తాగేవారు; వారు మాంసం తినేవారు, మద్యం తాగేవారు, గోమాంసాన్ని కూడా వారు తినేవారు."

తక్కినవారు తృప్తిగా తినగా, ఋషు లేమో సుష్టుగా తినేవారు; తక్కిన వారు తృప్తిగా తాగగా, ఋషు లేమో మస్తుగా తాగేవారు. ముఖ్యంగా సోమపానం వారికి "మౌనేయ ఉన్మాదం" కలిగించేది. తైత్తిరీయోపనిషత్తు దాన్ని "బ్రహ్మానందం"గా అభివర్ణించింది. " అందువల్లనే కావచ్చు: వేదాలను "అపౌరుషేయా" లన్నారు. అన్నట్టు, పరమేశ్వరుడు చెప్పిన దాన్ని ఋషులు చెవి ద్వారా విని, నోటి వెంట పలికేవారు కారట; కంటి ద్వారా చూచి, నోటివెంట పలికేవారట. అందువల్లనే వారు "మంత్రద్రష్ట"లట; అందువల్లనే వారిద్వారా మనకు సంక్రమించినట్టివి "దార్శనిక శాస్త్రాలట!

ఏమైనా, బ్రహ్మానందంలో పడి, ఋగ్వేదఋషులు కోరింది ముక్తిని కాదు, భుక్తినే; మోక్షాన్ని కాదు, మోదాన్నే; జన్మరాహిత్యాన్ని కాదు, జగతిలో సర్వసౌఖ్యానుభూతినే. తిరిగి ఇవి నా మాటలు కావు; కున్హన్ రాజా మాటలు. "ఇది ద్రవ్యం (మ్యాటర్), అది ఆత్మ (స్పిరిట్" అనే విభేదాన్ని ఋగ్వేదం చేయలేదని ఆయన వివరించాడు.
"జీవంతో కూడిన ద్రవ్యమే, లేదా ద్రవ్యంతో కూడిన జీవమే" ఋగ్వేదానికి తెలుసునని ఆయన విశదీకరించాడు. ఈ జగత్తులోనే మానవుడు జన్మసాఫల్యాన్ని పొందగలడని, ఇందుకోసం పరలోకాలకు పయనించ నక్కర లేదని ఆయన ఉద్ఘాటించాడు. "వేదసంస్కృతి సారాంశాన్ని చెప్పవలసిందిగా నన్ను ప్రశ్నిస్తే నా ప్రత్యుత్తరం: "ఈ సుందర జగత్తులో సుఖమయజీవితం" అని ఆయన ఉద్ఘోషించాడు.

కున్హన్ రాజా చెప్పడం దేనికి? ఋగ్వేదాన్ని ఒకసారి తిరగవేస్తే మనకే, తెలుస్తుంది - ఋషుల యజ్ఞాలు, యాగాలు, క్రతువులు మొదలైన వన్నీ ఐశ్వర్యం కోసమని, ఆరోగ్యం కోసమని, ఆయుర్దాయం కోసమని. ఐశ్వర్యాన్ని కోరినప్పుడు వారు ఆవులు కావా లన్నారు, గుట్టాలు కావాలన్నారు, పాడి కావాలన్నారు, పంట కావా లన్నారు, సంతానం కావా లన్నారు, అస్త్రశస్త్రాలు కావా లన్నారు, రథాలు కావా లన్నారు, అన్నింటికంటే ముఖ్యంగా దాసులను, దస్యులను, పణులను, అసురులను, అన్యులను వధించి, వారి సిరిసంపత్తులను దోచుకోగల బలదర్పాలు కావా లన్నారు. ఆరోగ్యం విషయంలో అన్ని రుగ్మతలనుంచి రక్షణ కావా లన్నారు. వజ్రదేహాలు కావా లన్నారు, అరిభీకరత్వం కావా లన్నారు. ఆయుర్దాయాన్ని కోరినప్పుడు "నూరు హిమాల" పాటు జీవితం కావా లన్నారు. అంతే తప్ప "ఈ జగం మిధ్య" అనలేదు. "ఈ బ్రతుకు బుద్బుదప్రాయం" అనలేదు. ఆ సిద్ధాంతాలను ప్రతిపాదించినవారు ఉపనిషత్తుల ఋషులు. వారిలో అతి ముఖ్యుడైన యాజ్ఞవల్క్యుడు పారమార్థికసత్యంగా "ఆత్మే సర్వస్వం" అని జనకమహారాజుకు బోధించాడు. అయితే, పారమార్థికసత్యం

కడుపు నింపదు కాబట్టి, వ్యావహారికసత్యాన్ని పాటించి, ఆ మహారాజునుంచి పదివేల గోవులను దానంగా పుచ్చుకొన్నాడు. వాటిని ఉత్తినే పుచ్చుకొనడమైనా కాదు, ఒక్కొక్క కొమ్ముకు పదేసి పసిడి మాడలు కట్టించుకొని మరీ పుచ్చుకొన్నాడు! "తన కాలంలో యాజ్ఞవల్క్యుని మించిన వేదాంతి లేడు; అతడిని మించిన ధనాశాపరుడు సయితం లేడు" అని దేవీప్రసాద్ చటోపాధ్యాయ వ్రాసింది అక్షరాలా సత్యం,

పేరుకు ఉభయులూ ఋషులే అయినా, ఋగ్వేద కాలంనాటి ఋషి తాత్త్విక దృక్పథానికి, ఉపనిషత్తుల కాలంనాటి ఋషి దృక్పథానికి విశేషవ్యత్యాసం గోచరిస్తుంది. పురాణాల కాలంనాటికి ఈ వ్యత్యాసం మరింత పెరుగుతుంది. ఆర్థిక, సాంఘిక వ్యవస్థలలో వచ్చిన విస్తృత పరిణామాలు ఇందు కొక కారణం; ఆర్యేతరులతో ఆర్యుల నిత్య సంఘర్షణవలె నిత్యసాహచర్యం మరొక కారణం. ఇక్కడికి వచ్చినప్పుడు ఆర్యులు గోపాలకులు. ధనమంటే వారికి గోధనమే. గోవులే వారికి "కరెన్సీ" అంటే ఆశ్చర్యంగా తోచవచ్చు గాని, అది చారిత్రక సత్యం. "గోపతి" అంటే వారికి ఆబోతు మాత్రమే కాదు, భూపతితోపాటు సూర్యచంద్రులు, మరికొందరు దేవతలు కూడా. "గోమేథం" అంటే యజ్ఞం. "గోఘ్నుడు" అంటే అతిథి. "గోత్రం" అంటే ఆదిలో గోగణం లేదా గోశాల; కాలక్రమాన కులం, వంశం, ఋషిసంతతి దానికి రూఢార్థాలుగా పరిణమించాయి. ఋగ్వేదకాలం ప్రారంభదశలలో గోపాలనకున్న ప్రాధాన్యానికి ఇట్టి నిదర్శనాలు కొన్ని వందలు చూపించవచ్చు. ఉపనిషత్తుల కాలానికి ధన మంటే కేవలం గోధనమే కాక, బంగారం కూడా. అందువల్లనే జనకమహారాజు నుంచి పదివేల గోవులతోపాటు, ఇరవై వేల పసిడి మాడలను కూడా యాజ్ఞవల్క్యుడు దక్షిణగా పుచ్చుకొన్నాడు. నాటికి గోపాలన ప్రాధాన్యాన్ని వ్యవసాయం కొంతవరకు తగ్గించింది. ఎక్కడ పచ్చిక బీడు లుంటే అక్కడికి తమ నివాసాలను మార్చడాన్ని ఆర్యులు తగ్గించారు; గ్రామాలలో స్థిరపడిపోవడం సాగించారు; గ్రామాలు పట్టణాలుగా పెంపొందడం ప్రారంభమైంది. చిన్న తెగలు పెద్ద తెగలుగా కలియడం, పెద్ద తెగలు విడివిడి రాజ్యాలుగా నెలకొనడం మొదలైన మార్పులు కూడా జరిగాయి.

ఆర్థిక, సాంఘిక వ్యవస్థలో ఈ పరివర్తనల సరసనే భావసరళిలో సయితం కొత్త ధోరణులు ద్యోతక మైనాయి. ఋగ్వేద కాలంనాటి మతం (మానవ వికాస శాస్త్రజ్ఞుల పరిభాషలో) "మ్యాజిక్". వేటను గురించిన చిత్రాలను తన గుహలో చిత్రిస్తే, వేటాడడానికి తనకు ఎక్కువగా జంతువులు దొరకగలవని ఆదిమానవుడు విశ్వసించేవాడు. ఋగ్వేదకాలంనాటి ఆర్యులు అంతకంటే నాగరికతలో కొన్ని మెట్లు పైకి వెళ్ళినట్టివారు. ఒక్కొక్క ప్రకృతిశక్తికి ఒక్కొక్క దేవతగా రూపకల్పన చేసుకొనడం; మంత్రశక్తితో కోరిన దేవతలను ఆవాహన చేయగలమని, మద్య మాంసాల నైవేద్యంతో సంతృప్తి పరచి, వారిచేత అభీష్టకార్యాలన్నింటిని చేయించుకొనగలమని నమ్మడం

ఇంతవరకు వారు ఎదిగివచ్చారు. మానవ నాగరికత చరిత్రను పరిశోధించిన పెక్కుమంది పండితుల తీర్మానం ప్రకారం, ఆర్యుల మతవిశ్వాసాలకు పూర్తిగా భిన్నమైనట్టివి వారు ఇక్కడికి చేరినప్పుడు అనార్యజాతులలో ప్రచారంలో వుండేవి. ఉదాహరణకు, కర్మసిద్ధాంతం ఆర్యేతరం; జన్మపునర్జన్మల సిద్ధాంతం ఆర్యేతరం; సర్వసంగపరిత్యాగం ఆర్యేతరం; యతుల వ్యవస్థ ఆర్యేతరం; తపస్సు ఆర్యేతరం; యోగశాస్త్రం ఆర్యేతరం; తాంత్రిక విద్యలు ఆర్యేతరం; ఫల, పత్ర, పుష్ప, తోయాలతో పూజావిధి ఆర్యేతరం; దేవాలయాలు, విగ్రహారాధన ఆర్యేతరం; అవతారసిద్ధాంతం ఆర్యేతరం; ఒక్కమాటలో, ఈనాడు హిందూమతంలో ముఖ్యాంశాలుగా చెల్లుతున్న అనేక విశ్వాసాలేమి, దానికి ప్రధానాంగాలుగా చెల్లుతున్న అనేక ఆచారవ్యవహారా లేమి ఆర్యేతరం. ఇక్కడికి వచ్చిన కొత్తలో ఆర్యేతరమైన ప్రతిదాన్నీ ఆర్యులు నిరసించినా, నిందించినా నిర్మూలించడానికి ప్రయత్నించినా, నెమ్మది నెమ్మదిగా ఆర్యేతర విశ్వాసాలను, జీవిత విధానాన్ని పంచుకొనడం ప్రారంభించారు. యతులపై ఇంద్రుడు తన కుక్కలను ఉసిగొలిపి, వారిని చంపించినట్టు ఋగ్వేదం చెబుతున్నది. 14 రామాయణ కాలం వరకు యతులపట్ల ఆర్యఋషులకు వైరభావం సమసి పోలేదని, శంబుకుడు యతి కనుకనే, అతడిని

రామునిచే వారు చిత్రవధ చేయించారని నేను నమ్ముతున్నాను. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. వైదికఋషులతో ఔపనిషద ఋషులకు, వారితో పౌరాణిక ఋషులకు సామ్యం చాలావరకు ఒక్క పేరులోనే!

పౌరాణిక ఋషు లందరిని గురించి కాక, రామాయణ ఋషులను గురించి మాత్రమే కొంత ప్రస్తావించి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. ఋగ్వేదంలో మనకు తగిలే అగస్త్యుడు, వసిష్ఠుడు. రామాయణంలో ప్రముఖపాత్ర వహిస్తారు. అయితే, వారే వీరు కారు; ఆ మూలపురుషుల వంశానికి చెందినవారు. ఆ మూలపురుషులిద్దరి జనన వృత్తాంతం ప్రసక్తిని ఇంతకుముందు ఒక చోట నేను తెచ్చాను. అశ్లీలమైనదిగా తోచే ఆ వృత్తాంతం వెనుక ఒక చారిత్రకసత్యం దాగివున్నట్టు డి.డి. కోశాంబి వ్రాశాడు. సుమేరియన్, బాబిలోనియన్, అసీరియన్ నాగరికతలలోవలె హరప్పన్ నాగరికతలో సయితం దేవతల సేవకై దేవదాసీలను నియోగించేవారట. అప్పటిలో వారిని అప్సరస లనేవారట. తండ్రి ఎవరో నిర్ధారణగా తెలియనప్పుడు ఈ అప్సరసల సంతానాన్ని "కుంభసంభవు" లనేవారట. కోశాంబి వివరణ ప్రకారం, మొహెంజొదారో త్రవ్వకాలలో బయల్పడినట్టిది కేవలం స్నానపానాదులకై ఉద్దేశించబడిన తటాకం కాదు; అది మతసంబంధమైన పుష్కరిణి. దాని అంచులలోని గదులు అప్సరసల శయ్యామందిరాలు. అగస్త్య వసిష్ఠుల జన్మ స్థానాలు ఆ మందిరాలే అని కోశాంబి చేసిన సూచన అసంబద్ధమైనదిగా నామట్టుకు నాకు ఎంతమాత్రం అనిపించడం లేదు. హరప్పన్ నాగరికతకు సంబంధించిన శిల్పాలు బహు స్వల్పంగానే లభించాయి. వాటిలో ఒకటి పూజారి శిల్పం కావడం, మరొకటి అప్సరస శిల్పం కావడం ప్రత్యేకించి గమనార్హమైన విషయంగా కోశాంబి సూచనను చదివిన మీదట నాకు స్ఫురిస్తున్నది.

విశ్వామిత్రవంశానికి మూలపురుషుని గురించి కూడా కోశాంబి మౌలికమైన కొన్ని భావాలను వెల్లడించాడు. వాటి వివరాలలోకి వెళ్ళక, ఒకే ఒక్క మాట చెప్పి సరిపుచ్చుతాను. కోశాంబి పరిశోధనల ప్రకారం గోత్ర ఋషులు ఎనిమిది మందిలో ఒక్క విశ్వామిత్రుడే స్వచ్ఛమైన ఆర్యుడు; తక్కినవారు అనార్యులు, లేదా ఆర్య, అనార్య జాతులవారి మిశ్రమసంతానం. గోత్రాల బండారాన్ని బయట పెడుతూ మరింత విపులంగా ఆయన వ్రాసిన ఒక పరిశోధక వ్యాసం వున్నది. కోరినవారు దాన్ని చదువుకోవచ్చు.
అగస్త్య, వసిష్ఠ, విశ్వామిత్రులు గాని, అత్రి, భరద్వాజులు గాని సన్యాసులు కారు, సంసారులే. శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, ధర్మభృత్తు మున్నగువారు సంసారులని రామాయణం స్పష్టంగా చెప్పక పోయినా, వారు సయితం సన్యాసులైనట్టు తోచదు. వేదాలలోగాని, బ్రాహ్మణాలలోగాని, దశోపనిషత్తులలోగాని "సన్యాసి", "పరివ్రాజకుడు" అనే మాటలు కనబడవు. అప్పటిలో వర్ణాలు నాలుగైనా, ఆశ్రమాలు మూడు మాత్రమే. తన జీవితం చివరిఘట్టంలో సంసారాన్ని మరి విడిచి పెట్ట గోరినప్పుడు యాజ్ఞవల్క్యుడు తన భార్య లిద్దరితో - మైత్రేయితో, కాత్యాయినితో - తాను సన్యాసాశ్రమంలో ప్రవేశించబోతున్నట్టు చెప్పడు. బౌద్ధమతాన్ని అరికట్టడానికి కల్పించబడినట్టిదే సన్యాసాశ్రమం.

ఏమైనా అత్రి, అగస్త్యాదుల విషయంలో రామాయణం "ఋషి", "ముని", "తాపసి" అనే వాటిని పర్యాయపదాలుగా ప్రయోగించింది. ఈ పదాలమధ్య అర్థ భేదాలు లేవా? కేవలం ఋషినే తీసుకొన్నా, వేదాల కాలంలో అతడు యజ్ఞయాగాలను చేసేవాడు; ఉపనిషత్తులకాలం వచ్చేసరికి యజ్ఞయాగాలను విరమించి, వాదోప వాదాలపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాడు. (యూరోపియన్ తత్త్వశాస్త్ర పరిభాషలో ఉపనిషత్తుల ఋషులు "సోఫిస్టులు"). కాగా ముని లనేవారు మౌనాన్ని పాటిస్తూ, ఏదో మంత్రాన్ని జపిస్తూ పోయేవారు; తాపసు లనేవారు శరీర కేశాలద్వారా నిర్లిప్తతను సాధించడానికి యత్నించేవారు. విభిన్నమైన ఈ ఆధ్యాత్మికసాధనలను పరిపాలించేవారిని "ఒకే కాడి కింద కట్టడం" ఎంతవరకు భావ్యం? ఇంతేకాక, దండకారణ్యంలోని ఆర్యులను వానప్రస్థులుగా పెక్కుచోట్ల రామాయణం పేర్కొంటున్నది. వానప్రస్థాశ్రమాన్ని వనాలలోనే గడపాలంటే, ఆర్యప్రాంతాలలో అవిలేనట్టు దండకారణ్యానికే ఎందుకు వెళ్ళాలి? తమ కథనం ప్రకారమే

అక్కడివారు ఘోర రాక్షసులు, నరమాంసభక్షకులు. వారి మధ్యకు కావాలని వెళ్ళడం దేనికి? ప్రాణాపాయాన్ని ఆహ్వానించడం దేనికి?

ఇన్ని ప్రశ్నలకు అవకాశ మివ్వడంతో పాటు, దండకారణ్యంలోని ఋషులనుగురించి రామాయణం వింతలను, విడ్డూరాలను పెక్కింటిని పేర్కొంటున్నది. వైఖానసులనే ఋషులు బ్రహ్మదేవుని గోళ్ళనుంచి పుట్టినవారట; వాలఖిల్యులు ఆయన రోమాలనుంచి పుట్టినవారట. పోతే, కొందరు ఋషులు చంద్రసూర్యుల కిరణాలనే దాహంగా పుచ్చుకొంటారట. కొందరు. ఆకులనే ఆహారంగా వినియోగిస్తారట. కొందరు గొంతువరకు నీళ్ళలో నిలబడి తపస్సు చేయగా, మరికొందరు ఎల్లప్పుడు తడిబట్టలతోనే వుంటారట. కొందరు అసలు నిద్ర పోరట; మరికొందరు రొమ్ముపైకి, లేదా భుజాల పైకి తలవాల్చి నిద్రపోతారట. కొందరు పంచాగ్నుల మధ్యలో తిష్ఠవేసి తపస్సు చేస్తారట. (ఆరణ్యకాండ, ఆరవ సర్గ). ఆధ్యాత్మికోన్నతిని కోరి, ఇన్ని కఠోర సాధనలను చేసినా, వీరు ఆయుధాలను విసర్జించినట్టు కనబడదు. విశ్వామిత్రునికి తెలియని అస్త్రశస్త్రాలు లేవట. కావాలంటే, కొత్త వాటిని ఆయన పుట్టించ గలడట (బాలకాండ, 21వ సర్గ). అగస్త్యుడు విష్ణుమూర్తి విల్లును, బ్రహ్మదేవుని బాణాలను, ఇంద్రుని కత్తిని, అమ్ముల పొదులను రామునికి బహూకరించాడట (ఆరణ్యకాండ, 12వ సర్గ). పైగా, సకల దివ్యశక్తులు ఈ ఋషుల కున్నాయి. వారు త్రికాలజ్ఞులు. ఎంతటి శాపమైనా తగిలించగలరు. అయినప్పుడు రాక్షసులకు ఏదో శాపం తగిలిస్తే, తమకు వారి పీడ వదిలేది కాదా? ఆ పని చేయక రాముని రక్షణ కోరడం దేనికి? చేతులు జోడించి, “ఓ విస్తార కీర్తిగల రాముడా! మమ్ము నందఱను నీవు రక్షించు వాడవు గావున, మాచే బూజింపను గారవింపను దగినవాడవు. రాజు దుష్టులను శిక్షించి, శిష్టులను బాలించువాడు గాన దండ్రితో సమానుడు. నృపాలుడు దేవేంద్రుని నాల్గవ యంశమునను, తక్కిన లోకపాలుర యంశమునను బుట్టి జనులను బాలించు చున్నాడు గావున, నృపాలుడు జనుల పొగడ్తల గైకొనుచు, మేలి భోగముల ననుభవించుచున్నాడు. అట్లే నీదేశ వాసులమైన మేము నీచే గాపాడ దగినవారము. సకల జనముల బాలించు నీ వరణ్యవాసివైనను; పురవాసివైనను మా యేలికవు. మే మన్ననో యాయుధములను విడిచి, కోపము నడచుకొని, యింద్రియముల గెల్చినవారమై, తపస్సే ధనముగా నెంచి, యా తపోధనమును గడించుచున్నారము. మేము మీ బిడ్డల వంటివారము. కాబట్టి నీవు మమ్మెల్లప్పుడు రక్షింపవలయును” అని ఎందుకు మొరపెట్టుకోవాలి? (ఆరణ్యకాండ, ఒకటవ సర్గ). ఇంతటితో సరిపుచ్చక “మమ్ములను సంరక్షించడంలో నీ ధర్మాన్ని నీవు పరిపాలిస్తే, మా తపఃఫలంలో నాల్గవ వంతు నీకు దక్కుతుంది” అని ఎందుకు ఆశ చూపించాలి? (ఆరణ్యకాండ. ఆరవ సర్గ). చిత్రకూట పర్వతం వద్ద సీతారామ లక్ష్మణులు ప్రశాంతంగా కాలం గడుపుతూ వుండగా “మీ రిక్కడ వుంటే, మాకు రాక్షసులపీడ హెచ్చగల”దని చెప్పి, వారిని మరింత దక్షిణదిశకు (మరింతగా రాక్షసుల మధ్యకు) ఎందుకు పంపించాలి? దీనిలో పెద్ద కుట్ర లేదా? ఈ కుట్రను ఖరదూషణుల వధానంతరం ఋషులు స్వయంగానే వెల్లడించలేదా? సందర్భంలో వారి పలుకులివి : “రామా! యిక్కార్యము నిమిత్తమే, పురందరుడు, పాకశాసనుడు, గొప్ప వెలుగు గలవాడునైన దేవేంద్రుడు పున్నెముల నొసగు శరభంగాశ్రమమునకు వచ్చియుండెను. ఓ రాఘవా! పాపంపు బనులొనర్చు నీ క్రూరరాక్షసు వధము నిమిత్తమే మహర్షులందఱు ని న్నుపాయముచే నిచ్చటికి జేరునల్గొనర్చిరి. దశరథనందనా! మేము తలపెట్టిన యిక్కార్య మీడేరిన దయ్యెను. ఇక మహర్షులీ దండకయందలి యాశ్రమములందు స్వవిహితకృత్యముల నింపుగా జేయగలరు.” ఈ పలుకులను పురస్కరించుకొని, చిత్రకూటం నుంచి పంచవటికి రాముని తరలించడంలో ఋషులు పెద్ద కుట్ర పన్నినారని అమృతలింగం చేసిన ఆరోపణ పూర్తిగా సహేతుకమైనది కాదా?

భక్తులవలె కాక, మేధావులవలె రామాయణాన్ని చదవగలవారికి ఒక ముఖ్య విషయం ఆకళింపుకు రాకమానదు. మనపై రామాయణ ప్రభావం తగ్గనంతవరకు మనమధ్య బాబాలు, భగవాన్లు, అమ్మలు, అమ్మమ్మలు తలయెత్తుతూనే వుంటారు; మూఢమార్గం వెంట మనను నడుపుతూ, నిలువుదోపిడి చేస్తూనే వుంటారు.

ఋషుల కుట్రలో రాముని పాత్ర

"ఋషు లెవరు?" అనే ప్రకరణంలోనే యజ్ఞయాగాదుల నెపంతో వారు దండకారణ్యంలో ఆశ్రమాలను ఎందుకు నెలకొల్పారో వివరించాలని ఆదిలో నే ననుకొన్నాను. కాని, ఆ ఘట్టాన్ని చేరేసరికి దాన్ని గురించి చెప్పవలసింది చాలా వున్నట్టు తోచింది. అందువల్ల ఒక ప్రకరణాన్ని అందుకు ప్రత్యేకిస్తున్నాను.

గుఱ్ఱాలను పూన్చిన రథాలతో, కొత్త తరహా గొడ్డళ్ళతో ఇక్కడకు చేరిన ఆర్యులు ధ్వంసం చేసింది హరప్పన్ నాగరికతకు చెందిన పురాలను మాత్రమే కాదు, దాని వ్యావసాయిక వ్యవస్థను కూడా. అందువల్లనే వారి దేవాధిదేవుడైన ఇంద్రునికి "పురందరుడు" అనే దానితోపాటు "వృత్రహుడు" అనేది కూడా ఒక బిరుదనామ మైంది. "పురందరః" అనే పదానికి ఉశత్రుపురములను ప్రక్కలించిన వాడు" అని "గురుబాలప్రబోధిని" స్పష్టంగా అర్థం చెబుతున్నది. ఇంద్రుడు ప్రక్కలించినట్టివి హరప్ప, మొహెంజొదారో, చాన్హుదారో, కాళీ బంగన్, లోథాల్ మొదలైన పురాలు. వీటిలో తక్కినవి హరప్ప, మొహెంజొదారోలవలె పెద్దవి కాకపోవచ్చుగాని, అవి సయితం పురాలే. ఇంద్రుడు నాశనం చేసినట్టి పురాలలో ఒకటిగా ఋగ్వేదం పేర్కొంటున్న "హరియూపియా" అనేది హరప్ప కావచ్చు; అగ్నిదేవుడు భస్మీపటలం చేసినట్టు ఋగ్వేదమే చెబుతున్న "నార్మిణి" మొహెంజొదారో కావచ్చు.' అన్నట్టు "సూర్యరాయాంధ్ర నిఘంటువు" ప్రకారం, "పురందరు"డంటే ఇంద్రునితో పాటు అగ్నిదేవుడు కూడా. పురాల విధ్వంసనకార్య క్రమంలో వారిద్దరు గట్టిగా పోటీపడి వుండాలి!

నగర సంబంధమైనది నాగరికత. ఆటవికులకు నగరం నచ్చదు, నాగరికత అంతకంటె నచ్చదు. గోడలంటేనే వారికి కంపరం. అవి వారికి గోరీని గుర్తుకు తెస్తాయి. కప్పుకింద వారికి శ్వాస సరిగా ఆడదు. అందువల్ల నగరాలు తమ చేజిక్కితే, వారు చేసే మొట్టమొదటి పని వాటిని నేలమట్టం చేయడం!
వేదకాలం నాటికి నాలుగైదు వేల సంవత్సరాలు వెనకకు వెళ్ళవలసిన పని లేదు. క్రీస్తుశకం అయిదవ శతాబ్దిలో నాటికి తెలిసిన ప్రపంచంలో అధికభాగాన్ని జయించిన హూణులు నగరాలను ధ్వంసంచేసి, ఆరుబయట డేరాలు వేసుకుని, వాటిలో బ్రతుకుతూ వుండేవారు. నగరానికి, నగరవాసానికి వారు అలవాటు పడ్డానికి చాలాకాలం పట్టింది. ఋగ్వేదకాలంలో ఇక్కడికి వలసవచ్చిన ఆర్యులు ఆటవికులు కాకపోవచ్చుగాని, ఆటవిక స్థితికి ఒకటి, లేదా రెండు మెట్లు పైగా వున్నట్టివారు. అందువల్ల హరప్పన్ నగరాలను వారు నుగ్గుచేయడం వింత కాదు; నగరాలు కేంద్రాలుగా వర్తకవ్యాపారాలను కొనసాగించే వణిక్కులను (ఋగ్వేదంలో వీరిని "పణు" లన్నారు) ఊచకోత కోయడం విడ్డూరం కాదు. కాని, వ్యావసాయిక వ్యవస్థను వారెందుకు నాశనం చేశారు? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరం "వృత్రహుడు" అనే పదంలో దాగివున్నది. "గురుబాలప్రబోధిని" ఆధారంగా "వృత్రహుడు - వృత్రం హతవాన్ వృత్రాసురుని జంపినవాడు" అని సరిపెట్టుకొనడానికి వీలు లేదు. "వృత్రము" అనే పదానికి "శ్యామిక" (చీకటి), " హిమాలయం" (కొండ) అనే అర్థాలు నిఘంటువులలో వున్నాయి. కాగా, సంస్కృత భాషలో గొప్ప పండితులైన కొందరు "వృత్రము" అనే మాటకు "అవరోధం", "ఆనకట్ట" అనే అర్థాలను కూడా చెప్పవచ్చు నన్నారు. వీరి వాదాన్ని బలపరచడానికి ఋగ్వేదంలోనే ఒకచోట కృత్రిమ రోధస్సులను (గట్లు, గోడలు, చెలియలికట్టలు మున్నగువాటిని) ఇంద్రుడు తెగగొట్టగా, వాటి రాళ్ళు రథచక్రాలవలె దొర్లుకు పోయినవని, నదీజలాలు తిరిగి నిరాటంకంగా ప్రవహించాయని స్పష్టంగా వున్నది. అయినప్పుడు "వృత్రహుడు" అంటే సరైన అర్థం "ఆనకట్టలను తెగగొట్టినవాడు" అని తప్ప మరొకటి కావడానికి వీలు లేదు. వృత్రాసురుడు కొండ చరియపై నల్లని త్రాచుపామువలె పరుండివుండగా ఇంద్రుడు అతడిని వధించాడని ఋగ్వేదం చెప్పడం తిరిగి ఈ తీర్మానాన్నే బలపరుస్తున్నది.

ఆనకట్టలపై ఆర్యులకు నిర్నిమిత్తంగా ఆగ్రహం కలగలేదు. ఇప్పుడు మనం చేస్తున్నది మెట్టసాగు, లేదా పల్లంసారు. హరప్పన్ రైతులు చేసిన సాగుకు ఈ రెండు పేర్లలో ఏదీ వర్తించదు; దాన్ని ఒక కొత్త పేరుతో - "వరదసాగు" అనే పేరుతో - పిలవాలి. అప్పటిలో ఇనపకట్టు నాగళ్ళు లేవు; ఇనుమే లేనప్పుడు ఇనపకట్టు నాగళ్లు ఎలా వుంటాయి? అప్పటి నాగళ్ళకు చెకుముకి రాళ్ళ కట్టులుండేవని కొందరు చెప్పగా, అప్పటిలో నాగళ్ళు లేవని, గసికలనే ఉపయోగించే వారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏమైనా, అప్పటిలో నేలను బాగా తడిపి, ఏదో ఒక తీరులో దాన్ని దమ్ము చేయవలసి వచ్చేది. ఇందుకోసం నదులకు, వాగులకు ఎక్కడికక్కడ ఆనకట్టలు కట్టి, వాటి ప్రవాహాలను పొలాలపైకి మళ్ళించి, కొన్ని రోజులపాటు నేలను వరదనీటిలో నాన నిచ్చేవారు. అందుకే నాటి వ్యవసాయాన్ని "వరదసాగు" అనడం! ఈనాటికి కూడా బలూచ్ ప్రాంతంలో సగటున 300 గజాల పొడవుతో, ఎనిమిది అడుగుల వెడల్పుతో ఎన్నో ఆనకట్టల అవశేషాలు కనబడుతున్నాయి. హరప్పన్ కాలంనాటి ఆనకట్టలు ఇలాగే వుండేవని అనుకోవచ్చు. ప్రస్తుతం వీటి పేరు "గబ్బంచు". 6 పరగణాలకు పరగణాలే వరదనీటిలో మునిగివుంటే, ఆలమందలు ఎక్కడ మేస్తాయి? అందువల్ల పశుపాలన ప్రధాన జీవికగాగల ఆర్యులు ఆనకట్టలను తెగగొట్టేవారు. వందల, వేలసంఖ్యలో గల ఈ ఆనకట్టలను (హరప్పన్ రైతులు అడ్డుపడుతుండగా) తెగగొట్టడం ఆర్యులకు ఒక గడ్డు సమస్యగా పరిణమించి వుండాలి. ఇందువల్లనే కావచ్చు, ఋగ్వేదం మొత్తం 70 సార్లు "వృత్రహుడు"గా ఇంద్రుని స్తోత్రం చేస్తున్నది. ఈ విధ్వంసన కృషిలో ఇంద్రునికి సహాయపడినందుకు, కొన్ని కొన్ని సందర్భాలలో స్వయంగానే కార్యభారాన్ని వహించి నందుకు అగ్ని, సూర్య, సోమ దేవులను, విష్ణువును, అశ్వినులను, మరుత్తులను ఋగ్వేదం ప్రశంసిస్తున్నది." ఈ దేవతలలో కొందరు వృత్రాసురుని ధాకకు తాళలేక పలాయనం చిత్తగించినట్టు ఋగ్వేదం స్వయంగానే చెప్పడాన్ని బట్టి తమ ఆనకట్టలను కాపాడుకొనడానికి ఎంత పట్టుదలతో హరప్పన్ రైతులు పోరాడినారో మనం ఊహించుకోవచ్చు.

పైగా, వృత్రాసురుడు కేవల మొక రాక్షసుడైతే, అతడిని వధించడానికి ఆర్యదేవగణంలోని ముఖ్యులందరు ఎందుకు రంగంలోకి దిగాలి? అతడిని తిరిగి తిరిగి వధించవలసి వచ్చినదన్న అభిప్రాయాన్ని ఎందుకు కలిగించాలి? ఒక్కొక్క ఆనకట్ట ఆర్యుల కళ్ళకు ఒక నల్లని త్రాచుపామువలె కనబడివుండాలి; ఒక్కొక్కటి ఒక వృత్రాసురునివలె వారిని కలవర పెట్టివుండాలి.

ఋగ్వేదకాలం ప్రారంభంలో "వృత్రహు"డైన ఇంద్రుడు అటు పిమ్మట "శునాశీరు"డైనాడు. "ఎవనివల్ల నాగళ్ళు కదులుచున్నవో అతడు శునాశీరు'డని "గురుబాలప్రబోధిని" వివరిస్తున్నది. పశుపోషణనుంచి వ్యవసాయానికి ఆర్యులు క్రమంగా మారడాన్ని ఇది సూచిస్తున్నది. ఋగ్వేదకాలం ఉత్తరార్ధంలోనే ఈ మార్పు జరిగివుండవచ్చు. ఇందుకు బలమైన సాక్ష్యాధారాలు కొన్ని ఋగ్వేదంలోనే వున్నాయి. మరికొంత దూరం వెళ్ళినతర్వాత వాటిని పేర్కొంటాను.

పశుపోషణకోసం ఒక ఘట్టంలో ఆనకట్టలను తెగగొట్టిన ఆర్యులు మరొక ఘట్టంలో వ్యవసాయ విస్తరణకోసం అడవులను తగలబెట్టడం మొదలు పెట్టారు. సప్తసింధుప్రాంతంలో స్థిరపడిన తర్వాత వారి జనసంఖ్య పెరిగివుండాలి. ఇంతే కాక, వారి జాతికి చెందిన మరికొన్ని తెగలు ఇక్కడికి వలస వచ్చి వుండాలి. అంతట సప్తసింధు ప్రాంతం నుంచి అన్యప్రాంతాలకు విస్తరించడం వారికి అనివార్యమై వుండాలి. వారు విస్తరించగలిగింది ప్రధానంగా ప్రార్థిశకే. అది గంగా యమునల ప్రాంతం; వర్షపాతం (సప్తసింధు ప్రాంతంలోకంటె) ఎంతో అధికంగావున్న ప్రాంతం; కీకారణ్యాలతో నిండివున్న ప్రాంతం. అక్కడ వ్యవసాయం మొదలు పెట్టాలన్నా, అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొనవలెనన్నా, అందుకు మున్ముందుగా - తప్పనిసరిగా - చేయవలసిన పని అక్కడి అడవులను తగలబెట్టడమే. మరొక విధంగా ఆ పని చేయడానికి - బుల్

డోజర్ల మాట విడిచిపుచ్చండి - కనీసం ఇనప గొడ్డళ్లు అయినా నాడు లేవు. అందువల్ల అగ్ని దేవుని సహాయాన్ని అర్థించక తప్పేదికాదు.

కొన్ని వేల సంవత్సరాలు వెనుకకు వెళ్ళడం దేనికి? నలభై యేళ్ళనాడు భద్రాచలం సమీపంలోని అరణ్యాలలో కొంత భూమిని సేకరించిన ఒక మిత్రుని "ప్రస్తుతం ఏమి పండిస్తున్నారు?" అని నేను ప్రశ్నించగా "ఇంకా పైర్లు పెట్టడం వరకు రాలేదు; అడవిని తగల బెడుతున్నాను" అని జవాబు చెప్పాడు. "తగలబెట్టడానికి బదులు చెట్లను కొట్టిస్తే, కలపను అమ్ముకొనవచ్చుగదా! కనీసం కట్టెలైనా అమ్ముకోవచ్చుగదా!" అని నే ననగా, "అది కూలిదండుగ పని కాగల" దన్నాడు. 1969లో అండమాన్, నికోబార్ దీవులలో పర్యటన నిమిత్తం పార్లమెంట్ సభ్యుల బృందంలో ఒక సభ్యుని హోదాలో నేను వెళ్ళినప్పుడు అక్కడి ఉద్యోగులు మాకు చెప్పిన ఒక మాట ఈ సందర్భంలో జ్ఞాపకానికి వస్తున్నది. తూర్పు బెంగాల్ నుంచి (ఇప్పటి బంగ్లాదేశ్ నుంచి) తరలివచ్చిన కాందిశీకులను కొందరిని లిటిల్ అండమాన్ దీవికి చేర్చి, అక్కడ వారి నివాసం కోసం అడవిలో కొన్ని వేల ఎకరాలమేరను బుల్ డోజర్లతో చదును చేశారు. బుల్ డోజర్లు పెకలించిన చెట్ల మొదళ్ళను బాదులకింద కోసి గుట్టలుగుట్టలుగా పేర్చారు. ఇక్కడ మనకైతే ఆ కలప మేలిమి బంగారంతో సమానం. కాని, అక్కడి వారికి దానితో పని లేదు. అక్కడినుంచి దాన్ని తరలించడానికి వీలున్నా, అందుకు విపరీతంగా ఖర్చు చేయవలసి వస్తుంది. ఏ మద్రాసు రేవుకో, కలకత్తా రేవుకో చేర్చడం మాట విడిచి పెట్టండి; పోర్ట్ బ్లెయిర్‌కు చేర్చినా, అది దండుగ బేరమే అవుతుంది. ఎక్కడికీ కదల్చకుండా ఆ కలప గుట్టలను అక్కడనే మిగల్చగా, వాటిలో ఎలుకలు, పందికొక్కులు ఎక్కువగా చేరి, పైర్లకు చెరుపు చేస్తున్నాయి. ఈ పరిస్థితిలో అగ్నిదేవుని సహాయాన్ని తాము అర్థించక తప్పదేమో అని తాము భావిస్తున్నట్లు ప్రభుత్వాధికారులు మాకు చెప్పారు. నిర్ధారణగా నాకు తెలియదుగాని, చివరికి ఆ దేవుడే దిక్కు అయినాడేమో! అండమాన్, నికోబార్ దీవులలో నేను చూచిన అడవులను పోలినవే ఒకనాడు గంగాయమునల పీఠభూములలో వుండేవి. వాటిలోని చెట్లు నూరు, నూట యాభై అడుగుల యెత్తువరకు పెరుగుతాయి. కొన్నింటి మొదళ్ళ కైవారం పది, పదిహేను అడుగులను మించి పోతుంది. చిక్కురొక్కురుగా పెరిగిన ఆ చెట్ల కొమ్మలగుండా, ఆ కొమ్మలపైకి దట్టంగా ఎగబాకిన తీగలగుండా వెలుతురు కిందికి దిగలేదు. ఇట్టి కీకారణ్యాలలో కాలు పెట్టడం తమకు సాధ్యం కాక పోయినందునే సప్తసింధుప్రాంతంలోని ఆర్యులు గంగాయమునల పీఠభూములలోకి సరాసరిగా విస్తరించ లేదు.
ఆ పీఠభూములకు ఉత్తరదిశలో (హిమాలయ పర్వతపంక్తికి కొంచెం దిగువలో) అరణ్యాల సాంద్రత తక్కువ కాబట్టి, ఆ ప్రాంతంగుండా నేపాల్ వరకు ముందుకు చొచ్చుకు పోయారు. అక్కడినుండి దక్షిణ దిశకు మరలి, క్రమానుగతంగా గంగాయమునల తీరాలకు చేరారు. ° అరణ్యప్రాంతం నుంచి అరణ్య ప్రాంతానికి ఈ పురోగమనంలో వారికి బాసటగా నిలిచినవాడు అగ్నిదేవుడే!

ఇంతకు పూర్వమే నేను సూచించినట్టు, సప్తసింధు ప్రాంతం నుంచి ఆర్యుల విస్తరణకు అగ్నిదేవుడు విశేషంగా సహాయపడినట్టు చెప్పడానికి ఋగ్వేదంలోనే అనేక సాక్ష్యాధారా లున్నాయి. వాటిలో ఒకదాన్ని మాత్రమే ఇక్కడ పేర్కొంటాను. బహుశా నేపాల్ దిశలో విస్తరిస్తున్న కాలంలో ఋగ్వేదఋషులు ఆలమంద నడుమ గల ఆబోతుతో అరణ్యం మధ్యగల అగ్నిదేవుని పోల్చారు. వాయు దేవుని ప్రోత్సాహంతో మరింతగా అతడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నా డన్నారు.

అతడి నాల్కలు కొడవళ్ళవలె ఎండుచెట్లను ధ్వంసం చేస్తున్న వన్నారు. అతడు నడిచిన దారి కారునల్లగా మారిపోతున్న దన్నారు. ఇది అరణ్యాలను దగ్ధం చేయడాన్ని గురించిన కవిత్వమే కాదా?

మరికొంత కాలంతర్వాత అరణ్యాలను మరింతగా దగ్ధంచేస్తూ తూర్పుదిక్కుకు ఆర్యులు ఏ విధంగా విస్తరించారో శతపథ బ్రాహ్మణంలోని ఒక ఘట్టం విశదీకరిస్తున్నది. సరస్వతీనదీతీరం నుంచి తూర్పుగా ముందుకు సాగిపోతూ తన దారిలో గల ప్రాంతా లన్నింటిని అగ్నిదేవుడు పవిత్రం చేశాడట. కాని, సదానీర అనే నదిని దాటి ముందుకు వెళ్ళలేకపోయాడట. (కోసల, విదేహ రాజ్యాల సరి హద్దు లోనిది ఈ నది). అంతట విదేఘ మాధవు డనే రాజు వచ్చి, నదిని దాటడంలో అగ్నిదేవునికి ఆసరాగా నిలిచాడట. అగ్నిదేవుని స్పర్శ తగలనందున అపవిత్రమైనదిగా మిగిలిపోయినదన్న కారణాన అంతకుముందు సదానీరకు తూర్పుదిశలో బ్రాహ్మణులు నివసించేవారు కారట. అగ్ని సంస్కారంతో పవిత్రమైన ప్రాంతంగా అది మారినంతనే అక్కడ వారు నిశ్చింతగా స్థిరపడినారట. కొత్తవలస ప్రాంతాలను నెలకొల్పడానికి ముందు అక్కడి కాననాలను క్షత్రియుల సహాయంతో బ్రాహ్మణోత్తములు, ఋషిసత్తములు దగ్ధం చేసేవా రనడానికి దీన్ని ఒక తిరుగులేని తార్కాణంగా పేర్కొన్నది ఒక్క ఎ.ఎల్. బషం మాత్రమే కాదు, " భారతీయ చరిత్రకారులు పెక్కుమంది కూడా వున్నారు.

కోసలనుంచి తూర్పుదిక్కుకు ఆర్యులు విస్తరణఘట్టంలో విదేఘ మాధవుని పాత్రకు తుల్యమైనదే కోసలంనుంచి నైఋతిదిశలో వారి పురోగమన ఘట్టంలో అయోధ్యారాముని పాత్ర. దీని విశదీకరణకు పూర్వం చెప్పవలసిన విశేషాలు కొన్ని వున్నాయి. మౌర్యులకాలానికి కొంచెం ముందువరకు అరణ్యాలను దగ్ధం చేయడం ద్వారా వ్యవసాయ క్షేత్రాల విస్తరణ కొనసాగింది. వ్యవసాయాభివృద్ధి కోసం, యజ్ఞ యాగాదులకోసం అరణ్యాలలోగల ఫలపుష్పభరిత వృక్షాలనైనా రాజు దగ్ధం చేయించడం ఎంత మాత్రం దోషం కాదని వసిష్ఠ ధర్మసూత్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. కాగా, మహాభారత కాలంలో ఖాండవదహనం జరిగింది అగ్నిదేవుని అజీర్ణవ్యాధి నివారణకోసం కాదు. అర్ధరాజ్యం పేరుతో ధృతరాష్ట్రుడు పాండవుల కిచ్చినట్టిది ఇప్పటి ఢిల్లీ పరిసరాలలోని ఖాండవ వనాన్ని. దాన్ని ఖాండవప్రస్థం అని కూడా అనేవారు. అప్పటిలో తమ రాజ్యసంస్థాపనకోసం పాండవులు చేసిన మొట్ట మొదటి పని ఖాండవవనాన్ని తగలబెట్టడం. ఒక విధంగా అది ఘోర హత్యాకాండ. ఒక పక్షం రోజులపాటు అది కొనసాగింది. చిట్టచివరికి దానినుంచి ప్రాణాలతో బయటపడింది తక్షకుడు, మయుడు, నాలుగు పిచ్చుకలు మాత్రమే. మయుడు అసురుడు కాగా, తక్షకుడు నాగజాతివాడట. ఖాండవ వన దహనసందర్భంలో తన జాతివారిని సర్వనాశనం చేసినందుకే బ్రాహ్మణ వేషంతో పరీక్షిత్తు రాజప్రాసాదంలో ప్రవేశించి అతడిని తక్షకుడు చంపివుండాలి. ఇందుపై జనమేజయుడు నాగజాతివారిపై దండెత్తి వారిని చిత్రవధ చేశాడు. (ఈనాటి మన నాగసమస్య ఈనాటిది కాదని, మహాభారత కాలంనాడే ఇది తలయెత్తిందని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.)

ఎంతటి క్రౌర్యానికైనా, అమానుషత్వానికైనా సంసిద్ధపడి, అరణ్యాలను స్వప్రయోజనానికై ఆర్యులు దగ్ధం చేయడం నిలిచిపోయింది బహుశా అశోకుని కాలంలోనే కావచ్చు. యజ్ఞయాగాదులతో పాటు అరణ్యాలను భస్మీపటలం చేయడాన్ని ఆయన నిషేధించాడు. అడవులను మరి కాల్చివేస్తే, దేశానికి అనర్థాలు తప్పని పరిస్థితి అప్పటికి ఏర్పడివుండాలి. అందువల్లనే ఖాండవవన , దహనాన్ని ఒక దేవతాకార్యంగా ఒకచోట అభివర్ణించిన మహాభారతమే అడవులకు చిచ్చు పెట్టడం మహాపాప మని మరొకచోట హెచ్చరించింది. ఈ హెచ్చరిక భీష్మ పర్వంలో వున్నది. ఈ పర్వాన్ని మహాభారతంలో దూర్చింది గుప్తరాజుల కాలంలో కావచ్చు. వర్ణాశ్రమ వ్యవస్థను బలపరచడానికే దీని ఫోర్జరీ జరిగింది. బ్రాహ్మణాధిక్యతను గురించి చెప్పదలచుకొన్న కుహనా ధర్మసూత్రాలను ఒక క్షత్రియుని నోట చెప్పించడం ఈ ఫోర్జరీకోరుల గడసరి తనాన్ని తెలుపుతున్నది.

ఇప్పుడు తిరిగి వెనుకకు వెళ్ళి పేర్కొనదగు విషయ మిది; ఈనాటికీ మత సంబంధమైన ఏదో ఒక ఆచారాన్ని, లేదా సంప్రదాయాన్ని పాటించకుండా సేద్యాన్ని ప్రారంభించరు. పూర్వకాలంలో పౌరుల నిత్యజీవితంతో మతానికి మరింతగా

ప్రమేయం వుండేది. ఋషులన్నవారు మద్యాన్ని (సోమరసాన్ని) సిద్ధపరచి, దాన్ని సేవించడాన్నే ఒక మతాచారంగా మార్చలేదా? సోమయజ్ఞమని దానికి పెద్ద పేరు పెట్టలేదా? ఏడు విధాలుగా దాన్ని జరిపేవారు కాదా? మంత్రాలతో, తంత్రాలతో ఎంత అట్టహాసంగా దాన్ని జరిపితే, అంత ఘనత తమకు దక్కగలదని భావించే వారు కాదా? అయినప్పుడు కొత్త వలస ప్రాంతాలను నెలకొల్పడానికి ముందు కొత్త వ్యవసాయ క్షేత్రాలను సంస్థాపించడానికి ముందు, ఏదో ఒక పెద్ద తంతును వారు జరపడం సహజమే కాదా? యజ్ఞయాగాదులను నిషేధించిన అశోకుడు సరిగా అదే సమయంలో అరణ్యప్రాంతాలను దగ్ధం చేయడంపై కూడా ఆంక్ష విధించడం ప్రత్యేకించి గమనార్హమైన విషయం. భగవద్గీతను పోర్జరీచేసి మహాభారతంలో దూర్చినవారే భీష్మపర్వాన్ని కూడా దానిలో ప్రక్షిప్తం చేసివుండవచ్చు. యజ్ఞ యాగాదులను భగవద్గీత నిరసించగా, అరణ్యాలను భస్మీపటలం చేయడం పాపకృత్యమని భీష్మపర్వం హెచ్చరిస్తున్నది. ఇది కూడా ప్రత్యేకించి గమనార్హమైన విషయమే!

ఇక్కడ నేను నొక్కి చెప్పగోరుతున్నది రామాయణంలో మనకు తగిలే విశ్వామిత్రుడు, భరద్వాజుడు, అత్రి, శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, అగస్త్యుడు మున్నగు ఋషులు ఆశ్రమాల పేరుతో దండకారణ్యంలో వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పినారని, వాటిని నెలకొల్పడానికి ముందు యజ్ఞయాగాదుల పేరుతో దండకారణ్యంలో విశాలప్రాంతాలను దగ్ధం చేశారని, ఇది కేవలం నా ఊహకాదని శతపథ బ్రాహ్మణాన్ని విమర్శాత్మక దృష్టితో పరిశీలిస్తే మీకు తెలుస్తుంది. ఏ యజ్ఞమైనా, ఏ యాగమైనా, దానిలో ఏవో కొన్ని బూతుమాటలు తప్పవు, బూతుపనులైనా తప్పవు. వీటికి ఆధునిక భారతీయుడు సిగ్గుతో తలవంచుకోవాలని ఎస్.ఎమ్. కుండేను పోలిన మహాపండితుడు వ్రాశాడు. కాని, ఇందుకు సంబంధించిన చర్చలోకి ఇక్కడ మనం దిగనక్కర లేదు. ఇక్కడ గమనించదగు విషయం వాజపేయం ఆదిలో పూర్తిగా అన్నపానీయాలకు సంబంధించిన యజ్ఞమని. ఇది మానవులకే కాక, దేవతలకు అన్నం పెట్టగల యజ్ఞమని ప్రజాపతి చెప్పాడట. ఈ యజ్ఞ సందర్భంలో మరుత్తుల స్తోత్రం జరుగుతుంది. మరుత్తులు కర్షకులని, కర్షకులే అన్నదాతలని శతపథ బ్రాహ్మణం స్పష్టం చేస్తున్నది.

ఇంతవరకు నేను వ్రాసిన విషయాలలో ఏకీభవించగలవారు రామరావణ యుద్ధానికి చారిత్రకాధారం ఎంతో కొంత వుంటే, దాన్ని ఆహార సేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థల సంఘర్షణగా నావలె తాము సయితం గుర్తించగలుగుతారు.
అయితే, ఇది నా “డిస్కవరీ” కాదు; ఇదివరలోనే కొందరు సరిగా ఇదే తీర్మానానికి వచ్చారు. అట్టివారిలో రొమిలా థాపర్‌ను ప్రత్యేకించి పేర్కొనాలి. గంగానది లోయకు చెందిన ఆహారోత్పత్తివర్గాలకు, వింధ్య పర్వత ప్రాంతాలలోని ఆహార సేకరణవర్గాలకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణ యుద్ధం కావచ్చునని ఆమె వ్రాసింది. ఈ యుద్ధాన్ని వింధ్య ప్రాంతం నుంచి మరింత దక్షిణంగా సింహళానికి జరపడం రామాయణాన్ని తిప్పి వ్రాసిన వారి పని కావచ్చునని ఆమె అభిప్రాయపడింది. "

నాగరికుడు కావడానికి ముందు మానవుడు రెండు వ్యవస్థలగుండా పయనించాలి. వాటిలో మొదటిది ప్రాకృతావస్థ (శావేజరీ); రెండవది బర్బరావస్థ (బార్బరిజం.) ఇంకా మొదటి వ్యవస్థను దాటనివారు ప్రపంచంలో అక్కడక్కడ కొద్ది మంది వున్నారు; రెండవ వ్యవస్థలో మిగిలినవారు ఎన్నదగు సంఖ్యలోనే వున్నారు. దండకారణ్యవాసులను (రాక్షసులన్న పేరుతో) ప్రాకృత వ్యవస్థను దాటనివారుగా కొన్నిచోట్ల రామాయణం సూచిస్తున్నది; వారు అయోధ్యావాసులను మించిపోగల నాగరికులైనట్టు మరి కొన్నిచోట్ల పేర్కొంటున్నది. కాని, నిజానికి అక్కడి వారు బర్బరావస్థకు చెందినవారు, ప్రాకృతావస్థకు చెందినవారైతే, వారు నరమాంసభక్షకులు కావాలి. కాని, నరమాంసభక్షకులుగా రామాయణం విస్పష్టంగా పేర్కొన్నట్టివారు విరధుడు, ఇల్వలుడు, వాతాపి, కబంధుడు మాత్రమే. అయితే, ఈ నల్గురికి సంబంధించిన

కథలు కేవలం పుక్కిటి పురాణాలని వాటి ముఖానే వ్రాసి పెట్టి వున్నది. తన యజ్ఞరక్షణకు రామలక్ష్మణులను పంపించవలసిందిగా కోరడానికి దశరథునివద్దకు వచ్చిన విశ్వామిత్రుడు రాక్షసులనుగురించి చేసిన నిందలలో నరమాంసభక్షణ ఒకటి కాదు (అయోధ్యాకాండ, 19వ సర్గ). చిత్రకూటం వద్ద నివసిస్తున్న ఋషులు రాక్షసులపై రామునికి చేసిన ఫిర్యాదులలో నరమాంసభక్షణ ఒకటి కాదు (అయోధ్యాకాండ, 116వ సర్గ). శరభంగాశ్రమానికి రామునివద్దకు రాయబారం వచ్చిన ఋషులైనా రాక్షసులు తమను కదిలిస్తున్నట్టు చెప్పలేదు (అరణ్యకాండ, ఆరవసw). రావణునినగరులో హనుమంతుడు చూచిన వంట పాత్రలలో "తేనెతో వండిన, మద్యంతో తడిపిన" వంటకాలే వున్నాయి కాని, నరమాంసం లేదు (సుందరకాండ, ఆరవసర్గ) నిద్రనుంచి మేల్కొనగానే కుంభకర్ణుడు తినడానికై రాసులుగా పోసిన భోజన పదార్థాలలో ఉన్నది పంది మాంసమే, దున్నమాంసమే, నరమాంసం కాదు.

(యుద్ధకాండ, 60వ సర్గ). ఇందువల్ల రాక్షసులు నరమాంస భక్షకులనడం, వారు ప్రాకృతావస్థకు చెందిన వారనడం నిరాధారమైన నిందలు మాత్రమే. రామాయణాన్ని తిరిగి జాగ్రత్తగా పరిశీలిస్తే, దండకారణ్యంలోనివారు ఆహార సేకరణ వ్యవస్థకు చెందినవారని తెలుస్తుంది. పినతల్లి కైకేయి కోర్కె ప్రకారం తాను వనవాసానికి పోనున్నట్టు తల్లి కౌసల్యకు చెబుతూ, రాము డన్న మాట దండకారణ్యంలో తాను "తేనె, గడ్డలు, దుంపలు, పండ్లు" తింటూ కాలక్షేపం చేయబోతున్నానని (అయోధ్యాకాండ, 20వ సర్గ). సరిగా ఇదే మాటను రాముడు గుహునికి సయితం చెబుతాడు (అయోధ్యాకాండ, 50వ స). గంగానదిని దాటేసరికి ఆకలిగొన్న రామలక్ష్మణులు వేటాడి తిన్నది పందిని, మనుబోతును, దుప్పిని, నల్లచారల దుప్పిని (అయోధ్యాకాండ, 52వ సర్గ). అరణ్యావాసాన్ని గడపడానికి చిత్రకూట పర్వత ప్రాంతం ఉత్తమమైనదని, "మీకు కావలసిన తేనె, దుంపలు, పండ్లు" అక్కడ సమృద్ధిగా లభిస్తాయని రామునికి భరద్వాజుడు చెబుతాడు (అయోధ్యాకాండ, 54వ సర్గ). రాముడు దండకారణ్యంలో ప్రవేశించగానే అక్కడి ఋషులు ఆయనకు అతిథి సత్కారంగా అందించినట్టివి "వన్యములైన కందమూల ఫలములు, మరియు వనమున దొరకు నానావిధాహారములు" మాత్రమే (ఆరణ్యకాండ, ఒకటవ సర్గ). పంపాసరోవరాన్ని ప్రశంసిస్తూ, కబంధుడు రామునికి చెప్పిన మాట లివి: "రాఘవా! యా సరస్సునందు రాయంచలు, నీరుకోళ్లు, క్రౌంచములు, లకుముకిపిట్టలు నీటియందు దేలుచు నింపుగా గూయు చుండును. ఆ పక్షులు తిన్నని స్వభావముగలవియై, వధమన నెట్టిదో యెఱుగవు గాన మానవులను జూచి యవి భయపడవు.

నేతిముద్దలం బోలెడి యా బలిసిన పక్షులను దినగలరు. లక్ష్మణుడు నీయెడ భక్తి గలవాడు గనుక, మంచివియు, చర్మము టెక్కలు లేనివియు, బలిసినవియు, ముండ్లు లేనివియునైన గండు చేపలను, చొటుచేపలను రొయ్య చేపలను బాణములచే గొట్టి, వాని నినుపశలాకకు గ్రుచ్చి, కాల్చి నీకు దెచ్చి ఈయగలడు. నీ వా చేపలను పంపాతీరమున గూర్చుండి భక్షించుచుండగా..." (ఆ డ, 73వ స). కాగా, వానరుల ఆహారం సయితం కందమూల ఫలాలని కిష్కింధాకాండ (37వ సర్గ) పేర్కొంటున్నది. ప్రత్యేకించి ఈ విషయమై రామాయణాన్ని పరిశీలించిన దేవరాజ ఛన్న తీర్మానం ప్రకారం లంకలో అన్నాన్ని గురించి బెదురువాటుగా కనబడే ప్రస్తావనలు ప్రక్షిప్తాలే. లంకలో వ్యవసాయం లేదు, పశుపోషణ లేదు. ఇంతే కాదు, అక్కడ చాతుర్వర్ణ్యం లేదు, వర్తకులు లేరు, విపణులు లేవు, వేశ్యాంగనలు లేరు. రావణుని రాజధానిని ఒక పురంగా రామాయణం వర్ణిస్తున్నా, అది ఏదో ఒక ఆటవికుల తెగకుచెందిన ఆవాసమని చెప్పడానికి అన్యాధారాలు దానిలో పెక్కు లున్నాయి. 1969లో నేను చూసిన కార్ నికోబార్ దీవికి కాస్తకుడియెడంగా రావణుని లంక బహుశా ఉండేది. ఈ దీవిలో ఆవులు లేవు, బట్టెలు లేవు, మేకలు, గొట్టెలైనాలేవు. అక్కడివారు పాలు, పెరుగు, వెన్న, నేయి ఉపయోగించరు. ఇండియా నడిగడ్డపై పడమటి నుంచి తూర్పుగా వెళ్ళిన కొద్దీ, ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్ళిన కొద్దీ పాలు, పెరుగు, వెన్న, నేయి ఉపయోగం తగ్గుతుంది;

వంటనూనెల ఉపయోగం పెరుగుతుంది. మానవ వికాసశాస్త్రవేత్త నిర్మల కుమార్ బోస్ చెప్పినట్టు, ఆర్యులకు నేయి లేకపోతే జరగదు, అనార్యులకు నూనె ఉంటే చాలు. ఈ కార్ నికోబార్ లోని వారు నిషాదు లట. ఇండియా నడిగడ్డపై ఇప్పుడున్న నిషాద జాతి తెగలలో ఒకదాని పేరు “కోల్". వీరికి ఈ పేరు రావడానికి కోలాన్ని (పందిని) వీరు అభిమానించడమే కావచ్చు. " ఏమైనా, కార్ నికోబార్ దీవిలో ఉన్నవి పందులు మాత్రమే. వాటి మాంసాన్నే అక్కడి వారు తింటారు. అన్నానికి బదులు "బ్రెడ్ ఫ్రూట్" అనే దాన్ని తింటారు. పోతే, మొత్తం దీవిని ఒక కొబ్బరి తోటగా చెప్పవచ్చు, కొబ్బరే వారికి ఫలహారం, కొబ్బరినీళ్ళే వారికి పాలు, కొబ్బరినూనే వారికి నేయి. నాగలి వారికి తెలియదు; సేద్యంతో వారికి నిమిత్తం లేదు. రామాయణ కాలంలో దండకారణ్యంలోని అనార్యులు (వారు నిషాదు లనుకొనడానికి ఎక్కువ ఆధారాలున్నాయి) ఈనాడు కార్ నికోబార్ దీవిలోనివారివలె ఆహార సేకరణ వ్యవస్థకు చెందినవారే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆహారోత్పత్తి వ్యవస్థలో మనిషికి ఎకరమైనా చాలు, ఆహార సేకరణ వ్యవస్థలో దాదాపు ఒక చదరపు మైలు కావాలి, కొన్ని కొన్ని ప్రాంతాలలో అంతకంటే హెచ్చుగా కూడా కావాలి, కార్ నికోబార్ లో చదరపు మైలుకు సగటు జనాభా యాభై. ఇందుకు కారణం ఇంతకు ముందు నేను పేర్కొన్నట్టు, ఆ దీవి దాదాపు ఒక కొబ్బరితోట కావడమే. నికోబార్ ద్వీపసమూహానికి చెందిన మరి కొన్నింటిలో వాటి విస్తీర్ణానికీ, జనసంఖ్యకూ నిష్పత్తి ఇంతకు చాలా తక్కువ. ఉదాహరణకు, లిటిల్ నికోబార్ వైశాల్యం 57 చదరపు మైళ్లు కాగా, దాని జనాభా (1960 నాటి లెక్కల ప్రకారం) 182 మాత్రం; గ్రేట్ నికోబార్ వైశాల్యం 333 చదరపు మైళ్లు కాగా, దాని జనాభా 203 మాత్రమే, 18 ఆహార సేకరణ వ్యవస్థలో మనిషికి కనీసం ఎకరం చొప్పున కావాలన్న గుర్తింపుతోనే సౌత్ అండమాన్ దీవిలో (పోర్ట్ బ్లెయిర్ పరిసరాలలో) జరవ తెగవారికి 350 చదరపు మైళ్ళ అడవిని ప్రత్యేకించారు. 19 ఎవ్వరితోను వీరు కలవరు, తక్కిన ప్రపంచంతో ఎట్టి సంబంధం పెట్టుకోరు. వీరు నరమాంస భక్షకులు కారు గాని, ఒంటిరిగా ఎవరైనా తారసిల్లితే బాణాలతో కొట్టి చంపుతారు. వీరిని అంకెకు తీసుకురావడం ఇదివరలో బ్రిటీష్ వారికి చేతకాలేదు; ఇప్పుడు మన ప్రభుత్వానికైనా చేతకావడం లేదు. అందువల్ల జరవల కోసం 350 చదరపు మైళ్ళు అడవిని ప్రత్యేకించి, దానికి నలుగడలలో ఇదివరలోవలె ఇప్పుడు కూడా పోలీసు చెక్ పోస్టులు పెట్టి, వారినుంచి ముప్పు రాకుండా కాపాడుకొనడం జరుగుతున్నది. ప్రస్తుతం జరవల సంఖ్య ఎంతో ఎవ్వరికీ గట్టిగా తెలియదు గాని, బహుశా మూడువందలకు మించదని ఊహిస్తున్నారు; నిజానికి అంతకంటే తక్కువ కావచ్చు.
ఆహార సేకరణ వ్యవస్థలో జీవించడానికి కావలసినట్టి సువిశాల ప్రాంతాలు విధిగా విపిన ప్రదేశాలే అయివుండాలి. లేకపోతే, తవ్వుకొని తినడానికి దుంపలు దొరకవు, కోసుకు తినడానికి పళ్ళు దొరకవు, పట్టుకు తినడానికి చేపలు దొరకవు. వేటాడి తినడానికి పిట్టలు, కుందేళ్ళు, పందులు, లేళ్ళు, జింకలు, దుప్పులు వగైరాలు దొరకవు, పిండుకొని తాగడానికి తేనెపట్టులు దొరకవు, ఒక్కమాటలో బ్రతుకే గడవదు. ఆహారోత్పత్తి వ్యవస్థకు చెందినవారికి “ఇదికూడా ఒక బ్రతుకేనా!" అనిపించవచ్చు. కాని, ఎవరి జీవిత విధానం వారికి ఉత్తమమైనదిగానే తోస్తుంది. ప్రెసిడెంట్ గా రాజేంద్రప్రసాద్ కార్ నికోబార్ దీవికి వెళ్ళినప్పుడు “నేను మీకు చేయగల సహాయం ఏదైనా ఉన్నదా?" అని ఆయన ప్రశ్నించగా అక్కడి ప్రజల పక్షాన “మా పద్ధతుల ప్రకారం మమ్ము బ్రతకనివ్వండి; అదే మీరు మాకు చేయగల గొప్ప సహాయ”మని బిషప్ రిఛన్ సమాధానం చెప్పాడు. ఆయనను లోకసభ సభ్యునిగా నామినేట్ చేయగా, తనకు ఢిల్లీ వాతావరణ మేమి, అంతకంటే ముఖ్యంగా అక్కడి జీవిత విధానమేమి, ఎంతమాత్రం మనస్కరించడం లేదని తన సభ్యత్వాన్ని అతిత్వరలోనే ఆయన విడిచిపెట్టాడు; నేను చూసినప్పుడు బిషప్ రిఛన్ వయస్సు ఎనభై సంవత్సరాలకు పైగా. మా పార్లమెంటరీ బృందంలోని సభ్యులందరిలో ఎందువల్లనో నేను ఆయనకు ఎక్కువగా నచ్చాను. తక్కినవారందరికీ అతిథి సత్కారంగా ఆయన రెండేసి, మూడేసి పెద్ద గవ్వ లివ్వగా, నా కేమో ఒక గుడ్డసంచిలో పెట్టి ఒక డజనుకు పైగా వాటి నిచ్చాడు. తన జీవితచరిత్ర ప్రతిని సయితం బహూకరించాడు. నాతో జరిపిన సంభాషణలో “నాగరికత అనే జాడ్యం ఇక్కడికి విస్తరించడానికి ముందు ఇక్కడ

అబద్ధాలాడేవారు కాదు, దొంగతనాలుండేవి కావు, కొట్లాటలు సాగేవి కావు. మీకు ఆశ్చర్యంగా తోచవచ్చుగాని, మా భాషలో యుద్ధాన్ని సూచించడానికి పదమైనా లేదని ఆయన చెప్పాడు. రామాయణ కాలంలో దండకారణ్య ప్రాంతంలోని నిషాదులు బహుశా ఇట్టివారే కావచ్చునని నాకు అనిపిస్తూ ఉంటుంది.

ఈ ఘట్టంలో దాదాపు ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఈ పీఠిక తిరిగి హఠాత్తుగా నిలిచిపోయింది. ఇందుకు పెక్కు కారణాలున్నాయి. తలచుకొనడానికైనా బాధాకరమైనవి కాబట్టి, ఇక్కడ వాటిని వివరించడానికి ప్రయత్నించను. కాగా, నేను విధిగా చెప్పవలసిన రెండు మాట లున్నాయి. నూటయాభై పేజీలకు పైగా అచ్చువేసిన మీదట ఈ నాటక ప్రచురణకై నా కారణాన ఇంతకాలంపాటు నవోదయ పబ్లిషర్స్ వేచి ఉండవలసి వచ్చింది. నాపట్ల ప్రేమ గౌరవాలతో ఈ దీర్ఘ విలంబనను సహించినందుకు ఆ సంస్థ నిర్వాహకులకు, నా నమస్కారాలు. ఈ పీఠికలో ఇంతకుముందు నేను పేర్కొన్నవారిలో ఇద్దరు ప్రముఖులు మరి లేరు. ఇంచుమించు ఏడాది క్రితం నేషనల్ ప్రొఫెసర్ సునీతికుమార్ ఛటర్జీ కాలధర్మం చెందగా, అయిదారు నెలలనాడు బిషప్ రిచర్డ్సన్ కన్నుమూశాడు. (నేను దీన్ని వ్రాస్తున్నది 1978 డిసెంబర్ రెండవ వారంలో). వారిద్దరి స్మృతికి నా ప్రేమాంజలి.

పద్దెనిమిది నెలలనాడు ఈ పీఠిక హఠాత్తుగా నిలచిపోయింది. బిషప్ రిచర్డ్ సన్ విషయమై నేను ప్రస్తావిస్తూ ఉండగా. దాదాపు మూడువేల సంవత్సరాల క్రితం దండకారణ్యంలోని నిషాదులు సయితం నిషాదులు కాకపోతే, మరొక జాతికి చెందిన ఆటవికులు కాని, వారి కోర్కెను తమ పద్ధతి ప్రకారం తాము బ్రతకాలని మాత్రమే కోరుకొని ఉండాలి.

ఆర్యఋషులు సాగనివ్వలేదు. గంగాయమునల ప్రాంతం నుంచి దక్షిణాదికి క్రమ క్రమంగా వారు విస్తరించారు' దండకారణ్యంలో ఆశ్రమాలను - "ఆశ్రయాలు" బహుశా వాటికి మరింత సార్థకనామం! - స్థాపించారు; యజ్ఞయాగాదుల పేరుతో విస్తృత ప్రాంతాలను దగ్ధం చేశారు; దగ్ధం చేసిన ప్రాంతాలను వ్యవసాయ క్షేత్రాల కింద మార్చారు; వ్యవసాయానికి కావలసిన పశుసంపదను రాజుల నుంచి గోదానం రూపంలో సంపాదించారు; వ్యవసాయానికి కావలసిన కార్మికులను ఛాత్రుల రూపంలో సమీకరించారు. ఋష్యాశ్రమాలలో ఛాత్రుల ప్రథమ కర్తవ్యం పశుపాలనమే, వారి ప్రధాన వ్యాసంగం అన్యవిధాల ఆశ్రమాధిపతుల కోసం కాయకష్టం చేయడమే.
ఏమైనా, ఇక్కడ గుర్తించదగు ముఖ్య విషయ మిది; దండకారణ్యానికి వలస వచ్చినవారి ఆర్థిక వ్యవస్థ స్థానికుల వ్యవస్థకు పూర్తిగా విభిన్న మైనట్టిది, విరుద్ధమైనట్టిది. వలసవచ్చినవారు అరణ్యాలను దగ్ధం చేయాలి; లేకపోతే, తాము కోరినట్టు ఆహారోత్పత్తిని వారు కొనసాగించలేరు. స్థానికులు అరణ్యాల దగ్ధకాండను నిరోధించాలి; లేకపోతే, ఆహార సేకరణ వారికి అసాధ్యం కాగలదు. ఈ విభిన్న జీవిత విధానాలు మధ్యగల ఈ వైషమ్యం, వారి విరుద్ధ ఆర్థిక వ్యవస్థల మధ్యగల ఈ విరోధం వారి మధ్య సంఘర్షణను అనివార్యం చేస్తుంది. ఈ సంఘర్షణలో రాముని సహాయం పొందడానికై ఋషులు ఆడని అబద్ధం లేదు, పన్నని కుట్ర లేదు, చేయని పాడుపని లేదు.

దండకారణ్యం ఋషులను నేను అకారణంగా నిరసించడం లేదు, అనవసరంగా నిందించడం లేదు. రామాయణాన్ని (దాని అనువాదాలను కాదు, అనుసరణలను కాదు, వాల్మీకి కృతిగా ప్రచారంలో గల సంస్కృత రామాయణాన్ని) భక్తులవలె కాక, విజ్ఞుల వలె చదివితే, ఋషులను నాకంటె తీక్ష్ణంగా మీరే నిరసింపవచ్చు, నాకంటె తీవ్రంగా మీరే నిందించవచ్చు. నా మాటకేమి, మీ మాటకేమి? సాక్షాత్తు ఆ సీతాదేవి ఏమన్నదో ఒకసారి గమనించండి. ఈ ఆటవికులు మనకు ఏమి అపకారం చేస్తున్నారని భర్తను నిగ్గదీసింది. ఈ స్థానికులను చంపడమే పనిగా పెట్టుకొనడం మీకు తగునా అని సూటిగా ప్రశ్నించింది. "తప్పులేని జనులను హింసించుట" ఘోరమని తెగవేసి చెప్పింది. మనతో "వైరము లేక దండకారణ్యమున

నున్నవారిని", తమ బ్రతుకు తాము నెమ్మదిగా బ్రతుకుతున్న వారిని చంపడం అతి ఘోరమని హెచ్చరించింది. బొంకులాడడం మహా పాతకం కాగా, పరదారాభిగమనం, వైరం లేకుండా సంహారం మరింత నికృష్టమైన పాపాలని, ఈ చివరి పాపాన్నే మీరు చేస్తున్నారని భర్త ముఖం పైనే అని వేసింది. ఇంతకంటె విపులంగా, ఇంతకంటె నిష్కర్షగా ఆమె మాట్లాడింది. ఆమె మాటలను మీరు పూర్తిగా తెలుసుకొనడానికి వీలుగా ఆ ఆరణ్యకాండలోని రెండు సర్గలకు (తొమ్మిదవ, పదవ సర్గలకు) సరస్వతుల సుబ్బరామశాస్త్రిగారి తెలుగు సేతను ఈ పీఠికకు రెండవ అనుబంధంగా ముద్రిస్తున్నాను. దాన్ని శ్రద్ధగా చదివితే, నా "సీత జోస్యం" నాటకంలోని ముఖ్యభాగాలు, ప్రత్యేకించి దానిలోని సీత పలుకులు, సంస్కృత రామాయణానికి ఎంత చేరువుగా ఉన్నాయో మీకు తెలిసివస్తుంది.

సీత పలుకులకు రాముడు చెప్పిన - చెప్పగలిగిన - ప్రత్యుత్తరం "నేను ప్రాణాలనైనా విడుస్తాను. నిన్ను విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను, అంతే తప్ప ఋషులకిచ్చిన మాటలను విడవను" అని మాత్రమే! ఋషులకు తానిచ్చిన మాట ప్రకారం "వైరము లేక" దండకారణ్యంలో ఉన్నవారిని రాముడు చంపుతూపోయింది ఒక ఏడాది కాదు, రెండేళ్ళు కాదు, వరసగా పదేళ్ళపాటు. ఋష్యాశ్రమం నుంచి ఋష్యాశ్రమానికి నివాసాన్ని మార్చుతూ స్థానికులైన ఆటవికులను పదేళ్ళపాటు ఆయన చంపిన మీదటనే (ఆరణ్యకాండ, 11వ సర్గ), అగస్త్యుని సూచన ప్రకారం మరింత దక్షిణంగా దండకారణ్యం లోనికి ఆయన చొచ్చుకు వెళ్ళిన మీదటనే ఆయన తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొనడం తటస్థించింది.

ఆటవికులైనవారు, ఆహార సేకరణ ప్రాతిపదికకాగల ఆర్థిక వ్యవస్థకు చెందిన వారు ఎప్పుడైనా ఎక్కడైనా - శాంతినే అభిలషిస్తారు, సామరస్య పూర్వకంగానే జీవిస్తారు. ఇది చారిత్రక సత్యం. వారి జీవితావసరాలు బహు స్వల్పం. సొంత ఆస్తిపాస్తులను కూడబెట్టుకొనాలన్న తాపత్రయం వారిలో ఉండదు. అందువల్ల వారి మధ్య వారికి చెదురుగా తప్ప వివాదాలురావు. ఒక పరాయివారితో వారు పోరుకు దిగడం అసలే జరగదు. వారి బ్రతుకు వారు బ్రతకకుండా పరులు అడ్డుపడినప్పుడు మాత్రమే వారు పోరుకు స్థిరపడతారు. ఉత్తర అమెరికా ఖండంలోని ఆదివాసులు చాలావరకు ఆహార సేకరణ వ్యవస్థకు చెందినవారే. వారికి వ్యవసాయం అసలే తెలియకపోదుగాని, దాన్ని కేవలం తిండి గింజలకోసం కొద్దిపాటిగా సాగించేవారు; అడవులలోనే వారు బ్రతుకుతూ ఉండేవారు; అడవి బట్టెల పైనే వారి ఆర్థిక వ్యవస్థ హెచ్చుగా ఆధారపడివుండేది.

ఇంగ్లీషువారు పదిహేడవ శతాబ్ది ప్రారంభంలో తమ ఖండం తూర్పు తీరానికి వలసకు రావడాన్ని ప్రారంభించినప్పుడు ఉత్తర అమెరికా ఆదివాసులు (రెడ్ ఇండియన్లు) వారికి ఆతిథ్యమిచ్చారు, అన్యవిధాల ఆదరించారు. అప్పటిలో తమకు ఆదివాసులు చేదోడు, వాదోడుగా నిలిచి ఉండకపోతే, ఇంగ్లీషువారు ఆకలికి మలమల మాడి చచ్చిపోయి ఉండేవారే! అయితే దీని ప్రతిఫలం అంతకంతకు హెచ్చుమంది వలసకు రావడం, అంతకంతకు హెచ్చుగా ఆదివాసులను అవతలికి తరిమికొట్టడం, వారి అడవులను నరికి వేయడం, వారి అడవిబట్టెలను వేల సంఖ్యలో వేటాడి చంపడం, ఇతర దురాగతాలకు, దౌర్జన్యాలకు దిగడం ఇంతే! ఈ ఘోరకృత్యాలు ప్రారంభమైన తర్వాతనే గత్యంతరం లేక రెడ్ ఇండియన్లు పోరుకు సన్నద్ధ పడవలసి వచ్చింది. ఆయుధబలం లేనందున వారికి పరాజయం తప్పలేదు, దాదాపు సర్వనాశనమే తప్ప లేదు. ఉత్తర అమెరికా ఖండాన్ని - ముఖ్యంగా పశ్చిమ భాగాన్ని - ఆక్రమించుకొనడంలో పాశ్చాత్యులు జరిపిన చిత్రవధకు దండకారణ్య ప్రాంతంలోని ఆర్యఋషులేమి, వారిని సమర్థించిన క్షత్రియులేమి కొనసాగించిన చిత్రవధకు విస్తృతిలోగాని, క్రౌర్యంలోగాని ఏమంత భేదం కానరాదు. నా మట్టుకు నాకు డీ. బ్రౌన్ రచించిన "బరీ మై హార్ట్ ఎట్ వూండెడ్ మీ" అనే గ్రంథానికి, " వాల్మీకి రామాయణంలో ఆరణ్య, కిష్కింధ, దగ్గరి పోలికలు కన్పించాయి. చెప్పిన మాటనే మరల చెప్పడమైనా, రామాయణాన్ని చదవవలసింది భక్తిభావంతో కాదు, విచక్షణా దృష్టితో. ఆ పని చేసినప్పుడు రామాయణంలో నాకు వలె మీకు కూడా ఆహార సేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థల మధ్య సంఘర్షణ స్పష్టంగానే గోచరిస్తుంది; అప్పుడు నావలె మీరు కూడా దండకారణ్యంలోని ఋషుల కుట్రలో రాముని పాత్రను సరిగ్గా అర్థం చేసుకో గలుగుతారు.

ఆయుధాల ప్రశ్న

"రామాయణకాలంలో ఎవరి ఆయుధా లెట్టివి?" అనే ప్రశ్నలో ఒక భాగానికి ప్రత్యుత్తరాన్ని వెంటనే చెప్పవచ్చు. రామునికి సంబంధించి నంతవరకు ఆయన ప్రధానాయుధం - కోదండం. అందువల్లనే "కోదండ రాముడు" ఆయన బిరుదనామం. కోదండంతో పాటు ఆయన ఖడ్గాన్ని కూడా వినియోగిస్తూ ఉండేవాడు. అయితే, దాని వినియోగం బహు సకృత్తుగానే. కోదండం, కార్ముకం, అస్త్రము, ఇష్వాసము, చాపము, ధనువు, ధన్వము, ధనుస్సు, సింగిణీ, సింగాణి, విల్లు మొదలైనవి కేవలం పర్యాయపదాలు కాకపోవచ్చు. ఉదాహరణకు, "కార్ముకం" అనే పదానికున్న నానార్థాలలో "వెదురు" కూడా ఉన్నది. దీన్నిబట్టి వెదురుబద్దతో చేసిన విల్లు "కార్ముకం" అని తీర్మానించుకొన వచ్చునేమో! " ధనువు"కున్న నానార్థాలలో ఒకటి "నాలుగు మూరల కొలది" దీన్నిబట్టి నాలుగు మూరల నిడివికల విల్లు" "ధనువు" అనుకోవచ్చునేమో; పోతే "సింగిణి" అంటే "కొమ్ముతో చేసిన విల్లు" అని "శబ్దార్థచంద్రిక" స్పష్టంగానే చెబుతున్నది. వాటి తీరుతెన్నులను బట్టి కూడా ధనుస్సులకు వేర్వేరు పేర్లు వచ్చి వుండవచ్చు. దేవిడి జమిందార్ "ఆంధ్రవిజ్ఞానము" ప్రకారం "ధనుస్సు త్రివిధము టంకారధనువు, ఝుంకారధనువు, మహాధనువు అని, టంకారధనుస్సు వంకరలు తిరిగి యుండునది. ఝుంకారధనుస్సు వంకరలు లేక, తిన్నగనుండి, శరసంధాన మొనర్చుతటి నించుక వంగియు తిరిగి తిన్నగా నగుచుండును. మహాధనుస్సు విల్లువలెవంగియే యుండును". ఏమైనా, ఈ విషయమై సాధికారంగా వ్రాయగల వారు వసిష్ఠుని ధనుర్వేద సంహితను క్షుణ్ణంగా చదివినవారే. అన్నట్టు, ఆయుధాలకు, ఆయుధ ప్రయోగానికి సంబంధించిన శాస్త్రానికి 'ధనుర్వేద సంహిత" అని పేరు రావడం వెనుకటి కాలంలో ధనువుకు యుద్ధంలోగల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నది.

టంకార, ఝుంకార, మహాధనువులలో ఏదో ఒకదాన్ని రాముడు వినియోగించేవాడో, లేక అవసరాన్ని బట్టి మూడింటినీ వినియోగించేవాడో రామాయణం మనకు స్పష్టపరచడం లేదు. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. విశ్వామిత్రుడు రామునికి ఏవో దివ్యాస్త్రాలను మంత్రోపదేశం ద్వారా అందజేసినా దనడం (బాలకాండ, 27వ సర్గ) నమ్మదగు విషయం కాదు, ఇదేవిధంగా అగస్త్యుడు విష్ణుదేవుని విల్లును, బ్రహ్మదేవుని అమ్ములను, దేవేంద్రుని అమ్ముల పొదిని రామునికి బహూకరించినా దనడం సయితం (అరణ్యకాండ, 12వ సర్గ) విశ్వసనీయం కాదు. మనకు నిజంగా దివ్యాస్త్రాలుంటే, మన దేశంపై జరిపిన దండయాత్రలలో - ఒకటి, రెండింటిలో తప్ప - వరసగా మనం ఎందుకు దెబ్బ తిన్నాము; క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దిలో పర్యన్ చక్రవర్తి సైరస్ ది గ్రేట్ ఇండియా పశ్చిమోత్తర ప్రాంతాన్ని జయించినట్టు కొందరు ప్రాచీన చరిత్రకారులు వ్రాయగా ఆ ప్రయత్నంలో ఆయన మరణించినట్టు మరి కొందరు వ్రాశారు. ' అయితే, ఆయన అల్లుడు డారియస్ ది గ్రేట్ నిశ్చయంగా ఆ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ తర్వాత మెసెడోనియొ చక్రవర్తి అలెగ్జాండర్ ది గ్రేట్ క్రీస్తుకు పూర్వం నాల్గవ శతాబ్దిలో అదే ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ' మన బ్రహ్మాస్త్రాలు, పాశుపతాస్త్రాలు, అన్య దివ్యాస్త్రాలు డారియస్, అలెగ్జాండర్ జైత్రయాత్రలను ఎందువల్ల నిరోధించ లేకపోయాయి? ఈవిధమైన ప్రశ్న తప్పక వస్తుందని మన పౌరాణికులకు తెలుసు. అందువల్లనే, కురుక్షేత్ర సంగ్రామానంతరం కలియుగం ప్రవేశించిందని, ఈ పాడు కలికాలంలో మంత్రాలు అమోఘంగా పనిచేయవని ఒక సాకును ముందుగానే వెతకి పెట్టారు.

అయితే, దివ్యాస్త్రాలలో నాగాస్త్రం ఉండేదేమో! కొనకు విషం పూసిన బాణం ప్రసక్తి ఋగ్వేదంలో ఉన్నది. " దానినే అటు తర్వాత నాగాస్త్రమనే వారేమో! కాగా, బాణం కొనకు విస్ఫులింగాన్ని కట్టినట్టిది ఆగ్నేయాస్త్రం కావచ్చునేమో! దీని ప్రసక్తి అధర్వవేదంలో కనబడుతున్నది. ఈ విషపు బాణాల, అగ్నిబాణాల ప్రయోగాన్ని "మనుధర్మశాస్త్రం" నిషేధిస్తున్నది; "నీతిప్రకాశిక" సయితం వీటిపై ఆంక్ష విధిస్తున్నది. అయితే "శుక్రనీతిసారం" యుద్ధంలో విజయసాధనకు అధర్మయుద్ధ పద్ధతులను మించినవి లేవని ఉదోషిస్తున్నది. అంతేకాదు. రాముడు, కృష్ణుడు, ఇంద్రుడు అధర్మయుద్ధాన్ని చేసినట్టివారని

వారి పేరెత్తి చెబుతున్నది; వారు ముగ్గురు వరసగా వాలిని, కాలయవనుని, సముచిని అధర్మయుద్ధం ద్వారానే వధించినట్టు వివరిస్తున్నది. "

ధర్మాధర్మ యుద్ధాల చర్చలోకి వెళ్ళకుండా, తిరిగి ధనుస్సు సంగతి యెత్తుకొన్నంతనే చెప్పవలసిన మొదటి మాట ధనుర్విద్యలో భారతీయులకు ఒకప్పుడు విశేష విఖ్యాతి వుండేదని. వారి విఖ్యాతిని పురస్కరించుకొనే దారియస్ కుమారుడు జ్కు సెజ్ గ్రీసుపై దండయాత్ర జరిపిన సందర్భంలో ఇండియా నుంచి ధనుర్ధారుల దళాన్ని ఒకదాన్ని రప్పించుకొన్నాడు. ' విలువిద్యలో భారతీయుల ఈ ఘనతకు ఒక కారణం, విల్లును తయారు చేయడంలో వారి నేర్పు కావచ్చు; రెండవ కారణం, దాన్ని ప్రయోగించండంలో వారి చాకచక్యం కావచ్చు; మూడవ కారణం, బాడాల ముక్కులకు వారు ఉక్కును వాడకం చేయడం కావచ్చు. విల్లును తయారు చేయడానికి వెదురుతోపాటు వేత్రాన్ని (పేము) వాడేవారు, కొమ్ముతోపాటు గంధం, సాలం, చంద్ర, మద్ది చెక్కలను వాడేవారు. ఇంతటితో ఆగక, బంగారం, వెండి, రాగి, ఇనుం మొదలైన లోహాలను సయితం వినియోగించేవారు. శ్రేష్ఠమైన విల్లు నిడివి నాలుగు మూరలు. కాగా, మధ్యరకం విల్లు నిడివి మూడున్నర మూరలు. బాణాన్ని ప్రయోగించడానికి వింటి త్రాటిని యవనుల వలె ఛాతీవైపుకు కాక, చెవివైపుకు మనవారు లాగేవారు. • బాణం ముక్కును మేలైన ఉక్కుతో చేసేవారు. ఒకనాడు మన ఉక్కుకు చాలింది ప్రపంచం మొత్తం మీదనే దొరికేది కాదు. పౌరవుని జయించిన అలెగ్జాండర్ ఆయన వద్ద నుంచి అన్నింటికంటే విలువైన నజరానాగా పుచ్చుకొన్నట్టిది 30 పౌనుల ఉక్కునే." ఇండియా ఉక్కుకు దాదాపు మధ్యయుగం వరకు ఈ ప్రసిద్ధి మిగిలింది. ఆరబ్ దేశాలలో కత్తిని "జవాబ్-ఇ-హింద్" అనేవారు. ఇండియా ఉక్కుతో చేసిన కత్తితో చెప్పే జవాబుకు తిరుగులేదని వారి తాత్పర్యం.

అయితే, ఉక్కును తయారుచేయడంలో ఇండియా మొదటి స్థానానికి ఎప్పుడు చేరుకున్నదో కచ్చితంగా చెప్పలేము. ఇనుమును, ఉక్కును ఉత్పత్తిచేసే పద్ధతులను ఆదిలో కనిపెట్టినవారు ఆర్మీనియన్ ప్రాంతంలోని ఆదివాసులట. వారిని కిజ్ వదను లనేవారట. వారి నుంచి ఆ పద్ధతులను మిటన్నీలు మొదట తెలుసుకొనగా, మిటన్నీలనుంచి హిట్టయిట్లు తెలుసుకొన్నారు. వారుభయులు ఆర్యజాతికి చెందిన తెగలవారే! వా రుభయులు పశ్చిమాసియాలో ఒకరి తర్వాత మరొకరు మహారాజ్యాలను సంస్థాపించినవారే. తమను, తమ రాజ్యాలను, తమ ప్రాబల్యాన్ని కాపాడుకొనడానికి, ఇనుము ఉక్కు ఉత్పత్తి పద్ధతులను వారుభయులు చాలా కాలంపాటు గుప్తవిద్యలుగా ఉంచారు. తమకు ఇనుము కావాలన్నా, ఉక్కు కావాలన్నా, తక్కిన రాజులు వారిని ప్రాధేయపడవలసి వచ్చేది. క్రీస్తుకు పూర్వం పధ్నాల్గవ శతాబ్దంలో ఈజిప్టుకు చెందిన ఒక ఫారో రాజు కొంత ఉక్కును ఉపాయనంగా కోరగా "ఇదుగో! ఇదుగో!" అంటూ కాలయాపన చేసి, హిట్టయిట్లు చివరికి మొండిచెయ్యి చూపించారు. అప్పటిలో ఆయుధాలనే కాక, ఆభరణాలను సయితం ఇనుముతో, ఉక్కుతో చేసేవారు; అప్పటిలో వాటి ధర బంగారం ధర కంటె బహుశా హెచ్చు.

ఏ విద్యలైనా, వాటికి బహుళ ప్రయోజనం ఉన్నప్పుడు, నిత్యజీవితంతో, అంతకంటే ముఖ్యంగా యుద్ధంతో వాటికి ప్రత్యక్ష సంబంధం ఉన్నప్పుడు, వాటిని గుప్త విద్యలుగా మిగల్చడం ఎంతో కాలం పాటు సాధ్యంకాదు. అణుశాస్త్రాన్ని గుప్తవిద్యగా అమెరికా ఎంత కాలంపాటు మిగల్చగలిగింది? ఇనుము, ఉక్కు ఉత్పత్తి పద్ధతులలో సయితం ఇంతే జరిగింది. హిట్టయిల్ సైనికదళాలలో అనాగరిక జాతులవారు కొందరు కేవలం భుక్తికోసం చేరుతూ ఉండేవారు. ఈ ఆయుధోపజీవుల ద్వారా ఇనుము, ఉక్కు ఉత్పత్తి పద్ధతులను ఒకటి, రెండు శతాబ్దాలు జరిగేసరికి ఇతర రాజ్యాలవారు తెలుసుకోగలిగారు. అయితే, క్రీస్తుకు పూర్వం పన్నెండవ శతాబ్దివరకు ఇనుము, ఉక్కు ఉత్పత్తులు బహుపరిమితంగా కొనసాగుతూ ఉండేవి; పదవ శతాబ్దినాటికి వాటి ఉత్పత్తులు ఎన్నదగు మేరకు పెరిగినా, ఎనిమిదవ శతాబ్దిలోనే ఆయుధాల నిర్మాణానికి వాటిని విరివిగా వినియోగించడం సాధ్యపడింది.

మిటన్నీలకు, హిట్టయిలకు జ్ఞాతులైన ఆర్యులు సప్తసింధు ప్రాంతంలో ఎప్పుడు పాదం పెట్టినారో నిర్ధారణగా చెప్పలేముగాని, ఇక్కడికి చేరేనాటికే ఇనుమును, ఉక్కును ఉత్పత్తిచేసే పద్ధతులు వారికి తెలుసునని అనుకోవచ్చు. “అయస్సు” ప్రసక్తి, దాని ప్రశంస ఋగ్వేదంలో పెక్కుచోట్ల కనబడుతుంది. గట్టితనంతో, కరకుతనంతో “అయస్సు"కు ఋగ్వేదం తరచు లంకె పెడుతుంది కాబట్టి అది ఇనుం అయివుండాలి, లేదా ఉక్కు అయివుండాలి. అయితే, సప్తసింధు ప్రాంతంలో ముడియినుం దొరకదు. వేదకాలంనాటి ఆర్యులు మగధ ప్రాంతానికి విస్తరించడంలో పట్టుదల చూపడం కేవలం విపిన ప్రాంతాలను వ్యవసాయ క్షేత్రాల కింద మార్చడం కోసమే కాదు; అక్కడి ముడియినుం కోసం కూడా కావచ్చు. "

రాముడు “బంగరు ములుకులుగల యేదమ్ముల నా కర్ణాంత మీడ్చి యేసెను” అని ఆరణ్యకాండ మూడవ సర్గలో ఉన్నది. "నే నేయు బంగారు తొడవులు దూర్చిన బాణములు నిన్ను భేదించుకొని యావలికి బోవును” అని రాముడు ఖరునితో . పల్కినట్టు అదే కాండ 29వ సర్గలో ఉన్నది. తిరిగి 31వ సర్గలో “పసిడిములుకుల” బాణాల ప్రసక్తి వచ్చింది. యుద్ధకాండకు వెళ్ళితే, ఈ “పసిడి ములుకుల” ప్రయోగం మరింత హెచ్చుగా కానవస్తుంది. రాముడు నిజంగానే పసిడిములుకుల అమ్ములను వాడి వుంటే, అవి శత్రువులను “భేదించుకొని, యావలికి బోవు”ట ఎంతవరకు జరిగేదో సందేహమే! ఒంటరిగా నిలిచి పోరాడినా, రాముడు ఎందరెందరినో చంపగలగడం ఉక్కుములుకుల అమ్ములను వాడినందువల్లనే, దిట్టమైన విల్లుతో చాకచక్యంగా వాటిని వాడినందువల్లనే! అయితే, ఒంటరిగానే ఆయన వేల మందిని, లక్షలమందిని చంపినట్టు చెప్పడం అబద్ధం తలదన్నగల అత్యుక్తి మాత్రమే! వేలు, లక్షలు, కోట్లు, వేలకోట్లు, లక్షలకోట్లు - ఇట్టి సంఖ్యలను రామాయణంలో అతి వెర్రిగా వాడినా రనడం తూలుమాట కాదు. సుగ్రీవుడు కబురు పెట్టగా వచ్చిన వానరవీరులు దాదాపు కోటికోట్ల మేరకు! (కిష్కింధాకాండ, 39వ సర్గ). 1976 నాటికి ప్రపంచం జనాభా 400 కోట్లకు కొంచెం తక్కువగానే, జనాభా నిపుణుల అంచనాల ప్రకారం క్రీస్తుశకం ప్రారంభంలో ప్రపంచం జనాభా 25 కోట్లు మాత్రమే. పన్నెండున్నర కోట్ల నుంచి 25 కోట్లకు ప్రపంచం జనాభా పెరగడానికి క్రీస్తుశకానికి పూర్వం దాదాపు 37,000 సంవత్సరాలు పట్టిందట.

క్రీస్తుశకం ప్రారంభమైన తర్వాత కూడా 1650 వరకు ప్రపంచం జనాభా పెరుగుదల ఏమంత త్వరితంగా జరగలేదు. పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభమైన పిమ్మటనే. ఇండియా విషయంలో కూడా సరిగా ఇదే ధోరణి కానవస్తుంది. రీస్ డేవిడ్జ్ అంచనా ప్రకారం క్రీస్తుకు పూర్వం ఏడవ శతాబ్దిలో మొత్తం ఉత్తర భారతం జనాభా బహుశ ఒకటిన్నర, రెండుకోట్లను మించలేదు. 16 దక్షిణాపథాన్ని కలుపుకొంటే అది మూడుకోట్లను దాటేది కాదేమో! డబ్లియు. హెచ్. మోల్యాండ్ అంచనా ప్రకారం అక్బర్ కాలంలో (క్రీస్తుశకం 1556-1605) ఇండియా మొత్తం జనాభా పదికోట్లు. " మొట్టమొదటి సారిగా 1872లో ఇప్పటి పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మాలను కూడా కలుపుకొని ఇండియా ఉపఖండం జనాభా లెక్కలను తీయగా, అప్పటి జనాభా ఇరవైకోట్లు మాత్రమే. 18 అయినప్పుడు రామాయణకాలంలో - అది క్రీస్తుకు పూర్వం పదవ శతాబ్దమని భావిస్తే - ఇండియా మొత్తం జనాభా ఒక కోటి కావచ్చు, కోటిన్నర కావచ్చు. అయినప్పుడు, లంకపై దండయాత్రకై సుగ్రీవుడు “కో!” అని కూతవేయగా వేలకోట్ల వానరులు వచ్చినారనడం “బొంకరా, బొంకరా, పోలిగా!” అంటే “టంగుటూరు మిరియాలు తాటికాయలంత” అన్నట్టుగా ఉన్నది. పోతే, లంకలోని రాక్షసుల సంఖ్య “లకోటుల మూడు లక్షల యఱువది వేవురికంటె హెచ్చు” అని చెప్పడాన్ని (కిష్కింధకాండ, 35వ సర్గ) ఏమనవలెనో నాకు తోచడంలేదు!! ఆ వానరులు, ఈ రాక్షసులు నిలబడ్డానికైనా ఈ భూమండలం చాలదు! ఇట్టి కాకమ్మ కథలను అల్లినవారు రాముడు జనస్థానంలో ఒంటరిగా నిలిచి సాగించిన పోరులో ఖరదూషణుల సమేతంగా పధ్నాలుగు వేలమందిని చంపినట్టు చెప్పడం (అరణ్యకాండ, 30వ సర్గ) అబ్బురమా? బహుశా ఆయన చంపినవారు పధ్నాలుగురు కావచ్చు.

ఏమైనా ఇట్టి వెర్రి మొర్రి కథలను ఒక పక్కకు నెట్టివేస్తే, వానరు లన్నవారు, ఋక్షము లన్నవారు, రాక్షసు లన్నవారు చిన్ని చిన్ని తెగలవారని, బహుశా ఒక్కొక్క తెగలో కొన్ని వందలమంది, లేదా, ఒకటి, రెండు వేలమంది ఉండేవారని తీర్మానించుకొనవలసి వస్తుంది. కెప్టెన్ కుక్ పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో ఆస్ట్రేలియాను స్థూలంగా సర్వే చేసినప్పుడు ఆ ఖండం మొత్తం జనాభా రెండున్నర లక్షలను మించకపోవచ్చునని అంచనా వేశారు. ఆ రెండున్నర లక్షల మంది 2500 తెగలకు చెందినట్టివారు. దీని తాత్పర్యం ఒక్కొక్క తెగలో సగటున వందమంది మించి లేరని. రాముని కాలంలో దండకారణ్యంలో రెండున్నర వేల తెగలు కాకపోతే, కనీసం ఏ వంద, లేక రెండు వందల తెగలు ఉండేవని ఖచ్చితంగా అనుకోవచ్చు. ఈ నాటికైనా ఈశాన్య భారతంలోనే ఎన్ని కొండజాతులు లేవు? అక్కడి ఒక్క నాగజాతిలోనే తిరిగి ఎన్ని తెగలు లేవు?

లంకపై దండయాత్రలో రాముడు పోరింది కొన్ని కోట్ల మందితో కాదు, లక్షలమందితో కాదు, వేలమందితోనైనా కాదు, కేవలం కొన్ని వందలమందితో కావచ్చు. వారిని ఆయన గెలవగలిగింది బహుశా వారికి విల్లంబులు లేకపోయినందునే కావచ్చు. వానరులకు అవి లేవని రామాయణం పెక్కుచోట్ల స్పష్టంగా చెబుతున్నది. వారు పోరు జరిపింది చెట్లను పెరికి, కొమ్మలను విరిచి, బండలను దొర్లించి, రాళ్ళను విసిరి; లేదా, గోళ్ళతో రక్కి పళ్ళతో పీకి, కాళ్ళతో తన్ని, మోకాళ్ళతో కుమ్మి, పిడికిళ్ళతో మోది. ఇంతే తప్ప గద, ఖడ్గం, శూలం మొదలైన ఆయుధాలనైనా వారు వాడలేదు!!

పోతే, రాక్షసులకై నా విల్లంబులున్నట్టు గట్టిగా చెప్పలేము. అవి వారికుంటే శూర్పణఖ తనకు జరిగిన ఘోరవమానాన్ని గురించి ఖరునితో మొర పెట్టుకొనడానికి వెళ్ళినప్పుడు "రాముని, వాని తమ్ముని ఒక్క బాణంతో చంపుతాను" అని కాక, "ఇదుగో! వారిని గొడ్డలితో నరుకుతా'నని అత దనివుండేవాడా? (అరణ్యకాండ, 22వ సర్గ). ఖరుని సేనానులలో మహా కపాలుడు శూలాన్ని, స్థూలాక్షుడు అడ్డకత్తిని, ప్రమాధి గొడ్డలిని పుచ్చుకొని, పోరులో దూకేవారా? ఖరుడు, మరికొందరు విల్లంబులను వాడకపోలేదుగాని, అతడి సైనికులు కురిపించింది బాణాల వర్షాన్ని కాదు, చెట్లవాననే, రాలవాననే. (ఆరణ్యకాండ, 25వ సర్గ). విల్లు చేయడానికి వెదురుబద్ద చాలు, బాణం చేయడానికి వెదురుపుల్ల చాలు. అయినప్పుడు, విల్లమ్ములను ఖరదూషణులకు చెందిన ప్రతి సైనికులు ఎందుకు సమకూర్చుకొనలేదు? లంకలో జరిగిన యుద్ధంలోనైనా తిరిగి ఇదే ప్రశ్న ఎదురౌతున్నది. రామలక్ష్మణులపై యుద్ధంలో ఇంద్రజిత్తు ప్రయోగించిన ప్రథమాయుధం నాగపాశం. అది వారిని పడగొట్టి, చేతులను కట్టివేసిందట. (యుద్ధకాండ, 45, 46వ సర్గలు) ఈ పాశాన్ని రామాయణంలోనే మరొకచోట యమపాశంతో పోల్చడం జరిగింది. అందువల్ల ఇది "లాసో" (Lasso) కావచ్చు. దీన్ని గిరిగిర విసరి పొగరుబోతు ఆబోతులనైనా, అశ్వాలనైనా పట్టుకోవచ్చు. ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై ప్రయోగించింది ఈ "లాసో"యే కావచ్చు. పోతే, కుంభకర్ణుడు యుద్ధానికి బయల్దేరింది విల్లమ్ములతో కాదు, మొనవాలుతో. అతని వెంట యుద్ధానికి వెళ్ళిన సైనికులు పుచ్చుకొని వెళ్ళినవి రోకళ్ళు, గుదియలు (యుద్ధకాండ, 65వ సర్గ). రోకళ్ళతోపాటు, గుదియలతో పాటు, వారు ఈటెలు, గదలు, గొడ్డళ్ళు, పట్టసములు, శక్తులు, త్రిశూలాలు, ఖడ్గాలు, చక్రాలు, మొదలైనవాటిని వాడినట్టు యుద్ధకాండ వివరిస్తున్నది. అక్కడక్కడ విల్లంబుల ప్రసక్తి ఉన్నా, అది కేవలం కొందరు నాయకుల విషయంలోనే. వానరులవలె రాక్షసులు సయితం ధనుర్బాణాలను వినియోగించేవారు కారేమో అని దీన్నిబట్టి అనుమానించవలసి వస్తున్నది. ఇదే అనుమానాన్ని సి.వి. వైద్య సయితం వెల్లడించాడు. ఒకవేళ వారికి ధనుస్సులుంటే, అవి శక్తిమంతమైనవి కాకపోవచ్చు; వారి బాణాల ముక్కులు ఉక్కుతోకాక, రాతి ముక్కలతో చేసినట్టివి కావచ్చు. ఆయుధాల విషయంలో ఈ విధమైన ఆధిక్యం ఏదో లేకపోతే, రామలక్ష్మణులు దండకారణ్యంలోని ఆటవికులను, సంఖ్యాబలం వారిపక్షాన వున్నా, జయించగలిగేవారు కాదు! ప్రపంచచరిత్రను పరిశీలిస్తే, కొద్దిమంది బహుళజనులను యుద్ధంలో జయించడం ఎప్పుడు - ఎక్కడ - జరిగినా

అది నూతనాయుధాలవల్ల, లేదా నూతన యుద్ధపద్ధతుల వల్ల, లేదా కొన్ని కొన్ని సందర్భాలలో ఈ రెండింటి సమ్మేళనం వల్ల జరిగినట్టు కానవస్తుంది.

మధ్యశిలాయుగం నాటికే - దాదాపు పదివేల సంవత్సరాల క్రితం నాటికే - విల్లును కనిపెట్టడం జరిగింది. ఆదిలో విల్లు ఒక ఆటవస్తువు; పిమ్మట ఒక సంగీత సాధనం.1 తంబుర, వీణ మొదలైనవి విల్లునుంచి కాలక్రమాన రూపొందినట్టివే. ఈనాటికి కూడా ఆఫ్రికాకు చెందిన జూలూ తెగవారు విల్లును సంగీత సాధనంగానే వాడతారు. " విల్లుకు అమ్మును తోడుచేసేసరికి అదే వేటకు ఉపకరణంగా మారింది. తర్వాత అతి త్వరలోనే అది యుద్ధసాధనంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఇంతటి పురాతన కాలంలోనే వ్యాప్తిలోకి వచ్చిన విల్లమ్ములకు దండకారణ్య ప్రాంతానికి చెందిన తెగలవారు (వానరులుగా, ఋక్షములుగా, రాక్షసులుగా రామాయణం పేర్కొంటున్నవారు) ఎందుకు అపరిచితులు కావాలి? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరానికై పసిఫిక్ సముద్రంలోని మెలినీజెన్, పోలినీజెన్ దీవులకు వెళ్లకతప్పదేమో! ఆ దీవులలో అయిదింటిని మినహాయిస్తే తక్కినవాటికి చెందినవారు విల్లంబులతో పోరు జరపడాన్ని కావాలనే విరమించారు. గదాయుద్ధమే వీరోచితమైంది. అందువల్ల ధనుర్బాణాల వినియోగాన్ని క్రీడా వినోదాలకు, వారి దృష్టిలో మత్స్యాల, పక్షుల, మూషికాల వేటకు వారు పరిమితం చేశారు. జూలూల దృష్టిలో కూడా ధనుర్బాణాలు భీరులకు తగు ఆయుధాలే! దండకారణ్యానికి చెందిన తెగలవారికి కూడా విల్లంబుల విషయమై ఇట్టి న్యూనభావమే వుండేదేమో! కుంభకర్ణుని విషయంలో ఇది అక్షరాలా నిజం. తాను “వాడి యమ్ములతో” యుద్ధానికి అయిష్టుడనని రావణునితో అతడు స్పష్టంగా చెప్పనే చెప్పాడు (యుద్ధకాండ, 63వ సర్గ).

ఏమైనా, ఆయుధబలం తక్కువైనందువల్లనే రాక్షసులుగా రామాయణం పేర్కొన్నవారు “గెరిల్లా” యుద్ధ పద్ధతులను అనుసరించవలసి వచ్చేది. ఎదుట నిలిచి పోరాడ్డానికి వీలులేనప్పుడు చాటునుంచి దెబ్బతీయక తప్పదు; పగలు దాడి జరపడానికి వీలులేనప్పుడు చీకటి మరుగున ముట్టడించక తప్పదు; అవసరమైనప్పుడు మారువేషాలను వేసుకొని పగతురపై దూకకతప్పదు. రాక్షసు లన్నవారు ఈ విధమైన గెరిల్లా యుద్ధ పద్ధతులను అనుసరించే వారు కనుకనే వారికి “నిశాచరు”లని, “కామరూపు”లని, “మాయావు”లని వారి విరోధులు ఏవేవో చెడ్డపేర్లు చాలా పెట్టారు!

మరొక్కమాట చెప్పి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. మన పౌరాణికులను విడిచిపుచ్చండి; మన చరిత్రకారులైనా మానవవికాస శాస్త్రానికి (anthropology) తా మివ్వదగు ప్రాధాన్య మివ్వరు. ఆ శాస్త్రాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు ఏ ప్రాచీన సంఘాన్ని గురించి, ఏ పురాతన సంఘటనను గురించి సముచితాభిప్రాయాలను ఏర్పరచు కొనడం సాధ్యపడదు. అన్ని సంఘాలవలె మనది కూడా మానవ వికాస చరిత్రలోని దశ లన్నింటి ద్వారా పయనించినట్టిదే! బ్రహ్మముఖం నుంచి మనం సరాసరిగా ఊడి పడలేదు!!

సీతారాములు

పదేళ్ళనాడు మద్రాసులో నా "సీతజోస్యం" నాటకాన్ని నా మిత్రబృందానికి చదివి వినిపించిన తర్వాత ఒక పండితమిత్రుడు చిరుకోపంతో చేసిన విమర్శ "ఈ సీత మా దృష్టిలోని సీత కా" దని. చిరునవ్వుతో ఆయనకు నేను చెప్పిన సమాధానం "ఈమె మీ దృష్టిలోని సీత కాకపోవచ్చుగాని, వాల్మీకి దృష్టిలోని సీత" అని. ఇప్పటికైనా నా పండితమిత్రుడు నాతో ఏకీభవించకపోవచ్చు. ఆయనవలె ఎందరెందరో ఏకీభవించక పోవచ్చు. అయినా, ఇదివరలో వలె ఇప్పటికీ - ఎప్పటికీ నా నమ్మకం వాల్మీకి సీతనే యధాతథంగా నేను నానాటకంలో ప్రవేశ పెట్టానని.

వాల్మీకిని సరిగా చదవక, చదివినా సవ్యంగా అర్థం చేసుకొనలేక, పెక్కుమంది సంభావిస్తున్నట్టు, సీత నోట నాల్కలేని పతివ్రతా శిరోమణి కాదు. అవసరమైనప్పుడు భర్తతో ఆమె నిష్కర్షగా మాట్లాడేది, గత్యంతరం లేనప్పుడు పరుషంగానైనా మాట్లాడేది. అనువాదాలతో సరిపుచ్చక, వాల్మీకి రామాయణం అరణ్యకాండలోని పదవ సర్గను చదవండి. (అది ఈ పీఠిక చివర రెండవ అనుబంధంలో ఉన్నది). దాన్ని చదివితే, "ఆయుధ మెక్కడ, అరణ్యవాస మెక్కడ" అని విభుని ఆమె సూటిగా ప్రశ్నించినట్టు తెలుస్తుంది. "శస్త్రములు చేపట్టుటవల్ల పాపబుద్ధి పుట్టును" అని ధవుని ఆమె గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తుంది. "పగ లేకనే యొక్కరిని జంపుట" మహాపాతకమని పెనిమిటితో ఆమె నిష్కర్షగా పలికినట్టు తెలుస్తుంది. పోతే, అయోధ్యాకాండలో 30వ సర్గను చదవండి. అరణ్యవాసానికి తనవెంట రావలదని భర్త గట్టిగా చెప్పినప్పుడు పట్టలేని కోపంతో తన తండ్రి మాటగా "నా అల్లుడు స్త్రీయే కాని పురుషుడు కాడు. పురుషవేషము దాల్చిన స్త్రీయై నన్ను వంచించెను!" అని పరుషంగా ఆమె పలుకుతుంది. కాగా, తన మాటగా మరింత పరుషమైన ధోరణిలో "నన్ను నటునివలె బరులపాలు చేయగోరు చున్నావు!" అని పలుకుతుంది. ఇంత పరుషంగా ఆమె నిష్కారణంగా పలకలేదు. అందుకు తగు కారణం ఉన్నది. దాన్ని మరికొంత దూరం పోయిన తర్వాత వివరిస్తాను.

సరే, "సీత హాస్యాలు కూడా ఆడేదా?" అని మరొక సందేహం పెక్కుమందికి కలగవచ్చు. ఔను! ఆమెది హాస్య ప్రవృత్తి, చతురతతో ఆమె హాస్యాలాడేది. అందరు వదినెలవలె మరదితో ఆమె ఎక్కువగా హాస్యాలాడేది. ఇది నా ఊహకాదు; వాల్మీకి రామాయణమే ఈ సంగతిని స్పష్టంగా చెబుతున్నది. సీతాపహరణం తర్వాత ఆమెను తలచుకొని విలపిస్తూ "చెట్టుచాటున దాగి నన్ను వేళాకోళము పట్టించ గోరుచున్నావటే!" అని రాము డన్నట్టు ఆరణ్యకాండ 61వ సర్గ తెల్పుతున్నది. "ప్రియులారా! నీవు పరియాచకము చేయు స్వభావము గలదానివని నే నెఱుగుదును" అని ఆయ నన్నట్టు 62వ సర్గ తెల్పుతున్నది. పంచవటి వద్ద ఒక శిలాఫలకాన్ని చూపిస్తూ "లక్ష్మణా! సీత మునుపు నాతోడ నీ రాతి మీద గూర్చుండి, నీ తోడ బెక్కు పరియాచకపు మాటలాడెను గదా!" అని రాముడన్నట్టు 63వ సర్గ తెల్పుతున్నది. కిష్కింధాకాండ ప్రథమసర్గ ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నది. అక్కడ తమ్మునితో "లక్ష్మణా! సీత చిఱునవ్వు మోముతో నడుమ నడుమ బరిహాస పూర్వకము లయినవియు తియ్యనివియు, రసవంతము లయినవియు, మేలొన గూర్చినవియు నైన పలుకులు పలుకు టెప్పుడు వినగలను?" అని రాముడంటాడు. సీత హాస్యోక్తు లాడేదనడానికి వీటినిమించి ఏమి సాక్ష్యాధారాలు కావాలి? ఈ సాక్ష్యాధారాల తర్వాత వాల్మీకి చిత్రణకు భిన్నంగా నేను సీతకు రూపకల్పన చేసినానంటే, అది సబబు కాగలదా?

లక్ష్మణునితో సీత పరియాచకాలాడుతూ ఉండేదని రాముడు స్వయంగా పలికిన మీదట వదినె ముఖమైనా మరదికి తెలియదనడం కంటె "నాన్ సెన్స్" వుంటుందా? అయినా, కిష్కింధాకాండ 6వ సర్గలో ఇది వున్నది. రావణుడు తనను ఎత్తుకుపోతున్న ఘట్టంలో తన ఆభరణాలను ఉత్తరీయంలో మూటకట్టి, ఋశ్యమూక పర్వత శిఖరంపై తన మంత్రులు నలుగురితో కూర్చున్న సుగ్రీవుని సమీపంలో సీత పడవేస్తుంది. వాటిని సుగ్రీవుడు రామలక్ష్మణులకు చూపించినప్పుడు,

లక్ష్మణుడు అన్నగారితో "ఆమె దొడుగు బాహుపురులెట్టివో, కమ్మ లెట్టివో, నాకు దెలియదు. నే నెల్లప్పు డామె పాదములకు మ్రొక్కుటంజేసి, యామె కాలియందియలు మాత్రము నే నెఱుగుదును" అన్నాడట (కిష్కింధాకాండ, 6వ సర్గ). పది సంవత్సరాలకు పైగా అరణ్య వాసంలోనేమి, అంతకుముందు అయోధ్యా నగరంలో నేమి పొరపాటుగానైనా లక్ష్మణుడు వదినె ముఖాన్ని చూడలే దనడం విడ్డూరపుమాట మాత్రమే కాదు, వికారపు మాట కూడా! వదినె ముఖాన్ని చూచినంత మాత్రాన తన మనస్సులో పాపచింతలు పుట్టవచ్చునన్న భయంతోనే క్ష్మణుడు ఆ పని చేయలేదా? అతని మనస్సు అంతగా దుర్బలమైనదా, దుష్టమైనదా? సమాజంలో స్త్రీ స్థానాన్ని గురించి అభిప్రాయాలు వక్రగతిని పట్టిన తర్వాత ఎవడో కిష్కింధకాండ 6వ సర్గలో లక్ష్మణుని చేత ఈ పలుకులను పలికించాడని నిస్సందేహంగా అనుకోవచ్చు. వనవాసానికి వెడుతున్న సందర్భంలో గంగానదిని దాటవలసి వచ్చినప్పుడు లక్ష్మణుడు సీతను "వెనుకనుండి బట్టుకొని" పడవలోకి ఎక్కించాడు. (అయోధ్యాకాండ, 52వ సర్గ). వదినె ముఖం వంక చూడ్డమే దోషమైతే, ఆమెను పట్టుకొని పడవ నెక్కించడం మరెంతటి మహాదోషం!!

రాముడు సీతను ఎంతగా ప్రేమించినా, ఆ ప్రేమ ఆయన పితృభక్తిని మించింది కాదు, ఆయన బ్రాహ్మణాభిమానాన్ని మించింది కాదు, ఆయన భ్రాతృ వాత్సల్యాన్ని మించింది కాదు, వంశగౌరవాన్ని గురించి ఆయన పట్టుదలకు మించింది కాదు. అందువల్లనే తండ్రి చెబితే, రాజ్యాన్నే కాదు, ధనాన్నే కాదు, ప్రాణాలనే కాదు, సీతనైనా భరతునికి అప్పగిస్తానని (!) కైకేయితో రాముడన్నాడు. (అయోధ్యాకాండ, 19వ సర్గ). తననైనాసరే భరతునికి అప్పగిస్తానన్నమాట విన్నందువల్లనే కావచ్చు, రామునితో సీత "నన్ను నటునివలె బరులపాలు చేయగోరుచున్నావు" అని కటువుగా పలికింది. ఇక, వైరము లేకుండానే చంపడం మహాపాపమని సీత హెచ్చరించినప్పుడు రాముడు ఋషులకు తా నిచ్చిన వాగ్దానాన్ని తప్పబోనని చెప్పడానికి ముందు "ఓ సీతా! నేను ప్రాణములను, నిన్ను, లక్ష్మణుని విడనాడుదుగాని..." అని స్పష్టం చేస్తాడు. (ఆరణ్యకాండ, 11వ సర్గ). మరొక ఘట్టంలో - లంకా యుద్ధంలో లక్ష్మణుడు , మూర్ఛిల్లినప్పుడు, అతడు మరణించినాడన్న భ్రమతో రోధించిన ఘట్టంలో - రాముడన్న మాటలు "నా కిక యుద్ధముతో గాని, ప్రాణములతో గాని, తుదకు సీతతో గాని పనియేమి యున్నది? దేశదేశమునను గావలసి నందఱు భార్యలు దొఱకుదురు; చుట్టాలును దొఱకుదురు; కాని, ఒక సోదరుడు దొరకుట యెక్కడనులేదు!" అని. (యుద్ధకాండ, 102వ సర్గ) సీతను గురించి ఇంతకంటె చులకనగా, నికృష్టంగా ఆయన మాట్లాడింది రావణ వధానంతరం, అశోకవనం నుంచి ఆమెను పిలిపించి, "స్వవంశమునకు నపకీర్తియు నిందయు రాకుండ గోరియు, నడవడి గాపాడుకొనగోరియు నేనింత కష్టపడితిని గాని, యదెల్ల నీ నిమిత్తముగాదు" అని చెబుతాడు. ఇంతటితోనైనా విరమించక, ఆయన పల్కిన పలుకు లివి; "
పరాయియింట జిరకాల ముండుటచే నడతల విషయమున సంశయాస్పదురాలైన నీవు నా యెదుట నుండుటచే గంటి నొప్పి వచ్చినవానికి దీపపు వెలుతురు మరింత పోట్లు పొడుచునట్లు " నీ దర్శనము నా కెక్కువ యాయాసాస్పదముగ నున్నది. కావున నో జనకరాజపుత్రీ! నే నానతిచ్చెదను; ఈ పదిదెసలలో నీ మనసున కెక్కిన చోటునకు బొమ్ము. నాకు నీతో గావలసిన యక్కల యేదియు లేదు; సత్కులమున బుట్టిన, యందును పౌరుషముగల యెట్టి మానవు డయినను జిరకాలము పొరుగింటనుండి వచ్చిన యాడుదాని బ్రేమతో జేపట్టునా? ఇంతదనుక క్రూరుడైన రావణుని తొడమీదనుండి జాలి పడినదానవు, ఆ దుష్టునిచే గామాతురమగు చూపుతో జూడబడినదానవునైన నిన్ను గొప్ప కులమున బుట్టినవాడనని పేరొందియుండు నే నెట్లు చేపట్టువాడను? నాకు వచ్చిన యవమానముం బోగొట్టుకొనుటకై నిన్ను జయించితిని కాని, నీ యందలి యాశచే గాదు. పోయిన కీర్తిని మరల సంపాదించితిని, ఇంక నీవు నీ ఇష్టమైన చోటికి బొమ్ము. ఓ శుభాంగీ! నే నెంతయో యాలోచించి యిట్లు పలికితినిగాని, యన్యముకాదు. నీవు లక్ష్మణునికడనో, భరతునికడనో, వానర రాజగు సుగ్రీవునికడనో, రాక్షసేంద్రుడగు విభీషణునికడనో, లేక నీ కెచ్చట నుండుట కష్టమో యచ్చట సుఖముగానుండి

జీవింపుము. దివ్యరూపము గలదానవు; మనోరమవు నైన నీవు బహుకాలము తన గృహమున నుండగా, గామాతురుడగు రావణుడు నిన్ను జూచి తన కామము నణచుకొని యుండి యుండునా?" (యుద్ధకాండ, 118వ సర్గ).

అయినా, ఆదర్శపురుషుడుగా, ఆదర్శప్రాయుడైన భర్తగా రాముని ఎందుకు సంస్తవిస్తారో నామట్టుకు నాకు అర్థంకాని విషయం!! రామాయణం మొత్తం మీద నిజంగా సంస్తవించదగు వ్యక్తి రాముడు కాదు, సీత. అటుతర్వాత సంస్తవించదగు వారు భరతుడు, లక్ష్మణుడు. ఆత్మాభిమానంలోగాని, హృదయ వైశాల్యంలో గాని, బుద్ధిసూక్ష్మతలో గాని, వాక్చాతురిలోగాని, ధర్మాభినిరతిలో గాని, సీతకు ఏడు వెనకలుగా నిలవ వలసినవాడే రాముడు. ఇక, త్యాగగుణంలో భరతునికి ఒక యోజనం దూరంలోనికైనా రాముడు రాడు, రాలేడు. విలపిస్తూ చేసినట్టిది త్యాగం కానేరదు. ముమ్మాటికి సత్యం. "జాబాలి" పీఠికలో నేను వివరించినట్టు, తనకు యౌవరాజ్య పట్టాభిషేకం తప్పిపోయినందుకు, తనకు సింహాసనం దక్కనందుకు లోలోపల కుమిలిపోవడమే కాదు, పైకి కూడా రాముడు తన బాధను వెళ్ళగక్కుతూ పోయాడు, పోతే, రామాయణం మొత్తంలో లక్ష్మణుడు గట్టిగా విలపించిన ఘట్టాలు బహుశా రెండు మాత్రమే. వాటిలో మొదటిది "నీచుడు నీచురాలి ననినట్టు" (ఇవి నా మాటలు కావు; సీత మాటలు) తన శీలాన్ని శంకిస్తూ భర్త తనను అడ్డమైన మాటలన్న మీదట లంకలో సీత అగ్నిప్రవేశం చేసినప్పుడు; రెండవది, అన్న ఆనతి ప్రకారం వాల్మీకి ఆశ్రమం చెంత అరణ్యంలో నిండుగర్భవతి సీతను విడిచి పెట్టినప్పుడు. ఇందుకు భిన్నంగా రాముడు విలపించనట్టి ముఖ్యఘట్టం ఏదీ లేదు. పైగా, "ఇది దైవ ప్రేరణ" అని, "దైవయోగ" మని, "దైవమాయ" అని, (అయోధ్యాకాండ, 22వ సర్గ), "మనుజులకు స్వాతంత్ర్య మనునది లే"దని, "పుట్టుట గిట్టుటకే" అని (అయోధ్యాకాండ, 104వ సర్గ), "తొంటి బాముున నేను కావలెనని పలుమాలు పాపకార్యములు చాలు, చేసి యుంటిని... వాని కన్నిటి కిప్పు డనుభవించ వలసిన కాలము వచ్చిన"దని (అరణ్యకాండ, 63వ సర్గ), కాస్త సందు దొరికితే రాముడు మెట్ట వేదాంతంలో పడిపోతాడు!

అయినా సీతను మించి, భరతుని మించి, లక్ష్మణుని మించి రాముడు ప్రశంసలందుకొనడం ఎందువల్ల? దీని కొక ముఖ్యకారణం లేకపోలేదు. అది "పబ్లిక్ రిలేషన్స్"కు, "ఇమేజ్ బిల్డింగ్"కు సంబంధించినట్టిది. ఉచితానుచితాలను, సమయాసమయాలను, సందర్భా . సందర్భాలను ఎంతమాత్రం పాటించక, ఒక వ్యక్తిని అదేపనిగా స్తోత్రం చేస్తూపోతే, అతడికి విధిగా ఘనత లభిస్తుంది. రాముని విషయంలో సరిగా ఇంతే జరిగింది. రామాయణంలో ఆయనను స్తోత్రం చేయనివారు దాదాపుగా లేరు. చివరికి శూర్పణఖ, మరీచుడు, కుంభకర్ణుడు కూడా ఆయనను స్తోత్రం చేస్తారు. వాల్మీకి రచనను పెంచి వ్రాసినవారే, రాముని అవతార పురుషునిగా చిత్రించినవారే ఈ పొగడ్తలను చేర్చివుండవచ్చు. "మనపట్ల వైరంలేని వారిని చంపడం ద్వారా మీరు మహాపాపం చేస్తున్నా"రని సీత భర్తను తీవ్రంగా విమర్శించిన వెనువెంటనే ఆమెచేత "నే నాడుదాననై నందున జపలబుద్ధిచే నింత చెప్పితినిగాని, నీ కెవ్వడు నేర్పగలడు?" అనిపించడం వాల్మీకి రచనలో వేలు పెట్టినవాని పనే అయి వుండాలి!

దశరథుడు "కామపరతంత్రు"డని, "కైకేయికి లోబడినవా"డని (అయోధ్యాకాండ, 53వ సర్గ) దూషించింది మరెవరోకాదు, రాముడే! అయినా, ఆదర్శప్రాయుడైన తనయునిగా రాముని భూషించడం భావ్యమా? తనకోసం తల్లి రాజ్యాన్ని సంపాదించగా భరతుడు దాన్ని నిరాకరించాడు. ఇంతటి గొప్ప త్యాగం చేసిన భరతుడు రాజ్యలోభానికి అతీతుడు కాకపోవచ్చునని అనుమానించింది మరెవరో కాదు, రాముడే! (యుద్ధకాండ, 128వ సర్గ) అయినా, ఆదర్శప్రాయుడైన సోదరునిగా రాముని కీర్తించడం భావ్యమా? తన జీవితంలోని ప్రతి ముఖ్యఘట్టంలో రాముడు సీతను అవమానించాడు, అవస్థల పార్జేశాడు, అయినా, ఆదర్శప్రాయుడైన భర్తగా రాముని సంస్తవించడం భావ్యమా? ఏ కఠిన పరీక్షకు నిలవవలసి వచ్చినా, రాముడు వలవల విలపించాడు. అయినా, ఆదర్శప్రాయుడైన వీరునిగా రాముని ప్రస్తుతించడం భావ్యమా?

అయితే, బహుళ జనుల దృష్టిలో ఎంత మాత్రం భావ్యం కాని పని - రాముని గురించి ఇట్టి ప్రశ్నలు నేను వేయడమే కావచ్చునేమో? అంతమేరకు రాముని విషయంలో "బ్రెయిన్ వాషింగ్" జరిగింది!

స్వతంత్రంగా ఆలోచించడం, స్వతంత్రంగా వ్యవహరించడం, మానసిక దౌర్బల్యాన్ని చూపినప్పుడు తండ్రినైనా ధిక్కరించడం, ధర్మవిరుద్ధంగా వర్తించమంటే గురువు మాటనైనా త్రోసిపుచ్చడం - ఈ విధమైన ధీరగుణాలు రామునిలో కలికానికైనా కానరావు. అందువల్లనే ఆయన తండ్రిని ఏడ్పించాడు, తల్లిని ఏడ్పించాడు, భార్యను ఏడ్పించాడు, తమ్ములను ఏడ్పించాడు, తమ బ్రతుకు తాము బ్రతుకుతున్న ఆటవికులను ఏడ్పించాడు, అందరినీ మించి తానే ఏడ్చాడు! చివరికి సరయూనదిలోకి దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు!

పోనీ, ఇతర విషయాలలో నాతో ఏకీభవించక పోయినా, నా పీఠికలోని మొదటి కొన్ని పుటలను చదివినంతనే ఈ పుస్తకాన్ని ముక్కముక్కలుగా చించిపారవేయక, ఇంతవరకు నాతో వచ్చినవారు ఒక్క విషయంలో నాతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను. సీతారాము లిద్దరిలో చేయెత్తి నమస్కరించదగు వ్యక్తి రాముడు కాదు,

సీత, సీత, ముమ్మాటికీ సీత!!

ఉపసంహారణ

ఎన్నెన్నో అవాంతరాల తర్వాత, ఎన్నెన్నో ఆలస్యాల తర్వాత, ఎట్టకేలకు ఈ పీఠికను ముగించ గలుగుతున్నాను. దీన్ని వ్రాయడానికి ఎన్నెన్నో గ్రంథాలను చదవవలసివచ్చింది, ఎంతెంతగానో పరిశోధన జరపవలసివచ్చింది. అయినా, రామాయణాన్ని గురించి చివరి మాటను చెప్పగలిగినానన్న భ్రమ నాకు లేదు. మహాభారతంతో పోల్చినప్పుడు రామాయణంలో జరిగిన ఫోర్జరీలు చాలా తక్కువ, పురాణాలతో పోల్చినప్పుడు తక్కువ మరింత అయినా, రామయణంలోనైనా మార్పులు, చేర్పులు బహుళంగానే జరిగాయి, బహుశా నాలుగైదు శతాబ్దాలపాటు అవి జరిగాయి, అందువల్ల ముందు తూర్పార బట్టి, అటు తర్వాత చెరిగినా, జల్లించినా, తప్పునుంచీ, తాలునుంచీ గట్టిగింజను వేరు చేయడం తేలిక కాదు; అది దాదాపు అసాధ్యమని చెప్పినా చెప్పవచ్చు. అయినప్పుడు, నా పీఠికలోని విషయాలను, ముఖ్యంగా రామాయణకాలం నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలకు సంబంధించిన విషయాలను, పరమ సత్యాలుగా స్వీకరించవలసిందిగా నేను కోరలేను. నేను కోరగలిగింది ఒకే ఒక విషయం. అది ఆలోచించకుండా నా వైఖరిని నిరసించవలదని, పరిశీలించకుండా నా వాదాన్ని నిరాకరించవలదని.

అన్నట్టు, నా వైఖరి పూర్తిగా కొత్తది కాదు, నా వాదం పూర్తిగా మౌలికమైనది కాదు. రామాయణం విషయమై నా కంటె నిశితంగా వ్రాసిన వారున్నారు; దాన్ని కేవలం ఒక కట్టుకథగా, ఒక జానపద గాథగా త్రోసివేసిన వారున్నారు. అట్టివారిని నేను గట్టిగా కాదనను గాని, రామాయణంలో చారిత్రకసత్యం రవ్వంతగా వుంటే, అది క్రీస్తుకుపూర్వం పదవ శతాబ్ది ప్రాంతాల ఉత్తర భారతంలోగల కొద్దిపాటి రాజ్యాలు పెక్కింటిలో ఒకదానికి చెందిన రాజాస్థానంలోని కుట్రలకు పరిమితమని నా వైఖరి; రామరావణ యుద్ధమనేది నిజంగా జరిగివుంటే, దాన్ని ఆహార సేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థల మధ్య సంఘర్షణగా పరిగణించవచ్చునని నా వాదం. నా వైఖరి సమర్థనకై "జాబాలి" పీఠికలో నేను ప్రయత్నించగా, నా వాదాన్ని మీకు నివేదించడానికై "సీతజోస్యం" పీఠికలో ప్రయత్నించాను.

ఎవరి కెంత బాధ కలిగినా సరే, మరొక్క విషయాన్ని చెప్పి, అంతటితో సరిపెడతాను. రామాయణ భారతాలైనా, అష్టాదశ మహాపురాణాలైనా వాటి ప్రదానోద్దేశాలు కులవ్యవస్థను పరిరక్షించడమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయడమే. అందువల్ల ప్రస్తుత ధోరణిలో వాటి ప్రచారం సాగితే, ప్రకృత రీతిలో వాటిపట్ల భక్తిశ్రద్ధలు ప్రబలడం జరిగితే, నవసమాజ నిర్మాణం, నూతన ధర్మసంస్థాపన కేవలం శుష్క నినాదాలుగానే మిగిలిపోవడం తథ్యం. దాదాపు పదిహేనువందల సంవత్సరాలుపాటు మన మానసిక వికాసానికి, మన సాంఘిక పురోగతికి రామాయణ, భారతాల ప్రభావం, అష్టాదశ మహాపురాణాల ప్రభావం ఒక తీవ్ర ప్రతిబంధకంగా నిలిచింది. ఆ ప్రతిబంధకాన్ని ఇకనైనా తొలగించుకొనకపోతే, మనం ఆధునిక యుగంలో ప్రవేశించలేము, అభ్యుదయ పథం వెంట పురోగమించలేము.

"లుంబిని"
బంజారా హిల్స్ — నార్ల వెంకటేశ్వరరావు
హైదరాబాదు
డిసెంబర్ 31, 1978

మొదటి అనుబంధం

దశరథ జాతకం

శాస్త్ర జేతవనమున విహరించుచూ తండ్రి చనిపోయిన గృహస్థును గూర్చి చెప్పినది :

వర్తమాన కథ

అతడు తండ్రి మరణించిన పిదప దుఃఖాభిభూతుడై పనులన్నియు విడనాడి శోకముచే వెర్రివా డయ్యెను. శాస్త్ర ప్రాతఃకాలముననే లోకమును గూర్చి యోచించినపుడు త్వరలోనే అతడు శ్రోతాపత్తి పొందగలడని తోచినది. మరునాడు శాస్త్ర శ్రావస్తిలో భిక్షాటనముచేసి భోజనానంతరము భిక్షువులను సాగనంపి, ఒక్క భిక్షువును వెంటనిడుకొని, అతని యింటి కరిగెను. గృహస్థు శాస్తకు ప్రణమిల్లి కూర్చున్న పిదప శాస్త మృదుమధుర స్వరముతో "ఉపాసకా, దుఃఖించు చున్నావా?" అనెను. "భస్తే, చిత్తము, పితృశోకము నన్ను వేధించు చున్నది". "ఉపాసకా, పూర్వము పండితులు అష్టలోక ధర్మములను (అష్టాంగ యోగములు) స్వరూపతః గ్రహించి తండ్రి మరణించినను లేశమాత్రము కూడా దుఃఖింపరైరి". అని శాస్త్ర అతని ప్రార్థనపై పూర్వజన్మ కథ చెప్పెను.

పాలీ భాష నుండి తాము తెనిగించిన ఈ జాతక కథ పునర్ముద్రణకు రెండేళ్ళనాడు నేను కోరినంతనే అందుకు సంతోషంగా సమ్మతించడమే కాక, నాయోగక్షేమాలను విచారిస్తూ స్వామి శివశంకరశాస్త్రి ప్రేమాదరాలతో కూడిన లేఖ వ్రాశారు. అదే ఆయన నుంచి నాకు చివరి లేఖ అయినందుకు చింతిస్తూ, ఆయన స్మృతికి ప్రేమాంజలి ఘటిస్తున్నాను.

అతీతకథ

పూర్వకాలమున వారణాసిలో దశరథరాజు నాలుగుగతులకును గురికాక ధర్మప్రకారము రాజ్యము చేయుచుండెను. ఆయనకున్న 16,000 మంది భార్యలలో పట్టపురాణికి ఇరువురు కొమరులును, ఒక కుమారియును జన్మించిరి. జ్యేష్ఠపుత్రుని పేరు రామపండితుడు, రెండవవాని పేరు లక్ష్మణ కుమారుడు, పుత్రిక సీతాదేవి. కొంతకాలమునకు పట్టపుదేవి కాలధర్మము చెందెను. ఆమె పోయిన తర్వాత చాలా సేపటి వరకును రాజు శోకాభిభూతుడై యుండెను. అమాత్యులు బోధించిన మీదట రాజు తెలివి తెచ్చుకొని అపరకర్మలు చేయించి వేరొకతెను పట్టపురాణిని చేసుకొనెను. ఆమె రాజున కిష్టురాలును, మనోరంజకురాలును ఆయెను. ఆవల ఆమె గర్భవతియై దోహదములు పొంది, తుదకు పుత్రుని గనెను. బిడ్డనికి భరత కుమారుడని పేరు పెట్టిరి. పుత్ర స్నేహమున రాజు ఆమెతో "భద్రే, నీకు వరమిత్తును కోరుకొనుము" అనెను. ఆమె వరము గైకొని, కుమారుని కేడు సంవత్సరాలు వచ్చునప్పటికి రాజసన్నిధి కరిగి "దేవా, నా కుమారునికై వరము దయ చేసితిరి. ఇప్పుడు దానిని ప్రసాదింపుడు" అని విన్నవించెను.

"భద్రే, కైకొనుము".

"దేవా, నా పుత్రునకు రాజ్యము దయ చేయుము".

రాజు వేలితో బెదిరించుచు "దుర్మార్గురాలా, నీవు నశింతువు! నా కుమారులిరువురు అగ్ని స్కంధములవలె ప్రకాశించుచున్నారు. వారిని వలదని నీ కుమారునికి రాజ్యము యాచించు చున్నావా?" అనెను. ఆమె చెదరి, శయనాగారమునకు చేరి పండుకొనెను. ఆవల ఆమె మాటి మాటికిని కుమారునకు రాజ్యము కావలెనని యాచించు

చుండెను. ఆమెకు వర మీయక రాజు తనలో "స్త్రీలకు కృతజ్ఞత లేదు. వారు ద్రోహము తల పెట్టుదురు. మోసమున రాజముద్రిక వేసి నా కుమారులను సంహరింప కుందును గాక" అని తలచి, కొడుకులను రావించి, విషయము వివరించి "మీ రిచట నున్న యెడల అపాయము సంభవింప వచ్చును. మీరు ఏదో సామంత రాజ్యమున గాని, అరణ్యమునగాని నివసింపుడు. నా యనంతరం మీరు మరలివచ్చి, వంశపరంపరాగతమగు రాజ్యము కైకొనుడు" అనెను.

ఆవల రాజు జ్యోతిష్కులను రావించి, తన ఆయుఃపరిమాణము గూర్చి అడిగెను. "పంద్రెండు సంవత్సరము"లని వారు చెప్పిరి. అప్పుడు రాజు కుమారులతో "నాయనలారా, మీరు నేటి నుండి పంద్రెండు సంవత్సరముల తర్వాత మరలి వచ్చి ఛత్రధారణము చేయుడు" అని చెప్పగా, వారు "మంచి"దని తండ్రికి ప్రణమిల్లి, రాచభవనంలోని వారు కన్నీరు కార్చుచుండగా నగరి వెలువడిరి. "నేను కూడా సోదరుల వెంట పోవుదు"నని సీతాదేవి తండ్రికి ప్రణమిల్లి కన్నీటితో బయలు వెడలెను. తమ వెంటవచ్చు జనమును వారు వెనుకకు మరల్చి హిమాలయమునకు జనిరి. జలము, ఫలములు మొదలగునవి సులువుగా లభించుచోట వారు ఆశ్రమమును నిర్మించుకొని, కందమూల ఫలాదులతో జీవనము చేయుచుండిరి. లక్ష్మణ పండితుడు, సీతాదేవియును రామపండితునితో "నీవు మాకు పితృస్థానీయుడవు, కావున ఆశ్రమ మందుండుము. మేము కందమూల ఫలాదులు తెచ్చి నిన్ను పోషింతుము" అనగా రామపండితు డాశ్రమముననే యుండసాగెను. వార లిరువురు కందమూల ఫలాదులు తెచ్చి ఇచ్చుచు ఆయనకు సేవ చేయు చుండిరి.

అక్కడ దశరథ మహారాజు పుత్రశోకముతో తొమ్మిదవ యేటనే మరణించెను. అపరకర్మలు జరిగిన పిమ్మట భరతకుమారుని అభిషేకమునకు అమాత్యులు అడ్డంకులు పెట్టిరి. "రాజ్యచ్ఛత్రాధిపతి అరణ్యమున నివసించుచున్నాడు" అని వా రనగా, భరత కుమారుడు "రామపండితుని వనమునుండి కొనివచ్చి ఛత్రధారణము చేయింతుము" అని యోచించి, పంచ రాజలాంఛనములతో, చతురంగబలముతో బయలువెడలి, రామపండితుని నివాసము చేరుకొని, కొలదిదూరములో శిబిరము నేర్పాటు చేసెను. లక్ష్మణపండితుడు, సీతయు కాననములోనికి పోయిన సమయమున భరతకుమారుడు రామపండితుని ఆశ్రమము చేరి, సుప్రతిష్టమైన సువర్ణ విగ్రహమువలె నిశ్చింతముగా ఉపవిష్టుడై ఉన్న రామపండితుని చూచెను. ఆవల సన్నిధికిబోయి, ప్రణామము చేసి ఒకప్రక్క నిలిచి, రాజు మరణవృత్తాంతము తెలిపి, అమాత్యులతో కూడా రాముని పాదముల వాలి, రోదనము చేయసాగెను. రామపండితుడు చింతింపలేదు. రోదింపలేదు. ఆయన ఆకృతిలో వికారము తోపలేదు. సాయంకాలమునకు సీతాలక్ష్మణులు కందమూలఫలాదులు కొనితెచ్చిరి. రాముడు తనలో "ఇతడు చిన్నవాడు. నాకు ఉన్నంత ద్రఢిమ కలవాడు కాడు. తండ్రి మరణవార్త సూటిగా తెలిపినచో, శోకావేగము కలిగి, గుండెలాగినను ఆగవచ్చును. వీ రిరువురను జలాశయములోనికి పంపి ఈ వృత్తాంతము తెలిపెదను" అని తలపోసి, ఎదుటనున్న నీటిపట్టు చూపి "మీరు చాలా ఆలస్యముగా వచ్చితిరి. నీటిలో స్నానము చేయుడు" అని ఈ గాథ పలికెను.

లక్ష్మణా, సీతా, జలంబులందిగుడు! వారు

జలములోనికి జని నిలిచిరి. ఆవల రామపండితుడు వృత్తాంతము వివరించుచు శేషగాథ పలికెను :

మనతండ్రి దశరథక్ష్మా మహారాజు
మరణవార్తను దెల్పు భరతుండు నేడు.

తండ్రి మరణవార్త విని వారు తెలివి కోలుపోయిరి. రెండవ పర్యాయము వార్తవిని, మరల తెలివి కోలుపోయిరి. మూడవసారి కూడా వారు స్పృహ తప్పుటచే అమాత్యులు వారిని నీటిలోనుండి యావలకు గొనివచ్చి, కూరుచుండబెట్టిరి. భరత కుమారుడు 'జనకుని మరణవార్త విని, సోదరుడు లక్ష్మణుడును, చెల్లెలు సీతయును దుఃఖము సహింపలేకుండిరి.

రామపండితుడు మాత్రము విచారపడలేదు. దుఃఖింపలేదు. ఈయన శోకరహితుడై యుండుటకు కారణ మేమో అడిగెదను' అనుకొని ఈ గాథ పలికెను.

శోకింప దగినను నీకు దుఃఖంబు
రాదే ప్రభావాన రామ, తెల్పుదువ?
తండ్రి గతించు వృత్తాంతంబు వినియు
రా కున్న దేటికి నీకు దుఃఖంబు?

తాను శోకరహితుడై యుండుటకు కారణము తెలుపుచు, అనిత్యతాస్వరూపమును వివరించుచు ఆయన ఈ గాథలు పలికెను.

ఎంత విలపించినగూడ నెవని జీవి
తమ్ము నిలువదొ వానికై తనకు తాను
బుద్ధిమంతుడు పీడలు పొందనేల?
పడుచువారలు, వృద్ధులు, పండితులును
నిండు మూర్ఖులు, ధనికులు, నిర్ధనులును
అందరును మృత్యువొందుదు రనుట నిజము.
అవనిజమునుండి పడిపోదు ననుభయంబు
ఫలమునకు నుండు నిత్యము, ప్రభవమొందు
మనుజునకు నిత్యముండును మరణ భయము.
ఉదయమున చాల గనబడుచుంద్రు జనులు
సందెవేళకు నుండరు కొంద రందు;
సందెవేళను గనబడు జనమునందు
ఒక్కడుంగూడ గనబడ డుదయవేళ.
మూడులగువార లేడ్చుచు మొత్తుకొనుచు
కష్టపడ లాభలేశము కలుగునేని
ఉత్తములు గూడ నేడ్చుచు మొత్తుకొందు.
తనకు దా హింసించుకొనుచు నెంతయును
దుఃఖించు నాతండు దుర్వర్ణు డగును
పొగులుచు నున్నచో పోషణం బగునె
మృతునకు? ఏడుపు వితథమ్ము సుమ్ము,
ముట్టుకొన్నంతనే గృహమునకు నిప్పు
సలిలముల నార్పివేసెడి చందనమునను
దూదిపింజను వాయువు తోలునట్లు
తోడనే జ్ఞాని దుఃఖమున్ దోలవలయు.
ప్రాణి యేకాకిగా ప్రభవించుచుండు
ఒక్క కుటుంబాన నుదయించుచుండు;.
సంయోగపరములు సర్వభోగములు.

ఇహపరలోకాల నెవడు ధ్యానించు
అష్టజగద్ధర్మ మవగత మెవని
కాబహోశుతు, ధీరు, నధికశోకంబు
సైతము బాధింపజాలదు సుమ్ము!
యోగ్యు లౌవారల కొసగుచునుందు
భోగవైభవములన్ పోషించుచుందు
బంధువులన్, పెరవారి పాలింతు
కరణీయ మిదె బోధ కల్గువారలకు

అక్కడ సమావిష్టులైన జనులు అనిత్యతా ప్రకాశనమును, ధర్మోపదేశమును గ్రహించి శోకరహితులైరి. అప్పుడు భరతకుమారుడు రామపండితునకు ప్రణామముచేసి "వారణాసీ రాజ్యపరిపాలనము నిర్వహింపుడు" అని వేడెను.
"లక్ష్మణకుమారుని సీతాదేవిని కొనిపోయి రాజ్యపాలనము చేయుము" అని రాముడనగా, "దేవా, మరి తామో" అని భరతుడడిగెను.

"నాయనా, పండ్రెండు సంవత్సరముల తర్వాత నీవు రాజ్యము చేయవలయునని నాయనగారన్నారు. నేనిప్పుడే అచటకి పోయిన పక్షమున ఆజ్ఞాపాలనము కానేరదు. మిగిలిన మూడు సంవత్సరములు గడిచిన పిదప వత్తును".
"అంతవరకెవరు రాజ్యము నెరపుదురు!"
"నీవు చేయుము".
"నేను నడపలేను".
"నేను రానంతవరకును ఈ పాదుకలు రాజ్యము నడుపును" అని రామపండితుడు తృణపాదుకలను తీసి యిచ్చెను. వారు ముప్వురును పాదుకలను గైకొని రామపండితునకు ప్రణామముచేసి, పరివారముతో వారణాసి చేరిరి. మూడు సంవత్సరముల కాలము పాదుకలను ప్రతినిధిగా నుంచి రాజ్యపాలనము చేసిరి. అమాత్యులు తృణపాదుకలను సింహాసనముపై నిలిపి అచట అభియోగములకు తీర్పునిచ్చెడివారు. తీర్పు సరిగా ఉండనిచో పాదుకలు పరస్పరము కొట్లాడుకొనునవి. ఆవల నిర్ణయములు సరిగా జరిగినచో పాదుకలు శాంతముగానుండెడివి. రామపండితుడు మూడు సంవత్సరముల తరువాత అడవి వెలువడి వారాణసి చేరి ఉద్యానమున ప్రవేశించెను. ఆయన యాగమన సూచన తెలిసికొన్న అమాత్యులతో కుమారుడు సీతను పట్టపురాణిని చేసి ఇరువురకును రాజ్యమప్పగించెను. ఇట్లు పట్టాభిషిక్తుడైన. బోధిసత్వుడు అలంకృతమైన రథమెక్కి అనుయాయులనేకులతో నగర ప్రదక్షిణము కావించి సుచంద్రప్రసాదమునపై అంతస్తు చేరి 16 వేల వత్సరములు ధర్మాను సారముగా రాజ్యముచేసి తుదకు స్వర్గగామి అయ్యెను.

(అభిసంబుద్ధగాద ఈ విషయము స్పష్టపరచు చున్నది.

పరిపాలనము మహాబాహువు కంబు
కంఠుడు రాముడు కావించినాడు
పదునారువేల సంవత్సరమితిని.)

శాస్త ఈ ధర్మోపదేశము చేసి జాతకములు రెంటిని సరిపోల్చెను. సత్య ప్రకాశనాంతరము గృహస్థు శ్రోతాపత్తిఫలము నందెను.
"ఆ కాలమున దశరథ మహారాజు శుదొధనుడు; మాత మహామాయ; సీత రాహులమాత, భరతుడానందుడు; లక్ష్మణుడు సారిపుత్రుడు : పరిషత్తు బుద్ధపరిషత్తు! రామపండితుడు నేనే."

రెండవ అనుబంధం

వైరము లేకనే వధ

వావిళ్ళవారికి కృతజ్ఞతతో వారు ప్రచురించిన "శ్రీ మదాంధ్ర వచన రామాయణము" నుంచి ఆరణ్యకాండలోని తొమ్మిదవ, పదవ సర్గలను ఇక్కడ ముద్రిస్తున్నాను. ఇది వాల్మీకి రామాయణానికి శ్రీ సరస్వతుల సుబ్బరామశాస్త్రిగారి తెలుగు సేత.

సీత సుతీకమునీంద్రుని యనుజ్ఞ వడసి ప్రయాణ మయిన పెనిమిటిం జూచి, మిక్కిలి తిన్నని పలుకులతో నిట్లనియె : "ఈ మునిధర్మము గొప్పది. దీనిని గడు సూక్ష్మమార్గమున సంపాదింపవలయు. ఇహలోకమున నింద్రియ విషయములందు దగులు విడిచినవానికే యీ ధర్మము సాధ్యముగా గలదు. పుడమియందు బొంకులాడుట మహాపాతకము. పరదారాభిమనమును, పగలేకయే యొక్కరిం జంపుటయు నా మహాపాతకమునకంటె మించిన మహాపాతకములు. ఈ మూడును కామ జన్యములగు వ్యసనములు. రాఘవా! బొంకులాడుట నీ కింతకు ముందును లేదు. ఇకమీదను గలుగదు. ధర్మహాని దెచ్చు పరదారాభిలాష నీ కెక్కడిది? నరేంద్రా! నీకు బరదారాపేక్ష ఇప్పుడును లేదు, ఇంతకు మునుపును లేదు, ఇకమీద నెప్పటికిని గలుగదు. శ్రీరామా! మనసునగూడ నీ కిట్టి యాశలేదు. అది దృఢము, నృపాత్మజా! ఎప్పటికిని నీవు స్వభార్యయందు రతిగలిగి యుండువాడవు.సత్యసంధా!మహాత్మా!శ్రీమంతుడా!లక్ష్మణాగ్రజా!నీయందు ధర్మము, సత్యము, వేయి యేల, సుగుణము లన్నియు స్థాపితములై యున్నవి. మహాబాహువా! శుభకరమైన దర్శనము గల యో నాథా!

జితేంద్రియులచే నన్ని సుగుణములు పొందగూడునుగాన, నీయెడ జితేంద్రియత్వముగూడ సిద్ధముగా నున్నది. అయినను, మూడవదగు క్రూరమైన పరప్రాణహింస నీకు సంప్రాప్తమైనది. పామరులజ్ఞానము వలన పగలేకయే ప్రాణిహింస చేయుదురు. పామరులు చేసెడి ప్రాణి హింసారూపమగు పాపమునకు నీ వొడి గట్టితివి. శూరా! నీవు మునిజన సంరక్షణము నిమిత్తము పోరుచేసి, దండకారణ్యమున నున్న రాక్షసుల నందఱను బరిమార్చెదనని ప్రతిజ్ఞసేసితివి. దీని నిమిత్తమే వింటిని బాణములను దాల్చి లక్ష్మణ సమేతుడవై యీ దండకారణ్యమునకు వచ్చితివి. ఇప్పుడు నీ వట్లు బయలువెడలుట చూచి, నీ పితృవాక్య పరిపాలనాది ధర్మమును, నీ మేలును దలంచిన నా మనము వంతల పాలగుచున్నది. ఓ వీరుడా! మనము దండకారణ్యములకు బోవుట యుక్తముగా దోపలేదు. దానికి గారణము సెప్పెద నాలకింపుము. నీవు విల్లు చేతబూని, తమ్ముని దోడు సేసికొని, యడవులకు బోవుచున్నాడవు. అచ్చటనున్న యెల్ల వనచరులను జూచి బాణ ప్రయోగము చేయుదువు! క్షత్రియులకు విల్లును, అగ్నిహోత్రుని గట్టెలును సమీపముననున్నచో మఱింత చిరాకు హెచ్చును.

మున్నొకప్పుడు బహు మృగపక్షి సంఘముల కునికిపట్టయిన యొక్క పావనమగు నాశ్రమమున సత్యము పలుకువాడును, సదాచారుడునునైన మునీంద్రుడొక్కరుడు తపస్సు చేయుచుండెను. దేవేంద్రు డా మునియొక్క తపస్సునకు విఘ్నము నొనరింపగోరి, కావలివాని రూపుదాల్చి. కత్తియొకటి దీసికొని యా యాశ్రమమునకు వచ్చెను. అట్లు దేవేంద్రుడు భటరూపముతో వచ్చి యయ్యాశ్రమమున దీవ్ర తపము సేయుచున్న యా మునీందుని యెదుట నిల్చి, "యో ద్విజేంద్రా! యీ కత్తిని నీకడ నుంచుకొని నే నడిగినప్పుడిమ్మ"ని చెప్పెను. ఆ మునీంద్రు డా కత్తిని దీసికొని, యది మొదలు తనయెడ దాపరికము చేసిన వస్తువును గాపాడుట యం దెక్కువ శ్రద్ధగలవాడై, తన వశమున నప్పగించిన ఖడ్గమును జేతపట్టుకొనియే తిరుగుచుండెను. తనయొద్ద నిల్లడవెట్టిన దానిని గాపాడుట యందాసక్తి గలవాడగుటచే దుంపలు పండ్లు తేబోవునపుడుగూడ నా కత్తి లేకుండ బోయి యెఱుగడు. తపసే కలిమిగా గల యా మునీంద్రు డెల్లప్పుడు కత్తిని జేతబూని పోవుచు, తపసు నందు దలంపు మాని, శస్త్రసంగము వలన గ్రూరబుద్ధి బూని, దేనినిబట్టినను నఱకుచు జీవహింస చేసి,

యన్యాయములకు బాల్పడి, నరకమున కేగెను, అని యిట్లు శస్త్రసంబంధమున నింతటి చేటుగలిగెనని పెద్దలు చెప్పగా నీ యితిహాసము వినియుందును.

ఆయుధముల దాల్చియుండుట యగ్ని దాల్చియుండటంబోలి మనోవికారమునకు గారణమగునని పెద్దలు చెప్పుదురు. కావున నాథా! నీ యెడ నాకు గల స్నేహము చేతను, నీవు నా యెడ జూపు బహుమానము చేతను, దెలిసిన విషయమునే జ్ఞప్తికి దెచ్చుచున్నాను. నీకు దెలియని సంగతి నుపదేశించు దానను గాను. నీవు వింటినిదాల్చి, వైరములేక, దండకారణ్యముననున్న యసురులను జంపబూనుట యెంతయు జేయదగని పని యని నాకు దోచుచున్నయది. తప్పులేక జనులను హింసించుట నా కిష్టముగా దోపలేదు. శూరులగు క్షత్రియులు ధనుర్ధరులై నొచ్చినట్టి మునుల రక్షింపవలసినది కాని, యిట్లు రక్కసులను వైరములేక హింసించుట తగదు. ఆయుధ మెక్కడ? అరణ్యవాస మెక్కడ? క్షత్రియ ధర్మ మెక్కడ? తప స్సెక్కడ? ఇవి పరస్పర విరుద్ధములైనవి. కావున మన మిప్పుడు వనమున నున్నాము. కనుక, వనవాసయోగ్యమయిన తపస్సు చేసెదము. ఆర్యా! శస్త్రములు చేపట్టుట వలన పాపబుద్ధి పుట్టును. ఇప్పు డిట్టి పాపబుద్ధి మనకు దగదు. వనవాసము ముగించి యయోధ్య కేగిన పదంపడి క్షాత్రము బూనుదువు గాని యిప్పటికి మానుము. నీవు రాజ్యము వదలి యెల్లప్పుడు వనవాసమునం దాసక్తి గలిగి తాపసుడవై యుందువేని, నా యత్తగారగు కైకకును, మామగారికిని దఱుగని ప్రేమము గలుగును. ధర్మమువలన నర్థము గలుగుచున్నది. ధర్మము వలన గామము గలుగుచున్నది. నరుడు ధర్మము వలన నంతయు బొందుచున్నాడు. ఈ జగత్తునకు సారభూతమైన ధర్మమేకాని వేరొక్కటి కాదు. జ్ఞానులగువార లయ్యయి కృచ్ఛచాంద్రా యణాదులగు, నియమములు పూని, యుపవాసములు సలిపి, శరీరమును బూనికతో పరుగు జేసి, ధర్మమును బొందుదురు. అంతియకాక, సుఖమువలన నెన్నటికిని సుఖము గలుగ నేరదు. శాంతస్వభావముగల యో నాథా! నీవెల్లప్పుడు మంచి మనసుగలవాడవై తపోవనము లందున్నంత కాలము తపోరూప ధర్మము నాచరింపుము. మూడులోకములకు సంబంధించిన యెల్ల విషయముల యధార్థమును నీ వెఱుగుదువు. నే నాడుదాననైనందున జపలబుద్ధిచే నీ నింత చెప్పితినిగాని, నీ కెవ్వడు నేర్పగలడు? నీవు స్వబుద్ధితోను, తమ్మునితోను ఆలోచించి యేది యుక్తమని తోచునో దానిని వెంటనే చేయుము" అని సీత రామునికి హితముపదేశించెను. (ఆరణ్యకాండ, తొమ్మిదవ సర్గ)

సీతాదేవి ప్రియుని యందలి భక్తితో జెప్పిన పలుకులు విని, ధర్మమార్గముననే యున్నట్టి రాముడు సీత కిట్లనియె : ధర్మజ్ఞురాలవైన యో జానకీ! నీ వంశ గౌరవమునకును, నా యందలి యనురాగమునకును దగినట్లు నా హితముగోరి ఈ మాట చెప్పితివి. దేవీ! నొచ్చినవారనుమాట వినరా గూడదనియే క్షత్రియులు ధనుర్ధరులయి యుండవలయునని నీవే చెప్పితివి గదా! అది నీకే తెలిసియున్నప్పుడు నీ కేమి బదులు చెప్పుదును? ఈ దండకారణ్యమున మిక్కిలి తీవ్ర నియమములతో దపం బొనరించుచున్న వారును, శరణు జొచ్చినవారిం గాపాడ జాలినవారును నగు మును లందఱు రాక్షసులబారి కోర్వజాలక, తాముగా వచ్చి, నన్ను శరణు జొచ్చిరి. అరణ్యవాసులగు మునులు ధర్మము నడుపుట యం దాసక్తిగల వారలై దుంపలు, పండ్లు, దినుచు, క్రూరకృత్యము లొనర్చు రక్కసులకు వెఱచి, సుఖము దక్కియున్నారు. ఒక్కొక్క వేళను బొలసుదిండ్లయిన క్రూరరాక్షసులు వనములం దనేక నియమములతో దపస్సు చేయుచున్న మునులను నిష్కారణముగా దిని పోవుచున్నారు. దండకారణ్య వాసులగు బ్రాహ్మణోత్తము లందఱు రాక్షసులచే భక్షింపబడుచు మనకడకు వచ్చి, మమ్ము గాపాడుడని చెప్పిరి.

నేను వారి నోటినుండి వచ్చిన ఈ మాటను విని ద్విజుల నడిగితిని. వారి పాద సేవ చేసి, ఈ ప్రకారముగా జెప్పితిని : "ఓ మునీంద్రులారా! నా యపచారము మన్నింపుడు. నేను స్వయముగా వచ్చి యుపచారము చేయతగిన యింత మహిమగల మీరు వచ్చి నన్ను బ్రార్థించుట యనునది నాకు మిక్కిలి సిగ్గుగా నున్నది" అని చెప్పి, "నేను మీ కిప్పుడేమి

చేయవలయు"నని యా వా రందఱు గూడి యేక వాక్యముగా "రామా! దండకారణ్యమున వలయు రూపముల దాల్చెడి యనేకులు రాక్షసులు మమ్ము మిక్కిలి బాధించుచున్నారు. వారిని సంహరించి నీవు మమ్ము గాపాడుదువుగాక! ఓ పాపరహితుడా! యెవరికి సాధింప నలవికాని నంజుడు దిండులైన రాక్షసులు హోమసమయములందు, దర్శపూర్ణమాసాది యాగకాలము లందును సమీపించి, మా యాగములం బాడుసేసి, మమ్ము బెదరించుచున్నారు. ఇట్లు రాక్షసులు పెట్టునట్టి యిడుమల బడుచు దపస్సులు నిర్విచారముగా జేసికొనజాలక దుఃఖపడుచు, గాపాడువారిం గానకయుండు మమ్ము గాపాడ నీవే సమర్థుడవు. నీకంటె వేఱుగతి మాకు లేదు. ఈ రేద్రిమ్మరులను మా తపోమహిమచే సంహరింప జాలుదుము. అయినను, మేము చిరకాలము శ్రమపడి సంపాదించిన తపస్సు నిత్తెఱగున బోగొట్టుకొన నిష్టపడకున్నారము. రాఘవా! తపస్సున కనేక విఘ్నములు సర్వదా సంభవించు చుండును. కావున దప మాచరించుట కడు నసాధ్యము. అట్లే రాక్షసులు మమ్ము నానావిధముల హింసించుచున్నను, శాపమొసగి, నానావిఘ్నముల కోర్చి సంపాదించిన తపస్సును వ్యయపఱుప మనస్సురాక యున్నవారము. కావున రాక్షసులబారి కోర్వజాలకున్న దండకారణ్య వాసులమైన మమ్ము నీవును, నీ తమ్ముడును రక్షింపుడు. వనవాసులమైన మాకు నీవే రక్షకుండవు" అని చెప్పిరి.

ఓ జానకీ! నే నిదియంతయు విని, దండకారణ్యవాసులైన ఋషులను సకల విధముల కాపాడునట్లు ప్రతిజ్ఞ చేసితిని. నేను మునుల యెదుట బ్రతిజ్ఞసేసి, నా బొందిని ప్రాణము లుండునంతవరకు జేసిన ప్రతిజ్ఞను నెరవేర్పకుండజాలను. నా కన్నింటికంటే సత్యవాక్యపరిపాలనమే యెల్లప్పు డభిమతము. ఓ సీతా! నేను ప్రాణములను, నిన్ను, లక్ష్మణుని విడనాడుదు గాని, యాడినమాట దప్పను. అందును బ్రాహ్మణులయెడ బ్రతిజ్ఞచేసి, దానిని దప్పిపోవుట సరియగునే? ఋషులు నన్నడుగక పోయినను, వారిని నేను గాపాడవలసియుండ, వా రడిగి, నే నట్లు చేసెదనని యొప్పుకొని, యిప్పుడు తప్పిపోవుట యేటి మాట?

ఓ పతివ్రతా! నీవు నా యందలి చెలిమివలనను, మంచిమనసు గలదాన వోట వలనను, ఈ యింపు మాటల బలికితివి. ఆ మాటలకు నేను సంతసించితిని. అప్రియుని కెవ్వరును హితము బోధింపరుగదా! నీకు నాయందుగల యిష్టముచేతనే యిట్టి మాట పలికితివి. ఈ పలుకు నీకును, నీ కులమునకు దగియున్నది. నీవు నా ధర్మములందు సాబాలు పుచ్చుకొనుచుండు దానవు. నాకు ప్రాణములకంటె మిన్నయైన దానవు" అని యిత్తెఱగున మహాత్ముడైన రాముడు తన నెచ్చెలియగు మైథిలితో నుడివి, విలుకాడై లక్ష్మణునితోగూడ మనోహరములగు తపోవనము లెల్ల దిరుగుచుండెను.

(అరణ్యకాండ, పదవ సర్గ).

REFERENCES

రామాయణంలో నిజమెంత?

1 Amrithalingam, T: Ramayana Vimarsa (English), Madras, undated, p. 367.

2 Kameswar Iyer, B.V. (Quoted by Guruge, Ananda : The Society of Ramayana, Maharagama, Ceylon, 1960, p 8)

3 Macdoneil, A.A. and Keith, A.B : Vedic Index of names and Subjects. Varanasi, 1958 Reprint, Vol. II, p. 230.

4 Winternitz, M: A History of Indian Literature, Calcutta, 1963, Vol. I, part II, p. 443.

5 Mishra, D.P : Studies in the Proto - History of India, Delhi, 1971, pp. 153-155.

6 Dutt, R. C: Civilization in India, London, 1893, Vol. 1. p. 138

7 Apte, V.M: Social and Religious Life in the Grihya Sutras, Bombay, 1954, pp. 106-107.

8 Jain, Jagadish Chandra : Life in Ancient India as Depicted in the Jain Cannon, Bombay, 1947, p. 89.

9 Jacobi, Herman : The Ramayana, Baroda, 1960, p. 104.

10 Macdonell, A.A : Sanskrit Literature, London, 1909, pp. 312-313.

11 Barth, A: Religions of India, New Delhi, 1969, p. 177.

12 Weber, Albrecht: The History of Indian Literature, London 1914, p. 192.

13 Keith, A.B. (Quoted by Guruge, p. 16)

14 Durant, Will:The Story of Civilization, Newyork,1941,The Oriental Heritage,Vol. 1 p.9.

15 Smith, G. Elliot : The Diffusion of Culture, London, 1930, pp. 208-209.

16 APTE, p. 105.

17. Frazer, James : The Golden Bough, Abridged Edition, London, 1950, pp. 380, 382, 387, and 396.

18 Allen, Grant: The Evolution of the idea of God, London, 1901, p. 286.

19 Frazer, pp. 433-434.

20 Allen, pp. 301-302.

21 Levi, Przyluski and Bloch: Pre-Aryan and pre-Dravidian in India, Calcutta, 1929, p. 14.

22 Winternitz, p. 452.

23 Muller, F. Max: A History of Ancient Sanskrit Literature, Varanasi, 1968, pp. 32-40.

24 Sen, Dineshchandra : The Bengali Ramayana, Calcutta, 1920, pp. 4-26.

25 Vaidya, C.V : The Riddle of the Ramayana, Delhi, 1972, pp. 55-61.

26 Sen, pp. 42-54.

27 Lyall , Alfred C : Asiatic Studies, First Series, p. 17.

28 Barth p. 265.

29 Lyall p. 18

30 Jacobi, pp. 99-100.

31 Crooke, William : The Popular Religion and Folklore of Northern India, Vol. 1, p. 87.

32 Majumdar, R.C., General Editor, The History and Culture of the Indian People, The Vedic Age, London, 1957, pp. 165-167.

33 Weber, A. (Quoted by Telang, K.T : Selected Writings and Speeches, Vol. I, Bombay, 1916, pp. 5-6)

34 Telang, pp. 1-93

35 Jacobi, pp. 71-72.

36 Winternitz, p. 452.

37 Vaidya, p. 52.

38 Bulcke, K: Ramkatha (Hindi), Prayag, 1971, pp. 102-103.

39 Fauche, Hippolyte (Quoted by Guruge, p. 12).

40 Blitz, Bombay, February, 14, 1976.

41 Shamasastry, R. (Quoted by Guruge, p. 15.)

42 Pargiter, F.E: Ancient Indian Historical Tradition, Delhi, 1962, pp. 93 and 277-278.

43 Wilson, H.H: The Vishnu Purana, English Translation, Calcutta, 1961, Note on pp. 307-308.

44 Vaidya, pp. 125-135.

45 Rangacharya, V: History of Pre-Musalman India, Vol. II, Part 1, Aryan Expansion Over India, Madras, 1937, p. 551.

46 Majumdar, R.C: Ancient India, Delhi, 1960, p. 197.

47 Sidhanta, N.K : The Heroic Age in India, London, 1929, pp. 6 and 13.

48 Mookerji, Radha Kumud : Ancient India, Allahabad, 1956, p. 88.

49 Srinivasa Iyengar, P.T : Advanced History of India, Waltair 1942, pp. 108-109.

50 Wheeler, Talboys J. (Quoted by Guruge, p. 14).

51 Lassen, C. (Quoted in History of Classical Sanskrit Literature M. Krishna Swami Delhi, 1970, pp. 15-16).

52 Ratnam, Malladi Venkata : Rama, the Greatest Pharaoh of Egypt, Rajahmundry, 1934,

2 vols.
53 Pusalker, A.D : The Cultural Heritage of India, Vol. II, Calcutta, 1969, p. 20.
54 Roychaudhuri, Hemchandra : Studies in Indian Antiquities, Calcutta, 1958, pp. 294-297.
55 Dikshitar, V.R. Ramachandhra : Indian Culture, Vol. I, No. 4, 1938, pp. 579-585.
56 Pathak, Visududdanand : History of kosala, Delhi, 1963, pp. 182-183.

ఏది జనస్థానం? ఎక్కడిది లంక?

1 Pargiter, F.E. (Quoted by T. Paramasiva Iyer in Ramayana and Lanka, Bangalore, 1940. References to Pargiter's views are scattered throughout his Preface to the volume).
2 Jacobi Herman: The Ramayana, Baroda, 1960, pp.68-71.
3 Mehta, C.N.: The Flight of Hanuman, Nadiad, 1941.
4 Adikari, N.S. (Quoted in A Bibliography of the Ramayana by N.A. Gore, Poona, 1943 p. 34).
5 Gore, p. 56
6 John, Daniel : Annals of the Bhandarkar Oriental Research Institute, Vol. XXI (1939-40), pp. 270-279.
7 Ramalinga Reddi Sastyabdapurti Commemoration Volume part II, pp. 20-24.
8 Indian Express, Madras, January, 18, 1977.
9 Bandarkar, D.R. Jha Commemoration Volume, Poona, 1937, pp. 47-57.
10 Imperial Gazetteer of India New Edition, Vol, IX, 1908, p. 68.
11 Paramasiva Iyer: Ramayana and Lanka, maps between pages 104 and 106.
12 Kunte, N.M: Vicissitudes of Aryan Civilization in India, Bombay, 1880, foot note on p. 190.
13 Rhys-Davids, T.H: Buddhist India, Calcutta, 1955, p 12 and p. 25.
14 Das, Santosh Kumar: Economic History of Ancient India, Calcutta, 1944, pp. 202-209.
15 Bhandarker p. 48.
16 Bhandarkar, R.G: Collected Works, Vol. III, Poona, 1927,p.8.
17 Kibe, Sardar M.G: Location of Lanka, Poona, 1947.
18 Gore, p. 39. 3
19 Hiralal: Jha Commemoration Volume, pp. 151-161.
20 Gore, p. 51.

21 Mankad, D.R. Editor : The Valmiki Ramayana, Kiskinda Kanda, Baroda, 1965.

22 Times of India, Bombay, February 23, 1976.

23 Mishra, D.P: Mahakosal Historical Society Papers, Vol. 1, Jabalpur.

24 Chakravarthy, R.S.: Hindustan Times, New Delhi, October 31, 1971.

25 Sinha, V.N.P: Chota Nagpur Plateau, New Delhi, 1976, pp. 11-27-41-53.

26 Amirthalingam, T: Ramayana Vimarsa, Madras, undated.

27 Amirthalingam, p. 466.

28 Brown, C.P.: A Dictionary of Telugu and English, Madras, 1852

29 Zamindar of Devidi : Telugu Encyclopaedia, Rajahmundry, 1941.

30 Watt Sir George: The Commercial Products of India, London, 1908, p. 1072.

31 Watt, p. 990.

32 Ramachandra Dikshitar: Indian Culture, Calcutta, 1935, Vol I, No. 4, p. 580.

33 Bhandarkar, D.R., p 56.

34 Roychaudhuri, H: Studies in Indian Antiquities, Calcutta, 1958, pp. 296-297.

35 Amirthalingam, pp. 462-466.

36 Imperial Gazetter of India, New Edition, 1908, Vol. I, p. 112.

37 Kaumidi mahotsvam translated into Telugu by Dr D.V. Avadhani, 3rd Edition, Hyderabad, 1968.

38 Cunningham, Sir Alexander (Referred to by D.R. Bhandarkar p. 50).

39 Bhandarkar, D.R., p. 50.

40 Sankalia, H, D: Ramayana, Myth or Reality, New Delhi, 1973, p. 17.

రాక్షసు లెవరు?

1 Das, Abinas Chandra : Rigvedic Culture, Calcutta, 1925, pp. 410-412.

2 Dutt, Romesh Chunder: A History of Civilization in Ancient India, London, 1893, Vol. I, p. 182.

3 Keith, A.B.: In Cambridge History of India, Vol. I, Ancient India, Cambridge, 1935, p. 76.

4 Banerji-Sastri, Anantaprasad: Asura India, Patna, 1926.

5 Macdonell, A.A. and Keith, A.B.: Vedic Index Varanasi, 1958, Vol. II, p. 510.

6 Guha, B.S. : Racial Elements in the Population, London, 1944, pp. 9-10.

7 Chanda, Ramaprasad: The Indo-Aryan Races, Calcutta, 1969, pp. 4-5.

8 Majumdar, D.N: Races and Cultures of India, Bombay, 1961, p.64.

9 Hopkins, E.W: Epic Mythology, Varanasi, 1968, pp. 38-39.

10 Venkata Ratnam, T.K: "The Rakshasas" an essay in K.V. Rangaswami Aiyyangar Commemoration Volume, Madras, 1940, pp. 187-188.

11 Mishra, D.P: Studies in the Proto-History of India, New Delhi, 1971.

12 Padmanabhan, B.S., in the Hindu, August 28, 1977.

13 Roy, Sarat Chandra: The Mundas and their Country, Bombay, 1971, pp. 28-29.

14 Childe, V.Gordon: New Light on the Most Ancient East, London, 1954, p. 185.

15 Hoyle, Fred: A Decade of Decision, London, 1953, p. 154.

16 Childe, V.Gordon: Progress and Archaeology, London 1945, p. 49.

17 Hoyle, p. 154.

18 Childe, 1945,p. 49.

19 Hoyle, p. 154.

20 Ghosh, A: The City in Early Indian History, Simla, 1973, p. 52.

21 Sankalia, H.D: Ramayana: Myth or Reality? p. 46.

22 Roy, p. 38.

23 Childe, 1945, p. 55.

24 Chatterji, Suniti Kumar: Kirata-Jana-Kriti, Calcutta, 1951, p. 11.

25 Vaidya, C.V: Epic India, Bombay, 1907, pp. 306-307.

26 Sharma, Ramashraya: A Socio-political Study of the Valmiki Ramayana, Delhi, 1971.

27 Dharma, Miss P.C: The Ramayana Polity, Madras, 1941.

Vyas, S.N: India in the Ramayana Age, New Delhi, 1967.

29 Mackenzie, Donald A: Myths of Babylonia and Assyria, London, Undated, pp. 64-65

30 Moscati, Sabatino: The Face of the Ancient Orient, London, 1960, p 29.

31 Ghosh, Oroon Kumar: The Changing Indian Civilization Vol. 2, Calcutta, 1976, p. 341.

32 Chatterji, kp. 6.

33 Levi, Przyluski and Block: Pre-Aryan and Pre-Dravidian in India, Calcutta, 1929, p. Xii

34 Ghosh, Vol. 2, p. 293.

35 Ghurye, G.S: Caste and class in India, New York, 1952, p. 64.

36 Chatterji, p. 5.

37 Iyengar, P.T: Srinivasa: History of the Tamils, Madras, 1929, pp. 58-62.

38 Sankalia, pp. 48-49.

ఋషు లెవరు?

1 Gupta, M. Shakti : Loves of Hindu Gods and Sages, New Delhi, 1973.

2 Mitra, Rajendralala : Indo-Aryans, London, 1881, Vol. II, p. 69. and Philosophy of the

3 Keith, Arthur Berriendale : The Religion Upanishads, London, 1925, pp.166-167. 222-242.

4 Muller, F. Max: Biography of Words, London, 1893, pp.

5 Macdonell, A.A. and Keith, A.B : Vedic Index, Varanasi, 1958, Vol. II, p. 475.

6 MacDonell and Keith, Vol. II, pp. 123-124 p. 517.

7 MacDonell and Keith, Vol. I,

8 MacDonell and Keith, Vol. I, p. 498.

9 Raja, C. Kundhan : The Quintessence of the Rig Veda, Bombay, 1964, p. 120.

10 Raja, p. 13.

11 Ghurye, G.S: Indian Sadhus, Bombay, 1964, pp. 15-16.

12 Raja, pp. 8-13.

13 Chattopadhyaya, Debi Prasad : What is Living and what is Dead in Indian Philosophy, New Delhi. 1976, pp. 130-133.

14 Macdonell and Keith, Vol. II, pp. 71, 183, 447.

15 Kosambi, D.D : The Culture and Civilization of Ancient India, London, 1965, pp. 66-68.

16 Kosambi, D.D : An Introduction to the Study of Indian History, Bombay, 1975, pp. 102-103.
17 Kosambi, D.D : "On the Origin of the Brahmin Gotras" in the Journal of the Bombay Branch of the Royal Asiatic Society, 1950, Vol. 26, pp. 21-80.
18 Amirthalingam, T: Ramayana Vimarsa, Madras, undated, p. 230.
19 Amirthalingam, p 221.

ఋషుల కుట్రలో రాముని పాత్ర

1 Kosambi, D.D : An Introduction to the Study of Indian History, Bombay, 1975, pp. 72-73.
2 Meanchen-Helen, Otto J : The World of the Huns, Los Angels, 1973, pp. 178-179.
3 Kosambi, 1975, pp. 74-75.
4 Mackay, Ernest: Early Indus Civilizations, London, 1948, pp. 122, 132.
5 Sharma, R.S: Studies in the Cultural History of India, Agra, 1965, p. 30.
6 Wheeler, Sir Mortimer: The Indus Civilization, Cambridge History of India, Supplementary Volume, Cambridge, 1943, pp. 6-7.
7 MacDonell, A.A : Vedic Mythology, Varanasi, 1963, pp. 31, 51, 59, 60.
8 Kosambi, D.D : The Culture and Civilization of Ancient India, London, 1965, p. 90.
9 Mitra, Priti : Land and Society in the Vecdic Age, Calcutta, 1966, p. 22.
10 Kosambi, 1975, p. 123.
11 Basham, A.L: The Wonder That Was India, London, 1955, p. 40.
12 Sharma, R.S., 1965, p. 37.
13 Bhattacharya, N.N : Ancient Rituals and Their Social Contents, Delhi, 1975, pp. 60-61.
14 Thaper, Romila : A History of India, London, 1968, Vol. I., p. 33.
15 Channa, Dev Raj : The Spread of Agriculture in Northern India as Depicted in the Valmiki Ramayana, New Delhi, 1963.
16 Bose, N.K : The Structure of Hindu Society, New Delhi, 1975, p. 75.
17 Mukhopadhyay, Sankarananda : The Austric of India, Calcutta, 1975, pp. 42-43.
18 Chak, B.L: Green Islands in the Sea, New Delhi, 1967. p. 63.
19 Chak, p. 48. : 20 Perry, W.J : The Growth of Civilization, Pelican Books, London, 1937, p. 211. : 21 Brown, Dee : Bury My Heart at Wounder Knee, Bantam Books, New York, 24th Printing, 1976.

ఆయుధాల ప్రశ్న

1 Rapson, E.J. (Editor) : The Cambridge History of India, Ancient India, Cambridge, 1935, Vol. I, p. 330.
2 Rapson, p. 334

3 Rapson, p. 345 ff.
4 Dutt, R.C: A History of Civilization in Ancient India, London, 1893, Vol. I, p. 57.
5 Dikshitar, V.R.R : War in Ancient India, Madras, 1944, p. 103.
6 Oppert, Gustav : On the Weapons, Army Organisation and Political Maxims of the Ancient Hindus, Ahmedabad, 1967, pp. 72-73.
7 Majumdar, R.C. (Editor) : The History and Culture of the Indian Bombay, 1951, p. 42. People, The Age of Imperial Unity,
8 Mitra, Rajendralala : Indo-Aryans, London, 1881, Vol. 1, pp. 298-99,
9 Mitra, pp. 303-304.
10 Mitra, p. 302.
11 Child, V. Gordon : What Happened in History, Pelican Books, London, 1948, pp. 182-183.
12 Krober, A.L: Anthropology, Indian Edition, New Delhi, 1976, p.725.
13 Banerjee, N.R; The Iron Age in India, New Delhi, 1965, p. 158.
14 Kosambi, D.D : The Culture and Civilization of Ancient India, London, 1965 p. 90.
15 Chand, Gyan: Population in Perspective, New Delhi, 1972, p. 102
16 Rhys-Davids : Buddhist India, Indian Reprint, Calcutta, 1955 p. 21.
17 Moreland, W.H : India at the Death of Akbar, London, 1920, p. 22.
18 Chand, p. 44.
19 Keith, Sir Arthur: Essays on Human Evolution, London, Undated, p. 155.
20 Vaidya, C.V : The Riddle of the Ramayana, New Delhi, Revised Edition, 1972, p. 112.
21 Krober, p. 356. ,
22 Taylor, Sir E.B : Anthropology, Thinker's Library Edition, London 1946, Vol. II, p. 50.
23 Krober, p. 375
24 Taylor, p. 50.

సీత జోస్యం

పాత్రలు : రాముడు - కోసల దేశాధిపతి, దశరథుని జ్యేష్ఠపుత్రుడు.
సీత - రాముని భార్య. లక్ష్మణుడు - రాముని తమ్ముడు.
జనస్థానానికి చెందిన ఇద్దరు ఋషులు.

రంగం : జనస్థానంలో సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం.

కాలం : రాముడు వనవాసాన్ని ప్రారంభించిన కొత్తలో.

ప్రథమాంకం

అది దండకారణ్యంలోని, జనస్థానంలోగల సుతీక్ష్ణమహర్షి ఆశ్రమంలో అతిథులకై ఉద్దేశించబడిన పర్ణశాల. ప్రేక్షకులకు ఎదురుగా కనిపించే మట్టి గోడలో దానికి ఒకే ఒక ద్వారం. లోనికి వచ్చేవారు వంగిరాకపోతే, ద్వారం తలకు తగులుతుంది. దానికి రెండువైపుల వెదురు కడ్డీలతో రెండు కిటికీలు. పర్ణశాలలోకి వస్తూపోతూ ఉండేవారు లోనికి రాకముందే ఆ కిటికీల గుండా కనబడుతూ ఉంటారు. ఆశ్రమంలోని చెట్టుచేమలు కూడా అల్లంత దూరాన ఉన్నట్టు ద్వారబంధం గుండా, గవాక్షాల గుండా కనిపిస్తూ వుంటాయి.

పర్ణశాలలో పక్కగోడ చెంత, ఒక నులక మంచం ఎత్తి పెట్టి ఉంటుంది. దాని ప్రక్క ఒక బల్లపై రాసిగా పేర్చిన కందమూల ఫలాలు, మరొక బల్లపై మంచినీళ్ళ కుండ; దాని సరసనే రెండు రాగి పంచపాత్రలు. పర్ణశాల మధ్యభాగంలో కృష్ణాజినాలతో కప్పబడిన అయిదారు ఉన్నతాసనాలు.

తెర లేచినప్పుడు ఒక అజినాసనంపై కూర్చుని, ఎదురుగా వున్న మరొక దానిపై విప్పి పెట్టివున్న తన నగల మూటలోనుంచి వాటిని పైకితీసి, ఏవేవో జ్ఞాపకాలు పెల్లుబికి వస్తున్నట్టు, సీత వాటివంక చూస్తూపోతూ వుంటుంది. వన్నె తగ్గిన నగలకు వాటి గుడ్డమూట చెంగుతో మెరుగు పెడుతూ వుంటుంది.

సీత వయస్సు పదహారు, పదిహేడు సంవత్సరాలు. ఒక సాదా పట్టుచీర కట్టుకొన్నా, చెవులకు కమ్మలు, మెడలో ఒక హారం, వేలిని ఒక వుంగరం తప్ప వేరే నగలు లేకపోయినా, ఇతర అలంకరణలు సయితం లేకపోయినా, చూడగానే చూపులను ఆకట్టుకొనగల అందచందాలు. క్షణానికొక భావవిలసనాన్ని ప్రతిఫలించగల విశాలనేత్రాలు; చక్కగా శ్రుతిచేసిన వీణవలె పలకగల కంఠస్వరం.

తెర లేచిన కాసేపటికి లక్ష్మణుడు ప్రవేశిస్తాడు. అతని వయసు కూడా పదహారు, పదిహేడు సంవత్సరాల ప్రాంతం. మంచి పొడగరి, వెడల్పు నుదురు, పెద్ద కళ్ళు, తీర్చి దిద్దినట్టుగా వున్న ముక్కు బలమైన క్రింది దవడ, కండలు తిరిగిన రెక్కలు, నారపంచె, నారతోనే నేసిన ఉత్తరీయం. ధనుస్సును, తూణీరాన్ని భుజాల నుంచి తొలగిస్తూ గడప దాటతాడు.

ఈ రంగంలో ప్రవేశించే ఋషు లిద్దరిలో మొదటి ఋషి వయస్సు అరవై పైగా; రెండవ ఋషి ఆయనకంటె పదేళ్ళు చిన్న. మొదటి ఋషి పొట్టి; రెండవ ఋషి పొడగరి. ఒకరిది బవిరి గడ్డం. మరొకరిది మేక గడ్డం. ఇద్దరివీ నారబట్టలే. మొదటి ఋషి చేతులలో దండ కమండలాలు; రెండవఋషి చేతులలో ఒక పళ్ళబుట్ట.

కాలి అలికిడి విని తలయెత్తిన సీతకు కిటికీని దాటుతూ లక్ష్మణుడు కనబడతాడు.

సీత : (మరది లోపలికి రాగానే అల్లరితో కూడిన చిరునవ్వుతో) తా మొక్కరే దయచేస్తున్నారు, తమ ఇనవంశోద్భవ ప్రభువు లెక్కడ?

లక్ష్మణుడు : ఏం? తమది కూడా ఇనవంశమే కాదా?

సీత : అయితే మాత్రమేం? మా వంశీకులు అఖిల జగత్తును పదే పదే జయిస్తూ పోయారా? అశ్వమేధాలను పదే పదే చేస్తూ పోయారా? వారు సాగరాన్ని తవ్వారా? పాతాళాన్ని చేరారా? స్వర్గం నుంచి గంగను భూతలానికి దించుకు వచ్చారా? మీవారితో మావారికి పోలి కెక్కడలే!

లక్ష్మణుడు : ముల్లోకాలలో జైత్రయాత్రలకు సంబంధించినంతవరకు ఆమాట నిజమైనా...

సీత : (వెక్కిరింపుగా) "ఆమాట నిజమైనా!"

లక్ష్మణుడు : ' కాదా, వదినా? '

సీత : వందిమాగధులు మీకే కాదు; మాకూ వున్నారు!

లక్ష్మణుడు : ఔను మీకూ వున్నారు - వుంటే?

సీత : ఆఁ! ఏమీ లేదు! వారి స్తోత్ర పాఠాలను, స్తోత్ర పాఠాలుగానే మేము పరిగణిస్తాము గాని, అవి పరమసత్యాలన్న పిచ్చి భ్రమలకు పోము!

లక్ష్మణుడు : పిచ్చి భ్రమ లేమిటి, వదినా?, దేవేంద్రుడు రాక్షసరూపంలో వచ్చి, మా సగరచక్రవర్తి యాగాశ్వాన్ని దొంగిలించి, పాతాళంలో దాన్ని కట్టివేయగా...

సీత : ఆయన దాన్ని తిరిగి తెప్పించాడు! అరవైవేల మంది కొడుకులను కన్న తండ్రికి ఏదైనా సాధ్యమే!

లక్ష్మణుడు : భృగుమహర్షి వరప్రభావం వల్లనే ఆయన మొదటి భార్యకు వంశకరుడైన ఒక పుత్రుడు, రెండవ భార్యకు వంశకరులు కాని వారు అరవై వేలమంది కలిగారని మీరు వినలేదా?

సీత : వినకేమి? ఆ వరప్రభావంవల్లనే మీ సగరుని రెండవ భార్య అన్నట్టు ఆమె పేరేమిటి? - మరచిపోయాను!

లక్ష్మణుడు : సుమతి!

సీత : ఆఁ! ఆ సుమతి నవమాసాలు మోసి, ఒక సొరకాయను కనింది. దాన్ని పగలగొట్టగానే దానిలోనుంచి బెలబెలమంటూ అరవై వేలమంది కొడుకులు బయటికి వచ్చారు. ఒక్కొక్కడికి ఒక్కొక్కటి చొప్పున అరవై వేల నేతి ముంతలు తెప్పించి, వాటిలో ఊరవేస్తూ వారిని అల్లారుముద్దుగా పెంచారు!

లక్ష్మణుడు : మీ ధోరణి చూస్తే సగర పుత్రులు సముద్రాన్ని తవ్విన సంగతిని కూడా మీరు శంకిస్తున్నట్టే కనబడుతున్నది.

సీత : ఎంతమాట! వీర, శూర, ధీరాగ్రేసరులైన సగరపుత్రుల శక్తి, సామర్థ్యాలను నేను శంకిస్తానా? తండ్రి మాటప్రకారం సముద్రాన్ని వారు తవ్వుతూపోగా భూమిని మోస్తుండే అష్టదిగ్గజాలు వారికి కనిపించాయి. భక్తి పూర్వకంగా వాటిని ప్రదక్షిణించి, వాటి కాళ్ళకిందగా మరింత తవ్వుకుంటూ పోయారు. ఇలా పోగా పోగా, వెయ్యి యోజనాల లోతున వారికి పాతాళలోకం తగిలింది. ఆ మాయలోకంలో...

లక్ష్మణుడు : పాతాళలోక మనేది లేదనే మీ తాత్పర్యమా?

సీత : అది లేకపోతే, అక్కడ కపిలమహర్షికి అల్లంత దూరాన మేతమేస్తున్న తమ తండ్రి యాగాశ్వం వారికి కనబడేదా?

"ఓరి దొంగా!" అంటూ ఆ మహర్షిపై వారు దూకేవారా? వారి దుందుడుకుతనానికి కినిసి, ఆయన శాపం పెట్టగా బూదిపోగులై వారు...

లక్ష్మణుడు : మీరింత హేళనగా మాట్లాడ్డానికి ఇదేమీ కట్టుకథ కాదేఁ!

సీత : అబ్బే! కట్టుకథ కాదు, పిట్టకథ!

లక్ష్మణుడు : అయితే, సగరపుత్రులకు సద్గతుల సాధనకై గంగాదేవిని ప్రార్థించి, మా భగీరథుడు ఆమెను స్వర్గం నుంచి భూతలానికి వెంటబెట్టుకురావడం కూడా ఒక పిట్టకథేనా?

సీత : కాదు, అది గట్టికథ! చిలవల పలవలతో మీ వందిమాగధులు దాన్ని చిక్కగానే అల్లారు!

లక్ష్మణుడు : అదేమిటి, వదినా? ప్రతిదాన్ని ఒక కల్పితకథకింద కొట్టి వేస్తున్నారు! తాను నూరవయాగం చేస్తుండగా దేవేంద్రుడే తిరిగి తన యాగాశ్వాన్ని అపహరించగా, మా రఘుచక్రవర్తి ఆ స్వర్గాధిపతిపై దండెత్తి వెళ్ళలేదా?

సీత : వెళ్ళకేఁ! వెదుతూ వెదుతూ (మరది దిక్కులో చూపుదు వేలెత్తి) మా ఈ ముద్దుమరదిని చంకనెత్తుకు వెళ్ళారు!

లక్ష్మణుడు : మీ మాటలు చాలా విచిత్రంగా వుంటాయి, వదినా!

సీత : మీ భ్రమలకంటేనా? ఆ భ్రమలతో లేనిపోని గొప్పలకు పోయి, మీ అన్నగారు ఏమి ముప్పులు తెస్తారో అని నే నెంతగా తల్లడిల్లుతూ వుంటానో నీ కేమి తెలుసు? ఇంతకూ ఆయన ఎక్కడికి వేంచేశారు?

లక్ష్మణుడు : తమ పుణ్యాశ్రమానికి విచ్చేసి, దాన్ని పావనం చేయవలసిందని మహర్షు లెవరో వచ్చి కోరగా...

సీత : ఈ కొత్త మహర్షు లెవరు? మన ప్రాణానికి వీ రెక్కడనుంచి దాపురించారు?

లక్ష్మణుడు : ఇక్కడి కొక యోజనం దూరంలోనే వారుంటున్నారట. తప్పక ఒకసారి దయచెయ్యాలని వారు మోమోట పెట్టగా, కాదనలేక వెళ్లారు!

సీత : కాదనలేక వెళ్లలేదు. కావాలనే వెళ్లారు! మీ అన్నగారి సంగతి నాకు తెలియదా? "రఘుకుల తిలకా! రణరంగధీరా! రాక్షససంహారకా!" అంటూ ఉబ్బవేస్తే చాలు, తమంతవారు ఈ లోకంలోనే లేరని తబ్బిబ్బు లైపోతారు! ఈ ఋషుల స్తోత్రాలు మరి చాలు; వీరి సత్కారాలూ చాలూ! త్వరగా వేరెక్కడికైనా వెళ్లి, మన పర్ణశాల మనం వేసుకొని, మన బ్రతుకు మనం బ్రతకడం అన్ని విధాల మనకు శ్రేయస్కరం.

లక్ష్మణుడు : ఒక రాజర్షి కుమార్తెవై వుండి కూడా ఎందుకు వదినా!, ఋషులంటే మీ కింత కంటగింపు?

సీత : రాజర్షి కుమార్తె నైనందునే! మా నాన్నగారు జటాజూటాలు ధరించిన ప్రతి కపటిని ఒక మహర్షిగా నెత్తిని పెట్టుకోరు! జ్ఞానులైన వారినే చేరదీస్తారు, వారినే సన్మానిస్తారు.

లక్ష్మణుడు : అయితే, ఇక్కడ ఈ జనస్థానంలోని ఈ ఋషు లందరు కపటవేషధారులనే మీరు తేల్చుతున్నారా?

సీత : అలా వారిని తేల్చకపోతే, వారు మన పుట్టి నిలువునా ముంచరూ! (ఈ లోపల నగలను తిరిగి మూట కట్టివేస్తూ) దీన్ని అక్కడెక్కడైనా కాస్త భద్రం చేస్తావా?

లక్ష్మణుడు : ఈ పూట వీటిని బయటికి తీశా రెందుకు?

సీత : పనిలేనివారు ఏదో పని కల్పించుకోవద్దూ? ఏమీ చేయకుండా ఒంటరిగా కూర్చుంటే మనస్సు పరిపరి విధాల పోతుంది. ఈ ఋషులు మన వనవాసాన్ని శాంతంగా గడపనిచ్చేటట్టు లేరు. (గట్టిగా నిట్టూర్చుతూ) ఊఁ! ఏమి కానున్నదో! (ఈ మాటల మధ్య నగల మూటను మరది చేతికి అందించబోతుంది. ఒక నగ బయటనే మిగిలిపోయినట్టు అంతలో గమనిస్తుంది. అందించబోతున్న మూటను వెనక్కు తీసుకుని, దాన్ని తిరిగి విప్పుతుంది. బయట మిగిలిన నగను తక్కిన వాటితో జతచేర్చి, మళ్ళీ మూట కట్టబోతూ, మధ్యలో ఆగి) ఈ జడ గంటలు చూచావా? ఇవి ఏడు తరాలనాటివట. ఇంటి పెద్ద కోడలికే వీటిని పెట్టడం మా వంశంలో పరిపాటి. దాన్ని తప్పించి మా అమ్మ నా పెళ్ళినాడు నా కిచ్చింది. "ఎందుకమ్మా!" అని నే నెంత చెప్పినా వినిపించుకోకుండా, తన చేతులతో తాను వీటితో నాకు జడ అల్లింది. ఇంత చిన్నతనంలోనే నా కిన్ని కష్టాలు చుట్టుకున్నాయని ఇప్పుడు - పాపం! - ఆమె

ఎంతగా కుమిలిపోతున్నదో! (కొన్ని క్షణాల మౌనం తర్వాత నగలపైకి తిరిగి దృష్టి పోనిచ్చి, ఒక నాగరాన్ని పైకి తీసి, మరదికి చూపుతూ) ఇది నా కెవ రిచ్చారో తెలుసా?

లక్ష్మణుడు : ఆఁ!

సీత : ఎవరు?

లక్ష్మణుడు : మా అమ్మ.

సీత : మా కారణంగా తన ముద్దుల కొడుకు అడవులపాలైనాడని ఆ తల్లి ఎంతగా వ్యసనపడుతున్నదో!

లక్ష్మణుడు : మీ వెంట వెళ్ళవలసిందిగా ఆమె నన్ను ఆశీర్వదించి మరీ పంపించింది. నేను వెనక దిగబడితేనే ఆమె నిజంగా వ్యసనపడేది.

సీత : మా చిన్నత్తగారికి నేనన్నా, మీ అన్నగారన్నా ఎంతో ప్రాణం. ఆమె ఎంత మంచివారు! మీ (నాగరాన్ని మూటలో పెట్టి, ఒక వజ్రహారాన్ని పైకి తీస్తూ) ఈ వజ్రహారాన్ని ఇంతకుముందు చూచావా?

లక్ష్మణుడు : లేదు.

సీత : ఇది మీ అన్నగారి బహుకృతి. ఏ సందర్భంలో బహూకరించారో ఊహించగలవా?

లక్ష్మణుడు : ఉహుఁ!

సీత : యౌవరాజ్య పట్టాభిషేకం తమకు జరగబోతున్న దనుకొన్న సందర్భంలో! "సింహాసనంపై రేపు నా సరసను కూర్చున్నప్పుడు నీవు దీన్ని పెట్టుకుంటే చూడాలని ముచ్చటగా వుంది," అంటూ తెచ్చియిచ్చారు. (బరువుగా) కాని అజినా సనాలే మాకు సింహాసనా లయ్యాయి. పోనీ, ఈ ప్రవాస కాలాన్ని ఏలాగో ముగించుకొని, ఇంటికి తిరిగి వెడదామను కొంటే, మరిన్ని కష్టాల పాయేయకుండా ఈ మునిముచ్చులు ఈ కారడవులనుంచి మనను బయటపడనిచ్చేటట్టు లేరు!

లక్ష్మణుడు : ఎందువల్లనో తెలియదు - ఈ మహర్షు లందరు ధూర్తులని మీరు అకారణ భయాలకు పోతున్నారు!

సీత : నావి సకారణ భయాలే, మీవి మాత్రం అకారణ భ్రమలు!! కార్యార్థులై వచ్చినవారు తమరు ఇంద్రులని, చంద్రులని వంది మాగధులకంటే హీనంగా ముఖస్తుతులకు దిగితే, వారిని ధూర్తు లనుకొనక, మహర్షు లనుకొంటానా?

లక్ష్మణుడు : అదేమిటి, వదినా? వారిలో కొందరి ముఖాలు బ్రహ్మవర్చస్సుతో ఎంతగా వెలిగిపోతూవుంటాయి!

సీత : ఔనౌను! వారి పొగడ్తలు వింటూవుంటే మీ అన్నదమ్ములిద్దరి ముఖాలు మరింతగా వెలిగిపోతూవుంటాయి! అన్నగారు అఖిలేశ్వరులని వారు కీర్తిస్తూవుంటే తమ్ముడుగారి ముఖంలో కోటి సూర్యులు ఒక్కసారిగా ఉదయిస్తారు. సరిగాని సంధ్యా వందనానికై వెళ్ళినవారు దాన్ని ముగించుకొని చక్కా రాక... (వెలుపలినుంచి "రఘుకుల తిలకా! రణరంగధీరా! రాక్షస సంహారకా!" అంటూ రెండు గొంతులతో స్తోత్ర పాఠాలు) అరుగో! వస్తున్నారు మళ్ళీ మీ వందిమాగధు లెవరో!

(పర్ణశాల ద్వారంవైపుకు లక్ష్మణుడు రెండడుగులు వేసి వేయకముందే ఒక ఋషి లోనికి ప్రవేశిస్తాడు.)

లక్ష్మణుడు : (చేతులు జోడిస్తూ) నమస్కారం!

ఋషి: శతమానం భవతు!

సీత : (దాచుకోలేని చికాకుతో లేచి నిలబడుతూ) నమస్కారం!

ఋషి : దీర్ఘసుమంగళీభవ!

(చేతిలో ఒక పళ్ళబుట్టతో మరొక ఋషి మొదటి ఋషి వెనకనే లోపలికి ప్రవేశించి, ఒక పక్క కొదిగి నిలబడి వుంటాడు)

మొదటి ఋషి : (లక్ష్మణునితో) తమ పాదపద్మరజంతో మా పర్ణకుటీరాన్ని...

సీత : పావనం చేయగలిగింది వీరు కాదు; వీరి అన్నగారు!

మొదటి ఋషి : ఓహో! తమరు రామచంద్ర ప్రభువుల సోదరులా? లక్ష్మణ స్వాములా?

సీత : ఆయన స్వాములు కావడానికి ఇంకా గడ్డమైనా మొలవలేదేం!

మొదటి ఋషి : అయినా, వారు స్వాములే! మా రఘుకుల స్వాములలో వారొకరు కారా, తల్లీ?

రెండవ ఋషి :(సీతను సమీపించి, పళ్ళబుట్టను ఆమెకు అందించబోతూ) మా గురుదేవుల పక్షాన ఈ చిన్ని కాన్కకు స్వీకరించండి!

సీత : (ఆ బుట్టను అందుకోకుండా) మాకెందు కివి? (ఒక మూలనున్న కందమూల ఫలాల రాసిని వేలెత్తి చూపుతూ) అటు చూడండి! సుతీక్ష మహర్షులు ఎన్నింటిని పంపించి, ఎంత పెద్ద రాసి పోయించారో!

మొదటి ఋషి : ఇక్కడ మీ కివి తక్కువని కాదు; మా రామచంద్ర ప్రభువుల పట్ల మా భక్తి గౌరవ ప్రపత్తులకు సూచకంగా తెచ్చాము - అంతే! రాజదర్శనానికి రిక్తహస్తాలతో వెళ్ళరాదని వృద్ధానుశాసనం!

సీత : ఇక్కడ రాజులెవరు?

మొదటి ఋషి : ఎవ రేమిటి తల్లీ? అయోధ్యా ప్రభువులు, శ్రీరామచంద్రులు.

సీత : అయోధ్యకు ప్రభువులు భరతులు కారా?

మొదటి ఋషి : ప్రస్తుతానికి ఆయన నామమాత్రంగా ప్రభువు లైనా, రాజ్యం వీరిదే, రాజ్యాధికారామూ వీరిదే!

సీత : అయితే, అక్కడనే నిక్షేపంగా వుండక ఈ అడవులలో అఘోరించడం దేనికి?

లక్ష్మణుడు : వదినా! (ఆమె తనవైపుకు చూడగా, "దయచేసి మీరు పూరుకోండి" అన్నట్టు మౌనంగా అర్థించి, రెండవఋషితో) అయ్యా! దాన్ని ఇలా తెండి! (పళ్ళబుట్టను అందుకొని, దాన్ని పర్ణశాలలో ఒక మూలగా పెట్టి వచ్చి, ఋషు లిద్దరికి చూపుతూ) నిలబడే వున్నారు - దయచేసి కూర్చోండి! (ఋషులిద్దరు కూర్చుంటారు) అర్ఘ్యపాద్యాలు సమర్పించనందుకు మమ్ము తమరు మన్నించాలి. తమకు తెలియని దేమున్నది? - మేమే సుతీక్ష మహర్షులకు ప్రస్తుతం అతిథులమై వున్నాము.

మొదటి ఋషి : ఆ విషయం - స్వామి! - మీరు మాకు వివరించాలా?

లక్ష్మణుడు : తమ శుభనామధేయాన్ని మేము వినవచ్చునా?

రెండవ ఋషి : వారు వాలఖిల్య మహర్షులు. తాము వినే వుంటారు, వాలఖిల్యులు బ్రహ్మరోమాల నుంచి జన్మించారని.

సీత : ఔను! వైఖానసులు బ్రహ్మదేవుని గోళ్ళనుంచి పుట్టుకు వచ్చారని కూడా విన్నాము! మరి తా మెవరు? ఆయన చెమట చుక్కల నుంచి ఊడిపడినవారు కారుగదా?

లక్ష్మణుడు : (వినతిపూర్వకంగా) మా వదినగారు ఈ పూట కాస్త చికాకుగా ఉన్నారు. ఆమె మాటలను తమరు పట్టించుకోవద్దని నా మనవి.

మొదటి ఋషి : ఆమె మాకు కన్నతల్లి వంటిది (సీత ముఖం చిట్లిస్తుంది) తల్లి నాలుగు తిట్టినా, అవి బిడ్డలకు దీవెనలే! కూర్చోండి, లక్ష్మణ స్వామీ! కూర్చోండి. ఎంతసేపు అలా నిలబడతారు? మీకు లేనిపోని శ్రమ దేనికి?

లక్ష్మణుడు : ఆఁ! ఏమి శ్రమ లెండి!

రెండవ ఋషి : అమ్మా! దయచేసి తామైనా.....

సీత : (వెంటనే కూర్చుంటూ) మరి కాసేపుపోతే మీరు నన్ను అమ్మమ్మనే చేస్తారేమో!

లక్ష్మణుడు : (సంభాషణ ధోరణి మార్చాలన్న తాపత్రయంతో, రెండవ ఋషి నుద్దేశించి) అయితే, తమ రెవరో, తమ పరిచయ భాగ్యం మాకు కలిగించారు కాదు.

మొదటి ఋషి : ఈయన మా ప్రియ శిష్యులు. మాతోపాటు వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి, మా సన్నిధిలో ఉంటున్నారు; భక్తి శ్రద్ధలతో మాకు శుశ్రూష చేస్తున్నారు.

సీత: ఈయనకు ఊరూ పేరూ లేదా?

మొదటి ఋషి : లేకేమి, తల్లీ, లేకేమి? ఈయన తోడ్పాటు లేకుండా ఈ జనస్థానంలో ఏ యాగామూ జరగదు. అందువల్ల "యాగానంద స్వాము" లనేది ఈయన ప్రసిద్ధ నామమైపోయింది! పేరుకు మా శిష్యులన్న మాటేకాని, అశేష యాగధన సంపన్నులు!

రెండవ ఋషి : నా పట్ల ప్రేమ గౌరవాల కొద్దీ మా గురుదేవులు పలుకుతున్న పలుకుల కేమిలెండి! వారి పాదధూళిని శిరస్సున ధరించడానికైనా తగను! వారు సామాన్యులా? అత్రి అగస్త్యులను మరపించగల మహర్షులు; భృగు భరద్వాజులతో పోల్చదగు బ్రహ్మరులు; వసిష్ఠ విశ్వామిత్రులకు దీటురాగల దివ్యర్షులు!

సీత : అయితే, ఈ జనస్థానానికి తా ముభయులు సూర్యచంద్రులన్నమాట! (మరదివైపు తిరిగింది) కూర్చోవయ్యా, నువ్వూ కూర్చో! మహర్షి సత్తముల సెలవైందిగా! తమ సమక్షంలో చేతులు జోడించి నిలబడలేదని శాప మేదో తగిలించరులే!

మొదటి ఋషి : అమ్మమ్మా! ఎంత మాట!

సీత : నే నన్నంత పనీ జరిగింది! నన్ను అమ్మమ్మను చేసివేశారు!!

లక్ష్మణుడు : (సంభాషణ ధోరణిని మార్చాలని తిరిగి ప్రయత్నిస్తూ) మా అన్నగారు ఇక్కడే, ఈ సమీపంలోనే వుంటున్న ఋషు లెవరో ఆహ్వానించగా వారి ఆతిథ్యాన్ని స్వీకరించడానికి వెళ్ళారు. వారు తిరిగి వచ్చేసరికి చాలా పొద్దెక్కి పోవచ్చు.

సీత : ఎండముఖాన పదరా దంటే తాము వెంటనే తిరుగు ప్రయాణం కట్టడం మంచి దేమో!

మొదటి ఋషి : మా ప్రభువులు ఇక్కడికి విచ్చేశారని విన్నంతనే వారి దర్శనార్థం నాలుగు యోజనాల దూరం నుంచి హుటాహుటిగా వచ్చాము. శ్రీవారి దర్శనభాగ్యం పొంది, వారికి మా నివేదన చేసుకోకుండా తిరిగి వెళ్ళము.

సీత : అయితే, శ్రీవారి దర్శనభాగ్యం కోసమే తాము విచ్చేయలేదన్న మాట! ఏదో నివేదనతో సయితం వచ్చారు!

లక్ష్మణుడు : (ఆందోళనతో) వదినా!

సీత : (వినిపించుకోకుండా) ఏ నివేదనతో తమరు వచ్చారో, అది నాకు తెలుసు చెప్పమంటారా? "రాక్షసుల పీడ మాకు విశేషంగా వుంటున్నది. మా యజ్ఞ యాగాదులకు వారు విఘాతాలు కల్పిస్తున్నారు. వారిని సంహరించి, వారి దురాగతాల నుంచి ప్రభువులు మాకు విముక్తి కలిగించాలి" ఇదే కాదా మీ నివేదన?

రెండవ ఋషి : ఆశ్చర్యం! పరమాశ్చర్యం! మా నివేదన మా మనస్సులో ఉండగానే దాన్ని తా మెంత సరిగా గ్రహించారు!

సీత : తమబోటి దివ్యరుల మధ్యకు వచ్చిన తర్వాత నాకు కూడా కాస్తకాస్త దివ్యదృష్టి అబ్బుతున్నది లెండి!

రెండవ ఋషి : (సీత పలుకులలోని వ్యంగ్యాన్ని గ్రహించలేక) దివ్యదృష్టికి ఈ జనస్థానంలో మా గురుదేవుల తర్వాతనే మరెవరైనా! వారు త్రికాలజ్ఞులు!

సీత : వారి శుశ్రూషతో తాము కనీసం ద్వికాలజ్ఞులైనా అయివుండాలి! అయినా, చూచి చూచి ప్రభువుల వారి దర్శనార్థం వారు లేనప్పుడు వేంచేశారేమో! ఇలాంటి క్షుద్ర విషయాలకు తాము తమ దివ్యశక్తులను వృథా చెయ్యరు కాబోలు! వాటిని తమ రు...

లక్ష్మణుడు : (అపహరిస్తూ) వదినా! దయచేసి నన్ను మాట్లాడనిస్తారా?

సీత : .ఏం! వీరు నన్ను శపిస్తారని భయమా? :

రెండవ ఋషి : అమ్మమ్మా! ఎంత మాట!

సీత : సంతోషం! మరొక మెట్టు పైకెక్కించక, నన్నింకా అమ్మమ్మగానే మిగిల్చారు!

మొదటి ఋషి : నాకు తెలుసు, తల్లీ! నాకు తెలుసు మీది క్షణిక కోపమని. మమ్ము కాదన్నట్టు మేము మిన్నకున్న పక్షంలో మా తల్లి మా పట్ల ప్రసన్నులౌతారని కూడా మాకు తెలుసు!

సీత : అయితే, నాకు రోష మన్నది కూడా లేదన్నమాట! (మొదటి ఋషి చిరునవ్వు నవ్వుతాడు) ఎవరే మన్నా

పడతారన్నమాట! (మొదటి ఋషి పెదవుల పై తిరిగి చిరునవ్వు) కాలు పట్టుకు లాగుతున్నా చూరు పట్టుకు వేలాడతారన్నమాట. (తనను కాదన్నట్టు మొదటి ఋషి మరల మందహాసం చేయగా నిస్పృహతో) అయితే, నేను నా పరాజయాన్ని గుర్తించక తప్పదు! రోషమైనా లేనివారిని ఏమని ఏమి లాభం?

(కొన్ని క్షణాలపాటు పూర్తి నిశ్శబ్దం)

మొదటి ఋషి : మేము బయల్దేరిన వేళా విశేషం వల్లనే మా మహారాణికి మాపై ఆగ్రహం వచ్చింది. ముందు ఆగ్రహపడినా, తర్వాత మమ్ము అనుగ్రహించి, రామచంద్ర ప్రభువులకు మా నివేదనను ఆమె బలపరుస్తారని మాకు తెలుసు!

సీత : ఔను! సమస్తం మీకు తెలుసు! మీరు సర్వజ్ఞు లయ్యె! సరిగాని, నాకున్న ఒక చిన్న సందేహం తీర్చండి. ఇది కోసల దేశమా?

మొదటి ఋషి : కాదు, జనస్థానం.

సీత : ఇక్కడికి వలసరావడానికి ముందు మీరు కోసలదేశ పౌరులా?

మొదటి ఋషి : కాదు, మాది కాశీదేశం.

సీత : అయితే, మావారు మీకు ప్రభువు లెలా అయినారో!

మొదటి ఋషి : రఘునందనులు ఈ భూమండలానికే ప్రభువులు!

సీత : ఎప్పటినుంచి?

మొదటి ఋషి : ఈ భూమి పుట్టినప్పటినుంచీ!

సీత : నాకు తెలియక అడుగుతున్నాగాని, ఈ భూమితోనే రఘుచక్రవర్తి పుట్టుకువచ్చాడా?

మొదటి ఋషి : లే దనుకోండి!

సీత : రఘుచక్రవర్తి జయించిన రాజ్యా లన్నీ ఇప్పుడు కోసలదేశ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నాయా?

మొదటి ఋషి : అవి గుర్తించక పోయినా...

సీత : మీరు గుర్తిస్తున్నా రన్నమాట! సంతోషం!! కాని, ఈ మహీమండలంపైన కోసలరాజులకు లేని సార్వభౌమత్వాన్ని మీరు గుర్తించడానికి ముందు ఈ జనస్థానంపై దీని ప్రభువు కున్న సర్వసత్తాక ప్రతిపత్తిని గుర్తించడం నాకూ, మాకూ, అందరికీ క్షేమ మేమో!

మొదటి ఋషి : వారు రాక్షసులు, తల్లీ! క్రూరరాక్షసులు!

సీత : వారి కంటికి మీరే క్రూరరాక్షసులుగా కనబడవచ్చుగదా! వారు మా కోసల రాజ్యంలోకి రాలేదు, మీ కాశీ రాజ్యంలోకైనా రాలేదు. అన్యాయంగా వారి సీమలోకి చొచ్చుకువచ్చింది మీరే! వారి నివాస స్థానాలకు చిచ్చు పెడుతున్నది వారే! వారి బ్రతుకులను బుగ్గిచేస్తున్నది మీరే! వారి ఉసురుపోసుకుంటున్నది...

లక్ష్మణుడు : (అపవారిస్తూ) వదినా! వదినా!

సీత : నా మాటకు ఒక క్షణం అడ్డురాబోకు! (తిరిగి మొదటి ఋషితో) వారిని సర్వనాశనం చేస్తున్నది మీరే!

మొదటి ఋషి : అ దేమిటి, తల్లీ! అ దేమిటి? మా హోమగుండాలలో నీళ్ళు పోసి, వాటిని చల్లార్చి వేస్తూ, వారు మమ్ము వేధించుకుతింటూ వుంటే, మేమే వారికి ఏదో కీడు తల పెట్టినట్టు మమ్ము నిందిస్తున్నారు!

సీత : హోమగుండాలను మీ రెందుకు వెలిగిస్తున్నారు? ఈ అడవులను కాల్చడానికి కాదా? వీటిని చదును చేసి, దున్నుకోడానికి కాదా? అందువల్ల మీకు పంటలు పండవచ్చు, మీ గరిసెలు నిండవచ్చు, మీ సంసారాలు పచ్చగా ఉండవచ్చు. కాని, ఇక్కడి వారి మాటేమిటి? వీరు కాయ లేరుకుని, కందమూలాలు తవ్వుకుని బ్రతకవలసిన వారు కారా? పిట్టలను పట్టుకొని, జంతువులను కొట్టుకొని పొట్టపోసుకోవలసిన వారు కారా? ఈ అడవులను మీరు ధ్వంసం చేస్తే, వారి బ్రతుకులే ధ్వంసం కావా?

మొదటి ఋషి : వారు కూడా హోమగుండాలను వెలిగించుకుంటే మేము కా దంటామా?

సీత : సేద్యంపట్ల వారికి ఆసక్తి లేదు. వారు హోమగుండాలను ఎందుకు వెలిగించుకోవాలి? తమ జీవిత విధానాన్ని ఎందుకు మార్చుకోవాలి?

మొదటి ఋషి : మన జీవిత విధానమే నాగరిక విధాన మైనందున!

సీత : జంతువులను వేటాడినట్టు తోటి మానవులను వేటాడి, వారి నివాస స్థానాలలో తిష్ట వేయడమే మీ నాగరికత కాబోలు!

మొదటి ఋషి : ఇది దైవానుశాసనం, తల్లీ! ఇది దైవానుశాసనం! యజ్ఞ వాటికలను, హోమగుండాలను మన ఇంద్ర వరుణ మిత్రాది దేవతలే మనకు నిర్దేశించారు! వారి ప్రీత్యర్థం యజ్ఞయాగాదులను మనం విధిగా జరపాలి. లేకపోతే సృష్టి క్రమానికి భంగం వాటిల్లుతుంది, సమస్త లోకాలు ఒక్కసారిగా లభిస్తాయి!

సీత : మీ దేవతలు మీ కుంటే, వారి దేవతలు వారికి లేరా?

మొదటి ఋషి : వారి దేవతలా? వారు క్షుద్రదేవతలు!

సీత : భక్తుల స్వభావాన్ని బట్టి దేవతల స్వభావాన్ని నిర్ణయిస్తే మీ దేవతలే క్షుద్రదేవత లేమో!

మొదటి ఋషి : (తన శాంతాన్ని మరి కాపాడుకోలేక) దశరథ మహారాజు కోడలు, రామచంద్రప్రభువు ధర్మపత్ని...

సీత : (ఆవేశంతో) వారి పేరెత్తడానికైనా మీకు అర్హత లేదు! మరి కట్టి పెట్టండి! అనవసర ప్రేలాపనకు పోతే...

లక్ష్మణుడు : (ఆందోళనతో) వదినా! వదినా!

రెండవ ఋషి : అమ్మమ్మా! ఎంత ఆగ్రహం! ఏమి ఆవేశం!!

సీత : అమ్మమ్మా, గిమ్మమ్మా అంటే మరి సహించేది లేదు సుమా!

లక్ష్మణుడు : వదినా! మీ కొక నమస్కారం! తొందరపడకండి. (మొదటి ఋషితో) తమరు, తమ శిష్యులు ఇప్పుడు వెళ్ళి, రేపు రాగూడదా?

మొదటి ఋషి : (లేస్తూ) రామచంద్ర ప్రభువుల దర్శనం లభించేవరకు మేము ఈ పుణ్యాశ్రమంలోనే వేచివుంటాము లెండి!

(గురువు వెంట శిష్యుడు కూడా లేస్తాడు)

లక్ష్మణుడు : సరే! సుతీక్ష్ణ మహర్షులతో మాట్లాడి, తమ విడిదికి ఏర్పాట్లు చేయిస్తాను. దయచేసి నావెంట రండి!

మొదటి ఋషి: ఆయన మాకు సుపరిచితులే! ఆయన దర్శనం చేసుకునే ఇక్కడికి వచ్చాము! మేము వెడతాము లెండి! మీకు శ్రమ దేనికి?

లక్ష్మణుడు : సరే మంచిది! నమస్కారం!

మొదటి ఋషి : దీర్ఘాయుష్మాన్ భవ!

(మొదటి ఋషి బయటికి వెడతాడు. సీతవంక బెదురు బెదురుగా చూస్తూ గురువును అనుసరించబోయిన రెండవ ఋషి తల "ఠఫీ" అంటూ ద్వారానికి కొట్టుకొంటుంది. "అమ్మమ్మ" అంటూ రెండు చేతులతో నెత్తి పట్టుకొని ఆయన నిలబడి పోతాడు).

లక్ష్మణుడు : (చప్పున చెంతకు వెళ్ళి) పాపం! ఎంత దెబ్బ తగిలింది! తల చిట్లలేదు గదా!

మొదటి ఋషి : (గుమ్మం అవతలనే ఆగి, వెనుకకు తిరిగి చూస్తూ) కాస్త చూచి నడవొద్దూ?

రెండవ ఋషి : (తల తడివి చూచుకుంటూ) ఇంకా నయం! చిట్ల లేదు, బొప్పి కట్టింది - అంతే! (సీతవంక తిరిగి ఒక బెదురుచూపు చూచి, గురువుతో) పదండి, గురుదేవా, పదండి!

(ఋషు లిద్దరి నిష్క్రమణ)

లక్ష్మణుడు : (సీత వైపుకు నడుస్తూ) అమ్మమ్మా! ఎంత కోపం! మీ కెంత కోపం!!

సీత : నన్ను నవ్వులలోకి దించాలని చూస్తున్నావు గాని, ఇది నవ్వులాట విషయం కాదు! ఈ మునిముచ్చుల కారణంగా

మన కేదో కీడు మూడక తప్పదు!

లక్ష్మణుడు : మన్నించండి, వదినా! ఎందుకో తెలియదుగాని, ఈ జనస్థానానికి వచ్చినప్పటి నుంచీ మీ నీడ చూచి మీరే భయపడుతున్నారు!

సీత : నా నీడ చూచి కాదు, ఈ ఋషుల పీడ చూచి! భూతాలవలె, పిశాచాలవలె వీళ్ళు మనను పట్టుకున్నారు!

లక్ష్మణుడు : మనం కాకపోతే మరి వారికి ది క్కెవరు వదినా?

సీత : అన్నకు తగిన తమ్ముడివే! దిక్కులేని వాళ్ళు ఈ ఆటవికులా? వీళ్ళను మారణహోమం చేస్తున్న వారూ, మీ ఋషులా? ఇన్నాళ్ళుగా చూ చూడనట్టు ఊరుకొన్నాను; మరి ఊరుకొనేది లేదు! మా అన్నగారిని రానీ! ఈ పూట ఆయనతో ఏదో ఒకటి తేల్చి వేసుకొంటాను!

లక్ష్మణుడు : నేను మీకు చెప్పగలపాటి వాడిని కాదుగాని...

సీత : అయితే చెప్పబోకు!!

లక్ష్మణుడు : (ఒక క్షణం మౌనం తర్వాత తల పంకిస్తూ) మీ ముఖంలో మబ్బులు కమ్ముకొంటున్నాయి, మీ కళ్ళలో మెరుపులు మెరుస్తున్నాయి, మీ మాటలలో పిడుగులు రాలుతున్నాయి - ఈ పూట మా అన్నగారికి పెనుతుఫాను తప్పదు!

తెర).

ద్వితీయాంకం

మర్నాటి ఉదయం పది, పదకొండు గంటల ప్రాంతాల.
సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంలో తిరిగి అదే అతిథిగృహం. తిరిగి అదే ఫక్కీలో.

ఈ రంగంలో కొత్తగా ప్రవేశించే రాముడు లక్ష్మణుని కంటె వయస్సుకు ఏ మంత పెద్దవాడు కాదుగాని, స్ఫురద్రూపి; ఛాయలో మాత్రం ఒకటి, రెండు వన్నెలు తక్కువ. తమ్ముడు కట్టుకొన్నవాటివలె తనవి కూడా నారబట్టలే. ఏ రాజాలంకరణలు లేకపోయినా, మోము తీరులో, మాట తీరులో, నడక తీరులో రాజఠీవి పుట్టిపడుతూ వుంటుంది. వంశగౌరవాన్ని కాపాడవలసిన భారం, దాన్ని పెంపొందించవలసిన బాధ్యత : ఇవి తనకు విధివిహితా లన్న ప్రగాఢ విశ్వాసం ప్రస్ఫుట మౌతుండే వ్యక్తిత్వం.

రంగస్థలం పై తెర లేచినప్పుడు అన్న రాకకై ఆతురతతో ఎదురు చూస్తూ లక్ష్మణుడు గుమ్మంలో నిలబడి ఉంటాడు. అశాంతిని, ఆగ్రహాన్ని సూచిస్తున్న వదనంతో సీత పర్ణశాలలో నడయాడుతూ వుంటుంది. మధ్యలో ఒకటి, రెండు సార్లు అశాంతితో చెంతనున్న అజినాసనంపై ఆమె కూర్చుంటుంది; ముళ్ళపై కూర్చున్నట్టు అంతలోనే తిరిగి దిగ్గున లేస్తుంది.

సీత : (లక్ష్మణునితో) తలవాకిలిలో నిలబడి నీ వెంత గిలగిలలాడినా, ఆయన వచ్చే వేళకే వస్తారు గాని, ఒక్కక్షణమైనా ముందు రారు! చిరచిరలాడుతున్న ఆ యెండలో పడిగాపులు దేనికి? నీడలోకి రారాదూ?

లక్ష్మణుడు : ఆఁ! ఏమంత యెండగా వున్నది లెండి!

సీత : నిన్న పొద్దుననగా వెళ్ళిన అన్నగారు ఇంతవరకు తిరిగి రాలేదన్న మనస్తాపం వల్ల ఎండ వేడిమి కూడా తమకు తెలియడం లేదు కాబోలు!

లక్ష్మణుడు : (లోపలికి వస్తూ) నిజమే, వదినా! ఆలస్యమైన కొద్దీ నాకు ఆందోళన హెచ్చుతున్నది. ఋషుల ఆతిథ్య

స్వీకరణకై వెళ్ళిన వారు...

సీత : ఋషుల ఆతిథ్య స్వీకరణ! ఔను! ఆటవిక సంహారరూపంలో!!

లక్ష్మణుడు : మీ మాటల కేమి గాని, నిన్న సాయంత్రానికి అన్నయ్య రాకపోతే రాత్రికైనా వస్తా రనుకొన్నాను. రాత్రికి తిరిగి రాలేదు సరిగదా, తెల్లవారిన తర్వాతనైనా ఆయన జాడ లేదు. ఇంత జాగుచేశా రెందుకో! కనీసం మనకు వర్తమానమైనా పంపించారు కారు!

సీత : ఆటవికసంహార కార్యక్రమంలో పూర్తిగా మగ్నులైనవారికి సతిజ్ఞాపకం వుంటుందా, సోదరుడు జ్ఞాపకం వుంటాడా? తమ శౌర్య ప్రతాపాలను పూర్తిగా చూపించి, రఘు వంశ ప్రతిష్ఠను పూర్తిగా కాపాడి, ఋషుల స్తోత్రపాఠాలను పూర్తిగా విని, ఆ తర్వాత నెమ్మదిగా వస్తారులే! రాక, ఎక్కడికి పోతారు?

లక్ష్మణుడు : కోపం కొద్దీ నిర్లక్ష్యాన్ని మీరు ప్రదర్శిస్తున్నా, మీ మనస్సు - వదినా! నిజం చెప్పండి! - ఆందోళనగా లేదూ?

సీత : (మాట తేల్చి వేస్తూ) లేదు.

లక్ష్మణుడు : గట్టిగా చెప్పండి - లేదూ?

సీత : (ముఖం ఒక వైపుకు తిప్పుకుని, కొంచెం గట్టిగా) లేదు!

లక్ష్మణుడు : నా వంక చూస్తూ చెప్పండి : నాకు నిజంగా ఆందోళన లేదూ?

సీత : (చెమ్మగిల్లిన చెక్కిళ్ళతో కూడిన ముఖాన్ని లక్ష్మణునివైపుకు తిప్పి) ఆందోళనపడి నేను చేయగలిగింది ఏమున్నది? ఆయనకు నేనంటే లక్ష్యమా, నా మాటంటే లక్ష్యమా?

లక్ష్మణుడు : ఆయనను వెతుక్కుంటూ నేను వెళ్ళడం మంచిదేమో! వెళ్ళమంటారా, వదినా?

సీత : వెళ్ళు! వెడితే ఆయనకు తోడుగా మరి నలుగురు నిరపరాధులను నువ్వుకూడా చంపి రావచ్చు!

లక్ష్మణుడు : అదేమిటి, వదినా? మరీ అంత నిష్ఠూరంగా మాట్లాడుతున్నారు!

సీత : ఔను! నిజమాడితే నిష్టురమే! ఆయనకు తోచకపోతే, పోనీ నీవైనా చెబుతున్నావా? - ఆటవికులను వేటాడ్డం కోసమే మనం అరణ్యవాసానికి రాలేదని. ఇది తగదని చెప్పకపోగా, ఆయన మాటకు నువ్వు తాళం వేస్తున్నావయ్యే! -

లక్ష్మణుడు : ఆయనకు నేను హితోపదేశం చేయగలపాటి వాడినా? అన్ని విషయాలలో ఆయన...

(లక్ష్మణుడు మాట మధ్యలో వుండగా రెండవ ఋషి పర్ణశాలలో ప్రవేశించబోతాడు. హుటాహుటిగా వస్తున్నందున "ఠంగు" అంటూ తల ద్వారానికి కొట్టుకొంటుంది. "అమ్మమ్మా!" అంటూ ఆయన ముందుకు తూలి పడిపోబోతాడు. పడకుండా ఆయనను లక్ష్మణుడు పట్టుకొంటాడు)

లక్ష్మణుడు : తల మళ్ళీ చితక గొట్టుకున్నారా?

సీత : ఆయన తల అంత తేలికగా చితికేది కాదులే!

రెండవ ఋషి : (ఒక అజినాసనంపై చతికిలబడి తల తడివి చూచుకొంటూ) చితకలేదు గాని, దిమ్మెక్కింది.

లక్ష్మణుడు : మంచితీర్థం కావాలా?

రెండవ ఋషి : ఔను, స్వామీ!

సీత : (మంచినీళ్ళు తీసుకురావడానికి కదలబోయిన మరదితో) నే నిస్తాలే!

(పర్ణశాలలో ఒక మూలగా బల్లపై పెట్టివున్న పెద్ద కుండలో నుంచి పంచపాత్రతో మంచినీళ్ళు తెచ్చి ఇస్తుంది)

రెండవ ఋషి : (మంచినీళ్ళను గడగడ తాగివేసి) అమ్మమ్మా! ప్రాణమిప్పుడు కాస్త కుదటబడింది. (సీత ముఖం చిట్లించు కొనడాన్ని గమనించి) మన్నించండి! "ఈ అమ్మమ్మా ఊతపదం నీ కొక జాడ్యమై పోయింది సుమీ!" అని మా గురుదేవులు నిన్న గట్టిగా నన్ను మందలించారు. కాని, అది లేనిదే నా నోట మాట పెగిలి చావదయ్యే! (దెబ్బ తగిలినచోట తల నిమురుకొంటూ) రామచంద్ర ప్రభువులు ఇంకా తిరిగి రానట్టేనా? ఆశ్రమద్వారం వద్ద వారి దారికాస్తూ పొద్దుటి నుంచి కూర్చునే ఉన్నా! లోపలికి వచ్చిన ప్రతివారినీ పలకరిస్తూనే పోయా! ఇంతలో ఎక్కడినుంచి దాపురించిందో ఆ పాపిష్టినిద్ర, ఒక రావిచెట్టు మొదలుకు జేరగిలబడి, ఒకటి, రెండు కునుకులు తీశా! ఇంతకు ముందే

చప్పున మెలకువ వచ్చి, కళ్ళు తెరిచి చూద్దునుగదా, పొద్దు నడినెత్తి కెక్కబోతున్నది. "అమ్మమ్మా! ఎంత పని జరిగింది!" అనుకొంటూ సరాసరి ఇక్కడికి ఒక్క పరుగున వచ్చా! రామచంద్ర ప్రభువులు ఇంకా తిరిగి రాకపోబట్టి సరిపోయింది గాని, లేకపోతే తమకు ముందుగా వర్తమానం అందించనందుకు, మా గురుదేవులు నన్ను నిలువునా చీల్చేవారే! నాకు తెలియదు, ఆయనెంత చండశాసనుడో! పైకి శాంతమూర్తిగా కనబడినా, కోపం వస్తే - అమ్మమ్మా! ఆయన ప్రళయకాల రుద్రుడే! కార్యార్థులై వచ్చినందున నిన్న మీ మాటలను ఆయన సహించారుగాని, లేకపోతే! ఏదో ఒక ఘోరశాపం పెట్టి ఉండేవారే! ఆయన...

సీత : (కోపంగా) మీరే మా కొకశాపం! వేరే శాపం దేనికి?

రెండవ ఋషి : అమ్మమ్మా! ఎంత మాట!

లక్ష్మణుడు : (సీతతో) వదినా! మీరు కాస్త శాంతించండి. (రెండవ ఋషితో) అయ్యా! అన్నగారు రాగానే తమకు వర్తమానం చేస్తాను లెండి! తాము వెళ్లిరండి!

రెండవ ఋషి : తప్పక చేస్తారా? మరచిపోరు గదా!

లక్ష్మణుడు : మరవను లెండి!

రెండవ ఋషి : అయితే, మరి నేను వెళ్ళివస్తా!

లక్ష్మణుడు : (ఆయన లేవగానే, ద్వారాన్ని చూపుతూ) ఈ సారైనా...

రెండవ ఋషి : అమ్మమ్మా! ఆ పొరపాటు మళ్ళీ చేస్తానా!

(ఈ మాట లని ద్వారం అల్లంత దూరాన ఉండగానే తల పూర్తిగా వంచుకొని రెండవ ఋషి బయటికి వెళ్ళబోతాడు. సరిగా ఆ వేళకు మొదటి ఋషిసమేతంగా రాముడు వాకిటిలోకి వస్తాడు. "లోపలికి దయచేయండి!" అన్నట్టు రాముడు మూగ సైగలతో ఆహ్వానించగా మండిగం పైగా లోపలికి పాదం పెట్టబోతున్న మొదటి ఋషి రొమ్మును రెండవ ఋషి తన తలతో ఢీకొంటాడు.)

రెండవ ఋషి : (తలయెత్తి మొదటి ఋషిని చూచి, తెల్లబోతూ) అమ్మమ్మా! ఎంత తప్పిదం! ఎంత తప్పిదం!! గురుదేవులు మన్నించాలి.

రాముడు : (లోపలికి వస్తూ) ఎవరది?

(వంగి కాళ్ళకు నమస్కారం చేస్తాడు)

మొదటి ఋషి : ఈయన మా శిష్యుడు లెండి! (రెండవ ఋషితో) చూడక తప్పిదం చేశావు - దాని కేమిలేం!

రాముడు : (అజినాసనాలను ఋషు లిద్దరికి చూపుతూ) దయచేసి కూర్చోండి!

మొదటి ఋషి : (ముందు తాను కూర్చుంటూ, రామునితో) తమరు కూడా దయచేయండి!

రాముడు : (రెండవ ఋషితో) అయ్యా! తమరు కూర్చోలే దేమి?

(బిత్తరపడివున్న ఆ ఋషిని రెక్కపుచ్చుకుని, ఒక అజినాసనంపై కూర్చోబెట్టి, తాను కూడా కూర్చుంటాడు. ఈ లోపుగా రాముని ధనుర్బాణాలను అందుకుని, వాటిని లక్ష్మణుడు పర్ణశాలలో ఒక మూలగా పెట్టివస్తాడు)

మొదటి ఋషి : (సీతతో) తల్లీ! తాము...

సీత : కూర్చుంటాను లెండి! నిన్న పొద్దుననగా వెళ్లినవారు, మీరు చూస్తూనే వున్నారుగా, ఇప్పుడే తిరిగి వచ్చారు. స్నానపానాదులు పూర్తి చేసుకొని, వారిని కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి. వారితో మీరు మాట్లాడదలచింది సాయంత్రం మాట్లాడవచ్చు. ఇంతలో ముంచుకుపోయేది ఏమీ లేదు.

రాముడు : (మొదటి ఋషితో) నా విశ్రాంతిమాట కేమి లెండి. తాము పెద్దలు, పూజ్యులు. నిన్నటినుంచి నాకోసం తాము వేచివుండవలసి వచ్చినందుకు నే నెంతో విచారిస్తున్నాను. తమ ఆదేశ మేమిటో సెల వివ్వండి.

మొదటి ఋషి : ఆదేశం కాదు, అభ్యర్థన. ప్రభువులు మా పుణ్యాశ్రమానికి ఒకసారి విచ్చేసి...

సీత : (వెటకారంగా) తమ పాదపద్మరజంతో దాన్ని ఒకసారి పావనం చెయ్యండి!

మొదటి ఋషి : మా విన్నపాన్ని మహారాణి చక్కగా వివరించారు.

సీత : ఇంకా వివరించనుంటారా? "మా పుణ్యాశ్రమాన్ని పావనం చేసిన తర్వాత మా ప్రాంతంలోని రాక్షసులను చెండాడి, వారి పీడ మాకు విరగడ చెయ్యండి!"

రాముడు : (చిరుకోపంతో) మరి చాలు మా ప్రసంగంలో నీ జోక్యం!

మొదటి ఋషి : మహారాజులకు మా దొక విన్నపం : మన సంభాషణలో పాల్గొనకుండా మహారాధీని దయచేసి నిరోధించకండి. అయోధ్యా చక్రవర్తులుగా, ఆర్యావర్తనాయకులుగా మీరు కొనసాగిస్తున్న దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు మీ పట్టపుదేవేరిగా ఆమె సమ్మతి, సన్నుతులు మీకు కావాలి. అవి లభించినప్పుడే మీ కృషి అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది, అప్పుడే మీ శాసనం అమోఘ మౌతుంది. మమ్మగురించి, మా మహర్షిలోకాన్ని గురించి మహారాజ్ఞికి ప్రస్తుతం కొన్ని దురభిప్రాయాలున్నట్టు మాకు తెలుసు. వాటిని నివారించగల మన్న విశ్వాసం మా కున్నది. (సీత వైపుకు తిరిగి) తల్లీ! ఇలా రండి! దయచేసి కూర్చోండి! నిన్నటి మీ సందేహాలను ప్రభువుల సమక్షంలో వెల్లడించండి. వాటిని మేము నిశ్శేషంగా తొలగిస్తాము.

సీత : గత రాత్రి మీరు పూర్తిగా జాగరణం చేసివుండాలి.

మొదటి ఋషి : జాగరణమా? దేనికి తల్లీ?

రాముడు : (చిరాకుగా) సీతా!

సీత : ఇప్పుడు మీ రిచ్చిన గంభీరోపన్యాసాన్ని సిద్ధపరచుకోడానికి!

మొదటి ఋషి : మా మహారాణికి అన్నీ తండ్రి పోలికలే వచ్చాయి. జనక మహారాజు కూడా సంభాషణాచతురులని, హాస్యప్రియులని విన్నాము. సరే తల్లీ! ఇలా వచ్చి కూర్చో! అన్ని విషయాలు చర్చించుకోవచ్చు. అన్ని సందేహాలు నివర్తిచేసుకోవచ్చు.

(నిలుచున్న చోటునుంచి సీత కదలదు)

రాముడు : పెద్దలమాట కాదనరాదు! రా! వచ్చి కూర్చో!

రామునికి దగ్గరగా సీత కూర్చుంటుంది.)

మొదటి ఋషి: లక్ష్మణస్వాములు - తమరు కూడా...

(కదిలివచ్చి, లక్ష్మణుడు కాస్త దూరంగా కూర్చుంటాడు)

మొదటి ఋషి : అయోధ్యా పౌరులు కానివారు అయోధ్యా ప్రభువుల రక్షణ కోరడం భావ్యం కాదని మహారాజ్ఞి అభిప్రాయం. అంతేకాదా, తల్లీ?

సీత : ఔను!

మొదటి ఋషి: కాని, అయోధ్యా ప్రభువుల రాజ్యాధికారంకంటె వారి నైతికాధికారం ఎంతో విస్తృతమైంది. కాదా, ప్రభూ?

రాముడు : నిశ్చయంగా!

మొదటి ఋషి : (లక్ష్మణునితో) లక్ష్మణస్వాములు మాతో ఏకీభవిస్తారా?

లక్ష్మణుడు : పూర్తిగా!

మొదటి ఋషి : ఈ నైతికాధికారమే అయోధ్యా ప్రభవులకు వంశపారంపర్యంగా దేశనాయకత్వాన్ని కట్టబెడుతున్నది. స్వర్గ నాయకత్వం ఇంద్రునిదైనట్టు ఆర్యావర్త నాయకత్వం ఇక్ష్వాకులదే! ఔనా ప్రభూ?

రాముడు : నిశ్చయంగా!

మొదటి ఋషి : లక్ష్మణస్వాములు తిరిగి మాతో ఏకీభవిస్తారా?

లక్ష్మణుడు : పూర్తిగా!

మొదటి ఋషి : ఆర్యావర్తం పై అయోధ్యా ప్రభువుల కున్న ఈ వంశపారంపర్య నాయకత్వం దృష్ట్యా ఆర్యఋషులైనవారు

తాము ఎక్కడున్నా ఆపత్కాలంలో ఆ ప్రభువుల రక్షణ కోరవచ్చునని మా మతం. ఇందుకు రామచంద్ర ప్రభువులు ఏమంటారు?

సీత : ఏమంటారా? (రాముని చూపుతూ) ఈ ప్రభువు లేమో "నిశ్చయంగా" అంటారు! (లక్ష్మణుని చూపుతూ) ఆ స్వామి లేమో "పూర్తిగా" అంటారు!! పొగడ్తలకు పొంగిపోవడం రాజులకున్న జాడ్యమే కాని, ఈ అయోధ్యారాజుల కున్నంతగా మరెవ్వరికి లేదు!

రెండవ ఋషి : అమ్మమ్మా! ఎంతమాట!

మొదటి ఋషి : (తన చికాకును కప్పిపుచ్చుకొంటూ, రెండవ ఋషితో) ప్రభువులతో మేము మాట్లాడి వచ్చేలోగా, మీరు మన విడిదికి వెళ్ళి, మన తిరుగు ప్రయాణానికి సన్నాహాలు జరపడం మంచిదేమో!

రెండవ ఋషి : (లేస్తూ) చిత్తం!

లక్ష్మణుడు : (రెండవ ఋషితోపాటు లేచి, ద్వారాన్ని చూపుతూ) జాగ్రత్తగా వెళ్ళండి!

రెండవ ఋషి : అమ్మమ్మా! తల మరొకసారి బొప్పి కట్టించుకొంటానా! (ప్రమాదం లేకుండానే ఈసారి రెండవ ఋషి బయటికి దాటిపోతాడు. ఆయన వెళ్లిపోగానే లక్ష్మణుడు తిరిగి తన స్థానంలోకి వచ్చి కూర్చుంటాడు.)

మొదటి ఋషి : మాకు తెలుసు తల్లీ! - విదేహరాజులలో పెక్కుమంది రాజర్షులున్నట్టు మాకు తెలుసు. వారిలో మహాజ్ఞాను లున్నట్టు కూడా మాకు తెలుసు. ఇప్పటి సీరధ్వజులు కూడా జ్ఞానసిద్ధి పొందిన వారే! అయినా, ఆర్యావర్తంపై నైతికాధికారానికి సంబంధించినంతవరకు ఎవరైనా అయోధ్యా చక్రవర్తుల తర్వాతనే. పుట్టింటి వారిపై మమతవల్ల ఈ విషయాన్ని గుర్తించడం జనక రాజనందనకు కొంత కష్టమే కావచ్చు. అయినా...

సీత : మీ పారలౌకిక శక్తుల సంగతి నాకు తెలియదు గాని, మీ లౌకికప్రజ్ఞ మాత్రం అసాధారణమైనదే!

రాముడు : (ముక్కుపై వేలు వేసుకొంటూ) సీతా!

మొదటి ఋషి : మా తల్లి ఎంత ప్రయత్నించినా మాకు కోపం తెప్పించలేరు!

సీత : ఆ సంగతి నిన్ననే తెలిసిందిలెండి!!

రాముడు ; ecl నిన్నకూడా మహర్షులతో వాగ్వాదం చేశావా? ఇది మనకు తగదు. పెద్దలు ఏమన్నా మారాడకుండా మనం వినాలి.

మొదటి ఋషి : వాదప్రియత్వం ఆమెకు రక్తంలోనే వున్నదిలెండి. అందువల్ల ఆమెను వారించకండి : ఆ! ఇంతకు ముందు నేను అంటున్నట్టు, ఎవరు గుర్తించినా, ఎవరు గుర్తించకపోయినా, మా ఋషిలోకం మాత్రం అనాది కాలంగా అయోధ్యా చక్రవర్తులకు ఈ ఆర్యావర్తం పైగల నైతికాధికారాన్ని గుర్తిస్తున్నది; వారినే తన నైతిక సార్వభౌములుగా గౌరవిస్తున్నది.

సీత : వారు మీకు నైతిక సార్వభౌములైతే వారి నుంచి మీరు కోరవలసింది నైతిక సమర్థన మాత్రమే; ఆయుధాల ద్వారా సంరక్షణ కాదు. ఆయుధాలతో ఏ ప్రభువులైనా రక్షించ వలసింది తమకు పన్నులు చెల్లించే తమ పౌరులనే!

మొదటి ఋషి : (క్షమా పూర్వకమైన చిరునవ్వుతో) మేము మా ప్రభువులకు పన్నులు చెల్లించడం లేదని మహారాణి అభిప్రాయమా? అయితే, అది పొరపాటు! నియతిగా మేము వాటిని చెల్లిస్తూనే వున్నాము.

సీత : అలాగా! ఇది నాకు తెలియని కొత్త విషయమే! రాజకోశాగారాలపై మీ ఋషులు దాడిచేయడమే నాకు తెలుసుగాని, వాటిని నించడం తెలియదు!

మొదటి ఋషి: మేము పన్నులుగా చెల్లించేది క్షరమైన ధనధాన్యాలు కావు; అక్షరమైన మా యజ్ఞఫలం!

సీత : అది అక్షరమైంది మాత్రమే కాదు, అగోచరమైంది కూడా!

మొదటి ఋషి: ఔను తల్లీ! ఔను!

సీత : అదీ ఒక మేలే! దాన్ని భద్రంచేసుకోడానికి ప్రజల కష్టార్జితంతో మేము కోశాగారాలు కట్టుకోనక్కరలేదు! :.

రాముడు : (తీవ్రంగా) సీతా! నీవు మరీ మితిమీరి పోతున్నావు సుమీ!

మొదటి ఋషి : (రామునితో) మా విన్నపాన్ని మన్నించి, తాము మహారాజైని వారించకండి. ఆమె వైఖరిని మార్చడానికి, దయచేసి, మాకు మరికొంత సావకాశ మిప్పించండి! (సీతతో) మీ కోశాగారాలను నింపలేకపోయినా, మా యజ్ఞఫలం మీకు పాథేయమౌతుంది, తల్లీ!

సీత : పాథేయమా?

మొదటి ఋషి : బ్రహ్మపథాన్ని చేరడానికి అది మీకు పాథేయమై, అక్కడ మీకు శాశ్వతసుఖాలను చేకూర్చుతుంది.

సీత : త్వరగా మమ్ము ఈ లోకం నుంచి సాగనంపడానికి అది తోడ్పడుతుందన్నమాట!

రాముడు : (కోపంగా) మరి చాల్లే! సంతోషించాం!!

మొదటి ఋషి : (రామునితో) తమరు చిరాకు పడవద్దు! (సీతతో) అమ్మా! మీ రేమన్నా సరేగాని, మా యజ్ఞఫల ప్రభావాన్ని చిరకాలంగా అయోధ్యా ప్రభువులు గుర్తిస్తున్నారు. అందువల్లనే దానిలో చతుర్థాంశాన్ని వారు కోరుతున్నారు. వారు కోరినమేరకు దాన్ని మేము సంతోషంగా వారికి సమర్పించుకొంటున్నాము!

సీత : (దీర్ఘం తీస్తూ) అలాగా!

మొదటి ఋషి : రాజులకు ప్రజ లిచ్చేది తమ రాబడిలో ఆరవవంతు మాత్రమే! ఇక, మే మంటారా? మా అయోధ్యా ప్రభువులకు మా యజ్ఞఫలంలో నాల్గవవంతును పంచి పెడుతున్నాము!

సీత : (అవహేళనగా) మీరు చెప్పే వరకు నిజంగానే నాకు తెలియదు సుమండీ! కష్టార్జితంలో తమరు మా కింత పెద్దభాగం పెడుతున్నారని! తమ

మొదటి ఋషి : రాసిలోనే అది పెద్దది కాదు, గుణంలో కూడా. అది అమూల్యమైంది, అనశ్వరమైంది, అమోఘమైంది!

సీత : తమ అమోఘసంపదను తమవద్దనే వుంచుకుని, దానితో ఆత్మరక్షణ చేసుకోవచ్చుగదా? ఆయుధాలద్వారా (రాముని చూపుతూ) ఈయన రక్షణ కోరడం దేనికి?

మొదటి ఋషి : యజ్ఞఫలం మాకు కూర్చే మహత్తరశక్తులతో మేము ముల్లోకాలనే మాడ్చి వేయగలం; సృష్టికి ప్రతిసృష్టిని చేయగలం! అట్టి మాకు ఈ రాక్షససంహారం ఒక లెక్కా? కాని, ప్రభువుల ఆయుధశక్తిని మించిపోయినప్పుడు తప్ప మేము మా దివ్యశక్తులను రాక్షస సంహారాన్ని పోలిన లౌకిక ప్రయోజనాల సాధనకై వినియోగించరాదు. ఇది మాకు దైవానుశాసనం!

సీత : మీ దివ్యశక్తుల పటిమ నాకు తెలియదుగాని, మీ వాక్పటిమ మాత్రం అమోఘమైనదే! రాముడు : (చాలా కోపంగా) సీతా!

సీత : మీరు గద్దించినా, మరి నేను మిన్నకుండేది లేదు! మిమ్ము ముఖస్తుతి చేసి, ఈ మునిముచ్చులు మీతో అమాయకులైన ఆటవికులను అన్యాయంగా చంపిస్తున్నారు. వీరి మోసాన్ని కానలేక మీరు...

రాముడు : (దిగ్గున లేస్తూ) చాల్చాలు! మరి కట్టి పెట్టు!! (మొదటి ఋషితో) తమవెంట నేను తప్పక వస్తాను, తమ హోమగుండాలను చల్లార్చుతున్న రాక్షసులను వధిస్తాను. విడిదికి వెళ్ళి, తమ ప్రయాణ సన్నాహాలు పూర్తి చేయించండి! మరి కొద్ది సేపటిలోనే నేను నా కోదండంతో తమ సేవలో నిలుస్తాను. (తమ్మునివైపు తిరిగి) లక్ష్మణా! మహర్షుల వెంట వెళ్ళి, వారిని విడిదిలో దిగవిడిచిరా!

మొదటి ఋషి : (సీతతో) ఈనాడు కాకపోతే మరొకనాటికైనా నీకే తెలుస్తుందిలే - తల్లీ - మా ఋషిలోకాన్ని రక్షించడం అయోధ్యా చక్రవర్తుల ప్రథమ కర్తవ్యమని. ఏనాడు దాన్ని వారు నిర్లక్ష్యం చేస్తే, ఆనాడే వారి ప్రాధాన్యం సమసిపోతుంది. మరి వెళ్ళిరామా?

(సీత మారు పలకదు. లక్ష్మణుడు ముందు నడవగా మొదటి ఋషి వెళ్ళిపోతాడు. వా రిద్దరు కదిలివెళ్ళగానే సీతకోపం కన్నీళ్ళకింద మారుతుంది. ముఖం ఒక వైపుకు తిప్పుకొని, చీరచెంగుతో కళ్ళను తుడుచుకొంటూ ఆమె నిలబడివుంటుంది.)

రాముడు : (కొన్ని క్షణాల మౌనం తర్వాత) నా కర్తవ్యాన్ని నేను పరిపాలిస్తున్నాను. నాకు రాగల ప్రమాద మేమీ లేదు! నీకు

లేనిపోని భయం దేనికి, బాధ దేనికి? (దగ్గరికి వెళ్లి, భుజంపై చేయి వేసి) ఎందుకు అనవసరంగా కంటతడి పెట్టుకోవడం? ఇటు చూడు! (ఒక క్షణం ఆగి) నిన్నే! ఇటు చూడమంటూ వుంటే! (అప్యాయంగా ఆమె ముఖాన్ని తనవైపుకు తిప్పుకొని, తడిసివున్న ఆమె చెక్కిళ్ళను తుడుస్తూ) నా మాట విను! అకారణంగా కలవరపడబోకు!

సీత : (గాద్గదికంగా) నే నేమి కలవరపడితే మీకు దేనికి లెండి! నేను మీకు కావాలా?

రాముడు : అదేమిటి? - పిచ్చిమాట!

సీత : పిచ్చిమాట కాదు, నిజం మాటే! నేను మీకు కావలసినదాన్నైతే "ఇదుగో! సంధ్యవార్చి వస్తా!" నంటూ నిన్న పొద్దుననగా వెళ్ళినవారు ఇప్పటికి తిరిగి వస్తారా? వచ్చీ రాకముందే మరొక ఋష్యాశ్రమానికి తిరిగి ప్రయాణం కడతారా?

రాముడు : నిన్న సాయంత్రానికో, రాత్రికో తిరిగి రావలసింది. కాని, నా సహాయం కోరిన మహర్షులు ప్రారంభించిన మహాయజ్ఞం నేటి ప్రాతఃకాలానికి కాని పూర్తికాలేదు.

సీత : అది మహాయజ్ఞమా? అయితే కనీసం ఒక వందమందికైనా వైధవ్యం సంప్రాప్తించి వుంటుంది!

రాముడు : వైధవ్య మేమిటి?

సీత : మీకు తెలియనట్టు నన్నడగడం దేనికి? యజ్ఞ యాగాదుల రక్షణ పేరుతో స్థానిక గృహస్థులలో ఏ వంద మందినో మీరు వధిస్తే, వారి భార్యలు వందమందికి వైధవ్యం సంప్రాప్తించదా? పాపం! వారూ నావంటి స్త్రీలే అని తలుచుకొన్నప్పుడు నా గుండెలు జలదరిస్తూవుంటాయి!

రాముడు : వారితో పోలిక పెట్టుకొంటున్నావా?

సీత : పోలిక పెట్టుకోవడంలో తప్పేమున్నది? వారు రాజపుత్రికలు కాకపోవచ్చు, రాజపత్నులు కాకపోవచ్చు. అయినా, వారూ నావంటి స్త్రీలే కారా? సుఖంగా తమ సంసారాలు తాము చేసుకోవాలని నావలె వారూ కోరుకోరా?

రాముడు : అయితే, మహర్షుల హోమగుండాల జోలికి పోకుండా తమ భర్తలను వారెందుకు నిరోధించరు?

సీత : నేను మిమ్ము నిరోధించగలుగుతున్నానా, తమ భర్తలను వారు నిరోధించగలగడానికి!

రాముడు : నేను వెదుతున్నది ఆర్షధర్మరక్షణ కోసం!

సీత : వారు వస్తున్నది ఆత్మ రక్షణకోసం! అరణ్యాలే, ఆరణ్యకసంపదలే జీవనాధారాలైనవారు వాటిని మీరు దగ్ధం చేస్తుంటే, చూస్తూ వూరుకోగలరా?

రాముడు : నీకు తెలియక పోవచ్చుగాని, అగ్నిహోత్రుడు పావనం చేయని భూములు ఆర్యులైనవారికి నివాసయోగ్యాలు కావని మన ధర్మశాస్త్రం చెబుతున్నది. ఆ శాస్త్రానుసారంగానే మన ఋషులు ఈ జనస్థానంలో తమ పుణ్యాశ్రమాల సంస్థాపనార్థం ఏవో కొన్ని ప్రాంతాలను అగ్నిహోత్రుని సహాయంతో పావనం చేయవలసివస్తున్నది. ఇంత విశాలమైన ఈ దండాకారణ్యం వుండగా ఈ రాక్షసులు ఈ జనస్థానాన్నే ఎందుకు అంటి పెట్టుకోవాలి? కాస్త అవతలికి కదలిపోరాదా? అక్కడ బ్రతకరాదా? అడవులలో అఘోరించే వారికి ఏ అడవు లైతేనేం!

సీత : ఆ మీ మహర్షులే ఆ పని ఎందుకు చేయరాదో! నిర్మానుష్యమైన ప్రాంతాలు ఈ దండకారణ్యంలో ఎన్ని లేవు? వాటిలో తమ పుణ్యాశ్రమాలను స్థాపించుకొనక, ఈ జనస్థానానికే మీ వారెందుకు రావాలి?

రాముడు : ఇదివరలో నీవు మహర్షు లంటే ఎంతో భక్తి చూపేదానివి. ఇక్కడికి వచ్చిన తర్వాత, ఎందువల్లనో వారిని నీవు విపరీతంగా విద్వేషిస్తున్నావు!

సీత : ఇక్కడికి మనం వచ్చిన తర్వాతగాని వారి నిజరూపం నాకు తెలిసి రాలేదు!

రాముడు : వారివిషయంలో నీవు పూర్తిగా పొరపడుతున్నావు సుమీ! వారు పూతచరితులు, మనకు సర్వదా పూజనీయులు!

సీత : పోనీ, మీ మాట నే నెందుకు కాదనాలి; వారు పూతచరితులే, పూజనీయులే! కాని, మనం వనవాసానికి ఎందుకు వచ్చినట్టు? మన ప్రవాసకాలాన్ని ప్రశాంతంగా గడుపుకుపోవడానికా, మహర్షుల ప్రేరణపై ఈ వన్యప్రాంతాలవారిని వధించి వెళ్ళడానికా?

రాముడు : "ఏకః క్రియా ద్వ్యర్థకరీ బభూవ" అన్నట్టు, పితృవాక్య పరిపాలనతో పాటు ఋషిలోక సేవకు ఈ వనవాసం నాకు మహదవకాశాన్ని కల్పిస్తున్నది!

సీత : అయితే, మీ తండ్రి ముందు మీ రేమి ప్రతిజ్ఞ చేసి వచ్చారు? మీ తల్లి కేమి వాగ్దానం చేసి వచ్చారు? ప్రవాసకాలంలో మునీంద్రునివలె జీవిస్తామని కాదా? దాన్ని మీ రిప్పుడు నిజంగా పరిపాలిస్తున్నారా?

రాముడు : ఎందుకు పరిపాలించడం లేదు?

సీత : మునీంద్రులు అస్త్రశస్త్రాలను ధరిస్తారా? సంధ్య వార్చడానికి వెళ్ళినా సాయుధులై వెడతారా? నిరాయుధులను చంపివస్తారా?

రాముడు ; వారు నిరాయుధులు కారే!

సీత : రాళ్ళూ రప్పలూ, కర్రలూ బుర్రలూ కూడా మీ దృష్టిలో ఆయుధా లేనా?

రాముడు : ఈటెలు, బరిసెలు, కత్తులు, గదలు, గొడ్డళ్ళు మొదలైనవి కూడా వారి కున్నాయి.

సీత : ఏమున్నా వారికి మీ విల్లంబులు లేవుగదా! అవే వారికుంటే అవలీలగా మీరు వారిని కూలవేయగలరా?

రాముడు : ఏమైనా నిరాయుధులుమాత్రం కారు. పైగా, వారు రాక్షసులు!

సీత : అది వారికి మీ మహర్షులు పెట్టిన పేరు! రాక్షసులుగా చిత్రించకపోతే, వారిని మీచేత మీ మహర్షులు చంపించలేరు! రాముడు,నీ మాటల కేమిలేః! వారు నిస్సందేహంగా రాక్షసులే!

సీత : పోనీ, రాక్షసులని చెప్పి మృగాలవలె వారిని వేటాడ్డానికైనా మీ రిప్పుడు రాజులు కారుగదా?

రాముడు : నే నిప్పుడు రాజును కాకపోయినా క్షత్రియుణ్ణి కానా? నా శరణు జొచ్చిన వారికి రక్షణ నివ్వడం నా క్షత్రియ ధర్మం కాదా.

సీత : అయితే, మీరు అయోధ్యలో చేసిన ప్రతిజ్ఞ మునివేషధారణకే పరిమితం కాబోలు! మునివలె జీవించనప్పుడు మునివేషం మాత్రం దేనికి? దాన్ని విప్పివేయండి!

రాముడు : ఈ ధర్మసూక్ష్మాలు నీకు తెలియవులే!

సీత : ఏం! నేనంత మూర్ఖురాలినా?

రాముడు : జనక మహారాజ పుత్రికారత్నాన్ని నేనంత మాట అంటానా? నేను ఈ దండకారణ్యంలో ప్రవేశించగానే....

సీత : మీరు దీనిలో ప్రవేశించలేదు; మిమ్ము దీనిలో ప్రవేశపెట్టించారు

రాముడు : (ఆశ్చర్యంగా) ప్రవేశపెట్టించారా? ఎవరది?

సీత: ఈ ఋషులే!

రాముడు : ఈ పూట నీ మాటలన్నీ విడ్డూరంగా వున్నాయి!

సీత : వీరు పన్నిన పన్నాగాన్ని నావలె మీరు కానగలిగితే నా మాటలు మీకు విడ్డూరంగా తోచవు.

రాముడు : పన్నాగమా. ఏమి పన్నాగం?

సీత : చాలా పెద్ద పన్నాగం! చిత్రకూటంవద్ద మనం చక్కని పర్ణశాల వేసుకోలేదా? అక్కడనే మన ప్రవాసకాలాన్ని గడపాలని అనుకోలేదా?

రాముడు: ఔను!

సీత : ఆ పర్వతంపై విహరిస్తూ, ఆ నదిలో జలక్రీడలాడుతూ మనం ప్రవాసక్లేశాలను మరచిపోలేదా?

రాముడు : నిజమే! అక్కడ అయోధ్యా నగరాన్నే మరచిపోయాం! అక్కడి ప్రకృతి సౌందర్యగరిమ అంతటిదే!

సీత : ఆ సౌందర్యగరిమ అక్కడ వుండగా మిమ్మొక మహాకవిని చేసింది. కదిలితే ఒక ఉపమానం, మెదిలితే ఒక ఉపమానం

అక్కడ మీనోట వస్తూవుండేది.

రాముడు : ఆఁ! నా పిచ్చి ఉపమానాల కేమిలే!

సీత : అవి పిచ్చివేమీ కావులెండి! చిత్రకూటం సానువులలోని ఒక చెట్టుకొమ్మ మందాకిని పైకి వాలివుండడాన్ని చూచి మీ రేమన్నారు?

రాముడు : నీవే చెప్పు!

సీత : నేను చెప్పను!

రాముడు : అయితే, నేను చెబుతాను : ప్రేమకలాపా లాడ్డానికి ప్రేయసి వక్షస్థలంపైకి వాలబోతున్న ప్రియునివలె అది వున్న దన్నాను.

సీత : ఇంతకంటె కూడా మంచి ఉపమానం మీరు తెచ్చారు. గాలి పాటుకు కదిలిన ఆ చెట్టుకొమ్మ మందాకినిపై జలజల పూలను రాల్చగా, నృత్య ప్రదర్శనానికి ముందు సభాసదులపై దోసిళ్ళతో పువ్వులను విరజిమ్మే నర్తకివలె అది వున్న దన్నారు.

రాముడు : ఉహు!! అంతకంటే మంచిది మరొకటి వున్నది. తొలి సంజరేకలకు జేవురించిన చిత్రకూట శిఖరాన్ని ఒకనాడు నీకు చూపిస్తూ, అది మన ప్రథమ సమాగమంనాటి నీ వదనబింబాన్ని పోలివున్నదని నేననలేదా?

సీత : అయినా, చిత్రకూట పర్వత ప్రాంతం మిమ్ము ఒక మహాకవిని చేయలే దంటారు దేనికి?

రాముడు : ఇవన్నీ నువ్వు జ్ఞాపకం చేస్తుంటే, నా మనస్సు మళ్ళీ ఆ నందనం వైపుకు పరుగు పెడుతున్నది!

సీత : అంత సుఖంగా, సంతోషంగా అక్కడ మనం కాలం గడిపినా, ఆ ప్రాంతాన్ని విడిచి ఇక్కడికెందుకు రావలసివచ్చింది?

రాముడు : అక్కడవుంటే నా తల్లులు, నా తమ్ములు నన్ను చూడ్డానికి తరచు వచ్చి, మన ప్రవాసదీక్షకు అంతరాయాలు కలిగిస్తారని నేను భయపడబట్టి.

సీత : అది మీకు కలిగిన భయం కాదు; ఈ ఋషులు మీలో ప్రవేశ పెట్టిన భయం!

రాముడు : అంతటి కాపట్యాన్ని వీరికి అంటగట్టడం నీకు తగదు! :

సీత : మన్నించండి. వీరి మాయలో పడి, వీరి కాపట్యాన్ని మీరు కాన లేక పోతున్నారు. మనం చిత్రకూటంవద్ద నివసించడంవల్ల జనస్థానంలోని రాక్షసులు అక్కడివరకు వచ్చి తమను హింసపెట్టగలరన్న భయాన్ని వీరు వెల్లడించలేదా? మరింత సురక్షిత స్థానాలకు తాము తరలిపోతున్నట్టు నటనచేయలేదా? అయినా, ఉత్తరాభిముఖంగా వెళ్ళక, దక్షిణదిశకే వీరు ఎందుకు వస్తున్నారు? మనవెనకనే ఈజనస్థానంలో ఎందుకు ప్రవేశిస్తున్నారు?

రాముడు : ఆఁ! నీవన్నీ లేనిపోని సంశయాలు!

సీత : అయితే, ఈ మాటకు బదులుచెప్పండి! ఈ దండకారణ్యంలో మన వనవాసానికి తగు ప్రదేశం ఏ దన్న ప్రశ్నకు ప్రతి ఒక్క ఋషి మరింతగా దక్షిణానికే పొమ్మని మనకు ఎందుకు చెబుతున్నాడు?

రాముడు : ఎందుకో తెలియదుగాని, అందరినోట అదే మాట వస్తున్నది.

సీత : తెలియకపోవడానికి ఇందులో పెద్ద రహస్య మేమున్నది? మీ రెంత ముందుకు సాగితే తా మంత ముందుకు విస్తరించవచ్చు; చివరికి మొత్తం దండకారణ్యాన్నే తాము వశపరచుకోవచ్చు.

రాముడు : అంతే నంటావా?

సీత : ఇంకా మీకు సందేహమా?

రాముడు : అయినా, నే నిప్పుడు వెనుదిరగడానికి వీలులేదు.

సీత : ఎందువల్ల?

రాముడు : వాగ్దానం చేసినందున.

సీత : ఏమి వాగ్దానం?

రాముడు : రాక్షసుల పీడనుంచి మీకు విముక్తి కలిగిస్తానని ఈ దండకారణ్యంలో ప్రవేశించగానే ఋషులకు నేను చేసిన వాగ్దానం.

సీత : అది తొందరపాటు వాగ్దానం కాదా? అనాలోచితమైనది కాదా?

రాముడు : ఏమైనా, ఒకసారి మాట యిచ్చిన మీదట దాన్ని తప్పడం మా వంశంలోనే లేదు.

సీత : అయితే, అయోధ్యలో మీ తల్లితండ్రుల కిచ్చి వచ్చిన మాట గాలికి ఎగిరిపోయినట్టేనా?

రాముడు : దానికి భిన్నంగా నేను వెళ్ళడంలేదు!

సీత : వెళ్ళ కేమి? అక్కడి మీ మాటప్రకారం ఇక్కడ మీరు మునివలెనే జీవిస్తున్నారా? మునులు ఆయుధధారణ చేస్తారా? క్షత్రియ ధర్మాలను పరిపాలిస్తారా? మీ మొదటి మాట నిలుపుకోవాలంటే, నా విన్నపాన్ని మన్నించి, మన వనవాసం ముగిసే వరకు ఆయుధవిసర్జన చేయండి!

రాముడు : అది జరగదు!

సీత : నన్ను మన్నించండి - నే నేదో ధర్మోపన్యాసం చేస్తున్నట్టుగా భావించకండి. నే నంతటిపాటిదాన్ని కాను. అయినా, దయచేసి నా మాట వినండి. ఆయుధానికి రక్తదాహం వుంటుంది; అది నరబలిని కోరుతుంది. ఆయుధధారణ చేయగానే కారుణ్య మూర్తులైనా క్రూరు లౌతారు, శాంతి ప్రియులైనా యుద్ధోన్మాదు లౌతారు. ముఖ్యంగా క్షత్రియుని చేతిలో ఆయుధా లుండరాదు. అవి అగ్నిహోత్రునికి సమీపంలో సమిధ లుండడమే! మీ చేతిలో నిత్యం వుంటున్న మీ ఆయుధాలే మిమ్ము హింసా కృత్యాలకు ప్రేరేపిస్తున్నాయి; అవే మీకు పాప చింతలను కలిగిస్తున్నాయి. నా ప్రార్థన మన్నించి, కనీసం ప్రస్తుతానికైనా ఆయుధ విసర్జన చేయండి.

రాముడు: నీ వేమైనా చెప్పు. నేను ఆయుధ విసర్జన చేయను. ఇది ముమ్మాటికీ నిశ్చయం!

సీత : నేను మీ దృష్టిలో మూర్ఖురాలినే కావచ్చు. అయినా, పెద్దల మాటనైనా పాటించరాదా? అనృతాలు పలకడం పాపమని పెద్దలన్నారు. అన్యకాంతలను కామించడం అంత కంటె పెద్దపాపమన్నారు. పగ లేకుండానే పరులను చంపడం ఈ రెండింటిని మించిన మహాపాపమన్నారు. ఆ మహాపాపానికే మీ రిప్పుడు వొడిగడుతున్నారు!

రాముడు : (కోపంగా) నేను మహాపాపానికి వొడిగడుతున్నానా? నీవు చాలా క్రూరంగా పలుకుతున్నావు సుమీ!

సీత : నిరపరాధులను నిర్దాక్షిణ్యంగా వధించడంకంటె నా పలుకులు క్రూరమైనవా?

రాముడు : (తీవ్రంగా) నేను వధిస్తున్న వారు నిరపరాధులనే నీవు నిజంగా నమ్ముతున్నావా?

సీత : ఔను! ఈ ఆటవికులకు మనపట్ల వైరం లేదు. మనతో వీరు ఏ విధమైన జోక్యం పెట్టుకోవడం లేదు. మనకు కించిత్తు అపకారమైనా తలపెట్టడం లేదు. మృగాలవలె వీరిని వేటాడ్డం దేనికి? రాక్షసులుగా వీరిని ఋషులు చిత్రిస్తూవుంటే నిజమేమో అనుకొన్నాను. కాని, తీరా ఇక్కడికి వచ్చి చూస్తే, వీరు అన్నెంపున్నెం తెలియని ఆటవికులు! తమ బ్రతుకు తాము బ్రతకాలనే వీరు కోరుతున్నారు. నా మాట వినండి. ఋషుల స్వార్థానికి వీరిని బలిపెట్టకండి. (చరాలున వంగి, భర్త రెండు పాదాలను పట్టుకుని) నే నొక మహారాజు కుమార్తెను, మరొక మహారాజు కోడలిని. భిక్ష మడగడం నా ప్రవృత్తికి విరుద్ధం. అయినా, ఈపూట మిమ్ము భిక్ష మడుగుతున్నాను. ఈ ఆటవికులకు ప్రాణభిక్ష పెట్టండి, వీరి సతులకు మాంగల్యభిక్ష పెట్టండి, నాకు మనశ్శాంతి భిక్ష పెట్టండి!!

రాముడు : (ఆమె పట్టు విడిపించుకుని తన ధనుర్బాణాల వద్దకు వెళ్ళి, వాటిని అందుకుని, బయటికి వెళ్ళబోతూ)

అవసరమైతే నేను నిన్ను విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను, నా ప్రాణాలనైనా విడుస్తాను; ఋషుల కిచ్చిన మాట మాత్రం తప్పను ఆడిన మాట తప్పితే మా వంశగౌరవం మంట గలుస్తుంది.

సీత : (అభిమానం, కోపం, దైన్యం ముప్పిరిగొనగా, లేచి నిలబడి, బయటికి వెళ్ళిపోతున్న భర్తతో) ఔను! మీ వంశగౌరవమే మీకు కావలసింది, నేను కాదు! వెళ్ళండి! వెళ్ళి, నిరపరాధులను చంపి, మీ వంశగౌరవం కాపాడుకోండి!! కాని ఆగి ఒక్క మాట వింటారా? (రాముడు ఆగిపోయి వెనుదిరిగి చూస్తాడు. ప్రతి మాటను నొక్కుతూ, తిరిగి సీత) అవసరమైతే నన్ను విడుస్తా మన్నారు. మీ రంతటివారే! మీ వంశ గౌరవానికి బలిగా ఎప్పుడో ఒకప్పుడు ఏ నట్టడివిలోనో నన్ను దిక్కులేని దాన్నిగా మీరు దిగవిడుస్తారు!!

(చురచురచూచి, రాముడు చరాలున బయటికి వెళ్ళిపోతూ వుండగా - తెర).

సీత జోస్యం : మరికొంత సమాచారం

1 సీత జోస్యం గ్రంథాన్ని సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ 1981-82లో ఉత్తమ గురంగా ఎంచి సాహిత్య అకాడెమో బహుమతి ప్రకటించింది. సాహిత్య రంగంలో ఇది ప్రతిష్టాత్మకమైన పురస్కారం, తదుపరి సాహిత్య అకాడమీ ప్రచురించే Indian Literature ద్వైమాస పత్రిక మే-జూన్ 1982 సంచికలో సమీక్ష ప్రచురిస్తూ నార్ల చారిత్రక విమర్శనాదృష్టిని తప్పు పట్టారు. (ఈ విమర్శకు తెలుగు అనువాదం అనుబంధం-2లో జతపరిచాము. చూడండి),2

2 ఈ విమర్శపై నార్ల స్పందించి తన రీజాయిండర్‌ను పంపగా అదే పత్రిక జులై-ఆగష్టు 1982 సంచికలో ప్రచురించింది. (ఈ విమర్శకు తెలుగు అనువాదం అనుబంధం-2లో జతపరిచాము. చూడండి.)

3 ఈ సాహిత్య అకాడెమీ అవార్డు పై గుల్బర్గా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హో, నూ, నాయక్ స్పందనకు తెలుగు అనువాదం అనుబంధం-3లో ఉంది. చూడండి.

4 సాహిత్య అకాడెమీ అవార్డు తిరస్కృతిపై నార్ల వివరణ అనుబంధం -4లో ఉంది. చూడండి.

5 మైసూరు యూనివర్సిటీకి చెందిన డాక్టర్ హెచ్.ఎస్. సుజాత సీత జోస్యం గ్రంథాన్ని కన్నడంలోకి "సీతేయ భవిష్య" పేరుతో అనువదించగా, అనువాద విభాగంలో సాహిత్య అకాడెమీ బహుమతి లభించింది.

6 ఈ గ్రంథాన్ని Seetha's Destiny పేరుతో బెంగుళూరుకు చెందిన ప్రొఫెసర్ పి.ఎస్. శ్రీధరమూర్తి ఇంగ్లీషులోకి అనువదించారు.

7 ప్రొఫెసర్ పి.ఎస్. శ్రీధరమూర్తిగారు జాబాలి గ్రంథాన్ని కూడ ఆంగ్లంలోకి అనువదించి The Last Word on Ramayana పేరుతో అచ్చు వేశారు.

గమనిక : Sahitya Akademi ని ఆ సంస్థ సాహిత్య అకాడెమీ అని తెనుగించింది అని గమనించాలి.

గ్రంథ సమీక్ష :

(ఇండియన్ లిటరేచర్ - ఇంగ్లీషు ద్వైమాసిక పత్రిక 3-1982) సీత జోస్యం; నార్ల వెంకటేశ్వరరావు; నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, పుటలు ; 143+12+54 వెల రూ. 15-00,

నాటక కర్తలు తమ అభిప్రాయాల్ని విదశపరుస్తూ లఘు నాటకాలను సుదీర్ఘ పీఠికలతో ప్రచురించటంలో కాని, పురాణేతిహాసాల ఆధారంగా నాటక రచన గావించటంలోగాని కొత్తదనం ఏమీ లేదు. అయితే ఓ ఆరితేరిన పాత్రికేయుడు అత్యంతాకర్షణీయమైన పాండిత్యాన్నంతా గుప్పిస్తూ, తన పాత్రల రూపకల్పనను సమర్థించుకుంటూ, ప్రజాదరణ పొందిన అతి సున్నిత దేవతామూర్తి పై 54 పుటల నాటకాన్ని వ్రాసి, దానికి రెండు అనుబంధాలు తోడైన 129 పుటల పీఠికను పొందుపరచినప్పుడు అది తప్పక పాఠకుల దృష్టిని ఆకట్టుకుంటుంది. పైగా అకాదెమీ పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు నాటకం అది కావటం మరింత విశేషం.

నార్ల భావనలో రామాయణంలో నాల్గింట మూడు వంతులు కాల్పనికం; మిగిలిన నాలుగవ వంతులో చారిత్రక ఆధారం ఏదన్నా వున్నా అది అన్ని రాజకుటుంబాల మాదిరే సింహాసనం కోసం కుతంత్రాలు, కుమ్ములాటలు; రాముడు అసలు వింధ్యను దాటింది లేదు; రావణుడు గోండుల రాజుగానీ లేదా మరో ఆదిమ జాతి నాయకుడుగానీ అయ్యుండాలి; రావణుడి కాలం నాటి లంక, నేటి లంక ఒకటి కావు; రామ రావణ యుద్ధం అనేది ఆహారోత్పత్తి చేసే ఆర్థిక వ్యవస్థకూ, ఆహారాన్ని ఏరుకు తెచ్చుకునే ఆర్థిక వ్యవస్థకూ మధ్య సంఘర్షణే, దండకారణ్యంలో వ్యవసాయాన్ని విస్తృతపరిచే

విషయంలో రాముని పాత్ర వున్న కారణంగా, అతని భార్య పేరు సీత కావటంతో వేదాల సీత రామాయణ సీత అయ్యింది. ఈ అభిప్రాయాలకు నార్ల మౌలికతను సంతరింపజేయటం లేదు; రామాయణ సాహిత్యాన్నంతా అవలోఢనం గావించి, గొప్ప హేతుబద్ధమైన సారాంశాలను ఎంపిక చేసుకుని తన పద్ధతిలో విస్తృతమైన వాదనలు వినిపించాడు.

అసలు సిసలైన వాల్మీకాన్ని గుర్తించటంలోని ఇబ్బందుల్ని నార్ల గుర్తించారు. తదనంతర కవులు చేసిన మార్పులు చేర్పులు, ఆప్రక్షిప్తాలనుండి మూల రచనను వేరుపరచటం దాదాపు దుస్సాధ్యమన్నారు. ఆ కారణం చాలు ఈ ఇతిహాసానికి సంబంధించి ఏ మతపరమైన, సామాజికపరమైన, ఆర్థిక లేదా రాజకీయపరమైన వ్యాఖ్యలు అయోమయ పరిచేందుకు అది విశ్వాసమైనా విశ్వాస రాహిత్యమైనా పిడివాదం మన నరనరాల్లో ప్రవహిస్తుంది. నార్ల నిశితంకాని, స్పష్టంగా లేని, ఒప్పించ నేర్పు కొరవడిన వాదనలు ఒక్కో పర్యాయం తన ప్రతిపాదనల్నే దెబ్బతీసాయి. ఉదాహరణకు 97వ పేజీలో "మన పై రామాయణ ప్రభావం తగ్గనంత వరకు మనమధ్య బాబాలు, భగవాన్లు; అమ్మలు అమ్మమ్మలు తలెత్తుతూనే ఉంటారు; మూఢ మార్గ వెంట మనను నడుపుతూ, నిలువు దోపిడి చేస్తూనే ఉంటారు. మళ్ళీ 131వ పుట చూచేట్లయితే
" రామాయణం భారతాలైనా, అష్టాదశ మహాపురాణాలైనా వాటి ప్రధానోద్దేశాలు కుల వ్యవస్థను పరిరక్షించడమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయడమే". ఇటువంటి పిడివాదం వల్ల ఆయన్ని కాదనే వారికే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. అంతే తీవ్రతతో వాళ్ళు నార్ల వంటి వాళ్ళే రామరాజ్యం రాకుండా అడ్డుకుంటున్నారని అనగలరు.

హరప్పా నాగరికత నిర్మాతల్ని దురాక్రమణదారులైన ఆర్యులు ఒక చోటు నుండి మరో చోటుకు తరమటంతో వాళ్ళు క్రమంగా తమ కౌశలాన్ని పోగొట్టుకున్నారంటారు నార్ల. ఒక నాగరికత శిఖరాగ్రం నుండి క్రిందికి పడిపోవటానికి నాలుగైదు తరాలు చాలంటారు. అదీ లిఖితపూర్వకంగా సమాచారాన్ని భద్రపరిచేందుకు లిపి లేని రోజుల్లో అయితే రెండు, మూడు తరాలు చాలు. (పుట 77). ఆర్యేతర నాగరికతా ప్రాభవాన్ని చాటి చెప్పేందుకు నార్ల చక్కటి నచ్చజెప్పే ధోరణిని చేపట్టారు. కాని ఇతిహాస నాయకులు ధరించిన మహిమగల ఆయుధాల్ని హేళన చేస్తూ భారతీయులు పరాయి దురాక్రమణదారులైన దారస్, అలెగ్జాండర్లతో తలపడినప్పుడు భారతీయుల వద్ద అటువంటి ఆయుధాలు వుంటే మరి దురాక్రమణదారులెలా వాళ్ళను ఓడించ గలిగారంటూ చేసిన వాదన కళాశాల చర్చలలో కుర్రకారు చేసే వాదనలా ఉంది. ఆయన అంతకుముందు తాను చేసిన వాదన - ప్రజలు నాలుగైదు తరాల కాలంలో క్షీణదశకు చేరుకుంటారనేది మరచి పోవటమే గాకుండా ఇతిహాసం ఒక సాహితీరూపంగా నిలిచే ప్రమాణాన్ని కూడ లక్ష్యపెట్టలేదు. ఇదంతా రామాయణ మహాభారత కాలాల నాటి నాయకులు ఉపయోగించిన ఆయుధాల శక్తినో, మహత్తునో ధ్రువీకరించేందుకు చెప్పటం కాదు; వ్రాసిన కాలాల పట్ల కూడ అంగీకారం లేని మౌఖిక ఇతిహాసాల విషయంలో ఒక పండితుడు ముందుగానే కొన్ని నిర్ణయాలు చేసుకుని వాటి ఋజువుల కోసం ఇరవయ్యవ శతాబ్దపు టార్చిలైటు సహాయంతో ఆ చీకటి మలుపుల్లోకి ప్రయాణించటంలో ఎదురయ్యే కనుపించని గోతుల్ని ఎత్తి చూపేందుకే.

రామ రావణ యుద్ధం ఒక స్త్రీ విషయమై కాదు, ఆహారోత్పత్తి ఆహార సేకరణ ఆర్థిక వ్యవస్థల మధ్య సంఘర్షణగా భావించుకొని . నార్ల ఇటు అభియోక్తగానూ అటు తీర్పరిగానూ ద్విపాత్రాభినయం చేసారు. ఆయన పనల్లా ఆదిమవాసుల కోపు గాయటమే - వాళ్ళు ఏయే వేషాల్లో ఉన్నా - ఋషుల ముసుగులోని ఇంద్రజాలికులు కానీ, వ్యవసాయదారులు కానీ, రాజుల ముసుగు వేసుకున్న దేశ బహిష్కృతులు కానీ - దురాక్రమణదారులకు వ్యతిరేకంగా ఆదిమవాసులపై పడే దెబ్బకు సిద్ధమవ్వటమే. దశరథ జాతక కథలలో (అవి బుద్ధుని శిష్యుల అభూత కల్పనలని ఆయన భావిస్తారు) రమా పండితుడు తన సోదరి సీతను వివాహమాడటంలో అభ్యంతరం చెప్పనప్పుడు నార్ల ఆనాడు అమలులో ఉన్న నైతిక సామాజిక కట్టుబాట్లను అనువర్తింప జేయటంలో నిష్పాక్షిక ధోరణి అవలంబించినట్లే. కానీ ఋషుల జన్మల విషయంలోని అశ్లీల

కథల విషయానికి వచ్చేప్పటికి పురాతన సమాజానికి ఇరవయ్యవ శతాబ్దపు నాటి భారతీయ సమాజపు వివేచనతో కూడిన దారుణమైన లైంగిక విశృంఖలత్వాన్ని అనువర్తింపజేసి అసహ్యించుకోవడం జరిగింది. (పుట 87).

పైగా అరాచకవాదుల్ని శాంతికాముకులుగా చిత్రించేందుకు నార్ల చాల కష్టపడవలసి వచ్చింది. పార్లమెంటు సభ్యునిగా తాను పర్యటించిన అండమాన్, కార్ నికోబార్ దీవులలో నివసించేవాళ్ళను ఉదహరించారు. బిషప్ రిచర్డ్ సన్ తమ భాషలో యుద్ధాన్ని తెలియజేసే పదమే లేదని తనకు చెప్పటం జరిగిందన్నారు. (పుట 110). కాని దానికి ముందు పేజీలోనే నార్ల దక్షిణ అండమాను చెందిన జరవ జాతిని గూర్చి చెప్పటం జరిగింది; జరవలు నరమాంస భక్షకులు కాదుగాని ఒంటరిగా కన్పించే కొత్త వాళ్ళను సైతం బాణాలు వేసి చంపుతారు. ఆ మరణాలను అడ్డుకునేందుకు పోలీసు తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి వచ్చింది. అయినా నార్ల దృష్టిలో ఆదిమ జాతులకు చెందినవారు శాంతి ప్రియులే. రామాయణపు దండకారణ్యంలోని నిషాదులు బిషప్ రిచర్డ్ సన్ వంటి శాంతిప్రియులైన ప్రజలయ్యుంటారేమోనని ఆయన విస్తుబోతారు.

సుదీర్ఘమైన పీఠిక తరువాత ఐదు పాత్రలతో రెండంకాల నాటకం ప్రారంభమవుతుంది. అప్పటికి పాఠకుడు నాటక రచయిత ఇష్టాయిష్టాలకు అనుకూలంగానో ప్రతికూలంగానో దురభిమానాన్ని పెంచుకుంటాడు - రామునికో సీతకో కాదు నార్లకు భక్తుడైతే తప్ప అతను ఆయన మాయలో చిక్కుకోడు. ఆహారోత్పత్తికి చెందిన ఆర్థిక వ్యవస్థకూ, ఆహార సేకరణకు చెందిన ఆర్థిక వ్యవస్థకూ మధ్య సంఘర్షణ ఒక ప్రక్క రాక్షసులకు వ్యతిరేకంగా రామలక్ష్మణుల సంరక్షణలో ఇరువురు ఋషులనూ, మరోపక్క ఆదిమవాసుల ఏకైక ప్రతినిధిగా సీతనూ నిలిపి చిత్రించారు. పావులు కదపటంలో సీత వైపు మొగ్గు ఎక్కువగా చూపబడింది ఒక స్త్రీకి అభిముఖంగా నలుగురు పురుషులు - నార్ల సీతను వాల్మీకి చిత్రించిన విధంగానే చిత్రిస్తున్నానని ఎంతగా చెప్పుకున్నా సీత నార్లకు బాకా ఊదింది. సీతను అందగత్తెగా, మనోల్లాసినిగా, హాస్యప్రియగా, ఆత్మస్థైర్యం కల దానిగా చిత్రించిన మేరకు వేదనలో మునిగిన పడుచుగా అనేకులు వేసిన ముద్ర నుండి ఆమెను రక్షించ గలిగారు. కానీ, ఆయన సీతను మొరసుగా, వాగ్వివాదిగా, తగవులాడిగా చిత్రించినపుడు మాత్రం తన వాదాన్ని తానే మరచిపోయారు. నార్ల నాటకంలో రాముడు పొగడ్తలతో పొంగిపోయేవానిగా; లక్ష్మణుని మానసిక దుర్బలునిగా ఋషులు అసంబద్ధులుగానూ చిత్రించబడ్డారు. ప్రత్యర్థుల పసలేని వాదనలకు వ్యతిరేకంగా సీత దృఢమైన వాదనలు నిలిపి నార్ల మరీ అయాచిత గౌరవాన్ని కల్పిస్తూ ఆమె పాత్ర చిత్రణకు రూపకల్పన చేశారు. విషయం ఆధునికం కానివ్వండి ప్రాచీనం కానివ్వండి, రాజకీయం కానివ్వండి సాహిత్యం కానివ్వండి సిగ్గుమాలిన అయాచిత గౌరవ రూపకల్పనలు విషయానికి మంచికంటే చెరుపే ఎక్కువ చేస్తాయి. రాముడు ఋషులకు వాళ్ళను రాక్షసుల నుండి కాపాడతానని ఇచ్చిన మాటను సర్వశ్రేష్ఠగా భావిస్తాడు; తాను ఇచ్చిన మాటను నిలుపుకోలేకపోతే కుల గౌరవం కుప్పకూలుతుంది; కనుక దానిని నిలబెట్టుకునేందుకు అవసరమైతే సీతను, లక్ష్మణుష్ఠమి ప్రాణాన్ని సైతం త్యజించగలడు. అవును రాముడంతటి వాడేనని సీత నమ్ముతూ ఎప్పుడో ఒకసారి, ఎక్కడో ఒక చోట కుటుంబ గౌరవం కోసం తనను కారడవుల్లో అనాథగా వదిలేస్తాడని జోస్యం చెబుతుంది.అనేక సంవత్సరాల పరిశోధనల ఫలితంగా పండితులు సీతాపరిత్యాగాంశంగల ఉత్తరకాండ వాల్మీకిది కానే కాదని తరువాత చేర్చబడినదనే నిర్ణయానికి రావటం జరిగింది. అలాంటప్పుడు నార్ల సీత వాల్మీకి సీత కాదు.

నార్ల సీత జోస్యం' షా 'సెయింట్ జోన్'ను స్ఫురణకు తెస్తుంది. నాటక రచయిత లిరువురూ విగ్రహారాధనకు వ్యతిరేకులట. సంప్రదాయబద్ధం కాని వాళ్ళ అభిప్రాయాల్ని గట్టిపరిచేందుకు సుదీర్ఘ పీఠికలు వ్రాస్తారు. సీత, జోన్ ఇద్దరూ కనబరిచే తెలివితేటలూ నిర్మొహమాటం వాళ్ళ పెద్దలకు సుఖాన్నివ్వవు. షా మేధావితనం జోనకు పునరుత్థానాన్ని సంతరింపజేస్తే నార్ల పనితనం సీతను క్రిందికి దొర్లించింది.

తన ముందుమాట చివరలో నార్ల ఆశించిందేమంటే తన పుస్తకాన్ని కొన్ని పేజీలు చదివిన తరువాత ఎవరైతే చింపి పోగులు పెట్టకుండా ఉంటారో వాళ్ళు రాముడు సీతల మధ్య ప్రశంసింప దగినవారు సీతయే గాని రాముడు కాదని తనతో ఏకీభవిస్తారని. ఇంకో చోట ఎక్కడో ఆయన చెప్పేదేమంటే తన పుస్తకం భక్తిపరుల కోసం కాదని, అవగాహనాపరులైన పాఠకుల కోసమని - దాన్ని ఎంతగా పదే పదే చెప్పటం జరిగిందంటే హేమ్లెట్ లోని రాణి మాటల్ని వేరొకరు ఇలా వల్లె వేసేంతగా - "ఈమె మరీ ఎక్కువగా నిరసించినట్లు అన్పిస్తూంది". -

పుస్తకాన్ని ముక్కలుగా చింపి వేయటానికి భిన్నంగా భారత జాతీయ సాహిత్య అకాడెమీ గత మూడేళ్ళలో తెలుగు సాహిత్యంలో మిక్కిలి ఉత్కృష్టమైన రచనగా ముప్పురు న్యాయ నిర్ణేతల సంఘ సిఫారసులకు అనుగుణంగా ఎంపిక చేసింది. ఆ న్యాయ నిర్ణేతలు ముప్పురు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అధ్యక్షులు (బి.గోపాలరెడ్డి), ఒక సుప్రీం కోర్టు న్యాయాధీశుడు (జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి) ఒక కళాశాల ఉపాధ్యాయుడు (అమరేంద్ర). ఇప్పుడు నార్ల తనను కవ్విస్తున్నారనే సంక్లిష్ట భావనను తొలగించుకొనగలరని ఆశిద్దాం.
(గమనిక : ఈ సమీక్షలో వివరించిన పుటల సంఖ్య సీత జోస్యం తొలిముద్రణకు చెందినవి.) డి.యస్.ఆర్.

సంపాదకుని లేఖలు

గ్రంథ సమీక్ష : (ఇండియన్ లిటరేచర్ - ఇంగ్లీషు ద్వైమాసిక పత్రిక 4-1982)

సీతజోస్యం (ఒక ప్రత్యాక్షేపం)

మహాశయా,

మే-జూన్ 1982 నాటి మీ పత్రికలో నా నాటకం "సీత జోస్యం" పై డి.యస్.ఆర్.గారి సమీక్షకు సమాధానంగా నేను చెప్పదల్చినదంతా ఏమంటే ప్రతికూలంగా ఉన్న సమీక్షను, అది విషపూరితమైనదైనాసరే స్వాగతించగలను - కానీ ఆకతాయి పద్ధతిని మాత్రం కాదు. మీ సమీక్షకుణ్ణి అంశాల వారీగా ఖండించే సమయం గానీ, ఉద్దేశ్యం గానీ నాకు లేదు. ఆయనలోని చారిత్రక, భౌగోళిక అవగాహనా లేమిని, ఆ మాటకొస్తే అసలు వాల్మీకి రామాయణ అవగాహనా రాహిత్యాన్ని పట్టి చూపేందుకే నేను పరిమితమౌతాను.

మొదటగా చారిత్రక అంశాన్ని స్పృశిస్తాను. గొణుక్కుంటూనైనా సరే డి.యస్. ఆర్. గారు నేను ఆర్యేతర (హరప్పాకు చెందిన) నాగరికతను పూర్వ వైభవ ప్రాపకానికి తగిన వాదం చేసినట్లుగా అంగీకరించారు. ఆర్యులు భారతదేశాన్ని జయించవచ్చి వలస లేర్పరచుకున్న నాటి పాక్షిక ఆటవిక దశను చాటేందుకు కూడ నా వాదనలో నేను వెనుకబడింది లేదు. ఓడించబడిన హరప్పన్లు కొండల్లోకి, కోనల్లోకి నెట్టబడగా గతంలోని వాళ్ళ ప్రతిభలన్నీ అది యుద్ధకౌశలంగానీ, శాంతియుత జీవనం గానీ బహుకొద్ది తరాలలోనే కోల్పోయారు; కాలక్రమేణా విజేతలైన ఆర్యులు వాటిని అమితంగా అలవర్చుకొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో హరప్పన్లను, ఆర్యులను ఒకే గాటన కట్టనందుకు అసంగత్యాన్నో, కాలేజీ చర్చల్లో పాల్గొనే యవ్వనారంభ దశ కుర్రకారు మనస్తత్వాన్నో నాకు అంటగట్టి, నిష్పాక్షికంగా ఆలోచించగల వారెవరైనా నన్ను నిందించగలరా? ఏం చేద్దాం.... పతనమైన నాగరికతను పరిఢవిల్లుతున్న దానితో సమతూకంతో చూచే పరిపక్వత డి.యస్.ఆర్.గారి వలె బహుశా నాకు లేదేమో!

ఇక భౌగోళిక స్థితిని గూర్చి ఒక మాట. జరవులు పోర్ట్ బ్లెయిర్‌కు ఆనుకుని ఉన్న అండమాన్ దీవుల్లో నివసిస్తారు. నేను ప్రత్యేకించి పేర్కొన్న నైకో బారియన్లు పోర్ట్ బ్లెయిర్‌కు దక్షిణంగా 150 మైళ్ళ దూరంలో ఉన్న కార్ నికోబార్ లో నివశిస్తారు. ఇప్పటికీ పోర్ట్ బ్లెయిర్‌కూ కార్ నికోబార్‌కూ మధ్య సముద్ర మార్గం గుండా ఎక్కువగా విస్తరించి ఉండే వర్షఋతువులో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఇటువంటి స్థితిలో జరవలు, నికోబారియన్ల భిన్నంగా ఉండటంలో డి.యస్.ఆర్. ఆలోచించినట్లు వింత ఏముంది? మన ప్రధాన భూభాగంలో కూడ కొద్ది వందల మైళ్ళ దూరంలో నివసించే ఆదిమజాతి తెగల్లో కూడ ఒక తెగకూ మరో తెగకూ మధ్య అలవాట్లలో, ఆచారాలలో, వ్యక్తిగత స్వభావాలలో మనం గమనించటం లేదూ?

డి.యస్.ఆర్. చెప్పినట్లు నేను సీతను “మొరసుగా, వాగ్వివాదిగా, తగవులాడిగా” చిత్రించాననే దానిని అంగీకరించవలసివస్తే ఆయన వాల్మీకి కృతిని అసలు చదివి ఉండడనీ, ఒకవేళ చదివినా ఏదో పైపైన తిరగవేయటం జరిగి ఉంటుందనే తన తప్పును తాను అంగీకరించవలసి ఉంటుంది. సీత కొంచెం రెచ్చగొట్టబడితే చాలు తన నాలుకతో ఎవరినైనా సరే చీల్చి చెండాడ గలదు. డి.యస్.ఆర్.గారు, అయోధ్యాకాండ ముప్పయ్యవ సర్గని తిరగెయ్య గలిగితే అందులో సీత తన భర్తను “రూపంలోనే మగడు (చేతల్లో మాత్రం) మగనాలి”. అంతటితో ఆగకుండా ఆమె అతణ్ణి తన భార్యను ఇతరులకు “అప్పగించే” ఒక “నటుని”తో పోల్చుతుంది. ఇక లక్ష్మణుని నిందించటంలో అంతకంటే ఆమె క్రూరం కాదనుకుంటే దురుసు. డి.యస్.ఆర్.గారు కావాలనుకుంటే అరణ్యకాండ 45వ సర్గను చూసి ఋజువు పరచుకోవచ్చు. వాల్మీకి రామాయణాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తూ విఖ్యాత సంస్కృత పండితుడు యం.యన్. దత్తు సీత లక్ష్మణుని అన్నమాటలకు బ్రేజన్ (సిగ్గుమాలిన) అనే విశేషణాన్ని వాడారు. అయినాసరే డి.యస్. ఆర్. గారు (సీతకు సంబంధించి) సిగ్గుమాలిన ఆయాచిత గౌరవాన్ని ప్రదర్శించాననే అభియోగం నా పై మోపారు. మున్ముందు డి.యస్. ఆర్. గారు రామాయణ ఇతివృత్తం పై వచ్చిన ఆధునిక కృతుల్ని (ఆధునికం స్ఫూర్తిలో అనుకోండి) వ్యంగ్య ధోరణితో ఖండించాలనుకుంటే ఆయన ముందుగా కనీసం ఒక్కసారైనా వాల్మీకి రామాయణం చదవవలసి ఉంది,అదీ నిశితంగా అధ్యయనం చేయవలసి ఉంది.

తమ సమీక్ష ముగిస్తూ ముగిస్తూ డి.యస్.ఆర్. గారు నన్ను గేలి చేసేందుకు షేక్ స్పియర్‌ను మెడ బట్టుకుని ఈడ్చుకొచ్చారు. వాయనం తిరిగి ఇస్తున్నట్లు నేనూ షేక్ స్పియర్ మాటల్నే ఉటంకించానా:

“ఓరి అజ్ఞాన భూతమా, నీ వెంతటి కురూపివి!” - వి.ఆర్. నార్ల

కొన్ని సంబంధిత అంశాలు

కొంతకాలం క్రితం (1982 నాటికి) కేంద్ర సాహిత్య అకాడెమిని విమర్శించి కుష్వంత్ సింగ్ వార్తల్లో కెక్కాడు. ఇప్పుడు అకాదెమి తన తప్పిదం కారణంగా వివాదంలో చిక్కుకుంది.

గత సంవత్సరం (1981) అకాడెమి ఆమోదించిన 22 భాషలకు గాను 21 భాషలకు సంబంధించి వార్షిక పురస్కారాలను ప్రదానం చేసింది. తెలుగులో వి.ఆర్. నార్లగారి "సీత జోస్యం"కు పురస్కారం లభించింది.

1979లో ప్రచురింపబడిన ఈ కృతి (పబ్లిషర్ : నవోదయ పబ్లిషర్సు, విజయవాడ) 1978-79-80 సంవత్సరాల కాలంలో ప్రచురించబడిన అత్యుత్తమ గ్రంథంగా కేంద్ర సాహిత్య అకాడెమీ నియమావళికి అనుగుణంగా ఎంపిక చేయబడింది.
పురస్కారాలు ప్రదానం చేసే సందర్భంగా ఈ పుస్తకం ఇలా ప్రశంసింపబడింది :

"కండగల హేతువాద రీతిలో, సులభ గ్రాహ్యమైన సహజ శైలితో, సాంప్రదాయబద్ధం కాని పద్ధతిలో పాత్ర చిత్రణ చేసి, సరికొత్త పద్ధతిలో రామాయణ ఇతివృత్తాన్ని తీర్చిదిద్దినందువల్ల "సీత జోస్యం" తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిందని భావిస్తున్నాం". గోవాలోని పనాజీలో జరిగిన పురస్కార ప్రదానోత్సవానికి నార్ల వచ్చేందుకు వ్యక్తిగతమైన ఇబ్బంది అడ్డుగా నిలిచింది. ఆ సందర్భంగా ఆయన వ్రాసిన లేఖలో సాహితీకారునిగా తన ఆశయాలను, ఉద్దేశ్యాలను ఉల్లేఖించారు "మంచి ప్రపంచంలో ఉత్కృష్ట మానవుల కోసం నా జీవన పోరాటం, అన్వేషణలలో ఒక భాగమే ఈ సీత జోస్యం".

అదే సందర్భంగా ఆయన తన నాటకాన్ని గురించి, అందులోని సుదీర్ఘమైన పీఠికను గురించి చెప్పిన విషయం కూడా అంతే ముఖ్యమైనది,

"నా నాటకం, మరీ ముఖ్యంగా దానికి నా విస్తృత పీఠిక, రెండు విషయాలను స్పష్టం చేస్తాయి. మొదటగా రామాయణ గాథకు అసలు చారిత్రక ఆధారం అనేది ఉంటే అది ఒక ప్రక్కన ఆహారాన్ని సేకరించుకుని కాలం గడిపే సామాజిక ఆర్థిక వర్గానికీ, మరో ప్రక్కన ఆహారాన్ని ఉత్పత్తి చేసే సామాజిక ఆర్థిక వర్గానికీ మధ్య సంఘర్షణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక రెండవ విషయం - ఈ ఘర్షణలన్నీ వింధ్య పర్వతశ్రేణికి ఉత్తరంగా ఉన్న ఏదో ప్రదేశంలో జరిగినవేగాని ఆ పర్వతశ్రేణికి దక్షిణంగా మాత్రం కాదు. ఇవి నా పరిశోధనల ఫలితాలు కావు. ఇంతకుముందే ఇతరులు ఇలా చెప్పటం జరిగింది. నేను చేసిందేమంటే దానిని విస్తృతపరచటమే; రామాయణం నుండి ఋజువులు చూపటమే. నేను విగ్రహారాధకుణ్ణి కాను. నా నాటకమూ భగవదారాధనకు వ్యతిరేకమే".

ఈ కృతిలోని నార్ల భావాలు యం.వెంకటశేష అయ్యంగారు కన్నడంలో రచించిన "ఆదికవి వాల్మీకి", "శ్రీరామ పట్టాభిషేకం" చదివిన వారికి ఆసాంతం కొత్తగా అన్పించవు. అటువంటి ప్రయత్నాలు ఇతిహాసాన్ని సంప్రదాయబద్ధంగా చదవటంగాక సరైన పద్ధతిలో అధ్యయనం చేసేందుకు ఉద్దేశించినట్టివి. దైవత్వమని విశ్వసించే విషయాలలో మానవ వ్యవహారాలను ఎత్తిచూపే ఉద్దేశ్యమే ఇటువంటి రచనలలో కన్పిస్తుంది.

"సీతజోస్యం" సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన తొలి ఏకైక తెలుగు నాటకం. పుటల నాటకానికి నార్ల 130 పుటల పీఠికను వ్రాసి మనకు జార్జి బెర్నార్డ్ షాను జ్ఞప్తికి తెస్తారు. నార్ల పాండిత్యాన్ని ధృవీకరించే ఈ ముందుమాట వ్రాసేందుకు లోతైన అధ్యయనం కోసం పధ్నాలుగేళ్ళు వెచ్చించవలసి వచ్చిందని తెలుసుకున్నాం. నార్ల రచనలు ఎప్పుడూ లోతైన ఆలోచనలతో, పరిశోధనాత్మక వివరాలతో కూడుకొని ఉంటాయి.

వి.ఆర్. నార్లగా వినుతి కెక్కిన నార్ల వెంకటేశ్వరరావుగారు (జననం : 1908) హేతువాదులలో మన దేశపు ఆలోచనాపరుల్లో ప్రసిద్ధులు. పేరెన్నికగన్న రచయితగా, కవిగా, నాటకకర్తగా, వ్యాసశిల్పిగా, విమర్శకునిగా పాతిక పైచిలుకు గ్రంథాలకు కర్తృత్వం వహించారు. ఈయన రచనలు పలు భారతీయ భాషల్లోకి అనువదించబడినాయి. పిరికితనం ఎరుగని ప్రావీణ్యత గల పాత్రికేయుడీయన.

1942 నుండి 1959 వరకు "ఆంధ్రప్రభ", 1960 నుండి 1977 వరకు "ఆంధ్రజ్యోతి" దినపత్రికలకు ఈయన సంపాదకులు. ఈయన రాజ్యసభ సభ్యులుగా రెండు పదవీ కాలాలు పూర్తి చేశారు. సాహిత్య అకాడెమి, లలితకళా ఎకాడెమీ, నేషనల్ బుక్ ట్రస్టు వంటి పలు సంస్థలతో, వ్యవస్థలతో ఈయనకు సంబంధాలున్నాయి. ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు ఈయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి సత్కరించాయి. 1958లో యునెస్కో సాధారణ సభలో ఈయన భారతదేశ ప్రతినిధి.

నార్ల సాహితీ ప్రియుడు. లేత వయస్సులోనే స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నవాడు. అజ్ఞానానికి, మూఢనమ్మకాలకూ, నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడే అవిశ్రాంత యోధుడు. ఈ ధోరణి భౌతికమైన నష్టాలకు గురిచేసినా ఈయన ఏ సందర్భంలోనూ తల దించింది తన నమ్మకాల, విశ్వాసాల సాధనలో ఏ రకమైన త్యాగానికై వెనుకాడింది లేదు. కొందరు గేలిచేయజూచినా తమ భావ ప్రకటనలో ఆయన చలించింది లేదు.

"ఇండియన్ లిటరేచర్" అనేది కేంద్ర సాహిత్య అకాడెమో సాధికారిక ద్వైమాసిక పత్రిక. దాని ఎడిటర్ కేశవ మల్లిక్. కేంద్ర సాహిత్య అకాడెమీ అధ్యక్షులు (ఉమాశంకర్ జోషి), ఉపాధ్యక్షులు (వి.కె. గోకల్), కార్యదర్శి (ఆర్.ఎస్.కేల్కర్) దాని సంపాదక కమిటీలో సభ్యులు. సాహిత్య అకాడెమీలో ఉద్యోగిగావున్న డి.యస్.రావు అనే ఆయన ఇటీవల ప్రచురితమైన ద్వైమాసికలో (మే-జూన్ 1982. సంపుటం 25, నెం.3, పుటలు 122-126) "సీత జోస్యం" గ్రంథాన్ని సమీక్షించారు. "సీత జోస్యం"ను షా "సెయింట్ జోన్"తో సరిపోల్చి షాలోని ప్రత్యుత్పన్నతి జోన్లో కొత్త జీవాన్ని అందిస్తే నార్లలోని బుద్ధికుశలత సీతకు అన్యాయం చేసిందన్నారు. నార్ల చెప్పిందే తిప్పి చెబుతూ డి.యస్. రావు అన్నదేమంటే - ఈ పుస్తకాన్ని ముక్కలు ముక్కలుగా చింపకుండ కేంద్ర సాహిత్య అకాదెమో దీనిని తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసే రచనగా పేర్కొంటూ పురస్కారానికి ఎంపిక చేసింది. తన దాడిని కొనసాగిస్తూ నార్ల తనను కవ్విస్తున్నారనే భావనను మానుకోగలరనే ఆశాభావాన్ని ప్రకటించటం జరిగింది. సాహిత్య అకాడెమీ ప్రచురించే పత్రికలో అటువంటి అననుకూలమైన విమర్శ చోటుచేసుకున్నందుకు నార్ల బాధపడటం సహజమే. ఈ తప్పిదాన్ని సాహిత్య అకాదెమో అంగీకరించని పక్షంలో తన పురస్కారాన్ని తిరస్కరించాలనే నిర్ణయానికొచ్చారు నార్ల. అకాదెమో తరఫున, సంపాదక మండలి పక్షాన కార్యదర్శి ఆర్.ఎస్.కేల్కర్ నార్లను క్షమించమని కోరటం అకాడెమిని ఇరుకునబెట్టే ఏ చర్యా చేపట్టవద్దని ఆయన నార్లను కోరాడు. సంపాదకుడు తప్పు చేయడం జరిగిందనీ ఇంతటితో యిక ఆ వివాదానికి తెరదించటం జరుగుతుందనీ కేల్కర్ చెప్పటం జరిగింది. ఈ విషయంలో అకాదెమి తనని తానే పరిహసించుకున్నదనీ, విమర్శించేవారికి తామే స్వయంగా సమాచారాన్నందించి నట్లయ్యిందన్న నార్ల చివరకు కార్యదర్శి సూచనను మన్నించటం జరిగింది. అకాడెమికి తెలియకుండా జరిగిన ఇటువంటి అసమర్థ ఉదంతాన్ని ఇంకా పెంచి పెద్ద చేయడంలో తనకు ఉత్సుకత లేదని నార్ల అన్నప్పుడు ఆయన సరైన నిర్ణయాన్ని గైకొన్నారని మనం అంగీకరించాల్సి ఉంటుంది.

ఈ ఉదంతం చాలా ప్రశ్నల్ని రేకెత్తిస్తుంది : నార్ల వంటి హేతువాది విమర్శను తట్టుకోలేడా? అకాడమీ ఉద్యోగికి విమర్శించే హక్కులేదా? తీవ్రమైన విమర్శలు అకాదెమో ప్రచురించే పత్రికలో కన్పించగూడదా? అనేవి. అయితే ఈ ప్రశ్నలన్నీ ప్రస్తుత ఉదంతానికి సంబంధించి అప్రస్తుతాలు. ఇక్కడ ప్రధాన సమస్య ఔచిత్యానికి సంబంధించింది. సంపాదకుడు వ్రాతప్రతుల్ని క్షుణ్ణంగా పరిశీలించకుండా, తన వివేచనకు పని కల్పించకుంటే వచ్చే ఫలితాల కిదొక మంచి ఉదాహరణ.

ఆ ఇటీవల నార్ల నాకు వ్రాసిన జాబులో ఈ విషయాన్ని చర్చించారు : "నా పుస్తకం చర్చించబడటం నే నెంతగానో కోరుకునే విషయం. విమర్శల్ని నే నెంతగానో స్వాగతిస్తాను. ఒకటి రెండు తెలుగు దినపత్రికలు ఈ నాటకంపై ఘాటైన

విమర్శలు గుప్పించాయి. నేను వాటిని స్వాగతిస్తాను. అటువంటి చర్చలు మన కృతి ఏ మేరకు కళకళలాడుతూ ఉంటుందో, అది ఎంతటి శక్తివంతమైనదో శోధించేందుకు ఉపకరిస్తాయి. ఏ అకాదెమి అయితే ఆ పుస్తకానికి అద్వితీయమైన గౌరవాన్ని కల్పించిందో ఆ అకాదెమో ప్రచురించే పత్రికలోనే ఆ అకాడమీలో పనిచేసే ఉద్యోగే తుంటరి విమర్శలు చేయటాన్ని నేను వ్యతిరేకిస్తాను. ఆ విమర్శకుడే అదే విమర్శ వేరే చోట చేసి వుంటే నేను అభ్యంతరం పెట్టి ఉండేవాణ్ణి కాదు. నాకు ఈ ఉదంతమంతా హేతురహితంగానూ, హానికరంగానూ కన్పిస్తుంది".

నార్ల అభిప్రాయాలు స్పష్టంగానే ఉన్నాయి. ఈయన నిర్ణయం పరిశుద్ధమైనదే, ఈయనను బాగా ఎరిగివున్న వారూ, ఈ ఉదంతం తెలిసినవారూ ఈయనను నిశ్చయంగా తప్పుపట్టలేరు. "ఇండియన్ లిటరేచర్" అదే సంచికలో అదే డి.యస్.రావు 1981వ సంవత్సరానికి ఆంగ్ల శాఖలో సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందిన జయంత్ మహాపాత్ర సృజన "రిలేషన్‌షిప్" అనే పుస్తకంపై చేసిన విమర్శ ఏమంటే - పుస్తకం చిన్నదైనా అది ప్రజ్వలింపజేసే వివాదాలు అపరిమితంగా ఉంటాయి. ఈ విషయంలో మహాపాత్రగారు ఎటువంటి నిర్ణయం గైకొన్నారో ఇంకా తెలియరాలేదు. నార్ల లేవదీసిన అభ్యంతరాలు ఇక్కడా సమానంగానే వర్తిస్తాయి. "ఇండియన్ లిటరేచర్" సంపాదకుడు ఆంగ్లకవితా సృజనకర్త. ఆయన కొంచెం ఔచిత్యాన్ని ప్రదర్శించి వుంటే అకాదెమో అటువంటి ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనాల్సి వచ్చేది కాదు.

డా॥ హా.మా. నాయక్ మాజీ వైస్ ఛాన్సలర్, గుల్బర్గా విశ్వవిద్యాలయం

నే నెందుకు సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని తిరస్కరించాను?

రమారమి గత అర్ధ శతాబ్దిగా భావ స్వేచ్ఛకై, భావ ప్రకటనా స్వేచ్ఛకై పోరాడిన నా వంటి వానిని వాటికి శత్రువుగా చిత్రింపబూనటం నిజంగా చాలా నిందార్హం. నా తెలుగు నాటకం "సీత జోస్యం" పురస్కారం స్వీకరించేందుకు ముందుగా ఇచ్చిన అనుమతిని కాదన్న సందర్భంలో దానికి కారణం నా రచనల పట్ల ప్రతికూల విమర్శలు కానేకాదని మాటిమాటికి వివరించి చెప్పినా నాపై దుర్భాషల వర్షం కురిపించే వాళ్లు దానిని తమకు అనుకూలమైన విధంగా పెడచెవిన పెడుతున్నారు. నా నిర్ణయం సరైనదా కాదా అనే విషయాన్ని తేల్చి చెప్పేందుకు ఈ వివరాలన్నీ ప్రజల ముందుంచుతున్నందుకు నన్ను మన్నిస్తారనుకుంటాను.

తెలుగులో నా నాటకాన్ని 1981వ సంవత్సరపు పురస్కారానికి ఎంపిక చేసిన తరువాత, ఆ పురస్కారాన్ని ప్రదానం చేసే అకాదెమిలోనే పనిచేసే ఒక సబ్ ఎడిటర్ నన్నూ, నా నాటకాన్నీ అప్రతిష్టపాలు చేస్తూ ఓ నాలుగు పేజీల విమర్శ వ్రాయటమే గాకుండా అంతకంటే దారుణంగా ఆ విమర్శను ఆ అకాదెమికి చెందిన ఇండియన్ లిటరేచర్ మే-జూన్ పత్రికలో ప్రచురించారు.

"భారతీయ సంస్కృతి ఇరవయ్యవ శతాబ్దపు ముంగిట జీవనం సాగిస్తున్నవారు". ఆక్షేపించబడుతున్నాననే భ్రమలో బతుకును వెళ్ళమారుస్తున్నవారు".

"ముందుగా ఒక అభిప్రాయానికి వచ్చి దానికి తరువాత కారణాల కోసం వెతికేవారూ", "తిరుగుబాటు భావాన్ని పాదుకొల్ప దల్చుకున్నవారు".

"ప్రతిదానికీ అభ్యంతరాలు చెప్పే స్త్రీ" "ఇంకా ఎదగని ఓ కళాశాల వాగ్వివాది" "ఒక దురావేశపరుడు" వంటివి ఈ సమీక్షలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నాపై విసిరిన విశేషణాలు. పైగా ఇటువంటి సమీక్ష విమర్శనాత్మకమైనదేగాని పరుషమైనది కాదని వర్ణించుకున్నారు.

ఇటువంటి చర్య ఔచిత్యాన్ని నేను ప్రశ్నించినప్పుడు ఆ పత్రిక సంపాదకులు అది ఒక కళంకాన్ని ఆపాదించే చర్యేనని అంగీకరించారు. ఆయన ఇంకో అడుగు ముందుకేసి భావ స్వేచ్ఛను కాపాడుకోవటంలో కట్టలు తెంపే ఉత్సాహం ఉరకలు వేసిందన్నారు. అకాదెమి కార్యదర్శిగారు తమంత తామే ఇంకా వివరణ ఇచ్చారు; అకాదెమీ పురస్కారానికి ఎంపిక చేయబడిన కృతిని విమర్శించేప్పుడు అయిష్టతను ప్రకటించటం అంటే అకాదెమో ప్రతిష్టను దిగజార్చటమే - అందులోనూ అకాదెమో ప్రచురించే పత్రికలో అటువంటి విమర్శ చోటుచేసుకోవడం గాయానికి అవమానపు కారం అద్దినట్లే.

బాధ్యత గల ఆ ఇరువురు కార్యనిర్వాహకుల ప్రకటనలు పరిశీలించిన పిమ్మట ఈ విషయంలో ఇంకేమీ వ్రాయదల్చు కోలేదు. కనుక నేను రెండు షరతులు పెట్టాను : మొదటగా వాళ్ళు నష్టపరిహారంగా నా సంక్షిప్త నిరసనను ఆసాంతంగా సరిదిద్దకుండా ప్రచురించాలి. రెండవది ఆ పత్రికలో యిక ఈ విషయమై ఎటువంటి రాతలైనా ప్రచురించటం తక్షణమే నిలిపి వేయాలి. రెండవ షరతు కేవలం అకాదెమికి చెందిన పత్రికకీ వర్తిస్తుందని నొక్కి చెప్పదలుచుకున్నాను. పత్రికా సంపాదకుడూ, అకాదెమీ కార్యదర్శి, ఇరువురూ కూడ అకాదెమీ పురస్కారాన్ని ప్రకటించిన పిమ్మట నా పుస్తకాన్ని అప్రతిష్ట పాలు గావించే విధంగా చేసిన విమర్శను ప్రచురించటం పొరపాటేనని అంగీకరించినందువల్ల ఈ షరతు సమంజసమేననుకుంటాను. తప్పిదాన్ని అంగీకరించిన విషయంలో అటువంటిది తిరిగి జరగరాదని కోరటంలో భావ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వాతంత్ర్యం వంటి విషయాలతో వైరుధ్యానికి తావుండదుకదా. అకాదెమి కార్యదర్శి ఈ రెండు షరతులూ సంప ంగా పాటింపబడతాయనే నిశ్చితమైన హామీ ఇచ్చినందువల్ల ఈ విషయంలో సంతృప్తికరమైన పరిష్కారమే లభించింది అనుకున్నాను;.

కానీ అలా అనుకోవటం తప్పని త్వరగానే తెలుసుకున్నాను. అకాదెమోలోని ఓ చిల్లర మురా వార్తా పత్రికలలో నా పై బురదజల్లే ప్రచార కార్యక్రమాన్ని పకడ్బందీగా రూపొందించారనే విషయం నిస్సందేహం. ఒక ప్రముఖ ఆంగ్ల దిన పత్రిక అదనపు సంపాదకీయం రూపంలో నాపై ఓ సవాలు విసిరింది : "రచయితే దాని మంచి చెడుల నిర్ణీత కాగలడా?" ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ రచయితే యింతకు ముందు ఇలా ప్రస్తావించటం జరిగింది : "అది (విమర్శ) మరో చోట ఎక్కడయినా ప్రచురించబడితే తమకు అభ్యంతరం ఉండేది కాదని ఆయన (నార్ల) అన్నారు." అకాదెమి పత్రికలో గాక మరెక్కడయినా నాపై విమర్శకు నేను సిద్ధమేననే నా అభిప్రాయం ఆయనకు తెలిసినప్పుడు రచయితే మంచి చెడుల నిర్ణేత అయ్యే ప్రశ్న ఎక్కడ ఉత్పన్నమవుతుంది?

ఇటీవలే అది అకాదెమి అధ్యక్షుని దృష్టికి వచ్చింది. ఆయన కార్యదర్శికి ఒక రహస్య పూర్వక జాబు వ్రాయటం జరిగింది. ఆ జాబులో ఆయనకు ఆ "ఘోర అనౌచిత్యాన్ని" అంగీకరించటంకంటే మార్గాంతరం లేదు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే" అకాదెమీ ఆ గ్రంథానికి పురస్కారాన్నిచ్చి గౌరవించిన సందర్భంగా దానిని గర్హిస్తూ చేసిన విమర్శను అకాదెమీ పత్రికలోనే ప్రచురించటం ఒక గొప్ప అనౌచిత్యానికి దారితీసింది. దాని ఫలితంగా రచయితకు తీరని అన్యాయం జరిగింది, కానీ...". ఆ "కానీ" అంతకు ముందు సంభవించిన "ఘోర అనౌచిత్యం" కొనసాగింపుకు అవకాశం కలుగజేసింది. ఈ విషయంపై చర్చకు అకాదెమీ పత్రిక తలుపులు తెరిచింది. అధ్యక్షులవారు తమ అభిప్రాయాల సమర్థనకు పాపం వోల్టేర్ గారి సమాధిని ఆశ్రయించవలసి వచ్చింది. వోల్టేర్ చెప్పింది అధ్యక్షుల వారికి తెలిసిన మాత్రం


నాకు తెలియక పోలేదు: "నీవు చెప్పిన దానితో నేను ఏకీభవించను కాని నీవు అలా చెప్పేందుకు నీకున్న హక్కును కాపాడేందుకు నేను తుది వరకు పోరాడతాను". ఒక ఘోర అనౌచిత్యాన్ని తిరిగి ప్రదర్శించే హక్కు కోసం తుది వరకు పోరాడతాననేది వోల్టేర్ ఉద్దేశ్యం కానే కాదు.


ఇంకా వివరాల్లోకి వెళ్ళకుండా నేను చెప్పదల్చుకున్నదిదే; మొదటి నుండి చివరి వరకు ఇది ఒక బాధాకరమైన వృత్తాంతం. ఇంతకూ అకాదెమి నన్ను గౌరవించదలిచిందా; గర్హించదలిచిందా? జవహర్‌లాల్ నెహ్రూ, రాధాకృష్ణన్, సునీతికుమార్ చటర్జీ గార్లు అకాదెమికి అధ్యక్షులుగా ఉన్న కాలంలో అకాదెమీతో నాకు క్రియాశీల సంబంధాలుండేవి. నాకు గుర్తున్నంత వరకు ఎన్నడూ ఏ పురస్కార గ్రహీతనూ అకాదెమి తన పత్రిక ద్వారా అపనిందలకు గురిచేయలేదు. అకాదెమి నాపట్ల ప్రవర్తించిన తీరుకు పురస్కారాన్ని తిరస్కరించటం మినహా మరో మార్గం లేదంటున్న నాతో స్వాభిమానం గల రచయితలందరూ తప్పక ఏకీభవిస్తారు.

- నార్ల వెంకటేశ్వరరావు.

(1-4 అనుబంధాల అనువాదకులు - శ్రీ రావెల సాంబశివరావు)

నరకంలో హరిశ్చంద్రుడు





సమర్పితము

ప్రియ మిత్రుడు

డాక్టర్ ఎన్. ఇన్నయ్యకు

శుభాకాంక్షలతో

237 diagram.

పీఠిక

పురాణాలు, చరిత్ర

షట్చక్రవర్తులలో మొట్టమొదటివాడు హరిశ్చంద్రుడు, మిగిలిన ఐదుగురు - నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు. నేను చూచిన రెండు పుస్తకాలలో వీరి పేర్లు ఇదే క్రమంలో వున్నాయి. ఇదే క్రమాన్ని అన్ని గ్రంథాలు పాటిస్తున్నవో, లేదో నాకు తెలియదు. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. ఇదే క్రమంలో కాకపోతే, మరొక క్రమంలో ఒకనాడు వీరు భారతీయ సార్వభౌములని చెప్పగలిగింది కేవలం మన పురాణాలే! ఈ పురాణాలను విడిచి, చరిత్ర వద్దకు వస్తే, అది మనకు చెప్పే విషయం మన దేశంలో మొట్టమొదటి సామ్రాజ్యం క్రీస్తుకు పూర్వం అయిదారు శతాబ్దాలనాటి మగధ సామ్రాజ్యమని.

అయితే, దానినైనా ఒక సామ్రాజ్యంగా పరిగణించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న లేకపోలేదు. ఉదాహరణకు, యునైటెడ్ కింగ్ డమ్ గా ఇప్పుడు చెల్లుతున్న రాజ్యాన్ని తీసుకోండి. ఇదొక ద్వీప సముదాయం. దీనిలో ఇంగ్లండ్, స్కాట్లెండ్, వేల్స్ అంతర్భాగాలు. కొన్ని దశాబ్దాల క్రితంవరకు ఐర్లాండ్ కూడా దీనిలో అంతర్భాగమే. (ఇప్పుడైనా ఐర్లాండ్ ఉత్తర ప్రాంతమైన ఆలస్టర్ దీనిలో ఒక భాగమే). యునైటెడ్ కింగ్డమ్ లోని వేర్వేరు దీవులకు వేర్వేరు భాష లున్నాయి, చరిత్ర లున్నాయి, సంస్కృతు లున్నాయి. అయినా, ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి వచ్చినప్పుడు వీటిని "యునైటెడ్ కింగడమ్" (సంయుక్త రాజ్యం) అన్నారే తప్ప, "బ్రిటీష్ ఎంపైర్" అనలేదు. ఈస్టిండియా కంపెనీని రద్దుచేసి, మనదేశం పరిపాలనాబాధ్యతను బ్రిటీష్ ప్రభుత్వం స్వయంగా స్వీకరించింది 1858లో. అప్పటికి ఆస్ట్రియాకు ఒక చక్రవర్తి, జర్మనీకి ఒక చక్రవర్తి, టర్కీకి ఒక చక్రవర్తి, రష్యాకు ఒక చక్రవర్తి, వీరితోపాటు మరికొందరు చక్రవర్తు లుండేవారు. అందువల్ల తాను చక్రవర్తిని బిరుదును స్వీకరించాలని విక్టోరియారాణి ముచ్చటపడింది. ఇది ముచ్చటగానే మిగలక, క్రమంగా తాపత్రయంగా మారింది. అయితే, బ్రిటీష్ పార్లమెంట్ అందుకు సమ్మతిస్తుందా? "చక్రవర్తి" లేదా "చక్రవర్తిని" పరిపాలన క్రింద జీవించడం స్వాతంత్ర్య ప్రియులకు, ముఖ్యంగా ప్రజాస్వామ్యవాదులకు ఎంతమాత్రం మనస్కరించదు. రాజులను, రాణులను సయితం, వారి అధికారం నామమాత్రమైనది కానిపక్షంలో నెట్టివేయాలనే వారు ఆకాంక్షిస్తారు. ఏమైనా బ్రిటీష్ పార్లమెంట్ సమ్మతిని పొందడానికి విక్టోరియారాణి 1876 వరకు వేచి వుండవలసి వచ్చింది. అప్పుడైనా పార్లమెంట్ చేత ఒక తీర్మానం చేయించడానికి నాటి బ్రిటీష్ ప్రధాని డిజ్రేలి తన యెత్తులను, జిత్తులను పూర్తిగా వినియోగించవలసి వచ్చింది. ఇంత జరిగిన తర్వాత కూడా విక్టోరియా కేవలం ఇండియా ఉపఖండానికి సంబంధించినంతవరకే "చక్రవర్తిని" "(ఎంప్రెస్ ఆఫ్ ఇండియా" కాగా, అదివరలోవలె అటుపిమ్మట కూడా యునైటెడ్ కింగ్ డమ్ కు సంబంధించినంతవరకు ఆమె "రాణి" (క్వీన్) మాత్రమే.

మగధరాజులు అన్యజాతులను జయించ లేదు, అన్యదేశాలను పరిపాలించ లేదు. అయినప్పుడు వారిని చక్రవర్తులుగా పేర్కొనడం భావ్యమా? మన దేశచరిత్ర, మన జాతి సంప్రదాయాలు మొదలైనవాటి దృష్టి నుంచి ఇది భావ్యమే కావచ్చు. ఒకప్పుడు - ఎప్పుడో కాదు, రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం వరకు - ఒక్కొక్క భాషా ప్రాంతం మనకు ఒక్కొక్క దేశం. "దేశములు" అనే పదానికి "ఆంధ్ర వాచస్పత్యము" చెబుతున్న అర్థం "అంగము, వంగము, కళింగము, కర్ణాటకము, కేరళము, కామరూపము... ఈ ధోరణిలో చాలా చాలా దూరం సాగుతున్నది. ఇంతే కాదు,

ఒకే భాషా ప్రాంతంలో "నాడు" లనేవి ఎన్నెన్నో ఉండేవి. మన తెలుగు భాషా ప్రాంతన్నే ఉదాహరణంగా తీసుకోండి. పలనాడు, వెలనాడు, వేగినాడు, పాకనాడు, పొత్తపినాడు, రేనాడు, కమ్మనాడు, పులుగునాడు, జంతురునాడు, కన్నాడు ఇట్టివి ఎన్ని ఉండేవో ఇప్పుడు లెక్కపెట్టడం కష్టం. అన్నట్టు, ఒక మురికినాడు కూడా ఉండేది. ఈ పరిస్థితిలో ఏదో ఒక నాడుకు ఏలికైనవాడు రాజు; రెండు, మూడింటికి ఏలికైనవాడు మహారాజు. నాడుల హద్దులను దాటి, రెండు లేదా మూడు భాషా ప్రాంతాలకు ఏలికైనవాడు చక్రవర్తి! అతడు చక్రవర్తి కానక్కరలేదు. ఏ పిల్లరాజైనా, పీచురాజైనా, అతడిని "అఖండ భూమండలాధీశ్వరా!" అని ఆస్థానకవులు పొగుడుతూ వుండేవారు! సరే దీని కేమిగాని, మనకు చక్రవర్తులు ఆరుగురు కాగా, మహారాజులు పదహారుగురని పురాణాలు చెబుతున్నాయి. కాగా, రాజులకు మితిలేకపోబట్టి కావచ్చు, వారి సంఖ్య విషయమై పురాణాలు మౌనం వహించాయి.

జాతీయ భావం వ్యాప్తిలోకి వచ్చింది, అది పూర్తిగా బలపడిందీ పందొమ్మిదవ శతాబ్దంలోనే. అందువల్ల ఒకప్పుడు మన దేశంలో వందల సంఖ్యలో చిన్న, పెద్ద రాజ్యాలు నెలకొనడంలో ఆశ్చర్యం లేదు. వెనకటి కాలంవరకు వెళ్ళడం దేనికి? బ్రిటీష్ వారు 1947లో మన దేశం నుంచి నిష్క్రమించినప్పుడు (జమీందారులు, జాగీరుదారులు వగైరాలను విడిచి పుచ్చగా) రాజుల, మహారాజుల, నవాబుల పేరుతో అయిదున్నర వందల మందికి పైగా ఉండేవారు! ఏమైనా, ఒకనాటి మన పాలకులలో కొందరిని భారతీయ చక్రవర్తులుగా పేర్కొనడం విడ్డూరమే. చివరికి అశోకుని రాజ్యమైనా దక్షిణాదిలో నెల్లూరును దాటి వెళ్ళలేదు. అయితే, విడ్డూరాలు కోకొల్లలుగా లేనిది పురాణమే కాబోదు. మనకు అష్టాదశ పురాణా లున్నాయి; తిరిగి అన్ని ఉపపురాణాలున్నాయి. అత్యుక్తులతోనే కాదు, అనృతాలలో కూడా వాటి మధ్య పోటీ కనబడుతుంది. పోతే, అవి వ్రాసే అసహజ విషయాలకు, అసంబద్ధ వివరాలకు హద్దుపద్దులు లేవు. ప్రస్తుత విషయాన్నే, షట్చక్రవర్తుల విషయాన్నే తీసుకోండి వారిలో అయిదవవాడైన సగరుని భార్య లిద్దరిలో ఒకరి కడుపున ఒక్కగానొక్క కొడుకు పుట్టగా, రెండవ ఆవిడ కడుపునుంచి అరవై వేలమంది బెలబెల బైటికి వచ్చిపడినారని బ్రహ్మాండ పురాణం చెబుతున్నది. పోతే, షట్చక్రవర్తులలో చివరివాడైన కార్తవీర్యార్జునుడు 85 వేల సంవత్సరాలు పరిపాలన చేశాడని విష్ణుపురాణం చెబుతున్నది. ఈ విషయంలో రామాయణ భారతాలైనా పురాణాలకు ఎంత మాత్రం తీసిపోవు. రామాయణం కథనం ప్రకారం దశరథుడు జీవించింది. 60 వేల సంవత్సరాలు; రాముడు రాజ్యం చేసింది 11వేల సంవత్సరాలు అప్పుడైనా బ్రతుకు పై రోత పుట్టి, సరయూ నదిలో దూకి రాముడు ఆత్మహత్య చేసుకొన్నాడుగాని, లేకపోతే, తండ్రి 60 వేల సంవత్సరాలు జీవించగా తాను తండ్రినిమించిన ఘనుడు కాబట్టి ఒక లక్ష సంవత్సరాలైనా పూర్తిచేసేవాడే ఈ సంఖ్యల తర్వాత ఆశ్చర్యార్ధక సంజ్ఞలను పెట్టబోయి, పురాణాల విషయంలో అది పిచ్చిపని కాగలదని సంక్షేపించాను. అత్యుక్తులు, అసంబద్ధాలు, అబద్దాలు మాత్రమే కాక, అసహజ విషయాలు, అభూతకల్పనలు ఏ దేశానికి చెందిన పురాణాలలోనైనా విశేషంగా ఉంటాయి. ఇందుకు కారణం పురాణాల రచన మానవ నాగరికత ప్రాథమిక దశలలో జరగడమే. వాటిని వ్రాసిన వారికి అగ్ని ఒక దేవుడు, వాయువు ఒక దేవుడు, వరుణుడు ఒక దేవుడు, సూర్యచంద్రులు ఇద్దరు దేవుళ్ళు, పృథ్వీ ఒక దేవత, గోవు ఒక దేవత. ఇక్కడ కాదుగాని, అన్యదేశాలు కొన్నింటిలో మేకపోతు, గొర్రె, పొట్టేలు, ఆబోతు, మొసలి, డేగ - అన్నీ దేవుళ్ళే, అన్నీ దేవతలే, "ఇక్కడ కాదుగాని" అని ఇంతకుముందు నేను వ్రాయడం నిజానికి పొరపాటు, ఇక్కడైనా, పాము పుట్టలలో మనం పాలుపోయడం లేదా? చెట్లకు ప్రదక్షిణలు చేయడం లేదా? కప్పలకు పెళ్ళిళ్లు చేయడం లేదా? రాళ్ళకు, రప్పలకు సాగిలి మ్రొక్కడం లేదా?

అన్నట్టు, ఇక్కడ ఒక పచ్చి మోసం సయితం జరిగింది. తాము ద్విజులమని, దివ్యజ్ఞానం తమకే పరిమితం కావాలని భావించినవారు, ద్విజేతరుల కోసం - ప్రజలలో వాటికి దాదాపు 80 వంతుల మంది కోసం - పురాణాలను ప్రత్యేకంగా సృష్టించారు. "మీది హీనజన్మ, మీది హీనబుద్ధి. మీకు పురాణ శ్రవణం చాలు.

అంతటితో సంతృప్తి చెందక, వేదాలను మీరు వింటే మీ చెవులలో కరిగించిన సీసం పోస్తాము; వేదాలను మీరు చదివితే, మీ నాల్క కోసివేస్తాము; వేదాలను మీరు జ్ఞాపకం పెట్టుకొంటే, అంతకు మించిన కఠిన దండన మీకు తప్పదు" అని హెచ్చరించారు. ఇంతటి మహాఘోరం జరిగింది. ప్రపంచం మొత్తం మీద ఒక్క ఈ దేశంలోనే! పురాణాలు ఏయే దేశాలలో, ఏయే జాతులలో ఏ విధంగా పుట్టినా, ఎంతగా వ్యాప్తిలోకి వచ్చినా, పాశ్చాత్య దేశాలకు, మన దేశానికి ముఖ్యమైన ఒక భేదం కనబడుతున్నది. పురాణాల పట్ల భక్తి విశ్వాసాలు ఆ దేశాలలో క్రమక్రమంగా సన్నగిల్లిపోయాయి. క్రైస్తవ మతాచార్యులు ఎంతగా కొట్టుమిట్టాడినా, బైబిల్ లోని కట్టుకథలను, పిట్టకథలను నమ్ముతున్నవారు తగ్గిపోయారు, తగ్గిపోతున్నారు. ఈ పరిణామం రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం ప్రారంభమైంది; కడచిన నూరేళ్ళలో పూర్తిగా బలపడింది. ఈ విషయంలో ముఖ్యంగా మెచ్చుకోవలసింది గ్రీస్ దేశాన్ని. క్రీస్తు శకానికి అయిదారు శతాబ్దాలకు ముందుగానే అక్కడ కొందరు మేధావులు, తత్వజ్ఞులు, కవులు, నాటక కర్తలు తమ పురాణాలను ఎగతాళి చేశారు, ఏవగించుకొన్నారు.

మనకు వ్యాస, వాల్మీకులు పౌరాణిక కవులు కాగా, గ్రీసు దేశస్థులకు హోమర్, హీసియె లు అట్టి కవులు. హోమర్ "ఇలియడ్" "ఒడెసి" అనే రెండు పురాణాలు వ్రాశారు. హీసియెడ్ హోమర్చే ప్రభావితుడై దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలను గురించి కొన్ని రచనలు చేశాడు. ఇంతేకాక, కర్షకుల దైనందిన జీవితం నుంచి కొన్ని ఘట్టాలను ఎన్నుకొని, వాటిని నీతికథలుగా మలచాడు, ఆ నీతి కథలలో సయితం అక్కడక్కడ పౌరాణిక గాథలు దూరినా, మొత్తంపై అవి సమకాలిక సాంఘిక జీవితానికి అద్దం పడుతున్నాయి. హీసియెడ్ క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దికి చెందినవాడు. కాగా, హోమర్ ఏ కాలానికి చెందినవాడో నిర్ధారణగా చెప్పలేకున్నారు. ఇటీవలి పరిశోధకులలో కొందరి అభిప్రాయం ప్రకారం, హోమర్ అనే వ్యక్తి నిజానికి లేడు; ఆ పేరుతో పెక్కుమంది వివిధ కాలాలలో "ఇలియెడ్", "ఒడెసి" పురాణాలకు వాటి ప్రస్తుత రూపాన్ని కూర్చారు. వారు మన సూతులను పోలినవారు కావచ్చు; వీరివలె వారు కూడా పౌరాణిక గాథలను పద్యాలుగా, పాటలుగా పాడుతూ, దేశాటన ద్వారా పొట్టపోసు కొన్నవారు కావచ్చు. హోమర్ అస్తిత్వాన్ని సందేహించినట్టే వ్యాసుని అస్తిత్వాన్ని కూడా సందేహించాలి. "వ్యాసం"
అంటే నిఘంటువులు చెప్పే అర్థం "విరివి వ్రాత" అని. దీన్నిబట్టి వివిధ కాలాలలో విభిన్న వ్యక్తులు చేసిన, లేక క్రోడీకరించిన రచనలను - వేదాలు, పురాణాలు, మహాభారతం వగైరాలను - ఒకే వ్యక్తికి అంటగట్టి, అతడిని "వ్యాసు" డనడం జరిగి ఉండవచ్చు. వ్యాసునికి మరొకపేరు "కృష్ణద్వైపాయనుడు" మూడవ పేరు బాదరాయణుడు. అతడు చారిత్రక వ్యక్తి కాడనుకొనడానికి బలమైన కారణాలు చాలా వున్నాయి. వ్యాసుని పేరుతో ఎంద రెందరో రచయితలు ఎప్పు డెప్పుడు రంగప్రవేశం చేశారో మనకు తెలియదుగాని, క్రీస్తుశకం పదవ శతాబ్దం వరకు వీరు పాతపుస్తకాలలో మార్పులు, చేర్పులు చేస్తూనే పోయారు, కొత్త పుస్తకాలను వ్రాస్తూనేపోయారు. మహాపురాణాలుగా చెల్లుతున్న వాటిలో చిట్టచివర వెలువడినట్టిది భాగవతం. తక్కిన పదిహేడు మహాపురాణాలలోని ముఖ్యాంశాలు దీనిలోవున్నాయి. పురాణాలను గురించి పరిశోధనలు జరిపిన పాశ్చాత్య పండితులలో ఒకడైన హెచ్. హెచ్. విల్సన్ తేల్చిన సారాంశం ప్రకారం, భాగవతరచన జరిగింది బహుశా క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దిలో. మరికొందరు పరిశోధకుల దృష్టిలో అది పదవ శతాబ్ది రచన. ఈ విషయమై నేను ఇంత దీర్ఘంగా ప్రస్తావించడం గ్రీసులో పురాణాల రచన క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దినాటికే నిలిచిపోగా మన దేశంలో అది క్రీస్తుతర్వాత పదవ శతాబ్ది వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగిందని చెప్పడానికే!

ఇంతకంటె కూడా ఆశ్చర్యకర విషయం క్రీస్తుతర్వాత ఇరవయ్యో శతాబ్దిలో సయితం మన పురాణాలలోని కట్టుకథలను, పిట్టకథలను మనలో అత్యధిక సంఖ్యాకులు పరమసత్యాలుగా విశ్వసించడమే! వాటిలోని బొంకులను, రంకులను పవిత్ర విషయాలుగా సంభావించడమే! పామరుల సంగతి విడిచిపెట్టండి. విద్యాధికులైన వారే ఈ పనులు చేస్తున్నారు. అత్యున్నత

పదవుల నధిష్ఠించి, మనను పరిపాలిస్తున్నవారే ఈ పనులు చేస్తున్నారు. ఇది మన ప్రగతిని ఎంతగా నిరోధిస్తున్నదో, మన భవిష్యత్తుకు ఎంతటి ప్రమాదంగా పరిణమిస్తున్నదో, ఆ మాట తలచుకొంటేనే గుండెలో రాయి పడుతున్నది!!

మనదేశంలో ఈనాడు - క్రీస్తుతర్వాత ఇరవయ్యో శతాబ్దిలో - జరుగుతున్నదానికి భిన్నంగా, ఏనాడో - క్రీస్తుకుపూర్వం నాలుగైదు శతాబ్దాలనాడే - జీనోఫెనీజ్ తమ పౌరాణిక కవు లిద్దరినీ వేడిగా, వాడిగా నిరసించాడు, ఏడు నిలువుల లోతున వారిని పాతి పెట్టినంత పనిచేశాడు. అదే కాలానికి చెందిన ప్లేటో అంతవరకు వెళ్లలేదుగాని, తమ పాత పురాణాలవల్ల మేలుకంటె కీడు అధికంగా జరుగుతున్న దన్నారు. ప్లేటో వైఖరి కొంతవరకు మన ద్విజుల వైఖరిని పోలినట్టిది. హోమర్, హీసియెడ్ పురాణాలను ఖండిస్తూనే, పామరజనులకు పురాణాలు అవసరం కాబట్టి, పాత బూతుపురాణాలకు బదులుగా కొత్త నీతిపురాణాలు వ్రాయాలని ఆయ నన్నాడు.

హీసియెడ్ తెరవేసి చెప్పినట్టు, సోక్రటీజ్ నోటివెంట ప్లేటో "రిపబ్లిక్" గ్రంథంలో చెప్పించినట్టు, గ్రీకు పురాణాలలోని దేవతలు అసూయా విద్వేషాలకు అతీతులు కారు, మదమాత్సర్యాలకైనా అతీతులుకారు. వారి అధిపతి పేరు "జూస్" (zeus) ఇతడు మన పురాణాలలోని ఇంద్రునికి పెద్దన్నయ్య. ఇతడు ఆడని అబద్ధం లేదు, చేయని మోసం లేదు, ఒడిగట్టని నైచ్యం లేదు. ఇతడు తాగుబోతు, వ్యభిచారి. ఏ ప్రలోభానికైనా ఇట్టే లొంగిపోతాడు; అభీష్టకార్యసిద్ధికై ఏ మాయోపాయానికైనా వెనుదీయడు; స్వీయ ప్రాబల్య రక్షణకై ఎంతటి క్రూరకృత్యాలకైనా సన్నద్ధపడతాడు. ఈ విషయాలలో తక్కిన గ్రీక్ దేవతలైనా తమ అధిపతి జూస్ కంటె ఒక మెట్టు, లేదా అరమెట్టు కిందగా నిలచినవారే. ఇట్టివారిని దేవతలుగా ఆరాధిస్తే వ్యక్తులుగా మన శీలం ఎంతవరకు నిలుస్తుంది? పౌరులుగా ఇతర పౌరులపట్ల మన ప్రవర్తన ఏ తీరులో వుంటుంది? సంఘంలో మన నైతికపు విలువలు ఏ స్థానంలో వుంటాయి? గ్రీలో రెండున్నర వేల సంవత్సరాల క్రితమే కొందరు మేధావులు, తాత్త్వికులు వేసిన ఈ ప్రశ్నలు ఇప్పటికైనా మన దేశంలో ఎందుకు వినబడవు? మన దేశంలోనైనా మన పురాణాలను నిరసించినవారు కొందరు లేకపోలేదుగాని, వారి సంఖ్య బహుస్వల్పం. ఈ శతాబ్దిలో పెరియార్ రామస్వామి, శ్రీ త్రిపురనేని రామస్వామి పురాణాలపై దాడిచేశారు; గత శతాబ్దిలో రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి వాటి పై దెబ్బతీశారు. అయితే, వారి విమర్శలు గాలికి ఎగిరిపోయినట్టుగా భావించవలసి వస్తున్నది. ఇందు కొక కారణం - వేదకాలంనాటి దేవగణంలో అగ్రగణ్యుడైన ఇంద్రుని పౌరాణికయుగంలో ఒక దిక్పాలుని స్థాయికి (లేదా దిక్పాలకులలో ప్రథమస్థాయికి) దిగజార్చి, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తుల స్థానంలో నిలబెట్టడం కావచ్చు. ఇంతకుముందు నేను పేర్కొన్నట్టు, దాదాపు మూడువేల సంవత్సరాల క్రితమే గ్రీలో పురాణాల రచన నిలిచిపోగా, ఇంచుమించు వెయ్యేళ్ళ క్రితంవరకు అది మన దేశంలో కొనసాగింది. ఈ నాటికైనా మనలో వాటి రచన నిలిచి పోయినట్టు చెప్పలేము. పాత పురాణాలను దేశభాషలలోకి అనువదిస్తూనే వున్నారు. క్రీస్తుకుపూర్వం అయిదవ శతాబ్దానికి చెందిన నాటకకర్త యురిపిడీజ్ చేసినట్టు పౌరాణిక పాత్రలకు నూతనరూప మివ్వడానికి, పౌరాణికగాథలకు నూతన వ్యాఖ్యానాలను చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నవారైనా అంతగా మన దేశంలో ఇప్పటికైనా కానరావడం లేదు. పవిత్ర గాథలను అపవిత్రం చేస్తున్నాడని యురిపిడీజ్ ను ఆయన సమకాలికులు నిరసించారు, నిందించారు. ఆయనను అవహేళన చేస్తూ, అరెస్టాఫెనీజ్ నాటకాలను వ్రాయడంవరకు వెళ్ళాడు. అయినా, యురెపెడీజ్ అదరలేదు, బెదరలేదు, గుండె బేజారు కాలేదు. కొన్ని విలక్షణ ప్రవృత్తులను, కొన్ని విపరీత మానసికావస్థలను ప్రతిభా పూర్వకంగా విశదీకరించడానికి పౌరాణిక గాథలను, పాత్రలను ఆయన వినియోగించాడు. ఆదిలో ఎంత అవహేళనకు లోనైనా, ఎందరి ఆగ్రహానికి గురికావలసి వచ్చినా, చివరికి ఆయన సమకాలికులే ఆయన మౌలికచింతనను, ఆయన ప్రజాప్రాభవాలను గుర్తించక తప్పలేదు. ఇంతే కాదు. రెండున్నర వేల సంవత్సరాల తర్వాత కూడా ఆయన పాతగిల లేదు. ఆయన స్థానం ఈనాడు ప్రపంచ నాటక కర్తల వరసలోనే. ఆధునికులలో ఆధునికుడు కావడం ఆయనలో మరొక విశేషం.

భాసుడు, కాళిదాసు సయితం ప్రపంచ నాటకకర్తలైనా, పౌరాణిక గాథలకు నూతనార్థాలను కట్టించడంలో, వాటి ద్వారా నూతన సందేశాన్ని అందించడంలో యురెపిడీజ్ తర్వాతనే వారిద్దరినీ పేర్కొనాలి. పాత యుగాల మాట కేమి? ఇప్పుడు మనం ఆధునిక యుగంలో వున్నాము. అయినా, మనలో ఆధునిక దృక్పథం ఎందుకు లేదు? పాతవాసనలు మనను ఎందుకు వదలడం లేదు? ఎదురుకుకాక, వెనుకకే మనం ఎందుకు చూస్తున్నాము. ముందుకుకాక, వెనుకనే మనం ఎందుకు నడుస్తున్నాము? ఈ అన్ని ప్రశ్నలకు సమాధాన మొక్కటే. అది -మనపై మన పురాణాల దుష్ప్రభావం.

ఇక్కడ మరొక్కమాటకూడా చెప్పాలి. ప్రాచీనకాలంలోనే పురాణాలను ఒక పక్కకు నెట్టినందునే, పౌరాణిక గాథలలో నిజంకంటె అబద్ధం, నీతికంటె అవినీతి, ఉదాత్తతకంటె నైచ్యం, అన్నింటినీ మించి, వాస్తవంకంటె కల్పన అత్యధికంగా వుంటాయని గుర్తించిన ఘనత కూడా గ్రీక్ మేధావులకే దక్కింది. అందువల్లనే ప్రపంచం మొత్తం మీదనే మొట్టమొదటి చరిత్రకారుడు గ్రీసులో తలయెత్తాడు. ఆయన పేరు - హిరొడెటెస్ (ఈయన సయితం రెండున్నరవేల సంవత్సరాల నాటివాడే!) ఈయన తర్వాత ఎన్నదగు గ్రీక్ చరిత్రకారుడు థూసిడెడీజ్. పురాణాల పట్ల భక్తి గౌరవాలు, ఔషధంలేని జాడ్యంవలె మనలో జితించిపోయి నందున మన దేశంలో తొలి చరిత్రకారుడుగా చెప్పదగినవాడు క్రీస్తు తర్వాత ఏడవ శతాబ్దికి చెందిన బాణభట్టు. ఆయన వ్రాసిన "హర్షచరిత"ను ప్రధానంగా ఒక కావ్యంగా పరిగణిస్తే, అటుపిమ్మట పేర్కొనదగు చరిత్రకారుడు ప్రాకృతంలో "గౌడవథ" వ్రాసిన వాక్పతిరాజు. ఈయన ఎనిమిదవ శతాబ్దంవాడు.

నిజానికి ఈయన కృతి కూడా చరిత్ర లక్షణాల కంటె రాష్యగుణాలనే అధికంగా కలిగివున్నదనేవారు లేకపోలేదు. కాగా, చరిత్రలుగా చెప్పదగిన మన తొలిగ్రంథాలు పన్నెండవ శతాబ్దిలో కల్హణుడు వ్రాసిన "రాజతరంగిణి", బిల్హణుడు వ్రాసిన "విక్రమాంకదేవ చరిత్ర," ఒక సాహిత్య ప్రక్రియగా కావ్యంతోపాటు, నాటకంతోపాటు చరిత్ర మన దేశంలో ప్రాచీనకాలంలోనే ఆవిర్భవించక పోవడానికి కారణాన్ని తిరిగి చెప్పమంటారా? అయితే, వినండి. అది మన దరిద్రపు గొట్టు పురాణాల దరిద్రపుగొట్టు ప్రభావమే!

పురాణాలలోని బొంకులు, రంకులు

గ్రీసులో క్రీస్తుకు పూర్వం అయిదవ శతాబ్దిలోనే పురాణాల విమర్శ ప్రారంభం కాగా, మన దేశంలో క్రీస్తు తర్వాత రవయ్యో శతాబ్దిలో సయితం వాటి ప్రశంస జరుగుతున్నదని ఈ పీఠిక మొదటి ప్రకరణలో చెప్పాను. వాటి ప్రశంసతోనైనా మనం సరిపుచ్చడం లేదు, పవిత్ర గ్రంథాలుగా వాటిని మనం పూజిస్తున్నాము, స్వర్గానికి సింహద్వారాలుగా వాటిని మనం ఔదల దాల్చుతున్నాము. తన ఆదర్శ రాజ్యానికి గాంధి పెట్టిన పేరు "రామరాజ్యం" అని; అన్ని రుగ్మతలకు దివ్యౌషధం - గాంధి విశ్వాసం ప్రకారం - రామనామమే! గాంధి వియ్యంకుడు రాజగోపాలాచారి రామాయణాన్ని, భారతాన్ని సులభశైలిలో తమిళంలో వ్రాశాడు. ఇంగ్లీషు సమేతంగా అనేక భాషలలో వాటి అనువాదాలు వెలువడినాయి. అవి లక్షల సంఖ్యలో అమ్ముడుపోతున్నాయి. గాంధికి శిష్యుడు, రాజగోపాలాచారికి మిత్రుడు అయిన కె.యమ్. మున్షీ పౌరాణిక గాథలే ఇతివృత్తాలుగా ఎన్నో నవలలు వ్రాశాడు. వాటిలో ఒకటి "భగవాన్ పరశురాముడు". ఇది పాడు కలికాలమైపోయింది కానీ, లేకపోతే ఆర్యధర్మ రక్షణకై దానివ్యాప్తికై మున్షీ సయితం ఒక గండ్రగొడ్డలిని భుజానవేసుకొని పద్దెనిమిది జైత్రయాత్రలు సాగించి వుండేవాడే! ఆయన రచనలో చిట్టచివరిది, అయిదారు సంపుటాల తర్వాత కూడా (ఆయన మృతికారణంగా, అసమగ్రంగా నిలిచిపోయినట్టిది "కృష్ణావతారం". పోతే, జాతీయ జ్ఞానపీఠంవారి లక్షరూపాయల బహుమానాన్ని పొందిన వారిలో ఒకరేమో తెలుగులో రామాయణం వ్రాసిన కవికాగా, మరొకరు కన్నడంలో రామాయణాన్ని వ్రాసిన కవి. ఇక, మన ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తున్న రేడియో తన దైనందిన కార్యక్రమాలను తెల్లవారేసరికి పౌరాణిక దేవతల సంస్తవాలతో మొదలు పెడుతుంది; పొద్దు పోయిన తర్వాత మరల వారి సంకీర్తనలతో ముగింపు చేస్తుంది. అది దేవభాష కాబట్టి చాలామందికి తెలియదుగాని "వేంకటేశ సుప్రభాతం"లో ఎన్నో బూతులున్నాయి. పోనీ, వెనకటిగాథలకు ఇప్పటి వారు కొత్త అర్థాలను చెబుతున్నారా? అదీ లేదు. వాటి పై కొత్త వ్యాఖ్యానాలను చేస్తున్నారా? అదీ లేదు. పై పెచ్చు, స్నానం చేయించి, వలువలను మార్చి, తల దువ్వి, జడ వేసి, పూలు తురిమి, సుగంధ ద్రవ్యాలను పులిమి, పురాణాలలోని కంపును కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతటితో నైనా ఆగక, ఆధునికయుగ సమస్యలన్నింటికి మన పురాణాలలో పరిష్కారాలు లభించగలవని ప్రజాబాహుళ్యాన్ని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. మనది సమతాయుగం. మన రాజ్యాంగ దృష్టిలో, మన శాసనాల దృష్టిలో పౌరు లందరిదీ సమానప్రతిపత్తి. పురాణాలు ఈ సమాన ప్రతిపత్తిని గుర్తించవు. వాటి దృష్టిలో కొందరు అగ్రజాతులవారు కాగా, మరి కొందరు నిమ్నజాతులవారు, కొందరు గొప్ప కులాలవారు కాగా, మరి కొందరు తక్కువ కులాలవారు. అందువల్ల కులాంతర వివాహాలను అవి వ్యతిరేకిస్తాయి; చివరికి సమిష్టి భోజనాలను సయితం అవి వ్యతిరేకిస్తాయి. పాతకాలపు ఆచారవ్యవహారాలను వీసం వాసిగానైనా అతిక్రమిస్తే, వర్ణసాంకర్యం జరుగుతుందని, వర్ణసాంకర్యం జరిగితే, ప్రపంచమే తలక్రిందులు కాగలదని భయపెట్టని పురాణం లేదు. అయినప్పుడు పురాణాలు మన సమతాయుగ ధర్మానికి విరుద్ధమైనవి కావా? రాజులేని వ్యవస్థను పురాణాలు అతి ఘోరవ్యవస్థగా భావిస్తాయి. అయినప్పుడు పురాణాలు మన ప్రజాస్వామ్య యుగధర్మానికే ప్రాణసంకటమైనవి కావా? ఒక్కమాటలో చెప్పాలంటే, మనకు పురాణాలలో విశ్వాసం వుంటే, మన నూతన రాజ్యాంగ విధానాన్ని చింపి ముక్కలు చేయాలి, చెత్తకుప్పపై విసిరి వేయాలి.

మనది పురోగతిని కాంక్షిస్తున్న తరం. యూరప్, అమెరికాలతో పోల్చినప్పుడు చైనా, జపానులతో పోల్చినప్పుడైనా మనం ఏడు తరాలు వెనుకబడి వున్నాము. ఉరుకులు, పరుగులు పెడితేనే తప్ప, వాటిని మనం కలుసుకోలేము. కాని, మన పురాణాలు మాత్రం మనం ఎంతగా ముందుకు సాగితే, సనాతన ధర్మానికి, సత్యయుగానికి అంత దూరం కాగలమని ప్రబోధిస్తున్నాయి. అంతగా మనం నాశం కాగలమని హెచ్చరిస్తున్నాయి. అట్టి పురాణాలు మన కాళ్ళకు బంధాలు కావా, మన మెడకు ఉచ్చులు కావా? ఈ నాటికీ మన ప్రజలలో నూటికి 60 మందికి పైగా నిరక్షరాస్యులే. వారి మాట

విడిచిపెట్టండి. మన సంఘనాయకులైనా, మన ప్రభుత్వాధినేతలైనా, పామరులకు భిన్నంగా ప్రవర్తించడం లేదు. ఒకే నోటితో, ఒకే నాల్కతో మన నూతన రాజ్యాంగాన్ని, మన పాత పురాణాలను ఏ విధంగా వారు మెచ్చుకొనగలుగుతున్నారో వారికే తెలియాలి! ఈ మెచ్చుకోలులో ఏదో ఒకటి విధిగా అబద్ధమైవుండాలి!

ఇంద్రుని "డిమోట్" చేసి, అతడి స్థానానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులను "ప్రమోట్" చేయడం మన దేశంలో జరిగినమాట నిజమే. అయినా, ఈ త్రిమూర్తులు ఇంద్రునికంటె ఉత్తములని చెప్పగలమా? ఉత్తములైతే, ఏ మేరకు? అంధవిశ్వాసంతో కాక, విచక్షణా దృష్టితో పరికిస్తే, ఇంద్రునిపై ఋజువర్తనలో వీరి ఆధిక్యత నామ - మాత్రమైనదే కాదా? ఈ విషయాన్ని నిరూపించడానికి పౌరాణిక గాథలను ఉదాహరించగోరితే, ఒక్కొక్కరినిగురించి కనీసం ఒక వందకు పైగా తేలికగా దొరుకుతాయి. అట్టి ప్రయత్నాన్ని నేను చేయబోవడం లేదు. ఒక్కొక్కరినిగురించి ఒక్కొక్క గాథనుమాత్రమే ఉదహరిస్తాను. వాటినైనా నా మాటలలో కాక "పూర్వగాథాలహరి" అనే నిఘంటువును కూర్చిన వేమూరి శ్రీనివాసరావుగారి మాటలలో ఉదాహరిస్తాను. ముందు బ్రహ్మసంగతి వినండి. అబద్ధాలకోరును "రెండు నాల్కలవాడు" అంటారు. బ్రహ్మకు నాలుగు నాల్క లున్నాయి. ఇందువల్ల ఆయన మరింత సులువుగా, చెలువుగా అబద్దాలు ఆడగలడని మనం అనుకోవాలి. సరే - ఇప్పుడిక శ్రీనివాసరావుగారు శివపురాణం నుంచి ఏమి యెత్తి వ్రాశారో ఒకసారి చిత్తగించండి!

"విష్ణుమూర్తియు బ్రహ్మయు తమ తమ యాధిక్యమును గూర్చి తగవులాడుకొనుచుండిరి. వారిట్లు పోరాడుచుండగనే వారియెదుట దివ్య ప్రభలతో వెలుగొందుచు స్తంభమువలె, లింగ మావిర్భవించెను. వారు దాని టోన్నత్యమునకు వెఱగుపడి, దాని యాద్యంతములు పరీక్షింప గోరిరి. విష్ణుమూర్తి వరాహరూపమున గ్రిందివైపునకును, బ్రహ్మ హంసరూపమున నూర్ధ్వమునకును వెళ్ళిరి. ఎవరు తుదవఱకు బోయివత్తురో వారికి రెండవవారు నమ్రులై పూజించు నట్లొడంబడిరి."

"విష్ణుమూర్తి యెంతవెళ్ళినను స్తంభాది యగుపడినది కాదు. అతడు తిరిగి వచ్చెను. బ్రహ్మ తాను అంతమును జూచివచ్చితినని చెప్పెను. బ్రహ్మకు విష్ణువు నమస్కరించెను. కాని, శివుడు ప్రత్యక్షమై బ్రహ్మ యసత్యము పల్కెనని చెప్పెను."

బ్రహ్మదేవుడు ఆడిన అబద్ధం సంగతి విడిచిపుచ్చండి. అసలు ఈ గాథ ఎంత అసభ్యమైనది! ఎంత అశ్లీలమైనది!! అయినా, దీన్ని అక్షర రూపంలోనైనా మిగల్చక, శిల్పంగా మలచడం సయితం జరిగింది! ఇట్టి శిల్ప మొకటి ఉండవల్లి గుహలలోనే కావచ్చు ఒకప్పుడు చూచినట్టు జ్ఞాపకం.

కాగా, దేవీ భాగవతం "అథారిటీ" పై శ్రీనివాసరావుగారు విష్ణుమూర్తిని గురించి వ్రాసిన గాథను, తిరిగి ఆయన మాటలలోనే, ఆలకించండి:

"రేవతుడను వాడు గుఱ్ఱ మెక్కి వెళ్ళుచుండగా విష్ణువు లక్ష్మిని బిలిచి, చూడు మా గుఱ్ఱ మెంత యందముగ నున్నదో యని చెప్పెను. లక్ష్మి యా గుఱ్ఱమును జెప్పవేయక చూచుచుండెను. నీవు రెప్ప వేయక యట్లు చూచుచుంటివి. నీకు గుఱ్ఱపు రూపు మన సైనది కాబోలు! నీ వాడు గుఱ్ఱమవై పుట్టు' మని లక్ష్మిని విష్ణువు శపించెను. ఈ శాపమున కామె విచారించెను, 'నీవు శివునిని బ్రార్థించుము. నీకు పుత్రుడు కలిగిన పిదప శాపవిముక్తి యగు'నని విష్ణువు పలికెను. లక్ష్మి కైలాసమున కేగి శివునిని బ్రార్థించెను. శివుడు విష్ణువును రావించెను. విష్ణువు అశ్వరూపముతోడనే వెళ్ళి యా యాడు గుఱ్ఱమును గూడెను.

అది గర్భవతియై పుత్రుని బడసెను. వెంటనే లక్ష్మిని శాపవిమోచన మయ్యెను. ఆ పుట్టిన బాలుని లక్ష్మీ విష్ణువు అచ్చటనే దిగవిడచి చనిరి. ఆ పుత్రుడే హయహయుడు".

ఈ గాథ ద్వారా దేవీ భాగవతకర్త ఏమి నీతి బోధించగోరినాడో మీకు అంతు చిక్కిందా? నాకు ఇది ఒకే ఒక విషయాన్ని స్ఫురింపజేస్తున్నది. దీన్ని వ్రాసిన వ్యక్తి సభ్యతారహితుడు, సంస్కారహీనుడు. మలిన మనస్కుడు, మానవాధముడు.

నాకు కలుగుతున్న జుగుప్సను అణుచుకొని, ఇక్కడ శివుని విషయమై ఒక గాథను తిరిగి "పూర్వగాథాలహరి" నుంచే ఉటంకిస్తున్నాను:
"విష్ణువు జగన్మోహినీరూపము ధరించి వచ్చుటచే దానవు లామె రూపము చూచి మోహపరవశతచే మైమఱచియుండి యమృతమును గోల్పోయిరని శివుడు వినెను. ఆ రూపమెట్లుండునో చూడవలెనని యితనికి గుతూహలము కలిగి, తనకు జూపుమని విష్ణువు నడిగెను. 'నీ మతి చలించును. నీవు వికల మనస్కుడ వగుదవు. నీవు చూడజాల'వని విష్ణువు చెప్పెనుగాని, శివుడు బలవంత పెట్టెను. విష్ణువు వల్లెయని యంతర్ధానము నొందెను. ఇత డెచ్చటి కేగెనని నాల్గుమూలలు శివుడు పరికించుచుండగా నింతలో జగన్మోహిని శివుని యెదుట నిలచెను. శివునకు మతి చలించినది. ఆమెను బట్టుకొనబోయెను. ఆమె పరుగిడెను. ఆమెవెంట శివుడు పరుగిడెను. నదులు, పర్వతములు, అరణ్యములు సరకు సేయక జగన్మోహినియును, నామె వెనుక శివుడును బరుగిడుచుండిరి. తుదకు శివునకు వీర్యము జారిపడెను. అపుడు హరిమాయ తెలిసికొని స్తుతించెను. విష్ణువు నిజస్వరూపము దాల్చి గోచరించెను".

ఈ మూడు గాథల తర్వాత నా వ్యాఖ్యానంగా నేను చెప్పవలసింది ఒకే ఒకమాట. శోధించి వీటిని నేను పట్టుకోలేదు; "పూర్వగాథాలహరి" పుటలను ఒకసారి యదాలాపంగా చూచినంత మాత్రాన ఇవి కంటబడినాయి. ఆ నిఘంటువు పుటలలో వీటికంటె అశ్లీలమైన, జుగుప్సాకరమైన, నీచమైన గాథలు కొన్ని వంద లున్నాయి.

నేను ఉదహరించిన మూడు గాథలు మూడు పురాణాలలోనివి కాబట్టి, పురాణాలలో ఏమి వున్నా, రామాయణంలో, భారతంలో ఈ విధమైనవి లేవని వాదించడానికి వీలు లేదు. రామాయణంలో అహల్య ఇంద్రునితో వ్యభిచరించి, "నా జన్మ పావనమైంది; మనకు ప్రమాదం రాకుండా నా భర్త తిరిగి రాకముందే మీరు చల్లగా తప్పుకొనండి" అని హెచ్చరిక చేసిన గాథ లేదా? ఇదే విధమైన బూతుకథలు భారతంలోనైనా ఎన్ని లేవు? కర్ణుని జన్మవృత్తాంతాన్ని జ్ఞాపకం తెచ్చుకొనండి; ఎవరికి ధర్మరాజును, భీముని, అర్జునుని కుంతి కనిందో జ్ఞాపకం తెచ్చుకొనండి. అంతకుముందు ధృతరాష్ట్రుడు, పాండురాజు విదురుడు - వీరి పుట్టుక సంగతిని జ్ఞాపకం తెచ్చుకొనండి. ఇంతకంటే ముఖ్యంగా అసలు వేదవ్యాసుని జన్మ వృత్తాంతాన్ని జ్ఞాపకం తెచ్చుకొనండి. నిజానికి ఇవి జ్ఞాపకం తెచ్చుకొనదగు గాథలు కావు కాబట్టి, వీటి ప్రసక్తిని మరి నేను విరమిస్తాను.

శృంగారలీలలు, కామకలాపాలు - వీటిని విడిచిపుచ్చండి; మానవ మాత్రులైన మన విషయంలోనైనా క్షంతవ్యంకాని అసత్యవచనాలు, అన్యాయచర్యలు, కపటవర్తనలు, క్రౌర్య ప్రదర్శనలు - వీటిని సయితం విడిచిపుచ్చండి; సాక్షాత్తు అవతారపురుషులైన రాముడు, కృష్ణుడు వీటిని మించిన దుష్కృత్యాలలో ఎన్నింటికి పాల్పడలేదు? వాలివధలో, శంబుకుని వధలో కేవలం రామభక్తులు తప్ప అన్యులు ఆయన ప్రవర్తనను హర్షించగలరా, సమర్థించగలరా?

సీతను ఎంత కఠినంగా, ఎంత కర్కశంగా, ఎంత క్రూరంగా ఆయన చూడలేదు, ఎంతగా ఆమెను సంక్షోభ పెట్టలేదు? రాముని స్వభావాన్ని గురించి నా అభిప్రాయాలను తెలుసుకొనగోరేవారు "జాబాలి", "సీత జోస్యం" అనే నా రెండు నాటకాల పీఠికలను చదవవచ్చు. పోతే, భాగవత కృష్ణుని వరకు వెళ్ళక, భారత కృష్ణుని చరిత్రను పరికించినా, దానిలో ఎన్ని అకృత్యాలు లేవు, ఎన్ని అన్యాయాలు లేవు? జరాసంధుని చంపడానికి భీమార్జునులను బ్రాహ్మణ వేషంలో ఆయన తీసుకువెళ్ళలేదా? అశ్వత్థామ చచ్చిపోయినట్లు ధర్మరాజుచేత ద్రోణాచార్యునికి అబద్ధాన్ని చెప్పించ లేదా? గదాయుద్ధంలో దుర్యోధనుని కటి ప్రదేశానికి కిందుగా మోద వలసిందిగా భీమునికి ఆయన చెప్పలేదా? లెక్కపెట్టగోరితే, కృష్ణుని విషయంలో ఇట్టి సంఘటనలు భారతంలో కనీసం మరొక పది కనబడకపోవు.

అవతారపురుషులే ఈ విధంగా ప్రవర్తించినట్టు మనకు చెప్పే రామాయణ, భారతాలను పవిత్ర గ్రంథాలుగా భావించే దేశంలో, వాటిని చదివినా, విన్నా అన్ని పాపాలు ప్రక్షాళన కాగలవని నమ్మే దేశంలో నైతికపు విలువలు తక్కువ స్థాయికి దిగజారితే అందుకు ఆశ్చర్యపడనక్కరలేదు గదా? నైతికపు విలువలకు అపరిచితులైనవారే గ్రంథకర్తలైతే, వారే పత్రికా సంపాదకులైతే, వారే సంఘనాయకులైతే, వారే దేశపరిపాలకులైతే కంచుకాగడాతో వెదకినా నీతి కనబడుతుందా? నిజాయితీ కానవస్తుందా? అప్పుడే మానవత్వం సయితం పూర్తిగా లోపించదా?

పురాణాలు చేసిన, చేస్తున్న కీడు

పురాణాలలో బూతుకథలే తప్ప నీతికథలు లేనేలేవా? లేకేమి? కొన్ని వున్నాయి. అయితే, వాటి సంఖ్య బహుస్వల్పం. పైగా, వాటిలోని నీతి వ్యక్తి ముక్తికే, అతడి మోక్షానికే ప్రాధాన్య మిస్తుంది. సమిష్టి క్షేమానికి కాదు; సంఘాభివృద్ధికి కాదు. ఇంతే కాదు. ఆ కథలలోని నీతికి ఒక క్రమం లేదు, ఒక పద్ధతి లేదు, ఒక స్థాయి లేదు, ఒక ప్రమాణం లేదు. దేవతలు చేసిన పనినే మానవులు చేస్తే, అది నీతి విరుద్ధం కావచ్చు. ఋషులు నడిచిన దారినే గృహస్థులు నడిస్తే, అది నీతిబాహ్యం కావచ్చు. ఇదే రీతిగా, భూసురుల విషయంలో ఏది ధర్మమో, అన్యుల విషయంలో అది పాపకృత్యం కావచ్చు. రాజుల విషయంలో ఏది న్యాయమో ఇతరుల విషయంలో అది శిక్షార్హమైన నేరం కావచ్చు. ఇట్టి పరస్పర వైరుధ్యాలు, పరిపూర్ణ వైపరీత్యాలు పురాణాలలోని నీతికథలలో కోకొల్లలుగా వున్నాయి.

పురాణాలను ఆదిలో వ్రాసిన వారికి, అటు పిమ్మట వాటిలో మార్పులు, చేర్పులు ప్రవేశపెట్టిన వారికి ఇవి తెలియని సంగతులు కావు. కావాలనే, పనికట్టుకొనే వారు ఈ వైఖరి అవలంభించారు. ఈ ధోరణిని అనుసరించారు. వారు కోరింది వర్గన్యాయం కాదు, వర్గాధిక్యత, వారు అభిలషించింది వర్ణసమత కాదు, వర్ణాధిపత్యం. వారు లక్షించింది సంఘోన్నతి కాదు, స్వర్గసుఖం, లేదా జన్మరాహిత్యం.

స్వర్గ సుఖం మాట విడిచిపుచ్చండి, జన్మ పునర్జన్మల ప్రసక్తి విడిచి పుచ్చండి. పోతే, వర్ణాధిపత్యం. వర్గాధిక్యత - ఈ రెండు లక్ష్యాలకు సంబంధించినంత వరకు మన పురాణాల రచయితలు అఖండ విజయాన్ని సాధించారు. అన్యదేశాలలో, అన్యసంఘాలలో వర్ణాధిపత్యాన్ని, వర్గాధిక్యతను కాపాడుకొనడానికి తరచుగా బలప్రయోగం చేయవలసివచ్చింది. ఈ దేశంలో, ఈ సంఘంలో బలప్రయోగంతో అవసరం కలిగిన ఘట్టాలు దాదాపు కానరావు. మన పురాణాలకు సంబంధించినంతవరకు - దానవులు, కిరాతులు, నిషాదులన్నవారిని లెక్కనుంచి మినహాయిస్తే, అన్యులలో ఒక్క నహుషుడు తప్ప, ఒక వేనుడు తప్ప, పౌరాణిక నీతిపై, పౌరాణిక ధర్మంపై తిరుగుబాటు చేసిన మూడవ వ్యక్తి ఈ క్షణంలో నాకు జ్ఞాపకం రావడం లేదు. ఒక వేళ నేను గుర్తుతెచ్చుకొనలేక పోతున్న వారు మరి కొందరుంటే, అట్టివారు బహుశా ఇద్దరు, ముగ్గురిని మించరు. ఎంతటి దీనస్థితికైనా, మరెంతటి హీనావస్థకైనా, ఎంతటి దురన్యాయానికైనా, మరెంతటి దుర్గతికైనా, ప్రజాబాహుళ్యాన్ని మానసికంగా ఒప్పించగల పద్ధతిని "బ్రెయిన్ వాషింగ్" అంటారు. ఈ "మెదడు ఉతుకుడు" విద్యలో ప్రావీణ్యానికి నోబెల్ బహుమానం వుంటే, దాన్ని మన పురాణాల రచయితలకే వరసగా ఇచ్చుకొంటూపోవాలి!

కనీసం ఒకటిన్నర లేదా రెండు వేల సంవత్సరాలుగా ఈ "బ్రెయిన్ వాషింగ్" క్షుణ్ణంగా జరిగివుండకపోతే, మన దేశంలో అగ్రవర్ణాలవారు, అగ్రవర్గాలవారు చేసిన - చేస్తున్న - ఘోరాన్యాయాలకు ప్రతిఘటనగా, వారు పెడుతున్న దారుణ హింసలకు ప్రతీకారంగా సాయుధ విప్లవాలు కనీసం ఒక వెయ్యి చెలరేగివుండేవి.

పురాణాలలోని నీతికథల ప్రసక్తి నుంచి కొంతదూరం వచ్చినట్టున్నాను. అందువల్ల తిరిగి వెనకకు వెడతాను. పురాణాలలోని నీతికథలలో అత్యుత్తమమైనవిగా నాల్గింటిని పేర్కొనడం కద్దు. వాటిలో మొదటిది హరిశ్చంద్రుని కథ, రెండవది నలదమయంతుల కథ, మూడవది సావిత్రీ సత్యవంతులకథ, నాల్గవది శిబిచక్రవర్తి కథ. వీటిలో రెండవ, మూడవ కథలలో ఏమి గొప్ప నీతికలదో నా మందబుద్ధికి, లేదా నా వక్రబుద్ధికి అర్థం కావడం లేదు. నలుడు అందగాడు కావచ్చు, రథాన్ని వేగంగా నడపడంలో మొనగాడు కావచ్చు, వంటలో, వార్పులో చేయి తిరిగినవాడు కావచ్చు, ఇవి కాక, అతడిలో

నాల్గవ ఘనత ఏదీ కనబడదు. ఆ కాలంనాటి తక్కిన మహీపతులకువలె అతడికి కూడా జూదం ఒక మహావ్యసనం. అన్నట్టు, వారి విషయంలో దాన్ని "జూదం" అనరాదు, "ద్యూతం" అనాలి.
ఆ వ్యసనం వల్ల అతడు కొన్ని కష్టాలు పడి, చివరికి వాటి నుంచి నలుడు ఎలాగో బయటపడ్డాడు. అతడి కష్టాలకు అతడి స్వభావం కాక, శనైశ్చర్యుడు కారణమని చెబుతా రనుకోండి. వాడి పిలకజుట్టు పట్టుకొని, శనిగాడిని లాక్కువస్తే, సమర్థించలేని వ్యసనం, లేదా ఘోరం ఏదైనా మిగులుతుందా? తాగి తందనాలాడితే, అది శనిగాడి పనే. దారినిపోయే పడతిని చెరిస్తే, అది శనిగాడిపనే, ఇరుగుపొరుగువాడితో తగవులాడి వాడిని చంపితే, తిరిగి అది శనిగాడి పనే. పురాణకర్తలు అన్ని కలహాలను నారదునికి అంటగట్టినట్లు, అన్ని దౌర్బాల్యాలను, దుశ్చర్యలను, దౌర్భాగ్యాలను శనైశ్చరుని నెత్తికి చుడతారు, మాత్రమే.

కాగా, నలదమయంతుల కథలో నీతి ఏదైనావుంటే, అది దమయంతి పాతివ్రత్యం నలునికున్న ద్యూత వ్యసనం సత్యవంతునికి లేదుగాని, అశ్వశాస్త్రంలో, పాకశాస్త్రంలో అతడికున్న ప్రావీణ్యాలు సయితం ఇతడికి లేవు. "చిత్రాశ్వుడు" అని మరొక పేరు అతనికి కలదు కాబట్టి, ఒక వేళ గుర్రపుస్వారీలో ఘను డేమో ఆ సంగతి నాకు స్పష్టంగా తెలియదు. ఏమైనా, ఇతడు వీరుడు కాదు, శూరుడు కాదు. సింహాసనాన్ని పోగొట్టుకొన్న ముసలితండ్రి పరువును కాపాడ్డానికై కత్తి పట్టడానికి బదులుగా, కట్టెలు కొట్టుకు రావడంతో ఇతడు కాలం గడుపుతాడు. ఏమైనా ఈ కథలోని నీతి సయితం తిరిగి పాతివ్రత్యమే. సత్యవంతుని ప్రాణాలను స్వయంగా లాక్కు వెళ్ళడానికి పాశం చేతపుచ్చుకొని, దున్నపోతుపై యమధర్మరాజు వేంచేయడం, ఆయనను బతిమలాడి సావిత్రి అన భర్తను బ్రతికించుకొనడం ఇది కట్టుకథ కాకపోతే, మరి ఏది కట్టుకథ కాగలదో నాకు తెలియదు.

ప్రతి పురాణంలో, ప్రతి ధర్మశాస్త్రంలో, ప్రతి ప్రాచీన రచనలో పాతివ్రత్యానికి ఇంతగా మహత్తులను అంటగట్టడం భార్యలపై భర్తల ఆధిపత్యాన్ని కాపాడ్డానికే. భర్త జూదరి కావచ్చు, తాగుబోతు కావచ్చు, తిరుగుబోతు కావచ్చు, అతడు రోగి కావచ్చు, క్రూరుడు కావచ్చు, నీచాతి నీచుడు కావచ్చు. అయినా అతడిని ఒక దాసివలె భార్య సేవించాలి, ఒక భక్తురాలివలె పూజించాలి, కేవలం ఒక ఛాయవలె అనుసరించాలి. అతడికోసం ఏ కష్టమైనా పడాలి, ఎంతటి త్యాగమైనా చేయాలి. తనను నీచంగా చూచినా, నికృష్టంగా హింసించినా సహించాలి. సహించడమైనా చాలదు, పతివ్రతగా తన అంతస్తు పెరిగిపోతున్నదని సంతోషించాలి. ఇంతే కాదు, ఆ మానవాధముడే జన్మజన్మలకు తన పతిదేవుడు కావాలని నోములు నోయాలి, పూజలు చేయాలి, ప్రార్థనలు జరపాలి.

స్త్రీలకు సంబంధించినంత వరకు ఇది కూడా తిరిగి "బ్రెయిన్ వాషింగ్". వారి విషయంలో ఇది మరింత ఉధృతంగా జరిగింది, విస్తృతంగా జరిగింది, సంపూర్ణంగా జరిగింది. అందువల్లనే వారి స్థితిగతులు ఈ నాటికి సయితం అతి దయనీయంగా వున్నాయి. ఈ స్థితికి హిందూ స్త్రీని దిగజార్చినట్టివి ప్రధానంగా పతివ్రతా శిరోమణుల కథలే, గాథలే. నవభారత రాజ్యాంగం పురుషునితోపాటు స్త్రీకి సమాన ప్రతిపత్తిని కల్గించిన తర్వాత కూడా పాతకాలపు పతివ్రతా శిరోమణుల కథలను, గాథలను పురాణాలుగా వినిపిస్తున్నారు, హరికథలుగా చెబుతున్నారు, కావ్యాలుగా ప్రచారం చేస్తున్నారు, నాటకాలుగా ప్రదర్శిస్తున్నారు, సినిమాలుగా తెర కెక్కిస్తున్నారు, స్త్రీలలో నూటికి ఒక్కరైనా ఈ కథలను, గాథలను నిరసించకపోగా, తామే వీటిని ప్రశంసించడాన్ని చూడగా వారి విషయంలో "బ్రెయిన్ వాషింగ్" ఏ మేరకు వెళ్ళిందో మనకు కొంతవరకు బోధపడుతుంది. కేథలిక్ పీఠాధిపతులు "బ్రెయిన్ వాషింగ్"లో ప్రవీణులని చెప్పడం కద్దు. కమ్యూనిస్టులు సయితం ఈ విద్యలో ఉద్దండులని చెప్పడం కద్దు.
ఈ- ఉభయవర్గాల వారు మన పురాణకర్తల వద్ద "అ, ఆ"లు దిద్దుకోవాలి, గుణింతం నేర్చుకోవాలి. స్త్రీల విషయంలో కంటె అస్పృశ్యుల విషయంలో పురాణకర్తలు "బ్రెయిన్ వాషింగ్"ను మరింత జయప్రదంగా చేశారు. ప్రాచీన

సంఘాలన్నిటిలో ఏదో ఒక వర్గాన్ని హీనంగా చూడ్డం జరిగిన మాట నిజమే. ఉదాహరణకు, రోమన్ సంఘంలో "స్లేవ్స్" ఉండేవారు, స్పార్టన్ సంఘంలో "హీలెట్స్" ఉండేవారు, బ్రిటీష్ సంఘంలో "విలెన్స్" వుండేవారు, జర్మన్, పోలిష్, రష్యన్ సంఘాలలో "యూదీలు" ఉండేవారు, అమెరికన్ సంఘంలో "నీగ్రో" లుండేవారు. ఈనాటికైనా, అమెరికన్ నీగ్రోలు కొన్ని రాష్ట్రాలలో, ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలలో, అసమానతలకు, అవమానాలకు, అప్పుడప్పుడు అత్యాచారాలకు సయితం గురికావలసి వస్తున్నది. అయితే, ప్రపంచం మొత్తంమీదనే ఏ సంఘమూ ఎన్నడూ హిందూ సంఘం అస్పృశ్యులను చూచినంత హీనంగా, అంత హేయంగా చూడలేదు. పశువుల కంటే తక్కువగా అది వారిని చూచింది. ఇది పొరపాటు మాట. కీటకాలకంటె కూడా తక్కువగా అది వారిని చూచింది. పైగా, ఇది దాదాపు మూడు వేల సంవత్సరాలుగా సాగుతున్నది. నవభారత రాజ్యాంగం అస్పృశ్యతను అపరాధంగా ప్రకటించినా, దాన్ని పాటించే వారు నిరాఘాటంగా పాటిస్తూనే ఉన్నారు. ఇంతేకాదు. ఇటీవల, ముఖ్యంగా గత దశాబ్దిలో అస్పృశ్య సంఘం పట్ల అత్యాచారాలు పెరిగిపోయాయి. పోనుపోను తరగడానికి బదులు ఇవి మరింత పెరిగిపోతున్నాయి. అయినా, అస్పృశ్యులలో కత్తి యెత్తినవా రెందరున్నారు, కదనరంగంలో నిలిచినవా రెందరున్నారు; నీగ్రోలు హీనస్థితిలో పడింది నాలుగైదు వందల సంవత్సరాల క్రితమే. అయినా, ఆఫ్రికా ఖండంలో ఒకటి, రెండు దేశాలలో తప్ప, అమెరికా ఖండంలో బహుకొద్ది రాష్ట్రాలలో తప్ప తిరిగి వారు నేడు తలయెత్తుకొని బ్రతకగలుగుతున్నారు. మొత్తం నీగ్రోజాతి మరల స్వతంత్ర ప్రతిపత్తిని మరొక దశాబ్దం లోపలనే పొందవచ్చు. ఇందుకు భిన్నంగా మన దేశంలో జరగడం అస్పృశ్యులన్నవారికి సంఖ్యాబలం లేకపోవడం వల్ల కాదు. వారు వేలలో కాదు, లక్షలలో కాదు, కోట్లలో ఉన్నారు. అయినా, వారిలో కరుకుతనం ఎందుకు లేదు? కనీసం కన్నెర్ర చేయడం వరకైనా వారు ఎందుకు వెళ్ళలేరు? దీనికి కారణం ఇంతకుముందే నేను చెప్పినట్లు పురాణాలు చేసిన "బ్రెయిన్ వాషింగ్". పూర్వజన్మలో ఏదో ఘోరపాపాలు చేసినందువల్లనే ఇప్పుడు ఈ హీనజన్మ కలిగినదన్న నమ్మకాన్ని పురాణాలు వారికి నూరిపోశాయి. పురాణాలలోని నీతికథలలో అత్యుత్తమమైనవిగా బహుశా పేర్కొనదగు నాల్గింటిలో రెండింటి ప్రస్తావన మాత్రంచేసి, తక్కిన రెండింటి సంగతిని నేను తడవలేదు. హరిశ్చంద్రుని ప్రసక్తిని కొంతదూరం పోయిన తర్వాత విశేషంగా తెస్తాను కాబట్టి ఆయన విషయం ఇక్కడ ముచ్చటించను. పోతే, మిగిలింది శిబిచక్రవర్తి. ఈయన జీవకారుణ్యం హర్షించదగిందే. ఈయన త్యాగగరిమ సంస్తవించదగిందే. కాని, ఎన్ని శ్యేనాలబారినుంచి ఎన్ని కపోతాలను రక్షించడానికై ఈయన తన శరీరాన్ని కోసి ఇవ్వగలిగేవాడు? అది క్రూరధర్మం కావచ్చు. ఘోరధర్మమే కావచ్చు; అయినా, ఆహారం కోసం ఒక ప్రాణి మరొక దాన్ని పట్టి చంపడం ప్రకృతి ధర్మం కాదా? ఈ ప్రకృతి ధర్మాన్ని ఏ శిబిచక్రవర్తి అడ్డగలడు? ఇది అసాధ్యమని పురాణకర్తలకు తెలియకపోలేదు. అందువల్ల కపోతం శిబిచక్రవర్తి వద్దకు రావడం, ఆయనను శరణువేడడం, కపోతాన్ని భక్షించగోరిన డేగ" అయితే, నన్ను ఆకలితో చావమంటావా?" అని ప్రశ్నించడం, "చావ నక్కరలేదు, పావురం యెత్తు మాంసాన్ని నా తొడనుంచి కోసి ఇస్తానని ఆయన చెప్పడం ఈ విధంగా కథను మరింత సాగదీసిన తర్వాత, పురాణకర్తలు "అబ్బే! ఇది ఉత్తుత్తి నాటకం. శిబిచక్రవర్తి త్యాగగుణాన్ని పరిశీలించడానికి అగ్ని, ఇంద్రుడు పక్షుల రూపంలో వచ్చా"రని చల్లగా జారుకొన్నారు. ఏదో ఒక వెర్రిమాట చెప్పి, ఒక పిచ్చి వ్రాత వ్రాసి, ఏ దేవుళ్ళనో, ఏ దయ్యాలనో ప్రవేశపెట్టి, తమను తాము సమర్ధించు కొనడంలో మన పురాణకర్తలు ప్రదర్శించే చాకచక్యం ఇంతంత కాదు!

ఏమైనా, ఇక్కడ మరొక్క విషయం చెప్పి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. పురాణాలు చేసిన చేస్తున్న - "బ్రెయిన్ వాషింగ్" నుంచి ఇప్పటికైనా మనం బయటపడలేకపోతే, ఇప్పటి అజ్ఞానంలోనే, ఇప్పటి అంధకారంలోనే, ఇప్పటి అధోగతిలోనే మన దేశం మిగిలిపోతుంది. పురాణాలు స్వర్గద్వారాలను మనకోసం తెరవడం శుద్ధాబద్ధం; అవి మనను ప్రతీపశక్తుల కారాగారంలో బంధించడం పరిపూర్ణసత్యం.

ముగ్గురు హరిశ్చంద్రులు

మనకు సుపరిచితుడైన సత్యహరిశ్చంద్రుడు. ఈయనతో పాటు అసత్యహరిశ్చంద్రుడు మరొకడున్నాడు. వీరిద్దరికి జతగావున్న మూడవ హరిశ్చంద్రుడు - రాజర్షి హరిశ్చంద్రుడు. ఈ ముగ్గురు హరిశ్చంద్రుల ప్రసక్తి కానవచ్చే ప్రాచీన గ్రంథాలలో ఇవి కొన్ని; ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, మార్కండేయ పురాణం, పద్మపురాణం, వాయుపురాణం, శివపురాణం, భాగవతం, దేవీ భాగవతం. వీటిలో ఏయే గ్రంథాలలో, ఏయే హరిశ్చంద్రుడు, ఏయే రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడో ఆ వివరాలలోకి నేను వెళ్ళబోవడం లేదు. కాగా, ఇక్కడ నేను చెప్పగోరుతున్నది మార్కండేయ పురాణంలోని గాథకే అధిక ప్రాధాన్యం లభించిందని, ఈయనే సత్యహరిశ్చంద్రుడని.

మార్కండేయ పురాణంలోని గాథను ఆధారంగా చేసుకొని, క్రీస్తుశకం పది, లేదా పదకొండవ శతాబ్దిలో క్షేమేంద్రుడు “చండకౌశిక” నాటకం సంస్కృతంలో వ్రాశాడు. అటు పిమ్మట ప్రతి భారతీయ భాషలో హరిశ్చంద్రుడు గురించి జానపదగేయాలు, యక్షగానాలు, కావ్యాలు, నాటకాలు మొదలైనవి లెక్కలేనన్ని వెలువడినాయి. మన తెలుగుకు సంబంధించినంతవరకు పదిహేనవ శతాబ్దికి చెందిన గౌరన “హరిశ్చంద్రోపాఖ్యానం” అనే ద్విపదకావ్యం వ్రాశాడు. పదిహేడవ శతాబ్దికి చెందిన రామరాజభూషణుడు "హరిశ్చంద్ర నలోపాఖ్యానం” అనే ద్వ్యర్థి కావ్యం రచించాడు. పందొమ్మిదవ శతాబ్దికి చెందిన శంకర కవి "హరిశ్చంద్రోపాఖ్యానం” అనే పద్యకావ్యం ప్రచురించాడు. పోతే, తెలుగులో హరిశ్చంద్రుని గురించి వెలువడిన మొట్టమొదటి నాటకం కందుకూరి వీరేశలింగం వ్రాసినట్టిది. అంతకు కొన్నేళ్ళకు ముందుగానే వ్రాసినా, దాని ప్రచురణ 1899లో, నాటి నుంచి 1929 వరకు ('ఆంధ్ర వాఙ్మయ సూచిక” వివరణ ప్రకారం) తెలుగులో వచ్చిన హరిశ్చంద్ర నాటకాల సంఖ్య 26. తర్వాత మరెన్ని వచ్చినవో నాకు తెలియదు. ఈ నాటకాలన్నింటిలో ఎక్కువ ప్రసిద్ధి పొందినట్టిది బలిజేపల్లి లక్ష్మీకాంతం రచన. ఇన్ని నాటకాల రూపంలోనే కాక, హరిశ్చంద్రుని గాథ తెలుగులో యక్షగానంగా వచ్చింది. హరికథగా వచ్చింది, వచన కావ్యంగా వచ్చింది; మత గ్రంథంగా వచ్చింది. ఇట్టి అవతారాలను మరి కొన్నింటిని కూడా అది ఎత్తివుండాలి. హరిశ్చంద్ర నాటకకర్తలలో కొత్త దారి తొక్కిన ఘనత విశ్వనాథ సత్యనారాయణదని చెప్పాలి. ఐతరేయ బ్రాహ్మణంలోని, మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్ర గాథలను ఆయన రెండు విడివిడి నాటకాలుగా వ్రాసి “కావ్య-వేద హరిశ్చంద్ర నాటకములు” అనే పేరుతో ఒకే సంపుటిగా ప్రచురించాడు.

ఐతరేయ బ్రాహ్మణంలో మనకు దర్శన మిస్తాడు కాబట్టి ముగ్గురు హరిశ్చంద్రులలో అతి ప్రాచీనుడు సత్య హరిశ్చంద్రుడు కాదు, అసత్య హరిశ్చంద్రుడే. ఒకరి తర్వాత మరొకరినో, లేక జట్లు జట్లుగానో ఆ వైనం మనకు తెలియదుగాని, ఆయన నూర్గురిని కట్టుకొన్నా, ఒకర్తుక కడుపైనా పండలేదు. అందుమీదట నారదుని హితోపదేశం ప్రకారం” నాకొక పుత్రుని ప్రసాదిస్తే, వాడిని యజ్ఞపశువును చేసి, నీకు ప్రీతిని కూర్చుతా” నని వరుణదేవునికి హరిశ్చంద్రుడు మొక్కుకొంటాడు. వరుణదేవుని కృపవల్ల ఆయనకు పుత్రసంతానం కలుగుతుంది. ఆ బాలునికి “రోహితుడు' అని పేరు పెడతాడు. లేక లేక కలిగిన కొడుకుని, ఏ తండ్రి బలి పెట్టగలడు? అందువల్ల ఎప్పటికప్పుడు ఏదో సాకు చెప్పి, తన వాగ్దాన పరిపాలనలో హరిశ్చంద్రుడు విలంబనం చేస్తాడు, కొంత ఊహ తెలియగానే తనను ఎక్కడ యజ్ఞపశువును చేస్తారో అని భయపడి, రోహితుడు అరణ్యాలకు పారిపోతాడు. కొన్ని సంవత్సరాలు ఈ విధంగా గడిచిపోతాయి. ఇది వరుణదేవునికి ఆగ్రహ కారణం కాగా, హరిశ్చంద్రునికి జలోదర వ్యాధిని కలిగిస్తాడు. తండ్రి రుగ్మత వార్తవిన్న రోహితుడు యజ్ఞపశువు కావడానికి సన్నద్ధపడగా, ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి, అతడిని వారిస్తాడు. ఇందువల్ల మరో ఆరేళ్ళు దొర్లిపోతాయి.
అంతట రోహితుడు తన స్థానంలో యజ్ఞపశువునుచేయడానికి “అజీగరుడు" అనే పేద బ్రాహ్మణుని ముగ్గురు కొడుకులలో రెండవ వాడిని "శునశ్శేపుడు” అనే వాడిని నూరు ఆవులిచ్చి కొంటాడు. క్షత్రియునికంటె బ్రాహ్మణుడు అధికుడు కాబట్టి,

శునశ్శేపుని బలిగొనడానికి వరుణుడు సమ్మతిస్తాడు. అందుపై నరమేధానికి సర్వసన్నాహాలు జరుగుతాయి. అయితే, శునశ్శేపుని యూపస్తంభానికి కట్టడానికి ఒక్కరైనా ముందుకు రారు. మరొక నూరు గోవులను పుచ్చుకొని, శిరశ్ఛేదనం. అన్యులెవ్వరు అందుకు సమ్మతించకపోగా, "నాకు ఇంకొక వంద ఆవుల నివ్వండి. మిగిలిన ఆ కాస్తపనిని కూడా నేనే చేస్తా" నని అజీగర్తుడు కసాయి కత్తితో లేస్తాడు. ఈ ఘట్టంలో శునశ్శేపుడు వేదమంత్రాలను చదివి, వివిధ దేవతలను ప్రార్థించగా, అతడికి యూపస్తంభం నుంచి విముక్తి, లభిస్తుంది, హరిశ్చంద్రునికి ఆరోగ్యం లభిస్తుంది.

నరమేధానికి ఏ ఋషికీ ఏ విధమైన అభ్యంతరం వుండేది కాదు. గోదానాలను, భూదానాలను, సువర్ణదానాలను, ఇతర దానాలను పుష్కలంగా స్వీకరించి, నరమేధాన్ని వారు స్వయంగా జరిపించేవారు. శునశ్శేపుని యజ్ఞపశువును చేయబోయినప్పుడు విశ్వామిత్రుడు హోత, జమదగ్ని అధ్వరుడు, వసిష్ఠుడు బ్రహ్మ, ఆయాస్యుడు ఉద్గాత. ఈ నలుగురిలో విశ్వామిత్రుడు కొంతనయం అజీగర్తుని ప్రవర్తనపట్ల జుగుప్స కలిగిందో లేక శునశ్శేపుని పట్ల జాలి కలిగిందో మనకు తెలియదుగాని, యూప స్తంభం నుంచి బంధవిముక్తి పొందిన శునశ్శేపుని తన కుమారునిగా స్వీకరిస్తాడు. ఇందుకు విశ్వామిత్రుని నూటొక్కమంది కొడుకులలో పెద్దవారు యాభై మంది తండ్రిని వ్యతిరేకిస్తారు. వారిపై ఆగ్రహపడి, ఆర్యావర్తనానికి వెలుపల హీనంగా, హేయంగా జీవించవలసిందిగా వారిని ఆయన శపిస్తాడు. కాగా, విశ్వామిత్రుని పుత్రులలో మధ్యముడైన మధుచ్ఛందుడు, అతడి యాభైమంది తమ్ములు తమ అన్నగా శునశ్శేపుని గుర్తిస్తారు. ఈ గుర్తింపు తర్వాత శునశ్శేపుని పేరు "దేవరాతడు"గా మారుతుంది.

ఇది ఐతరేయ బ్రాహ్మణంలోని గాధ. రామాయణంలో, భాగవతంలో ఇది కొంత భిన్నంగా ఉన్నది. ఆ విషయాన్ని వివరంగా చర్చించక, ఇక్కడ రెండు, మూడు ముఖ్యాంశాలను మాత్రం పేర్కొంటాను.

విశ్వామిత్రుడు శపించిన కుమారులలో ఒకరి సంతతివారే ఆంధ్రులు. రామాయణ, భారతాల ప్రకారం విశ్వామిత్రుని శాపం "మీరు దస్యులు కండి! కుక్క మాంసం తినండి" అని. అయినా, "ఐతరేయ బ్రాహ్మణంలో మా ప్రసక్తి ఉన్నది" అని ఆంధ్రులలో కొందరు ఎందుకు గొప్పలకు పోతారో నాకు అర్థంకాని విషయం. తమ గొప్పతనం తమ ప్రాచీనతలో ఉన్నదా? లేక దస్యులుగా బ్రతుకుతూ, కుక్క మాంసం తినడంలో వున్నదా? ఏమైనా, ఈ విషయంలో గొప్పలకు పోవడం "మతిలేనిపని"గా భావించినందువల్లనే కావచ్చు, "వేద హరిశ్చంద్ర" నాటకంలో విశ్వనాధ అసలు విశ్వామిత్రుని శాపం ప్రసక్తినే విడిచిపెట్టడం జరిగింది.

పోతే ఒకప్పుడు మనదేశంలో నరమేధం సర్వసామాన్యమున్న సూచన ఐతరేయ బ్రాహ్మణ గాధలో వున్నది. ఈ పుణ్యభూమిలో సోదర మానవుని యజ్ఞపశువును చేయడం వేదకాలంలో నిలిచిపోలేదు. మధ్యయుగంలో ఇది కొనసాగింది, ఆధునిక యుగంలో సయితం అప్పుడప్పుడు - అక్క దక్కడ చాటుమాటుగా కొనసాగుతున్నది. విష్ణుకుండినుల వంశానికి చెందిన విక్రమేంద్రవర్మ క్రీస్తుశకం ఆరవ శతాబ్దిలో చెక్కించుకొన్న ఒక శిలాశాసనంలో తాను పురుషమేధం జరిపించినట్టు సగర్వంగా చెప్పుకొన్నాడు. ఈ విషయమై మీకు సందేహం ఉంటే కుందుర్తి ఈశ్వరదత్తు కూర్చిన "శాసన శబ్దమంజరి"లోని 193వ పుటను ఒకసారి చూడండి. నిజానికి పధ్నాలుగు శతాబ్దాలు వెనకకు వెళ్లనక్కర లేదు. ఆధ్యాత్మిక సంపద అపారంగావున్న ఈ పవిత్రభూమిలో గుప్తనిధుల కోసం, పుత్ర సంతానం కోసం, శత్రునాశం కోసం, అలౌకిక శక్తులకోసం ఈనాటికీ నరబలిని చేసేవారు చేయడం లేదా?
అన్నట్టు బ్రిటీష్ వారు జోక్యం కలిగించుకొని, దాన్ని నిలిపివేయించిన తర్వాతనే ఆదివాసులలో నరబలి నిలిచిపోయింది. ఒక యువకుని బలి పెట్టకపోతే, పంటలు సరిగా పండవన్న నమ్మకం వారిలో ఉండేది. ఆ యువకుడు బ్రాహ్మణుడైతే,

పంటలు సమృద్ధిగా పండగలవని కూడా వారు నమ్మేవారు. "విధిగా ఒక మనిషినే నరక నక్కరలేదు; కోడినో, గొర్రెనో నరికితే సరిపోతుంది" అని వారికి నచ్చజెప్పడానికి బ్రిటీష్ వారు చాలా శ్రమపడవలసి వచ్చింది!

తిరిగి వెనకకు వెళ్ళి, మనం వేసుకొనవలసిన ప్రశ్నలు కొన్ని వున్నాయి. నారదుని హితవచనం ప్రకారం హరిశ్చంద్రుడు చేసింది బుద్ధిహీనమైన పని కాదా? నూర్గురు భార్యలున్నవాడు, ఒక్కొక్క భార్యకు కనీసం ఒక బిడ్డ చొప్పున, నూర్గురు బిడ్డలను కోరుకొనవచ్చుగదా? తనబోటి చక్రవర్తికి నూర్గురు బిడ్డలను పోషించడం భారం కాదుగదా? నూర్గురు కాకపోతే, యాభైమందిని, పాతికమందిని, కనీసం పదిమందిని కోరుకొనవచ్చు గదా? అప్పుడు వారిలో ఒక పుత్రుని బలియిచ్చినా (అదెంతటి అమానుష కృత్యమైనా) తక్కిన బిడ్డలు మిగిలేవారు కాదా? పుట్టిన వెంటనే బలి పెట్టగలనన్న వాగ్దానంతో ఒకే ఒక పుత్రుని ఎందుకు కోరుకోవాలి? తాను నపుంసకుడను కానని నిరూపించుకొనడానికా? లేక పున్నామ నరకాన్ని తప్పించుకొనడానికా? పుట్టిన వెంటనే వాడిని బలి పెట్టినా, ఒక కొడుకు పుడితే పున్నామనరకం తప్పగలదని ఏ శాస్త్రంలోనైనా వ్రాసి పెట్టివున్నదా? లేక, నారదుడు ఆ తప్పుడు మాటను తన చెవిలో ఊదినాడా? పురాణాల కథనం ప్రకారం నారదుడు బ్రహ్మ తొడనుంచి పుట్టినవాడు. అతడిది ఇంత వక్రమైన జన్మ అయినందువల్లనే కావచ్చు, అతడు ఏమి చెప్పినా, ఏది చేసినా అది వక్రంగానే వుంటుంది. కలహాలను పెట్టడంలో, వాటిని పెంచడంలో అతడికి అతడే సాటి. అందువల్లనే అతడి బిరుదనామం "కలహభోజను"డని. తాము అల్లుతున్న కథ ఎక్కడ కాస్త చిక్కుపడినా, దాన్ని విప్పడానికి పురాణకర్తలకు నారదుడు ఎంతగానో వినియోగపడతాడు. పైగా ఏ వాహనం లేకుండానే ముల్లోకాలలో సంచరించగల దిట్ట కాబట్టి పురాణాల రచయితలు "ఓ" అంటే, మరుక్షణంలోనే "కో" అంటూ నారదుడు వారిముందుకు వచ్చి నిలబడతాడు!

ఏమైనా, నేను హర్షించేది, గౌరవించేది ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుడినే! లేకలేక కలిగిన కొడుకును చేతులారా ఏ తండ్రి బలి యివ్వగలడు? మాట తప్పినందుకు తనకు నరకం తప్పకపోయినా కుమారుని బలి పెట్టడానికి నిరాకరించేవాడే నిజమైన తండ్రి. అట్టి తండ్రి వలెనే ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుడు సంచరించాడు. వరుణుడు ఎన్నిసార్లు వచ్చి, "నీ వాగ్దానాన్ని పరిపాలించ వేమి?" అని నిగ్గదీసినా, "ఇదుగో! అదుగో," అని వాయిదాలు వేస్తూ పోయాడు. ఒక్కొక్కసారికి ఒక్కొక్క కొత్తసాకును వెతుకుతూ పోయాడు. కోపగించిన, వరుణుడు తనకు జలోదర వ్యాధిని కలిగించగా, ఆ బాధను సహించాడు. అంతే తప్ప, రాజభటులను పంపి, లేదా సైనిక దళాలను పంపి, కుమారుని పట్టించడానికి ప్రయత్నించలేదు. తన కుమారుడు నాలుగు కాలాలపాటు బ్రతికితే జలోదర రూపంలో తాను నరకయాతన అనుభవించడానికి సన్నద్ధపడ్డాడు. ఇంతేకాదు, అనృత దోషానికి నరకానికి వెళ్ళవలసి వచ్చినా, అందుకు వెనుదీసేవాడు కాదు.

ఈ హరిశ్చంద్రుని విషయంలో నేను మెచ్చలేని విషయం ఒక్కటే. అది తన పుత్రునికి బదులుగా శునశ్శేపుని బలిపెట్టడానికి సమ్మతించడం. ఈ ప్రతిపాదన తనది కాకపోవచ్చు. దీన్ని చేసినవాడు రోహితుడు కావచ్చు. అయినా, శునశ్శేపునికైనా తన ప్రాణాలపై తనకు తీపి వుండదా? అతడి తండ్రి దారిద్ర్యాన్ని, అతడి తండ్రి కర్కశ హృదయాన్ని అవకాశంగా తీసుకొని, శునశ్శేపుని యజ్ఞపశువును చేయడానికి హరిశ్చంద్రుడు సమ్మతించి ఉండవలసింది కాదు. ఇందుకు మారుగా జలోదరంతో చనిపోవడానికి, నరకానికి వెళ్ళడానికి సన్నద్ధపడితే, అతడు తన మానవతను, తన మహనీయతను మరింతగా నిరూపించుకొనగలిగేవాడు. హరిశ్చంద్రుడు కానివ్వండి, మరొకడు కానివ్వండి. అసత్యదోషం, నరహత్య దోషం - ఈ రెండింటిలో ఒకదాన్ని కోరుకొనవలసివస్తే, నిస్సందేహంగా మొదటి దోషాన్నే కోరుకుతీరాలి.

ఐతరేయ బ్రాహ్మణంలోని హరిశ్చంద్రుని ప్రవర్తనకు పూర్తిగా భిన్నమైనట్టిది మార్కండేయ పురాణంలోని, ఇతర పురాణాలలోని హరిశ్చంద్రుని ప్రవర్తన. ఈయనకు కావలసింది తనకు ముక్తి, తనకు మోక్షం, తనకు స్వర్గం, తనకు

శాంతి, తనకు సౌఖ్యం. పైగా, ఈయనలో సత్యంపట్ల, భక్తికంటె శాపంపట్ల భయం హెచ్చు. విశ్వామిత్రుడు అన్యాయంగా, అధర్మంగా వ్యవహరిస్తున్నాడని ఈయనకు తెలుసు. క్రూరంగా, కర్కశంగా సంచరిస్తున్నాడని ఈయనకు తెలుసు. అయినా, విశ్వామిత్రుడు ఏమి కోరినా "చిత్తం, స్వామీ!" అంటాడే తప్ప, ఎదురు చెప్పడు. విశ్వామిత్రుని చూస్తేనే ఈయనకు వణుకు పుడుతుంది. ముచ్చెమటలు పోస్తాయి, నోటమాట పెగలడమైనా కష్టమైపోతుంది. పిరికితనానికి ఈయన పెట్టింది పేరు. "నా నొసటి వ్రాత" అని విలపించడం మాత్రమే ఈయనకు చేతనైన తెలిసిన విద్య. పురాణాల ద్వారా "బ్రెయిన్ వాషింగ్" జరగనివారికి ఈయన సత్యవ్రతుడుగా కాక, శాపభయస్థునివలె గోచరిస్తాడు. నాది హేతువాదం, భౌతిక దృష్టి, నాస్తికమతం. ఈ కారణాన ఆస్తికులైనవారు నా తీర్పును త్రోసిపుచ్చవచ్చు. కాని, సంస్కృత భాషలో, వాఙ్మయంలో మహాపండితుడైన 'హెరిట్స్ ఎంటర్ నిట్స్' తీర్పుని సయితం త్రోసిపుచ్చడం సమంజసం కాగలదా? నే నిప్పుడు చెబుతున్న తీర్పు కొన్ని దశాబ్దాల క్రితం ఆయన చెప్పినట్టిదే.

నా నాటకంలో నేను మరొక అడుగు ముందుకు వేసి, విశ్వామిత్రుడైనా, వసిష్ఠుడైనా, పురోహిత వర్గానికి చెందిన వారెవరైనా, తరతరాలుగా - యుగయుగాలుగా - రాజులను తమ గుప్పిటిలో పెట్టుకొని, ప్రజలను దోచుకు తింటున్నట్టివారని చెప్పడానికి ప్రయత్నించాను. దీని ప్రచురణ ఇప్పుడు జరుగుతున్నా, ఈ నాటకరచన 1965 ప్రాంతంలో జరిగింది. అప్పటిలో ఒకసారి దీన్ని నా మిత్రుడు బందా కనకలింగేశ్వరరావుకు చదివి వినిపించాను. హరిశ్చంద్రనాటకంలో నాయకపాత్రను ఆయన కొన్ని వందలసార్లు ధరించివుండాలి. ఆయనకు విశేషఖ్యాతి తెచ్చిన పాత్రలలో అదొకటి. అందువల్ల నా నాటకంలోని హరిశ్చంద్రపాత్ర ఆయనకు ఎంతమాత్రం మనస్కరించక పోవచ్చునని నేను అనుమానించాను. కాని, దాన్ని ఆయన మెచ్చుకొన్నాడు. ఆయన నటుడు మాత్రమే కాదు, న్యాయవాదికూడా. నా నాటకంలో హరిశ్చంద్రునికి యమధర్మరాజు వేసిన ప్రశ్నలు అతి సమంజసమైనవిగా ఆయన భావించాడు. అయితే, ఒక మార్పును ఆయన సూచించాడు. తన కపటనటనకు వసిష్ఠుడు పశ్చాత్తాపపడి, హరిశ్చంద్రుని క్షమాపణ కోరినట్టుగా చివరిలో కొన్ని మాటలను కలపడమే ఆయన సూచించిన మార్పు. పురోహితవర్గంలో మార్పు రాదు! రాబోదు. ఏ మాత్రం మారినా, ఆ వర్గం ఆధిక్యత పోతుంది, అధికారం పోతుంది, ఆదాయం పోతుంది. ఆ వర్గాన్ని గురించి తండ్రికున్న భ్రమలు తొలగితే, కొడుకు భ్రమలలో చిక్కుకొనడం సర్వసాధారణంగా జరుగుతోంది. అందువల్లనే పురోహితవర్గం ప్రాబల్యం ఈనాటికీ తగ్గలేదు. నిజానికి ఈ వర్గం ప్రాబల్యం ఈ మధ్య మరింత పెరుగుతున్నది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొన్నందునే నా మిత్రుడు సూచించిన మార్పుకు నేను సమ్మతించలేదు.

ఇప్పుడిక రాజర్షి హరిశ్చంద్రుని గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తాను. ఈయన ప్రసక్తి మన తెలుగు నాటకాలలో (నేను చూచిన వాటిలో) రాలేదు. అయితే, మార్కండేయ పురాణం సమేతంగా పెక్కింటిలో ఇది వున్నది. శ్మశానవాటికలో హరిశ్చంద్రుడు తన భార్య తలను నరకడానికై కత్తియెత్తినంతనే యమధర్మరాజు సమేతంగా ఆకాశంనుంచి ఊడిపడిన దేవేంద్రుడు, కోసల చక్రవర్తి సత్యసంధతను మెచ్చుకొని, ఆయనను స్వర్గానికి ఆహ్వానిస్తాడు. అంతట "నా ప్రజలందరు నా వెంట రానిదే నేను స్వర్గానికి రాలేను." అని హరిశ్చంద్రుడు స్పష్టం చేస్తాడు. (కేవలం తన ముక్తికే, తన మోక్షాన్నే హరిశ్చంద్రుడు కాంక్షించినా డన్న విమర్శకు విరుగుడుగా పురాణకర్తలు అతి తెలివిగా ఇక్కడ ఈ మాటలు దూర్చారు!) ముందు ఏవో కొన్ని అభ్యంతరాలను చెప్పినా చివరికి దేవేంద్రుడు హరిశ్చంద్రుని కోర్కెకు సమ్మతించి, కోసలరాజ్య ప్రజలందరిని కోటి రథాలలో ఎక్కించుకు వెడతాడు. కుమారునికి పట్టాభిషేకం చేసి, హరిశ్చంద్రుడు సయితం దేవలోకానికి చేరతాడు. అయితే మెదడన్న పదార్థం మాత్రం వున్నవానికైనా ఇక్కడ ఒక చిన్న సందేహం కలగాలి.
కోసల ప్రజలందరు స్వర్గానికి వేంచేసిన తర్వాత హరిశ్చంద్రుని కుమారుడు ఎవరిని పరిపాలించాడు? చెట్లను, చేమలనా? లేక పక్షులను, జంతువులనా? పురాణాల విషయంలో ఏది వింత కాదు, విపరీతం కాదు, విడ్డూరం కాదు. అయినా, మరొక

విషయాన్ని చిత్తగించండి. కావాలని నారదుడు ఉబ్బవేయగా, హరిశ్చంద్రుడు ఒక ఘట్టంలో తాను రాజర్షినని గర్వపడతాడు. ఇందుకు కినిసి ఆయన ప్రజ లందరితో పాటు ఆయనను కూడా స్వర్గం నుంచి దేవేంద్రుడు కిందికి తోసిపారవేస్తాడు. వారు కిందికి పడుతుండగా హరిశ్చంద్రుడు తన తప్పిదాన్ని మన్నించవలసిందిగా దేవేంద్రుని వేడుకొంటాడు. అంతటితో దేవేంద్రుని కోపం చల్లారినా, తిరిగి వారికి స్వర్గంలో ప్రవేశాన్ని కల్పించడు. "హరిశ్చంద్రనగరం" అనే పేరుతో రోదసిలో ఒక నగరాన్ని సృష్టించి, అక్కడ నివసించవలసిందిగా ఆదేశిస్తాడు. అందువల్ల తండ్రి త్రిశంకునివలె కుమారుడు హరిశ్చంద్రుడు సయితం అటు స్వర్గంలో కాక, ఇటు భూతలంపై కాక, శూన్యంలో కాలక్షేపం చేస్తున్నాడు. నావంటి నాస్తికునికి ఎంత వెతికినా కనబడదుగాని, ఆస్తికులకు త్రిశంకు స్వర్గంవలె హరిశ్చంద్రనగరం కూడా స్పష్టంగా కనబడుతోనే వుంటుంది నా బోటివారివి చర్మనేత్రాలు కాగా, వారివేమో జ్ఞానచక్షువులు!

ఈ హరిశ్చంద్రగాథలను ఇంత దీర్ఘంగా నేను చర్చించడం హరిశ్చంద్రుడు చారిత్రక వ్యక్తి అనే నమ్మకంతో కాదు, ఈ గాధలలో పరస్పర వైరుధ్యాలు ఎన్ని - ఏ మేరకు కలవో చూపించడంకోసమే. ఒకే పాత్రకు విభిన్న నామాలవరకు ఈ వైరుధ్యాలు వెళ్ళాయి. ఐతరేయ బ్రాహ్మణంలో హరిశ్చంద్రుని కుమారుని పేరు రోహితుడు, పురాణాలలో అతడి పేరు రోహితాస్యుడు, సంస్కృత నిఘంటువులలో రోహితాశ్వుడు, తెలుగు కావ్యాలలో, నాటకాలలో లోహితాస్యుడు. ఇంతకు మించిన వైరుధ్యాలు హరిశ్చంద్రుని భార్య పేరులో వున్నాయి. ఆయన నూర్గురు భార్యలలో ఒకరి పేరునైనా ఐతరేయ బ్రాహ్మణం చెప్పలేదు. పోతే, మార్కండేయ పురాణంలో ఆయన భార్య శైబ్య, శివపురాణంలో ఆమె పేరు సత్యవతి, మహాభారతంలో ఆమె పేరు ఔశీనరి. గౌరన ద్విపద కావ్యంలో, తెలుగు నాటకాలలో ఆమె పేరు చంద్రమతి. ఈ ప్రబుద్ధులు హరిశ్చంద్రుని పేరును కూడా ఈ విధంగా మార్చివుంటే, మరింత సొగసుగా వుండేది. తండ్రి పేరును మార్చకపోయినా, కుమారుని పేరుతో పాటు వయసునుకూడా మార్చారు. ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం నరమేధ ప్రయత్నం నాటికి అతడి వయసు ఇరవై సంవత్సరాలు దాటి వుండాలి. పురాణాలలో మాత్రం అతడిని బాలుడిగా పేర్కొంటారు. మన తెలుగునాటకాలలో కూడా అతడు బాలాకుమారుడే!

దీని తాత్పర్యం - సత్యహరిశ్చంద్రునిలో సత్యం లేనట్టే, సత్య హరిశ్చంద్రుని గాథలో సయితం సత్యం లేదని కాదా?

ముని ముచ్చులు

మొట్టమొదటిసారిగా "మునిముచ్చులు" అనే మాటను వాడిన వారెవరు? "మనుచరిత్ర"లో అల్లసాని పెద్దన కావచ్చునా? ఏమో, నాకు తెలియదు. ఎవరు మున్ముందుగా దాన్ని వాడినా, అది టంకంలా అతికే మాట, అక్షరాలా నిజమైన మాట. "ముచ్చు" లేదా "ముచ్చు", అనే పదానికి నిఘంటువులు చెబుతున్న అర్థం "దొంగ" అని. మునులన్నవారు - ముఖ్యంగా పురాణాలలోని మునులు - దొంగలకంటె నికృష్టమైనవారు. దొంగలు మీ వస్తువులనే దొంగిలిస్తారు, మునులు మీ ఆస్తిపాస్తులతో పాటు మీ వ్యక్తిత్వాన్ని దొంగిలిస్తారు. ఆలోచనాశక్తితో పాటు మీ ఆత్మగౌరవాన్ని హరిస్తారు. మీ స్వాతంత్ర్యాభిలాషతోపాటు మీ సమస్తాన్ని హరిస్తారు. ఇవే మాటలను కొంచెం మోటుగా చెప్పాలంటే మునిముచ్చులు మిమ్ములను చచ్చుదద్దమ్మ లుగా మార్చివేస్తారు.
మౌనం వహించేవారు మునులు కాగా, తపస్సు చేసేవారు తాపసులు. వీరిద్దరికి పెద్దన్నయ్యలు ఋషులు. "చిన్నరెడ్డి", "పెద్దరెడ్డి" అన్నట్టు, "చిన్నకమ్మ", "పెద్దకమ్మ" అన్నట్టు, ఋషులలో చిన్న పెద్ద తారతమ్యాలున్నాయి. వీరిలో కొందరు శృతర్షులు, కొందరు కాండర్షులు, కొందరు పరమరులు, కొందరు రాజర్షులు, కొందరు దేవర్షులు, కొందరు మహర్షులు కాగా, వీరిలో అత్యున్నత స్థానాన్ని అధిష్ఠించినవారు బ్రహ్మర్షులు. వీరి ప్రతిపత్తినిబట్టి వీరి పంతాలు, వీరి పట్టుదలలు, వీరి ప్రగల్భాలు, వీరి పటాటోపం, వీరి ప్రతీకార వాంఛలు పెరుగుతూపోతాయి. , ఇదే ప్రకారం, వీరి స్థాయినిబట్టి వీరిలోని స్వార్థం, సంకుచితత్వం, నైచ్యం, నీతిమాలినతనం, క్రోధం, క్రౌర్యం, కపటం మొదలైన సకల దుర్లక్షణాలు పెరుగుతూ పోతాయి. పురాణాలలో మనకు తరచు తారసిల్లే ఋషులు వసిష్టుడు, విశ్వామిత్రుడు, పరాశరుడు, వేదవ్యాసుడు, భృగుడు, గౌతముడు, జమదగ్ని, భరద్వాజుడు, నారదుడు, దుర్వాసుడు. ఇట్టివారు మరి కొందరున్నా, వారందరినీ ఇక్కడ పేర్కొన నక్కరలేదు. కాగా, ఇక్కడ చెప్పవలసింది ఇవి వ్యక్తుల నామాలు కావని, వీటిలో అనేకం వంశాల నామాలని, ఋషులన్నవారిలో ఒక అమ్మకు, ఒక అబ్బకు పుట్టినవారు బహుతక్కువ. ఇంతే కాదు. నవమాసాల తర్వాత ప్రకృతిసిద్ధంగా జన్మించినవారు మరింత తక్కువ. వీరి ఘనతకు ప్రధానకారణం ఇదే కావచ్చు. అయినా, వీరు తమ వంశాలకు మూలపురుషులని కొందరు సగర్వంగా ఎందుకు చెప్పుకొంటారో నాకు అర్థంకాని విషయం.

ఏమైనా, ఇక్కడ నేను వివరించగోరుతున్న విషయం - వసిష్ఠ - విశ్వామిత్రాది నామాలు వ్యక్తులను కాక, వంశాలను పురోహిత వంశాలను సూచిస్తాయని. కాకపోతే ఋగ్వేదకాలంనాటి వసిష్ఠ, విశ్వామిత్రులు రామాయణ కాలంవరకు జీవించారని అనుకోవలసి వస్తుంది. అన్నట్టు ఋగ్వేదంలోని ఋక్కులను వ్రాసిన ఋషులు కోరుకొన్న పూర్ణాయుర్దాయం నూరు సంవత్సరాలు మాత్రమే. సంవత్సరానికి వీరు వాడిన పదం "హేమంతం". దీన్నిబట్టి వీరు ఏదో ఒక హిమాచ్ఛాదిత ప్రాంతం నుంచి సప్తసింధు ప్రాంతానికి వలస వచ్చినట్టివారని తీర్మానించుకోవాలి. మహాపండితులలో కొందరు సరిగా ఇదే తీర్మానానికి వచ్చారు.

వ్యక్తులు వేరైనా, ఒకే వంశానికి లేదా ఒకే గోత్రానికి చెందిన ఋషులు ఒకే విధమైన పాడు బుద్ధులను చూపడం కద్దు. ఋగ్వేదకాలంలో వసిష్ఠ విశ్వామిత్ర వంశాల మధ్య ప్రారంభమైన కలహం రామాయణ కాలంవరకు సమసిపోలేదు; అటు తర్వాత కూడా ఆ చిచ్చు ఆరివుండక పోవచ్చు.

మన హరిశ్చంద్ర నాటకంలో ఆ సంగతిని విడిచి పెడతారుగాని, తన కొడుకులను చంపినాడని, తనకు రాజపోషకుడైన హరిశ్చంద్రుని నోట అబద్ధం చెప్పించం కోసం అతడిని నానా హింసలు పెట్టినాడని విశ్వామిత్రునిపై విద్వేషంతో "నీవు బకరిగా మారిపో!"అని వసిష్ఠుడు శాపం పెడతాడు. అయితే 'నీవు ఆడేలుగా మారిపో!' అని విశ్వామిత్రుడు వెనువెంటనే

ప్రతిశాపం పెడతాడు. నా వద్దగల నిఘంటువులను చూడగా, ఇవి ఏ యే పక్షులన్న సంగతి స్పష్టంగా తెలియలేదు. నాకే కాదు, మార్కండేయ పురాణాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన ఎస్.ఇ. పార్జితర కు కూడా ఇది అస్పష్ట విషయంగానే మిగిలింది. పార్టితర్ కంటే ముందుగా విష్ణుపురాణాన్ని ఆంగీకరించిన హెచ్. హెచ్. విల్సన్ సయితం ఇక్కడ తికమకపడ్డాడు. ఇవి కొంగలలో రెండు జాతులైనా కావచ్చు. ఒకటి కొంగ, మరొకటి బాతు కావచ్చు. అవి ఏవైనా, ఈ రెండు పక్షులు ఎడతెగకుండా కొన్ని వేల సంవత్సరాలపాటు (పురాణాలలో కాలప్రమాణాలు సర్వసాధారణంలో త్రుటిలోపల తృటిలో, లేదా సహస్రాబ్దాలలో వుంటాయి) హోరాహోరీగా పోరాటాన్ని సాగించగా, సమస్త విశ్వం సంచలించిపోతుంది. అంతట సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే జోక్యం కల్పించుకొని, ఆ పోరు నిలిపించి, వసిష్ఠ విశ్వామిత్రుల వారి పూర్వరూపాలను ప్రసాదిస్తాడు. అయితే, ఆయన కైనా వారి రూపాలనే తప్ప, వారి నైజాలను మార్చడం సాధ్యపడివుండదు!

ఇంతకే కాదు, ఎంతకైనా తగినవారే ఋషులంటే! బిడ్డా పాపా లేని వారెవరైనా "అయ్యా! మమ్ము కరుణించండి", అని వేడుకొన్నంతనే వారు తమ "యినుపకచ్చడాల్" విప్పివేసేవారు. వశిష్ఠుడు ఆ పని చేశాడు; వ్యాసుడు ఆ పని చేశాడు; ఇతర ఋషులు ఆ పని చేశారు. తమనుంచి సంతానభిక్ష కోరకపోయినా, కామాంధులై కచ్చడాలను విప్పిన ఋషుల లెక్కను తేల్చడం అంత తేలిక పనికాదు. ఇట్టివారిలో విశ్వామిత్రుడున్నాడు, పరాశరు దున్నాడు, దధీచి వున్నాడు. పోతే, ఏ దేవవేశ్యనో చూచినంతనే వీర్యస్థలనం జరిగిన ఋషిపుంగవుల సంఖ్య పదులతో ఆగదు, వందలను దాటిపోతుంది.

కాగా, మానభంగాలకు సయితం ఈ ఋషివృషభాలలో కొందరు వెనుదీయలేదు. వావి వరసలతో వీరికి పని లేదు; తాము కామిస్తున్న పరదార నిందుచూలాలన్న జాలి సయితం వీరికి కలగదు. అన్నభార్య మమతతో ఇంత పాశవికంగానూ బృహస్పతి ప్రవర్తించాడు. ఆమె గర్భంలోని శిశువు "ఇది నీకు తగునా?" అన్నందుకు కోపగించి, "నీవు గుడ్డివాడవు కమ్ము!" అని శపించాడు. వాడెంతటి పశుప్రాయుడైనా, దేవతల గురువు కాబట్టి, బృహస్పతి శాపం తగలనే తగిలింది. మమత కుమారుడు పుట్టు గుడ్డిగానే పుట్టాడు. అందుకే అతని పేరు దీర్ఘ తముడు.

ఋషిపత్నులలో కొందరు తమ భర్తలకంటె రెండాకులు ఎక్కువ చదివినవారే. ఉదాహరణకు బృహస్పతినే తీసుకోండి. అతడు అన్న పెండ్లాన్ని చెరచగా అతడి భార్య (ఆమె పేరు -తార). చంద్రుడిని తగులుకొంటుంది! పోతే, అహల్య వుండనే వున్నది. ఈ నారీరత్నం ఇంద్రునితో రమించి, "నా జన్మ తరించింది. మా ముసలితొక్కు తిరిగి వచ్చేవేళ సమీపిస్తున్నది; మరి త్వరగా వెళ్ళిపోండి!" అని హెచ్చరిస్తుంది.

తామెంతటి పశుప్రాయులైనా, తాము ఋషులైనందున తాము శాపం పెడితే దానికి తిరుగులేదన్న మూఢవిశ్వాసాన్ని పురాణాల ద్వారా పురోహితులమూక, పూజారులగుంపు బహుళ ప్రచారం చేసింది. ఈ ఋషులన్నవారిలో కొందరైనా చారిత్రక వ్యక్తులైతే వీరిని పోల్చవలసింది ఈనాటి రజనీష్, మహేష్ యోగి, సత్య సాయిబాబా, ధీరేంద్ర బ్రహ్మచారి వగైరా వగైరాలతో, వీరివలె వారుకూడా ప్రచార పద్ధతులలో మహా ప్రజ్ఞా నిధులు. ఆదిలో సూతుల రచనలైన పురాణాలను - కేవలం శూద్రుల కోసం, స్త్రీలకోసం ఉద్దేశించిన పురాణాలను - కాలక్రమాన వీరు సొంతం చేసుకొన్నారు. ఇందుకు బలమైన కొన్ని కారణా లున్నాయి. వాటిలో మొదటిది-గౌతమబుద్ధుని . నమ్ముకొంటే, ఆయనే మనకు రక్ష కాగలడన్న మౌఢ్యాన్ని మహాయాన బౌద్ధం ప్రచారం చేసింది. అందుమూలంగా మహాయానం ప్రజాదరణ విశేషంగా పొందినంతనే యజ్ఞయాగాదులు పూర్తిగా తగ్గిపోయి, వాటి ద్వారా పురోహితుల రాబడి తగ్గిపోయింది. అంతట పురోహితులమూకలో ఒక భాగం రామావతారం, కృష్ణావతారం మొదలైన వాటిని సృష్టించి, గుడులు కట్టి, గోపురాలు కట్టి, పూజాపురస్కారాలు దీపధూప నైవేద్యాలు, పవ్వళింపు సేవలు మున్నగు వాటిని మొదలు పెట్టి, కొత్త కొత్త రీతులలో ప్రజలను దోచుకుతినడం

మొదలు పెట్టింది. చాలా కాలంవరకు వైదిక మతావలంబులు ఈ మార్పును ఈసడించుకొన్నారు. దేవాలయాలలోని పూజారులు కసాయివారికంటె అధములని మనుధర్మశాస్త్రం వ్రాసింది. ప్రాచీనకాలానికి చెందిన మనుధర్మ శాస్త్రంలోనే కాదు, క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దికి చెందిన రాజతరంగిణిలో కూడా పూజారుల నింద వున్నది. ఒక వైపున వేదాలపట్ల, మరొక వైపున దేవాలయాలపట్ల సమానంగా భక్తి శ్రద్ధలు తమకున్నట్టు చెప్పుకొనేవారికి ఈ విషయాలు తెలియక పోవచ్చు. పూజాపురస్కారాలు, దీప ధూప నైవేద్యాలు మొదలైన వాటిని ప్రారంభించకపోతే, తమకు భుక్తి గడవదని నమ్మినంతనే సూతులను మెడపట్టి గెంటివేసి, భూసురోత్తములే పురాణకర్త లైనారు. అప్పటికే చాలాకాలంగా ప్రచారంలోగల కాకమ్మకథలలో వారు మార్పులు చేర్పులు చాలా నేర్పుగా సాగించారు. తమ వర్ణాధిక్యతను, వర్గప్రాబల్యాన్ని పరిరక్షించుకొనడానికి ఎన్నెన్నో ఫోర్జరీలు చేశారు. ఈ విద్యలో వీరికి వీరేసాటి. అతుకు కనబడకుండా పాతగుడ్డకు వీరు కొత్తగుడ్డను కుట్టగలరు. ఎట్టి గట్టి మరకలనైనా ఇట్టే చెరపివేయగలరు; చెడ్డ చెమట కంపునైనా కప్పిపుచ్చగలరు.
ఈ ఫోర్జరీ వ్యవహారం ఈనాటికీ కొనసాగుతున్నది అందువల్లనే కొత్త రామాయణాలు, కొత్త భారతాలు, కొత్త పురాణాలు. కొన్నేళ్ల క్రితం జాతీయ జ్ఞానపీఠం వారు ఒక తెలుగు రామాయణానికి, ఒక కన్నడ రామాయణానికి బహుమానా లిచ్చారు. ఈ రెండు రచనలు ఫోర్జరీలుగా పేర్కొనదగినవే. సంస్కృతమూలంలోని అనేక విషయాలను వీటి రచయితలు వదిలివేశారు. లేదా వాటికి కొత్త ముస్తాబు చేశారు. ఈ సందర్భంలో ఫోర్జరీ అనే పదాన్ని ఇన్నిసార్లు వాడినందుకు నాపై విరుచుకుపడగలవారికి తెలియకపోవచ్చుగాని, ఈ పదాన్ని నాకంటే చాలా ముందుగా సంస్కృత భాషా పాండిత్యంలో, భారతీయ వాఙ్మయ చరిత్రలో సుప్రసిద్ధుడైన మారిస్ వింటర్న్స్ వాడాడు.

పురాణాలను ఇదివరలో వ్రాసిన వారికిగానీ, ఇప్పుడు వ్రాస్తున్న వారికి గానీ జంకు లేదు, కొంకు లేదు. ఇంతే కాదు, బొంకు, రంకు అనే మాటలను వీరు వినలేదేమో అనిపిస్తుంది. ఒకవేళ విన్నా, వాటిపట్ల వీరికి రోత లేదని అనిపిస్తుంది, అవసరమైతే తమ పరమపవిత్ర గ్రంథాలను సయితం తలక్రిందులు చేసి వీరు వ్రాసివేస్తారు. ఋగ్వేదం ప్రకారం ఊర్వశితో పురూరవుడు కాపురం చేసింది నాలుగేళ్ళు మాత్రమే. అయినా, వీరిద్దరు 61వేల సంవత్సరాలు సంసారం చేసినట్టు విష్ణుపురాణంలో వ్రాశారు! ఇంతటితోనైనా వీరు ఆగలేదు. తమ పాత పురాణాలలోని సంగతులను కొత్త పురాణాలలో చిత్తం వచ్చినట్టు - చేతికి వచ్చినట్లు - మార్చి వేశారు. భాగవతపురాణం ప్రకారం మొత్తం నరకాలసంఖ్య కొన్ని వందలను, లేదా కొన్ని వేలను దాటి వెళ్ళలేదు. గరుడపురాణం వీటిని 84 లక్షల వరకు ఒక్క కలం గీతతో - కాదు, ఒక్క గంటల గీటుతో పెంచివేసింది. సిగ్గు బిడియాలు లేకుండా, చీము నెత్తురులైనా లేకుండా ఋతులను, బొంతులను వ్రాసిన - వ్రాస్తున్న పౌరాణిక గ్రంథాలను పవిత్ర గ్రంథాలుగా భావించడం కంటె అపవిత్రచర్యను ఏ కొంచెం మెదడున్న వాడైనా ఊహించగలడా? అయితే, ఇక్కడే పురాణాల గడసరితనం ఉన్నది. అవి ముమ్మందుగా దెబ్బతీసేది మెదడు పైనే. అన్యలోకాలని, అలౌకిక శక్తులని, ఆధ్యాత్మిక మహిమలని, శాపాలని వాటి శ్రాద్ధాలని ఏవేవో పిచ్చి భ్రమలను అవి కలిగిస్తాయి. వెర్రి భయాలను పుట్టిస్తాయి. బహుశా ఏ జాతి పురాణంలోనూ ఒక ఋషి దేవుని కాలెత్తి, తన్నినట్టు వ్రాసిలేదేమో! అది హిందూపురాణాలలో వున్నది. విష్ణుమూర్తి వక్షస్థలంపై భృగుడు ఒక తన్ను తన్నాడట! ఈ ఋషులను గురించి, వీరి ప్రగల్భాలను గురించి, వీరి ప్రల్లదనాలను గురించి, వీరి పటాటోపాన్ని గురించి నేను నిరసనగా వ్రాశానని ఈ మధ్యనే ఒక శుంఠ నామీద దుమ్మెత్తిపోశాడు. బహుశా వీడి నమ్మకం తాను ఋషి సంతతివాడినని, బహుశా వీడి విశ్వాసం స్వచ్ఛమైన ఆర్యరక్తం తన రక్తనాళాలలో ప్రవహిస్తున్నదని! లెక్కలోకి తీసుకొనదగినవాడు కాదు కాబట్టి ఈ శుంఠ ప్రసక్తిని నిజానికి నేను తేవలసింది కాదు కాగా, నా బాధ అత్యుక్తులకు, అసత్యాలకు, అవినీతికి, అన్యాయాలకు, అత్యాచారాలకు అడ్డమైన తప్పుడు పనులకు పరాకాష్ఠలుగా చెప్పదగు పురాణాల కారణంగా ఇంచుమించు రెండువేల సంవత్సరాల నుంచి ఒక దేశంగా, ఒక ప్రజగా, ఒక సంఘంగా మనకు ఎన్నివిధాల - ఎంతగా అపకారం జరుగుతున్నదనే! నాది భౌతికదృష్టి కావచ్చు, నేను నాస్తికుడను కావచ్చు, నేను మానవతావాదిని కావచ్చు. ఈ కారణాల వల్ల నన్ను, నా మానసిక సంక్షోభాన్ని మీరు నిర్లక్ష్యం చేయవచ్చు.

కాని, రాజా రామమోహన్ రాయ్ ని నిర్లక్ష్యం చేయగలరా? స్వామి దయానంద సరస్వతిని నిర్లక్ష్యం చేయగలరా? వారు నాస్తికులు కారు, ఆస్తికులే. ఒకవేళ వీరిద్దరిలో రామ్, బ్రహ్మ సమాజీకుడని, దయానంద్ ఆర్య సమాజీకుడని మీరు వారినీ, పురాణాల పట్ల వారి వైముఖ్యాన్ని అంతగా పట్టించుకొనకపోవచ్చు. అయితే, బాబూ గోవింద్ దాస్ మా టేమిటి? ఆయన భారతరత్న బాబూ భగవాన్ దాసు అన్న కాడా? అస్సాం, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలకు గవర్నర్ గా చేసిన శ్రీ శ్రీప్రకాశ్ కు పెదతండ్రి కాడా? హిందూ ధర్మశాస్త్రాలను దార్శనిక శాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు కాదా? హిందూ మత సంరక్షణకై (అనారోగ్యాన్ని పాటించక) కృషిచేసిన వాడు కాదా? తాను వ్రాసిన "హిందూ ఎథిక్స్" అనే గ్రంథంలో ఏయే చెరుపులను, ఎన్నెన్ని చెరుపులను, ఏయే మేరకు పురాణాలు మనకు చేస్తున్నవో ఆయన చెప్పలేదా? నీతికంటె వాటిలో బూతు ఎక్కువని ఆయన చెప్పలేదా? వాటిలోని దేవుళ్ళను, వాటిలోని ఋషులను ఆరాధ్య దైవాలుగా సంభావిస్తే ఆదర్శ పురుషులుగా సంభావిస్తే, మనజాతి అధోగతిలోనే మిగిలిపోగలదని హెచ్చరించలేదా?

అయినా, పురాణాలలోని బొంకులే, వాటిలోని బూతులే ఈనాటికీ మనకు కథలు, కావ్యాలు, నాటకాలు కావా? ఇవే సినిమాలు, ఇవే టెలివిజనులు కావా? తెలతెలవారకముందే రేడియో వీటినే ఓండ్ర పెడుతుంది; సాయం సమయాలలో వీటి పైనే ఈ బొర్ర పొట్టవాడు, లేదా, ఆ పొడుం పట్టువాడు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తారు. ఈ దౌర్భాగ్యస్థితి నుంచి బయటపడలేకపోతే మనం ఆధునిక యుగంలోకి అడుగు పెట్టగలమా?

ఈనాడు మన ప్రభుత్వ చిహ్నాలపై “సత్యమేవ జయతే” అనే సూక్తిని చెక్కుతున్నారు, ముద్రిస్తున్నారు, ఇతర విధాల మనముందు ప్రతినిత్యం దాన్ని పెడుతున్నారు. అయినా, ఈ నాటికంటె ఏనాడైనా అసత్యం మన దేశంలో ఎక్కువగా రాజ్యం చేసిందా? ఆ మాటకు వస్తే, ఏ దేశంలోనైనా - ఎక్కడైనా - ఎక్కువగా అది రాజ్యం చేసిందా? ఇందుకొక కారణం సత్యహరిశ్చంద్రుని పోలిన ఒక భీరుడు, ఒక కపటి, ఒక స్వార్థపరుడు, విలపించడంలో ఒక ఘటికుడు సత్యసంధతకు ప్రతీకగా మనదృష్టిలో చెల్లడమే!

నీతి, అవినీతి

ఒక హిరొడెటెస్ మనకులేనట్టే, ఒక అరిస్టాటిల్ కూడా మనకు లేదు. ఆయన ప్రపంచం మొత్తం మీదనే మొట్టమొదటి చరిత్రకారుడు కాగా, ఈయన మొట్టమొదటి నీతిశాస్త్ర నిర్మాత. దీని తాత్పర్యం - హిరొడెటెస్ పుట్టకముందు చరిత్ర లేదని కాదు; ఆయన ఘనత పురాణాల నుంచి చరిత్రను వేరుచేయడం; ఈయన వైశిష్ట్యం మతం నుంచి నీటిని విడదీయడం. చరిత్ర అనే ఛద్మవేషం వేసి, పురాణం మానవుని మేధాశక్తిని బలహీనపరుస్తుంది; అతడి హేతుదృష్టిని మందగింపజేస్తుంది. అతడిని వాస్తవికతకు దూరంచేసి, వెర్రిమొర్రి లోకాలలో ప్రవేశపెడుతుంది. ఇదే విధంగా కాదు, ఇంతకంటే దుష్టంగా - మతం వ్యవహరిస్తోంది, విశ్వాసం పేర అది మౌఢ్యానికి ప్రోది చేస్తుంది; ఆచారం పేర దురాచారాలను నెలకొల్పుతుంది; సంప్రదాయం పేర సద్వర్తనను చంపివేస్తుంది. దీనికంటే ముఖ్య విషయం మరొకటి వున్నది. నీతి అనే మేలిముసుగు వేసుకొని, ఆ ముసుగుకింద మతం ఎన్ని దోషాలనైనా చేస్తుంది, ఎట్టి దుష్కృత్యాలకైనా సన్నద్ధపడుతుంది, ఎంతటి దౌర్జన్యాలనైనా జరుపుతుంది. అది ఏ మతమైనా కానివ్వండి; దాని చరిత్రపుటలు కన్నీటితో తడిసి ఉంటాయి. ఆ పుటలలోని పంక్తులు నెత్తురు మరకల కారణంగా మనం చదవలేని తీరులో వుంటాయి.

హిరొడెటెస్ వలె క్రీస్తుకు పూర్వం అయిదు శతాబ్దాలనాడు కాకపోయినా, కనీసం క్రీస్తు తర్వాత ఏడవ శతాబ్దికి మన దేశంలో ఒక చరిత్రకారుడు (బాణభట్టు) ఉదయించాడు. కాని, ఈనాటికైనా ఒక అరిస్టాటిల్ మనమధ్య తలయెత్తినట్టు చెప్పలేము. సంస్కృత భాష తెలియనివాడిని కాబట్టి ఆ భాషలో పండితులైన నా మిత్రులు కొందరిని "ప్రాచీన కాలంలో, కనీసం మధ్యయుగంలోనైనా, మతం ఊసు లేకుండా, ఆత్మ, పరమాత్మల ప్రసక్తి లేకుండా, స్వర్గ నరకాలతో నిమిత్తం లేకుండా, మన దేశంలో ఎవరైనా నీతిశాస్త్రం వ్రాశారా?" అని ప్రశ్నించాను. ఇందుకు ఒక్కరు మాత్రం "వ్రాయకేమి? చాలా చాలా వ్రాశారు" అని ప్రత్యుత్తర మిచ్చారు. "అయితే, వాటిలోనుంచి ఒక నీతి సూత్రాన్ని వినిపించండి" అన్నాను. వెంటనే ఆయన ఒక శ్లోకాన్ని చదివి, దాని తాత్పర్యాన్ని కింది విధంగా నాకు చెప్పారు; "ఎప్పుడు భోజనం చేసినా కాళ్ళను, చేతులను మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి". అటుతర్వాత మడిబట్ట ప్రసక్తి వున్నదో, లేదో ఆయన నాకు చెప్పలేదు. ఏమైనా, ఇది ఆరోగ్య సూత్రం కావచ్చుగాని, నీతి సూత్రం కాగలదా? అటుతర్వాత పనికట్టుకొని భారతీయ నీతి శాస్త్రంపై ఇంగ్లీషులో గల పుస్తకాలను పెక్కింటిని చదివాను. వాటి రచయితలలో కొందరు ముఖ్యులు - గోవింద్ దాస్, సర్ పి.ఎస్. శివస్వామి అయ్యర్, జాన్ మికంజీ, సి.వి. చందవర్కార్, సుశీలకుమార మిత్ర, మనోరమ ఔహరి, సురమదాస్ గుప్త, రోడెరిక్ హింద్రే, రోలెండ్ డబ్లియు స్కాట్, మగ లాల్ ఎ.బుచ్. అయితే, ఏ పుస్తకాన్ని చదివినా, ఎవరి పుస్తకాన్ని చదివినా, దానిలో మతం నుంచి నీతిని విడగొట్టడానికి జరిగిన ప్రయత్నం స్వల్పం, దాదాపు శూన్యం. వీరిలో డాక్టర్ సురమ స్పష్టంగానే చెప్పింది - హిందూమతం నుంచి హిందూతత్త్వశాస్త్రాలను వేరుచేయలేమని. మరి కాస్త ముందుకు వెళ్ళి హిందూ మతం నుంచి హిందూ నీతిశాస్త్రాన్ని విడదీయలేమని కూడా ఈమె చెప్పి ఉండవలసింది. ఈమె "డెవలప్మెంట్ ఆఫ్ మోరల్ ఫిలాసఫీ ఇన్ ఇండియా" అనే పేరుతో వ్రాసిన పుస్తకంలో నీతి సూత్రాల చర్చ మొత్తంలో పదిశాతం కాగా మిగిలింది కర్మఫల చర్చ, పూర్వ జన్మవాసనల చర్చ. ఆ వాసనల కారణంగా హిందూసంఘంలో అశేషంగా అసమానతలు ప్రవేశించడం ఎంతో సహజమన్న, న్యాయసమ్మతమన్న చర్చ!

"నీతి" అనే పదానికి నానార్థాలున్నాయి. ప్రాపణము, పాడి, న్యాయము, ఉపాయము, రాజనీతి, సత్ప్రవర్తనము, అశ్వాదులను గురించి తెలుపు శాస్త్రము - ఇవి దానికున్న భిన్నార్థాలలో కొన్ని మాత్రమే. పోతే, ఒక్క తెలుగు వారు మాత్రం "విధము" (రీతి" అనే ప్రత్యేకార్థంలో కూడా "నీతి" అనే పదాన్ని వాడతారని "సూర్యరాయాంధ్ర నిఘంటువు" వివరిస్తున్నది. నా దృష్టిలో ఈ నిఘంటువు చేసిన ఒక పెద్ద పొరపాటు "నీతి"కి గల నానార్థాలలో శీలం అనే దాన్ని

చెప్పకపోవడం ఇంతేకాక "నీతి"కి గల "వినయం" అనే పదాన్ని కూడా ఇది వెలివేసింది. ఇందుకు ఈ నిఘంటుకర్తలకు బౌద్ధంపట్ల గల వైముఖ్యమే కారణం కాదుగదా! పంచశీల "వినయపిటకం" బౌద్ధంతో సన్నిహిత సంబంధం వున్న పదబంధాలు మరొక తెలుగు నిఘంటులో "నీతిశాస్త్రం" అనే వాటిని పర్యాయ పదాలుగా "శీలశాస్త్రం" "వినయశాస్త్రం" అనే వాటిని పేర్కొన్నారు. సద్వర్తనకు మనం ప్రస్తుతం "నీతినాయితీలు" అనే సమాసాన్ని ఎక్కువగా వాడుతున్నాము. గుణం లేనివాడిని "నీతి మాలినవాడు"గా నిరసిస్తున్నాము. అందువల్లనే ఆంగ్లేయంలో "ఎథిక్స్" అనే పదానికి ప్రత్యామ్నాయంగా "నీతి అనే దాన్ని వాడడానికి నేను నిర్ణయించుకొన్నాను.

శుక్ర చాణక్య విదురాదుల పేర నీతి శాస్త్రాలున్నాయి. అయితే, ప్రధానంగా అవి రాజనీతి శాస్త్రాలు లేదా దండనీతి శాస్త్రాలు. తన రచనలో నీతిని మించి అవినీతి హెచ్చుగా కలదని చాణుక్యునికి తెలుసు. అందువల్లనే దాన్ని ఆయన "అర్థశాస్త్ర" మన్నాడు. ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని స్థాపించగోరేవారికి దాన్ని మించిన పాఠ్యగ్రంథం బహుశా మరి దొరకదు.

ప్రాచీన కాలంలోనే మనవారు తర్క వ్యాకరణ, ధర్మ, మీమాంస, వైద్యశాస్త్రాలను వ్రాశారు. జ్యోతిష, సాముద్రిక, శకున శాస్త్రాలను వ్రాశారు. అర్థకామ మోక్ష శాస్త్రాలను వ్రాశారు. గజ అశ్వగజ శాస్త్రాలను వ్రాశారు. మరిన్ని శాస్త్రాలనో వ్రాశారు. అయినప్పుడు నీతి (శీల) శాస్త్రాన్ని ఎందుకు వ్రాయలేదు? ఇందుకు ప్రత్యుత్తరాన్ని సులభంగానే చెప్పవచ్చు. మతంనుంచి మానవుని, మానవసంఘాన్ని, మానవ జీవితాన్ని వేరు చేయడం, మనవారికి తెలియదు. అది నరబలుల మతమైనా ఏదో మతాన్ని అనుసరించనివాడు మనవారి దృష్టిలో నరుడే కాదు. అందువల్లనే మహాజుగుప్సాకరమైన "సహజ" మతాన్ని సయితం వారు మత సార్వభౌమత్వం కిందికి తెచ్చారు. అయితే, ఏ మతానికి, లేదా మతశాఖకు ఏ పేరు పెట్టినా, వారి దృష్టిలో మతమంటే కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలే. వారి విశ్వాసం ప్రకారం మతమంటే వర్ణ, కుల, శాఖాది విభేదాలే. అందువల్లనే వారు ఏ శాస్త్రాన్ని వ్రాసినా, పూర్తిగా మత దృక్పథంలోనే వ్రాశారు. అద్వైతం నిజమైతే, ద్వైతం అబద్ధం. ఈశ్వరుడు నిరాకారుడైతే, విగ్రహారాధన మహాపరాధం. బ్రహ్మచర్యంలో మహత్తువుంటే, తంత్ర విద్య గర్హనీయం. అహింస పరమధర్మమైతే, యజ్ఞ యాగాదులు అధర్మాచరణ. అయినా, వీటిలోని పరస్పర వైరుధ్యాలను హిందూమతం గుర్తించదు. "మార్గం ఏదైనా గమ్యం ఒక్కటే" అనే సూక్తిని చిలకపలుకువలె అది వల్లిస్తుంది. దానికి కావలసింది ఒక్కటి మాత్రమే. అది కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను ఆమోదించడం. కేవలం ఆమోదించడమైనా చాలదు; వాటిని ఔదల దాల్చాలి. అప్పుడు సంఘంలోని అసమానతలకు, అన్యాయాలకు, అఘాతాలకు, అమానుషత్వాలకు బాధ్యత సంఘానిదే కాదు, వ్యక్తిదే. తన అత్యున్నత స్థితివలె తన అధమాధమ స్థితికి కూడా బాధ్యత పూర్తిగా వ్యక్తిదే.

ఒకడు భూసురుడు కావడం పూర్వజన్మలో తాను చేసుకొన్న పుణ్యంవల్ల, మరొకడు ఛండాలుడు కావడం పూర్వజన్మలో తాను ఒడిగట్టుకొన్న పాపంవల్ల. ఒకడు కుబేరుడు కావడం పూర్వజన్మలో తాను సంపాదించుకొన్న పుణ్యంవల్ల. మరొకడు కటిక దరిద్రుడు కావడం పూర్వజన్మలో తాను మూటగట్టుకొన్న పాపంవల్ల. ఆరోగ్యానికి, రుగ్మతలకు ఇదే మూలం; ఖ్యాతికి, అపఖ్యాతికి ఇదే రహస్యం. కష్టాలకు, సుఖాలకు ఇదే కీలం. మతం పేరుతో మానవులను ఎందరెందరో ఎన్నో మోసాలు చేశారుగాని, ఇంతటి సూక్ష్మ బుద్ధితో మోసం చేసినవారు లేరు. ఏదో ఒక ప్రకృతి ధర్మాన్ని (ఉదాహరణకు, గురుత్వాకర్షణ శక్తిని) ఉద్ఘాటిస్తున్న ధోరణిలో మోసం చేసినవారు లేరు. తమ సూత్రాల అమోఘత్వాన్ని నిరూపించడానికి, కొన్ని పురాణాలలో, ఇతర మత గ్రంథాలలో కర్మఫలాన్ని సర్వేశ్వరుడైనా తప్పించుకొనలేడని వారు ఉద్ఘోషించారు.

వ్యక్తికి, అతడి పూర్వజన్మకు, దానిలో అతడి పాపపుణ్యాలకు ఇంత ప్రాధాన్య మిచ్చినవారు సమష్టి దృక్పథాన్ని ఎలా పెంచుకొనగలరు, సంఘ క్షేమాన్ని లక్షించి నీతిశాస్త్రాన్ని ఎలా వ్రాయగలరు? వారు వెళ్ళగలిగింది వ్యక్తికి ముక్తివరకే,

అతడికి మోక్షం వరకే, అతడికి స్వర్గ సుఖం వరకే, లేదా నరకంలో యమయాతనల వరకే. అంతటితో ఆగక, మరొక అడుగు ముందుకు వేస్తే అది కులవ్యవస్థ పరిరక్షణ వరకే.

వ్యక్తికి, కులానికి, మతానికి, ముక్తి మోక్షాలకు ఇంతగా అగ్ర ప్రాధాన్య మిచ్చినందువల్లనే హిందువులలో ఒక అరిస్టాటిల్ ఆవిర్భవించలేదు. మత ప్రసక్తి లేకుండా, సంఘదృష్టి నుంచి, సమష్టి క్షేమం దృక్పథం నుంచి అతడు ఒక నీతి శాస్త్రాన్ని రూపొందించ లేదు. బౌద్ధ, జైన మతాలు నీతి సూత్రాలకు కొంత అధిక ప్రాధాన్య మిచ్చిన మాట నిజమే. అయితే అవి కూడా ఏదో ఒక రూపంలో కర్మ సిద్ధాంతాన్ని విశ్వసించినవే, జన్మరాహిత్యాన్ని లక్షించినవే.

ఇంతవరకు నేను వ్రాసినదాన్ని బట్టి, హిందూమతంలో, దాని మత గ్రంథాలలో నీతి సూత్రాలకు స్థానం లేనే లేదని భావించరాదు. అక్కడక్కడ - అప్పుడప్పుడు - ఏవో కొన్ని నీతి సూత్రాలను హిందూమత నాయకులు ఏకరవు పెట్టకపోలేదు. పైగా, ఇట్టి సూత్రాలు ఏవో కొన్ని లేకపోతే, వర్ణాశ్రమ బద్ధమైన సాంఘిక జీవితమైనా సాధ్యపడదు. ఇంతేకాదు. చివరికి ఆటవిక సంఘాలలోనైనా "కల్లలాడరాదు" - "దొంగతనం చేయరాదు" "ఇరుగుపొరుగునాని పెండ్లాముతో పొత్తు పెట్టుకోరాదు" - ఇట్టి నీతి సూత్రాలు ఎన్నో కొన్ని వుంటాయి. వీటిని నాగరిక సంఘాలలో కంటె మిన్నగా ఆటవికులే పాటించడం కూడా కద్దు. వారిలో కొందరికి అబద్ధం చెప్పడం చేతనైనా కాదు! ఇంతకుముందు నేను అచ్చతెనుగులో చెప్పిన నీతిసూత్రాలనే హిందూమత నాయకులు "సత్యం వద" "ధర్మం చర" అని దేవభాషలో చెప్పారు. అంతమాత్రం చేత మనకు ఒక నీతి శాస్త్రం కలదని చెప్పలేము. "ఎథిక్స్ "కు సంబంధించిన పాశ్చాత్య శాస్త్రాలను పోలినవి మనకు కూడా రావాలంటే, వాటికి మతంతో, కర్మతో, జన్మపునర్జన్మలతో, స్వర్గనరకాలతో, ముక్తి మోక్షాలతో ఏమీ సంబంధం ఉండరాదు. అట్టి నీతిశాస్త్ర నిర్మాణం ఇదివరలో మనదేశంలో జరగలేదు. ఇక ముందైనా ఎంతవరకు జరుగుతుందో అనుమానమే!

మన రాజ్యాంగం మనలో ప్రతి వయోజనుని ఒక వ్యక్తిగా, ఒక పౌరునిగా గుర్తిస్తున్నది. కొన్ని ప్రాథమిక స్వత్వాలను అది మనకు సంక్రమింపజేస్తున్నది. ఇందుతోపాటు మనపట్ల, మన సంక్షేమంపట్ల ప్రభుత్వానికి కొన్ని ప్రాథమిక బాధ్యతలను నిర్దేశిస్తున్నది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటుతున్నాయి. అయినా, శాసనసభలలోనో, న్యాయస్థానాలలోనో, మేధావివర్గాల సదస్సులలోనో తప్ప ఈ విషయాల ప్రసక్తి సయితం ఏమంతగా రావడం లేదు. ఇందుకు మారుగా, మనం నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్ర పోయేవరకు - కొందరి విషయంలో నిద్రలోకూడా - వినే మాటలు "నొసట వ్రాసిన వ్రాలును చెరి పేదెవరు? " "కానున్నది కాక మానదు" "కులం తక్కువ వాడే కూటికి ముందు" "కులానికి కులం తెగులు, నీటికి నాచు తెగులు" "కర్మ కంతం లేదు, కాలానికి నిశ్చయం లేదు"
"మాలదాన్ని ఎంకటమ్మా! అంటే, మరింత ముందరింట్లోకి వచ్చిందట" - ఇట్టివేకావా? రాజ్యాంగ వ్యవస్థ మారినా మన మత వ్యవస్థ, అంతకంటే ముఖ్యంగా, మన మానసిక వ్యవస్థ మారినా మన మత వ్యవస్థ, అంతకంటే ముఖ్యంగా, మన మానసిక వ్యవస్థ ఎంతమాత్రం మారలేదని ఇది సూచించడం లేదా? నిజానికి మన రాజకీయ వ్యవస్థ సయితం కేవలం పేరుకే మారింది. ఇప్పుడు శాసనసభ్యులకు ఎన్నికలు వాస్తవానికి కుల ప్రాతిపదిక పై, మంత్రివర్గ నిర్మాణాలు తిరిగి కుల ప్రాతిపదికపై, ప్రభుత్వాధికారం పంపకాలు సయితం కులం ప్రాతిపదికపైనే! అయినప్పుడు ఏమి మార్పు వచ్చినట్లు, ఎక్కడ మార్పు వచ్చినట్టు?

మనకు త్రివిధాలైన నీతి సూత్రాలున్నాయని డాక్టర్ సురమ దాస్ గుప్త వ్రాసింది. ఈ సందర్భంలో "ధర్మం" అనే దాన్ని నీతికి పర్యాయపదంగా ఆమె వాడింది. ఆమె విభజనం ప్రకారం మొదటిది సాధారణ ధర్మం, రెండవది వర్ణాశ్రమధర్మం,

మూడవది ఆపద్ధర్మం. వీటిలో మొదటి ధర్మం ఆటవిక సంఘాలలో సయితం ప్రవర్తిల్లుతుందని ఇంతకు ముందే నేను వివరించాను. కాగా హిందూమతానికి పంచప్రాణాలుగా చెప్పదగింది వర్ణాశ్రమధర్మమే. అగ్రవర్ణాల ఆధిక్యత కోసం, వాటి ఔన్నత్యం కోసం, వాటి క్షేమం కోసం, వాటి సౌభాగ్యం కోసం సృష్టించబడిన ధర్మమిది. ఇతర దేశాలలోని, అన్య సంఘాలలోని వర్గ ధర్మం కంటె ఇది అన్యాయమైనది; అమానుషమైనది. అయినా, దీన్ని పరిరక్షించడమే రాజధర్మ మని చెప్పని ధర్మశాస్త్రం లేదు, పురాణం లేదు, ప్రాచీన కావ్యం లేదు, నాటకం లేదు, అన్యరచన లేదు. భగవద్గీతను ఎవరో కొందరు ఫోర్జరీ చేసి, భారతంలో దూర్చింది కూడా వర్ణాశ్రమ ధర్మరక్షణ కోసమే.

పోతే, మిగిలింది ఆపద్ధర్మం. శుక్రాచార్యుని అవహేళన చేయడం కోసం భాగవతపురాణంలో ఆయన చేత బలిచక్రవర్తికి - "వారిజాక్షులందు, వైవాహికములందు, బ్రాణవిత్త, మానభంగమందు జకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు, బొంకవచ్చు నఘము నొందదధిప" అని చెప్పిస్తారు. శుక్రాచార్యుడు అసురుల గురువైనా, ఆయన చేత కూడా గోవుల రక్షణలో, అగ్రజన్ముల రక్షణలో అనృత దోషాన్ని పాటించనక్కర లేదని చెప్పించడం ఇక్కడ ప్రత్యేకంగా గమనార్హం కాదా? వర్ణాశ్రమ ధర్మం రక్షణను నొక్కి చెప్పడానికి సందర్భాలతోనైనా పనిలేదు. ప్రస్తుత చర్చతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, ఇక్కడొక విషయాన్ని చెప్పాలి. గోవులను, బ్రాహ్మణులను (అయినచోట, కానిచోట) జతచేయడం. గోవులకు బ్రాహ్మణులతో సాటిగా - వారికంటె మిన్నగా కూడా - పవిత్రత ఉన్నదని కాదు. ఋగ్వేదకాలంలో కాక, అటుపిమ్మట అనేక శతాబ్దాల వరకు గోవు ఆస్తి మాత్రమే కాదు, అది నాణెం కూడా. ఈనాడు ధరలను మనం రూపాయాలలో నిర్ణయించినట్టు ఆనాడు గోవులలో నిర్ణయించేవారు. అందువల్ల గోరక్షణ అంటే అప్పటిలో సంపదరక్షణ. గోవులతో విధిగా బ్రాహ్మణులను జతచేర్చేవారు కాబట్టి బ్రాహ్మణ సంపద రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చే వారన్న మాట! దీన్ని నేను బ్రాహ్మణ విద్వేషంతో వ్రాస్తున్నట్టు ఏ నీచుడైనా నన్ను నిందించగోరితే, వాడికి ఒకప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారు, నన్ను గురించి పల్కిన పలుకులను వినిపించాలి. ఒకానొక సందర్భంలో ఢిల్లీలో మేము కలుసుకొన్నప్పుడు ఆయన నాతో "నార్లగారూ! మిమ్ములను సరిగా అర్థం చేసుకొంటున్నది నే నొక్కడినే! మీరు బ్రాహ్మణ విద్వేషులని పలువురు మీ పరోక్షంలో మిమ్ము నే ఆడిపోసుకుంటారు. మీరు బ్రాహ్మణ విద్వేషులు కారు, బ్రాహ్మణత్వ విద్వేషులు" - అన్నారు. "మీ మాట అక్షరాలా నిజం" అని సంతోషంతో చెమ్మగిల్లిన కళ్ళతో నేను ఆయనకు నమస్కరించాను.

అసలు విషయాన్ని విడిచి, చాలాదూరం వచ్చినట్టున్నాను. ఇప్పుడు తిరిగి వెనకకు వెళ్ళి చెప్పవలసిన మాట శుక్రాచార్యునికి ఆపాదించబడిన మేరవరకు ఆపద్ధర్మాన్ని సాగదీస్తే, అది అష్టావక్ర ధర్మ మౌతుంది. ఈ విషయాన్ని మరొకచోట చర్చిస్తాను.

కాగా, ఎన్నిసార్లు చెప్పినా పునరుక్తి కానట్టిది - హిందూసంఘాన్ని అధోగతికి దిగజార్చినట్టిది వర్ణాశ్రమ ధర్మమని. అగ్రవర్ణాలవారు తమకు అవసరమైనపుడు దాన్ని పాటించారు, అవసరం లేనప్పుడు అతిక్రమించారు. తమకు ప్రయోజనకరమైన సందర్భాలలో, సన్నివేశాలలో దాన్ని మార్చారు. దక్షిణలను దండిగా ముట్టజెప్పిన కొందరు శూద్రరాజులను, కొందరు విదేశీయులను కూడా క్షత్రియులుగా గుర్తించి, వారు సూర్యవంశానికి, లేదా చంద్రవంశానికి చెందిన వారని, దొంగ వంశ వృక్షాలను సృష్టించారు. తాము స్వయంగా రాజధర్మాన్ని స్వీకరించి, ప్రభుతను కొనసాగించిన ఘట్టాలలో వర్ణాశ్రమ ధర్మం విషయంలో కాఠిన్యాన్ని చూపించారు. ఈ ధర్మంవల్ల హిందూసంఘానికి కొంత సుస్థిరత సిద్ధించిన మాట నిజమే. అయితే, అది నిస్సారమైన, నిస్తేజమైన, నిర్జీవమైన సుస్థిరత; ఈజిప్షియన్ మమ్మీల సుస్థిరత.

"కావలసింది భావవిప్లవం"

మానవ స్వభావంలో కొన్ని దార్యాలతోపాటు కొన్ని దౌర్బల్యాలు కూడా వుంటాయి. శాస్త్ర నిర్మాతలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మానవస్వభావాన్ని నీతిశాస్త్రకారుడు . నిర్లక్ష్యం చేస్తే, నీతిశాస్త్రకారుని మానవస్వభావం నిర్లక్ష్యం చేస్తుందని "బె ట్రెండ్ రసెల్" చెప్పిన మాట పూర్తి నిజం. ఈ విషయంలో గాంధి పెద్ద పొరపాటు చేశాడు, హిమవత్పర్వతాన్ని మించిన పొరపాటు చేశాడు. దీన్ని ఒక పొరపాటు అనడం నా తొందరపాటువల్లనే. వాస్తవానికి ఆయన చేసినవి రెండు పొరపాట్లు. వీటిలో రెండవదాన్ని గురించి ముందు ప్రస్తావిస్తాను.

ఆధునిక యుగంవైపుకు కాక, మధ్యయుగంవైపుకు, ప్రాచీనయుగం వైపుకు గాంధీ దేశాన్ని నడిపించాడు. రామభజనతో ఆయన నిద్రలేచేవాడు, రామభజన చేసి మరీ నిద్రపోయేవాడు. ఇతర మత గ్రంథాలను తన ప్రార్థన సమావేశాలలో వినియోగించినా, ఆయనకు అత్యంత ప్రియమైన గేయం, "రఘుపతి రాఘవ రాజారామ్!" ఇంతే కాదు. తన ఆదర్శ రాజ్యానికి ఆయన పెట్టిన పేరు, "రామరాజ్యం". ఆయన ఆర్థిక విప్లవానికి ప్రాతిపదిక, "సూత్ర యజ్ఞం". ఆయన విశ్వాసం ప్రకారం పారిశ్రామికవిప్లవం, ఆధునిక నాగరికత సైతాన్ సంతానం. ఇది కాలానికి ఎదురీదడం, యుగధర్మాన్ని తలక్రిందులు చేయడానికి యత్నించడం! గత శతాబ్ది ఉత్తరార్థంలో మన దేశం ఒక అడుగు ముందుకు వేయగా, ఈ శతాబ్ది పూర్వార్థంలో గాంధి దాన్ని ఏడడుగులు వెనుకకు వేయించాడు.

పోతే ఇప్పుడిక గాంధి చేసిన మొదటి పొరపాటుకు వస్తాను. రాజకీయాలలో నైతికవిలువలను ప్రవేశపెట్టడాన్ని తన జీవితం పరమ లక్ష్యాలలో ఒకదాన్నిగా ఆయన పదే పదే చాటుకొన్నాడు. కాని ఆయన చేసిన పనిమాత్రం రాజకీయాలలో నీతికి బదులుగా అవినీతిని ప్రవేశ పెట్టి వాటిని ఒక రొచ్చుగుంటగా మార్చడం! ఆయన రెండవ పొరపాటుకు మూలం ఆధునిక యుగధర్మాన్ని ధిక్కరించడం కాగా, మొదటిదానికి కారణం మానవస్వభావంలోని దౌర్బల్యాలను నిర్లక్ష్యం చేయడం. పురాణాల దుష్ప్రభావం వల్లనే ఆయన తన మొదటి పొరపాటు చేశాడని నా నమ్మకం.
సత్యహరిశ్చంద్రుని కథ ప్రభావంవల్లనే ఆదిలో సర్వేశ్వరుడిని సత్యంగా ఆయన నిర్వచించాడు. అటుపిమ్మట, "సత్యమే సర్వేశ్వరు"డని దాన్ని సవరించాడు. "సత్యం" అనే పదానికి "యథార్థం" మొదలు కొని, "శాపం" వరకు నానార్థాలున్నాయి. వీటిలో ఏ ప్రత్యేకార్థం సత్యాన్ని పరమేశ్వరుడుగా ఆయన నిర్వచనం చెప్పినాడో మనకు తెలియదు.
క్షత్రియుడుగా జన్మించిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావడానికి ఎన్నెన్ని ప్రయత్నాలను - ఎంతటి కఠోర ప్రయత్నాలను - చేశాడో పురాణాలు వివరిస్తున్నాయి. ఇంతకు ముందు చెప్పినట్లు పురాణాల ప్రభావం గాంధి పై విశేషంగానే పడింది. క్రైస్తవమతానికి చెందిన "సెయింట్స్" ప్రభావం దానికి జతపడింది. ఈ రెండింటి వల్ల ఆయన కూడా బ్రహ్మర్షి కాగోరినాడు, దివ్యశక్తులను సాధించగోరినాడు. వైశ్య ప్రతిపత్తినుంచి బ్రహ్మర్షి ప్రతిపత్తికి పెరగడానికి గాంధి ప్రయత్నం చేశాడని ఇటీవల నాకు గట్టి అనుమానం కలుగుతున్నది.
ఆ ప్రయత్నాన్ని తనకు మాత్రమే గాంధి పరిమితం చేసుకొనివుంటే మనకు, మన దేశానికి ఘోరాపకారం జరిగేది కాదు. కాని, తన ఆశయాలను, విశ్వాసాలను దేశంపై రుద్దడానికి ఆయన కృషిచేశాడు. దానివల్ల బహుశా కొన్ని తరాల వరకు సమసిపోని అరిష్టాలు మనకు సంభవించాయి.

దేశంకోసం, సంఘంకోసం త్యాగాలను చేయవలసిందే. కానీ, తినడానికి తిండి, కట్టుకొనడానికి గుడ్డ, తలదాచుకొనడానికి నీడ, రోగం రొష్టూ వస్తే మందుమాకులు, పిల్లలకు చదువుసంధ్యలు ఇట్టి ప్రాథమిక జీవితావసరాలకు సయితం ఏర్పాట్లు చేయకుండా త్యాగం చేయమనడం భావ్యమా? ఒక వెల్లువ వలె దేశభక్తి కట్టలు తెంచుకొన్నప్పుడు కొందరు ఎంతకైనా

సన్నద్ధపడవచ్చు. కాని, ఆ పొంగు ఎందరిలో నిలుస్తుంది? ఎంతకాలం నిలుస్తుంది? గాంధికైతే ఆయన ప్రాథమికావసరాలను తీర్చడానికి బిర్లా, బజాజ్ మొదలైన కోటీశ్వరు లుండేవారు. అట్టివారు ఎందరికి లభిస్తారు? ఎంతకాలం లభిస్తారు? అయినప్పుడు, నెమ్మది నెమ్మదిగా వారిలో నైతికపు విలువలు పలచబడిపోవా? ప్రజలను ప్రజాసంస్థలను తమ పోషణకై, తమ కుటుంబ పోషణకై (తమ కిష్టమైనా, కష్టమైనా) వినియోగించుకొనవలసిన దౌర్భాగ్య స్థితిలో వారు పడరా? 1920-1947 సంవత్సరాల మధ్య ఎందరు ఈ స్థితికి దిగజారలేదు?

అహింస ఒక మహత్తరాదర్శమే కావచ్చు. కాని, ఒక చెంపపై ఛెళ్ళున కొట్టగా, రెండవ చెంపను అందించగలవారు ఎందరుంటారు? చివరికి గాంధికైనా అన్ని సందర్భాలలో ఇది సాధ్యపడిందా? ఖరే, నారిమన్, సుభాష్ ప్రభృతుల విషయంలో ఆయన నూటికి నూరుపాళ్ళూ క్రోధరహితంగానే, అహింసా ధర్మానుసారమే ప్రవర్తించినట్టు చెప్పగలమా?

పోతే, బ్రహ్మచర్యం, ప్రత్యేకించి నాతిగల బ్రహ్మచర్యం, ఎందరికి సాధ్యం? తానైనా బ్రహ్మచర్యాన్ని పాటించ నారంభించింది నలుగురు కొడుకులను కన్నతర్వాతనే కాదా? ఏడు పదులు దాటిన తర్వాత కూడా కామేచ్ఛను తానెంతవరకు జయించగలిగానో పరీక్షించి తెలుసు కొనడంకోసం నగ్నయువతులను తన సరసను శయనించవలసిందిగా ఆయన కోరలేదా?

ఈ విధంగా వ్రాసుకుపోతే మానవస్వభావంలోని దౌర్బల్యాలను పరిగణనలోనికి తీసుకొనకుండా ఏవేవో మహత్తర లక్ష్యాలను అనుసరించ వలసిందిగా తన సహచరులను గాంధి ప్రోత్సహించిన సందర్భాలకు అంతు కనబడదు. ఇంతేకాక, దీనివల్ల కలిగిన మహా అనర్థాలకు సయితం మితి కనబడదు. ఒక బ్రహ్మర్షి స్థాయికి తాను పెరగగలిగితే, దేశవిభజనను నిరోధించడం మొదలుకొని, సత్యకాలాన్ని తిరిగి తీసుకురావడం వరకు తాను సాధించగలనని గాంధి కలలు కని ఉండాలి. అవి ఆయన పిచ్చికలలే కాని వెనుకటిది సత్యకాలం కానే కాదు. చరిత్రకారుల దృష్టిలో వెనుకటిది ఆటవికయుగం. అప్పటిలో ప్రజాబాహుళ్యంలో నూటికి 90 మంది పశువుల కంటె దీనంగా, హేయంగా బ్రతుకుతూ వుండేవారు. ఇదే విధంగా "రామ రాజ్యం" అనేది నిజానికి లేదు. "అన్నమో రామచంద్రా!" అని ఆ కాలంలో ప్రజలు అలమటిస్తూ వుండేవారు. నా రామాయణ నాటకాల పీఠికలు ఒకదానిలో నేను చెప్పినట్టు అయోధ్యలో దశరథుని రాజ ప్రాసాదం మట్టి మిద్దె.

ఇది గాంధిని నిరసించడం కాదు; గాంధీయిజాన్ని నిరసించడం. వ్యక్తిగా ఆయన గొప్పవాడే కావచ్చు, గౌరవించదగువాడే కావచ్చు కాని, ఆయన భావాలు, ఆయన విశ్వాసాలు గర్హించదగినవి. పదేళ్ళక్రితం ఇది నా ధోరణి కాదు. అయితే, ఈ మధ్యకాలంలో నాలో ఎందుకు మార్పు వచ్చింది? ఏదైనా, ఒక చెట్టు మంచి చెడుగులను గురించి చెప్పవలసింది అది కాసే కాయలనుబట్టి. గాంధేయవిప్లవం కాస్తున్నవి అన్నీ పుచ్చుకాయలు, చచ్చుకాయలే, అన్నీ చేదుకాయలు, విషపుకాయలే. అందువల్ల గాంధీయిజంపట్ల నానాటికి నాకు - నాకే కాదు - స్వతంత్రంగా ఆలోచించగల ప్రతివ్యక్తికీ - వైముఖ్యం కలుగుతున్నది. జుగుప్స పెరుగుతున్నది.

గాంధి కానివ్వండి, మరొకరు కానివ్వండి, ప్రతి నీతిశాస్త్రనిర్ణేత (రసెల్ హెచ్చరించినట్టు) మానవస్వభావంలోని దౌర్బల్యాలను నిర్లక్ష్యం చేయరాదు. మానవుని త్యాగానికి, అతని సహిష్ణుతకు, అతడి ప్రజా సేవాదీక్షకు కొన్ని పరిమితు లున్నాయి. దీన్ని విస్మరించడం ఎంత మాత్రం తగదు. నా వాదం తాత్పర్యం - విత్తమునుంచి వారిజాక్షులవరకు ఆపద్ధర్మం సాకుతో అబద్ధాలు చెప్పవచ్చునని కాదు; నీచంగా, నికృష్టంగా వర్తించ వచ్చుననడం అసలే కాదు. కానీ, నిజం చెప్పటం

ఒక చెడ్డదోషం కాగల సన్నివేశాలు మానవ జీవితంలో నిశ్చయంగా కొన్ని వుంటాయి. మన పురాణాలైనా ఈ సంగతిని కాదనలేదు. ఇందుకు నిదర్శనంగా మహా భారతంలోని కౌశికుని కథను జ్ఞాపకం తెచ్చుకొనండి.

కౌశికుడు సత్యసంధుడు. ఇతర సద్గుణాలకైనా కొదవలేనివాడు. ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని, దానిలో ఆయన తపస్సు చేస్తూవుండగా, దొంగలకు భయపడి కొంద రెవరో పరుగుపరుగున వచ్చి, ఆయన పంచచేరారు. తరువాత కొద్ది సేపటిలోనే దొంగలు ఆ దారినే వచ్చి, "మీ ఆశ్రమంలో కొందరు దాగున్నారు, వారెక్కడ?" అని నిగ్గదీశారు. అబద్ధం చెప్పకూడదన్న నమ్మకంతో "అదిగో! అక్కడ!" అని వారిని కౌశికుడు చూపించాడు. వెంటనే వారిపై కత్తులు దూసి, వారిని చంపి, వారి సొత్తును దొంగలు పూర్తిగా దోచుకుపోయారు. తన సత్యసంధతకు గౌతముడు చివరికి పొందింది స్వర్గసుఖం కాదు, నరకయాతన.

స్వర్గనరకాలలో నాకు విశ్వాసం లేదు కాబట్టి, స్వర్గధామానికి వేంచేయడానికి ముందు (ధర్మరాజువలె) గాంధి నరకలోకంలోకి ఒకసారి తొంగి చూడవలసి వచ్చినట్టు అనబోను. కాని గాంధి సయితం ఒక చిన్న అబద్ధం చెప్పిన సంఘటన ఒక ఆప్తమిత్రుని ద్వారా మూడు, నాలుగు దశాబ్దాల నాడు నేను విన్నాను. ఆ మిత్రుని పేరు-ఆర్. వెంకటరాజులు నాయుడు, తంజావూరుజిల్లాకు వలసవెళ్ళిన తెలుగు రైతు కుటుంబంలో ఆయన జన్మించాడు. విద్యాభ్యాసం ముగిసినంతనే జర్నలిజంలో ప్రవేశించి, కౌలాలంపూర్ లోని ఒక తమిళ దినపత్రిక సంపాదకత్వం వరకు ఆయన యెదగగలిగాడు. 1932 ప్రాంతాల ఆయన డాక్టర్ వరదరాజులు నాయుడుగారి దినపత్రిక "తమిళనాడు"కు అసోసియేట్ ఎడిటర్. అప్పటిలో ఆయన మైసూరు సంస్థానంలోని నందికొండలకు విశ్రాంతికై వెళ్ళడం జరిగింది. సరిగా అదే సమయంలో గాంధి కూడా అక్కడనే విశ్రాంతికై విడిది చేసి వున్నాడు. ఒకనాడు గాంధి దర్శనం కోసం చాటుమాటుగా అప్పటి మైసూరు మహారాజా నందికొండలకు వచ్చాడు. తన చర్య బ్రిటిషువారికి కోపం కలిగించవచ్చునని భయపడి "నా రాకవార్త బయటికి పొక్కకుండా దయచేసి కట్టుదిట్టాలు చేయండి" అని గాంధిని అర్థించాడు. అందుపై గాంధి అక్కడున్న న్యూస్ ఏజెన్సీల విలేకరు లందరిని పిలిపించి, "మహారాజా రాకవార్తను ప్రచురణకు పంపవద్దు" అని సూచించాడు. ఆయన సూచనను వారు పాటించారు. అయితే, నందికొండలలో వెంకటరాజులు నాయుడు ఉనికి సంగతి గాంధికి తెలియదు. మహారాజా రావటం, గాంధిని దర్శించడం, తిరిగి వెళ్ళడం - ఈ వార్తను ఆయన తన పత్రికకు పంపించగా, దాన్ని అది ప్రముఖంగా ప్రచురించింది. సహజంగానే ఇది మహారాజాను కలవరపరచింది. మీరు నా విన్నపాన్ని గురించి తగినంత శ్రద్ధ తీసుకొనలేదా? అని గాంధికి ఆయన వర్తమానం చేశాడు. అంతట నాయుడును పిలిపించి, "నీవు పంపిన వార్త అబద్ధమని మీ పత్రికకు వెంటనే తంతి పంపించు" అని గాంధి మీ బలవంతం చేశాడు. ఇందుకు నాయుడు ససేమిరా ఒప్పుకొనలేదు. అందుపై న్యూస్ ఏజెన్సీల ప్రతినిధులను గాంధి స్వయంగా తిరిగి పిలిపించి, మైసూరు మహారాజా నన్ను చూడ్డాని కై వచ్చినట్టు ఒక మద్రాసు తమిళ దినపత్రికలో వెలువడినవార్త శుద్ధ అబద్ధం" అని ఒక ప్రకటన విడుదల చేశాడు! అన్ని సందర్భాలలో సత్యాన్ని పాటించడం గాంధికైనా సాధ్యం కాదని ఈ సంఘటన నిరూపించడం లేదా? నేను విననివి గాంధి జీవితంలో ఇట్టి సంఘటనలు మరి ఎన్నివున్నవో!

పదిహేను, పదహారు శతాబ్దాల మధ్యకాలంలో యూరప్ పునరుజ్జీవనానికి దోహదం చేసిన క్రైస్తవ మేధావి, మానవతావాది ఎర్యాసస్ నిజమాడరాని సందర్భాలు, అట్టి సన్నివేశాలు కొన్ని వుంటాయని స్పష్టంగా హెచ్చరించాడు.
ఇదే మాటను శామ్యూల్ బట్లర్ (ఈయన పట్ల బెర్నార్డ్ షాకు గురుభావం వుండేది) మరింత గడసరిగా చెప్పాడు. "ఏది సత్యం అంటే ఎన్నడూ అబద్ధం చెప్పకపోవడం కాదు; ఎప్పుడు అబద్ధాన్ని చెప్పవలెనో, ఎప్పుడు చెప్పరాదో నిర్ణయించుకొనడంలో విజ్ఞత' అని ఆయనన్నాడు. జైనమతాచార్యులు సయితం అబద్ధం చెప్పడం ఏయే సందర్భాలలో

సముచితమో, ఎప్పుడు అనుచితమో వివరించారు. మార్గం మధ్యలో అపరిచితులు ఎవరైనా తమకు తటస్థపడి ఆ ప్రాంతాన్ని గురించి, అక్కడి గ్రామాలు, పట్టణాలు మొదలైన జనపదాలగురించి, పంటలు, పశువులు మున్నగువాటి నిగురించి ఆరా తీయడానికి ప్రయత్నిస్తే, శ్రమణులు తమకు ఏమీ తెలియదని అనృతం చెప్పాలని, ఇందువల్ల అనృత దోషం వారిని బాధించదని స్పష్టం చేశారు. దీన్ని గురించి మరికొన్ని విషయాలను తెలుసుకొనగోరేవారు హెర్మన్ యాకోబే ఇంగ్లీషులోకి అనువదించిన జైన సూత్రాలలో మొదటి భాగాన్ని 145-147 పుటలు చూడవచ్చు.

ఇందుకు భిన్నంగా అది ఏ సందర్భమైనా, లేక సన్నివేశమైనా, ఆడినమాటను తప్పరాదనడంవల్ల పాప పుణ్యాల మాట అటుంచి - కొన్ని వైపరీత్యాలు, లేదా విషఫలాలు తప్పకపోవచ్చు. ఇట్టిదే ఇందుకొక నిదర్శనం గయుని కథ. "నీకు ఎవరినుంచి, ఎందువల్ల ప్రాణాపాయం కలగబోతున్నది?" అని ప్రశ్నించకుండానే "శరణు! శరణు!" అని గయుడనగానే, అందుకు సమ్మతించి, ఆడినమాట తప్పరాదన్న పట్టుదలతో గయునికోసం అర్జునుడు కృష్ణునితో యుద్ధానికి దిగటం తగునా? ఈ అనాలోచిత చర్యవల్ల కృష్ణార్జునుల మధ్య యుద్ధం అనివార్యం కాలేదా? వారిమధ్య పోరు నిలపడానికి తమతమ లోకాలనుంచి త్రిమూర్తులు పరుగు పరుగున రావలసిన అగత్యం కలగలేదా?

బ్రాహ్మణ వేషంలో వచ్చినవాడు నిజంగా బ్రాహ్మణుడు కాదని, దొంగవేషగాడని తెలిసిన మీదట వామనుడికి చేసిన వాగ్దానాన్ని బలిచక్రవర్తి పాలించవలసింది కాదు. ఇది కపటాన్ని, మోసాన్ని ప్రోత్సహించడమే. ఈ ప్రోత్సాహం అనృతదోషం కంటే పెద్దది కాదా?

ఏ పురాణాలను చూచినా వాటిలో కనబడేవి ఇట్టి అసంబద్ధపు గాథలే, అసహజ సంఘటనలే, నీతి పేరిట చెల్లే అవినీతి చర్యలే! అయినా, పురాణాల ప్రభావం నానాటికీ పెరుగుతున్నదే తప్ప, తరగటం లేదు. ఇందువల్ల అజ్ఞానం చిక్కబడుతున్నది, అంధ విశ్వాసాలు పెచ్చరిల్లుతున్నాయి, అవినీతి దావానలంవలె ప్రజ్వరిల్లుతున్నది. నోరు విప్పితే ఏదో ఒక అబద్ధపు కూతకూయని రాజకీయవాదులు దేశంలో ఈనాడు ఎందరున్నారు? మంత్రిపదవి మొదలుకొని, బంట్రోతు పనివరకు లంచాల గడ్డి తిననివారు ఎందరున్నారు? వర్తకవాణిజ్యాలలో, చిన్న, పెద్ద పరిశ్రమలలో వీలైనన్ని దగుల్బాజీ పనులు చేయనివారెంద రున్నారు? చివరికి విద్యాలయాల ప్రాంగణంలోకి కూడా, న్యాయస్థానాల ప్రాకారాలలోకి కూడా అవినీతి చొచ్చుకుపోలేదా? ఈనాడు 'సత్యమేవ జయతే" అనే సూక్తికి మనం చెప్పుకొనవలసిన అర్థంలో ఏ తప్పుడు కూతలు కూసినా, ఏ వెధవ పనులు చేసినా, ఒక పదవిని సంపాదిస్తే, లేదా హెచ్చుగా డబ్బును కూడబెడితే, సత్యం ఆ తుచ్ఛుని పక్షాన్నే వుండి వుండాలని ఇంగ్లీషులో ఒక లోకోక్తి వున్నది. దాని తాత్పర్యం "పెద్దపటాలాల పక్కనే పరమేశ్వరు దుంటాడని." అదే విధంగా ఏ గడ్డికరచినా, ఎవడికాళ్ళు పట్టుకొన్నా, ఎన్నిసార్లు "ఛీ ఛీ" అనిపించుకొన్నా, ఎందరి కూటిలో మట్టి పోసినా, ఎన్నెన్ని కొంపలు కూల్చినా, చివరికి ఖూనీలు చేయించినా, కోటలో పాగావేసినవాడి పక్షానే, కోటికి పడగ లెత్తినవాడి పక్షానే సత్యం వున్నదని తీర్మానించుకొనవలసిన పరిస్థితిలో ఈనాడు మనం పడ్డాము. ఇంతే కాదు, పూర్వజన్మలో ఎంతో పుణ్యాన్ని మూటకట్టుకొని వుండకపోతే, ఎవడైనా చకచక పైకి ఎందుకు ప్రాకగలడన్న మూఢవిశ్వాసం ప్రజలలో ఈనాడు మరింతగా విశ్వరూపాన్ని ధరిస్తున్నది.

ఇంకొక తరచి చూస్తే మన మతంలోనే, మన వేదాంతంలోనే కల్ల వున్నది, కపటం వున్నది. అందువల్లనే మనం చెప్పేదానికి, చేసేదానికి పొంతన ఎంతమాత్రం లేకుండా పోతుంది. సంగతినికూడా ఇక్కడ చెప్పాలి.

వేరొక మతంలో కనబడని ఒక విపరీత సూత్రం విడ్డూరపు సిద్ధాంతం - హిందూమతంలో వున్నది. దాని ప్రకారం జీవన్ముక్తుడు పాపపుణ్యాలకు అతీతుడు. ఈ విషయం "అనుగీత"లో వున్నది; కొన్ని ఉపనిషత్తులలో కూడా వున్నది.

జీవన్ముక్తుడు, లేదా ఆత్మస్వరూపాన్ని తెలుసుకున్నవాడు తల్లిని చంపినా, తండ్రిని చంపినా, మరెంతటి ఘోరకృత్యాన్ని చేసినా, అతడికి ఏ పాపమూ అంటదు. "చంపేవాడెవడు? చచ్చేవా డెవడు? "ఇది కాదా భగవద్గీతలో కృష్ణుడు పార్థుడికి చేసిన మహోపదేశం! ఏ నీతిసూత్రాలైనా సామాన్యులకే, తిరిగి వారిలో హీనకులాలవారికే! జీవన్ముక్తుల విషయంలో పాపాల ప్రసక్తి రాదు, రారాదు. ఇందువల్లనే కావచ్చు - జీవన్ముక్తులైన ఋషులు గుంపులు గుంపులుగా వుండే మన పురాణాలలో వారు పలికేవన్నీ బొంకులే, వారు చేసేవన్నీ రంకులే! "ఇవేనా పుణ్యగ్రంథాలు? వీటిని పారాయణం చేస్తే స్వర్గద్వారాలు మనకోసం తెరుచుకుంటాయా?" అని ప్రశ్నించేవాళ్ళు పెక్కుమంది దృష్టిలో పాషండులే, పాపిష్ఠివాళ్ళే!

కాగా, ప్రస్తుతానికి నేను చివరిమాటగా ఒకే ఒకదాన్ని చెప్పగోరుతున్నాను. పురాణాల దుష్ప్రభావం నుంచి ఇప్పటికైనా ఒక ప్రజగా మనం బయటపడలేకపోతే, రాముడు, కృష్ణుడు, నలుడు, హరిశ్చంద్రుడు మున్నగువారిని సముద్రాంతరాలకు సాగనంపకపోతే, ధర్మశాస్త్రాలను భస్మీపటలం చేయకపోతే, కులవ్యవస్థను రూపుమాపకపోతే, హేతుదృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొనకపోతే మనదేశం పైకి కాక క్రిందికే, మరింత క్రిందికే - పోతుంది, మనం వెనుకకే - మరింత వెనుకకే - నడుస్తాము. మనలో భావవిప్లవం రానంతవరకు ఏ పంచవర్ష ప్రణాళికలు, ఏ పంచ సూత్రాలూ అధోగతి నుంచి మనను తప్పించలేవు.

"లుంబిని"

బంజారా హిల్స్ — నార్ల వెంకటేశ్వరరావు.

హైదరాబాదు

నరకంలో హరిశ్చంద్రుడు

(నాటకం)

పాత్రలు : హరిశ్చంద్రుడు : అయోధ్య చక్రవర్తి,
లోహితాస్యుడు : హరిశ్చంద్రుని కుమారుడు;
వసిష్టుడు : హరిశ్చంద్రుని రాజపురోహితుడు;
సత్యకీర్తి : హరిశ్చంద్రుని మహామంత్రి;
కృష్ణపాణి : హరిశ్చంద్రుని ప్రధానరాజవైద్యుడు;
మాధవ శర్మ : హరిశ్చంద్రుని మరొక రాజవైద్యుడు;
యమధర్మరాజు : నరకలోకాధిపతి;
చిత్రగుప్తుడు : యమధర్మరాజు ఆస్థానంలో లేఖకుడు.

వీరు కాక ఒక రాజభటుడు, ఇద్దరు పరిచారకులు, ఇద్దరు యమకింకరులు

రంగాలు : ప్రథమాంకం : అయోధ్యాపురిలో హరిశ్చంద్రుని శయ్యాగారం
ద్వితీయాంకం : సంయమనిలో యమధర్మరాజు న్యాయస్థానం
తృతీయాంకం : ప్రథమాంకంలోవలె హరిశ్చంద్రుని శయ్యాగారం

సమయాలు : ప్రథమాంకం : ఉదయం తొమ్మిది, పది గంటల మధ్య
ద్వితీయాంకం : మరి కొన్ని క్షణాలకు
తృతీయాంకం : తిరిగి మరికొన్ని క్షణాలకు

ప్రథమాంకం

హరిశ్చంద్రుని శయ్యాగారం. చక్రవర్తి హంసతూలికా తల్పంపై పరుండి వుంటాడు. వృద్ధాప్యంతోపాటు దౌర్బల్యం ప్రవేశించిన వయస్సు, శుష్కించి వెలవెలబారిన ముఖం, భుజాల నంటుతున్న శిరోజాలు. కర్ణకుండలాలు, వజ్రాంగుళీయం తప్ప అన్య రాజాభరణాలు లేవు. చీనాంబరాన్ని ధరించాడు. శయనించి వున్నప్పుడు నిచోళం (దుప్పటి) లోనుంచి శిరోభాగం మాత్రమే కాన వస్తూవుంటుంది. శయ్యపై లేచి కూర్చున్నప్పుడు అనాచ్ఛాదిత వక్షస్థలం కనబడుతూ వుంటుంది.

సత్యకీర్తి హరిశ్చంద్రుని సమవయస్కుడు. ఆరోగ్యం కాని, పటుత్వం కాని సడలలేదు. ప్రగల్భుడు కాదు గాని, స్వామిభక్తి పరాయణుడు. ధౌతాంబరాన్ని ధరించాడు. ఉత్తరీయం కూడా తెల్లనిదే. కుడిచేతి వేళ్ళకు రెండు ఉంగరాలు, మెడలో హారం. రాజవైద్యులు, పరిచారకులు, రాజభటుడు - వీరిని తమ తమ ప్రతిపత్తికి తగు వేషభూషలు.

తెర లేచినప్పుడు రాజతల్ప శిరోభాగంలో ఒక పరిచారకుడు. అతడికి రెండవ వైపుగా మరొక పరిచారకుడు. ఉభయులు వీవనలతో విసురుతూ వుంటారు.

తల్పం సమీపంలో నాలుగు భద్రాసనాలు వుంటాయి. అప్పుడప్పుడు వాటిపై మహామం, రాజ వైద్యులు, కూర్చుండి లేస్తూ వుంటారు.

చక్రవర్తి రుగ్మత ప్రసక్తి వచ్చిన సందర్భాలలో మహామంత్రి, రాజవైద్యులు ఆయన శయ్యకు వీలైనంత దూరంగా రుతూవుంటారు.

తెర లేచినప్పుడు రాజవైద్యులు కృష్ణపాడి, మాధవశర్మ ఆందోళనతో కూడిన ముఖాలతో ఏవో మంతనా లాడుతూవుంటారు. మహామంత్రి అశాంతిలో ఒకచోట నిలవలేక పచార్లు చేస్తూ వుంటాడు.

హరిశ్చంద్రుడు : (తీవ్ర జ్వరపీడితునికి సహజమైన అశాంతితో శయ్యపై ఇటు నటు కదులుతూ) దేవీ! దేవీ!!

సత్యకీర్తి : సార్వభౌములు నిద్రలో కలవరిస్తున్నారు.

కృష్ణపాణి : నిద్రలో కలవరింతలు కావు, మహామంత్రీ! విషజ్వర తీవ్రతలో...

సత్యకీర్తి : విషజ్వరమా!

కృష్ణపాణి : నా నోట తిరిగి చెప్పించడం దేనికి? తమరు పెద్దలు, అనుభవజ్ఞులు! తమకు తెలియని దేమున్నది?

హరిశ్చంద్రుడు : దేవీ! దేవీ! చంద్రమతీ!!

(సత్యకీర్తి గట్టిగా నిట్టూర్చుతాడు)

సత్యకీర్తి : కఫదోషంతో వచ్చిన స్వల్పజ్వరమని, త్వరలోనే తగ్గిపోతుందని...

కృష్ణపాడి : (మాటకు అడ్డువస్తూ) నిన్నటి పరిస్థితి అంతే, మహామంత్రీ! ఇంతలోనే ఇంతగా ముంచుకు వస్తుందని మాకు మాత్రం ఏమి తెలుసు?

మాధవశర్మ : మాకు మాత్రం... (మాట మధ్యలో ఆగి, ప్రధాన రాజవైద్యుని వైపు తిరిగి) కృష్ణపాటి భిషగ్వరులు మమ్ము మన్నించాలి. (తిరిగి మహామంత్రితో) మాకు మాత్రం ఇది కేవలం కఫజ్వరం కాదని, జాగ్రత్త వహించకపోతే విషమించవచ్చునని ఆదిలోనే తోచింది.

కృష్ణపాడి : (కోపంగా) ఆదిలోనే తమకు తోచిందా? అయితే, మమ్ము హెచ్చరించ లేదేమి?

మాధవశర్మ : రాజవైద్యులలో తమరు ప్రధానులు, నాడీనిదానంలో అద్వితీయుల మని తాము చెప్పుకుంటారు. అందువల్ల...

కృష్ణపాణి : (తీవ్రంగా) అందువల్ల?

మాధవశర్మ : తమరు ఆగ్రహిస్తే, మే మేమి చెప్పగలం?

సత్యకీర్తి : (కృష్ణపాణితో) మీరు కాస్త శాంతించండి. (మాధవశర్మతో) మీకు నిన్ననే ఇది విషజ్వరమని తోచివుంటే, మాతోనైనా కాస్తమాట అన్నారు కాదేమి?

మాధవశర్మ : మన్నించండి, అది మా తప్పిదమే!

కృష్ణపాణి : (రోషంగా) నిన్న మాతోపాటు మీరుకూడా నాడీపరీక్ష చేశారు; మీ కేమి దోషం కనబడింది?

మాధవశర్మ : కఫదోషంతోపాటు వాతప్రకోపం కానరాలేదా?

కృష్ణపాణి : వాతప్రకోపం రాత్రి ప్రవేశించింది.

మాధవశర్మ : సార్వభౌముల రుగ్మత చలితో ప్రారంభమైంది. కఫవాతాలు ఏకకాలంలో ప్రకోపించకపోతే, ఆ లక్షణం కనబడుతుందా? ఇది రక్తధాతువు నాశ్రయించిన సతతజ్వర మని మేము ప్రారంభంలోనే నిర్ణయించుకున్నాము.

కృష్ణపాణి : ఏ ప్రమాణంతో? ప్రత్యక్ష ప్రమాణంతోనా? అనుమాన ప్రమాణంతోనా? ఆపోపదేశ ప్రమాణంతోనా?

మాధవశర్మ : ప్రత్యక్ష ప్రమాణం వుండగా, అన్య ప్రమాణాలు దేనికి? కేవలం కఫజ్వరమైతే, అంత చలితో ప్రారంభం కాదు!

కృష్ణపాణి : గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్టు - చాల్చాలు నాడీనిదానంలో మమ్ము తప్పుపట్టడమా? (సత్యకీర్తి వైపు

తిరిగి) వ్యాధి వశం తప్పిపోయినందున ఈ మాధవ శర్మ మాపై నెపం నెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. మీకు తెలియవా? - ఈ ప్రబుద్ధుని కుత్సితాలు, ఇతడి కుతంత్రాలు!

సత్యకీర్తి : (ఆందోళనతో) వ్యాధి వశం తప్పినట్టేనా? మరి చేయగలిగింది లేదా?

కృష్ణపాణి : (నీరసంగా) ఏమీ కనబడదు.

హరిశ్చంద్రుడు : దేవీ! దేవీ!

సత్యకీర్తి : (మాధవశర్మతో) మీ రేమంటారు?

మాధవశర్మ : మే మైనా ఇప్పుడు చేయగలిగింది లేదు.

కృష్ణపాణి : ("ఇప్పుడు" అనే మాటను నొక్కుతూ) "ఇప్పుడు" చేయగలిగింది ఏమీ లేదంటున్నావుముందుగా అయితే నీ వేమైనా చేయగలిగేవాడివా?

మాధవశర్మ : దుర్లక్షణాలు కనిపించగానే మా కవకాశ మిచ్చివుంటే, ఎవరి హస్తవాసి ఎట్టిదో తెలిసేది!

కృష్ణపాణి : ఛీ! నీచుడా! మా హస్తవాసిని శంకిస్తావా? ఇంతకాలంగా శ్రీవారి ఆరోగ్యాన్ని కాపాడిన దెవరు? ఎన్నో గడ్డ గండాలనుంచి శ్రీవారిని తప్పించిన దెవరు? నీవా, మేమా?

మాధవశర్మ : పోనీ అని మిన్నకుంటే నువ్వు నోరు పారవేసుకుంటున్నావ్. నీ బండారం కాస్తా...

సత్యకీర్తి : (చికాకుగా) సంతోషించాం! మీ కలహానికి సమయాసమయాలు లేవా? కృష్ణపాణి క్షమించండి! ఒకేసారిగా మాధవశర్మ మన్నించండి!

సత్యకీర్తి : క్షమించడం లేదు, మన్నించడం లేదు. ఏదైనా ఒక దారి వుంటే చూడండి.

కృష్ణపాణి : ఏ దారైనా, ఇహ ఆ పరమేశ్వరుడే చూపించాలి.

మాధవశర్మ : ఇప్పుడు మన చేతిలో ఏమీలేదు.

కృష్ణపాణి : నీ కొద్ది బుద్ధి పోనిచ్చావ్ కాదు. "ఇప్పు"డంటూ మళ్ళీ అదే కూత కూస్తున్నావ్! నీ

మాధవశర్మ : కూతలు కూస్తున్నది నేను కాదు, నువ్వు!

సత్యకీర్తి : (పట్టరాని కోపంతో, బుసకొడుతూ) మీకు మతి పోయిందా? ఇక్కడేనా మీరు కాట్లాడవలసింది? మీ రిద్దరు తక్షణం బయటికి దయచెయ్యండి!

మాధవశర్మ : నా తప్పేమున్నది, మీరే చెప్పండి, మహామంత్రీ! తాము చూస్తూనే వున్నారుగదా? ఇతడు నా పై ఎంతగా నోరు పారవేసు....

సత్యకీర్తి : అన్నీ చూస్తూనే వున్నాము. ముందు మీరు కదలండి. (మాధవ శర్మ తటపటాయించగా) కదులుతారా, లేదా?

మాధవశర్మ : మహామంత్రులు...

సత్యకీర్తి : మళ్ళీ చెబుతున్నాను - కదులుతారా, లేదా?

మాధవశర్మ : (వెళ్ళిపోతూ) ఆగ్రహించకండి. వెడుతున్నాము (నమస్కరిస్తూ) మేము తెలియక చేసిన తప్పిదం వుంటే మన్నించండి.

(వెడతాడు)

కృష్ణపాణి : (వెళ్ళిపోతున్న మాధవశర్మను పురుగును చూచినట్టు చూస్తూ) మాకు పేర్లు పెట్టడానికే అతడు వచ్చాడు. ఆ పని కాస్తా పూర్తి చేసి, చక్కాపోయాడు. ఈ స్థితిలో సార్వభౌములను విడిచిపెట్టి మే మెక్కడికి పోగలం? మేము చివరి వరకు శ్రీవారి సేవలో నిలవవలసినవారిమే!

హరిశ్చంద్రుడు : (శయ్యపై సగం లేచి) దేవీ! దేవీ!

కృష్ణపాణి : (దగ్గరికి వెళ్ళి, హరిశ్చంద్రుని తిరిగి మంచంపై పరుండబెట్టడంలో పరిచారకులకు సహాయపడుతూ) ఇంతలోనే ఎంత ముంచుకు వచ్చింది! నిన్న సూర్యాస్తమానం తర్వాత.

ఒక ఘడియకు మేము పరీక్షచేసినప్పుడు ఈ జ్వరతీవ్రత లేదు. అప్పుడు ప్రభువులు సుఖంగా నిద్రపోతున్నారు. (ఒక క్షణం ఆగి) శ్రీవారు శయ్యపై నిలవడం లేదని అర్ధరాత్రివేళ మాకు వర్తమానంచే సేవరకు వ్యాధి విషమించిందని మాకు తెలియదు. ఆ వర్తమానం కాస్త ముందుగానైనా చేశారు కారు. అర్ధరాత్రివేళ వైద్యునికి వర్తమానం చేయరాదని శాస్త్రం చెబుతున్నది. హుటాహుటిగా మేము బయల్దేరి వస్తుండగా, గుడ్లగూబ మా కెదురైంది. అది మరొక దుశ్శకునం. (సత్యకీర్తిపై తన పలుకుల ప్రభావాన్ని కనిపెట్టి చూస్తూ, ఇంకొక క్షణం తర్వాత) మా లోప మేమీ లేకుండా శాస్త్రం చెప్పిన దివ్యౌషధా లన్నీ ప్రయోగించాము. తక్షణం కొంత సుగుణం కనబడింది. కాని, తెల్లవారేసరికి మళ్ళీ తిరగబెట్టింది. ఎవరైనా నిజదోషానికి వైద్యం చేయగలరుగాని, విధిదోషానికి చేయగలరా?

హరిశ్చంద్రుడు : దేవీ! చంద్రమతీ!

సత్యకీర్తి : (నిట్టూర్చుతూ) సార్వభౌములు సతీమణిని పదే పదే సంస్మరిస్తున్నారు.

కృష్ణపాణి : ఆమె పుణ్యాత్మురాలు. అందువల్లనే పుణ్యస్త్రీగా స్వర్గానికి వేంచేశారు. మహాసాధ్వీలలామ పుణ్యఫలమే శ్రీవారి నిప్పుడు కాపాడాలి.

సత్యకీర్తి : యువరాజ ప్రభువులు చెంతనైనా లేరు. వారం రోజు లనగా ఆ రాకుమారులనుంచి వర్తమానమైనా లేదు. ఎక్క డున్నారో, ఏమో? మీరు నిన్ననే మమ్మ ఏమాత్రం ? హెచ్చరించివున్నా...

కృష్ణపాణి : మనం త్రికాలజ్ఞులమా? ఏ క్షణాన ఏమి జరుగుతుందో మన కెలా తెలుస్తుంది?

సత్యకీర్తి : (చికాకుగా) మిమ్ముల ననవలసిన పనిలేదులెండి! ఎటుపోయి ఎటువస్తుందో అని ముందుగా జాగ్రత్త పడకపోవడం మాదే పొరపాటు. (ఒక క్షణం ఆగి) ఎవరురా, అక్కడ!

భటుడు : (నమస్కరిస్తూ ప్రవేశించి) చిత్తం!

సత్యకీర్తి : తక్షణం సర్వసేనాని వద్దకు వెళ్ళి - అన్నట్టు యువరాజ ప్రభువుల వెంట ఆయన వేటకు వెళ్ళారుగా! -తక్షణం దుర్గాధిపతి వద్దకు వెళ్ళి, యువరాజ ప్రభువు లెక్కడున్నా, వారిని వెంటనే తోడ్కొని రావలసిందని మా మాటగా చెప్పు.

భటుడు : చిత్తం, దేవరా!

(నమస్కరిస్తూ నిష్క్రమిస్తాడు)

కృష్ణపాణి : జన్మ నక్షత్రాన్ని సూర్యుడు, అంగారకుడు, రాహువు ఆక్రమిస్తే మహరాజులకు మరణం తప్పదని ప్రాయికంగా జ్యోతిష్కులు చెబుతారు. ఈ పరిస్థితిలో సాక్షాత్తు ఆ ధన్వంతరి వైద్యం చేసినా, అశ్వనీదేవతలే అవనీతలానికి దిగివచ్చినా, మాట దక్కదు. మా వైద్య లోపమేమీ లేదని తమరు యువరాజ ప్రభువులతో...

సత్యకీర్తి : మనవి చేస్తాములెండి! (క్షణం ఆగి, తిరిగి పచారు చేస్తూ) ఆయనకు కడసారి చూపైనా అందుతుందో, లేదో!

కృష్ణపాణి : (హరిశ్చంద్రుని సమీపించి, నాడీ పరీక్షచేస్తూ) నాడిలో యుద్ధాశ్వగతి కానవస్తున్నది. మరి ఏ క్షణాన...

హరిశ్చంద్రుడు : (రాజ వైద్యుని చేతిని విదిలించి వేస్తూ) ఎవడవురా నువ్వు? మాతంగకన్యలను సమీపించకుండా మమ్మ నిరోధిస్తున్నావ్!

కృష్ణపాణి : (శయ్య పై సగం లేచిన హరిశ్చంద్రుని పరిచారకుల తోడ్పాటుతో తిరిగి పరుండబెట్టి, ఇవతలికి వస్తూ) శ్రీవారి చిత్తం మరింతగా వారి వశం తప్పిపోతున్నది.

హరిశ్చంద్రుడు : (అంతలోనే మంచంపై తిరిగి సగం లేచి) రండి! రండి! వచ్చారా? మీ వీణలు తెచ్చారా? (పరిచారకులు నిరోధిస్తున్నా శయ్యనుంచి దిగబోతూ) మీ కుసుమ కోమలాంగుళులతో వీణాతంత్రులను మీటండి! మీ కిన్నెర కంఠాలతో పాడండి. (క్షణం ఆగి) సిగ్గుపడతారు దేనికి? పాడండి! గొంతెత్తి పాడండి. (అలసిపోయినట్టు, హరిశ్చంద్రుడు శయ్యపై వాలిపోతాడు)

కృష్ణపాణి : సార్వభౌములు నృత్యగానకళాభిమానులు! వారు మెచ్చిందే ఆట; వారికి నచ్చిందే పాట. వారి మెప్పుపొందడానికి దేవలోకంలో సురకాంతలు ఎంతగా ఉత్సహిస్తున్నారో!

సత్యకీర్తి : (తీవ్రంగా) మీ అశుభవాక్కులు, మీ అధిక ప్రసంగాలు మరి కట్టి పెట్టండి. మీ వాచాలత్వంతో మాకు సగం మతిపోతున్నది. యువరాజ ప్రభువులకు కనీసం కడసారి చూపు అందించడానికైనా ప్రయత్నించండి.

కృష్ణపాణి : కాలం, ఖర్మం కలిసి రానప్పుడు మన మేమి చేసినా ఫలిత మొక్కటే! తాము పెద్దలు, పూజ్యులు - మావల్ల వైద్యలోపం లేదని తమకు తెలియదా? మాకు మాట రాకుండా ఆ ప్రభువులతో...

సత్యకీర్తి : (విదిలిస్తూ) మీ గొడవే తప్ప మీకు మరొకటి లేనట్టున్నది!

కృష్ణపాణి : రాజాశ్రితుల బ్రతుకెట్టిదో - మహామంత్రులు తమకు తెలియదా?

భటుడు : (ప్రవేశిస్తూ) మహా మంత్రులకు నమస్కారం.

సత్యకీర్తి : దుర్గాధిపతికి మా వర్తమానం అందజేశావా?

భటుడు : చిత్తం, దేవరా! వెంటనే బయల్దేరుతున్నట్టు తమకు మనవి చెయ్యమన్నారు.

సత్యకీర్తి : మంచిది!

(నమస్కరించి, భటుడు వెళ్ళిపోతాడు .)

కృష్ణపాణి : రాజ పురోహితులు వసిష్ఠ మహర్షికి కూడా వర్తమానం చేయడం మంచిదేమో!

సత్యకీర్తి : ఔను! మాకు స్ఫురించనేలేదు సుమా! ఎవరురా, అక్కడ!

భటుడు : (తిరిగి ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సత్యకీర్తి : వసిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి, వారిని వెంటనే తోడుకురావలసిందిగా సూతునితో మా ఆజ్ఞగా చెప్పు, ఉత్తమాశ్వాలను పూన్చిన రథంలో వెళ్ళమన్నామని చెప్పు,

భటుడు : చిత్తం, దేవరా!

(నిష్క్రమిస్తాడు.)

హరిశ్చంద్రుడు : (శయ్యపై తిరిగి చివాలున లేస్తూ) ఆహా! ఏమి మధురగానం! ఏమి మధుర గానం! ఈ రత్నహారాన్ని మా బహుమానంగా పరిగ్రహించండి.

కృష్ణపాణి : (హరిశ్చంద్రుని శయ్యను సమీపిస్తూ) శ్రీవారికి తమ జీవితంలోని పూర్వఘట్టా లన్నీ జ్ఞప్తికి వస్తున్నాయి. (ఈ లోపల పరిచారకులు హరిశ్చంద్రుని శయ్యపై తిరిగి పరుండబెట్టగా, నాడిని పరీక్షిస్తూ) తక్కిన యేర్పాటులు కూడా తాము త్వరగా ముగించడం మంచిది.

సత్యకీర్తి : (ఆందోళనతో అంతవరకు వచ్చిందా? ("జై"నన్నట్టు కృష్ణపాణి తల ఊపగా, బాధతో మూల్గుతూ) యువరాజ ప్రభువులకు కడసారి చూపు ప్రాప్తి కూడా లేదన్న మాట! (కొన్ని క్షణాల మౌనం తర్వాత) ఎవరురా, అక్కడ!

భటుడు : (చేతులు కట్టుకొని ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సత్యకీర్తి : సూతునికి వర్తమానం అందిందా?

భటుడు : చిత్తం, దేవరా! తమరి సెలవైనంతనే అందు కేర్పాటు చేశాను.

సత్యకీర్తి : అయితే, ఉపదుర్గాధిపతి వద్దకు కూడా నమ్మకమైన బంటును చూచి, వెంటనే పంపించు. వసిష్ఠులవారిని, యువరాజు ప్రభువుల వారిని తప్ప అన్యులను మా అనుమతి లేకుండా దుర్గంలో ప్రవేశించనివ్వరాదు. తెలిసిందా?
భటుడు : చిత్తం, దేవరా!

(నిష్క్రమిస్తాడు.)

కృష్ణపాణి : (హరిశ్చంద్రుని శయ్యవద్ద నుంచి ఇవతలికి వస్తూ) కీడెంచి మే లెంచమన్నారు మహామంత్రులు గట్టి కట్టుదిట్టాలే చేశారు.
హరిశ్చంద్రుడు (శూన్యంలోకి వేలెత్తి) ఎవరురా మీరు? ఎందుకు వచ్చారు?

సత్యకీర్తి : (హరిశ్చంద్రుడు వేలెత్తి చూపుతున్న దిక్కుకు చూస్తూ) ఎవ్వరూ లేరే!

కృష్ణపాణి : శ్రీవారు ఏవో రూపాలను చూస్తున్నారు. సంధించినప్పుడు అది సహజమే. మహామంత్రీ!

హరిశ్చంద్రుడు : యమకింకరులా? ఎందుకువచ్చారు? పొండి ! పొండి!! పోతారా, లేదా! కదలరే? మెడపట్టి గెంటించాలా? ఎవరురా, అక్కడ?

భటుడు : (చేతులు కట్టుకొని ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సత్యకీర్తి : ఏమీలేదురా! నువ్వు పో!

భటుడు : (వెనకకు తిరగబోతూ) చిత్తం!

సత్యకీర్తి : ఉపదుర్గాధిపతి వద్దకు వర్తమానం వెళ్ళిందా!

భటుడు : చిత్తం దేవరా!

సత్యకీర్తి : మంచిది.

హరిశ్చంద్రుడు : ఆః! ఎంత సాహసం! ఎంత కండకావరం! మమ్ము సమీపిస్తారా? మేము మహాచక్రవర్తుల మని మీకు తెలియదా? ఏదీ నా కరవాలం? మిమ్ము తుత్తునియలు చేస్తాను! ఏదీ మా కరవాలం? ఎవడురా, అక్కడ?

భటుడు : (భయపడుతూ ప్రవేశించి) చిత్తం, ప్రభూ!

కృష్ణపాణి : నిన్ను కాదురా! నువ్వు పో! మహామంత్రులు స్వయంగా పిలిస్తే తప్ప నువ్వు రాబోకు!

భటుడు : (బిత్తరపడి వెళ్ళిపోతూ) చిత్తం, స్వామీ!

(భటుని నిష్క్రమణ)

హరిశ్చంద్రుడు : మాకు మరణ మాసన్న మైందా? మా ప్రాణాలు తోడుకుపోవడానికి వచ్చారా? (వికటంగా నవ్వుతూ) మీ యమధర్మ రాజుకు మతిపోయినట్టున్నది. స్వర్గం నుంచి మాకోసం పుష్పక విమానం రావాలి; దానిలో దేవదూతలు రావాలి; "వేంచేయండి, ప్రభూ!" అని భక్తి, వినయాలతో మమ్ము ప్రార్థించాలి. (ఆకసంవైపు రెండు చేతు లెత్తి) అదుగో! పుష్పక విమానం! మా కోసం రానే వస్తున్నది! దానిపై దేవేంద్రుడు స్వయంగా వస్తున్నాడు. ఆయన వెంట రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ వస్తున్నారు. వీణలు మీటుతూ వస్తున్నారు; నృత్యం చేస్తూ వస్తున్నారు! రండి! రండి!

(శయ్యనుంచి హరిశ్చంద్రుడు దిగబోతాడు. పరిచారకులకు తోడుగా వెళ్ళి, సత్యకీర్తి, కృష్ణపాణి చక్రవర్తిని పట్టుకొని, నెమ్మదిగా తిరిగి పడుకోబెడతారు.)

సత్యకీర్తి : ఈ విపరీత చేష్ట లేమిటో?

కృష్ణపాణి : సంధిప్రకోపం చరమస్థాయికి చేరుకున్నది.

హరిశ్చంద్రుడు : (శయ్యపై చివాలున లేచి కూర్చుండి, దీనంగా) రానే లేదా? పుష్పకం రానే లేదా? క్షణం ఆగి, పళ్లు పటపట నూరుతూ) తుచ్ఛులారా! నవ్వుతున్నారా! చతురంభోధి పరీత వసుంధరను ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్న ఈ చక్రవర్తిని చూచి నవ్వుతున్నారా? సత్యసంధుడని ముల్లోకాలలో కీర్తి నార్జించిన ఈ సార్వభౌముని చూచి నవ్వుతున్నారా? నవ్వండి! నవ్వండి! మీ పొట్టలు చెక్కలయేటట్లు నవ్వండి! మీ అంతు, మిమ్ము పంపించిన మీ యమధర్మరాజు అంతు మేము కనుక్కునే వరకు నవ్వండి. ఎవరురా, అక్కడ! ఏదీ మా ఖడ్గం?

(బిడియంతో లోనికి తొంగిచూచిన భటుడు అంతలోనే వెనకకు తగ్గుతాడు.)

సత్యకీర్తి : (శయ్యనుంచి దిగబోయిన హరిశ్చంద్రుని పరిచారకులు పట్టుకొని, పరుండబెట్టిన తర్వాత, కృష్ణపాణితో) గుడ్లు అప్పగించి చూస్తూ నిలబడక మరొక ప్రయత్నం చేసి చూడండి.

కృష్ణపాణి : మన ప్రయత్నాల స్థితి దాటిపోయింది. అయినా, మహామంత్రుల మాట మే మెందుకు కాదనాలి? ఇదివరకే

ఒకసారి వాడిన నవరత్న చింతామణి తిరిగి వాడి చూస్తాం! (సంచిలోనుంచి మందు తీసి, పరిచారకుల సహాయంతో దాన్ని అతి కష్టం మీద హరిశ్చంద్రునితో సేవింప జేస్తాడు)

హరిశ్చంద్రుడు : (కృష్ణపాణి ఇవతలికి రాగానే మంచంపై తిరిగి దిగ్గున లేచి) పుణ్యలోకాలలో ప్రవేశించవలసిన మాకు దేవేంద్రునితో అర్ధ సింహాసనం అధిష్టించవలసిన మాకు యమధర్మరాజునుంచి పిలుపు రావడమా? తాను స్వయంగానైనా రాక, తన కింకరులను పంపించడమా? ఏమి వింత! ఎంత విడ్డూరం! సత్యానికి ఇంతగా చేవ చచ్చిందా? ధర్మం ఇంతగా శక్తిహీనమై పోయింది? మేము రాము. రా మని మీ ప్రభువుతో చెప్పండి. కావాలంటే తననే రమ్మనండి - అడగవలసిన నాలుగు మాటలు ఆయననే అడుగుతాము! (మరింత ఉద్వేగంతో) పొమ్మంటే పోక సమీపిస్తున్నారా! పాశాన్ని విసరుతున్నారా? ప్రాణాలు తోడుతున్నారా? మీకు బుద్ధి చెబుతాము! మా ప్రతాపం చవిచూపిస్తాము! ఏదీ మా కరవాలం! ఏవీ మా ధనుర్బాణాలు, ఏదీ మా రథం? ఎక్కడ మా చతురంగబలం? ఎక్కడ.... ఎక్కడ.... ఎక్కడ....

(పరిచారకుల పట్టునుంచి తప్పించుకుని, హరిశ్చంద్రుడు మంచి పైనుంచి దూకబోయి, కిందికి పడిపోతాడు. సత్యకీర్తి, కృష్ణపాణి త్వరితంగా వెళ్లి, ఆయనను లేవనెత్తి మంచంపై పరుండ బెడుతున్న పరిచారకులకు సహాయపడతారు. నాడీపరీక్ష చేసి, "హంస ఎగిరిపోయింది" అన్నట్టు కృష్ణపాణి సంజ్ఞ చేస్తుండగా - తెర)

ద్వితీయాంకం

(యమధర్మరాజు న్యాయపీఠంపై ఆసీనుడై ఉంటాడు. ఆయనది గంభీరమైన మూర్తి, గంభీరమైన వాక్కు జనులు సర్వసామాన్యంగా భావించినట్టు, ఆయన భయంకరుడు కాడు. చీనాంబరాన్ని ధరించి వుంటాడు. శిరస్సుపై రత్నఖచిత కిరీటం, కంఠంలో వజ్రహారం, హస్తాలకు భుజకీర్తులు. శరీరోపరి భాగానికి ఆచ్ఛాదన లేదు.

యమధర్మరాజు ధర్మపీఠానికి ఒక చెంపగా తన ప్రతిపత్తికి సముచితమైన భద్రాసనంపై చిత్రగుప్తుడు కూర్చుని ఉంటాడు. నిరాడంబరమైనవి అతని వేషభూషలు. యమకింకరుల దుస్తులు రాజభటులకు తగినట్టివి. తన శయ్యాగారంలోని వేషభూషలతోనే హరిశ్చంద్రుడు న్యాయస్థానంలో ప్రవేశిస్తాడు.)

హరిశ్చంద్రుడు : (తన రెక్కలు పట్టుకొన్న యమకింకరులతో పెనుగులాడుతూ) తుచ్ఛులారా! మీ తుచ్ఛపుబుద్ధి పోనిచ్చారు కాదు. సామ్రాజ్యాధిపతి నన్న సంకోచమైనా లేకుండా రెక్కలు పట్టుకొని మమ్మిద్చుకు వస్తారా?

చిత్రగుప్తుడు : రమ్మనగానే తమరు రాకపోతే వారికి గత్యంతరం లేదు గదా! వారి ధర్మాన్ని వారు నిర్వర్తిస్తున్నారు.

హరిశ్చంద్రుడు : ధర్మోపన్యాసా లిస్తున్నావ్! మధ్య నీ వెవరివయ్యా?

చిత్రగుప్తుడు : నా పరిచయం తమకు లేదు కాబోలు! నన్ను చిత్రగుప్తుడంటారు.

హరిశ్చంద్రుడు : ఓహో! తప్పుడు లెక్కలు వ్రాసే చిత్రగుప్తులవారు తమరేనా, స్వామీ!

యమధర్మరాజు : ఇది న్యాయస్థాన మని మరచిపోతున్నావ్!

హరిశ్చంద్రుడు : న్యాయస్థానం కాదు, అన్యాయస్థానం. లేకపోతే సత్యవ్రతానికి, ధర్మనిరతికి విశ్వవిఖ్యాతి నార్జించుకొన్న మ మ్మిక్కడికి రప్పిస్తారా? యమధర్మరాజు పాలించే న్యాయ మిదే కాబోలు! ఆయనను నా యెదట పడనివ్వండి అడగవలసిన నాలుగు మాటలు ముఖంమీదే అడిగివేస్తాను.

యమధర్మరాజు : రెచ్చిపోయి పిచ్చిగా మాట్లాడుతున్నావు సుమా!

హరిశ్చంద్రుడు : పిచ్చిగా మాట్లాడుతున్నది మేము కాదు, మీరే! ఇంతకూ మీ రెవరు

చిత్రగుప్తుడు : వారే ధర్మ ప్రభువులు,

హరిశ్చంద్రుడు : యమధర్మరాజులు తమరేనా? తమరు భయంకరులని విన్నామే!

యమధర్మరాజు : పాపుల దృష్టిలో న్యాయమూర్తులు భయంకరులే!

హరిశ్చంద్రుడు : మా విషయంలో తమరు పొరపడినట్టున్నారు. లేకపోతే ఇంతటి . ఘోరాన్యాయానికి పాల్పడరు!

యమధర్మరాజు : పొరపడినామా? ఏ విధంగా?

హరిశ్చంద్రుడు : మా సూర్యవంశంలోనే మరొక హరిశ్చంద్రుడు ఉండేవాడు. ఆయన తండ్రి పేరు కూడా త్రిశంకుడే. ఆయన అనృత దోషానికి పాల్పడ్డాడు. వరుణదేవుని వరప్రసాదంగా తాను పొందిన పుత్రుని ఆయన ప్రీత్యర్థం యాగపశువుగా చేసి నరమేధ జరుపుతానని తా నిచ్చిన మాటను ఆయన నిలుపుకోలేదు. ఆయన పాపాన్ని ఈ చిత్రగుప్తుడు నాకు అంటగట్టినట్టున్నాడు.

యమధర్మరాజు : మా చిత్రగుప్తు డట్టి పొరపాటు చేయలేదు.

హరిశ్చంద్రుడు : అయితే, మమ్ము తన సమక్షానికి ఎందుకు రప్పించినట్టు?

యమధర్మరాజు : ఎందుకు రప్పించామో విచారణ తర్వాత నీకే తెలుస్తుంది.

హరిశ్చంద్రుడు : తెలిసి మేము చేసిన పాప మేదీ లేదే?

యమధర్మరాజు : తెలియక చేసే పాపా లుండవచ్చు గదా! తెలిసి చేసినా, తెలియక చేసినా పాపాలు పాపాలే! పైగా, నీవు చేసినవి తెలియక చేసిన పాపాలని నమ్మలేము. హరిశ్చంద్రుడు : అవేవో సెల విస్తారా?

యమధర్మరాజు : (తన లేఖకునివైపు తిరిగి) చిత్రగుప్తా! విచారణ లాంఛనాలను ప్రారంభించు! (కింకరులతో) అతడిని

విడిచిపెట్టి, మీరు పొండి. అవసరమైనప్పుడు మేము పిలుస్తాము. (హరిశ్చంద్రుని విడిచిపెట్టి, యమధర్మరాజుకు భక్తితో నమస్కరిస్తూ కింకరులు వెళ్లిపోతారు).

చిత్రగుప్తుడు : (హరిశ్చంద్రునితో) నీ పేరు?

హరిశ్చంద్రుడు : పేరైనా తెలియకుండానే పిలిపించావా, స్వామి? నరకానికి తగినట్టుగానే వున్నది మీ నడవడిక!

యమధర్మరాజు : తిరిగి హెచ్చరిస్తున్నాము - ఇది న్యాయస్థానం! అధిక ప్రసంగం చేయక, అడిగిన ప్రశ్నకు బదులు చెప్పు.

చిత్రగుప్తుడు : నీ పేరు?

హరిశ్చంద్రుడు : రాజమాన్య, రాజపూజిత శ్రీశ్రీశ్రీ హరిశ్చంద్ర చక్రవర్తి.

(యమధర్మరాజు నొసలు యెగరవేసి, చిరునవ్వు నవ్వుతాడు).

చిత్రగుప్తుడు : తండ్రి పేరు?

హరిశ్చంద్రుడు : త్రిశంకుచక్రవర్తి.

చిత్రగుప్తుడు : ఊరు?

హరిశ్చంద్రుడు : అయోధ్యానగరం.

చిత్రగుప్తుడు : వృత్తి?

హరిశ్చంద్రుడు : చతురంభోధిపరీత భరతక్ష్మాతల మహాసామ్రాజ్యాధిపత్యం.

చిత్రగుప్తుడు : నీ పాపాల నంగీకరిస్తున్నావా?

హరిశ్చంద్రుడు : ఆ పాపా లేవో తమరు సెల వివ్వలేదు!

చిత్రగుప్తుడు : సత్యవ్రతంలో నిష్ఠ తప్పడం నీ మొదటి పాపం.

హరిశ్చంద్రుడు : (ఆశ్చర్యంగా) సత్యహరిశ్చంద్రుడుగా పేరందిన మేము సత్యవ్రతంలో నిష్ఠ తప్పడం! ఈ అధోలోకంలో నుంచి చూచినప్పుడు అన్నీ తలక్రిందులుగానే కనబడతాయి కాబోలు!

యమధర్మరాజు : ఎలా కనబడతాయో త్వరలోనే తేలుతుంది. నీ పాపాన్ని అంగీకరిస్తున్నావా?

హరిశ్చంద్రుడు : లేదు.

యమధర్మరాజు : చేసిన ఒక పాపాన్ని చేయలే దంటే, అది రెండు పాపాలౌతుంది సుమీ!

హరిశ్చంద్రుడు : సత్యవ్రత నిష్ఠలో సామ్రాజ్యాన్ని త్యజించడానికైనా సంకోచించని పుణ్యపురుషుడనని భూలోకంలో మాకున్న కీర్తి తమ లోకం వరకు రాలేదు కాబోలు!

యమధర్మరాజు : కీర్తి కేమిలే! అది శేషంగా ఈ లోకంలోనే మిగులుతుంది! కీర్తి, అపకీర్తులతో నిమిత్తం లేకుండా మే మిక్కడ చేసేది పాపపుణ్యాల పరిశీలన.

హరిశ్చంద్రుడు : అయితే, మేము సత్యవ్రతంలో నిష్ఠ తప్పినట్టే తమరు భావిస్తున్నారా?

యమధర్మరాజు : ఔను!

హరిశ్చంద్రుడు ఎప్పుడు? ఎక్కడ?

యమధర్మరాజు : దాన్ని మా చిత్రగుప్తుడు వివరిస్తాడు.

చిత్రగుప్తుడు : (తన ముందు పెట్టుకొన్న వ్రాతప్రతి పుటలను పరికిస్తూ, యమధర్మరాజుతో) విశ్వామిత్రునికి రాజ్యాన్ని ధారవోసిన ఘట్టంతో ప్రారంభించ మంటారా, ప్రభూ!

యమధర్మరాజు : మంచిది.

హరిశ్చంద్రుడు : ఆడిన మాట ప్రకారం ఆ మహర్షికి సామ్రాజ్య మిచ్చి, దారాసుతులను వెంటబెట్టుకొని, కట్టుగుడ్డలతో

కాననాలకు వెళ్ళిపోయాము. మాటకోసం మహీమండలాధి. పత్యాన్ని చేజేతుల వదలుకొన్నామని నవలోకానికి లోకమే మమ్ము కీర్తిస్తున్నది. ఇది తమ లెక్కలలోకి పాపంగా ఎక్కడం - ఔరా! - ఎంత విపరీతం! (చిత్రగుప్తునితో) ఈ ! పద్ధతిలోనే వారు లెక్కలు వ్రాస్తారా, స్వామి?

యమధర్మరాజు : అతనిపై నీవు విసరులు విసర నక్కరలేదు. మాకు సమాధానం చెప్పు! నీవు రాజ్యాన్ని ధారవోసిన వెంటనే విశ్వామిత్రుడు ఏమన్నాడు?

హరిశ్చంద్రుడు : యాగానికై అంతకు ముందొకనాడు మేము దానంగా తమ కిచ్చిన ధనాన్ని తిరిగి తెమ్మన్నారు.

యమధర్మరాజు : తిరిగి తెమ్మన్నాడా? అంటే, ఒకసారి నీవు దాన్ని చెల్లించావన్న మాట.

హరిశ్చంద్రుడు : చెల్లించా మనే చెప్పవచ్చు. యాగార్థం మహర్షి కోరిన ధనాన్ని మత్తేభాల పై కట్టించి వెంటనే పంపుతా మన్నాము. "వద్దు! వద్దు! మా కవసరమైనప్పుడు మేమే వచ్చి తీసుకు వెడతాము. అంతవరకు రాజకోశాగారంలో దాన్ని భద్రపరచి వుంచు!" అని చెప్పి ఆయన వెళ్ళిపోయారు. "తమ ధనం తమవద్దనే ఉండడం మంచి"దని మే మెంత చెప్పినా ఆయన వినిపించుకోలేదు.

యమధర్మరాజు : నీ వద్ద భద్రపరచిన తన ధనాన్ని తనకు అప్పగించవలసిందిగా మహర్షి కోరడం దాన్ని తిరిగి తెమ్మనడం కాగలదా?

హరిశ్చంద్రుడు : మా రాజ్యంతో పాటు ఆయన ధనాన్ని భద్రపరచిన కోశాగారాన్ని కూడా ఆయనకు మేము అప్పగింత పెట్టలేదా? అయినప్పుడు దాన్ని తెమ్మనడం తిరిగి తెమ్మనడమే కాదా? పైగా, అది కొద్దిపాటి ధనమైనా కాదు. దంతావళంపై బలవంతుడొకడు నిలిచి, రత్నాన్ని ఎంత పైకి రువ్వుతాడో అంత యెత్తు ధనం!

యమధర్మరాజు : రాజ్యాన్ని ధారవోసే సందర్భంలో రాజకోశాగారంలో తమ కోర్కెపై భద్రపరచిన తమ ధనంవినా తక్కిన దాన్ని మాత్రమే ధారవోస్తున్నానని విశ్వామిత్రునితో నీ వన్నావా?

హరిశ్చంద్రుడు : ఆ మాట మే మనవలసిన పనిలేదు కాబట్టి అనలేదు. విశ్వామిత్ర మహర్షి తపోవనం మా రాజ్యంలోనే ఉన్నది. ఆ కారణాన తమ తపోవన భూములువినా, తక్కిన మా రాజ్యాన్ని ధారవోస్తున్నామని మే మనాలా? పైగా, ఒకసారి మేము దానం చేసినంతనే ఆ ధనం ఆయనదై పోయింది. ఆయన ధనాన్ని ఆయనకే రెండవసారి మేము దానం చేయగలమా?

యమధర్మరాజు : ఈ వాదం ఆయనవద్ద చేశావా?

హరిశ్చంద్రుడు : ఇంత వివరంగా చేయలేదు గాని, మా రాజ్యంతోపాటు ఆయన ధనాన్ని, భద్రపరచిన కోశాగారాన్ని కూడా ఆయనకే అప్పగించినట్టు చెప్పాము.

యమధర్మరాజు : అందుపై ఆయ నేమన్నారు?

హరిశ్చంద్రుడు : ఆడిన మాట తప్పుతున్నా వన్నారు.

యమధర్మరాజు : ఆయన ఆరోపణ నిజమైనదేనా?

హరిశ్చంద్రుడు : కాదు.

యమధర్మరాజు : అయితే, తనకు ముట్టిన ధనం ముట్ట లేదని ఆయన పలకడం అబద్ధం కాదా?

హరిశ్చంద్రుడు : అంతమాట మే మనలేము.

యమధర్మరాజు : "నీవు అబద్ధమాడుతున్నా"వని విశ్వామిత్రునికి చెప్పడానికి చాలా సాహసం కావాలి. ఆయన శాపాలభయం మాకులేదు కాబట్టి, ఈ సందర్భంలో ఆయన అబద్ధమాడినట్టు మే మనవచ్చునా?

హరిశ్చంద్రుడు : తమ రేమైనా అనగలరు!

యమధర్మరాజు: అది అబద్ధమైనప్పుడు నీవు దానికి తలవొగ్గ వచ్చునా?అబద్ధానికి తలవొగ్గడం అబద్ధమాడ్డంతో సమానం కాదా?

హరిశ్చంద్రుడు : ఆ విధంగా మేము భావించలేదు.

యమధర్మరాజు : ఎందువల్ల?

హరిశ్చంద్రుడు : సత్యవ్రతాన్ని ఎవరికి వారు పాటించగలరు గాని మరొకరిని నిర్బంధించి పాటింపజేయగలరా?

యమధర్మరాజు : విశ్వామిత్రుని నిర్బంధించి ఆయనచే సత్యవ్రతాన్ని పాటింపజేసే ప్రశ్న ఇక్కడ లేదు. ఆయన అబద్ధమాడగా, అది అబద్ధమని చెప్పకపోగా, సత్యంగా దాన్ని ఎందుకు స్వీకరించావు?

హరిశ్చంద్రుడు : మేము దానంగా తమ కిచ్చిన ధనం ఆయనకు ముట్టనే ముట్టిందని మే మనకపోలేదు. అయినా, మా మాట ఆయన వినిపించుకోలేదు.

యమధర్మరాజు : ఆయన వినిపించుకొన్నా, వినిపించుకొనకపోయినా, వాస్తవం అంతే కాదా?

హరిశ్చంద్రుడు : అంతే!

యమధర్మరాజు : అయినప్పుడు తిరిగి ధన మివ్వడానికి సమ్మతించడం వాస్తవానికి ద్రోహం చేయడం కాదా?

హరిశ్చంద్రుడు : విశ్వామిత్ర మహర్షికి ధర్మసూక్ష్మాలు చెప్పవలసింది మేమా అని సంకోచించాము. యమధర్మరాజు : ఆయన మహర్షి కాక, నీ రాజ్యంలో సామాన్య పౌరుడైతే, ఆ విధంగా సంకోచించేవాడివా? మహర్షులైనా, మరొకరైనా, ధర్మసూక్ష్మాలు ధర్మసూక్ష్మాలే కావా? నీ రాజ్యంలో నీవు న్యాయపాలన చేసింది ఈ పద్ధతిలో నేనా?

హరిశ్చంద్రుడు : న్యాయపాలనలో మేము శక్తిమంతులకు, శక్తిహీనులకు మధ్య వివక్ష చేయలేదు. మహర్షిని మేము సంతృప్తిపరచడం, అందువల్ల వచ్చే కష్టనష్టాలు మావే కాని, ఇతరులకు కావని...

యమధర్మరాజు : నీ చర్య వల్ల నీవేనా కష్టనష్టాల పాలైంది? చంద్రమతి మాటేమిటి? ? లోహితాస్యుని మాటేమిటి? వారిని నీవు అష్టకష్టాల పాయేయలేదా? అన్నవస్త్రాలకు వారిని దూరం చేయలేదా? పశువులవలె వారిని సంతలో తెగనమ్ముకో లేదా?

హరిశ్చంద్రుడు : వారు నా భార్యాపుత్రులు.

యమధర్మరాజు : నీ భార్యా పుత్రు లైనంత మాత్రాన నీ కీర్తి దాహానికి వారు బలికావాలా?

హరిశ్చంద్రుడు : మే మాడిన మాట తప్పరాదని మా కంటె వారే ఎక్కువ పట్టుదల చూపించారు.

యమధర్మరాజు : ఆడిన మాట తప్పకుండానే అబద్ధ మాడవచ్చు. నిజాన్ని మాటలోనే కాదు; మనస్సులో కూడా పాటించాలి. సత్యవ్రతాన్ని నెరపవలసింది మనోవాక్కాయకర్మలతో. అయినా, కేవలం మాటలను పట్టుకొని వ్రేలాడ్డమే సత్యవ్రతంగా నీవు సంభావించావు! సరే! చిత్రగుప్తా! సత్యానికి ఇతడు ద్రోహం చేసిన మరొక సందర్భ మేది?

చిత్రగుప్తుడు : (వ్రాతప్రతి పుటలను తిరగవేస్తూ) నక్షత్రకుని దారిబత్తెం విషయంలో!

హరిశ్చంద్రుడు : ఆ సందర్భంలో కూడా మేము అపచారం చేశామా?

యమధర్మరాజు : నిస్సందేహంగా! "నీ గురుకార్యంపై నీవు మావెంట వచ్చినప్పుడు నీకు మే మెందుకు దారిబత్తె మివ్వాలి? పైగా, మావెంట నున్నప్పుడు మేము నిన్ను పోషించలేదా? అవి కందమూల ఫలాలే కావచ్చు. అయినా, వాటిని ముందు నీకు పెట్టి, నీవు తినగా మిగిలినవాటినే మేము తినలేదా? మాకు మిగల్చకుండా వాటిని నీవే తినివేస్తే, మేము పస్తుండలేదా? అయినా, దారిబత్తెం కోరడం తగునా?" అని నీవు నక్షత్రకుని ప్రశ్నించలేదా?

హరిశ్చంద్రుడు: ఔను.

యమధర్మరాజు : అయినా, నక్షత్రకుడు విశ్వామిత్రుని పేరెత్తేసరికి బెదిరిపోయి, నిన్ను నీవు వీరబాహునికి తెగనమ్ముకొని, దారిబత్తె మిచ్చి పంపించలేదా?

హరిశ్చంద్రుడు : మే మేమి చేసినా, ఆడినమాట తప్ప రాదన్న దీక్షతోనే.

యమధర్మరాజు : మాట యిచ్చినట్టు భ్రమపడ్డానికైనా ఇక్కడ సావకాశం లేదే? విశ్వామిత్రుడు నక్షత్రకుని నీ వెంట

పంపినప్పుడు అతడిని పోషించడం చాలదని నీతో అన్నాడా? అదనంగా దారిబత్తెం చెల్లించ వలె నన్నాడా? అందుకు నీ వంగీకరించావా?

హరిశ్చంద్రుడు : లేదు.

యమధర్మరాజు : ఆడినమాటే లేనప్పుడు దాన్ని తప్పడమేమిటి, తప్పక పోవడమేమిటి?

హరిశ్చంద్రుడు : దారిబత్తెం మాట విశ్వామిత్ర మహర్షి మాతో అనకపోయినా, నక్షత్రకునితో అన్నారేమో అని మే మనుమానించడానికి వీలు లేదా? లేకపోతే, నక్షత్రకుడు అంతగా పట్టు పట్టేవాడా?

యమధర్మరాజు : విశ్వామిత్రుని మాట పైనే నక్షత్రకుడు దారిబత్తెం తెమ్మన్నా, అది న్యాయం కాదు. న్యాయం కాదని నక్షత్రకునికి నీవు స్వయంగానే చెప్పావు. న్యాయం కానిదాన్ని ధిక్కరించడం సత్యవ్రతంలో ఒక భాగం కాదా? న్యాయం లేనిచోట సత్యం నిలవగలదా?

యమధర్మరాజు : అయితే, ఆయన అభిమతాన్ని అన్ని సందర్భాలలో గౌరవించలేదేమి?

హరిశ్చంద్రుడు : అంతదూరం మేము ఆలోచించలేదు. దారిబత్తెం చెల్లించాలనడం విశ్వామిత్రుని అభిమతమైతే, దాన్ని గౌరవించడం మా ధర్మమని భావించాము.

యమధర్మరాజు : చిత్రగుప్తా! అదేమిటో వివరించు!

హరిశ్చంద్రుడు : అన్ని సందర్భా లంటే తమ తాత్పర్యం?

చిత్రగుప్తుడు : తన కుమార్తెలను వివాహ మాడవలసిందిగా విశ్వామిత్రుడు కోరగా, అందుకు నీవు నిరాకరించలేదా?

హరిశ్చంద్రుడు : వర్ణవ్యవస్థను రక్షించవలసిన మేము వర్ణ సాంకర్యానికి దిగడం మా రాజధర్మానికి విరుద్ధం కాదా?

యమధర్మరాజు : రాజులైన వా రెందరు వర్ణాంతర వివాహాలు చేసుకోలేదు?

హరిశ్చంద్రుడు : వీరు వర్ణబాహ్యలు, మాతంగకన్యలు.

యమధర్మరాజు : మీ కులగురువు వసిష్ఠుని పత్ని మాతంగ స్త్రీ కాదా?

హరిశ్చంద్రుడు : వారు మహర్షులు; వా రేమైనా చేస్తారు!

యమధర్మరాజు : మీరు మహారాజులు; వారూ ఏమైనా చేస్తారు? వారు అబలలన్న సంకోచమైనా లేకుండా మాతంగకన్యలను నీవు దండించలేదా?

హరిశ్చంద్రుడు : లేదు, పాపపు కోర్కెను వారు కోరగా మా సమక్షం నుంచి తొలగించ మన్నాము. అంతే!

యమధర్మరాజు : మరి, వారిని నీవు దండించినట్టు విశ్వామిత్రుడు నిన్ను ఎందుకు నిందించవలసి వచ్చింది?

హరిశ్చంద్రుడు : అది అకారణనింద.

యమధర్మరాజు : అయితే, తిరిగి అసత్యాన్ని సత్యంగా గుర్తించా వన్నమాట! వాస్తవానికి తిరిగి ద్రోహం చేశా వన్నమాట!

హరిశ్చంద్రుడు : తమకు తెలిసిన ధర్మసూక్ష్మాలు అందరికీ తెలుస్తాయా?

యమధర్మరాజు : ధర్మసూత్రాల పరిజ్ఞానం ఎంత మాత్రం లేకుండా సత్యవ్రతానుష్ఠానం సాధ్యమా?

హరిశ్చంద్రుడు : మా వ్రతాన్ని మా వసిష్ఠ, విశ్వామిత్రులు హర్షించారు.

యమధర్మరాజు : శంఖంలో పోసిందే తీర్థమైనట్టు, మహర్షులు హర్షించిందే సత్యవ్రత మౌతుంది కాబోలు!

హరిశ్చంద్రుడు : అయితే, తమరు చెప్పే సత్యవ్రత మేది?

యమధర్మరాజు : ఇంత వరకు చెప్పింది చాలదా? ఇంకా చెప్పాలా? అయితే, విను! నీవు భ్రమపడుతున్నట్టు అబద్ధా లాడకపోవడమే సత్యవ్రతం కాబోదు. భావనాబలం లేక అబద్ధా లాడకపోవచ్చు, కల్పనాచాతుర్యం లేక అబద్ధా లాడకపోవచ్చు, ధైర్యసాహసాలు లేక అబద్ధా లాడకపోవచ్చు. అది అంగిలితో పాటించే సత్యవ్రతమే, అంతరంగంతో పాటించేది కాదు. కొందరి విషయంలో అది పైపై నటన; కొందరి విషయంలో అది కీర్తి దాహం. అట్టివారి కంటె అబద్ధ లాడేవారే నయం.

హరిశ్చంద్రుడు : (వెటకారంగా) అబద్ధ లాడేవారే నయమా? ఈ సూత్రం తమ లోకానికే వర్తిస్తుందా, అన్నిటికీనా?
యమధర్మరాజు : ఏ లోకంలోనైనా అంగిలితో నిజమాడేవానికంటె అంతరంగంలో కల్మషం లేకుండా అబద్ధ మాడేవాడే నయం!
హరిశ్చంద్రుడు : ఇదేనా సత్యవ్రతానికి తమ నిర్వచనం?
యమధర్మరాజు : అది నీకు అర్థం కాకపోవచ్చుగాని, సత్యవ్రత మంటే అసత్యాన్ని ఖండించడం, అధర్మాన్ని నిరసించడం, అవినీతిని ప్రతిఘటించడం, అన్యాయాన్ని ధిక్కరించడం, అస్వాతంత్ర్యాన్ని నిర్మూలించడం.
హరిశ్చంద్రుడు : అస్వాతంత్ర్య నిర్మూలన కూడా సత్యవ్రతంలో ఒక భాగమా?
యమధర్మరాజు : స్వాతంత్ర్యం లేనిచోట సత్యం నిలవగలదా? న్యాయం నిలవగలదా? అస్వాతంత్ర్యంపట్ల, అన్యాయంపట్ల ఆగ్రహంతో కూడిందే సత్యవ్రతం. దాన్ని సత్యాగ్రహ మన్నా అనవచ్చు.
హరిశ్చంద్రుడు : తిరిగి ప్రశ్నిస్తే సత్యవ్రత నిర్వచనాన్ని తమరు మరింత సాగదీస్తారేమో!
యమధర్మరాజు : సత్యవ్రత సమగ్ర స్వరూపాన్ని తెలుసుకొనడానికైనా జంకుతున్న నీవు సత్యవ్రతాన్ని పాటించగలవా?
హరిశ్చంద్రుడు : మేము దాన్ని పాటించలేకపోయామని మా విశ్వామిత్రు లనలేదు, మా వసిష్ఠు లనలేదు
యమధర్మరాజు : వారి మాట కేమి? నీ అంతరాత్మ ఏ మంటున్నది?
హరిశ్చంద్రుడు : దాన్ని మేము శోధించుకోలేదు.
యమధర్మరాజు : ఆత్మశోధన లేకుండానే సత్యవ్రతం కొనసాగించా వన్నమాట! ఇప్పుడైనా ఒకసారి దాన్ని శోధించుకుంటే, మాతంగకన్యలకు నీ అంతఃపురంలో స్థాన మివ్వకపోయినా నీ నీ అంతరంగంలో స్థాన మిచ్చినట్టు నీకే తెలుస్తుంది.
హరిశ్చంద్రుడు : (చెవులు మూసుకొంటూ) శివశివా!
చిత్రగుప్తుడు : మాతంగకన్యలను ఇంతకుముందే ఈయన సంస్మరింగా డు, ప్రభూ!
హరిశ్చంద్రుడు : ఎప్పుడు?
చిత్రగుప్తుడు : మా పిలుపు రావడానికి కొంచెం ముందుగా, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు.
హరిశ్చంద్రుడు : అపస్మారక స్థితిలో జరిగినదానికి మేము బాధ్యులమా?
యమధర్మరాజు : స్వప్నాలలోవలె అపస్మారక స్థితిలో వింతవింత రూపాలలో బాహిరిలేని అంతరంగంలో నిగూఢమై ఉండే అపరితృప్త వాంఛలే! ప్రయత్నించి కూడా తీర్చుకొనలేక పోయిన కోర్కెలు, లోకానికి వెరచి ప్రయత్నించకుండా విడిచిపెట్టిన కోర్కెలు - ఇవన్నీ నిద్రలో స్వప్నాలుగా, సంధిలో ప్రేలాపనలుగా వెలుపలికి తోసుకు వస్తాయి. నిజ మనేది మనస్సు పైపొరలలో కాక, దాని లోతులలో దాగి వుంటుంది. దాన్ని తెలుసుకొనగలవాడే సత్యవ్రతుడు.
హరిశ్చంద్రుడు : తమ మాటలు మాకర్థం కావడం లేదు. కారుణ్య రహితమైన తమ ధర్మచర్చతో మమ్ము ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఏమైనా, తెలిసి మేము ఏ దోషాన్నీ చేయలేదు.
చిత్రగుప్తుడు : (వ్రాతప్రతి పుటలలోకి చూస్తూ) తెలిసి చేసిన దోషం కూడా ఉన్నది ప్రభూ!
హరిశ్చంద్రుడు : తెలిసి చేసిన దోషం ఉన్నదా?
యమధర్మరాజు : లేకేమి? చంద్రమతి నిర్దోషి అని నీకు తెలియదా? శవదహనానికి చెల్లించవలసిన సుంకానికై ఆమె కాశీరాజపుత్రుని హత్య చేయలేదని నీకు తెలియదా? అయినా, ఆమె శిరచ్ఛేదానికి నీ వెందుకు సిద్ధపడినట్టు?
హరిశ్చంద్రుడు : అప్పటిలో మేము వీరబాహుని సేవకులమైనందున మా సేవా ధర్మాన్ని పాటించబోయాము.
యమధర్మరాజు : రాజధర్మ మని, సేవాధర్మ మని ప్రతిచర్యను సమర్థించుకొనడానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నావు.వాటిని మించిన మరొక ధర్మం - మానవధర్మం లేదా?దానికి విరుద్ధంగా నీ భార్యాపుత్రులను నీ వెంత క్షోభ పెట్టలేదు? నీ
హరిశ్చంద్రుడు : సత్యమని మేము నమ్మినదానికోసం మాతోపాటు వారు కూడా త్యాగాలను చేయవలసి వచ్చింది.

యమధర్మరాజు : సంతోషంగా చేసేవే త్యాగాలు, విలపిస్తూ చేసేవి కావు. సత్యవ్రతానికై విషమ పరీక్షలకు గురికావలసి వచ్చిందని నీ వెంతగా విలపించ లేదు? నీ

హరిశ్చంద్రుడు : అది మానవసహజం.

యమధర్మరాజు : నిర్దోషి అని తెలిసి కూడా భార్యా శిరచ్ఛేదానికి సంసిద్ధం కావడం కూడా మానవసహజ మేనా?

హరిశ్చంద్రుడు : మా ప్రతిచర్యకు మీరు విపరీతార్థాలు తీస్తున్నారు!

యమధర్మరాజు : మేము తీస్తున్నవి ఏ అర్థాలో ఇక్కడ కొంత , లంపాటు వుంటే నీకే తెలుస్తుంది. కీర్తి దాహం, స్వర్గలోభం మొదలైన నీ తక్కిన పాపాలను క్షమిస్తున్నాము. సత్యవ్రతాన్ని సరిగా అర్థం చేసుకొనక, అర్థం చేసుకొన్న మేరకైనా దాన్ని నిష్ఠగా పాటించక, నీవు చేసిన పాపానికై ఒక పుష్కరంపాటు ఇక్కడ మా అతిథిగా ఉండు.

హరిశ్చంద్రుడు : (తన చెవులను తనే నమ్మలేనట్టు) ఎవరికి ఈ కఠిన శిక్ష!

యమధర్మరాజు : చతురంభోధి పరీత భరత క్ష్మాతల చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ హరిశ్చంద్రులవారికి!!

హరిశ్చంద్రుడు : ఆ చక్రవర్తి సత్యవ్రత పాలనకై తన సామ్రాజ్యాన్ని ధారవోయలేదా? ఆయన కేనా ఈ ఘోర శిక్ష!

యమధర్మరాజు : మూల్యంలేని సత్యానికి సామ్రాజ్యాన్ని మూల్యంగా భావిస్తున్న నీకు మే మిచ్చింది చాలా స్వల్ప శిక్ష!

హరిశ్చంద్రుడు : విశ్వామిత్రులవలె మీరు మమ్మ పరీక్షిస్తున్నారా?

యమధర్మరాజు : ఇంతవరకు ఆ భ్రమలో ఉన్నావా?

హరిశ్చంద్రుడు : మా సత్యనిషా గరిష్ఠను పరీక్షించడానికి ఆయన కూడా పెద్ద నాటకం నడిపారు లెండి!

యమధర్మరాజు : మూర్ఖుడా! ఇది న్యాయస్థానం, నాటకశాల కాదు.

హరిశ్చంద్రుడు : (తెల్లబోతూ) నిజంగానే తమరు మాకు శిక్ష విధించా రన్నమాట!

యమధర్మరాజు : నిజంగానో, అబద్ధంగానో ఒక పుష్కరంపాటు కరకు కత్తుల బోనులో గడిపిన తర్వాత నీకే తెలుస్తుందిలే!

హరిశ్చంద్రుడు : (సడలిన బింకంతో) ఆ కత్తుల బోనులో మేము పుష్కరం గడపాలా?

యమధర్మరాజు : నీకు తోడుగా చాలా మంది ఉన్నారులే!

హరిశ్చంద్రుడు : వారు చక్రవర్తులు కారు!

యమధర్మరాజు : ఆ చింత నీవు పెట్టుకోనక్కరలేదు. చక్రవర్తుల తలదన్నిన వారే నీ కిక్కడ జతగా వున్నారు.

హరిశ్చంద్రుడు : (దీనంగా) మాకు అన్యాయం జరిగినట్టు మేము భావిస్తున్నాము. ధర్మప్రభువులు మా విషయం పునరాలోచన చెయ్యాలి!

యమధర్మరాజు : మానవునికి, మానవునికి మధ్య అన్ని కృత్రిమ విభేదాలను తొలగించే మృత్యువు తర్వాత కూడా చక్రవర్తినని అహంకరిస్తున్నావు. పాపిగా నిర్ణయించి, శిక్ష విధించిన పిదప కూడా "మేము, మేము" అంటూ నీకు నీవే ఆధిక్య మిచ్చుకొంటున్నావు. నీకు మరొక పుష్కరంపాటు శిక్ష విధిస్తున్నాము.

హరిశ్చంద్రుడు : వద్దు, ప్రభో! వద్దు! తమరు నా కళ్ళు తెరిపించారు! నాకు వివేకం కలిగించారు! మరి అహంకరించను! తమరు ధర్మానికే చక్రవర్తులు, ఈ పాపిని మన్నించండి! ఈ దీనుని కరుణించండి!!

యమధర్మరాజు : సరే! నీ రెండవ శిక్షను ఉపసంహరిస్తున్నాము.

హరిశ్చంద్రుడు : తాము ధర్మప్రభువులే కారు, కారుణ్యమూర్తులు!

యమధర్మరాజు : స్తోత్రపాఠాలకు పొంగేది మీ భూలోకచక్రవర్తులు; మేము కాము సుమీ!

హరిశ్చంద్రుడు : ప్రభువులు తిరిగి నన్ను మన్నించాలి!

యమధర్మరాజు : ఎవరురా, అక్కడ! (కింకరులు నమస్కరిస్తూ ప్రవేశించగా) ఇతడిని తీసుకుపొండి!

(కింకరులు తనవైపుకు ఒక అడుగు వేసివేయకముందే వారి దిక్కులో నడిచి, మేకపిల్లవలె వారిని హరిశ్చంద్రుడు అనుసరిస్తుండగా - తెర).

తృతీయాంకం

(ఈ అంకంలో ప్రవేశించే కొత్త పాత్ర లిద్దరిలో వసిష్ఠుడు వృద్ధుడైనా దృఢకాయుడు. తెల్లని పంచె, తెల్లని ఉత్తరీయం, తెల్లని బవిరిగడ్డం. మెడలో రుద్రాక్షమాలలు, భుజం పైగా యజ్ఞోపవీతం, చేతిలో కమండలం, కాళ్ళకు పావుకోళ్ళు,
కొత్త పాత్రలలో రెండవ వాడైన లోహితాస్యుని వయస్సు దాదాపు నలభై సంవత్సరాలు. చీనాంబరాన్ని ధరించాడు. చెవులకు రత్నకుండలాలు, మెడలో రత్నహారం, వేళ్ళకు వజ్రాంగుళీయాలు, భుజాల నంటుతున్న నల్లని జుట్టు, కోరమీసం.
హరిశ్చంద్రుని శయ్యాగారంపై తిరిగి తెర లేచినప్పుడు సత్యకీర్తి చింతాక్రాంతుడై ఒక భద్రాసనంపై కూర్చుని వుంటాడు. ఆయనకు కొద్ది దూరంలో మరొక భద్రాసనంపై కూర్చున్న కృష్ణపాణి ముఖంలో విచారంకంటె ఆందోళన హెచ్చుగా కనబడుతూ వుంటుంది.

పరిచారకులు చక్రవర్తి పాదాలవద్ద చేతులు కట్టుకుని మౌనంగా నిలబడి వుంటారు.

తెర లేచిన తర్వాత కొన్ని క్షణాల వరకు మృత్యుమందిరంలో కానవచ్చే నిస్తబ్ధత.)

సత్యకీర్తి : (దీర్ఘంగా నిట్టూర్చుతూ) వసిష్ఠులవారైనా ఇంకా దయచేశారు కారు!

కృష్ణపాణి : మరి ఏక్షణమైనా వారు రావచ్చు.

సత్యకీర్తి : యువరాజ ప్రభువులు ఏ కీకారణ్యాలలో వున్నారో! వారికి వర్తమానం చేరిందో, లేదో!

కృష్ణపాణి : ఉపసర్వసేనాని ఘటికుడు. జాడలు తీసి, ఆ ప్రభువుల శిబిరాన్ని ఈ సరికి చేరే వుండవచ్చు. వారిని తోడ్కొని వస్తూనే వుండవచ్చు; మా వైద్యలోపం లేదని వారితో తమరు...

సత్యకీర్తి : (చికాకుగా) మనవి చేస్తాము లెండి! ఎందరు రాజవైద్యులుండి ఏమి ఫలం? యువరాజ ప్రభువులకు కడసారి చూపైనా దక్కించలేకపోయారు.

కృష్ణపాణి : రాజవైద్యులైనా, విధిలిఖితాన్ని మార్చగలరా, మహామంత్రీ! మా లోపం లేకుండా మేము...

హరిశ్చంద్రుడు : (చివాలున మంచంపై లేచి కూర్చుండి) మరి అహంకరించను, మరి అహంకరించను! తమరు నా కళ్ళు తెరిపించారు! నాకు వివేకం కలిగించారు!!

(ఆశ్చర్యసంభ్రమాలతో సత్యకీర్తి, కృష్ణపాణి, పరిచారకులు కొన్ని క్షణాలపాటు నిశ్చేష్టు లౌతారు. వారిలో పరిచారకులు ముందుగా తెప్పరిల్లి, హుటాహుటిగా హరిశ్చంద్రుని చేరి, ఆయనను నెమ్మదిగా పట్టుకొని, శయ్యపై పరుండబెడతారు.).

కృష్ణపాణి : (తాను కొంత తెప్పరిల్లగానే హరిశ్చంద్రుని సమీపించి, నాడీ పరీక్ష చేస్తూ) ఆగిపోయిన నాడి తిరిగి కొట్టుకుంటున్నది! లేచిపోయిన హంస తిరిగి వచ్చింది!

సత్యకీర్తి : (ఎట్టకేలకు నోట మాట రాగా) ప్రభువులవారు గట్టెక్కినట్టేనా? తిరిగి మనకు దక్కినట్టేనా?

కృష్ణపాణి : మళ్ళీ ఆశ కలుగుతున్నది, మహామంత్రీ!, మళ్ళీ ఆశ కలుగుతున్నది! (నాడీనిదానాన్ని కొనసాగిస్తూ) నాడి గతి క్రమంగా హెచ్చుతున్నది. (రెండు, మూడు క్షణాల తర్వాత) నాడీగమనంలో దుర్లక్షణాలు తగ్గుతున్నాయి.

సత్యకీర్తి : అయితే, ప్రభువులు బ్రతికి బయటపడ్డట్టే!

కృష్ణపాణి :(నాడిని, శ్వాసను మరికొంత సేపు పరీక్షించి, ఇవతలికి వస్తూ) మాకు తెలుసు - పోయే ప్రాణాలనైనా సంజీవిని పోలిన మా దివ్యౌషధాలు తిరిగి రప్పిస్తాయని! అసూయా గ్రస్తులైన మాధవశర్మలు, గీదవశర్మలు ఏమి కూసినా, మా హస్తవాసే శ్రీవారిని -

భటుడు : (ప్రవేశిస్తూ) వసిష్ఠులవారు వేంచేస్తున్నారు!

సత్యకీర్తి : (వస్తున్న వసిష్ఠునికి ఎదురుగా వెళ్లి) మహర్షిచంద్రులకు నమస్కారం!

కృష్ణపాణి : (సత్యకీర్తి మాటతో మాట కలుపుతూ) బ్రహ్మర్షులకు నమస్కారం!

వసిష్ఠుడు : (ఉభయుల నుద్దేశించి) శతాయుష్మాన్ భవ!

వసిష్ఠుడు :(హరిశ్చంద్రుని వైపు చూచి) సార్వభౌములు శయ్యాగతులైనారు -స్వాస్థ్యం చెడిందా? ఎప్పుడు? మొన్న మేము చూచి నప్పుడు ఆరోగ్యంగానే వున్నారే!

సత్యకీర్తి : నిన్న ప్రొద్దున కొద్దిగా జ్వరం తగిలింది, సాయంత్రానికి పెరిగి అర్ధరాత్రివేళకు సంధించింది.

కృష్ణపాడి : తెల్లవారేసరికి ఆ సంధి చరమస్థాయికి వెళ్ళింది.

సత్యకీర్తి : ఆశలన్నీ వదలుకొన్న తర్వాత ....

కృష్ణపాణి : హంస లేచిపోయినతర్వాత.... (భటుడు నిష్క్రమిస్తాడు)

వసిష్ఠుడు : ఆఁ! అంత ఉపద్రవం వచ్చిందా?

కృష్ణపాణి : మా దివ్యౌషధాల ప్రభావంతో ప్రభువులవారు పునర్జన్మమెత్తారు!

కసిష్ఠుడు : (హరిశ్చంద్రుని వద్దకు వెళ్లి, నుదుటిపై చేయివేసి) సార్వభౌముని ఫాలభాగంపై స్వేదబిందువు కురిస్తున్నాయి.

కృష్ణపాణి : అయితే, నిస్సందేహంగా వ్యాధి తిరుగుముఖం పట్టినట్టే! జ్వరమిక త్వరగా దిగిపోతుంది! మా దివ్యౌషధాలకు తిరుగులేదు.

వసిష్ఠుడు : (సత్యకీర్తితో) నిన్ననే మాకు వర్తమానం చెయ్యకపోయారా? మంత్రతీర్థ మిచ్చివుంటే ప్రమాదం ఉత్పన్న మయ్యేదే కాదు.

కృష్ణపాణి : రాత్రి పొద్దుపోయేవరకూ ఏదో స్వల్పమైన జ్వరమనే భావించాము. జరిగిన పొరపాటుకు మహర్షిపుంగవులు మమ్ము మన్నించాలి.

(వసిష్ఠుడు తన కమండలంలోని నీళ్ళను హరిశ్చంద్రుని ముఖం పై చల్లుతాడు. కళ్లు నులుముకుంటూ లేచి, హరిశ్చంద్రుడు శయ్యపై కూర్చుంటాడు)

సత్యకీర్తి : బ్రహ్మర్షుల మంత్రతీర్థం ఎంత అమోఘంగా పనిచేసింది!

హరిశ్చంద్రుడు : (నిద్రలోనుంచి నెమ్మదిగా మేల్కొంటున్న వానివలె దిక్కులను కలయజూచి, వసిష్ఠుని గుర్తుపట్టి నంతనే, ఆశ్చర్య భావాన్ని ముఖంలో ద్యోతకంచేస్తూ) తమరు విచ్చేశారా?

వసిష్ఠుడు : ఔను, నాయనా?

హరిశ్చంద్రుడు : ఎప్పుడు?

వసిష్ఠుడు : ఇంతకు ముందే!

హరిశ్చంద్రుడు : విశ్వామిత్రులవారు తమవెంట రాలేదా?

వసిష్ఠుడు : రాలేదు

హరిశ్చంద్రుడు : ఒంటరిగా వచ్చారా? జంటగా వచ్చారా?

వసిష్ఠుడు : జంట యేమిటి, నాయనా?

హరిశ్చంద్రుడు : తమకంటె ముందుగా ఆయ నిక్కడికి వేంచేయవలసిన వారేనే!

వసిష్ఠుడు : అధికంగా మాట్లాడకు, నాయనా! ఆయాసం వస్తుంది.

హరిశ్చంద్రుడు : తమ రిక్కడకు రాక తప్పదని తెలుసుగాని, ఇంత త్వరలో వస్తారనుకోలేదు!

వసిష్ఠుడు : వర్తమానం చేరగానే రాకుండా, ఆలస్యం చేస్తామా?

హరిశ్చంద్రుడు : ఆలస్యంచేస్తే ఊరుకుంటారా ? రెక్కలు పట్టుకుని బడబడ ఈడ్చుకువస్తారు!

వసిష్ఠుడు : ఏమిటి, నాయనా! చిత్రంగా మాట్లాడుతున్నావ్!

హరిశ్చంద్రుడు : (నవ్వుతూ) తమ కెంత శిక్ష? ఒక పుష్కరమా? రెండు పుష్కరాలా? నన్నడిగితే పది పుష్కరాలైనా తమ కది స్వల్ప శిక్షే!

వసిష్ఠుడు : ఏమి మాట లివి నాయనా? నువ్వు ఏ లోకంలో వున్నావ్ ?

హరిశ్చంద్రుడు : తమ రున్న లోకంలోనే!

వసిష్ఠుడు : అంటే?

హరిశ్చంద్రుడు : (మరింతగా నవ్వుతూ) నరకలోకం, మహాత్మా! నరకలోకం! కొన్ని పుష్కరాలపాటు యమధర్మరాజు అతిథిగా తమరు గడపవలసిన నరకలోకం ! అయితే, తమ రిక్కడ రాజపురోహితులుగా వుండలేరు! వెర్రి హరిశ్చంద్రుడు కాదు, యమధర్మరాజు తమ మాయలో పడ్డానికి!

వసిష్ఠుడు : ఏవో పిచ్చిభయాలు నీ మనస్సులో పెట్టుకున్నావు, నాయనా! ఇది అయోధ్యానగరం. నీ

హరిశ్చంద్రుడు : కాదు, మహాత్మా! కాదు! ఇది సంయమినీ నగరం!

వసిష్ఠుడు :అయోధ్యను వీడితే మనం చేరేది, సంయమినీనగరానికి కాదు, నాయనా! అమరావతికే!

హరిశ్చంద్రుడు : (విరగబడి నవ్వుతూ) ఆహాహా! అమరావతి! అమరావతి! పుష్పకంలోనే తమ రిక్కడికి వేంచేశారా! దేవదూతలే తోడ్కొని వచ్చారా? దేవేంద్రుడే స్వాగత మిచ్చాడా? తమ మాతృశ్రీ ఊర్వశీదేవి ఆశీర్వదించిందా? (నవ్వినవ్వి, హరిశ్చంద్రుడు గుక్కతిప్పుకోలేకపోతాడు. పరిచారకులు చప్పున మంచితీర్థ మిస్తారు. రెండు గుక్కలు తాగి, సొమ్మసిల్లి నట్టు హరిశ్చంద్రుడు శయ్య పైకి వాలిపోతాడు.)

కృష్ణపాణి : (నివ్వెరపాటును కప్పిపుచ్చుకొనడానికి ప్రయత్నిస్తున్న వసిష్ఠునితో) సంధిలోనుంచి సార్వభౌములు బయటపడలేదు.

(వసిష్ఠుడు తిరిగి గంభీరముద్ర ధరించి, శిరఃకంపనం చేస్తాడు.)

సత్యకీర్తి : బ్రహ్మర్షులు తిరిగి మంత్రతీర్థం.... :

భటుడు : (ప్రవేశిస్తూ) యువరాజ ప్రభువులు దయచేస్తున్నారు!

(వసిష్ఠుడు, సత్యకీర్తి, కృష్ణపాణి భటుడు ప్రవేశించిన దిక్కుకు చూస్తారు. లోహితాస్యుడు ఆతురతతో ప్రవేశిస్తాడు.)

లోహితాస్యుడు : (వసిష్ఠుని చూడగానే, తలవంచి, చేతులు జోడించి) కులగురువులకు నమస్కారం!

వసిష్ఠుడు : దీర్ఘాయుష్మాన్ భవ! నీ ప్రియజనకులు ఆకస్మికంగా వ్యాధి గ్రస్తులైనారు. నీవు ఆందోళన పడనక్కరలేదు. త్వరలో కోలుకొంటారులే! :

లోహితాస్యుడు : (తండ్రి వద్దకు చకచక వెడుతూ) నాన్నగారికి నమస్కారం! (హరిశ్చంద్రుడు కన్నెత్తి చూడకపోగా, ఆయన శయ్యపై కూర్చుండి, ముఖంలోకి ఆందోళనతో చూస్తూ, అక్కడి వారినందరినీ సమష్టిగా ప్రశ్నిస్తున్నట్టు) స్పృహలో లేరా?

కృష్ణపాణి : వ్యాధి తీవ్రత ఇప్పుడే తగ్గుతున్నది. యువరాజ ప్రభువులు భయపడనక్కరలేదు.

లోహితాస్యుడు : ఎప్పటి నుంచి ఈ స్థితిలో వున్నారు?

కృష్ణపాణి : అర్ధరాత్రి నుంచి.

లోహితాస్యుడు : ముందుగానే మాకెందుకు వర్తమానం చేయలేదు?

సత్యకీర్తి : శ్రీవారికి జ్వరం తగిలింది నిన్న ప్రొద్దునే!

లోహితాస్యుడు : ఇంతలోనే ఇంతగా ప్రమాదించిందా?

వసిష్ఠుడు : ఆందోళన పడకు, నాయనా! అదే తగ్గిపోతుంది.

లోహితాస్యుడు : బ్రహ్మర్షులే మా కిప్పుడు దిక్కు

సత్యకీర్తి : బ్రహ్మర్షుల మంత్రతీర్థం అమోఘంగా పని చేస్తుంది. ఇంతకుముందు వారు తీర్థాన్ని సంప్రోక్షించగానే

సార్వభౌములు శయ్యపై లేచి కూర్చున్నారు.

లోహితాస్యుడు : మరొకసారి మమ్ము కరుణించండి, బ్రహ్మర్షీ!

వసిష్ఠుడు : మంచిది. (కమండలంలోని నీళ్ళను తిరిగి హరిశ్చంద్రుని ముఖం పై జల్లుతూ) పవనాహతికి లోనైన కారుమేఘంవలె అపస్మారక స్థితి మరి విచ్చిపోతుందిలే!

హరిశ్చంద్రుడు : (చన్నీళ్ళు తగలగానే చివాలున లేచి, ఎదురుగా కనబడిన లోహితాస్యుని కౌగలించుకుని కన్నీరు పెడుతూ) వచ్చావా, నా తండ్రీ! నన్ను వెతుక్కుంటూ వచ్చావా? నిన్ను, నీతల్లిని పెట్టరాని కష్టాలు పెట్టాను! ఆమెకు దూరమైనాను - ఆమె క్షమాభిక్ష కోరలేను! నువ్వైనా నన్ను క్షమిస్తావా? నువ్వైనా క్షమిస్తావా? (బిత్తరపడిన లోహితాస్యుడు పలకక పోగా) క్షమిస్తానను, బాబూ! క్షమిస్తా నను!!

లోహితాస్యుడు : (వసిష్ఠునుద్దేశించి, గద్గద స్వరంతో) మా జనకు లింత వింతగా మాట్లాడుతున్నారేమి, బ్రహ్మర్షీ?

వసిష్ఠుడు : సంధి మాట లవి, బాబూ! ఆయన మన లోకంలో లేరు! అయినా, భయం లేదు. ఆయన సత్యవ్రతమే ఆయనను కాపాడుతుంది!

హరిశ్చంద్రుడు : (ఏడ్పులోనుంచి నవ్వులోకి మారి) సత్యవ్రతమా? అది నన్ను కాపాడుతుందా? ఆ వ్రత స్వరూపమైనా నాకు సరిగా తెలియదే! తెలియ జెప్పడానికి మీరు ప్రయత్నించనైనా లేదే! పైగా, నేను సంధిలో ఏదో ప్రేలుతున్నానని అంటున్నారా?

వసిష్ఠుడు : సత్యవ్రతస్వరూపం నీకు తెలియక పోవడ మేమిటి, నాయనా? సత్యహరిశ్చంద్రుడుగా నీ కీర్తి ఆచంద్రతారార్కం నిలుస్తుంది!

హరిశ్చంద్రుడు : మీరు నాలో పెంచింది ఈ కీర్తి దాహాన్నే! దానితోనే నన్ను క్షోభపెట్టుకున్నాను, నాభార్యాపుత్రులను క్షోభ పెట్టాను! ఆ యమధర్మ ప్రభువు పుణ్యమా అని ఇప్పటికైనా నా కళ్లు తెరుచుకున్నాయి, నాకు వివేకం కలిగింది!

లోహితాస్యుడు : (కన్నీటితో తండ్రికి విజ్ఞప్తి చేస్తూ) కులగురువుల దూషణ తిరస్కారాలు మనకు తగవు! (వసిష్ఠునితో) మా పితృపాదులేమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, క్షమించండి.

హరిశ్చంద్రుడు : నావి తెలియని మాటలు కావు, బాబూ! తెలిసిన మాటలే! ఈ వసిష్ఠుడు, విశ్వామిత్రుడు పంతాలకు పోయి, మనలను కాల్చుకు తిన్నారు! సర్వజ్ఞుల మన్న నటనతో మన ఉసురు పోసుకున్నారు! (వసిష్ఠునితో) పొండి! ఇక్కడి నుంచి తక్షణం పొండి! పోతారా, లేదా? ఊఁ!!

(హరిశ్చంద్రుడు శయ్య పై నుంచి దిగబోగా, లోహితాస్యుడు, పరిచారకులు వారిస్తారు. గద్దించగా వచ్చిన అలుపుతో ఆయన వెనకకు వాలిపోతాడు.)

లోహితాస్యుడు : (వసిష్ఠునికి పాదాభివందనం చేస్తూ) బ్రహ్మర్షిపుంగవులు మమ్ము మన్నించాలి.

వసిష్ఠుడు : మన్నించడాని కేమున్నది, బాబూ! విషజ్వరపీడితుని సంధి ప్రలాపాలను బ్రహ్మర్షులు పట్టించుకోరు!

లోహితాస్యుడు : దైవసమానులుగా తమను సంభావించుకునే మా పితృపాదులు ఎంత సంధిలో నైనా ఈ విధంగా తమపట్ల సంచరించడం ఏదో మహావిపరీతం! ఈ విపత్కాలంలో - మహాత్ములు, మీరే మమ్ము రక్షించాలి.

సత్యకీర్తి : బ్రహ్మర్షులు తిరిగి మంత్రతీర్థాన్ని సంప్రోక్షించడం మంచిదేమో!

కృష్ణపాణి : ఔషధ ప్రక్రియకు తప్ప ఈ సంధిప్రకోపం లొంగక పోవచ్చు. బ్రహ్మర్షుల సెలవైతే...

సత్యకీర్తి : (కృష్ణపాణితో) మీరు కాస్త సంక్షేపించండి! (వసిష్ఠునితో) బ్రహ్మర్షులు కరుణించాలి.

వసిష్ఠుడు : పాపం! మన కృష్ణపాణి ఒక అవకాశం కోరుతున్నాడు. దాన్ని అతని కిచ్చి చూడండి! వైద్యంలో అతడు ఘనుడు!

కృష్ణపాణి : (నమస్కరిస్తూ) బ్రహ్మర్షుల దీవనలే మమ్మింత వానిగా చేశాయి!

సత్యకీర్తి : ఆయనకు అవకాశాలకు కొదవలేదులెండి; తమరు సార్వభౌముని కాపాడాలి.

లోహితాస్యుడు : (కాళ్లపై పడుతూ) మా ప్రార్థన మన్నించండి!

(వసిష్ఠుడు లోహితాస్యుని లేవనెత్తి, గంభీరముద్రతో శిరఃకంపనం చేస్తూ కమండలంలోని నీళ్లు మరొకసారి హరిశ్చంద్రుని ముఖంపై చల్లుతాడు.).

హరిశ్చంద్రుడు :(చరాలున లేచి) చాల్చాలు మీ కపట నటన! తీర్థాలని, ప్రసాదాలని నన్నిక మోసపుచ్చలేరు!

లోహితాస్యుడు కళ్లుమూసుకొని విలపిస్తాడు.

హరిశ్చంద్రుడు : విలపిస్తావు దేనికి, బాబూ! ఈ మునిముచ్చుల గుప్పిటిలోనుంచి ఇప్పటికైనా బయటపడినందుకు మనం సంతోషించాలి. ఇలారా! నా దగ్గరికిరా!

లోహితాస్యుడు : (శోకోద్వేగంతో) బ్రహ్మర్షీ! బ్రహ్మర్షీ!

హరిశ్చంద్రుడు : ఆయనను నమ్ముకొని నేను చెడ్డాను. నాయనా! నీవుకూడా ఎందుకు చెడతావు! ఇలారా, నావద్ద కూర్చో!

వసిష్ఠుడు : మహా దుష్టగ్రహా లేవో ప్రవేశించి, ఆయనను పీడిస్తున్నాయి, బాబూ! జప తప హోమాలతోగాని వాటిని తరిమి వేయలేము. మా పుణ్యాశ్రమానికి వెళ్లి, తగు శాంతులు చేస్తాములే! నీవు విచారించకు, బాబూ!

హరిశ్చంద్రుడు : ఔను, మహాత్మా! వసిష్ఠ విశ్వామిత్రు లనే రెండు మహా దుష్ట గ్రహాలు మమ్ము పట్టి పీడిస్తున్నాయి! (లోహితాస్యునితో) నాయనా! మనను, మన రాజవంశాలనే కాదు, మన ప్రజలను సయితం పురోహితులనే ఈ దుష్ట గ్రహాలు తరతరాలుగా పీడిస్తున్నాయి! అంధ విశ్వాసాలనుంచి బయట పడాలంటే, నిర్నిరోధంగా సత్యాన్వేషణ చేయాలంటే, జ్ఞానపరిధులను పెంచుకోవాలంటే, నవపథాలవెంట నడిచి, నూతన శిఖరాలను అందు కోవాలంటే, ముందుగా మనం ఈ దుష్టగ్రహాలను తన్ని తరమాలి!

వసిష్ఠుడు : (లోహితాస్యునితో) సరే, బాబూ! మేము వెళ్ళి వస్తాము! హరిశ్చంద్రుడు : వెళ్లండిగాని, మళ్లీ రాబోకండి సుమీ!

(లోహితాస్యుడు మరింతగా విలపిస్తుండగా తెర).

హిరణ్యకశిపుని హత్య



పాత్రలు:

హిరణ్యకశిపుడు - అనార్య చక్రవర్తి, లీలావతి - హిరణ్యకశిపుని ధర్మపత్ని, ప్రహ్లాదుడు - హిరణ్యకశిపుని కుమారుడు, శుక్రాచార్యులు - హిరణ్యకశిపుని గురువు, సముచి - హిరణ్యకశిపుని సేనాని, అంగిరసుడు - ఆర్యఋషి, బృహత్కీర్తి - అంగిరసుని కుమారుడు, వామదేవుడు - వేరొక ఆర్య ఋషి (వీరు కాక హిరణ్యకశిపుని రాణ్మందిరంలో ఒక భటుడు).

రంగాలు:

ప్రథమ, తృతీయ, పంచమ, సప్తమ రంగాలు హిరణ్యకశిపుని రాచనగరంలో ఆలోచనా మందిరం. ద్వితీయ, చతుర్థ, షష్ట రంగాలు అంగిరస ఋష్యాశ్రమంలో అతిథి సత్కార పర్ణకుటీరం.

సమయాలు:

ప్రథమ రంగం - హిరణ్యకశిపుడు రాజ్యానికి వచ్చిన పిదప అయిదేళ్ళకు, ద్వితీయ రంగం - రెండేళ్ళ తర్వాత, తృతీయ రంగం - మూడేళ్ళ తర్వాత, చతుర్థ రంగం - సంవత్సరం తర్వాత, పంచమ రంగం ఏడేళ్ళ తర్వాత, షష్ఠ రంగం - మూడునెలల తర్వాత, సప్తమ రంగం - నెల తర్వాత. (వేషధారణ సందర్భంలో వివిధ రంగాల మధ్య దొర్లిన కాలచక్ర గతిని దృష్టిలో పెట్టుకోవాలి).

ప్రథమ రంగం

(సువిశాలమైనది హిరణ్యకశిపుని ఆలోచనా మందిరం. ప్రేక్షకుల దిక్కునుంచి కుడివైపున ఆలోచనా మందిరం నుంచి వెలుపలికి వెళ్ళే ద్వారం; ఎడమవైపున అంతఃపురంలోకి వెళ్ళే ద్వారం.

అది సుందరమైన మందిరం. దాని కుడ్యాలపై వివిధ వర్ణాలతో సహజ సుందరంగా చిత్రించబడిన లతలు, పుష్పాలు. అక్కడక్కడ కొన్ని చిత్రాలు కూడా.

ఆలోచనా మందిరం ముందు భాగంలో కొన్ని భద్రాసనాలు; వెనుక భాగంలో కొట్టవచ్చినట్టుగా ఒక పెద్ద స్తంభం, ఆ స్తంభానికి ఆవలగా ఇరువైపుల గదులలోనికి ద్వారాలు.

సిరి సంపత్తుల ప్రదర్శన, ఇతర విధాలైన ఆడంబరాలు లేకుండా, కళాభిమాని, సంస్కృతిపరుడు చక్కని అభిరుచులతో నిర్మించుకొన్నట్టిదిగా వుంటుంది, ఆ మందిరం రక్కసునిగా పురాణాలు చిత్రించినా, హిరణ్యకశిపునిది ధీరోదాత్తమైన గంభీరమూర్తి. చూడగానే అసాధారణ వ్యక్తిగా పోల్చుకొనదగువాడు. నాటకం ప్రారంభంలో ఆయన వయస్సు ఇంచుమించు ముప్పై మాత్రం. అంతకంటే కూడా చిన్నవాడుగా కనబడతాడు. తక్కిన రంగాలలో కూడా అసలు వయస్సు కంటె చిన్నవాడుగానే కన్పిస్తాడు.

పెద్ద కళ్ళతో, కోటేరు వంటి ముక్కుతో, తీరైన పెదవులతో, నవ్వితే బొట్టలు పడే గుండ్రని బుగ్గలతో, కోరమీసంతో, నిగనిగలాడుతున్న నల్లని గిరజాలతో హిరణ్యకశిపుని ముఖం ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది.

తన వ్యక్తిత్వానికి తగినట్టు ఆడంబర రహితమైనవే హిరణ్యకశిపుని వేషభాషలు. చీనాంబరం ధరిస్తాడు; వక్షస్థలాన్నీ కప్పుతూ కుడిభుజం పైగా ఉత్తరీయం. చెవులకు రత్నకుండలాలు, మెడలో రత్నహారం, బాహువులకు సువర్ణకేయూరాలు, ఎడమ చేతివేలికి ఒక వజ్రాంగుళీయం.

శుక్రాచార్యుని వయస్సు నాటక ప్రారంభానికి యాభై పైగా, అరవైలోపు. తక్కిన ఋషులకు వలె గడ్డాలు, మీసాలు లేవు. చెవులప్రక్క ముచ్చిలిగుంట మినహాయిస్తే మిగిలింది బట్టతల. శాంత గాంభీర్యాలు తొణికిసలాడే ముఖం. చూచినంతనే నమస్కారానికి చేతులెత్తించే వ్యక్తిత్వం.

తెల్లపంచె, తెల్లని ఉత్తరీయం. యజ్ఞోపవీతం లేదు. తక్కిన ఋషులకు వలె చెవులకు కుండలాలు, మెడలో రుద్రాక్షమాలలు, మొదలైన పటాటోపాలు లేవుగాని, కమండలాన్ని, పావుకోళ్ళను వాడకం చేస్తాడు.

సముచి, హిరణ్యాక్షునికంటె, కొన్ని నెలల మాత్రమే చిన్న. అయినా, అనేక యుద్ధాలలో కాకలు తీరిన వానివలె వుంటాడు. కార్యదక్షుడైనా, ఆవేశానికి సులభంగాలోను కాగల ప్రవృత్తి. అతని వేషభాషలు దాదాపు హిరణ్యకశిపుని వాటివలెనే వుంటాయి.

తెర లేచినప్పుడు ఆలోచనా మందిరంలో ఒక భద్రాసనంపై హిరణ్యకశిపుడు చింతాక్రాంతుడై కూర్చుని వుంటాడు. ఇంతలో విచారంతో కూడిన ఆతురతతో శుక్రాచార్యులు ప్రవేశిస్తాడు).

హిరణ్యకశిపుడు : (శుక్రాచార్యులు చూచినంతనే భక్తితో లేచి) ఆచార్యదేవులకు నమస్కారం!

శుక్రాచార్యులు : ఆయురారోగ్యైశ్వర్య సిద్ధిరస్తు!

హిరణ్యకశిపుడు : ("ఆసన మలంకరించండి" అని హస్త ద్వయంతో సగౌరవంగా సంజ్ఞచేస్తూ, గద్గద స్వరంతో) ఆర్య ఋషులెంత ఘోరాన్ని చేయించారో విన్నారా?

శుక్రాచార్యులు : (ఆసీనుడౌతూ) వినకేమి? - నాయనా! విన్నాను. హాహారావాలతో నగరానికి నగరమే దద్దరిల్లిపోతున్నది. దుర్నిరీక్షుడైన హిరణ్యాక్షుని ఎవరు సమీపించగలిగారు? ఏ విధంగా హత్య చేయగలిగారు?

హిరణ్యకశిపుడు : ఆ వివరాలింకా పూర్తిగా తెలియరాలేదు. వేటకు వెళ్ళిన అన్నయ్యపై చాటుమాటుగా పడి మొన్న సాయంత్రం చిత్రవధ చేశారట.

శుక్రాచార్యులు : ఆర్య ఋషులెంతటి అఘాయిత్యానికైనా వెనుదీయరని, ఒంటరిగా తిరగవద్దని ఎన్నిసార్లో

హెచ్చరించాను. అయినా, ఒంటరిగానే వేటకు వెళ్ళాడా?

హిరణ్యకశిపుడు : లేదు, ఆచార్యదేవా! లేదు! కొద్దిపాటి పరివారం వెంటవున్నది.

శుక్రాచార్యులు : అయితే, వారేమైనారు?

హిరణ్యకశిపుడు : అన్నయ్య బాణానికి దెబ్బతిన్న ఒక వరాహం పారిపోతుండగా దాన్ని వెంబడిస్తూ ఆయన క్షణంలో కనుమరుగైపోయాడట.

శుక్రాచార్యులు : ఏం! అప్పటికి చీకటి పడిందా?

హిరణ్యకశిపుడు : ఔను! చీకటి తెర చాటునే హత్య జరిగింది

శుక్రాచార్యులు : ఎక్కడ?

హిరణ్యకశిపుడు : మా తండ్రిగారి పేర మేము త్రవ్వించిన కశ్యపసాగర తీరంలో.

శుక్రాచార్యులు : అక్కడి కీకారణ్యానికే వేటకు వెళ్ళాడన్నమాట! దానిలో పట్టపగలే కన్నుపొడుచు కున్నా కనబడదు. ఇంకా మృతదేహమైనా దొరకలేదని చెప్పుకుంటున్నారు - నిజమేనా?

హిరణ్యకశిపుడు : నిజమే, గురుదేవా!

శుక్రాచార్యులు : వెంటనున్నవారు వెదకి తేలేదా?

హిరణ్యకశిపుడు : వెదకడానికి వారు తలొక దిక్కుకు వెళ్ళగా, విడివిడిగా వారిని ఊచకోత కోసివేశారట. కొనప్రాణాలతో ఒకే సైనికభటుడు తిరిగిరాగలిగాడు. తనకు తెలిసిన సమాచారమైనా పూర్తిగా చెప్పకముందే అతడు ప్రాణాలు విడిచాడు.

శుక్రాచార్యులు : (తల పంకిస్తూ) అజయుడైన హిరణ్యాక్షుని మరొక విధంగా జయించలేమని ఈ నీచకృత్యానికి పాల్పడ్డారు!

హిరణ్యకశిపుడు : (గట్టిగా నిట్టూర్చుతూ) మాతల్లి శోకాన్ని చూడలేకుండా వున్నాను. చాప చుట్టినట్టు శాత్రవ ధరాతలాలను అవలీలగా జయించిన వీరపుత్రుని దుర్మరణవార్తను వినవలసి వచ్చిందని కంటికి, మంటికి ఏకధారగా ఆమె విలపిస్తున్నది. శోకోద్వేగంతో ఆమె తన ప్రాణానికేమి చేటు తెచ్చుకుంటుందో అని నాకు భయంగా వున్నది.

శుక్రాచార్యులు : పుత్రశోకం దుర్భరమైనదే! అయినా, తాను కశ్యప ప్రజాపతి సతినన్నమాట దితి మరచిపోరాదు. హిరణ్యకశిప, హిరణ్యాక్షుని వీరమాత నన్న మాటనైనా మరచిపోరాదు.

హిరణ్యకశిపుడు : మేమెంత చెప్పినా ఆమె వినిపించుకోవడం లేదు. తాము చెప్పి చూస్తారా?

శుక్రాచార్యులు : శోకం పొంగులెత్తుతున్నప్పుడు ఎవరేమి చెప్పినా లాభం లేదు. పొంగు కొంత తగ్గిన తర్వాత మాట్లాడి చూస్తానులే! మీ వదిన భాను పాపం! మరెంతగా కుమిలిపోతున్నదో! ఇంత చిన్న వయస్సులో పసుపుకుంకుమలకు దూరమైపోయింది.

హిరణ్యకశిపుడు : మా తల్లికంటె మా వదిన ఎంతో నయం! పుట్టెడు దుఃఖాన్ని దిగమ్రింగి, ఆమె తక్కిన వారి నోదార్చుతున్నది.

శుక్రాచార్యులు : భాను బిడ్డలందరు పసికందులే. తొమ్మండుగురిలో పెద్దవాడికైనా పట్టుమని పదిహేనేళ్ళు రాలేదు. వారి ముఖమైనా చూచి, ఆ తల్లి గుండె దిటవు చేసుకోవాలి.

హిరణ్యకశిపుడు : ఆపద వచ్చినప్పుడే ఎవరి స్వభావమెట్టిదో తెలుస్తుంది. అన్నయ్య హత్యావార్త విన్నంతనే నా మట్టుకు నేను నిలువునా నీరైపోయాను. అప్పుడు నాకు ధైర్యం చెప్పింది కూడా మా వదినే!

శుక్రాచార్యులు : ఋషుల దుస్తంతాల నుంచి రాజ్యాన్ని కాపాడవలసిన నీవే శోకంతో కృంగిపోతే, వారు మరింతగా చెలరేగరా, నాయనా? శుక్రాచార్యుని పలుకుల మధ్య ప్రవేశించి సముచి మౌనంగా ఒకప్రక్క నిలబడి వుంటాడు).

హిరణ్యకశిపుడు : (సముచితో) కొత్త సమాచారాలేవైనా తెలిసినవా?

సముచి : మరొక భటుడు తిరిగివచ్చాడు ప్రభూ! అయితే, అతని నాల్క కోసివేసారు. మూగసైగలతో తప్ప ఏమీ చెప్పలేకపోతున్నాడు.

హిరణ్యకశిపుడు : రాక్షసులని మమ్ము నిందించే ఆర్య ఋషులు ఎట్టి అమానుష కృత్యాలకు దిగుతారో చూచారా? ఆచార్యదేవా!

శుక్రాచార్యులు : (సముచితో) భటుడేమి చెబుతున్నాడు?

సముచి : అతడి సైగలు మేము గ్రహించగలిగినంత వరకు చెట్టుచాటు నుంచి యువరాజు ప్రభువులపై పడి, ఆయన శిరస్సును గదలతో మోది చంపినట్టు చెబుతున్నాడు. హత్యానంతరం ఆయన మృతదేహాన్ని వారెత్తుకుపోయినట్టు చెబుతున్నాడు.

హిరణ్యకశిపుడు : అది వీరుని మృతదేహాన్ని అవమానించడానికి సయితం ఆర్యఋషులు వెనుదీయరన్న మాట! మరెంత కాలంపాటు తమ దురంతాలను వారు కొనసాగించ గలరో మేము చూస్తాము! (సముచితో) సరే! నీవు వెళ్ళవచ్చు. (సముచి వెళ్ళిపోతుండగా వెనకనుంచి) ఇతర వివరాలేవైనా తెలిస్తే వెంటనే వచ్చి మాకు చెప్పు.

సముచి: (ఆగి, వెనుదిరిగి) చిత్తం.

హిరణ్యకశిపుడు : మంచిది. (సముచి నిష్క్రమిస్తాడు).

శుక్రాచార్యులు : క్రోధావేశాలు నిన్ను కలచివేస్తున్నాయి, నాయనా! వాటికిది సమయం కాదు. నీవిప్పుడు శాంతంగా వుండి, దూరదృష్టితో వ్యవహరించాలి.

హిరణ్యకశిపుడు : క్రోధావేశాలతో ఏమి చెయ్యను, ఆచార్యదేవా! ఏమి చేసినా, ఆలోచించే చేస్తాను.

శుక్రాచార్యులు : మీ అన్నదమ్ములిద్దరి స్వభావాలు నాకు తెలియవా నాయనా! అన్నయ్యలోని ఆవేశోద్వేగాలు నీలో లేవు. అయినా, అన్నయ్యపట్ల నీకున్న ప్రేమ గౌరవాలు ప్రతీకార చర్యలకు నిన్ను పురికొల్పవచ్చునేమో అని నా భయం.

హిరణ్యకశిపుడు : ఇంతటి ఘోరకృత్యం తర్వాత కూడా ప్రతీకార చర్యలు తగవా, ఆచార్యదేవా!

శుక్రాచార్యులు : అవి తగవని నేనంటానా? కాని, దేనికైనా సమయాసమయాలున్నాయి.

హిరణ్యకశిపుడు : కాస్త ఆలకించండి, ఆచార్యదేవా! అంతఃపురంలో నుంచి మా తల్లి ఆక్రందనం ప్రాకారాలన్నింటినీ దాటి, ఇంతదాకా వినరావడం లేదా? అది గుండెలను తరగడం లేదా? దాన్ని వింటూకూడా నేను మిన్నకుంటే అది మా తల్లి గర్భశోకాన్ని నిర్లక్ష్యం చేయడమే కాదా?

శుక్రాచార్యులు : నీవు మిన్నకుండరాదు నాయనా! అయితే, ఋషుల దౌష్ట్యాలలో ఇది మొదటిది కాదు; చివరిది కాబోదు. ఇది కొన్ని తరాలుగా వస్తున్న సమస్య. మరికొన్ని తరాలకు విస్తరించే సమస్య. అందువల్ల తాత్కాలిక ప్రతీకార చర్యలు నిష్ఫలమైపోతాయి. దీర్ఘకాలిక పరిష్కారాన్ని గురించే నీవిప్పుడు ఆలోచించాలి. (తిరిగి ప్రవేశిస్తున్న సముచిని చూచి) కొత్త సంగతులేవైనా తెలిసినవా బాబూ?

సముచి : తమ దేవుడే వరాహరూపంలో వచ్చి, యువరాజు ప్రభువులను వధించినట్టు ఋషులప్పుడే ప్రచారం ప్రారంభించారట.

శుక్రాచార్యులు : కాకమ్మ కథలల్లడంలో వారికి వారే సాటి. అద్భుత గాథలు, అభూత కల్పనలు పామరజనాన్ని ఆకర్షించినంతగా మరేవీ ఆకర్షించవని వారికి బాగా తెలుసు. తమతో విభేదించి నేను మీ పక్షాన చేరానని నన్ను గురించి వింత వింత కథలు (తన చెవి ప్రక్క వెంట్రుకల పాయనొకదాన్ని కుడిచేతి వేళ్ళతో పట్టుకుని, పైకెత్తి చూపుతూ) ఇన్ని అల్లలేదా?

హిరణ్యకశిపుడు : ఔను. చాలా అల్లారు. (సముచితో) మీ సన్నాహాలు పూర్తికాలేదా?

సముచి : పూర్తికావస్తున్నాయి. ప్రభూ!

హిరణ్యకశిపుడు : వెళ్ళి, త్వరగా ముగించు.

సముచి : చిత్తం (వెడతాడు)

హిరణ్యకశిపుడు : ''సన్నాహా" లన్నమాట వినగానే కొంత కలతపడిన శుక్రాచార్యులు "ఏమి సన్నాహాలు" అని ప్రశ్నించడానికి అవకాశ మివ్వరాదన్న ఆతురతతో) ఔనా! ఆచార్యదేవా! కాకమ్మ కథ లల్లడంలో వారికి వారేసాటి. అయినా, ప్రతిదానిలో తమ దేవుని చొప్పించడం తగునా? ఆయనకు బంధుప్రీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని అంటగట్టడం తగునా? తనవారి సమర్థనకై మత్స్య, కూర్మ, వరాహాది వికృత రూపాలను ఆయన ధరిస్తాడనడం తగునా? అది తమ దేవుని న్యూనపరచుకొనడమే కాదా?

శుక్రాచార్యులు : వారి గడసరితనం అక్కడే వున్నది నాయనా! పరమేశ్వరుడే తమ పక్షాన పోరాడుతున్నాడంటే అది తమకెంత బలం! తమలో భీరులనైనా అది వీరులను చేస్తుంది; తమ అరివర్గంలో ధీరులను సయితం అది సంశయాత్ములను చేస్తుంది. ఏ యుద్ధంలోనైనా ముందుగా జయించవలసింది మనస్సునే! అందుకు వలసిన వ్యూహాలను పన్నడంలో ఆర్య ఋషులు మహోద్దండులు. వారు... (దూరం నుంచి రణదుందుభుల మ్రోత).

శుక్రాచార్యులు : (ఆశ్చర్య విషాదాలతో) అదేమిటి నాయనా! సైన్యాలను సిద్ధం చేస్తున్నావా?

హిరణ్యకశిపుడు : ఔను ఆచార్యదేవా!

శుక్రాచార్యులు : దేనికి?

హిరణ్యకశిపుడు : ఆర్య ఋషులకు బుద్ధి చెప్పడానికి.

శుక్రాచార్యులు : అక్కడే హిరణ్యాక్షుడు అప్పుడప్పుడు పొరపాటు చేస్తుండేవాడు, నాయనా! ఋషులేదైనా దౌష్ట్యాన్ని ప్రేరేపిస్తే, మనమెంత వారించినా వినక, ప్రతీకార చర్యగా ఆర్యజాతిని దండించేవాడు.

హిరణ్యకశిపుడు : ఆచార్యదేవులు నన్ను మన్నించాలి. అన్నయ్య ఏమిచేసినా, మన మేలు కోసమే చేసేవాడు, మన రాజ్య రక్షణ కోసమే చేసేవాడు.

శుక్రాచార్యులు : అతని ఉద్దేశాలను నేను కాదనడం లేదు. కాని, దౌష్ట్యాలకు విరుగుడు ప్రతి దౌష్ట్యాలు కావు.

హిరణ్యకశిపుడు : పరిస్థితులు పూర్తిగా దుస్సహమైనప్పుడే కాదా ఆయన ప్రతీకార చర్యలకు దిగింది? అదైనా రెండు, మూడుసార్లు మాత్రమే!

శుక్రాచార్యులు : నిజమే, నాయనా! కాని, ఒకసారి చేసినా పొరపాటు పొరపాటే!

హిరణ్యకశిపుడు : అన్నివేళల తన సహజోద్వేగాన్ని అణచుకోలేక పోయినా, ఆయన అమృత హృదయుడు!

శుక్రాచార్యులు : అతని సంగతి నాకు చెప్పాలా, నాయనా! అతడు మహోదాత్తుడు కూడా!

హిరణ్యకశిపుడు : ఔను! ఆయన అగ్రజుడైనా, నా పట్ల ప్రత్యేకానురాగంతో మా ప్రియజనకులు సింహాసనాన్ని నాకప్పగించారు. ఇందుకు మరొక రైతే ఎంతగా ఈర్ష్యా విద్వేషాలకు లోనయ్యేవారో! అన్నయ్య మాత్రం... (మరి నోటమాట రాక ఆగిపోతాడు తడిసిన కళ్ళను తుడుచుకుంటాడు).

శుక్రాచార్యులు : అన్నయ్య అంతస్తు నాకు తెలియదా, నాయనా! నీవంటే అతని కెంత ప్రేమ వాత్సల్యాలో నాకు తెలియదా? నేనన్నా భక్తి గౌరవాలు లేకపోలేదు గాని, రానురాను నా పట్ల అతని విశ్వాసం కొంత సడలింది.

హిరణ్యకశిపుడు : లేదు, గురుదేవా! లేదు.

శుక్రాచార్యులు : నాకెక్కడ బాధ కలుగుతుందో అని నీవు లేదన నక్కరలేదులే, నాయనా! ఎంతైనా నాది ఆర్యజాతి. అందువల్ల మీరు నా నిజోద్దేశాలను గురించి...

హిరణ్యకశిపుడు : తమ నిజోద్దేశాలను శంకించడానికి అన్నయ్యగాని, నేనుగాని అంత క్షుద్రులమా?

శుక్రాచార్యులు : (ముక్కుపై వేలు వేసుకుంటూ) ఎంతమాటా నాయనా! మిమ్ము శిష్యులను పొందిన నా భాగ్యానికి నేనెంత గర్విస్తున్నానో నీకు తెలియదు. హిరణ్యాక్షుడైనా ఇటీవల కొంత కాలంగా...

హిరణ్యకశిపుడు : మాటకు అడ్డు వస్తున్నందుకు మన్నించండి. రెండు, మూడు సందర్భాలలో తమ హితబోధకు

వ్యతిరేకంగా అన్నయ్య వెళ్ళినా, అది గురుభక్తి లోపం వల్ల కాదు, ఇప్పుడు తమరైనా అంగీకరించాలి, ఋషుల ప్రవర్తన దుస్సహమై పోయింది.

శుక్రాచార్యులు : వారి ప్రవర్తన ఎంత దుస్సహమైనా, ఇది విభిన్న వ్యక్తుల మధ్య సంఘర్షణ కాదు, నాయనా! విభిన్న మత విశ్వాసాల మధ్య, సాంఘిక సిద్ధాంతాల మధ్య సంఘర్షణ. ఎవరైనా, వ్యక్తులను సంహరించగలరుగాని, విశ్వాసాలను, సిద్ధాంతాలను సంహరించగలరా?

హిరణ్యకశిపుడు : అవి కొందరు వ్యక్తులు ప్రతిపాదించేవి కావా? ఆ వ్యక్తులను తుడిచిపెడితే, వారి వెంట అవి కూడా తుడిచిపెట్టుకు పోవా?

శుక్రాచార్యులు : వాటిని ప్రతిపాదిస్తున్నది కొందరు వ్యక్తులే కావచ్చుగాని, వారొక జాతికి నాయకులు. వారిపై కత్తి కట్టడాన్ని ఆ జాతి తనపై యుద్ధ ప్రకటనగానే భావిస్తుంది. కొత్తగా మీ దేశానికి చేరుకున్నా, ఆర్య జాతి మీ మధ్య స్థిరపడిపోయింది. దాన్ని మీరుగాని, అది మిమ్ముగాని రూపుమాపడం అసాధ్యం. సాధ్యమైనా, అందుకు యత్నించడం అమానుషం.

హిరణ్యకశిపుడు : అయితే, ఋషుల దారుణ కృత్యాలు చేయించినా మేము సహించ వలసిందేనా? ఆచార్యదేవులు నన్ను మన్నించాలి. మానవ మాత్రులు అంత సహనం చూపలేరు. (ఈలోగా ప్రవేశించిన సముచితో) సైన్యాలను సిద్ధం చేశావా?

సముచి : చిత్తం ప్రభూ!

హిరణ్యకశిపుడు : అయితే, ప్రస్థాన భేరి వేయించు! ఆగు!

శుక్రాచార్యులు : (వెనకకు వెళ్ళబోతున్న సముచితో) ఇదుగో! బాబూ! నీ వొక్క క్షణం (సముచి ఆగిపోగా, హిరణ్యకశిపునితో) తిరిగి చెబుతున్నాను, నాయనా ! తొందరపడకు!! ఇది నీ జీవితంలోనే కాదు, రెండు జాతుల జీవితంలో అతిక్లిష్ట ఘట్టం!

హిరణ్యకశిపుడు : అందుకే సైనికచర్య.

శుక్రాచార్యులు:ఎవరిపై సైనిక చర్య?శత్రు సేనపై సైనిక చర్య గైకొంటే, అది నిరాక్షేపణీయం! ఇక్కడ శత్రు సైన్య మేదీ లేదే!

హిరణ్యకశిపుడు : హంతకులను శిక్షించడానికి సైనిక బలాన్ని వినియోగించరాదా?

శుక్రాచార్యులు : హంతకులను పట్టుకోవలసిందే! వారిని శిక్షించవలసిందే! కాని, , హంతకులెవరో తెలియనప్పుడు, వారు పరజాతి వారన్న కారణాన, ఆ జాతిపై సైన్యాలను నడపడం నీకు తగదు, నాయనా!

హిరణ్యకశిపుడు : వారిలో కొందరి రక్తం కళ్ళజూస్తే, తక్కిన వారికి బుద్ధి వస్తుంది.

శుక్రాచార్యులు : నిరపరాధులను శిక్షిస్తే, అపరాధులకు బుద్ధి వస్తుందా?

హిరణ్యకశిపుడు : ఇది గత్యంతరం లేని నిర్ణయమని ఆచార్యదేవులకు ఎలా నచ్చజెప్పాలో నాకు పాలుబోవడం లేదు. ఋషులు బలిగొన్న మా అన్నయ్య నిండు ప్రాణాలు, వారపహరించిన ఆయన మృతదేహం, కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్న మా తల్లి కన్నీళ్ళు, బుగ్గి కలిసిపోయిన మా వదిన బ్రతుకు, ఆమె పసిబిడ్డల గగ్గోలు, గాయపడిన నాగుండె - అన్నీ చేరి "ప్రతీకారం! ప్రతీకారం" అంటూ నా చెవులలో కోటి గొంతులతో ఘోషిస్తున్నాయి. మళ్ళీ వేడుకుంటున్నాను, ఆచార్యదేవా! దయచేసి, నన్ను వారించకండి! శుక్రాచార్యులు : (సముచి వైపుకు తిరిగి) ప్రభువు పిలిచేవరకు బయట వేచివుంటావా,బాబూ!

(హిరణ్యకశిపుని వైపు చూచి, ఆయన "సరే" అన్నట్టు తల పంకించిన మీదట సముచి నిష్క్రమిస్తాడు)

శుక్రాచార్యులు : (సముచి వెళ్ళిపోయేవరకు నిదానించి) నిలబడేవున్నావు కూర్చో! నాయనా! కూర్చుని, శాంతంగా నా

పలుకులు విను! (హిరణ్యకశిపుడు కూర్చున్న మీదట) హత్యలకు ప్రతీకారం ప్రతిహత్యలు కావు, ఋషుల రక్తాన్ని నీవు చిందింపజేస్తే, వారి మతం మరింత బలపడుతుంది. ఏ మతానికైనా దోహదం దాని ప్రతికక్షులు స్రవింపజేసే ఆ మతాచార్యుల రుధిరమే!

హిరణ్యకశిపుడు : మరి వారి దౌష్ట్యాల నిరోధానికి మార్గమేమిటో ఆచార్యదేవులు సెలవివ్వడం లేదు.

శుక్రాచార్యులు : ఋషుల విశ్వాసాల కంటె, వారి సిద్ధాంతాల కంటె నీవి సర్వోత్తమమైనవని నీ ప్రవర్తన ద్వారా, నీ పరిపాలన ద్వారా నీవు నిరూపించాలి; వారి ప్రభావానికి లోనౌతున్న వారి మనస్సులను మార్చాలి.

హిరణ్యకశిపుడు : అందుకు మనం చేసిన ప్రయత్నం సామాన్యమైందా? వారిది బర్బర జాతి. ఎవరేమి చేసినా వారు మారరు.

శుక్రాచార్యులు : ఒక జాతికి జాతినే ఖండించడం భావ్యం కాదు. మీరు వారిని బర్బరు లంటే, వారు మిమ్ము రాక్షసులంటారు. ఈ పరస్పర దూషణ తిరస్కారాలు ఉభయ జాతులకు శ్రేయస్కరం కావు.

హిరణ్యకశిపుడు : బర్బరులు కాకపోతే యజ్ఞయాగాల పేరుతో వారు మూగ జీవాలను బలిగొంటారా? నరమేధ పేరుతో సోదర మానవులనే హత్యచేస్తారా?

ఆ శుక్రాచార్యులు : అవి వారి మత విశ్వాసాలకు సంబంధించిన ఆచార వ్యవహారాలు. విశ్వాసాలను మార్చితే, వాటివెంట అన్నీ మారిపోతాయి.

హిరణ్యకశిపుడు : మత విశ్వాసాలనేవి స్థిరమైనవి కావా?

శుక్రాచార్యులు : ఏవీ స్థిరమైనవి కావు, నాయనా! ఈ దేశంలో ప్రవేశించినప్పుడు ఆర్యులు ఇంద్ర, వరుణ, పర్జన్య, మిత్రాది దేవతలను ఆరాధించేవారు. ఇప్పుడు బ్రహ్మ, విష్ణువులను కూడా ఆరాధిస్తున్నారు. మరికొంతకాలం పోతే మన శివుని కూడా తమ ఆరాధ్యదైవంగా చేసుకోవచ్చు. ఇదివరలో నరబలితో, పశుబలితో యజ్ఞయాగాలనే చేసేవారు; ఇప్పుడిప్పుడే పుష్ప ఫల పత్ర తోయాలతో పూజా పునస్కారాలను కూడా చేస్తున్నారు.

హిరణ్యకశిపుడు : అయినా, వారి బుద్ధి మారలేదు; మారదు.

శుక్రాచార్యులు : అదే మారుతుంది. మార్పు మానవ సహజం.

హిరణ్యకశిపుడు : అయిదేళ్ళలో రాని మార్పు మరెప్పుడు వస్తుంది?

శుక్రాచార్యులు : ఏ పెద్ద మార్పులు అంత త్వరలో రావు, నాయనా! అందుకు కొన్ని తరాలు గడవాలి.

హిరణ్యకశిపుడు : అంతవరకు వారి దురాగతాలను మేము సహించవలసిందేనా?

శుక్రాచార్యులు : సహనమొక్కటే చాలదు, సుహృద్భావం కూడా కావాలి. సుహృద్భావంతో పరస్పరావగాహనకు, పరస్పర సహకారానికి ప్రయత్నించకపోతే, నిత్య సంఘర్షణతో రెండు జాతులు సమానంగా నిర్వీర్యమైపోతాయి.

హిరణ్యకశిపుడు : అన్నయ్య హత్య తర్వాత - మన్నించండి - మన విధానాల పట్ల నా విశ్వాసం కొంత దెబ్బ తిన్నది. చిన్న, పెద్ద విషయాలన్నింటిలో ఆర్య నాగరికత మా దానికి పూర్తిగా విరుద్ధం. నిజానికి ఆ జాతివారిని నాగరికులనడానికైనా వీలు లేదు. నగరాలంటేనే వారికి కిట్టదు. నగరాలను, నగర దుర్గాలను నేల మట్టం చేయడం ఇప్పటికే వారు పనిగా పెట్టుకున్నారు. పురాలను ధ్వంసం చేసే పురందరుని దేవునిగా ఇప్పటికే వారు కొలుస్తున్నారు. వారిని మార్చలేము.

శుక్రాచార్యులు : మానవ యత్నానికి అసాధ్యమనేది లేదు, నాయనా! విభిన్న నాగరికతలు సరసకు వచ్చినప్పుడు, ప్రత్యేక ప్రయత్నం లేకపోయినా, వాటి మధ్య పరస్పరాదాన ప్రదానాలు తప్పవు. ఆ కారణంగా ఆ రెండింటికి అనేక ముఖ్య విషయాలలో భిన్నమైన కొత్త నాగరికత తలయెత్తడమూ తప్పదు. ఉభయ జాతుల నాయకులు వివేకాన్ని చూపితే, ఆ కొత్త నాగరికత విశిష్టరూపం ధరిస్తుంది; లేకపోతే, వికృతమైనదిగా పరిణమిస్తుంది.

హిరణ్యకశిపుడు : ఆచార్యదేవుల హితబోధ పాటించి, మరికొన్నాళ్ళ పాటు సహనం చూపినా, ఋషులు మాతో కలసివచ్చే

సూచనలు లేవు. అన్నయ్యవలె నన్ను, నా వారిని హతమార్చే వరకు వారు నిద్రపోరు!

శుక్రాచార్యులు : వారెంతకైనా తగుదురుగాని, వారిలో నైనా కొందరు మంచివారు లేకపోలేదు. వారిని నీ వైపుకు తిప్పుకోవాలి. స్వజాతిపై ఋషులకు నేడున్న ప్రాబల్యాన్ని క్రమంగా తగ్గించాలి. దూరదృష్టితో ఉదాత్తంగా వ్యవహరించడం తప్ప ఇందుకు మరొక మార్గం లేదు.

హిరణ్యకశిపుడు : మానవాతీతమైన బాధ్యతను ఆచార్యదేవులు నాపై మోపుతున్నారు.

శుక్రాచార్యులు : ఆత్మ విశ్వాసంతో నీ కర్తవ్యాన్ని నీవు పాటిస్తే రెండు జాతుల సముద్ధరణ జరుగుతుంది. నేటి భిన్నత్వాన్ని కోల్పోయి, ఏకజాతిగా అవి రూపొందుతాయి. మౌఢ్యం స్థానంలో వివేకం ప్రవేశిస్తుంది.విద్వేషం స్థానంలో ప్రేమ నెలకొంటుంది;సంఘర్షణ స్థానంలో శాంతి రాజ్యం చేస్తుంది; ఒకకొత్త నాగరికతతో ఒక కొత్త ప్రపంచమే అవతరిస్తుంది. నాకు తెలుసు ప్రియసోదరుని ఘోరహత్య తర్వాత ఇట్టి నిర్ణయాన్ని తీసుకొనడానికి అసాధారణ ధీరోదాత్తత కావాలని. నీవట్టి ధీరోదాత్తుడవని నా ఆశలన్నీ నీ పైనే పెట్టుకున్నాను. నాకు ఆశాభంగం కలిగించకు, నాయనా! అంతే జరిగితే, నా తపస్సు నిష్ఫలమైనట్టే భావిస్తాను, మరి నీవు జీవించడం నిరర్థకమని భావిస్తాను.

(కొన్ని క్షణాలు ఉభయులు గంభీర మౌన ముద్ర ధరిస్తారు).

హిరణ్యకశిపుడు : (నిట్టూర్చి, భద్రాసనంపై నుంచి లేచి, శుక్రాచార్యునికి అవనత మస్తకంతో నమస్కరిస్తూ) నా దౌర్బల్యాలు నాకు తెలిసినా, సాధ్యమైనంత వరకు ఆచార్య దేవుల ప్రేమ విశ్వాసాలకు పాత్రుడను కావడానికి ప్రయత్నిస్తాను.

శుక్రాచార్యులు : (ఆశీర్వాద సూచకంగా తలపై చేయుంచి) విజయోస్తు! (ప్రేమతో హిరణ్యకశిపుని తల నిమురుతూ) ప్రస్థానభేరి వేయించ వద్దని సముచితో మరి చెప్పనా, నాయనా!

హిరణ్యకశిపుడు : మంచిది. (బిగ్గరగా) ఎవరక్కడ? చిత్తం, దేవరా!" అంటూ భటుడు ప్రవేశిస్తాడు) మేము పిలుస్తున్నామని సర్వసేనాపతులతో చెప్పు. చిత్తం, ప్రభూ!" అంటూ భటుడు నిష్క్రమిస్తాడు. హిరణ్యకశిపుడు ఆంతరంగిక సంఘర్షణలకు తిరిగి అంతలో లోనై, అశాంతంగా కొన్ని క్షణాల పాటు పచార్లు చేసి) ప్రతీకార చర్యలకు సిద్ధపరచిన సేనలను తిరిగి శిబిరానికి పంపిస్తే, దాన్ని భీరుత్వంగా భావిస్తారు! వద్దు, ఆచార్యదేవా! వద్దు. నన్ను నగుబాట్లు పాలుచేయవద్దు!

శుక్రాచార్యులు : తాత్కాలికమైన అప్రతిష్ఠకు భయపడి నీ విద్యుక్త ధర్మానికి విరుద్ధంగా వెళ్ళడం నీ అంతస్తుకు తగదు, నాయనా! స్వజాతి నన్ను విద్వేషిస్తున్నది; మీ జాతి నన్ను పూర్తిగా విశ్వసించడం లేదు. అయినా, నిందా తిరస్కారాలను పాటించక, . కష్టనిష్ఠూరాలను లెక్కించక నేను నమ్మినదాన్ని సాధించడానికైనా అల్పశక్తితో నేను ప్రయత్నించడం లేదా?

(సముచి ప్రవేశిస్తాడు, తన తొలి ఉత్తరువును ఉపసంహరించుకొనడానికి హిరణ్యకశిపుడు సంకోచిస్తాడు).

శుక్రాచార్యులు : ఇంకా సంకోచిస్తావా, నాయనా!

హిరణ్యకశిపుడు : ఆచార్యదేవులు నన్ను విషమ పరీక్షకు గురిచేస్తున్నారు.

శుక్రాచార్యులు : విషమపరీక్షకు నిశ్చలంగా నిలిచిన వారే చరితార్థులౌతారు,నాయనా!రెండు జాతుల భవిష్యత్తు ఈ క్షణాన నీ చేతులలో ఉన్నది. వాటికి మరణదండన విధిస్తావా, నవజీవనాన్ని ప్రసాదిస్తావా? నీకు నీవై ఒక నిర్ణయాన్ని చేసుకో!

హిరణ్యకశిపుడు : (కళ్ళ వెంట గిర్రున నీళ్ళు తిరగగా సముచితో) సైనిక బలాలను శిబిరాలకు తిప్పి పంపించు!

సముచి : ప్రభువులు మన్నించాలి - సైన్యాలు ఉద్రిక్తమై వున్నాయి. శిబిరాలకు మరలమంటే, తిరుగుబాటు చేయవచ్చు.

హిరణ్యకశిపుడు : (హుంకరిస్తూ) ఆ! ఎలా తిరుగుబాటు చేస్తాయో మేము చూస్తాము, నీవు వెళ్ళు! మా ఆజ్ఞ పాలించు.

సముచి : తమ సెలవు ప్రకారమే చేస్తాను గాని, ఫలితాలకు నేను బాధ్యత వహించలేను.

హిరణ్యకశిపుడు : ఇది ధిక్కారమా?

సముచి : కాదు, ప్రభూ!

హిరణ్యకశిపుడు : అయితే, మరి మాట్లాడక వెళ్ళు! సైన్యాలను శిబిరాలకు మరలించు.
సముచి : చిత్తం!

(సముచి నిష్క్రమణ)

శుక్రాచార్యులు : ధన్యుడవు, నాయనా! ధన్యుడవు! (దగ్గరికి వెళ్ళి, కౌగిలించుకొంటూ) లోకనిందకు వెరవకుండా నిష్ఠూర కర్తవ్యపాలన నీకే చెల్లు! (హిరణ్యకశిపుడు శుక్రాచార్యుని భుజంపై తనువు వాల్చి కన్నీరు కార్చుతుండగా - తెర).

ద్వితీయ రంగం

(అంగిరస ఋష్యాశ్రమంలో అతిథి సత్కార పర్ణకుటీరం. ప్రేక్షకుల వైపు నుంచి చూడగా, ఎడమప్రక్క ద్వారం ఆశ్రమంలోని ఇతర భాగాలకు వెళ్ళేది; కుడి ప్రక్క ద్వారం ఆశ్రమం వెలుపలికి వెళ్ళేది. కుటీరం వెనుక భాగంలో కిటికీల కింద తడిక కంతలు. వాటిగుండా లతానికుంజాలు కనిపిస్తూ వుంటాయి.



కుటీరంలో నాలుగైదు అజినాసనాలు వుంటాయి. తడికగోడల ప్రక్కగా రెండు మంచాలు, వాటి పై శయ్యగా వినియోగించడానికి వీలైన లేడి చర్మాలు.

మొట్టమొదటిగా మనం చూచేనాటికి అంగిరసుని వయస్సు దాదాపు యాభై సంవత్సరాలు. ఆయనిది వెడల్పు ముఖం, పెద్ద కళ్ళు, గద్ద ముక్కు, బయటికి నిక్కబొడుచుకు వచ్చిన చెవులు, వెడల్పు నోరు, బలమైన దవడలు, పొడుగుపాటి గడ్డం, ముందుకు దువ్వి తల కుడివైపున గుండ్రని ముడిగా చుట్టిన తల వెంట్రుకలు, భయభక్తులను సమానంగా రేకెత్తించే వ్యక్తిత్వం.

బృహత్కీర్తి వయస్సు దాదాపు ముప్పై సంవత్సరాలు. అన్నీ తండ్రి పోలికలు. మీసాలే తప్ప, గడ్డం లేదు. తండ్రిని చూచి గజగజలాడేవాడైనా, సోమ ప్రియునికి సహజమైన వాచాలత్వంఅంగిరసుని కంటె వామదేవుడు రెండు, మూడేళ్ళు చిన్న. బక్కపలచటివాడైనా, పొడగరి. కోలముఖం, మేక గడ్డం. కల్లకపటా లెరుగనివాడు. ఆలోచన తక్కువ.

దేవాతిథి వయస్సు ముప్పది పై రెండు, మూడేళ్ళు. ముఖంలో కరకు, చూపులో చురుకు, పైకి దువ్వి, తల మధ్యగా ముడివేసిన నల్లని కురులు. సొగసుగా కత్తిరించిన గడ్డం. ఉద్వేగి, సాహిసి. సహచరులను ఉద్వేగపరచి, వారి ప్రేమ విశ్వాసాలను చూరగొనగలవాడు.
ఋషులు ముగ్గురి వలె బృహత్కీర్తి కూడా తెల్లని ధోవతినే ధరిస్తాడు. అందరి ఉత్తరీయాలు కూడా తెల్లనివే. ఎవ్వరికీ యజ్ఞోపవీతం వుండదు. ఋషులు ముగ్గురి చెవులకు కుండలాలు, మెడలో రుద్రాక్షమాలలు, కాళ్ళకు పావుకోళ్ళు, వామదేవ, దేవాతిథి, బృహత్కీర్తుల చేతులలో కమండలాలు.
హిరణ్యాక్ష వధ తర్వాత రెండేళ్ళకు ఈ ద్వితీయ రంగం

(తెర లేచినప్పుడు అంగిరసుడు, వామదేవుడు అజినాసనాలపై కూర్చుని, మంతనాలాడుతూ వుంటారు. కొన్ని క్షణాల తర్వాత బృహత్కీర్తి ప్రవేశిస్తాడు).

బృహత్కీర్తి : (అంగిరసునికి సాష్టాంగపడుతూ) పితృదేవులకు నమస్కారం!
అంగిరసుడు : శతమానం భవతు!
బృహత్కీర్తి : (వామదేవుని వద్దకు వెళ్ళి, పాదాభివందనం చేస్తూ) వామదేవులకు నమస్కారం.
వామదేవుడు : పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు!

అంగిరసుడు : డస్సిపోయినట్టు కనబడుతున్నావు. నీ ప్రయాణ విశేషాలు తర్వాత చెప్పవచ్చు, నీ ముందు స్నాన పానాలు చేసిరా!

బృహత్కీర్తి : అన్నీ ముగించుకునే వచ్చాను. సుహోత్ర మహర్షి ఎంతగానో సత్కరించి పంపించారు!

వామదేవుడు : అతిథి సత్కారానికి ఆయన తర్వాతనే మరెవరైనా! హిరణ్యకశిపుని నిషేధాల పిమ్మట గంధర్వులు శ్యేన రూపులై వచ్చి, సుహోత్ర మహర్షికి సోమవల్లరులను విక్రయించి వెడుతున్నట్టు మేము కర్ణాకర్ణిగా విన్నాము.

బృహత్కీర్తి : మీరు విన్నది నిజమే! మూజువంత పర్వత ప్రాంతం నుంచి వారు తరచు వచ్చిపోతున్నారట.

వామదేవుడు : సుషోమా నదీ ప్రాంతంలోని శర్యణా సరసీతటం నుంచి కాదా, వారు వస్తున్నది?

బృహత్కీర్తి : ఎక్కడినుంచి వస్తున్నా వారు తెస్తున్నది మాత్రం సర్వశ్రేష్ఠ వనస్పతి. లేకపోతే అంత శుచిగా, అంత శుభ్రంగా, అంత శుద్ధంగా సుహోత్రుల సోమామృతం వుంటుందా? అంత పుష్టిగా, అంత పుష్కలంగా వుంటుందా?

వామదేవుడు : పుష్కలంగా కూడా వుంటున్నదా? :

బృహత్కీర్తి : అసంఖ్యాక సోమకలశాలు సోమామృతంతో తొణికిస లాడుతున్నందునే త్రికాలాలలో ఆయన సోమయ లను నిర్విఘ్నంగా కొనసాగించగలుగుతున్నాడు.

వామదేవుడు : అగ్నిష్టోమమేనా? తక్కినవి కూడానా?

బృహత్కీర్తి : దానితో పాటు అత్యగ్నిష్టోమ, షోడశిని, వాజపేయాది సోమయజ్ఞ సప్తకాన్ని ఆయన యథాపూర్వకంగా సాగిస్తున్నాడు.

వామదేవుడు : (నోరూరుతున్నట్టు) మా తిరుగు ప్రయాణంలో సుహోత్ర మహర్షి పుణ్యాశ్రమాన్ని దర్శించి, ఆయన యజ్ఞ ఫలాన్ని పంచుకోవాలి. :

బృహత్కీర్తి : (కళ్ళు కాంతులీనుతుండగా) ఆ యజ్ఞ ఫలాపేక్షే నన్ను ఆయన వద్ద దినత్రయం నిలిపింది!

అంగిరసుడు : (మందలింపుగా) కార్యార్థి దినత్రయ మొకచోట నిలవవచ్చునా?

బృహత్కీర్తి : (దొరికిపోయిన దొంగవలె) తక్కిన ఋష్యాశ్రమాల సందర్శన త్వరగా ముగిసింది. "మీ పూజ్య జనకులు పెట్టిన గడువు దాటకుండానే తిరిగి వెళ్ళవచ్చు. ఇక్కడ విశ్రాంతి తీసుకో, నాయనా!" అని సుహోత్రమహర్షి బలవంతం చేశారు. ఆయన మాట కాదనలేక పోయాను

అంగిరసుడు : సరే, మంచిది! మహర్షులందరిని సందర్శించావా?

బృహత్కీర్తి : ఒక్క దీర్ఘతమసుల దర్శనం మాత్రమే కాలేదు. కార్యార్థులై ఆయన దేశాంతరం వెళ్ళినారట.

అంగిరసుడు : తక్కిన మహర్షులేమన్నారు?

బృహత్కీర్తి : దేవాతిథిలు తప్ప. తక్కినవారందరు ఇప్పుడు తొందర పడరాదన్నారు. ముఖ్యంగా సుహోత్రులు ఈనాటి మన సమావేశాన్ని సయితం వ్యతిరేకించారు.

వామదేవుడు : ఔను! వ్యతిరేకిస్తారు! హిరణ్యకశిపుడెన్ని నిషేధాలు విధించినా, ఆయన సోమయజ్ఞాలు నిరాఘాటంగా సాగుతూనే వున్నాయి.

అంగిరసుడు : ఇప్పుడు తొందరపాటు తగదన్నది ఆయనొక్కరే కారుగదా!

వామదేవుడు : ఎందరేమన్నా, మామతం మారదు. ఇప్పటికే కాలవిలంబన జరిగింది. ఇకనైనా చర్యగైకొనక పోతే, సమస్త యజ్ఞ యాగాలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఇక్కడి తమ పరిస్థితులు మాకు తెలియవుగాని, మూడు, నాలుగేళ్ళుగా మేము అగ్నిష్టోమమైనా జరపలేక పోతున్నాము.

బృహత్కీర్తి : కొన్ని నెలలుగా మేమైనా దాన్ని జరపలేదు.

వామదేవుడు : ఇంద్ర వరుణ సోమాగ్ని దేవతలను ఈ విధంగా మనం నిర్లక్ష్యం చేయబట్టే వారు మనను నిర్లక్ష్యం చేస్తున్నారు.

బృహత్కీర్తి : ముఖ్యంగా సోమయజ్ఞాలు సన్నగిల్లిపోయినందునే సోమపతి మనపై శీతకన్ను వేస్తున్నాడని దేవాతిథి మహర్షులన్నారు. వీలుపడితే, తామిక్కడికి దయచేసి, తమ వైఖరి వివరిస్తామన్నారు.

వామదేవుడు : శుభవార్త చెప్పావు, నాయనా! ఆ మహర్షి పుంగవులైనా మీ పితృపాదుల మనస్సు మార్చగలరేమో!

అంగిరసుడు : ఆయనలో ఆలోచనకంటె ఆవేశం హెచ్చు. సమయాసమయాలను గుర్తించక, తొందరపాటుతో ఇప్పుడు మనమే చర్యగైకొన్నా, అది హిరణ్యకశిపుని మరింత బలపరుస్తుంది.

వామదేవుడు : (చురుకుగా) ఏడేళ్ళనాడు అతడు రాజ్యానికి రాగానే చర్యగైకొనాలంటే, ఇది సమయం కాదన్నారు. ఇప్పుడు తిరిగి అదేమాట. మరి తమ దృష్టిలో తగు సమయమేదో సెలవిస్తారా?

బృహత్కీర్తి : ఆదిలోనే నిరోధిస్తే పరిస్థితులింత అధ్వాన్నమయ్యేవి కావు.

వామదేవుడు : (హర్షామోదాలతో) నీ పేరుకు తగినట్టు బృహత్కీర్తితో కలకాలం వర్ధిల్లు, నాయనా!

అంగిరసుడు : (మందహాసంతో) మావాడి మాటలేమిలేండి! సుహోత్రుల ఆతిథ్య ప్రభావం వాడిచేత ఆవిధంగా పలికిస్తున్నది! హిరణ్యాక్ష సంహారం తర్వాత హిరణ్యకశిపుడు మన పై ప్రతీకార చర్యలకు దిగివుంటే ప్రజాభిప్రాయం మనకు సుముఖంగా మారివుండేదేమో! కాని శుక్రాచార్యులు అతనిని నిరోధించాడు.

వామదేవుడు : అయినా, మనవారిని అక్కడక్కడ హింసించడం జరగలేదా?

అంగిరసుడు : ఉద్రిక్తులై మన పై చెలరేగినవారిని స్వజాతీయులన్న సంకోచమైనా లేకుండా అతడు అణచివేశాడు. దానితో అతని ప్రతిష్ఠ మరింత పెరిగింది. ప్రస్తుతం మనవారైనా మనలను పూర్తిగా సమర్థిస్తారన్న నమ్మకం లేదు.

వామదేవుడు : మరి ఏడేళ్ళకాలయాపన చేస్తే, మన వారు అతడినే సమర్ధించవచ్చు. ఆ ప్రమాదాన్ని తాము కానడంలేదు.

బృహత్కీర్తి : దైత్యరాజు ప్రశంసలో మనవారిలో కొందరిపుడు దైత్యులనే మించి పోతున్నారు. ఇదివరలోవలె యజ్ఞయాగాలు సాగకపోయినా వర్షాలు సకాలంలో పడుతున్నవట! దున్నకుండా వసుంధర పండుతున్నదట. శాంతి సుభిక్షాలు నెలకొన్నవట! స్వర్గలోకాల సంపత్తి ఇక్కడ పోగుపడుతున్నదట!

వామదేవుడు : (ఉద్రేకంగా) ఔను! న భూతో, న భవిష్యతి'గా హిరణ్యకశిపుడు పరిపాలన సాగిస్తున్నాడని మన శుంఠలే స్తోత్రపాఠాలు చేస్తున్నారు.

అంగిరసుడు : (అనునయంగా) అందువల్లనే మనమిప్పుడు తొందరపడరాదు. అతడు అపమార్గాన నడిచి అల్లరి పాలయ్యేవరకు వేచివుండాలి.

వామదేవుడు : శుక్రాచార్యులు జీవించి యుండగా ఆ పరిస్థితి రాదు. ఆ స్వజాతి విద్రోహి కుయుక్తులతో జంబుకేశ్వరునికి పాలు చెప్పగలడు!

బృహత్కీర్తి : జిత్తులలో సాటి లేనివాడు కాబట్టే, మన సోమయజ్ఞాలతో పాటు దైత్యుల సురాపానానికి కూడా అతడు స్వస్తి చెప్పించాడు.

వామదేవుడు : ఉభయజాతుల శ్రేయస్సు పేరుతో శాకాహార ప్రచారాన్ని కూడా ప్రారంభించాడు

బృహత్కీర్తి : ఉభయజాతులవారు తమతమ ఆహార నియమాలను, తమ ఆచార వ్యవహారాలను సవరించుకుంటే, నవధర్మం నభోమండలం నుంచి ఊడిపడుతుందట.

వామదేవుడు : అప్పుడు నవజీవన విధానం నెలకొంటుందట! నవమానవుడే తలెత్తుతాడట! నవయుగం ప్రారంభమగుతుందట!

అంగిరసుడు : (చికాకుతో) ఈ మాటలన్నీ మీరు మాకు చెప్పడం దేనికి? శుక్రాచార్యులు ఏమంటున్నాడో, ఏమి చేస్తున్నాడో మాకు తెలియదా? అన్నీ తెలుసు కాబట్టే తొందరపడరా దంటున్నాం. ఇప్పుడు అతని మాట నెగ్గుతున్నది, అతడి ఆట సాగుతున్నది. మనవారు సైతం... (చికాకును, చిరునవ్వుగా మార్చి) అరుగో! దేవాతిథి మహర్షులు దయచేస్తున్నారు.

దేవాతిథి : (ప్రవేశిస్తూ) అంగిరస మహర్షి చంద్రులకు నమస్కారం!!
అంగిరసుడు : దీర్ఘాయుష్మాన్ భవ!
దేవాతిధి : వామదేవులకు నమస్కారం!
వామదేవుడు : అభీష్టకార్యం సిద్ధిరస్తు!
బృహత్కీర్తి : దేవాతిధి మహర్షులకు నమస్కారం పాదాభివందనం చేస్తాడు).
దేవాతిథి : (లేవనెత్తుతూ) ఆయురారోగ్యైశ్వర్య సిద్ధిరస్తు!
అంగిరసుడు : (బృహత్కీర్తితో) మహర్షులకు అర్ఘ్యపాద్యాలను తీసుకురా, నాయనా!
దేవాతిథి : అర్ఘ్యపాద్యాలకేమిలెండి! మా అభ్యర్ధన మన్నించండి. మాకదే పదివేలు (లోనికి వెళ్ళబోతున్న బృహత్కీర్తితో) వద్దు, నాయనా, వద్దు. ఒక శపథంతో మేమిక్కడికి వచ్చాం. అంగిరస మహర్షి మా అభ్యర్థనను మన్నించకపోతే ఇక్కడ మంచి తీర్థమైనా ముట్టము!
వామదేవుడు : (సంతోషంగా) కార్యదీక్షకు అగ్రతాంబూలం దేవాతిథులుదే!
అంగిరసుడు : (మందహాసంతో) మా పట్ల దేవాతిథులు ఇంత నిర్దయ వహించరాదు.
దేవాతిథి : (ఆవేశపూరిత కంఠంతో) కాదు, నిస్పృహ! ఈ విషమ ఘట్టంలో తాము నాయకత్వం వహించకపోతే, ఆర్యజాతికి మరి దిక్కెవరు?
అంగిరసుడు : ఎవరి నాయకత్వానికైనా అనుకూల పరిస్థితులు రావద్దా?
వామదేవుడు : అనుకూల పరిస్థితులు లేకపోతే, వాటిని మనం కల్పించుకోవాలి!
అంగిరసుడు : మీ కోర్కెపైనే కాదా, మేము బృహత్కీర్తిని ఋష్యాశ్రమాల రహస్య పర్యటనకు పంపించింది! తిరిగి వచ్చి, అతడు మీ సమక్షంలోనే ఒక్క దేవాతిథులు తప్ప తక్కిన వారందరు ఇది చర్యకు తగు సమయం కాదన్నట్టు చెప్పాడు. అయినా, “ఎవరేమన్నా, మా మతం మాదే!” అని మీరు సెలవిస్తున్నారు. ప్రజల సమర్ధన మనకు లేదు; కనీసం మహర్షుల సమర్థనైనా లేకపోతే, మరి మేము చేయగలిగిన దేమున్నది?
వామదేవుడు : తమ సరసన నిలవడానికి మేమున్నాము. దేవాతిథులున్నారు!
అంగిరసుడు : మన ముగ్గురితో సరిపోతుందా?
దేవాతిథి : తమరొక్కరే చాలు! తమ యాగఫలంతో శుక్రాచార్య సమేతంగా హిరణ్యకశిపుని హతమార్చడానికి!
అంగిరసుడు : ఆ శ్రీ మహావిష్ణువైనా అతడిని ఇప్పుడేమీ చేయలేడు.
దేవాతిథి : శుక్రాచార్యుల ప్రేరణతో ఉభయ జాతులవారిని హిరణ్యకశిపుడు భ్రష్టులను చేస్తున్నాడు. ఈ ఘోరాన్ని చూస్తూ ఊరుకోవలసిందేనా? మా శక్తి అల్పమైందని మాకు తెలుసు! అయినా, మాకు చేతనైన యత్నాన్ని చేయడం మా విద్యుక్త ధర్మంగా భావించాము. అందుకు ఏవో కొన్ని యేర్పాటులు చేసి మరీ ఇక్కడికి వచ్చాము.
అంగిరసుడు : ఏర్పాటులు చేసి వచ్చారా? ఏమిటవి?
దేవాతిథి : ఏమైతేనేమి లెండి! మా అల్ప శక్తికి తగినట్టు అవి అల్పమైనవే! ఆర్యజాతి నిర్వీర్యమైపోయిందన్న బహుజనాభిప్రాయాన్ని తొలగించడానికైనా అవి తోడ్పడకపోవు.
అంగిరసుడు : ఇప్పుడు మన మెంత చిన్న పొరపాటు చేసినా, మహానర్థకం తప్పదు సుమండీ!
దేవాతిథి : అయితే, మేము తప్పే చేస్తామంటారా?
అంగిరసుడు: ఔను!!
దేవాతిథి : ఇది తమ నిశ్చితాభిప్రాయమా?
అంగిరసుడు : ఔను!
దేవాతిథి : మరి మాకు సెలవిప్పించండి.
అంగిరసుడు : ఆవేశపడకండి, మహర్షీ! మీరన్నట్టు మన జాతి జీవితంలోనే ఇది విషమ ఘట్టం! ఇప్పుడు తప్పటడుగు

వేస్తే, తరతరాల వరకు మరి కోలుకోలేము! మన జాతి, మన ధర్మం, సర్వం నాశనమైపోయినా పోవచ్చు.

బృహత్కీర్తి : ఆ ప్రమాదం ఎన్నటికీ రాదు!

అంగిరసుడు : (కోపంగా) సంతోషించాములే! నీ జోక్యానికి. నీవు కాస్త నిదానించు (దేవాతిధితో) ఏమి చేసి వచ్చారు, మహర్షీ! ఏమి చేసి వచ్చారు? దయచేసి, చెప్పండి! ప్రమాద నివారణకు వీలుంటే, ఇప్పటికైనా ప్రయత్నించవచ్చు.

దేవాతిథి : ఇప్పుడెవరేమి చేయగలిగిందీ లేదు!

అంగిరసుడు : అంత దూరం వెళ్ళారా?

దేవాతిథి : ఆహా!

వామదేవుడు : (సంతోషంగా) అయితే చెప్పినా నష్టం లేదు. చెప్పండి, మహర్షీ! వినాలని మాకు కుతూహలంగా వున్నది.

దేవాతిథి : (సగర్వంగా) హిరణ్యకశిప వధకు మా శిష్యులను నియోగించి చ్చాము.

అంగిరసుడు : (పై ప్రాణం పైకి లేచి పోతున్నట్టు) ఆ!

వామదేవుడు : ముందు చంపవలసింది హిరణ్యకశిపుని కాదు; శుక్రాచార్యుడిని! దైత్యరాజు దేమున్నది? అతను శుక్రాచార్యుని చేతిలో కీలుబొమ్మ!

దేవాతిథి : నిజమే! కాని, శుక్రాచార్యునికి మృతసంజీవిని విద్య తెలుసు! అతడిని చంపడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

అంగిరసుడు : అయితే, ఆ విద్యతో హిరణ్యకశిపుని అతడు బ్రతికించలేడా?

దేవాతిథి : ఆ సంగతి మాకు తెలియకపోదు. అందువల్లనే హిరణ్యాక్షుని విషయంలో చేసినట్టుగానే మృతదేహాన్ని గల్లంతు చేయడానికి కట్టుదిట్టాలు చేశాము.

వామదేవుడు : (దేవాతిథి వీపు చరుస్తూ) ఎంత దూరాలోచన! ఎంత కార్య దక్షత! (దేవాతిథి ముఖంలో పట్టలేనంత సంతోషం)

అంగిరసుడు : (తల పంకిస్తూ) అయితే, మీ శిష్యుల నెప్పుడు పంపించారు?

దేవాతిధి : నిన్న.

అంగిరసుడు : ఏ వేళ?

దేవాతిథి : ప్రాతఃకాలాన.

అంగిరసుడు : రాజధానికి వారెప్పటికి చేరివుంటారు?

దేవాతిథి : నగర పరిసరాల వరకు మా తేరులో పంపించాము. నిన్న సాయంత్రానికి చేరివుండవచ్చు.

అంగిరసుడు : వారికేమి చెప్పి పంపించారు?

దేవాతిథి : రత్న వ్యాపారుల వేషంతో హిరణ్యకశిపుని సమీపించి అతడిని వధించ వలసిందిగా ఆదేశించాము.

అంగిరసుడు : మా ఆదేశాన్ని వారు...

వామదేవుడు : (తిరిగి దేవాతిథి వీపు చరుస్తూ) రత్నాలంటే దైత్యరాజుకు విపరీతమైన వ్యామోహం! రత్న వ్యాపారులు నిరాటంకంగా అన్ని వేళలలో అతని వద్దకు పోవచ్చునట. మీ పాచికకు తిరుగు వుండదు!

అంగిరసుడు : మీ ప్రశంస తర్వాత చేయవచ్చు. దయచేసి, మా మాటకు ఒక క్షణం అడ్డు రాకండి! (దేవాతిథితో) మీ ఆదేశపాలన జరిగిందా?

దేవాతిథి : ఏమో, చెప్పలేను! కాని, మా శిష్యుల భక్తిలో, వారి శక్తిలో మాకు పూర్తి విశ్వాసం వున్నది. నిన్న కాకపోతే, నేడో, రేపో వారు తమ పని పూర్తి చేసుకునే వస్తారు. లేదా, మా ఆదేశపాలనలో ఆత్మార్పణ చేస్తారు.

అంగిరసుడు : మమ్ము సంప్రదించకుండా ఇంత దూరం మీరు వెళ్ళిన తర్వాత మా వద్ద కెందుకు వచ్చినట్టు?

దేవాతిథి : తమ వద్దకు కాక, మరెవరి వద్దకు వస్తాము? ఋషికులానికి తమరే పెద్దలు, పూజ్యులు.

వామదేవుడు : తమరు తప్ప మాకు నాయకత్వం వహించగల వారెవ్వరున్నారు?

అంగిరసుడు : ఇదే కాబోలు మా నాయకత్వాన్ని గౌరవించడం!

దేవాతిథి : రంగంలో దూకడానికి నాయకుడు సంకోచిస్తున్నప్పుడు అనుచరులే సాహసించి ముందుకు త్రోసుకు పోవాలి.

అంతవరకు ఎంతగా సంకోచిస్తున్న నాయకుడైనా ఆ తర్వాత అగ్రశ్రేణిలో నిలవక తప్పదు.

వామదేవుడు : (విప్పారిన ముఖంతో) అగ్రగాములై అంగిరసు మహర్షులింక నడవక తప్పదు.

అంగిరసుడు : మా పట్ల మీకు నిజంగా గౌరవం వుంటే, ఇప్పటికైనా మా మాట వింటారా?

వామదేవుడు : ఓ! తప్పక!

దేవాతిథి : అదేమిటో చెప్పండి!

అంగిరసుడు : హిరణ్యకశిప సంహారయత్నం నిన్న రాత్రి జరిగి వుంటే, తెల్లవారేసరికి ఆ వార్త పొక్కి వుండేదే! ఆ యత్నమిప్పటికైనా బహుశా జరిగి వుండదు. మా మాట విని, మా అరదం పై సందేశహరులను పంపించండి; మీ శిష్యులను వెనుకకు రప్పించండి.

దేవాతిథి : మన్నించండి, ఆ పని మేము చేయలేము.

అంగిరసుడు : మన జాతికే మహోపకారం జరగనున్నదని చెప్పినా మా మాట వినరా?

దేవాతిథి : ఇప్పుడు జరుగుతున్న దానిని మించిన అపకారం ఏమీ జరుగదు, జరగబోదు.

అంగిరసుడు : మా వయస్సునైనా గౌరవించి మా మాట వినరా?

దేవాతిథి : తమరు మాకు గురుతుల్యులు, తమ పట్ల గౌరవ లోపమేమీ లేదు. మా ప్రయత్నం విఫలమైనా, తమరు రంగంలో మరి నిలవక తప్పని పరిస్థితిని కల్పిస్తుంది!

అంగిరసుడు : చివరిసారిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను; మా మాట వినండి.

దేవాతిథి : అంగిరస మహర్షులు మమ్ము మన్నించాలి.

అంగిరసుడు : మీరు మా కతిథులు. మేము శాంతం వహించక తప్పదు. అయినా, మీ అనాలోచిత చర్య మా తీవ్ర నిరసనను ప్రకటించడానికై మిమ్ము విడిచి వెళ్ళక తప్పదు. మన్నించండి. (దిగ్గున లేస్తాడు),

దేవాతిథి : తమరు లేచి వెళ్ళడం దేనికి? మేమే వెడతాములెండి! (కమండలం చేతబుచ్చుకుని, చరాలున లేచి వెడుతూ, నాలుగడుగులు వేసిన పిదప, వెనుదిరిగి చూస్తూ) మా కోసం తమరు స్వయంగా వర్తమానం చేయడం త్వరలోనే జరగకపోదు! (వెళ్ళి పోతాడు).

వామదేవుడు : (నెమ్మదిగా తానుకూడా లేచి) సెలవిప్పించండి.

అంగిరసుడు : ఆయన ననుసరించబోతున్నారన్న మాట!వామదేవుడు : తమ నాయకత్వ భాగ్యం మాకు లభించనప్పుడు గత్యంతరం లేదు గదా! (వెళ్ళిపోవడానికి నాలుగడుగులు వేస్తాడు).

అంగిరసుడు : మీ కమండలం విడిచి వెడుతున్నారు. (వెనుకకు రాబోతున్న వామదేవుని చేతికి బృహత్కీర్తి కమండలాన్ని అందిస్తుండగా - తెర).

తృతీయ రంగం

(తెర లేచినప్పుడు హిరణ్యకశిపుడు కొరకొర చూపులతో పచారు చేస్తూ వుంటాడు. తిరిగి సంభాషణ ప్రారంభించడానికి సావకాశం కోసం వేచివున్నట్టు సముచి ఆయన ముఖ కవళికలను గమనిస్తూ వుంటాడు. కొన్ని క్షణాల పిమ్మట హిరణ్యకశిపుడు తన భద్రాసనం పైకి చేరి, ఎడమ చెక్కిలిని అరచేతిలోకి వాల్చి, ఆలోచనాముద్ర వహిస్తాడు.)

సముచి : (మరికొన్ని క్షణాలు వేచి వున్న పిదప, విజ్ఞప్తి పూర్వకంగా) మరొకసారి మనవి చేస్తున్నాను - శుక్రాచార్యులవారి చిత్తశుద్ధిని నేను శంకించలేదు. -.

హిరణ్యకశిపుడు : ఆయన విధానాలే ఆర్యఋషుల విజృంభణకు మూలమౌతున్నాయనడం ఆయన చిత్తశుద్ధిని శంకించడమే కాదా?

సముచి : నన్ను తమరు చివరి వరకు చెప్పనివ్వలేదు. నాకైనా ఆచార్యుల వారి పట్ల భక్తి గౌరవాలు లేకపోలేదు. ఆయనేమి చెప్పినా, మన హితాన్ని కోరే చెబుతున్నారని అంగీకరించడానికైనా నాకభ్యంతరం లేదు. కాని...

హిరణ్యకశిపుడు : (తీక్షణంగా) కాని?

సముచి : తమ కప్రియమైన ప్రసంగాలు నాకు దేనికిలెండి!

హిరణ్యకశిపుడు : (కొంత తగ్గి) సర్లే - ఆ సంకోచమేమిటో బయటపెట్టు! (దగ్గరికి వచ్చి, కూర్చోవలసిందిగా హిరణ్యకశిపుడు సైగ చేయగా సముచి వచ్చి, సమీపంలోని ఒక భద్రాసనంపై ఆసీనుడౌతాడు).

సముచి : సదుద్దేశంతో కూడినవన్నీ సద్విధానాలు కానక్కరలేదు.

హిరణ్యకశిపుడు : గురుదేవులు మాకు సూచించినవి సద్విధానాలు కావనే నీ తాత్పర్యమా?

సముచి : ఔను, ప్రభు!

హిరణ్యకశిపుడు : ఎందువల్ల?

సముచి : అవి సత్ఫలితాల నివ్వడం లేదు గనక!

హిరణ్యకశిపుడు : తమని దీర్ఘకాలిక విధానాలని ఆచార్యదేవులు ఆదిలోనే చెప్పలేదా?

సముచి : ఒక దశాబ్దం స్వల్పకాలం కాదని ప్రభువులైనా అంగీకరించాలి.

హిరణ్యకశిపుడు : ఆచార్య దేవులు రూపొందించగోరుతున్నది దశాబ్దాలను కాదు, శతాబ్దాలను.

సముచి : అది నా దౌర్భాగ్యమే కావచ్చు గాని, అంత దూరం నా దృష్టి వెళ్ళలేదు.

హిరణ్యకశిపుడు : అయినప్పుడు తొందరపడి, ఆయనను శంకించవచ్చునా?

సముచి : తక్కిన సేనానులు, సచివులు తమకు చెప్పడానికి సంకోచిస్తున్నారు గాని,

నిశ్చితాభిప్రాయం కూడా ప్రస్తుత విధానాలు ప్రమాదభరితమైనవనే!

హిరణ్యకశిపుడు : (నొసలెగర వేస్తూ) అలాగా!

సముచి : తమరు మృత్యుభయాన్ని జయించారు. దినదిన గండాల మధ్య కూడా గుండె పై చేయి వేసుకొని తాము హాయిగా నిద్రపోగలరు! అది మాకు సాధ్యమా? ప్రతి వైఫల్యం తర్వాత మరింత పూనికతో తమపై హత్యాయత్నాలు జరుగుతుండగా మేము నిశ్చింతగా వుండగలమా?

హిరణ్యకశిపుడు : (నవ్వుతూ) గురుదేవుల పై మీ రోషావేశాలకు కారణమిదేనా? ఇందుకైతే మీరాయనను తిరస్కరించరాదు, పురస్కరించాలి.

సముచి : (భద్రాసనంపై నుంచి లేచి, ఉద్రిక్త కంఠంతో) తమపై మరొక హత్యాయత్నం జరిగి రెండు ఘడియలైనా కాలేదు. పైగా, నేడు జరిగింది. నెల లోపల రెండు యత్నం. ఇది తమకు నవ్వులాట విషయం కావచ్చుగాని, మాకు కాదు,

హిరణ్యకశిపుడు : ఇంత త్వరలోనే ఆర్యఋషులు మరొక యత్నం చేయడం వారి సహకార నిదర్శనం, ఆచార్య దేవుల

విజయానికొక తార్కాణం.

సముచి : ఎదురాడుతున్నందుకు ప్రభువులు నన్ను క్షమించాలి. ప్రాణాలకు తెగించిన యువకులజట్టు, జట్టు తర్వాత జట్టుగా హత్యాయత్నాలకై ముందుకు వస్తుండగా ఆర్య ఋషులకు విస్పృహ దేనికి?

హిరణ్యకశిపుడు : ఎవరో కొందరు కుర్రకుంకలను రెచ్చగొట్టి పిచ్చిపనులకు పంపించడం ఏమంత కష్టమైన పని?

సముచి : ఇది చులకన చేయదగు విషయం కాదు, ప్రభూ! పట్టుపడిన యువకులలో కనీసం ఒక్కడి చేతనైనా తనను ప్రోత్సహించి పంపినవారెవరో చెప్పించలేకపోయాము.

హిరణ్యకశిపుడు : కావచ్చుగాని, ఇవి దుష్టయత్నాలని ఆర్య ప్రజానీకం కూడా తీవ్రంగా నిరసిస్తున్నది. దాన్ని బట్టే తెలుసుకోవచ్చు. - తమ వారిలో ఋషుల పలుకుబడి ఎంతగా సన్నగిలిపోతున్నదో!

సముచి : వారి నిరసన కేవలం పై పై నటన మాత్రమే!

హిరణ్యకశిపుడు : మాకు గండం తప్పిన, తప్పిన ప్రతిసారి వారు పండుగ చేసుకొనడం కూడా పైపై నటన కాబోలు!

సముచి : ప్రజల మధ్యకు మేము వెళ్ళినంతగా ప్రభువులు వెళ్ళరు.

హిరణ్యకశిపుడు : వెళ్ళకపోతే మాత్రమేమి? ఎక్కడేమి జరుగుతున్నదో ఎప్పటికప్పుడు మేము తెలుసుకోవడం లేదా?

సముచి : క్షమించండి - సాహసిస్తున్నందుకు! తమకు చేరుతున్న సమాచారాలు ప్రధానంగా శుక్రాచార్యుల వారి నుంచే!

హిరణ్యకశిపుడు : (చికాకుగా) యధార్థాన్ని ఆయన మభ్యపరుస్తున్నట్టు ధ్వనిస్తున్నావా?

సముచి :లేదు, ప్రభూ! దృష్టి భేదం వల్ల కావచ్చు, పరిస్థితులు నాకు భిన్నంగా కనబడుతున్నాయి.

హిరణ్యకశిపుడు : దృష్టిలోనైనా పోయిన పదేళ్ళలో సోమపానం తగ్గలేదా? పశుబలులు తగ్గలేదా? నరమేధాలు తగ్గలేదా?

సముచి : కొంతవరకు తగ్గాయి.

హిరణ్యకశిపుడు : కొంతవరకేనా?

సముచి : ఎంతవరకు తగ్గినా, పరిస్థితులు అనుకూలిస్తే తిరిగి తమ పాత జీవిత విధానానికి వారు పోరని ఎవరు చెప్పగలరు?

హిరణ్యకశిపుడు : అయితే, మీ దృష్టిలో ఇప్పుడు జరుగుతున్నవి తాత్కాలికమైన మార్పులే! పై పై మార్పులే!

సముచి : ఔను, ప్రభూ!

హిరణ్యకశిపుడు : పశువుల మేతకై పచ్చికబయలు నుంచి పచ్చిక బయలుకు తమ నివాసం తరచు మార్చక, ఎక్కడో ఒకచోట క్రమంగా వారిప్పుడు స్థిరపడి పోవడం లేదా?

సముచి : కొందరంతే చేస్తున్నారు.

హిరణ్యకశిపుడు : ఆనకట్టలను తెగగొట్టడం తగ్గించలేదా?

సముచి : కొంతవరకు తగ్గించారు. ?

హిరణ్యకశిపుడు : వ్యవసాయానికే అధిక ప్రాధాన్యమివ్వడం లేదా?

సముచి : అధికంగా కాకపోయినా, ఆదిలో కంటే కొంత నయం.

హిరణ్యకశిపుడు : గుడిసెలలో బ్రతకడం మాని, ఇటుకలతో ఇల్లు కట్టుకొనడం లేదా?

సముచి : అక్కడక్కడ కొందరు కడుతున్నారు.

హిరణ్యకశిపుడు : అన్ని కాలాలలో ఉన్నిబట్టల వాడకాన్ని తగ్గించి, నూలుబట్టలకు మారడం లేదా?

సముచి : అదీ కొంతవరకు నిజమే, ప్రభూ!

హిరణ్యకశిపుడు : గడపలను పసుపు కుంకాలతో అలంకరించుకోవడం లేదా?

సముచి : ఇప్పుడిప్పుడే ఆ పని కొందరు చేస్తున్నారు.

హిరణ్యకశిపుడు : ఇప్పుడిప్పుడని, అక్కడక్కడని నీకెంత చులకన చేయడానికి ప్రయత్నించినా ఆర్యజాతి జీవిత విధానం

త్వరగా మారిపోతున్నది. అదే విధంగా మనవారు సయితం వారి నుంచి కొన్ని కొన్ని విషయాలను నేర్చుకుని, బాగుపడుతున్నారు. క్షుద్ర దేవతోపాసన మనవారితో ఇటీవలెంతగా తగ్గిపోలేదు? (హిరణ్యకశిపుని పలుకుల మధ్య భటుని ప్రవేశం).

భటుడు : (ప్రభువు ఆగినంతనే) దేవరవారు మన్నించాలి. శుక్రాచార్యుల వారు వేం చేశారు.

హిరణ్యకశిపుడు : వారిని వెంటనే ప్రవేశపెట్టు. (భటుని నిష్క్రమణ).

సముచి : మరి నాకు సెలవిప్పిస్తారా?

హిరణ్యకశిపుడు : గురుదేవులు వస్తుంటే నీవు వెళ్ళవలెనా? నీ సందేహాలను ఆయనకు నివేదించవచ్చు - నీ వుండు!

(ఇంతలో శుక్రాచార్యులు ఆందోళనతో ప్రవేశిస్తాడు).

హిరణ్యకశిపుడు : (ద్రాసనంపై నుంచి భక్తితో లేస్తూ) గురుదేవులకు నమస్కారం!

శుక్రాచార్యులు : దీర్ఘాయుష్మాన్ భవ! మరొకసారి...

సముచి : ఆచార్యవరులకు నమస్కారం!

శుక్రాచార్యులు : శతాయుష్మాన్ భవ! (హిరణ్యకశిపుని దగ్గరికి వెడుతూ) మరొకసారి హత్యాయత్నం జరిగిందా?

హిరణ్యకశిపుడు : (చిరునవ్వుతో) ఇద్దరు కుర్రకుంకలు ఏదో వెర్రిపని చేశారులెండి!

శుక్రాచార్యులు : అలా చప్పరించి వేయకు, నాయనా! రాజ ప్రాసాదంలోకి తిరిగి ఎలా ప్రవేశించారు? తిరిగి ఏమి చేశారు?

హిరణ్యకశిపుడు : ఆ! ఏమీ లేదులెండి! చెబితే, మీరనవసరంగా కలవరపడతారు! శు

క్రాచార్యులు: (సముచి వైపు తిరిగి) ఏమి జరిగింది, సముచి?

సముచి : రెండు నల్లత్రాచులను ప్రభువుల వారిపై విసిరారు.

శుక్రాచార్యులు : నల్ల త్రాచులనా?

సముచి: ఔను!

శుక్రాచార్యులు : ఎలా తెచ్చారు?

సముచి : బుట్టలతో.

శుక్రాచార్యులు : లోనికెలా వచ్చారు?

సముచి : అదే ఇంకా తెలియలేదు.

శుక్రాచార్యులు : ఆహారంలో విషం కలపడానికి చేసిన ప్రయత్నం విఫలమైనందున ఈసారి సర్పాలనే ప్రయోగించారన్న మాట!

హిరణ్యకశిపుడు : (నవ్వుతూ) ఇది చివరి ప్రయత్నమే కావచ్చు. కొత్త ప్రయత్నాలకు కొత్త పద్ధతులు. మరి మిగలనట్టే!

శుక్రాచార్యులు : అదేమన్నమాట, నాయనా? దుష్టులకు దురాలోచనలు తక్కువా? ఏడాది లోపల ఇది ఆరవ యత్నం.

సముచి : నెలలోపల రెండవది!

శుక్రాచార్యులు : ఔను! రాను రాను ఋషులు మరింత రెచ్చిపోతున్నారు!

సముచి : ఆచార్యవర్యుల విజయానికిది తార్కాణం (శుక్రాచార్యులు నివ్వెరపోతాడు).

హిరణ్యకశిపుడు : (కోపంగా) సముచీ!

సముచి : ఇది ప్రభువులన్న మాటే కాదా?

హిరణ్యకశిపుడు : మరి చాలు! కట్టి పెట్టు!!

శుక్రాచార్యులు : (కలతతో) అతనిపై కోపగించకు, నాయనా! నా వైఫల్యాన్ని నేను గుర్తించక తప్పని పరిస్థితులే వచ్చాయి!

హిరణ్యకశిపుడు : గురుదేవులు నన్ను మన్నించాలి. నేనన్నది - నిస్పృహ పెరిగిపోతున్నందునే ఆర్య ఋషులు విజృంభిస్తున్నారని; పెరిగిపోతున్న వారి నిస్పృహ తమ విజయానికి తార్కాణమని.

సముచి : ఆచార్యవర్యా! ప్రభువుల పలుకులుగా నేను తమకు నివేదించింది కూడా అంతే కాదా?

హిరణ్యకశిపుడు : (తీక్షణంగా) పలుకులనే కావచ్చు గాని నీవు స్ఫురింపజేసింది దురర్థం!

సముచి : క్షమించండి, నాకు దురుద్దేశమేమీ లేదు.

శుక్రాచార్యులు : నీవెంత ప్రభు భక్త పరాయణుడవో నాకు తెలుసు, బాబూ! ఆపద వెంట ఆపద వస్తున్నా, నీ అప్రమత్తతే ప్రభువును కాపాడుతున్నది. ఆయురారోగ్యైశ్వర్యాలతో నీవు చిరకాలం వర్థిల్లు!

సముచి : ఆచార్యవర్యుల ఆదరానికి, ఆశీస్సులకు కృతజ్ఞుడను.

శుక్రాచార్యులు : నీవు నిత్యజాగరూకుడవై వుండకపోతే, ఋషులు...

హిరణ్యకశిపుడు : నేటి ప్రాతఃకాలాన దయచేయవలసిందిగా గురుదేవులకు వర్తమానం ద్వారా వేడుకొన్నది ఒక ముఖ్య విజ్ఞాపన కోసం!

శుక్రాచార్యులు : అలాగా, నాయనా! ఏమిటది?

హిరణ్యకశిపుడు : మా చిరంజీవికి అయిదేళ్ళు వెళ్ళిపోతున్నాయి. వాడికి తమరు అక్షరాభ్యాసం చేయించాలి.

శుక్రాచార్యులు : ప్రహ్లాదునికి అయిదేళ్ళు నిండుతున్నాయా! ఎప్పటితో?

హిరణ్యకశిపుడు : రేపటితో.

శుక్రాచార్యులు : సంతోషం.

హిరణ్యకశిపుడు : అక్షరాభ్యాసం చేయించిన తర్వాత తమ విద్యాపీఠంలోనే వుంచి, వాడికి విద్యా బుద్ధులు చెప్పాలి.

శుక్రాచార్యులు : అక్షరాభ్యాసానికేమి? దాన్ని చేయిస్తానులే! ఆ పిమ్మట అన్నయ్య బిడ్డలతోపాటు వారి గురువుల వద్దనే చిరంజీవి కూడా విద్యాభ్యాసం చేయవచ్చు.

హిరణ్యకశిపుడు : మావాడికి తమ శిష్యరిక భాగ్యం లభించాలని నాతోపాటు వాడి తల్లి కూడా మనసారా కోరుకుంటున్నది.

శుక్రాచార్యులు : అయితే సరే, నాయనా!

సముచి : నా జోక్యాన్ని ప్రభువులు మన్నించాలి. రాకుమారులను ఆచార్యుల వారి విద్యాపీఠానికి పంపించడం శ్రేయస్కరం కాదు.

హిరణ్యకశిపుడు : (కోపంగా) ఆ!

సముచి : (నిశ్చలంగా) తమరు ఆగ్రహించినా అది శ్రేయస్కరం కాదని తిరిగి చెప్పక తప్పదు.

హిరణ్యకశిపుడు : ఇది ప్రభు ధిక్కరణ కాదా?

సముచి : కాదు, ప్రభుభక్తి!

హిరణ్యకశిపుడు : నీ ప్రవర్తన అంతకంతకు మాకు మరింత దుస్సహం అవుతున్నది. నీవిక మా సమక్షం నుంచి...

శుక్రాచార్యులు : (మాటకు అడ్డుపడి) అకారణంగా సముచి అభ్యంతరం చెప్పడు, నాయనా! నీవు కాస్త నిదానించు! (సముచితో) నీవు మనస్సులో వున్నమాట నాతో దాపరికం లేకుండా చెప్పు, బాబూ!

సముచి : ప్రభువుల వారు కలతపడతారని నేనింతవరకు వారికి చెప్పలేదు. ఉదయం ప్రభువులపై విషసర్పాలను విసరిన వారిద్దరు తమ విద్యాపీఠంలోని ఆర్య యువకులే! శుక్రాచార్యులు : (ఆశ్చర్య విషాదాలతో) మా విద్యాపీఠం లోని వారా?

సముచి : ఔను!

శుక్రాచార్యులు : (నిట్టూర్పుతో) మా వైఫల్యానికి ఇది మరొక నిదర్శనం.

హిరణ్యకశిపుడు : (సముచి పలుకుల దెబ్బ నుంచి తేరుకుంటూ) తమ విధానాల పాటవాన్ని తామే శంకించరాదు. తమరు ముందే చెప్పలేదా? రెండు, మూడు తరాల తర్వాత గాని వాటి సత్ఫలితాలు ప్రస్ఫుటం కావని.

శుక్రాచార్యులు : కాని, మా విద్యాపీఠంలోని వారే...

హిరణ్యకశిపుడు : కొన్ని వందల మంది తమ పీఠంలో విద్య నభ్యసిస్తున్నారు. వారిలో ఎవరెట్టివారో ఎలా తెలుస్తుంది?

శుక్రాచార్యులు : (సముచితో) వారిద్దరెవరో, వారినెవరు పంపించారో తెలుసుకోగలిగావా బాబూ?

సముచి : ప్రయత్నం చేస్తున్నాము గాని, తెలుసుకోగలమన్న నమ్మకం లేదు. అన్నింటికి తెగించిన వారినే ఆర్యఋషులు పంపిస్తున్నారు!

శుక్రాచార్యులు మేము, మా విద్య, మా విధానాలు ఎంత శుష్కమైనవో తెలుస్తూనే వున్నది! యువకుల లేత మనస్సులను మార్చడమైనా మాకు చేతకాక పోతున్నదన్నమాట!

హిరణ్యకశిపుడు : అదేమిటి, ఆచార్యదేవా? ఎందరో ఆర్య యువకులు మన సైన్యాలలో సయితం చేరలేదా? ఎంత స్వామి భక్తితో మనను కొలవడం లేదు?

శుక్రాచార్యులు : ఏమైనా మన సముచి చెప్పినట్టు, ప్రహ్లాదుని విద్యాపీఠానికి పంపించడం శ్రేయస్కరం కాదు.

హిరణ్యకశిపుడు : సముచి మాటలకేమి లెండి! చిరంజీవికి తామే విద్యాభిక్ష పెట్టాలి.

శుక్రాచార్యులు : అయితే, రాజప్రాసాదంలోనే విద్యాబోధ చేస్తాంలే!

హిరణ్యకశిపుడు : ఆటలకైనా ఎందుకోగాని వాడు తక్కిన పిల్లలతో కలువడు. చనువుగా మా వద్దకైనా రాడు. చక్కిలిగింత పెట్టినా నవ్వడు. ఏడు పైనా గట్టిగా యేడ్వడు. ఏదో ఒక మాదిరిగా వుంటాడు. పది మందితో కలిసి మెలిసి తిరగడం వాడు నేర్చుకోవాలి. వాడిని మీ విద్యాపీఠానికి పంపించాలని నాకంటె లీలావతి ఎక్కువ పట్టుదలతో వున్నది.

శుక్రాచార్యులు : తొందరేమిటి, నాయనా! ఆలోచించి, ఏదో ఒకటి చేస్తాములే!

హిరణ్యకశిపుడు : తమతో మాట్లాడాలని లీలావతి కోరుతున్నది. తామొకసారి లోనికి దయచేస్తారా?

సముచి : ప్రభువుల కొక మనవి. ఆర్య ఋషుల దుస్తంత్రాలు తమకు తెలియనివి కావు. విద్యాభ్యాసానికి రాకుమారుని ఆర్య యువకుల మధ్యకు పంపిస్తే మహాప్రమాదమేదైనా సంఘటించవచ్చు.

హిరణ్యకశిపుడు : అట్టి భయమేదీ మాకు లేదు.

సముచి : నాకే కాదు, తక్కిన సేనానులకు, సచివులకు సయితం తమ ఆలోచన సమ్మతికరం కాదు.

హిరణ్యకశిపుడు : (చురుకుగా) ఒకరి సమ్మతిని మేము కోరడం లేదు! గురుదేవా! తమరొకసారి లోపలికి దయ చేయండి!

(హిరణ్యకశిపుని వెంట శుక్రాచార్యులు లోనికి వెడుతుండగా - తెర)

చతుర్థ రంగం

(నిర్జన రంగస్థలంపై తెర లేస్తుంది. తర్వాత కొన్ని క్షణాలకు భయ సంకోచాలతో వామదేవుడు, దేవాతిథి ప్రవేశిస్తారు)

వామదేవుడు : (గుసగుసల గొంతుతో) శుభ శకునమే! పాదం పెట్టగానే అంగిరసు దెదురు పడలేదు.

దేవాతిథి : ఎలాగైనా ముందు బృహత్కీర్తిని కలుసుకోవాలి. మనం వస్తున్నట్టు అతనికి తెలియదా?

వామదేవుడు : తెలియకేమి? మా శిష్యునితో నిన్ననే వర్తమానం చేశాము.

దేవాతిథి : ఎదురు వచ్చి, మనను దారిలోనే కలుసుకుంటే బాగుండేది.

వామదేవుడు : ఆ మాటే మేము చెప్పి పంపించాము. అయినా రాలేదంటే ఏమి చిక్కు వచ్చిందో! (ఆశ్రమం లోపలి భాగాలలోకి చూస్తూ) అటు వెడుతున్నదెవరు? బృహత్కీర్తి కాదా?

దేవాతిథి : (అటు దిక్కుగా చూస్తూ) కాదు, కాని, అతడితో బృహత్కీర్తికి...

వామదేవుడు : ఔను! బృహత్కీర్తికి వర్తమానం చేస్తే సరి. మేము వెళ్ళి, అతడితో మాట్లాడి వస్తాము. మీరిక్కడే వుండండి. (వామదేవుడు వెడతాడు. ఆయన వెళ్ళిన దిక్కుకు దేవాతిథి చూస్తూ వుండగా వెనకవైపు నుంచి బృహత్కీర్తి ప్రవేశిస్తాడు)

బృహత్కీర్తి : వచ్చారా, మహర్షి? (తుళ్ళిపడి దేవాతిథి వెనుదిరిగి చూస్తాడు)

బృహత్కీర్తి : నవ్వుతూ, మహర్షులు తుళ్ళిపడుతున్నారేమిటి? (బదులు చెప్పకుండా దేవాతిథి చిరునవ్వు నవ్వుతాడు. చెంతకు వెళ్ళి, బృహత్కీర్తి పాదాభివందనం చేస్తాడు).

దేవాతిథి : పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు! ఆ! ఏమీలేదు, నాయనా! మరెవ్వరో అనుకున్నాను. నీకోసం వెతుకుతూ వామదేవులు అటు వెళ్ళారు. దారిలోనే మమ్ము కలుసుకొనగల వనుకొన్నామే!

బృహత్కీర్తి : తమకోసమే బయల్దేరాను. అయితే, మన దారులు వేరైనట్టున్నాయి.

వామదేవుడు : (తిరిగి ప్రవేశిస్తూ) నువ్వు రానే వచ్చావా, నాయనా!

బృహత్కీర్తి : మహర్షులకు నమస్కారం! (దగ్గరికి వెళ్ళి పాదాభివందనం చేస్తాడు)

వామదేవుడు : సర్వాభీష్ట సిద్ధిరస్తు! మేము వస్తున్నట్టు అంగిరస మహర్షులకు తెలుసా!

బృహత్కీర్తి : త్వరలోనే తాముభయులు రావచ్చునని సూచనప్రాయంగా ఒక మాట వారి చెవిని వేశాను.

దేవాతిథి : అది విని వారేమన్నారు? ఆగ్రహపడలేదు గదా?

బృహత్కీర్తి : లేదుగాని, “మా మాట పట్ల వారికి గౌరవమే లేనప్పుడు మాతో వారికేమి పని?” అంటూ భ్రుకుటి ముడిచారు.

దేవాతిథి : అయితే, నీవు వెళ్ళి, ఇక వారిమాట ప్రకారం నడుచుకొనడానికే మేము వచ్చినట్టు వారికి నివేదించు, నాయనా!

బృహత్కీర్తి : సరే! (వెళ్ళబోతాడు)

వామదేవుడు : వారిని మాకు సుముఖులనుగా చేయవలసిన బాధ్యత నీదే సుమీ! ఎలా వ్యవహరిస్తావో, ఏమో!

బృహత్కీర్తి : అది నాకు విడిచి పెట్టండి! (వెడతాడు)

వామదేవుడు : అంగిరసు లేమన్నా, దానికి “జై” ననాలి. దేనికీ యెదురు చెప్పరాదు. మరి మీరేమి చేస్తారో!

దేవాతిథి : మా భయం మీరెక్కడ తొందర పడతారో అని!

వామదేవుడు : మాలో మరెక్కడ తొందరపాటు, ఇంద్రాగ్ని వరుణ దేవులకు యజ్ఞయాగాదు లేనాడు తగ్గినవో అనాడే మా చేవ చచ్చింది. ఇది వరలో పిలిస్తే చాలు ఆ దేవతలు పలికేవారు; సకల సంపదలను సమకూర్చేవారు. ఇప్పుడు మాకు పొయిలో పిల్లి లేవడమైనా కష్టమైపోతున్నది. చెప్పుకుంటే సిగ్గు చేటుగాని, ఆరు నెలల క్రితం మే మొకనాడు కుక్క మాంసం వండుకు తినవలసి వచ్చింది!

దేవాతిథి : ఆ! దుర్భిక్షం అంతవరకు వెళ్ళిందా?

వామదేవుడు : (నిట్టూర్చుతూ) ఔను! సోమరసాన్ని సేవించి ఎంతకాలమైందో! దాని రుచిని సయితం మరిచిపోయాము. (కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం. ఈ లోపల చాలా దూరాన వేద మంత్ర పఠన జరుగుతున్నట్టు వినబడుతుంది). అంగిరసులు యజ్ఞయాగాదులు యధావిధిగా కొనసాగిస్తున్నట్టే వున్నారు. ఆశ్రమం పచ్చ పచ్చగానే కనబడుతున్నది. ఆయన స్థితిగతులు తగ్గినట్టు తోచదు.

దేవాతిథి : యజ్ఞయాగాలపై మనవారికి భక్తి శ్రద్ధలు సన్నగిలినంతనే అనార్యుల పూజావిధి దూష్యమైనది కాదని అంగిరసులంటున్నారట. శివపూజకు ప్రతిగా శ్రీహరి పూజను ప్రోత్సహిస్తున్నారట; హరిభక్తుల నుంచి కాన్కలు స్వీకరిస్తున్నారట.

వామదేవుడు : ఎప్పటికేది నెయ్యమో దాన్ని చేయడంలో ఆయనకు ఆయనే సాటి! అమోఘమైనది ఆయన మేధాశక్తి. ఏనాటికైనా శుక్రాచార్యుల ఆటలను... (అంగిరస, బృహత్కీర్తులు ప్రవేశిస్తారు).

వామదేవుడు : అంగిరసులకు నమస్కారం!

దేవాతిథి : (వామదేవుని గొంతుతో గొంతు కలుపుతూ) ఋషీశ్వరులకు నమస్కారం.

అంగిరసుడు : (ఉభయుల నుద్దేశిస్తూ) దీర్ఘాయుష్మాన్ భవ! మాపై కృప కలిగింది కాబోలు! తిరిగి దయ చేశారు!

వామదేవుడు : ఎంత మాట! ఋషి కులానికి తామగ్రజుల వంటివారు తమ కృపాభిక్ష కోరుకోడానికి వచ్చాము.

దేవాతిథి : మా అనాలోచిత చర్యలకు మహర్షులు మమ్ము మన్నించాలి.

అంగిరసుడు : (అజివాసనాలను చూపుతూ) దయ చేయండి! (వాటి పై తామందరు కూర్చున్న మీదట, ఇప్పటికైనా తమ యత్నాలను మానినట్టు కనబడదు!

వామదేవుడు : మానకేమి? విషనాగ ప్రయోగం తర్వాత కొత్త యత్న మేదీ జరగలేదు. అంగిరసుడు : జరగకపోవడమేమిటి? ఆ తర్వాత...

దేవాతిథి : తుది యత్నంగా హిరణ్యకశిపుని శయ్యాగారాన్ని తగల బెట్టించాము లెండి.

వామదేవుడు : (ఆశ్చర్యంగా) ఆ సంగతి మేము వినలేదే! అదెప్పుడు?

దేవాతిథి : ఆరు నెలలనాడు.

అంగిరసుడు : అది తుది యత్నమేనా?

దేవాతిథి : ఆ విషయంలో తమకు సందేహ మక్కరలేదు. మానవులకు బదులు ? మానవుల మాటకేమి? దేవతలైనా హిరణ్యకశిపుని వధించలేరు!

అంగిరసుడు : ఈ విషయాన్ని తెలుసుకొనడానికి తమకిన్నేళ్ళు పట్టిందా? ఇప్పటికి మొత్తమెన్ని యత్నాలు చేశారు?

దేవాతిథి : చాలా చేశాము లెండి!

బృహత్కీర్తి : నా లెక్క ప్రకారం యాభై రెండు.

దేవాతిథి : (అణచుకొనలేని గర్వంతో) పైకి పొక్కనివి మరొక పదిహేను కూడా వున్నాయి.

అంగిరసుడు : (వెటకారంగా) అయితే, నూరు పూర్తి చేయరాదా?

దేవాతిథి : నూరు కాదు, ఇన్నూరు, మున్నూరు యత్నాలు చేసినా, హిరణ్యకశిపుని వధించలేము.

అంగిరసుడు : అంత గట్టిగా చెబుతున్నారు - ఎందువల్ల?

దేవాతిథి : రహస్యంగా అతడు ఘోర తపస్సు చేసి మన బ్రహ్మ నుంచి వరాలు పొందినాడట!

అంగిరసుడు : అలాగా!

బృహత్కీర్తి : మన బ్రహ్మ దైత్యులకు వరాలిస్తాడా? అది కల్ల,

అంగిరసుడు : (బృహత్కీర్తితో) కాస్త నీ వూరుకో! (దేవాతిథితో) అతడు పొందిన వరాలేవి?

దేవాతిథి : ఇంటగాని, బయటగాని, నేల పైగాని, నింగిలోగాని, నీళ్ళలోగాని, నిప్పులోగాని, పగలుగాని, రేయిగాని తనకు మృత్యువు సంభవించరాదన్న వరం పొందాడట!

వామదేవుడు : చాలా దీర్ఘమైన వరమేనే!

దేవాతిథి : మేము పూర్తిగా చెప్పలేదు. అది మరింత సుదీర్ఘం.

అంగిరసుడు : అయితే, పూర్తిగా సెలవివ్వండి.

దేవాతిథి : నరులచేగాని, మృగాలచేగాని తనకు చావు రాగూడదట. సర్పాలచేగాని, క్రిమికీటకాదులచేగాని చావు రాగూడదట. చేతనా చేతనాలలో దేనితోనూ చావు రాగూడదట. ఆయుధాలచేగాని, అసురులచే గాని చావు రాగూడదట.

బృహత్కీర్తి : ఇంత కంఠశోష దేనికి? ఎన్నటికీ చావు రాగూడదంటే సరిపోయేది కాదా?

అంగిరసుడు : (బృహత్కీర్తితో) నిదానించమని నీకింతకు ముందే చెప్పలేదా? అయితే యితర వరాలేవి?

దేవాతిథి : యుద్ధంలో తన కెదురులేని శౌర్యం, లోకపాలకులను అతిక్రమించే మహిమ, భువనత్రయ విజయాన్ని రెండవ వరంగా కోరినాడట.

వామదేవుడు : ఇంద్రాగ్ని వరుణాది లోకపాలకులు హిరణ్యకశిపునికి పాదదాసు లైనందువల్లనే కాబోలు, మేము పిలిస్తే ఈ మధ్య పలకడమేలేదు.

బృహత్కీర్తి : పూజ్య జనకులు అనుమతిస్తే ఒక్క మాట!

అంగిరసుడు : ఏమిటది?

బృహత్కీర్తి : దేవాతిథులు చెబుతున్నది కాకమ్మ కథ కాదా?

అంగిరసుడు : ఆ మాట దేవాతిథి మహర్షుల పట్ల మహాపచారం! నీకు వేరే పనులు లేవా? వెళ్ళి వాటిని చూచుకో! (ఎవ్వరికి నమస్కరించకుండా బృహత్కీర్తి చివాలున లేచి వెళ్ళిపోతాడు).

అంగిరసుడు : (కుమారుని వెళ్ళనిచ్చి) ఈ వరాల మాట మీరిప్పుడు విన్నారుగాని, మాకు ముందునించే తెలుసు!

వామదేవుడు : క్రితం సారి మేము వచ్చినప్పటికే తమకు

అంగిరసుడు : ఆ! తెలుసా?

వామదేవుడు : అయితే, అప్పుడే మాతో చెప్పకపోయారా?

అంగిరసుడు : ఏమి చెప్పినా వినే స్థితిలో మీరప్పుడున్నారా? సరిగాని, అయిదారేళ్ళ లోపల హిరణ్యాక్షుని కుమారులలో ఆరేడుగురు, హిరణ్యకశిపుని కొడుకు లిద్దరు చనిపోయారు. ఇవి సహజ మరణాలేనా? లేక...

దేవాతిథి : ఔను! సహజ మరణాలే.

అంగిరసుడు : హిరణ్యాక్షుని పుత్రులలో పెద్దవారు ముగ్గురూ ఒకేనాడు చనిపోవడం వల్ల మాకు కొంచెమేదో సందేహం తోచింది లెండి. పైగా విష ప్రయోగం వల్ల వారు చనిపోయినట్టు చెప్పుకున్నారు.

దేవాతిథి : ఆ ముగ్గురు హఠాన్మరణానికి విష ప్రయోగమే కారణం కావచ్చు. అయితే, అందుకు మా ప్రేరణ లేదు. మా శిష్యులెవరైనా దైత్య వంశ సమూల నాశన దీక్షతో పని చేస్తే చేసి వుండవచ్చు.

అంగిరసుడు : ప్రహ్లాదునికి అట్టి ప్రయోగం సంఘటించదు గదా?

దేవాతిథి : దైత్య వంశ నిర్మూలన వాంఛనీయం కాదా?

అంగిరసుడు : అన్ని సందర్భాలలో కాదు. ప్రహ్లాదునికి ఎట్టి ప్రమాదం రానివ్వమని మీరు మాకు వాగ్దాన మివ్వాలి.

దేవాతిథి : అది మాకు సాధ్యమా?

వామదేవుడు : (దేవాతిథితో) మీరు తిరిగి అంగిరసులకు యెదురాడుతున్నారు!

దేవాతిథి : అంగిరస మహర్షులు మమ్ము మన్నించాలి. మా నుంచి ప్రహ్లాదునికి ఎట్టి ప్రమాదం రాబోదు.

అంగిరసుడు : పోగా మిగిలిన హిరణ్యాక్షుని పుత్రులలో పెద్దవాని వయస్సు ఇప్పుడెంత?

దేవాతిథి : తొమ్మిది పైన, పది లోపు.

అంగిరసుడు : వాని పేరు?

దేవాతిథి : కాలనాభుడు.

అంగిరసుడు : ప్రహ్లాదుడు ఆరేళ్ళ వాడైనా, కాలనాభునికి సమవయస్కునివలె కనబడతాడట నిజమేనా?

దేవాతిథి : ఔను!

అంగిరసుడు : శుక్రాచార్యుని విద్యాపీఠంలో ఎన్నాళ్ళుగా అతడు చదువుతున్నాడు?

దేవాతిథి : మూడు, నాలుగు నెలలుగా!

అంగిరసుడు : అతని స్వభావమెట్టిదో?

వామదేవుడు : ఈ విషయాలన్నీ తమకు తెలియకనే మమ్మడుగుతున్నారా?

అంగిరసుడు : మాకు తెలియక పోవుగాని, మీరేమి వింటున్నారో తెలుసుకుందామని. ప్రహ్లాదుడు వయస్సుకు మించిన కబుర్లు చెబుతున్నాడట - నిజమా?

దేవాతిథి : కేవలం ముది మాటలు మాట్లాడుతాడట.

అంగిరసుడు : (తాను విన్న సంగతి ధ్రువపడినట్టు) ఊ హూ!...

దేవాతిథి : మహర్షులు ప్రహ్లాదుని గురించి గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నారు - ఏమిటి విశేషం?

అంగిరసుడు : పెద్ద విశేషమేమి లేదు. అయితే, శుక్రాచార్యుని విద్యాపీఠంలో మీకు ఆంతరంగికులైన యువకులున్నారా?

దేవాతిథి : కొందరున్నారు గాని, వారితో తమకేమి పని?

వామదేవుడు : అదుగో! అంగిరసులకు తిరిగి యెదురాడుతున్నారు!

దేవాతిథి : మే మెదురాడిన దెక్కడ?

అంగిరసుడు : రాజధాని నగరానికి మీవలె మేము చేరువగా లేము. అక్కడి విశేషాలు మాకంటె మీకు ఎక్కువగా తెలుస్తాయి. అందువల్ల అడగవలసి వస్తున్నది.

వామదేవుడు : తమకు దివ్యదృష్టి వున్నట్టు ప్రతీతి. ముల్లోకాలలో తమకు తెలియని విశేషాలుంటాయా?

అంగిరసుడు : ఏ దృష్టి వున్నా మేము చెప్పినట్టు తక్కిన మహర్షులు నడుచుకొనకపోతే మేము చేయగలిగింది స్వల్పమే!

దేవాతిథి : తమ సహకారాన్ని అర్థించడానికే కాదా మేము తిరిగి తమ వద్దకు వచ్చింది?

అంగిరసుడు : మీ ఆలోచనల ప్రకారం మా నాయకత్వం కాబోలు!

దేవాతిథి : కాదు తమ ఆలోచనల ప్రకారమే! తమ పలుకే మాకిక శాసనం!

అంగిరసుడు : అయితే, శుక్రాచార్యుల విద్యాపీఠంలో గల మీ యువకులలో నమ్మకమైన వారిద్దరిని మా వద్దకు రహస్యంగా పంపిస్తారా?

దేవాతిథి : ఇద్దరు చాలునా?

అంగిరసుడు : ప్రస్తుతానికి చాలు!

దేవాతిథి : ఎప్పుడు పంపించమంటారు?

అంగిరసుడు : వీలైనంత త్వరలో! అతి రహస్యంగా పంపించాలి. పరమ విశ్వసనీయులనే పంపించాలి.

వామదేవుడు : దేవాతిథులు మృత్యుగహ్వరంలో దూకమన్నా మారు మాట్లాడకుండా దూకేవారు ఆయన చేతిలో కోకొల్లలుగా వున్నారు. తమకు జ్ఞాపకం వున్నదా? ఆరేళ్ళనాడు రత్న వ్యాపారుల వేషంలో ఇద్దరు యువకులను హిరణ్యకశిపుని వధకై పంపించిన మీదట ఆయన తమ దర్శనానికి రావడం.

అంగిరసుడు : ఆ సంగతి మరచి పోగలమా?

వామదేవుడు : చీల్చి చెండాడినా తాము దేవాతిథుల శిష్యుల మన్న మాట వారు బయట పెట్టలేదు! తర్వాత ఎందరెందరిని ఆయన పంపించలేదు? వారందరిలో మచ్చుకు ఒక్కరైనా...

అంగిరసుడు : మొత్తం నూట యాభైమందిని మీరు నియోగించారా?

దేవాతిథి : దాదాపుగా!

అంగిరసుడు : ఇది సమయం కాదన్నా, మా మాట వినక, అంతమందిని వృథాగా బలి పెట్టారన్నమాట!

వామదేవుడు : ఇప్పటికైనా తగు సమయం వచ్చినదంటారా? హిరణ్యకశిపుని పీడ విరగడైతే తప్ప తిరిగి అగ్నిష్టోమ యజ్ఞ భాగ్యమైనా మాకు లేదు. దాన్ని మేము చేసుకొని ఏడేళ్ళు దాటిపోయింది!

అంగిరసుడు : మరొక పదేళ్ళపాటు మీరు ఓపిక పట్టవలసి వస్తుందేమో! వామదేవుడు : మరి పదేళ్ళే!

దేవాతిథి : చాలా పెద్ద గడువు పెడుతున్నారు!

అంగిరసుడు : మీ తొందరపాటు ప్రవృత్తి ఎక్కడికి పోతుందిలెండి! (బృహత్కీర్తి నెమ్మదిగా ప్రవేశించి, వామదేవునికి వెనకగా కూర్చుంటాడు).

వామదేవుడు : లేదు, మహర్షీ! లేదు! తాము రెండు పదేళ్ళు ఆగమన్నా ఆగుతాము! ఈ లోపల సుహోత్రులు తమ యజ్ఞఫలాన్ని అప్పుడప్పుడు మాకు పంచి పెట్టకపోతారా?

బృహత్కీర్తి : సుహోత్రుల వద్దకు గంధర్వుల రాకపోకలు ఈ మధ్య కొంత తగ్గిపోయాయట.

అంగిరసుడు : అది ముఖ్యంగా నీకు విచారకర విషయం! లోపల పనులుంటే చూసుకోవలసిందిగా నీకు చెప్పలేదా?

బృహత్కీర్తి : (కదలడానికి మనస్కరించక) పనులేవీ లేవు.

అంగిరసుడు : చేయాలంటే చాలా వుంటాయి!

బృహత్కీర్తి : మహర్షులకు అతిథి సత్కారాలు జరగనే లేదు. ఆ విషయం మీకు జ్ఞాపకం చేద్దామని...

అంగిరసుడు : మంచిది. జ్ఞాపకం చేశావుగా! మరి వెళ్ళు! (చివాలున లేచి, బృహత్కీర్తి వెళ్ళిపోతాడు).

వామదేవుడు : పాపం! ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు! మాకు వలె సుహోత్రులకు కూడా బృహత్కీర్తి అంటే చాలా అభిమానం! తమ వద్దకు భక్తి శ్రద్ధలతో తరచు వస్తూ పోతూ వుంటాడని ఆయన చెప్పారు!

అంగిరసుడు : మా వాడికి భక్తి శ్రద్ధలు ఆయన పట్ల కాదు; ఆయన సోమయజ్ఞాల పట్ల!

వామదేవుడు : వారిని యధేచ్ఛగా చేసుకోగల సౌభాగ్యం తిరిగి మాకెప్పుడు లభ్యమౌతుందో! అంతా తమ చేతిలో వుంది!

దేవాతిథి : తమ పథకమేమిటో మాకు స్థూలంగానైనా సూచిస్తే, ఎంతకాలమైనా వేచివుండడం మాకు సులభమౌతుంది!

అంగిరసుడు : బయటికి ఎంత మాత్రం పొక్కనివ్వరు గదా!

దేవాతిథి : మమ్మ మీరు పూర్తిగా నమ్మవచ్చు.

వామదేవుడు : (దేవాతిథి గొంతుతో గొంతు కలుపుతూ) అంత పని చేస్తామా?

అంగిరసుడు : అయితే, మరికాస్త దగ్గరికి రండి. (దగ్గరికి జరిగిన దేవాతిథి, దేవుల చెవులలో అంగిరసుడు నెమ్మదిగా ఏదో ఊదుతుండగా - తెర)

పంచమ రంగం

(లీలావతి వయస్సు దాదాపు నలభై సంవత్సరాలు. కల్లకపటాల నెరుగని ప్రవృత్తి; నిరాడంబర వ్యక్తిత్వం మహారాజ్ఞి వలెకాక సామాన్య గృహిణివలె కనబడుతుంది. విలువగల వస్త్రాలను గాని, అభరణాలనుగాని ధరించదు. సుఖానందాలకు అంతగా నోచుకున్నది కాదని ఆమె వదనాన్ని చూడగానే స్ఫురిస్తుంది.

ప్రహ్లాదుడు పదునాలుగేండ్ల బాలుడైనా, పద్దెనిమిది నిండిన యువకునివలె వుంటాడు. జడునివలె కనబడినా లోతైనవాడు. వేష భూషలలో చాలావరకు తండ్రిని అనుకరిస్తాడు.

హిరణ్యకశిపుని ఆలోచనామందిరంపై తెర లేచినప్పుడు "హరిఃఓం! హరిఃఓం" అంటూ కళ్లు మూసుకుని ప్రహ్లాదుడు హరినామస్మరణ చేస్తూ వుంటాడు. కొన్ని క్షణాల పిమ్మట లీలావతి ప్రవేశిస్తుంది. అల్లంత దూరాన వుండగానే ఆమె పాదాల చప్పుడు విని కళ్లు కొద్దిగా తెరిచి ప్రహ్లాదుడు ఆమెను చూస్తాడు. వెంటనే మరింత గట్టిగా కళ్లు మూసుకుని, మరికొంచెం బిగ్గరగా "హరిఃఓం! హరిఃఓం")

లీలావతి : (బాధా విచారాలతో కొడుకుని చూస్తూ కొద్ది సేపు నిలబడి, ఆ పిమ్మట) మమ్మింతగా క్షోభ పెట్టరాదురా, బాబూ!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : మా కడుపు

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : ఎంత కష్టంలోనైనా కంటతడి పెట్టని నీ తండ్రి నిన్న సాయంత్రం కన్నీరు మున్నీరుగా విలపించారు, రా! అయినా, నీ మతం నీదేనటరా!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : కళ్లు తెరిచి, ఒకసారి నా వంక చూడరా, బాబూ!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : ఆయనకు గతరాత్రి కంటిపై కునుకు లేదు. చెప్పనలవికాని బాధపడుతున్నారురా!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : (కోపంతో ప్రహ్లాదుని తలపై చేయివేసి, దాన్ని గట్టిగా కుదుపుతూ) నీదెంత కఠిన గుండెరా!

ప్రహ్లాదుడు : హరిఃఓం! హరిఃఓం! (కోపం పట్టలేక, లీలావతి కుమారుని వెనుకకు పడదోస్తుంది).

ప్రహ్లాదుడు : ("హరిఃఓం!" అంటూ తిరిగి లేచి కూర్చుని) నా హరినామస్మరణకు అంతరాయం కలిగిస్తున్నావమ్మా!

లీలావతి : నీవు మా బ్రతుకులకే అంతరాయం కలిగిస్తున్నావ్! పోనీ, నా మాటకేమిగాని, నీ తండ్రి మనస్సు ఎంత మెత్తనిదో నీకు తెలియదటరా! అప్పుడప్పుడు నేనైనా నిన్నొక దెబ్బ వేశానేగాని, ఆయనెన్నడైనా నీపై చేయి చేసుకున్నారటరా! నీకు తలనొప్పి వచ్చినా, ఆయన విలవిలలాడిపోతారే! ఆయనను దుఃఖ పెట్టడం నీకు తగునటరా!

ప్రహ్లాదుడు : తండ్రి యెవరు? తల్లియెవరు? కొడుకెవరు? అంతా మాయామోహజాలం! ఈ సంసార లంపటం నుంచి కాపాడగలిగింది ఆ శ్రీ మహావిష్ణువే!

లీలావతి : నీకు తల్లిదండ్రులైనా లేరటరా!

ప్రహ్లాదుడు : అందరికీ ఆ శ్రీమహావిష్ణువే తండ్రి; ఆయనే తల్లి.

లీలావతి : మేము నీకేమీ కామా?

ప్రహ్లాదుడు : అందరికీ కావలసినవాడు ఆ వైకుంఠవాసుడే!

లీలావతి : ఏ ఆర్యఋషి చేశాదురా, నీకీ దుర్బోధ.

ప్రహ్లాదుడు : ఆర్యఋషి కాదు; దేవ ఋషి.

లీలావతి : ఎవదురా ఆ దేవ ఋషి?

ప్రహ్లాదుడు : నారదమహర్షి !

లీలావతి : వాడు నీకెక్కడ దాపురించాదురా!

ప్రహ్లాదుడు : నీ గర్భవాసంలో వుండగానే నీ

లీలావతి : పైత్యం బాగా తలకెక్కింది. ఎవడే కట్టుకథ చెప్పినా నమ్మే స్థితికి వచ్చావు.

ప్రహ్లాదుడు : కట్టుకథ కాదమ్మా! గట్టికథే! ఇంద్రుని చెరనుంచి నిన్ను విడిపించి, నారద మహర్షి నీకాశ్రయ మిచ్చినప్పుదు....

లీలావతి : ఏడ్వాలో, నవ్వాలో తెలియడం లేదు. ఇంద్రుదు నన్ను చెరబట్టడం, నారదుదు నన్ను విడిపించడం! మతి నీకు పోయిందా? నాకుపోయిందా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : రాను రాను నీ పిచ్చి మరింత ముదిరిపోతున్నది

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : ఆ పేరు మరెత్తకు! దాన్ని వినలేక ఛస్తున్నాను!

ప్రహ్లాదుడు : హరిపేరు వినని చెవులు చెవులు కావు.

లీలావతి : మాటి మాటికి అతని పేరిశ్రదానికి నీకు నోరెలా వస్తున్నదిరా!

ప్రహ్లాదుడు : హరి పేరెత్తని నోరు నోరుకాదు.

లీలావతి ; అతడు తప్ప మరెవ్వరు నీ కంట దూరరటరా!

ప్రహ్లాదుడు : హరిని చూడని కళ్లుకళ్లు కావు! !

లీలావతి : అయితే, అతడి సేవలోనే బ్రతుకు వెళ్లమారుస్తావన్నమాట

ప్రహ్లాదుడు : హరిసేవ చేయని బ్రతుకు బ్రతుకు కాదు,

లీలావతి : హరి, హరి, హరి మా ప్రాణాలు హరించదానికి వాడెక్కడ దాపురించాదురా!

ప్రహ్లాదుడు ; హరి చింతనలేని నరుదు నరుదు కాదు.

లీలావతి : మా కదుపున నీవు చెడబుట్టావురా! హరిని కొలిచే కొడుకు మాకు కొదుకు కాదు! అతడే వరాహ రూపంలో వచ్చి, మీ పెదతండ్రిని చంపి వెళ్లినట్టు ఆర్య ఋషులెంత ప్రచారం చేశారో - చేస్తున్నారో - నీకు తెలియదటరా!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : అతడే నీ తండ్రి అంతుకూడా కనుక్కుంటాడని వారంటున్న మాటలు నీకు వినబడలేదటరా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : ఇది జడత్వమా? గడసరి తనమా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : వెనకవేసుకువస్తాదు దేనికిరా!

ప్రహ్లాదుడు : ఆయన చేసేది దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ,

లీలావతి : అయితే, నీ పెదతండ్రి దుష్టుడేనా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : హరి ఆర్యఋషుల కొత్త దేవుదు కాడటరా!

ప్రహ్లాదుడు : ఆయన అనాది దేవుడు; అందరికీ దేవుడు.
లీలావతి : అందరికీ దేవుడైతే ఆర్య ఋషులనే
ప్రహ్లాదుడు : ఆయన ఆశ్రిత పక్షపాతి.
లీలావతి : ఆశ్రితు లెట్టి దురాగతాలకు దిగినా, వారిని సమర్థిస్తారటరా?
ప్రహ్లాదుడు : ఆయన చేసేది దుష్టశిక్షణ, శిష్టరక్షణ
లీలావతి : నీ తండ్రి దుష్టుడేనా?
ప్రహ్లాదుడు : హరిఃఓం!
లీలావతి : ఇది జడత్వం కాదు, గడసరితనమే! నీ కిష్టంలేని ప్రశ్నలన్నింటిని "హరిఃఓం" అంటూ దాటవేస్తున్నావే!
ప్రహ్లాదుడు : హరిఃఓం!
లీలావతి : మళ్లీ ఆ మాట అన్నావంటె పీక పిసికివేస్తాను!
ప్రహ్లాదుడు : హరిఃఓం!

(వెర్రికోపంతో లీలావతి కుమారుని గొంతు పట్టుకొనబోతుండగా శుక్రాచార్యులు వడివడిగా ప్రవేశిస్తాడు).

శుక్రాచార్యులు : (లీలావతిని వారిస్తూ) తొందరపడుతున్నావమ్మా!
లీలావతి : (రెండు చేతులతో ముఖం కప్పుకుని, బావురుమంటూ) గొడ్రాలినైతే ఈ కడుపు కోత నాకు తప్పేది!
శుక్రాచార్యులు : వద్దు, తల్లీ! వద్దు! శోకించవద్దు!!
లీలావతి: శోకం తప్ప నాకేమి మిగిలిందిలేండి! వీడు ఏనాడు నా కడుపున పడ్డాడో ఆనాడే మాకు కష్టాలు ప్రారంభమైనాయి. పుట్టబోతూ పెదతండ్రిని సాగనంపాడు; పుట్టి, అన్నలు ముగ్గురినీ సాగనంపాడు.
శుక్రాచార్యులు : తిట్టీ, తిమ్మీ లాభం లేదమ్మా! మంచిగా చెప్పి, మనస్సు మార్చాలి.
లీలావతి : ఏమి చెప్పడానికైనా నా మాట వినిపించుకుంటేనా! అటు చూడండి హరి నామస్మరణ చేస్తూనే పోతున్నాడు!
శుక్రాచార్యులు : నేనే కాక, మా చండుడు, మా అమర్కుడు ఎన్ని కళ్లతో కనిపెట్టి చూచినా, మనవాడి కెవరో ఈ పిచ్చి బాగా తలకెక్కించారు.
లీలావతి : పిచ్చే అంటారా?

(శుక్రాచార్యులు 'ఔ' నన్నట్టు తల వూపుతాడు)

లీలావతి : ముందు నేనూ అంతే ననుకున్నా! కాని, ఇప్పుడిప్పుడు కొంత సందేహం కలుగుతున్నది. గురుదేవులు మా సంభాషణ వినే వుండాలి.
శుక్రాచార్యులు : కొంతవరకు విన్నాను.
లీలావతి : మరి తమరేమి అనుకుంటున్నారు?
శుక్రాచార్యులు : ఇప్పుడే ఏమీ చెప్పలేనమ్మా! (ప్రహ్లాదునితో) నీ వేమైనా కాంక్షిస్తున్నావా, బాబూ?
ప్రహ్లాదుడు : హరి పాదారవింద సేవాకాంక్ష తప్ప అన్యం నాకు లేదు.
లీలావతి : ఆర్య ఋషుల పాద సేవకు. అది మరొక పేరు కాదటరా?
ప్రహ్లాదుడు : హరిఃఓం!

(అర్థయుక్తంగా లీలావతి శుక్రాచార్యుని వంక చూస్తుంది. ఆయన శిరఃకంపనం చేస్తాడు)

శుక్రాచార్యులు : హరిని ఆరాధించగోరేవారు నీ తండ్రి రాజ్యంలో నిరాటంకంగా ఆరాధించవచ్చు. ఎవరే దేవుని కొలిచినా ఆయన అభ్యంతరం చెప్పరు.
ప్రహ్లాదుడు : మరి నా కభ్యంతరం చెప్పడం దేనికి?
శుక్రాచార్యులు : నీ సంగతి వేరు! నీవొక నాటికి నీ తండ్రి స్థానంలో రాజ్యం చేయవలసి వుంటుంది.

ప్రహ్లాదుడు : అంతమాత్రం చేత నా యిష్టదైవాన్ని నేనారాధించుకోరాదా?

శుక్రాచార్యులు : ఆరాధించుకోవచ్చుగాని, హరి చింతలేని జన్మ జన్మకాదని నీవంటున్నావయ్యె! నీ తోటి విద్యార్థులను హరిదాసులుగా మార్చడానికి ప్రయత్నించావయ్యె! మరి నీవు రాజువైతే, అన్యమతాల వారికి రక్షణ వుంటుందా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : ఇది పిచ్చికాదు, గురుదేవా! ఇది పిచ్చికాదు!

శుక్రాచార్యులు : (ఆగమన్నట్టు లీలావతికి సంజ్ఞ చేస్తూ, ప్రహ్లాదునితో) నీ వంటి హరిభక్తులకు తప్ప అన్యులకు నీ రాజ్యంలో భద్రత వుండదన్న పరిస్థితిలో తన తదనంతరం రాజ్యాధికారాన్ని నీ కప్పగించరాదన్న నిర్ణయానికి నీ తండ్రి రాక తప్పుతుందా, బాబూ!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

శుక్రాచార్యులు : తమ మత పక్షపాతి వన్న కారణానే నిన్ను వీలైనంత త్వరగా నీ తండ్రి స్థానంలో రాజుగా చేయడానికి ఋషులు ఏవో కుట్రలు చేస్తున్నట్టు వదంతులు వ్యాపిస్తున్నాయి. నీవు వాటిని వినలేదా?

ప్రహ్లాదుడు : హరిఃఓం!

లీలావతి : (ఉద్రేకంలో) వీడా పిచ్చివాడు! వీడు పిచ్చాడనుకునే వీడి తండ్రి పిచ్చివాడు!!

ప్రహ్లాదుడు : హరిఃఓం!

(పట్టరాని కోపంతో ప్రహ్లాదుని జుట్టు పట్టుకుని తల నూపివేయ దొడగిన లీలావతిని శుక్రాచార్యులు వారిస్తుండగా)

తెర.

షష్ఠ రంగం

(నిర్జన రంగస్థలంపై తెర లేస్తుంది. తర్వాత కొన్ని క్షణాలకు అంగిరస, వామదేవులు మాట్లాడుతూ ప్రవేశిస్తారు).

బృహత్కీర్తి : (వెనుకగా వస్తూ) వామదేవ మహర్షులు మళ్ళీ తమ కమండలం మర్చిపోయారు.

వామదేవుడు : (కమండలాన్ని అందుకుంటూ) పరధ్యానం, నాయనా! పరధ్యానం! ఈ పరధ్యానంతో ఎన్ని కమండలాలు పారవేసు కున్నానో లెక్కలేదు. దీన్ని కూడా పారవేసుకుంటే మరొక దాన్ని సంపాదించుకునే స్తోమతైనా లేదు. యజ్ఞయాగాల పేరు తలచే వారైనా లేకపోయిన తర్వాత మా పని మరీ కటకటగా వుంటున్నది.

అంగిరసుడు : మరొక దినం ఆగి వెళ్ళరాదా?

వామదేవుడు : మొన్ననే వస్తామన్న దేవాతిథులు నేటికైనా రాలేదయ్యె! ఆయన కోసం మరెంతకాలం వేచివుంటాము? మాకు సెలవిప్పించండి.

అంగిరసుడు : సరాసరి నిజాశ్రమానికి తిరిగి వెడుతున్నారా?

వామదేవుడు : ఔను! సరాసరి వెళ్ళక తప్పుతుందా? సుహోత్రులు స్వర్గస్థులైనారయ్యె! ఇక్కడికి వస్తూ, పోతూ దారిలో ఆగి, వారి సోమయజ్ఞ ఫలాన్ని పంచుకునే మహద్భాగ్యం మరి మాకు లేదు.

బృహత్కీర్తి : (విప్పారిన ముఖంతో) అతిథి సత్కారానికి ఆయనకు ఆయనే సాటి! ఆయన వెళ్ళిపోయిన తర్వాత మూజవంత పర్వత ప్రాంతంలోని గంధర్వులు ఇటువైపు తొంగైనా చూడ్డం లేదట.

వామదేవుడు : ఎత్తు కెత్తు బంగారమిచ్చి సుహోత్రుల వలె సోమవల్లరులను కొనగలవారు మరి లేరు గదా? ఆ గంధర్వులిక రావడానికి!

బృహత్కీర్తి : ఎంతవరకు నిజమోగాని, గోధనమిచ్చినా సరిపోతుందని విన్నాను.

వామదేవుడు : గోధన మిచ్చినా చాలా?

అంగిరసుడు : (చిరునవ్వుతో) మా వాడిని ఆ గంధర్వుల వద్దకు పంపిస్తే సరి ఆ సంగతి తేల్చుకు వస్తాడు. ఈ పనికైతే మావాడు హిమాలయాల ఆవలికైనా అవలీలగా వెళ్ళి రాగలడు! సుహోత్రుల నిర్యాణం మా వాడికి ప్రత్యేకించి విచార... అదుగో! దేవాతిథులు వస్తున్నారు! (ప్రవేశించిన దేవాతిథితో) దయచేయండి.

దేవాతిథి : అంగిరస మహర్షి సత్తములకు నమస్కారం.

అంగిరసుడు : దీర్ఘాయుష్మాన్ భవ!

దేవాతిథి : వామదేవులకు నమస్కారం,

వామదేవుడు ; శీఘ్రమేవ విజయ ప్రాప్తిరస్తు!

దేవాతిథి : (బృహత్కీర్తి తనకు పాదాభివందనం చేయగా) పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు!

వామదేవుడు : మొన్ననే వస్తామని...

దేవాతిథి : చివరి క్షణంలో అనుకొనని చిక్కువచ్చి పడింది లేండి!

అంగిరసుడు : అలాగా! ఏమిటది?

దేవాతిథి : కాలనాభుని యువరాజ్య పట్టాభిషిక్తుని చేస్తారట?

అంగిరసుడు : ఎప్పుడు?

దేవాతిథి : త్వరలోనే!

వామదేవుడు : పెద్ద చిక్కు వచ్చిపడిందే!

అంగిరసుడు : చిక్కేమీ కాదు; మనకు మరింత మంచి! అయితే, ఈ సంగతి ప్రహ్లాదునికి తెలుసా?

దేవాతిథి : తెలియకేమి? ఇది అతడు చెప్పి పంపించిన వర్తమానమే!

అంగిరసుడు : ఇప్పుడతని వైఖరేమో తెలుసుకున్నారా?

దేవాతిథి : అసలు చిక్కు అక్కడే వున్నది.

అంగిరసుడు: ఏమిటది?

దేవాతిథి : తన తండ్రి నిర్ణయం న్యాయమైనదేనట! తమ తాత పక్షపాతం చేసి వుండకపోతే, సింహాసనం హిరణ్యాక్షునికే దక్కి వుండేదట; అతని తదనంతరం కాలనాభునికి పట్టాభిషేకం జరిగివుండేదట!

అంగిరసుడు : ఆ! అతడింతగా జారిపోయాడా?

వామదేవుడు : ఇన్నేళ్ళుగా మనం చేసిన ప్రయత్నమంతా విఫలమై పోయింది!

దేవాతిథి : అంత ప్రమాదం రానివ్వలేదు లేండి! హరి భక్తునికి ఇది సముచిత వైఖరి కాదని ఎంతో దూరం చెప్పి, చివరికి మళ్ళీ ఒక దారికి తెచ్చాము!

అంగిరసుడు : మానసికంగా అతడు దుర్బలుడనే అనుమానం మాకు మొదటి నుంచీ వున్నది. తిరిగి అతడి చిత్తం ఏ విధంగా సంచరిస్తుందో ఎలా చెప్పడం? మనమిప్పుడు త్వరపడాలి.

వామదేవుడు : అమ్మయ్య! "త్వరపడా"లనే మాట ఇప్పటికైనా తమ నోట వచ్చింది. ఇక క్షణమైనా విలంబన తగదనే నా అభిప్రాయం కూడా.

బృహత్కీర్తి : "ఆలస్యాదమృతం విషం!"

అంగిరసుడు : (చికాకుగా) నీ పాండిత్యానికి సంతోషించాములే! నీ వూరుకో!

(బృహత్కీర్తి ముఖం చిన్నబుచ్చుకుంటాడు).

వామదేవుడు : బృహత్కీర్తి పరమోత్సాహి!

అంగిరసుడు : (వామదేవునితో) మావాడిని మెచ్చుకునేవారు మీరొక్కరే కనబడుతున్నారు. (దేవాతిథితో) అన్యులపై

ఆధారపడితే ఇప్పుడు కార్యసాఫల్యం జరగకపోగా ప్రమాదించ వచ్చు, ఏమంటారు?

దేవాతిథి : నిజమే!

అంగిరసుడు : ఏమి చేసినా మనం స్వయంగా చేయడమే మంచిదంటారా?

దేవాతిథి : ఔను!

అంగిరసుడు : మీలో ఎంత మార్పు వచ్చింది! ఆవేశకావేషాలు పూర్తిగా చంపుకున్నారు. ఏ పనినైనా వెనుక ముందులు దీర్ఘంగా ఆలోచించి మరీ చేస్తున్నారు; ఆర్యజాతి భవిష్యత్తు మీ చేతులలో పదిలమనే విశ్వాసాన్ని రేకెత్తిస్తున్నారు!

బృహత్కీర్తి : అంతా అంగిరస మహర్షుల ఆశీర్వాద బలమే! :

అంగిరసుడు : శీఘ్రమేవ నాయకత్వ సిద్ధిరస్తు!

వామదేవుడు : తథాస్తు!

దేవాతిథి : (ఉభయులకు నమస్కరిస్తూ) పెద్దలిద్దరికి మా కృతజ్ఞతా పూర్వక వందనాలు.

అంగిరసుడు : (ఒక క్షణం మౌనం తర్వాత, తల పంకిస్తూ) కార్యరంగంలో మనమిప్పుడు స్వయంగా దిగక తప్పదు కాబట్టి, ఆ భారం మాపైనే వేసుకోవాలని వున్నది. కాని... :

దేవాతిథి : ఎంతమాట! మేముండగా ఆ భారం తమరిని వహించనిస్తామా?

వామదేవుడు : అట్టి ఆలోచనైనా తమ మనస్సులోకి రానివ్వరాదు.

బృహత్కీర్తి : నేనుండగా పూజ్యజనకులకు శ్రమదేనికి? నన్ను నియోగించండి.

అంగిరసుడు : నిన్ను నియోగిస్తే నిర్వాకమైనట్టే! ఇది సోమయజ్ఞ మేమీ కాదు!

దేవాతిథి : మేముండగా మరొకనితో పనిలేదు! :.

అంగిరసుడు : (లేచి, దేవాతిథిని కౌగిలించుకుంటూ) ఆర్యజాతి భావి నాయకుని నోట మరొకమాట రాదని మాకు తెలుసు! ఆ జాతి భాగ్యం పండబోతున్నది!

వామదేవుడు : మాకు చేతనైన పని చేయడానికి మేము కూడా సిద్ధంగానే వున్నాము.

బృహత్కీర్తి : నాకు చేతనైన దాన్ని నేనూ చేస్తాను.

అంగిరసుడు : నీకేమి చేతనౌనో నాకు తెలియదా? నీవూరుకో! (దేవాతిథితో) సత్వరంగా లక్ష్యసాధనకు పథకమేదైనా వేశారా?

దేవాతిథి : ఏదో వేశాము గాని, ప్రహ్లాదుడు అభ్యంతరం చెబుతున్నాడు.

అంగిరసుడు : అతడి మనస్సు మార్చామన్నారు - మరి అభ్యంతర మేమిటి?

దేవాతిథి : తండ్రిని రాజ్యభ్రష్టుని చేయడానికి సమ్మతిస్తున్నాడుగాని, అతడి వధను ప్రతిఘటిస్తున్నాడు.

అంగిరసుడు : వధించకుండా హిరణ్యకశిపుని పదవీ భ్రష్టుని చేయగలమా?

దేవాతిథి : కారాగారబద్ధుని చేస్తే సరిపోతుందని అతడి పట్టుదల.

అంగిరసుడు : హిరణ్యకశిపుడు సామాన్యుడా? పైగా అతడంటే ప్రజలకెంత ప్రేమానురాగాలు! ఎంత భక్తి విశ్వాసాలు! అతడిని కారాగారబద్ధుని చేస్తే, ప్రజలు తిరగబడి, చెరనుంచి వెంటనే విడిపించి, తిరిగి రాజును చేయరా?

వామదేవుడు : "వెర్రి కుదిరింది, తలకు రోకలి చుట్టండి" అన్నట్టుగా వున్నాయి, ప్రహ్లాదుని పలుకులు!

దేవాతిథి: ఏమైనా ఈ విషయంలో అతడు మన మాట వినేటట్టు లేదు

అంగిరసుడు : మరి చెప్పి లాభం లేదా?

దేవాతిథి : లేదు.

అంగిరసుడు : (తల పంకిస్తూ) ఊ! (ఒక క్షణం తర్వాత) అయితే, చెరబట్టడమే మన అభిమతమని చెప్పి పంపించండి!

వామదేవుడు : హిరణ్యకశిపుని చెరబట్టడమా? అది కొరవితో తల గోకు కొనడమే!

అంగిరసుడు : మనకిప్పుడు కావలసింది ప్రహ్లాదుని సమ్మతి. తర్వాత ఏమి చెయ్యాలో అది వేరుగా నిర్ణయించుకోవచ్చు.

వామదేవుడు : ఒకసారి ప్రభువైన తర్వాత అతడు మనమాట వినకపోవచ్చు గదా?

అంగిరసుడు : ఆ భయం మీకక్కరలేదు. తండ్రిని పదవీ భ్రష్టుని చేసిన తర్వాత రాజ్యాధికారాన్ని నిలుపుకోవాలంటే, అతడు మన తోడ్పాటు పై ఆధారపడవలసిన వాడే!

వామదేవుడు : ఔనౌను! ఆ మాట నిజం.

బృహత్కీర్తి : అప్పుడతడు మన చేతిలో కీలుబొమ్మ కాక తప్పదు.

అంగిరసుడు : సోమదేవుని చేతిలో నీవే ఒక కీలుబొమ్మవు. మరొక కీలుబొమ్మను నీవేమి ఆడిస్తావులే! (దేవాతిథితో) మన చర్యకు ప్రజాభిప్రాయాన్ని సుముఖం చేసుకోవాలంటే, పసివాడన్న సంకోచమన్నా లేకుండా, హరిభక్తుడన్న కారణాన కొడుకును హిరణ్యకశిపుడు నానా హింసలు పెడుతున్నాడన్న ప్రచారాన్ని మరింత ముమ్మరంగా కొనసాగించాలి.

వామదేవుడు : మీ మాటపై ఏడాది క్రితమే మేము దాన్ని మహోధృతంగా ప్రారంభించాము.

బృహత్కీర్తి : రెండేళ్ళుగా అది తప్ప నాకు మరొక పని లేదు.

వామదేవుడు : శూలాలతో పొడిపిస్తున్నాడని, ఏనుగులతో తొక్కిస్తున్నాడని మేము చెబుతున్నాము.

బృహత్కీర్తి : కాలు చేతులు కట్టించి, నీళ్ళలో పారవేస్తున్నాడని, కొండలపై నుంచి క్రిందికి త్రయిస్తున్నాడని నేను చాటుతున్నాను.

వామదేవుడు : మంటలలోకి పడద్రోయిస్తున్నాడని, గోతులలో పూడ్పిస్తున్నాడని, పాములచేత కరిపిస్తున్నాడని, మేము చాలా చిలువలు, పలవలు కలిపి ప్రచారం చేస్తున్నాములే!

బృహత్కీర్తి : యజ్ఞ పశువులకు మూయించినట్టు నవరంధ్రాలు మూయింపజేస్తున్నాడని నేను మరొక అడుగు ముందుకు వెడుతున్నాను.

అంగిరసుడు : మాటలలో నీ ప్రతాపం మాకు తెలియదా? లోపల పనులున్నాయేమో - వెళ్ళి చూచుకో!

బృహత్కీర్తి : (తెగించినట్టు) పనుల వంక దేనికి? - నేనుండడం మీకిష్టం కాకపోతే, వెళ్ళమని చెప్పవచ్చు గదా!

అంగిరసుడు : అయితే, చెబుతున్నాను వెళ్ళు!

(రోషంతో బృహత్కీర్తి చివాలున లేచి వెళ్లిపోతాడు)

వామదేవుడు : పాపం! కోపగించి పంపించి వేశారేమి?

అంగిరసుడు : వాడి మాటకేమి గాని, చంపించడానికి తండ్రి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రహ్లాదుడు చావకపోవడం ఆ శ్రీ మహావిష్ణువు మహిమవల్లనే అన్న నమ్మకం కనీసం మనవారిలోనైనా ప్రబలిందా?

వామదేవుడు : నిస్సందేహంగా!?

అంగిరసుడు : (దేవాతిథితో) మీరేమంటారు

దేవాతిథి : అన్య జాతులలో కూడా మన ప్రచార ప్రభావం కొంత కనిపిస్తుంది.

అంగిరసుడు : అయితే, తండ్రి పెడుతున్న హింసల నుంచి ప్రహ్లాదుని రక్షించడానికై శ్రీ మహావిష్ణువు నూతనవతార మెత్తవచ్చునన్న ప్రచారం ప్రారంభించడం యుక్తమేమో!

వామదేవుడు : ఆ బాధ్యత మాది!

అంగిరసుడు: హిరణ్యకశిపుడు బ్రహ్మ నుంచి పొందినట్టుగా మనం చెబుతున్న వరాలను దృష్టిలో పెట్టుకుని, నూతనవతార స్వరూపాన్ని నిర్ణయించాలి. క్రితంసారి వరాహ మన్నట్టు, ఈసారి ఏ సింహమో అంటే సరిపోదు.

దేవాతిథి : ఈసారి నరసింహం అంటే సరి.

అంగిరసుడు : ఆలోచనలో మీరు ఘటికులైనారని నేనూరికే అనలేదు!

వామదేవుడు : దేవాతిథుల ఆలోచన దివ్యంగా వున్నది!

అంగిరసుడు: వామదేవులు ఒక క్షణం పాటు మమ్ము మన్నిస్తారా? దేవాతిథులను ఏదో ఒక విషయమై కాస్త సంప్రదించాలి.

(వామదేవుని ప్రత్యుత్తరానికి వేచి వుండకుండా రహస్య మంతనానికై దేవాతిథిని రెక్క పట్టుకుని, అంగిరసుడు అవతలికి తీసుకువెడుతుండగా తెర)

సప్తమ రంగం

(హిరణ్యకశివుని ఆలోచనా మందిరం పై తెర లేచిన కొన్ని క్షణాలకు శుక్రాచార్యునిచెవిలో సముచి ఏదో రహస్య మాడుతూవుండగా, కలతతో కూడిన ముఖాలతో వారుభయులు ప్రవేశిస్తారు.

ప్రవేశించగానే శుక్రాచార్యులు అలసిపోయి వున్నవానివలె ఒక భద్రాసనంపై చతికిలబడుతాడు. సముచి ఆయనకు సమీపంగా కూర్చుండి, గుసగుసల గొంతుతో మరికొన్ని క్షణాల పాటు ఏదో చెబుతూ పోతాడు. తల పంకిస్తూ అతని మాటలు వింటున్న శుక్రాచార్యులు మధ్యమధ్య ఏదో అంటూ వుంటాడు.)

సముచి : (రహస్య మంతనం ముగిసినంతనే చివాలున లేచి) ఎవరక్కడ?

భటుడు : (ప్రవేశిస్తూ) ఏమి సెలవు?

సముచి : ఆచార్యవర్యులు దయచేశారని ప్రభువుల వారికి నివేదించు!

భటుడు : చిత్తం! (వెడతాడు)

సముచి : ఏమి చెప్పినా తాము చెప్పవలసిందే! నా వల్ల కాదు.

శుక్రాచార్యులు : సరే! చేతనైనంత వరకు చెప్పి చూస్తాను!

సముచి : చెప్పి చూస్తామంటే చాలదు! ఎలాగైనా సరే ఆచార్యవర్యులు నచ్చజెప్పాలి. లేకపోతే ఘోర ప్రమాదమేదైనా సంఘటించవచ్చు.

శుక్రాచార్యులు : (బరువుగా) ఊ!

సముచి : గట్టిగా చెబితే ప్రభువులు తన మాట త్రోసివెయ్యరనే నా నమ్మకం.

శుక్రాచార్యులు : ఇది తండ్రి కొడుకులకు సంబంధించిన విషయం. నీకు మాత్రం తెలియదా, కొడుకంటే అతనికెంత మమకారమో!

సముచి : తెలుసు గనకనే ఇంత కలత! మరి ఈ కొడుకేమో.... అడుగుల చప్పుడౌతున్నది. ప్రభువులవారే కావచ్చు. ఆచార్యవర్యా! మీదే భారం!!

(లోపలి నుంచి ప్రవేశించిన హిరణ్యకశిపుడు, సముచి నమస్కారాన్ని అందుకుంటూ ముందుకు సాగి, శుక్రాచార్యుని సమీపించి "గురుదేవులకు నమస్కారం" అంటూ పాదాభివందనం చేస్తాడు. "దీర్ఘాయుష్మాన్ భవ!" అంటూ శుక్రాచార్యులు ఆశీర్వదిస్తాడు)

హిరణ్యకశిపుడు : వేళకాని వేళ దయచేశారు - విశేషమేమైనా వున్నదా?

శుక్రాచార్యులు : ఔను! వేళకాని వేళే! నీ సాయం సమయం విశ్రాంతికి భంగం కలిగిందేమో!

హిరణ్యకశిపుడు : (శుక్రాచార్యునికి సమీపంగా కూర్చుంటూ) నా విశ్రాంతి మాట కేమిలెండి! నే నన్నది - వేళకాని వేళ తామెందుకు శ్రమ పడవలసి వచ్చిందని?

శుక్రాచార్యులు : ఋషులేదో పెద్ద కుట్ర కొత్తగా ప్రారంభించినట్టు ఇంతకు ముందు తెలిసింది!
హిరణ్యకశిపుడు : (చిరునవ్వుతో) పాతవి ఫలించాయా? కొత్తవి ఫలించడానికి!
శుక్రాచార్యులు : అలా త్రోసివేయడానికి వీలులేదు, నాయనా!
హిరణ్యకశిపుడు : ఏడెనిమిదేళ్లుగా లేని కుట్ర ఇప్పుడు చేయడానికి వెనుకటి బలమైనా వారికి లేదేం!
శుక్రాచార్యులు : మనకు పరమాప్తులైనవారేవారి వైపుకు తిరిగేసరికి, పూర్వమెన్నడు లేని బలం వారికిప్పుడు వచ్చింది.
హిరణ్యకశిపుడు : మనకు పరమాప్తులైనవారే వారి వైపుకు తిరిగారా? ఎవరది?
శుక్రాచార్యులు : చెప్పడానికి నాకు నోరు రావడంలేదు.
హిరణ్యకశిపుడు : తమ సంకోచాన్ని బట్టి తమెవరి నుద్దేశిస్తున్నారో నేను గ్రహించానులెండి! మా ప్రహ్లాదుడు ఋషుల పక్షాన చేరాడని తమ భయం -అంతే కాదూ?

("ఔ" నన్నట్టు శుక్రాచార్యులు తలవూపుతాడు).

హిరణ్యకశిపుడు : (తిరిగి చిరునవ్వుతో) ఈ భయాన్నే మా లీలావతి వెల్లడిస్తున్నది. ఆమె మాట పైనే తమరు...
శుక్రాచార్యులు : పుత్రుని మనోగత భావాలను మాతృహృదయం అద్భుతంగా గ్రహిస్తుంది, నాయనా!
హిరణ్యకశిపుడు : పితృహృదయమేనా వాటిని గ్రహించలేనిది? మావాడి సంగతి ఆమె కంటే నాకే బాగా తెలుసు! వాడొక వెర్రినాగన్న! వాడేమిటి? కుట్రేమిటి? ఆపాటి ప్రజ్ఞ వుంటే వాడిని గురించి నాకింత చింత దేనికి?
శుక్రాచార్యులు : అతడు కానరాని ప్రజ్ఞావంతుడు! అందుకు చాలా నిదర్శనాలు కన్పిస్తున్నాయి. నాకే కాదు, మన సముచికి కూడా! (సముచితో) అలా దూరంగా నిల్చున్నావేమి, బాబూ? ఇలా రా? దగ్గరికి వచ్చి కూర్చో!
సముచి : (దగ్గరికి వచ్చి కూర్చుంటూ) ఔను, ప్రభూ! ఆచార్యవర్యులన్నట్టు చాలా నిదర్శనాలు కన్పిస్తున్నాయి.
హిరణ్యకశిపుడు : ఔనౌను! ప్రతి నీడలో నీకొక కుట్ర కన్పిస్తుంది!
శుక్రాచార్యులు : సముచి నీడలను చూచి భయపడే వాడు కాదు, నాయనా! అనుమానానికి గట్టి కారణాలుండబట్టే అతడు కలత పడుతున్నాడు.
హిరణ్యకశిపుడు : (నవ్వుతూ) ఆచార్యదేవులను అనుమానించడానికి సయితం ఒకప్పుడతనికి గట్టి కారణాలే కనబడ్డాయి. మా వాడి వెర్రిలో సముచికి సగం వున్నది!
శుక్రాచార్యులు : సముచిని, అతని హితవచనాన్ని చులకన చేసి వుండకపోతే, ప్రహ్లాదుడు ఈ స్థితికి వచ్చేవాడు కాదు. చిరంజీవిని మా విద్యాపీఠంలో చేర్చవద్దని అతడెంతగా హెచ్చరించలేదు! అతడి మాట త్రోసిపుచ్చినందునే ఇన్ని చిక్కులు వచ్చాయి!
హిరణ్యకశిపుడు : దానిలో చేరే వారందరు చెడిపోతున్నారా? అది మా దౌర్భాగ్యం!
శుక్రాచార్యులు : ఏమైనా, మన దౌర్భాగ్యాన్ని తమ సద్భాగ్యంగా మార్చుకొనడానికి ఋషులాయత్తపడుతున్నారు. త్వరపడకపోతే, ఏదో ఒక మహా ప్రమాదం తప్పకపోవచ్చు.
హిరణ్యకశిపుడు : కాలనాభునికి యువరాజ్య పట్టాభిషేకం వెంటనే చేయించాలని గురుదేవుల తాత్పర్యమా? తమ రెప్పుడంటే అప్పుడే చేయవచ్చు!
శుక్రాచార్యులు : అది కాదు, నాయనా!
హిరణ్యకశిపుడు : మరేమిటి? :.
శుక్రాచార్యులు : (బరువుగా) చెప్పడానికి నోరు రాకపోయినా చెప్పక తప్పదు. ప్రహ్లాదుని కారాగారబద్ధుని చెయ్యాలి.
హిరణ్యకశిపుడు : (ఆశ్చర్యంగా) ఎందుకు గురుదేవా? వాడిపిచ్చి మరింత ముదురడానికా?
శుక్రాచార్యులు : కాదు, నాయనా! ముదురుపాకంలో పడిన అతని కుట్రను అరికట్టడానికి.
హిరణ్యకశిపుడు: (నవ్వుతూ)మా వెర్రినాగన్న కుట్ర చేయడం, అది ముదురు పాకానికి రావడం... హహహ! అహహహా!!!

సముచి : మన్నించండి, ప్రభూ! ఇది నవ్వివేయదగు విషయం కాదు! మా అనుమానానికి బలమైన కారణాలు చాలా వున్నాయి.

హిరణ్యకశిపుడు : బలమైన కారణాలా? చాలా వున్నాయా! సరే, ఒకటి చెప్పు!

సముచి : రాకుమారుని తాము నానా హింసలు పెడుతున్నారని, ఆయన రక్షణకు తమ శ్రీహరి త్వరలోనే మరొక అవతార మెత్తబోతున్నాడని ఆర్య ఋషులు రహస్య ప్రచారం చేస్తున్నారు. శ్రీహరి తమపై...

హిరణ్యకశిపుడు : (తిరిగి నవ్వుతూ) చాలా గొప్ప కారణమే!

సముచి : దయచేసి నా మాట పూర్తిగా వినండి, ప్రభూ!

హిరణ్యకశిపుడు : నీ మాట నేను వినాలా? ఎందుకు? ఋషుల ప్రచారాన్ని బలపరచడానికా?

శుక్రాచార్యులు : ఏమిటది? నాకర్థం కాలేదు!

హిరణ్యకశిపుడు : అర్థం కాకపోవడమేమిటి, గురుదేవా? మా వెర్రి నాగన్నను కారాగారబద్ధుని చేయడం ఋషుల అబద్ధపు ప్రచారాన్ని నిజం చేయడమే కాబోదా?

శుక్రాచార్యులు : కొన్నేళ్ళుగా కిమ్మిన్నాస్తిగా పడివున్న వారు తమకేదో కొత్త బలం చేకూరబట్టే తిరిగి తమ దుష్ట ప్రచారం ప్రారంభించారు. తమ ప్రచారంలో మన వాడి పేరును వారు కలపడాన్ని బట్టి వారి కొత్త బలమేమిటో మనం ఊహించుకోవచ్చు.

హిరణ్యకశిపుడు : మనవాడి సంగతి తెలిసి కూడా వాడికి ఈపాటి తెలివితేటలున్నట్టు తామెలా భావించగలుగుతున్నారో చిత్రమే! తమరు...

లీలావతి : (లోపలి నుంచి ప్రవేశిస్తూ) గురుదేవులకు నమస్కారం!

శుక్రాచార్యులు : దీర్ఘసుమంగళీ భవ! (లీలావతి ప్రవేశించగానే సముచి లేచి నిలబడతాడు)

లీలావతి : గురుదేవులు దయచేసినట్టు విని ఇలా వచ్చాను. తమ సంభాషణకు అడ్డురాలేదు గదా?

శుక్రాచార్యులు : లేదమ్మా, లేదు! రా! వచ్చి కూర్చో! (లీలావతి దగ్గరికి వచ్చి కూర్చుంటుంది)

హిరణ్యకశిపుడు : ఇది నీవు కూడా పాల్గొనవలసిన సంభాషణే! మన వెర్రి నాగన్న ఏదో పెద్ద కుట్ర పన్నుతున్నాడట!! దాన్ని గురించి నన్ను హెచ్చరించడానికి ఆచార్యదేవులు వేళకాని వేళ శ్రమపడి వచ్చారు.

లీలావతి : మన్నించండి, వాడు వెర్రివాడేమీ కాదు, వాడు వెర్రివాడని భావిస్తున్నవారే వెర్రివారు!

హిరణ్యకశిపుడు : నీదీ గురుదేవుల మతమే అని వారికి నేను ముందుగానే మనవి చేశాను!

లీలావతి : వాడి సంగతి మీకు తెలియదులెండి! పైకి కనబడినట్టి వాడు వెర్రివాడేమీ కాదు; మహా గడసరి.

హిరణ్యకశిపుడు : (నవ్వుతూ) వట్టి గడసరైనా కాదన్న మాట. ("మహా"లో "హా"ను సాగదీస్తూ) మహాగడసరి!! ఆ గడసరి తనం కనిపించదే?

లీలావతి : వాడంటే మీకున్న మమకారం వల్ల మీ కేమీ కనిపించదులెండి!

హిరణ్యకశిపుడు : నీకేనా మమకారం లేనిది?

లీలావతి : నాకు లేదు!

హిరణ్యకశిపుడు : వాడు నీ బిడ్డ కాడా?

లీలావతి : కాడు! వాడు నా బిడ్డయితే మీ శత్రుపక్షాన చేరతాడా? మీకు ద్రోహం తలపెడతాడా? వాడు పితృద్రోహి! రాజద్రోహి! జాతి ద్రోహి!

హిరణ్యకశిపుడు : అయితే, వాడిని బంధించడం చాలదు; మరణ దండన విధించాలి.

లీలావతి : ఆ పని చేయకపోతే రక్షణ మీకు లేదు, మీ రాజ్యానికి లేదు, మీ జాతికి లేదు!

హిరణ్యకశిపుడు : (చిరునవ్వుతో) చూచారా, గురుదేవా! మా లీలావతి ఆవేశం!

లీలావతి : ఆవేశం కాదు, ఆక్రోశం, రత్నాలవంటి కుమారులు ముగ్గురు పోయి, ఈ భ్రష్టుడు మాత్రం మిగిలాడని నేనెంత క్షోభపడుతున్నానో మీకేమి తెలుస్తుంది!

శుక్రాచార్యులు : ఆ తల్లి ఎంతో సంక్షోభపడిపోతున్నది, నాయనా! తనకు మిగిలిన ఒకే ఒక కొడుకుని వాడి పైనే కళ్ళన్నీ పెట్టుకుని, అల్లారుముద్దుగా పెంచుకున్నది. తన ముద్దు ముచ్చటలన్నీ వాడు చెల్లించగలడనుకున్నది. ఉగ్గుపోస్తూ, పాలిస్తూ, జోలపాడుతూ, ముద్దులాడుతూ, వాడిని గురించి ఏవేవో కలలు కన్నది! తల్లికి, తండ్రికి, గౌరవం తెస్తాడనుకున్నది. వంశానికి, జాతికి కీర్తి నిలబెడతాడనుకున్నది. ఆ తియ్యని కలలన్నీ పీడకలలుగా మారిపోయాయి! అప్పటి నుంచి ఆమె కంటికి నిద్ర దూరమైపోయింది. ఆమె గుండెలో మంటలు లేస్తున్నాయి. (రోధిస్తున్న లీలావతిని చూపుతూ) రోధించ వలదని ఆ తల్లికి చెప్పలేను. కొండలాదిగా ఆమెలో పేరుకుపోయిన దుఃఖం కన్నీళ్ళ రూపంలో కరిగి, బయటికి త్రోసుకురాకపోతే ఆమె బ్రతుకు మరింత దుర్భరమైపోతుంది.

లీలావతి : (కన్నీళ్ళ గొంతుతో) నన్ను గురించి నాకు చింత లేదు, గురుదేవా! (వేలెత్తి భర్తను చూపుతూ) ఆయనను గురించే నా చింత! ఎందరెంతగా హెచ్చరించినా, పుత్రునిపై ప్రేమ కొద్దీ వాడెంతటి పరమదుష్టుడో గ్రహించలేకుండా వున్నారు!

హిరణ్యకశిపుడు : మీరేమైనా చెప్పండి - వాడిని నేను శిక్షించలేను. .

శుక్రాచార్యులు : శిక్షించనక్కరలేదు, నాయనా! బంధించు - అంతే చాలు! అదైనా అతని నిజోద్దేశాలను గురించిన అనుమానాలు తొలగేవరకే! ఆ తర్వాత విడిచిపెట్టవచ్చు.

హిరణ్యకశిపుడు : గురుదేవులు నన్ను మన్నించాలి.

శుక్రాచార్యులు : ఏ ప్రేమైనా అంధప్రాయమైనది కారాదు, నాయనా!

హిరణ్యకశిపుడు : ఎంత పిచ్చివాడైనా వాడు నా ఏకపుత్రుడు, నా రక్తంలో రక్తం, నా ప్రాణంలో ప్రాణం.

శుక్రాచార్యులు : నిజమే, నాయనా! కాని, నీకు, నీ వంశానికే కాక, నీ జాతికి కూడా అతడి ద్వారా ప్రమాదం కలగ బోతున్నది. నీ లక్ష్యాలకు, నీ విధానాలకు సయితం ప్రమాదం కలగబోతున్నది. అయినా చూస్తూ మిన్నకుండ వచ్చునా?

హిరణ్యకశిపుడు : ఈ విషయంలో గురుదేవులు నన్ను మన్నించాలి.

శుక్రాచార్యులు : అంగవ్రాతంలో దుష్టాంగం వుంటే, శేషాంగశ్రేణి రక్షణకై చికిత్సకుడు దాన్ని ఖండించాలి, నాయనా!

హిరణ్యకశిపుడు : ఏ చికిత్సకుడైనా స్వీయాంగాన్ని ఖండించుకోలేడు!

లీలావతి : (లేచి, భర్త పాదాలపై పడి) మీ పాదాలకు మ్రొక్కుతున్నా గురుదేవుల హితబోధను పాటించండి.

హిరణ్యకశిపుడు : (భద్రాసనంపై నుంచి లేస్తూ) నాకిది తప్పదంటారా!

శుక్రాచార్యులు : ఔను, నాయనా!

హిరణ్యకశిపుడు : సరే! ముందు వాడితో మాట్లాడి చూస్తాను. ఎవరురా అక్కడ!

భటుడు : (ప్రవేశిస్తూ) చిత్తం, ప్రభూ!

హిరణ్యకశిపుడు : ప్రహ్లాద రాకుమారులను మేము రమ్మంటున్నామని చెప్పు,

భటుడు : చిత్తం, దేవరా! (వెడతాడు)

లీలావతి : వాడితో మాట్లాడ్డం దేనికి?

హిరణ్యకశిపుడు : మీ సంశయాలెంతవరకు నిజమో తేల్చుకోడానికి.

లీలావతి : వాడు మీకు దొరుకుతాడనే కాబోలు, మీ భావం!

హిరణ్యకశిపుడు : వాడు చిన్న పిచ్చివాడైతే, నేను పెద్ద పిచ్చివాడినని నీ నమ్మకం అంతే కదూ? సరిలే! నీవు వెళ్ళు!

లీలావతి : నేను వెళ్ళడం దేనికి? ఆ మాట్లాడేదేదో నా యెదుటనే మాట్లాడండి!

హిరణ్యకశిపుడు : ఒంటరిగానే వాడితో మాట్లాడాలి, ఇందరి ముందరైతే వాడు బిడియ పడవచ్చు.

శుక్రాచార్యులు : అయితే, నేను కూడా వెళ్ళిరానా, నాయనా?

హిరణ్యకశిపుడు : మంచిది, గురుదేవా!

(పాదాభివందనం చేస్తాడు)

శుక్రాచార్యులు : దీర్ఘాయుష్మాన్ భవ!

లీలావతి : పోనీ, నేను వెడతాను - గురుదేవులనైనా వుండనివ్వండి!

శుక్రాచార్యులు : వద్దులే, అమ్మా! ఒంటరిగానే మాట్లాడనీ!

లీలావతి : వాడితో ఒంటరిగా మాట్లాడాలంటే ఈనాడు నాకెందుకో భయంగా వున్నది.

హిరణ్యకశిపుడు : నీ వెర్రి భయాలకేమిలే నీవు వెళ్ళు!

(లీలావతి శుక్రాచార్యునికి పాదాభివందనం చేస్తుంది. ఆయన "దీర్ఘ సుమంగళీభవ!" అని దీవిస్తాడు. లీలావతి లోనికి, శుక్రాచార్యులు వెలుపలికి వెడతారు)

హిరణ్యకశిపుడు : పిచ్చి భయాలు మాని, మరి వెళ్ళు! (లీలావతి నిష్క్రమణ)

లీలావతి : (అవతలికి అడుగు వేసి వేయక ముందే వెనుదిరిగి) జాగ్రత్త సుమండీ!

హిరణ్యకశిపుడు : ఆ వెర్రినాగన్న నీ కంటికి పెనుభూతంలా కనబడుతున్నట్టున్నాడు!

లీలావతి : వాడు మన పాలిట పెనుభూతమే!

హిరణ్యకశిపుడు : *(లీలావతి వెళ్ళగానే వెనుదిరిగి, ఆలోచనా మందిరం వెనక భాగంలో అనుమానంతో ఏదో ఆలకిస్తున్నట్టు నిలబడి వున్న సముచిని చూచి, ఆశ్చర్యంగా)* నీవిక్కడే వున్నావా?

సముచి : ఔను, ప్రభూ! ఎందుకైనా మంచిదని ఆగిపోయాను.

హిరణ్యకశిపుడు : మంచి లేదు, చెడ్డ లేదు - వెళ్ళు!

సముచి : మన్నించండి, ప్రభూ! మీ సంభాషణకు నేనడ్డు రాను!

హిరణ్యకశిపుడు : నీ దృష్టిలో కూడా మా వెర్రినాగన్న ఒక పెనుభూతమే కాబోలు! నాకు నీ రక్షణ అక్కరలేదు,నువ్వు వెళ్ళు!

సముచి : *(ఆలోచనా మందిరం వెనుక భాగానికి మరి నాలుగడుగులు వేస్తూ)* వెడతాను, ప్రభూ! వెడతాను!

హిరణ్యకశిపుడు : (బయటికి వెళ్ళే ద్వారాన్ని చూపుతూ) వెళ్ళవలసింది అటుకాదు ఇటు!

సముచి : కాలి అలికిడి ఏదో తగిలింది, అదేమిటో తెలుసుకోవాలి ఒక క్షణం ప్రభువులు నన్ను మన్నించాలి.

హిరణ్యకశిపుడు : లేనిపోని నీ అనుమానాల కేమిలే! తక్షణం వెళ్ళు!

సముచి : వెళ్ళక తప్పదా, ప్రభూ!

హిరణ్యకశిపుడు : ఆహా!

సముచి : *(ఆలోచనా మందిరం వెనక వైపు నుంచి చూపులను మరలించుకో లేకపోతున్నట్టు, అటు మరొక క్షణం కలయ జూచి)* అయితే, సెలవు!

(నమస్కరించి వెళ్ళిపోతూ కూడా సముచి ఒకసారి వెనుదిరిగి చూస్తాడు. అంత వరకు ఒకే చోట నిలుచున్న హిరణ్యకశిపుడు ఆ తర్వాత ఆలోచనా మందిరం ముందు భాగంలో పచార్లు చేయనారంభిస్తాడు. మధ్యలో పెదవులపై చిరునవ్వు మొలకలెత్తుతుంది. "పెనుభూతం!" అంటూ పైకి అంటాడు. కొన్ని క్షణాల పిదప తిరిగి అదే మాటను పునశ్చరణ చేస్తూ నెమ్మదిగా నవ్వుకుంటాడు. మరి కొన్ని క్షణాల తర్వాత కాలి అలికిడి చెవిని సోకినట్టు తోచగా, నిలిచి ఆలకిస్తాడు. తాను భ్రమపడినట్టు నిర్ణయించుకుని, తిరిగి పచార్లు చేస్తాడు. ప్రహ్లాదుని రాక

ఆలస్యమైన కొద్దీ ముఖంలో కొంత అశాంతి ద్యోతకమౌతుంది. కాళ్ళు అలికిడైనట్టు తోచగా మరొకసారి నిలిచి ఆలకిస్తాడు. జరుగుతున్న ఆలస్యానికి ముఖంలో అశాంతి చిహ్నాలు పెరుగుతుండగా "హరిః ఓం" అనే మాట వినబడుతుంది. దాన్ని విన్నంతనే హిరణ్యకశిపుడు పచార్లు నిలిపి వేస్తాడు.

హిరణ్యకశిపుడు : ("హరిః ఓం") అంటూ ప్రవేశిస్తున్న కుమారుని కెదురేగి కౌగిలించుకుంటూ)వచ్చావా, బాబూ! వర్తమానం చేరడంలో ఆలస్యమైందా?

ప్రహ్లాదుడు : హరిః ఓం!

హిరణ్యకశిపుడు : ఆ హరి ఎంత అదృష్టవంతుడురా! అన్యచింత లేని నీవంటి మహాభక్తుడు లభించాడు!

ప్రహ్లాదుడు : హరిః ఓం!

హిరణ్యకశిపుడు : నీ వంటి నిశ్చల భక్తులు మరి పది మంది దొరికితే, ఆర్యఋషుల ఈ కొత్తదేవుడు మన దేశంలో గట్టిగా పాతుకుపోతాడు!

ప్రహ్లాదుడు : ఆయన ఆదిదేవుడు; దేవదేవుడు.

హిరణ్యకశిపుడు : నీవు చిన్నవాడివి, బాబూ! నీకు తెలియదు! మన శివునికి పోటీగా ఇటీవలనే వారు హరిని తెరపై కెక్కించారు! అంతకు ముందు వారు ఇంద్రాగ్ని వరుణాది దేవతలనే ఆరాధించేవారు. వారి వేదాలలో హరి ప్రసక్తి సయితం లేదు.

ప్రహ్లాదుడు : విష్ణువనే పేరుతో శ్రీహరి వేదదేవుడు.

హిరణ్యకశిపుడు : వేదాల సంగతి కూడా తెలుసుకున్నావన్న మాట! అన్ని విషయాలు తెలుసుకోవడం మంచిదే! అయితే, ఋగ్వేదంలో ఇంద్రుని కీర్తిస్తూ 250 ఋక్కులుండగా, విష్ణువును ప్రస్తుతించేవి అయిదు మాత్రమే! ఈ సంగతి నీకెవ్వరు చెప్పలేదా?

ప్రహ్లాదుడు : ఇంద్రుడు శ్రీ మహావిష్ణువు భృత్యుడు.

హిరణ్యకశిపుడు : ఆ దుస్థితి అతడికి పట్టి ఎంతో కాలం కాలేదు, బాబూ! తాము కొలిచే దేవుల ప్రతిపత్తిని ఆర్య ఋషులు సమయానుకూలంగా మార్చుతూ వుంటారు. ఇంద్రుడు తమ పక్షం వహించి, తమను రణరంగంలో నడిపిస్తున్నందునే తాము అజేయులమని వారొకప్పుడు నటన చేసేవారు. మనతో యుద్ధాలలో వరుసగా ఓడిపోయిన తర్వాత తమ మాటపై తమ వారిలోనే నమ్మకం సడలిపోయిందని ఋషులు గుర్తించారు. అందుమీదట ఇంద్రుని తలదన్నిన శ్రీహరి ప్రస్తుతం తమ పక్షాన పోరాడుతున్నాడని వారంటున్నారు. వారి మాయలో పడబోకు, బాబూ!

ప్రహ్లాదుడు : మాయచేసే వారెవరు? మాయలో పడేవారెవరు? ఎల్ల శరీరధారులు ఇల్లనే చీకటి నీటిలో తెల్లుతున్నారు.

మేము, తామనే మతి భ్రమణంతో ఖిన్నులౌతున్నారు. ఆ చీకటి గోతిలో నుంచి తప్పించి కైవల్య పద మివ్వగలవాడు ఆ శ్రీహరి మాత్రమే!

హిరణ్యకశిపుడు : అక్కడే నీవు పొరపడుతున్నావు, బాబూ! మనపై శత్రుత్వ సాధనకై ఆ శ్రీహరిని ఆర్య ఋషులు కొత్తగా సృష్టించారు. అతడు మన వంశాన్ని, మన జాతిని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నాడని వారు చెప్పడం లేదా? నీ పెదతండ్రిని అతడే వధించాడట! నాపట్ల కూడా వైరం పూని వున్నాడట! మన వైరిగా చెబుతున్నవానిని నీవు కొలిస్తే మన వైరి వర్గం బలపడదా?

ప్రహ్లాదుడు : వైరులెవ్వరు? మన చిత్తమే మన వైరి! లోకాలన్నింటిని గడియ లోపల జయించినా, చిత్తాన్ని గెలవలేనివాని జన్మ వ్యర్థమైపోతుంది.

హిరణ్యకశిపుడు : (కుమారుని తల నిమురుతూ) ఏమైనా, ఒకందుకు నాకు సంతోషంగా ఉన్నది, బాబూ! గుచ్చి, గుచ్చి, ఎంతగా ప్రశ్నించినా ఇది వరకు "హరిః ఓం" తప్ప నీ నోట మరొక మాట వచ్చేది కాదు. ఈనాడు మనస్సు విప్పి మాట్లాడుతున్నావు. రా, బాబూ! ఇలారా! కూర్చుని, అన్ని విషయాలు సవిస్తరంగా చర్చించుకోవచ్చు. (ప్రహ్లాదుని రెక్కపుచ్చుకుని భద్రాసనాల వద్దకు తీసుకువెడతాడు).

హిరణ్యకశిపుడు : (తాను కూర్చుంటూ) రా, బాబూ! దగ్గరిగా కూర్చో!

ప్రహ్లాదుడు : నిలబడ్డమే నాకిష్టం!

హిరణ్యకశిపుడు : అదేమిటి, బాబూ! చిన్న, పెద్ద విషయాలన్నింటిలో నీ మతం నీదేనా? తక్కిన వాటన్నింటిలో నీ ఇష్ట ప్రకారమే వెళ్ళినా, ఈ ఒక్క హరి విషయంలో మాత్రం నా యిష్ట ప్రకారం వెళ్ళు, బాబూ! మన జాతి వాడైన సోముని అన్యాయంగా చంపించి మత్స్య రూపంలో వచ్చి హరి చంపి వెళ్లినట్టు ఆర్య ఋషులు అపవాదు పుట్టించారు. తర్వాత సముద్ర మధనం కథ కల్పించి, దానిలో తమ హరిని కూర్మాన్ని చేశారు. పిమ్మట నీ పెద తండ్రి విషయంలో హరిని ఏ అవతార మెత్తించారో నీకు తెలుసు! నేను దేవుడను కాను; మానవుడనే! అయినా, అన్ని మతాల వారిని సమానంగా చూడ్డానికి నేను ప్రయత్నిస్తున్నాను. హరి నిజంగా దేవుడైతే, ఒక మతం వారి పక్షం వహించి, తక్కిన వారిని రూపుమాపడానికి సిద్ధపడతాడా? హరి అనేవాడు లేడు, బాబూ! ఉన్నా, అతడు దేవుడు కాడు. పోనీ, ఆర్య ఋషుల మతం పైనే భక్తి శ్రద్ధలుంటే, వారి బ్రహ్మను పూజించు. వారి బ్రహ్మ... (ప్రహ్లాదుని చూపులు ఆలోచనా మందిరం వెనుక భాగంపై లగ్నమై ఉన్నట్టు గమనించి) నీ చూపులెక్కడో వున్నాయి. నా మాటలు వినిపించుకోవడం లేదా, బాబూ!

ప్రహ్లాదుడు : హరిః ఓం!

హిరణ్యకశిపుడు : యుక్తాయుక్త విచక్షణ చేయగల వయస్సు వచ్చింది. నేను చెప్పేది సావధానంగా విని, ఏది ఎంతవరకు సమంజసమో ఆలోచించు, బాబూ!

ప్రహ్లాదుడు : హరిః ఓం!

హిరణ్యకశిపుడు : మళ్లీ చెబుతున్నాను - బాబూ! హరి లేడు. . -

ప్రహ్లాదుడు : లేకేమి? ఆయనున్నాడు.

హిరణ్యకశిపుడు : ఎక్కడ వున్నాడు?

ప్రహ్లాదుడు : అన్నిచోట్ల వున్నాడు.

హిరణ్యకశిపుడు : ఆర్య ఋషుల కుట్రలలో తప్ప మరెక్కడా లేడు, బాబూ!

ప్రహ్లాదుడు : ఆయన సర్వాంతర్యామి! ఇందుగలడందులేడని సందేహించనక్కరలేదు. ఎందెందు వెదకి చూస్తే, అందందే ఆయన కనబడతాడు.

హిరణ్యకశిపుడు : మరి నేనింత వెదకినా నాకు కనబడడే!

ప్రహ్లాదుడు : మీరు సరిగా వెదకడం లేదేమో!

హిరణ్యకశిపుడు : పోనీ, నీవు చెప్పు - ఎలా వెదకాలో!

ప్రహ్లాదుడు : ఆ స్తంభంలో చూడండి! దానిలో ఆయన కనబడ్డం లేదా?

హిరణ్యకశిపుడు : (లేచి, వెనుదిరిగి చూస్తూ) ఏడీ? నాకు కనబడడే?

ప్రహ్లాదుడు : జాగ్రత్తగా పరిశీలించండి.

హిరణ్యకశిపుడు : (చిరునవ్వుతో) లేదు, బాబూ! లేదు! నీ భక్తి ప్రాబల్యం చేత స్తంభాన్ని చూచి, హరిగా నీవు భ్రమ

పడుతున్నావు.


ప్రహ్లాదుడు : భ్రమ పడుతున్నది నేను కాదు మీరే! (రెండు చేతులెత్తి, హెచ్చించిన గొంతుతో) పుండరీకాక్షా! వైకుంఠవాసా! జగద్రక్షకా! పాహిమాం! పాహిమాం! (పరుగున వెళ్ళి, స్తంభానికి సాష్టాంగపడి, దాన్ని అధో భాగాన్ని రెండు చేతులతో గట్టిగా కౌగిలించుకుంటాడు).

హిరణ్యకశిపుడు : (క్షణంపాటు విస్తుపోయి) ఓరి వెర్రి నాగన్నా! (ఈ మాటలంటూ హిరణ్యకశిపుడు కుమారుని వద్దకు వెళ్ళి, స్తంభాన్ని కౌగిలించుకున్న అతని చేతులను విడిపించడానికి కిందికి వంగుతాడు. స్తంభం వెనుక సింహం తలతో దాగి వున్న దేవాతిథి పైకి దూకి, 'పులిగోళ్ళ'తో హిరణ్యకశిపుని కడుపును చీల్చుతాడు. వంగి వున్న హిరణ్యకశిపుడు ముందుకు పడిపోయి ప్రాణాలు విడుస్తాడు. విజయ సూచకంగా దేవాతిథి రెండు చేతులెత్తి వికటంగా నవ్వుతూ వుంటాడు).

ప్రహ్లాదుడు : (తన ప్రక్కనే కుప్పకూలిన తండ్రిపై పడి విలపిస్తూ) అయ్యో, తండ్రీ! అయ్యో, తండ్రీ! ఎంత ఘోరం జరిగింది! ఎంత ఘోరం! (అంతలోనే చివాలున లేచి, వికటాట్టహాసం చేస్తున్న దేవాతిథిని ఉద్దేశించి) ఇంత ఘాతుకానికొడిగట్టావే! ఎవడవురా నువ్వు దేవాతిథి , ఉగ్ర నరసింహ రూపంలో నేను హరిని! శ్రీహరిని!

ప్రహ్లాదుడు : (గొంతు గుర్తుపట్టి) ఛీ! నీచుడా! నీవు దేవాతిథివి కావా? నమ్మించి నన్ను మోసం చేస్తావా? బంధిస్తానని చెప్పి, హత్య చేస్తావా? (ఇందుకు జవాబుగా దేవాతిథి మరింతగా వికటాట్టహాసం చేస్తాడు. ఇంతలో భటుడు హుటాహుటిగా లోనికి వస్తాడు. అతడిని చూడగానే హుంకరిస్తూ దేవాతిథి అతడిపై పడబోతాడు. భయపడి, "నరసింహం! నరసింహం!" అని కేకలు వేస్తూ అతడు పారిపోతాడు. ఆలోచనా మందిరం వెనుక భాగానికి ఇరువైపులా ఉన్న గదులలో దాగివున్న అంగిరస, వామదేవులు ఈ లోపున హత్య జరిగిన చోటుకు పరుగు పరుగున వచ్చి, దేవాతిథిని బరబర లాక్కుపోతుండగా.

- తెర) -

పంచరాత్రం (ద్రౌపది)

ఏకాంక నాటిక

ఏకాంక నాటిక



తెర లేచినప్పుడు రజత దీపస్తంభం వద్ద సువర్ణ కలశంతో నిలబడి వున్న ద్రౌపది ప్రమిదలోకి తైలం వంచుతూ వుంటుంది. అది నిండగానే వత్తిని సరిచేసి, కలశాన్ని ఒక ప్రక్కగా వుంచి, వెనుకకు వచ్చి, ధర్మరాజు పాదాలవద్ద భక్తితో కూర్చుంటుంది.

ద్రౌపది : రామాయణ పారాయణానికి అంతరాయం కలి ది. తమకు శ్రమ కాకపోతే, ఆ పుణ్యకధాశ్రవణ భాగ్యాన్ని మరి కొంతసేపు కలిగించండి. రెండు నెలలనాడు ప్రారంభించినా, ఇంకా అయోధ్యా కాండలోనే ఉన్నాము.

ధర్మరాజు : నీకు నిద్రాసమయమైన దేమో!

ద్రౌపది : లేదు, స్వామి! లేదు! పౌరాణిక గాథలను తాము శ్రావ్యంగా చదివి, వాటిలోని ధర్మ సూక్ష్మాలను వివరిస్తుంటే, నాకు తన్మయత్వం కలుగుతూ వుంటుంది!

ధర్మరాజు : తన్మయత్వం వల్లనే కాబోలు, ఇంతకు ముందు కునికి పాట్లు పడ్డావు!

ద్రౌపది : కునికిపాట్లు పడింది నేను కాదు; ఆ దీపం!

ధర్మరాజు : అయితే, ఆవలించింది కూడా ఆ దీపస్తంభం కాబోలు!

ద్రౌపది : (తిరిగి నవ్వి) కథ మంచి పట్టులో వున్నది.
(తమ మధ్య ఒక చిన్న బల్లపై తెరచిన పుటలతో వున్న భూర్జరపత్ర గ్రంధ సంపుట మెత్తి, దాన్ని ధర్మరాజు వొడిలో పెడుతూ) మధ్యలో నిలపడం తమకు భావ్యం కాదు.

ధర్మరాజు : (పుస్తకాన్ని చేతులలోకి తీసుకుంటూ)

ద్రౌపది : ఎక్కడ నిలిపారో తమకు తెలియదా? మొదలు పెట్టాలి?

ధర్మరాజు : చదవడం నేనెక్కడ నిలిపానో నాకు తెలుసు. కాని, వినడం నీవెక్కడ నిలిపావో అది నాకెలా తెలుస్తుంది!

ద్రౌపది : (తిరిగి నవ్వి) వనవాసానికి తన వెంట రావలదని రాముడనగా కుపితురాలైన సీత ఆయనను నిందావాక్యాలు పలుకనారంభించిన ఘట్టం వరకు వచ్చాము.

ధర్మరాజు : పోనీ, దాన్ని రేపు చదువుకోరాదా? అది బాధాకరమైన ఘట్టం!

ద్రౌపది : ఎవరికి బాధాకరం? రామునికా? తమకా?

ధర్మరాజు : ఉభయులకు! (ఈసారి ద్రౌపది మరింత బిగ్గరగా నవ్వుతుంది. ధర్మరాజు చిరునవ్వు నవ్వుతాడు.)

ద్రౌపది : (గ్రంధ పఠనానికి ధర్మరాజు తిరిగి ఉపక్రమించబోతుండగా) అక్షరాలిప్పుడు స్పష్టంగా కనపడుతున్నవా?

ధర్మరాజు :ఓ, దివ్యంగా దీపమిప్పుడు కునికిపాట్లు పడ్డం లేదు, దీపస్తంభమిప్పుడు అవలించడం లేదు!

ద్రౌపది : (నవ్వి) నవ్వులలోకి దించి, మరి ఈ పూటకు చదవకుండా సరి పెట్టాలని చూస్తున్నారు!

ధర్మరాజు : నవ్వే నీకు శోభ

ద్రౌపది : (మానవదనంతో) ఏమి శోభో! అదే మన క్షోభలన్నింటికీ మూలం! మయసభలో దుర్యోధనుని పాట్లు చూచి మిమ్ములతో పాటు నేను కూడా నవ్వబట్టే కాదా కురుక్షేత్ర సంగ్రామం అనివార్యమైంది!

ధర్మరాజు : ఇంతలో నవ్వు. అంతలో కన్నీరు, ఇంతలో ఆగ్రహం, అంతలో అనుగ్రహం - హావభావ విలాసాలలోని ఈ చంచలత్వమే స్త్రీ జాతికి శోభ!

ద్రౌపది : (చిరునవ్వుతో) అయితే, పురుషజాతికి ఏది శోభ తెస్తుందో నన్ను చెప్పమంటారా?

ధర్మరాజు : నా అనుమతి కోరడం దేనికి? చెప్పు!

ద్రౌపది : స్త్రీ జాతి చిత్తమెరిగి ప్రవర్తించడం!

ధర్మరాజు : ఔనౌను! లేకపోతే ప్రతి గృహమొక కురుక్షేత్రమౌతుంది!

ద్రౌపది : (నవ్వి) ఆ ప్రమాదం తప్పాలంటే మాటలతో నన్ను మరపించక, తిరిగి రామాయణపఠనం సాగించండి!

ధర్మరాజు : సరే! (పుస్తకం చేతిలోకి తీసుకొని, చదవడం మొదలు పెడతాడు)

స్వార్యమానా తు రామేణ మైథిలీ జనకాత్మజా,
వనవాస నిమిత్తాయ భర్తార మిద మబ్రవీత్
సా తముత్తమ సంలిగ్నా సీతా విపుల వక్షసమ్,
ప్రణయాచ్చాభిమానా చ్చ పరిచిక్షేప రాఘవమ్
కిం త్వా మన్యత వైదేహః పితామే మిథిలాధిపః,
రామ! జామాతరం ప్రావ్యస్త్రీయం పురుష నిగ్రహమ్.
అనృతం బత లోకో యమజ్ఞానాద్యద్ధి వక్ష్యతి,
తేజో నాస్తి వరం...

ద్రౌపది : వరసగా అలా చదువుకుపోతే, నాకేమి తెలుస్తుంది? దయచేసి టీకా తాత్పర్యాలు చెప్పండి!

ధర్మరాజు : చెప్పక తప్పదా? సరే విను "తన ప్రియుడు బ్రతిమాలుతున్నా వినక, అరణ్యవాసాన్ని గురించే మాట్లాడగోరి,

సీత దన్ను రాముడు వెంట దోడ్కొని పోనిచ్చగించ నందుకు మిక్కిలి చింతనొంది, ప్రేమచేతను, గర్వము చేతను విరివి రొమ్ముగల రాముని ఈ రీతిగా నిందింప దొడగింది.

మిథిలాపతి అయిన తండ్రి జనక మహారాజు పురుష రూపంలో వున్న స్త్రీని అల్లునిగా తెచ్చుకొన్నట్టు తెలుసుకుంటే ఏమనుకుంటాడో! ఓరామా!....

ద్రౌపది : సీత ఇంత పరుషంగా మాట్లాడింది? మనస్సుకు నొప్పి కలిగి నప్పుడు భర్తపై ఎవరినా కసురుకుంటారు గాని), ఇంతగా నోరు పారవేసుకుంటారా?

ధర్మరాజు : భర్తను దూషించినా లలిత లలితంగా, మధుర మధురంగా దూషించాలన్నమాట!

ద్రౌపది : (నవ్వి) అంతటితోనైనా సీత తన తిట్లను కట్టి పెట్టిందా? ఆ రాముని మనస్సును - పాపం! - మరింతగా నొప్పిస్తూ పోయిందా?

ధర్మరాజు : నొప్పించకుండా తిట్టడం నీవలె అందరు భార్యలకు చేతకావద్దా?

ద్రౌపది ; నొప్పి లేకుండా తిట్లు తినడం రాముని వలె అందరు భర్తలకు కూడా చేతకాదులెండి!

(తిరిగి ద్రౌపది నవ్వు: ధర్మరాజు చిరునవ్వు)

ద్రౌపది : మననవ్వులతో కథ ముందుకు సాగడం లేదు. దయచేసి, చదవండి!

ధర్మరాజు : "ఓ రామా! మిథిలా పురాన్ని పాలించే నా తండ్రి జనకమహారాజు..."

ద్రౌపది : మాటి మాటికి జనక మహారాజు ప్రసక్తి తెస్తుంది దేనికండీ? తానొక మహారాజు పుత్రికైతే, రాముడు మరొక మహారాజుకు పుత్రడు కాడా?

ధర్మరాజు : ద్రుపద మహారాజు కూర్మి పుత్రికనని మాకు అనుక్షణం జ్ఞాపకం చేయడానికి నీవైతే ద్రౌపది పేరునే

పెట్టుకున్నావు గదా!

ద్రౌపది : నా నిజనామం కృష్ణ,

ధర్మరాజు : కాని, ఆబాల్యంగా నీ ప్రసిద్ధనామం ద్రౌపదే!

ద్రౌపది : పుట్టుకతోనే తమ ప్రసిద్ధనామం ధర్మరాజులైనట్టు కాబోలు! (ద్రౌపది నవ్వు: ధర్మరాజు చిరునవ్వు)

ధర్మరాజు : సీత దూషణ వాక్యాలను నీవింకా వినగోరుతున్నావా?

ద్రౌపది : వినిపించడానికి తమకు సంకోచం లేకపోతే!

ధర్మరాజు : మధ్య నాకు సంకోచం దేనికి?

ద్రౌపది : సీత నుంచి నేనెక్కడ పాఠాలు నేర్చుకు పోతానో అని!

(మరల ద్రౌపది నవ్వు ధర్మరాజు చిరునవ్వు. ధర్మరాజు తిరిగి చదవడం ప్రారంభిస్తాడు.)

ధర్మరాజు : కిం త్వా మన్యత వైదేహః పితాయే మిధిలాధిపః
రామ! జామాతరం ప్రాప్యప్రియం పురుష నిగ్రహం.
అనృతం బతలోకోయ మజ్ఞానా ద్యద్ధి వక్ష్యతి,
తేజో నాస్త్రీ పరంరామే తపతీవ దివాకరే,
కిం హి కృత్యానిషణ్ణస్యం కుతో నాభయమస్తితే,
య తృత్యక్తు కామస్వంమా మనన్య పరాయణామ్'?

"మిథిలా పురాన్ని పాలించే నా తండ్రి జనక మహారాజు, భార్యను కాపాడుకోలేక, ఇచ్చుట విడిచి, అడవులకు వెడుతున్న నీ సంగతి విని, నా అల్లుడు స్త్రీయే కాని, పురుషుడు కాడు, పురుషరూపం దాల్చిన స్త్రీయై నన్ను వంచన చేశాడని విదారిస్తాడు. గదా! వెలుగుతున్న సూర్యునిలో ఎట్టి ప్రతాపం వున్నదో అట్టి ప్రతాపం రాముడవైన నీలో కనపడదు. ఈ ప్రజలందరు తెలివితక్కువ తనం వల్ల రాముడు ప్రతాపవంతుడు అంటారేకాని, అదివట్టి బూటకం. ఓ రామా! నీవు ఏ పని చేసి..."

ద్రౌపది : ముందేమో తండ్రి పై పెట్టి నీవు పురుషుడవే కావన్నది. అప్పుడు తానై నీకు పౌరుషం లేదంటున్నది. ఏ స్త్రీకైనా ఇంత పౌరుష్యం తగదు!

ధర్మరాజు : సీత సాధారణ స్త్రీ కాదు; ఆమె మహాసాధ్వి, పతివ్రతా శిరోమణి.

ద్రౌపది : అసాధారణ స్త్రీ తన భర్త పట్ల తన కున్న అసాధారణ భక్తి గౌరవాలను అసాధారణ దూషణవాక్కులతో ప్రదర్శిస్తుంది కాబోలు!

ధర్మరాజు : ఏ వాక్కులనైనా వాటిని పలికిన సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలించాలి. వనవాసానికి తన వెంటరావలదని రాముడు చెప్పిన సందర్భంలో భర్త వియోగాన్ని నిమేషమాత్రమైనా భరించలేని జానకి తీవ్ర హృదయావేదనవల్ల తీవ్రంగా పలికింది!

ద్రౌపది : ఎంత తీవ్రవేదనలోనైనా భర్తను "నీవు పురుషుడువుకావు; నీకు పౌరుషంలే" దనడం దుస్సహం! రాముడు కాబట్టి సరిపోయింది కాని, మరో భర్త ఆ మాట లన్న భార్యను నిలువునా చీల్చేవాడు!

ధర్మరాజు : ఆయన క్షమామూర్తి!

ద్రౌపది : ఆక్షమ శూర్పణఖ విషయంలో ఏమైపోయిందో! ఇంత కంటే చాలా స్వల్పానికి ఆమె ముక్కు చెవులను కోయించివేశాడు!

ధర్మరాజు : ఆయన మానవోత్తముడు! ఆయన చర్యలను సాధారణ మానవ ప్రమాణాలతో వితర్కించరాదు.

ద్రౌపది : తమరేమైనా చెప్పండిగాని, నాకేమో సీత నిందలో కొంతైనా నిజం లేకపోతే...

ధర్మరాజు : (ముక్కుపై వేలు వేసుకొంటూ) ఎంత పాపపు మాట!

ద్రౌపది : క్షమించండి! (లేచివెళ్ళి, తాంబూలం పళ్ళెం దగ్గరికి తెచ్చి) మరి నాలుగు ఆకులు వేసుకుంటారా?

ధర్మరాజు : వద్దు!

ద్రౌపది : (ఒక ఆకు మడుపు ధర్మరాజుకు అందిస్తూ) పోనీ, ఇదొక్కటి!

ధర్మరాజు : నాకు వద్దు! నీవు వేసుకో! జానకి...

ద్రౌపది : (ఆకు మడుపును వయ్యారంగా నోట పెట్టుకుంటూ) పోనీ, కాస్త వక్కపొడి వేసుకుంటారా?

ధర్మరాజు : వద్దు. జానకి ఏమన్నా తనకొక కఠిన పరీక్షా సమయంలో దుఃఖపారవశ్యంతోనే అన్నది - ఆసంగతి నీవు గమనించడం లేదు!

ద్రౌపది : ద్యూతంలో తాము నన్నోడిన దానికంటె ఆమెకిది కఠిన పరీక్షా సమయం కాదుగదా! అప్పుడైనా నేను తమనొక్క మాట అన్నానా?

ధర్మరాజు : అప్పుడు నీవు ప్రశంసాపాత్రమైన నిగ్రహాన్నే ప్రదర్శించావు గాని, మరొక సన్నివేశంలో...

ద్రౌపది : ఏదది?

ధర్మరాజు : విరాటరాజు కొలువుకూటంలో కీచకుడు నిన్ను అవమానించి నప్పుడు...

ద్రౌపది : అప్పుడైనా వీర విక్రములైన పత్నులు నా రక్షణకు రావడం లేదని విలపించానే తప్ప తమను నిందించలేదే!

ధర్మరాజు : ఎవరన్న మాటలు వారికి జ్ఞాపకం వుండవులే! నేను జూదరినైనందువల్లనే...

ద్రౌపది : ఏదో నోరు జారి ఆ ఒక్కమాట అన్నాననుకోండి!

ధర్మరాజు : విరాట సభలో అదొక్కమాటే కావచ్చుగాని, ఆతర్వాత వంటశాలలో నీవన్న మాటలు...

ద్రౌపది : అవి తమకెలా తెలిశాయి?

ధర్మరాజు : నీవు దాచి పెట్టినంత మాత్రాన తెలియకుండా వుంటాయా?

ద్రౌపది : క్షమించండి. రెండవ సారి పేరోలగంలో ఘోరావమానం జరిగే సరికి భరించలేక ఏవోవదరి వుండాలి.

ధర్మరాజు : సీతకు ఇది కూడా అట్టి సన్నివేశమే!

ద్రౌపది : ఇవి ఒకే విధమైన సన్నివేశాలంటే మన్నించాలి, నేనంగీకరించ లేను.

ధర్మరాజు : పోనీ, ఇవి భిన్న సన్నివేశాలే అనుకో! మితిమీరి సీతాదేవి భర్తను తూలనాడిందే అనుకో! ఏమైనా తాననగోరిన నాలుగు మాటలు ఆయన ముందే అని వేసింది కాని ఆయను చాటున అన్యులతో అనలేదు.

ద్రౌపది : నేను మాత్రం అన్యులతో అన్నానా? మన అజ్ఞాతవాసానికి భంగం కలగకుండా అప్పటిలో తమను దర్శించడానికి వీలు లేకపోబట్టి మన భీమసేనులతో అన్నాను. మీదేరగలదో అతనితోనే అన్నావు.

ధర్మరాజు : ఎవనితో అంటే నీ మనోభీష్ట సమ్రాట్టులు మాత్రం తమ పట్టమహిషి మనోభీష్టాలను తీర్చరా!

ద్రౌపది : యుధిష్ఠర

ధర్మరాజు : ఇప్పటి మాటకేమిలే! కీచక వధలో, దుర్యోధన, దుశ్శాసన సంహారంలో నీ కోర్కెలీడేర్చింది అతడే కాదా?

ద్రౌపది : తమరు శాంత మూర్తులు, ధర్మరూపులు, అజాత శత్రువులు! తమ స్వభావానికి విరుద్ధమైన కోర్కెలు తమనుంచి కోరడం నాకు తగునా?

ధర్మరాజు : నా నుంచి నీవేమి కోరడానికైనా నేను జరజెట్టినా! సవ్యసాచినా! అతిరూపసినా! మహావివేకినా!

ద్రౌపది: అట్టివారందరినుంచి పూజలందుకొంటున్న ధర్మస్వరూపులు! భవబంధనాల నుంచి విముక్తి సాధించే ధర్మోపదేశాన్ని తమ నుంచి పొందుతున్నాను. అంత కంటె నా కేంకావాలి?

ధర్మరాజు : నీ వేమి, తమ్ము లేమి నా పట్ల భక్తి గౌరవాలు చూపు తున్నమాట నిజమే! కాని...

ద్రౌపది : తమ సందేహమేమిటి?

ధర్మరాజు : నా పట్ల మీకు ప్రేమానురాగాలున్నవా అని ఈ మధ్యతరచు వితర్కించుకుంటున్నాను!

ద్రౌపది : ఈ సందేహం తమ కెందుకు కలగాలి? భక్తి గౌరవాలున్న చోట ప్రేమానురాగాలుండవా?

ధర్మరాజు : అన్ని సందర్భాలలో వుండనక్కర లేదు!

ద్రౌపది : ఆ ధర్మ సూక్ష్మ మేమిటో నాకు తెలియదు.

ధర్మరాజు : వినయం కొద్దీ తెలియదన్నా, నీకా, ధర్మసూక్ష్మాలు తెలియం(ని)ది? ప్రథమ ద్యూతం తర్వాత రాజసభకు తోడ్కొని రావలసిందిగా దుర్యోధనుడు ప్రాతికామిని పంపగా "ధర్మజులు ముందుగా తమ నోడిపోయి పిమ్మట నన్నోడినారా? లేక, ముందు నన్నోడి, తర్వాత తామాదుపడి నారా"? అని నీవు ప్రశ్నించలేదా? నాకే కాక, భీష్మ ద్రోణాదులకైనా ఈ ప్రశ్నతోయలేదు. దానిలో గర్భితమై వున్న ధర్మసూక్ష్మం సామాన్యమైందా? యందుండబట్టే ఆ ప్రశ్న నాకు తోచింది!

ద్రౌపది : తమ కృప నా.

ధర్మరాజు : నా కృప!

ద్రౌపది : ఔను! తమ కృప! .

ధర్మరాజు : కృపను కాంక్షించేది రాజుల నుంచి, దైవాలనుంచి

ద్రౌపది : తమరే మాకు రాజులైనా, దైవాలైనా!

ధర్మరాజు : అందువల్లనే కాబోలు, దూరం నుంచి నాకొక నమస్కారం విసిరి పారవేస్తారే తప్ప చెంతకురారు!

ద్రౌపది : మేము తమ చెంత లేమా?

ధర్మరాజు : చెంత నున్నవి శరీరాలే, హృదయాలు కావు!

ద్రౌపది : అదేమిటి? అలా సెలవిస్తున్నారు!

ధర్మరాజు : (నిట్టూర్చుతూ) ఊ! సెలవివ్వడం! అది కూడా ఆత్మీయుల పట్ల ప్రయోగించే పదం కాదు; అధికుల పట్ల ప్రయోగించేదే! ఈ విధమైన ఆధిక్యత, ఎంత బాధాకరమో ఇప్పుడిప్పడే నాకు దెలిసి వస్తున్నది! పుట్టినదాదిగా పెద్దరిక మిచ్చి, ప్రేమానురాగాలకు అందని ఉన్నతాసనం పై నన్ను కూర్చోబెడుతున్నారు!

ద్రౌపది : ఈ పూట తమ మాటలు చిత్రంగా వున్నాయి! తమ పట్ల భక్తి గౌరవాలు చూపడం దోషమా?

ధర్మరాజు : సర్వసాధారణంగా భక్తిలో ప్రేమపాలు కంటే భయం పాలు హెచ్చు. గౌరవం విధిగా అనురాగ ప్రేరితమైంది కానక్కరలేదు.

ద్రౌపది : అది ఎవరి విషయంలోనైనా కావచ్చునేమో గాని, నా విషయంలో మాత్రం కాదు. తమ రంటే నాకు భక్తి గౌరవాలతో పాటు ప్రేమానురాగాలు కూడా వున్నాయి. ప్రథమ ద్యూత, తర్వాత ధృతరాష్ట్రుడు నన్నొక వరం కోరుకోమనగా, దాస్యం నుంచి తమ విముక్తిని నేను కోరుకోలేదా?

ధర్మరాజు : ఔను, కోరుకున్నావులే! కాని, నాపై ప్రేమతో కాదు, నీ కుమారునిపట్ల అనురాగంతో!

ద్రౌపది : అదేమిటండీ?

ధర్మరాజు : ఏమిటో నీకు తెలియదా? అప్పటి నీ మాటలను ఒక సారి జ్ఞప్తికి తెచ్చుకో! "నా జ్యేష్ఠ పుత్రుడు ప్రతినింద్యుడు రాకుమారుడుగా జన్మించాడు, రాకుమారుడుగా వర్ధిల్లుతున్నాడు. తోటి రాకుమారులు వాడిని దాసపుత్రుడని ఇక గేలి చేయవచ్చు. మాట తలచుకుంటేనే నా గుండె తరుక్కుపోతున్నది. నా చిరంజీవికి ఈ ఘోరావమానం తప్పాలంటే ధర్మజులకు దాస్య విముక్తి కలిగించండి" - ఇవి కావా అప్పటి నీ మాటలు?

ద్రౌపది : శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు కూడా నా పుత్రులే. అయినా, ఆ నలుగురి మాట తలపక,

ప్రతినింద్యుని ప్రసక్తిని మాత్రమే నేను తీసుకురావడం వాడు తమ పుత్రుడనే కాదా? తక్కిన నలుగురి పుత్రులపై కంటే మీ పుత్రుని పట్లనే నాకు అధికానురాగం వున్నదనడం, మీ పట్ల అధికప్రేమ కలదని చెప్పడమే కాదా?

ధర్మరాజు : నీ వేమన్నా నాకు తెలుసు - నీ తక్కిన నలుగురిలో కూడా పార్థుని నీవెక్కువగా ప్రేమిస్తావని!

ద్రౌపది : ఎందరు పార్థులైనా ధర్మప్రభువులైన తమ తర్వాతనే!

ధర్మరాజు : అదుగో! తిరిగి "ధర్మప్రభువులు"! దాచాలన్నా, నిజం దాగదులే! నేను నీకు ధర్మప్రభువును కాగా, అతడేమో ప్రేమ మూర్తి!

ద్రౌపది : సీత పలుకుల ప్రభావం నాపై పడలేదు గాని, తమపై పూర్తిగా పడింది! (నవ్వుతుంది)

ధర్మరాజు : అబ్బే! నేను నిన్ను నిందించడం లేదు. మత్స్య యంత్రాన్ని ఛేదించింది అతడే! మా తల్లి జోక్యం లేకపోతే నీవతనికి మాత్రమే పత్నివై వుండేదానివి.

ద్రౌపది : అప్పుడు తమ పట్టమహిషిని కాగల మహద్భాగ్యం నాకు దక్కి వుండేదా?

ధర్మరాజు : సంతోషం! నన్ను కాకపోయినా నా పదవిని ప్రేమిస్తున్నావు!

ద్రౌపది : (దిగ్గున లేచి, కన్నీటి గొంతుతో) ఎందుకండీ? ఈ పూట నన్నింత క్షోభ పెడుతున్నారు! మీ దేవిక ప్రసక్తినే నెప్పుడైనా తెస్తున్నానా?

ధర్మరాజు : ఆసపత్ని పట్ల నీకు ఈర్ష్య లేకపోవడం కూడా నేనంటే నీకు ప్రేమలేదనే నిరూపిస్తున్నది.

ద్రౌపది : తమ కొక సతీమణి వుండగా, తమ పెద్ద తమ్ముడు ఇద్దరిని, రెండవ తమ్ముడు ముగ్గురిని కట్టుకున్నారు. తమ చిన్న తమ్ములిద్దరు చెరొకరిని ఏరి, కోరి తెచ్చుకున్నారు. ఈ ఎనిమిది మంది సవతులను గురించి ఆలోచిస్తూ కూర్చుంటే నాకున్న మతి కాస్తా ఎప్పుడో చెడిపోయేది! ఎందుకండీ? అకారణంగా ఈ పూట నన్నింతగా నొప్పించడం! (కన్నీరు పెడుతుంది)

ధర్మరాజు : నవ్వు నుంచి కన్నీళ్ళలోకి ఇంత త్వరగా మారడం నీకే చెల్లు! సరే! - రామాయణ పారాయణం తిరిగి కొనసాగిద్దామా!

ద్రౌపది : వద్దులెండి!

ధర్మరాజు : ఏ! ఇంతలోనే దాని పట్ల అంత వైముఖ్యం?

ద్రౌపది : అదే ఈ పూట తమ మనస్సును అనవసరంగా వికలం చేసింది.

ధర్మరాజు : వినవద్దనుకుంటే నీవు మానుకో - నేను చదువుకుంటాను.

ద్రౌపది : అయితే, పతి దూషణలో సీతను మించిపోగల ప్రజ్ఞ నాకున్నదని తమకు నిరూపించు వలసి వుంటుంది!

ధర్మరాజు : మంచిది! నిరూపించు

(చదవడానికి పుస్తకాన్ని తిరిగి చేతులలోకి తీసుకుంటాడు),

ద్రౌపది : (పుస్తకాన్ని చివాలున పెరికి వేసుకుంటూ) సీతా రాముల గోడు మనకు దేనికి? ద్యూతంతో కాసేపు సంతోషంగా కాలక్షేపం చేద్దాం - రండి! (లేది పాచికలు పెట్టివున్న మరొకబల్ల వద్దకు ఆహ్వానిస్తుంది.)

ధర్మరాజు : (సగం లేచి) ఇప్పుడు ద్యూతం, దేనికిలే! తిరిగి నిన్నోడి పోతానేమో!

ద్రౌపది : అయితే, గెలుచుకునేది మీరేగా! అంతకంటే నాకేం కావాలి! సతిని దిన దినం కొత్తగా గెల్చుకోవడంలో పతికైనా ఎంత ఆనందం లేదు! రండి, స్వామీ! రండి!! చేయిపట్టుకుని ధర్మరాజును ద్రౌపది అవతలికి లాగుతుండగా -

తెర)

తెర లేచేసరికి భీముడు ఫలాహారాల బంగారు పళ్ళెం ముందు పెట్టుకొని, దాన్ని ఖాళీ చేస్తూ వుంటాడు. ప్రక్కన సువర్ణ కలశం వుంటుంది. మధ్యలో ఒకసారి కలశం నుంచి అతడు మధువును సేవిస్తాడు. ఒకటి, ఒకటిన్నర నిమిషాల తర్వాత మరొక ఫలాహారాల పళ్లెంతో ద్రౌపది ప్రవేశిస్తుంది.

ద్రౌపది : అవి చల్లారిపోయినవేమో! వీటిని తీసుకోండి - వేడివేడిగా వున్నాయి.

(చేతిలోని కొత్త పళ్ళెం భీముని ముందు పెట్టడానికి పాతదాన్ని తీసివేయబోతుంది.)

భీముడు : (తన యెదుట వున్న పళ్ళెం ద్రౌపది చేతికి చిక్కకుండా దాన్ని మరింత దగ్గరికి లాక్కుంటూ) కొందరికి వేడి వేడి పదార్థాలు రుచి, కొందరికి చల్లనివి రుచి మనకన్నీ రుచి!

ద్రౌపది : అన్నీ మీకు రుచిగానే వుంటాయా? పాక శాస్త్రంలో ఆ నలమహారాజు తర్వాత అంతటి మహాపండితులైన తాము అనవలసిన మాటేనా ఇది?

భీముడు : ఆకలి రుచి ఎరుగదు; నిద్ర సుఖం ఎరగదు. (కొత్త పళ్ళెం అందుకుంటూ) పళ్ళెం బరువే తప్ప పదార్థాల బరువు కనబడదు!

ద్రౌపది : (నవ్వుతూ) కరవేమీ రాలేదు లెండి! కావాలంటే మరొక పర్యాయం తెస్తాను.

భీముడు : నేను నోరు తెరచి అడిగితే నీవు తెచ్చేది మరొక్క పర్యాయమే అన్న మాట! ఆకలెరిగి, అడగకుండా పెట్టేదే ఆలి!

ద్రౌపది : దేనికైనా మితం వుండాలి. “అతి సర్వత్ర వర్జయేత్!" అన్నారు.

భీముడు : (నాటకంలో వేషధారి వలె) చిలుకా! ఓ రామచిలుకా! నీ చిలక పలుకులతో మమ్ము చికాకు పెట్టవలదు!

ద్రౌపది : (నవ్వి) నావి చిలుక పలుకులా?

భీముడు : (పాత ధోరణిలో) మొలక నవ్వుల ఓ చిలుకా! నీ ముద్దు పెదవులనుంచి రావలసినవి చద్దిమాటలుకావు.

ద్రౌపది : (మరింతగా నవ్వి) వేషాలు కట్టడం మనకు కొత్త కాదులెండీ!

భీముడు : రంగురంగుల ఓ చిలుకా! రమ్యమైన ఓ చిలుకా! నీ కొరకై ఈ పురుష సింహమొకసారి చీర సింగారించవలసి వచ్చింది!

ద్రౌపది : (చేతిలోని పళ్ళెం భీముని ముందు పెడుతూ, చెంత కూర్చుంటూ) మీ నాటకం మరి చాలు లెండి!

భీముడు : (పక్క కొదుగుతూ) నీకు పుణ్యం వుంటుంది! కాస్త దూరంగా జరిగి కూర్చో! (ముక్కుపై వేలు వేసుకుంటూ) నాకు సరిపడని వాసనేదో వస్తున్నది.

ద్రౌపది : ఏమి వాసన?

భీముడు : పోయిన పన్నెండు నెలలుగా నీవు నేర్చుకు వచ్చిన శ్రీరంగ నీతుల వాసన!

ద్రౌపది : (తిరిగి నవ్వి, ముక్కుపై వేలువేసుకుంటూ) అగ్రజులను ఆక్షేపిస్తున్నారా?

భీముడు : అప్పుడప్పుడు వింటేనే ఆయన శ్రీరంగనీతులను నేను తట్టుకోలేను! ప్రతి నాలుగేళ్ల తర్వాత పన్నెండు నెలలపాటు ఏకధాటిగా వాటిని నీవు ఎలా భరించగలుగుతున్నావో ఆ పరాత్పరుని కెరుక!

ద్రౌపది : (చిరునవ్వుతో) మీ మాటల కేమిలెండి! మనను కాపాడుతున్నది ఆయన ధర్మదీక్షే!

భీముడు : ఔనౌను! దానికి మూడు కోరలుండబట్టి అది మనను కాపాడుతున్నది.

ద్రౌపది : కోరలేమిటి? ధర్మానికి కోరలుంటాయా

భీముడు : కోరలు లేని ధర్మం బోసినోటి పులి

ద్రౌపది : అయితే, మీ అన్నగారి ధర్మానికున్న మూడు కోరలేవో?

భీముడు : ఒకటి నా గద. రెండవది పార్థుని గాండీవం.

ద్రౌపది : మరి మూడవది?

భీముడు : అది నీ నాల్క! :

ద్రౌపది : కోరవలె నా నాల్క కరుకైనదా?

భీముడు : దాని కరుకుతనం ఏ కోరకూ వుండదు.

ద్రౌపది : నా పాడు నాల్కతో మిమ్ము ఎంతగా నొప్పించానో లెండి!

భీముడు : అది ముందు నొప్పించినా, తర్వాత ఒప్పిస్తుంది. అయిదూళ్ళతోనో, అయిదిళ్ళతోనో మా అన్నగారు సంతృప్తి పడి, సంధి సేసుకోకుండా ఆకట్టింది అమోఘమైన నీ నాల్కే!

ద్రౌపది : చాల్లెండి – మాటలు నేర్చారు!

భీముడు : నేర్పేవారున్నపుడు నేర్చుకునేవారుండరా?

ద్రౌపది : (చిరునవ్వుతో) మాటలు నేను నేర్పగా, తిండి మా హిడింబి నేర్పిందా?

భీముడు : అది మనకు ఏ గురుశుశ్రూష లేకుండా పుట్టుకతోనే పట్టుపడిన విద్య!

(ద్రౌపది నవ్వుతుండగా వ్రేల్చిన ఒక మాంసఖండాన్ని సగం కొరికి, మిగిలిన సగాన్ని ద్రౌపది నోటికి అందించబోతాడు.)

ద్రౌపది : నాకు వద్దు! మీరే తినండి!

భీముడు : అన్నట్టు, నీవింకా మడి విప్పలేదు కాబోలు!

ద్రౌపది : మడేమిటి?

భీముడు: శ్రీరంగనీతుల మడి!

ద్రౌపది : మడులూ లేవు, దడులూ లేవు.

భీముడు : లేకపోవడమేమిటి? (ఆమె పైట చెంగును తాకుతూ) మంచు ముద్దలా ఎంత చల్లగా వున్నది. ఇది మడి బట్ట తడి కాదూ? (ద్రౌపది నవ్వు. మరొకసారి ఆమెను వేలితో తాకి, బాధ నటిస్తూ) దడి ముల్లు గుచ్చుకుని – చూడు, రక్తమెలా చిమ్ముర్చుతున్నదో!

ద్రౌపది : (విచారాన్ని నటిస్తూ) అయ్యో పాపం! ఎంత ప్రమాదం! ఎంత ప్రమాదం!

భీముడు : జాలి గొలిపేదే నా బ్రతుకు! ఆ నారద మహర్షి ఎక్కడ తగల బడ్డాడో! ఒకసారి దర్శన మిచ్చినా బాగుండును!

ద్రౌపది : ఇప్పుడు ఆయనతో మీకేమి పని!

భీముడు : ఒక విజ్ఞాపన చేసుకోవాలి.

ద్రౌపది : ఏమని?

భీముడు : మా వంతుల వరస తప్పించి, నాకు మూడవ స్థానమివ్వలేవా, మహాప్రభో!" అని.

ద్రౌపది : (నవ్వుతూ) వరస తప్పించడం దేనికి?

భీముడు : నా వంతు పన్నెండు నెలలలో మొదటి ఆరు నెలలు శ్రీరంగనీతుల పీడ తప్పడానికి!

ద్రౌపది : (కోపాన్ని నటిస్తూ) మీకు పీడ దేనికి లెండి! - ఇప్పుడు వెళ్ళి, ఆరు నెలల తర్వాతనే రండి!

(లేచి, లోపలికి వెళ్లబోతుంది.)

భీముడు : (తాను కూడా చరాలున లేచి, ఆమె దారికి అడ్డంగా నిలిచి) వెళ్లడానికి వీల్లేదు. ఇది యువరాజుల ఆజ్ఞ!

ద్రౌపది : దాన్ని మహారాష్ట్ర ఉపసంహరిస్తున్నది.

భీముడు : ఇది పతి దేవుల ఆదేశం!

ద్రౌపది : దాన్ని సతీమణి తిరస్కరిస్తున్నది.

భీముడు : ఇది ప్రియుని కన్నీటి విన్నపం!

ద్రౌపది : దాన్ని ప్రియురాలు మన్నిస్తున్నది!

(కిలకిల నవ్వులతో ఉభయులు తిరిగి భద్రాసనంపై దగ్గరిగా కూర్చుంటారు)

భీముడు : (కలశాన్ని అందుకుని) ఈ పానీయం కొంచెం సేవిస్తారా?

ద్రౌపది : నా కోర్కె చెల్లిస్తే!

భీముడు : ఏమిటది?

ద్రౌపది : చెల్లిస్తామని ముందు వాగ్దానం చేయండి తర్వాత చెబుతా!

భీముడు : బుద్ధి చెప్పి పంపవలసిన జయద్రథుడెవడో కొత్తగా తటస్థ పడలేదు గదా?

ద్రౌపది : (నవ్వుతూ) లేదు.

భీముడు : అయితే, ఇంకొక కీచకుని వధించాలా?

ద్రౌపది : నన్ను కన్నెత్తి చూడ్డానికి ఏ కీచకుడు ఇప్పుడు సాహసించలేదు.

భీముడు : మరొక దుశ్శాసనుని గుండెలు చీల్చాలా?

ద్రౌపది : నా పేరు వింటేనే ఎందరు దుశ్శాసనులైనా ఇప్పుడు గిజగిజలాడతారు!

భీముడు : వేరొక దుర్యోధనుని తొడలు విరగగొట్టాలా?

ద్రౌపది : దుర్యోధనులిప్పుడు నా దాసాన దాసులు!

భీముడు : తిరిగి సౌగంధి కొలను తెచ్చి పెట్టాలా?

ద్రౌపది : ఇప్పుడవి నా కాసరంలో కోకొల్లలు!

భీముడు : అయితే, మరేమిటి?

ద్రౌపది : వాగ్దాన మివ్వడానికి మీ కింత భయం దేనికి?

భీముడు : భయమా? అది మనకు ఇంటా వంటా లేదు.

ద్రౌపది : అయితే వాగ్దానం ఎందుకు ఇవ్వరు?

భీముడు : మా అన్నగారి శ్రీరంగనీతులను ఆక్షేపించరాదని కొట్టబోవుగదా? అది మా వల్ల కాదు.

ద్రౌపది : మీ అన్నగారికి మీరంటే ఎంత ప్రేమో మీకు తెలియదు!

భీముడు : ఔనౌను! ఆయన గీసిన గీత దాటనంత వరకు చాలా ప్రేమ!

ద్రౌపది : అంతేనా?

భీముడు : మరెంత? దేనికి?

ద్రౌపది : అయితే, ఆయన పట్ల అపార భక్తి విశ్వాసాలు చూపిస్తారు

భీముడు : ఎందుకో నాకే తెలియదు! ఆయన యెదట పడేసరికి ఈ పెద్ద పులి కూడా పిల్లికూన అయిపోతుంది! నా ఈ పెంకితనమే మళ్ళీ మనకు ముప్పుతిప్పలు తేవచ్చు.

ద్రౌపది : అదేమిటి?

భీముడు : ఆ పుట్టుగ్రుడ్డి పలుకే తిరిగి శాసనమై చెల్లుతున్నదిగా!

ద్రౌపది : ధృతరాష్ట్ర మహారాజులను అంతమాట అనవచ్చునా?

భీముడు : "పుట్టుగ్రుడ్డి" అనడం తప్పైతే "జనుషాంధుడు" అంటాలే!

ద్రౌపది : పాపం! ఆయనను చూస్తేనే ఇప్పుడు జాలి వేస్తున్నది. దేనికండీ ఆయనపై మీకింత కోపం?

భీముడు : నాకు కోపం దేనికో తర్వాత చెబుతాను; నీకు జాలి దేనికో ముందు చెప్పు

ద్రౌపది : ఆయన ఎంత దౌర్భాగ్యస్థితిలో పడిపోయారో మీకు తెలియదా! దేనికి? నేను చెప్పడం -

భీముడు : అయితే, అందుకు బాధ్యులెవరు? తానే కాదా?

ద్రౌపది : ఇప్పుడు ఆ పాత విషయాలను త్రవ్వడం దేనికి లెండి! అయినదేదో అయిపోయింది!

భీముడు : ఆ తర్వాత మాట - "కానున్న దేదో కాక మానదు!" ఈ శుష్కవేదాంతాన్ని నమ్ముకుంటే మళ్ళీ మనం భిక్షాటన

చేసుకోవలసి వస్తుంది!

ద్రౌపది : ఆ! మీవన్నీ విడ్డూరపు మాటలు!

భీముడు : నీకు తెలియదేమో కాని, చచ్చిన తన కుమారులకు పిండ ప్రదానాల పేరుతో ఆయన మన రాజకోశాగారాన్ని అడ్డమైన వాడికీ అదేపనిగా దోచిపెడుతున్నాడు! ఆయన గోదానాలు, భూదానాలు, సువర్ణదానాలు నానాటికి మితిమీరి పోతున్నాయి. అయినా, ఈయనున్నారే - మన యుధిష్ఠర చక్రవర్తులు - వీరు అడ్డు చెప్పడం లేదు. "ఓహోహో! అజాత" శత్రువులంటే వీరే! ఆ బలిచక్రవర్తులంటే వీరే!!" అని లోకం తనను మెచ్చుకోవాలని కాబోలు, ఆయన ఒకటి యివ్వమంటే, వారు పది యిస్తున్నారు!

ద్రౌపది : ఇస్తే మాత్రం మనకు వచ్చిన లోపమేమిటి లెండి! కురువృద్ధులందరు వెళ్ళిపోయారు, మిగిలింది ఒక్క ధృతరాష్ట్రులే! ఆయన మనశ్శాంతికై మనం ఏమైనా సరే చేయవలసిందే!

భీముడు : ఆయన మనశ్శాంతి! మన చేత తిరిగి తిరిపమెత్తిస్తే తప్ప ఆ దుష్ట బుద్ధికి మనశ్శాంతి సిద్ధించదు. సరే! - ముందు ఈ భీమ సేనులకు ఇప్పుడు మనశ్శాంతి కావాలి! మరొక మధుకలశం ప్రసాదించండి!

ద్రౌపది : ముందు ఈ మాట చెప్పండి - నాకు వాగ్దానమిస్తారా, లేదా?

భీముడు : ఇవ్వక నాకు తప్పుతుందా? సరే, నానుంచి ఏమి కావాలో చెప్పు!

ద్రౌపది : మరేమి లేదు. మీకు పుణ్యం వుంటుంది. నా మాట విని పానీయంలోనైనా కాస్త మితంగా వుండండి! ఈ పూట భోజనం చేస్తూ ఎన్ని కలశాలు సేవించారో తెలుసా?

భీముడు : కలశం పైకెత్తితే మనకు కనబడేవి చుక్కలు, లెక్కలు కావు.

ద్రౌపది : ఇందాక భోజనం చేస్తూ పదిహేడు; ఇప్పుడు ఫలాహారం చేస్తూ (భీముని సమక్షంలోని కలశాన్ని వేలితో చూపుతూ) దీన్ని కూడా కలుపుకుంటే పది!

భీముడు : గణితశాస్త్రంలో నీకింత పాండిత్యం వున్నట్టు మాకు తెలియదే!

ద్రౌపది : దేనికైనా ఒక మితం వుండాలి. మా చెల్లెలు జలంధర చెప్పింది - ఇప్పుడు మీరు కలశాల మధ్యనే కాలక్షేపం చేస్తున్నారని.

భీముడు : ఆ కాశీరాజు పుత్రిక తప్పులెన్నడంలో చాలా గొప్పదిలే! ఇక్కడికి ఆమెగారు ఎప్పుడు వేంచాశారేమిటి?

ద్రౌపది : నిన్న సాయంత్రం!

భీముడు : తెల్లవారితే నీ నగరులో నేను ప్రవేశిస్తానని తెలుసు కాబట్టి, నిన్న సాయంత్రమే వచ్చి నా పై నేరాలు మోపి వెళ్లిందన్న మాట! సరే! నేరస్థుని విచారించి తీర్పు చెప్పండి!

ద్రౌపది : (వెంటనే లేచి, అక్కడి భద్రాసనాలన్నింటిలో ఉన్నతమైన దానిపై న్యాయమూర్తి ఠీవితో కూర్చుని, అభియోగపత్రాన్ని చదువుతున్నట్టు నటిస్తూ) హస్తినాపురపు నివాసులు, పాండుమహారాజుల ద్వితీయ పుత్రులు, కురు సామ్రాజ్య యువరాజులు అయిన శ్రీ భీమసేనులపై మహారాణి ద్రౌపదిదేవిగారికి కాశీరాజ పుత్రిక, భీమసేనుల ద్వితీయ కళత్రం అయిన జలంధరాదేవి సమర్పించుకొన్న అభియోగపత్రము. మహారాణీ! యువరాజులు మద్యపానప్రియులను విషయము జగద్విదితము. వారి ఈ మద్యప్రియత్వము నానాటికి పెరిగిపోవుచున్నది. ప్రస్తుతము వారు మద్యకలశాల మధ్య అహోరాత్రములు గడపు చున్నారు. రాచ కార్యములను వారు పూర్తిగా నిర్లక్ష్యము చేయుచున్నారు. క్రమక్రమముగా వారి ఆరోగ్యము సన్నగిల్లుచున్నది. మితిమీరి పోవుచున్న మద్యపానము నుండి వారిని నిరోధించుటకు నేను ప్రయత్నము చేయుచుండగా వారు నా పై కోపమువహించి, అప్పుడప్పుడు నా పట్ల క్రూరముగా ప్రవర్తించుచున్నందున, సమస్త విషయములను సవినయముగా మహారాజ్ఞికి ఇందుమూలముగా నివేదించు కొనడమైనది. (అభియోగపత్రాన్ని మడత పెట్టి, ఒక వైపున వుంచుతున్నట్టు నటన చేసి) అభియోగ పత్రమును వింటివా? ఇందుపై ఏమి చెప్పుకొనగోరు చున్నావు?

భీముడు : (తన స్థానంలో కూర్చునే) నేను నిర్దోషిని.

ద్రౌపది : (కోపాన్ని నటిస్తూ) ఇది న్యాయస్థానము! న్యాయమూర్తి నిన్ను విచారించుచున్నారు. న్యాయమూర్తి సమ్ముఖమున ముకుళిత హస్తములతో నిలబడవలెనని, వినమ్రముగా సమాధానము చెప్పుకొనవలెనని హెచ్చరించుచున్నాను!

భీముడు : (లేచి, చేతులు కట్టుకుని నిలబడుతూ) నన్ను మన్నింపుడు.

ద్రౌపది : మంచిది! మన్నించితిమి! నీవు మితిమీరి మద్యపానము చేయుచుంటివా?

భీముడు : అంతగా మితిమీరుట లేదు.

ద్రౌపది : కొంతగా మితిమీరుచున్నావని నీ పలుకుల తాత్పర్యమా?

భీముడు : చిత్తము.

ద్రౌపది : అట్లు ఎందుకు చేయుచుంటివి?

భీముడు : సకారణముగనే!

ద్రౌపది : సకారణముగనా? ఆ కారణమెద్దియో న్యాయమూర్తికి నివేదించుకొనుము.

భీముడు : దుశ్శాసనుని వధానంతరము నా ఉదరకోశములో తీవ్ర జ్వాలలు చెలరేగుచున్నవి.

ద్రౌపది : అతనిని వధించి ప్రతిజ్ఞా పాలనము చేసుకొన్నందున నీ కోపజ్వాలలు చల్లారియుండవలసినది కాదా? చల్లారుటకు మారుగా, అవి ప్రజ్వలించుట ఎట్లు సంభవించినది?

భీముడు : కోపజ్వాలలు చల్లారగా, అంతకంటే తీవ్రమైన కొత్త జ్వాలలు లేచినవని న్యాయమూర్తులకు నా విన్నపము.

ద్రౌపది : కొత్త జ్వాలలా? వాటి స్వభావమును వివరింపుము.

భీముడు : దుశ్శాసనుని రొమ్ము చీల్చి, అతడి రక్తమును నేను దోసిళ్ళతో డ్రాగినట్టు న్యాయమూర్తి వినియుందురు. ఆ దుష్టాత్ముని రక్తము విషప్రాయమై నన్ను దహించివేయుచున్నది. ఆ బాధోపశమనముకై నేను పూర్వము కంటే కొంత అధికముగనే మద్యమును సేవించుచున్నాను!

ద్రౌపది : (చప్పున తన స్థానంలో లేచి, భీముని వద్దకు వచ్చి, రెండు భుజాలపై చేతులు వేసి, గొంతుతో) ఇది నవ్వులాటా? నిజమా?

భీముడు : నిజమే!

ద్రౌపది : ఖలునికి నిలువెల్లా విషమంటారు. సందేహం లేదు విషపూరితమైన వాడి రక్తమే మీ శరీరాన్ని దహించి వేస్తున్నది. నా మాట విని, వెంటనే రాజవైద్యులను పిలిపించండి. వారేదైనా విరుగుడు చెబుతారేమో!

భీముడు : ఉహు! ఇది ఓషధాలకు లొంగే రుగ్మత కాదు.

ద్రౌపది : అదేమిటండీ!

భీముడు : క కొద్దీ ఏమో చేసాను గాని, ఇప్పుడు నేను కూర్చున్నా నిలుచున్నా, ఆ దృశ్యమే కళ్ళకు కట్టినట్టు కనబడుతూ వుంటుంది. నిద్రలోనూ అదే!

ద్రౌపది : పాపిష్టిదాన్ని! నా వల్లే మీకు... (దుఃఖం పెల్లుబికి రాగా మాట మధ్య ఆగిపోతుంది.)

భీముడు : (ద్రౌపది చెక్కిళ్ళపై కన్నీటిని తన చేతితో తుడుస్తూ) అబ్బే! ఏమీ లేదు! నిన్ను అనవసరంగా కలత పెట్టినట్టున్నాను. నాకే? నేను నిక్షేపంలా వున్నాను. (వంగి, మధుపాత్రను అందుకుని దాన్ని ఖాళీ చేసి) ఇలా కూర్చో! (రెక్క పుచ్చుకుని ఆమెను ఒక భద్రాసనం వద్దకు తీసుకు వెళ్ళి, దానిపై కూర్చోబెట్టి, తాను ఆమె సరసన కూర్చుంటూ) జలంధర నాపై మరేమైనా నేరాలు మోపిందా?

ద్రౌపది : లేదు.

భీముడు : గత వారం మా అన్నగారితో గట్టిగా వివాదపడ్డాను. ధృతరాష్ట్రుని ప్రేరణపై ఆయన చేస్తున్న దానధర్మాలు మితిమీరిపోతున్నాయని, ఆయన ఈ ప్రస్తావన నీ వద్ద తెచ్చారా?

ద్రౌపది : లేదు.

భీముడు : తేవలసిందేనే! ఎందుకు ఊరుకున్నారో!

ద్రౌపది : ఆయన మాటకేమి గాని, మీ సంగతి చెప్పండి. విషతాపంలాంటిది మిమ్ము బాధిస్తున్నదా?

భీముడు : అబ్బే! లేదు! ఊరికే అన్నాను.

ద్రౌపది : ఊరికే అన్నారా?

భీముడు : ఔను! నీవు నాటకం నడుపుతున్నావని హాస్యోక్తిగా నేనన్న దానికి ఇంతగా బెదిరిపోవాలా?

ద్రౌపది : అది హాస్యోక్తి మాత్రమేనా?

భీముడు : కాక?

ద్రౌపది : అనవసరంగా నన్ను ఎంత కలత పెట్టారండీ!

భీముడు : సరేగాని, మరికాస్త ఫలాహారం తెస్తావా?

ద్రౌపది : తిరిగి తేవలసిందేనా? (ఈ మాటలు అంటూనే లోపలికి వెడుతుంది.

(భీముడు తన స్థానంలో నుంచి లేచి, పచార్లు చేస్తూ వుంటాడు. కొన్ని క్షణాల తర్వాత ద్రౌపది ఫలాహారంతో తిరిగి ప్రవేశిస్తుంది)

భీముడు : (పచార్ల మధ్య ఆగి, ద్రౌపది వంక చూస్తూ) దాని పట్ల ఇంత నిర్దయదేనికి?

ద్రౌపది : అదేమిటి?

భీముడు : ఫలాహారం అంటే కేవలం దాన్నే తెస్తారా?

ద్రౌపది : మరేమి తెస్తారు?

భీముడు : "అన్న పానీయా" లని పెద్దలన్నారు. అన్నంతోపాటు పానీయాన్ని కూడా తీసుకురావద్దా?

ద్రౌపది : దీన్ని మీరు తింటే తినండి, మానితే మానండి, మరి నేను మధువును తెచ్చేది లేదు, లేదు, ముమ్మాటికీ లేదు.

భీముడు : అంతేనా!

ద్రౌపది : మరెంత? దేనికైనా ఒక మితం వుండాలి.

(చేతిలోని ఫలాహారాల పళ్ళెరాన్ని పాతదాని ప్రక్కగా పెడుతుంది)

భీముడు : నా ముచ్చట తీర్చిన తర్వాత నీవు చెప్పదలచిన నీతులను చెప్పరాదా?

ద్రౌపది : అందువల్ల ఫలితం?

భీముడు : (తాను నిలబడివున్న చోటనే హఠాత్తుగా మోకరిల్లి, ప్రార్థన చేస్తున్నట్టుగా, రెండు చేతులు జోడించి, కళ్ళు సగం మూసుకుని) ఓ నారద మహర్షీ! ఎక్కడున్నావయ్యా, నీవు?

ద్రౌపది : (గొంతు మార్చి) "హరి నారాయణ! హరి నారాయణ! హరే! హరే! వత్సా! నీ భక్తిని మెచ్చితిమి! ఏమి కావలెను?

భీముడు ; కోరిన వరమును రాము ప్రసాదింతురా, దేవా?

ద్రౌపది : అవశ్యము!

భీముడు : ఆడిన మాటను తప్పరుగదా?

ద్రౌపది : ఈ సందేహము మాపట్ల ఘోరాపచారము! కోపముతో మేము తిరోధానము కానున్నాము!

భీముడు : దేవా! దేవా! కోపగింపకుడు!

ద్రౌపది : మంచిది! నిన్ను క్షమించుచున్నాము. నీకు కావలసిన వరములను కోరుకొనుము!

భీముడు : నా కొక్క వరమే చాలును!

ద్రౌపది : ఆలసించక దానిని నివేదించుకొనుము!

భీముడు : మహర్షీ! మీ భక్తునికి పాంచాలి శ్రీరంగనీతుల బాధ నుండి శాశ్వతముగా విముక్తిని ప్రసాదింపుడు!

ద్రౌపది : నీతి పైనే నిఖిల జగత్తులు నిలిచియున్నవి, నాయనా!

భీముడు ; నీతికి, శ్రీరంగనీతికి భేదము లేదా, స్వామీ!

ద్రౌపది : లేకేమి, వత్సా? లేకేమి?

భీముడు : నేను రక్షణ కోరుచున్నది శ్రీరంగనీతి నుండియే!

ద్రౌపది : దానిని నీకు సంతోషముగా ప్రసాదించుచున్నాము!

భీముడు : ధన్యోస్మి! ధన్యోస్మి!

(నవ్వుతూ కలశాన్ని ఒక్కగుక్కతో ఖాళీ చేస్తాడు)

ద్రౌపది : నాకు భాగం పెడతామన్నారు! !

భీముడు : మరొక కలశం తీసుకురా! చెరిసగం పంచుకుందాము

ద్రౌపది : మరి నేను తీసుకురాకే!

భీముడు : అందుకే అర్జునుడంటే నాకు చెడ్డ అసూయ!

ద్రౌపది : అసూయ దేనికి? :

భీముడు : ధర్మముద్రతో దేవతా విగ్రహం వలె నా వద్దకు వస్తావు; ప్రణయ ముద్రతో ప్రౌఢనర్తకివలె అతని వద్దకు వెడతావు!

ద్రౌపది : అయితే, నన్నొక కొత్త అవతార మెత్తించే తమ ప్రజ్ఞ సామాన్యమైందా? (నవ్వుతుంది)

భీముడు : (బ్రతిమాలుతున్నట్టు) అంతటి ఈ ప్రజ్ఞానిధికి పారితోషికంగా మరొక్క కలశం!

ద్రౌపది : రేపటి వరకు తిరిగి అడగరాదు!

భీముడు : అయితే, మరి మూడు!

ద్రౌపది ; కాదు, ఒక్కటి!

భీముడు : పోనీ, మధ్యస్థంగా రెండు!

ద్రౌపది : మధ్యస్థాలు, గిధ్యస్థలు ఈ మహారాజ్ఞికి మనస్కరించవని తమకు తెలియదా?

భీముడు : అయితే, ఈ యువరాజు ప్రభువులు ప్రస్తుతానికి తను పిపాసను ఒక కలశంతోనే తీర్చుకుంటారు!

ద్రౌపది : ప్రస్తుతం లేదు, అప్రస్తుతం లేదు - రేపటి వరకు తిరిగి అడగరాదు!

భీముడు : సరే! తమ చిత్తం; మా ప్రాప్తం!

(ద్రౌపది మధుకలశానికై లోనికి వెడుతుంది. భీముని దృష్టి తిరిగి ఫలాహారం పళ్ళెంపై లగ్నమౌతుంది.)

ద్రౌపది : (కలశంతో తిరిగి వస్తూ, ఆవలిస్తున్న భీముని చూచి) నిద్రాదేవత అప్పుడే మిమ్ము వరిస్తున్నదా?

భీముడు ; ఆ జీవితేశ్వరి విలంబాన్ని సహించలేదు.

ద్రౌపది : ఆమె మీ పంచమ కళత్రం! మీకు ప్రియతమ!

భీముడు : పంచమ కాదు, ప్రధమ! ఓం ప్రథమంగా మమ్ము వరించిన ప్రేమస్వరూపిణి! (ద్రౌపది నవ్వు) తమ అమృత హస్తంతో ఆ సువర్ణకలశాన్ని ఇలా దయచేయించండి! (చిరునవ్వుతో మధుకలశాన్ని భీముని ముందు పెట్టి, అతని సరసన ద్రౌపది కూర్చుంటుంది. ఆమె కూర్చుండబోతుండగానే కలశాన్ని చేత బట్టుకుని భీముడు లేస్తాడు.) :

ద్రౌపది : మంచి మర్యాదస్తులే - నేను ప్రక్కకు వచ్చి కూర్చోగానే లేచిపోతారా? -

భీముడు : (ఆమె మాట వినిపించుకోనట్టు, కలశాన్ని ఒక్క గుక్కలో ఖాళీ చేసి, దాన్ని బల్ల పై వుంచి, ద్రౌపది రెక్కపుచ్చుకుని, ఆమెను శయ్యవైపుకు లాక్కుపోతూ) దేవీ! నిద్రాదేవీ! నా ప్రాణప్రియా! వచ్చుచున్నాను, ఇదే వచ్చుచున్నాను.

(కిలకిల నవ్వుతూ, తన చేతిని విడిపించుకొనడానికి ప్రయత్నిస్తున్నట్టు ద్రౌపది నటన చేస్తుండగా - తెర)

(వాడిపోతున్న పూలమాలపై ద్రౌపది చన్నీటిని చిలకరిస్తుండగా తెర లేస్తుంది. ఆ తర్వాత ఆమె సుగంధ కలశాన్ని పరిశీలించి, దాన్ని కూడా తడిచేస్తుంది. దాదాపు పూర్తిగా కాలిపోయిన అగరువత్తులను తీసివేసి, కొత్త వాటిని వెలిగిస్తుంది. ఆ తర్వాత దాచుకోలేని అశాంతితో శయ్యాగారంలో నడయాడుతుంది. ద్వారం గుండా, గవాక్షం గుండా రెండు, మూడుసార్లు బయటికి తేరిపార జూస్తుంది. మధ్యలో ఒకసారి నిలువుటద్దం వద్దకు వెళ్ళి, నుదుటి పై తిలకాన్ని, సిగలోని పువ్వులను సరిదిద్దుకుంటుంది. ఆమె తిరిగి గవాక్షం గుండా చూస్తుండగా అర్జునుడు ప్రవేశిస్తాడు. అడుగుల చప్పుడును బట్టి, ఆయన వచ్చినట్టు తెలుసుకున్నా వెనుదిరిగి చూడదు. ఆమె వాలకాన్ని చూచి, తనపై అలిగి వున్నట్టు అర్జునుడు గ్రహిస్తాడు. ఆమె దని ఆకర్షించడానికి ఒకటి రెండుసార్లు పొడిదగ్గు దగ్గుతాడు. అప్పటికీ ఆమె వెనుదిరిగి చూడక పోగా, చెంతకు వెడతాడు)

అర్జునుడు : (ద్రౌపది వెనక నుంచి, తాను కూడా గవాక్షంలో నుండి వెలుపలికి చూస్తూ) పున్నమ రేయిలో పులకరిస్తున్న పుష్పవనాన్ని చూస్తున్నావా? (ద్రౌపది పలకదు, కొన్ని క్షణాలు ఆగి) కాలంకాని కాలంలో ఆ నల్లని మబ్బు ఎక్కడ నుంచి దాపురించిందో! (ద్రౌపది మౌనం, మరికొన్ని క్షణాలు తర్వాత) ఆ మబ్బు తెర తొలగిపోతేనే, మళ్ళీ మనకు పాలవెన్నెల!

(ద్రౌపది గిర్రున వెనక్కు తిరిగి, ఇవతలికి వచ్చి, భద్రాసనంపై కూర్చుంటుంది. తనను అనుసరించి వచ్చిన అర్జునుడు సరసన కూర్చోగా పెడముఖం పెడుతుంది)

అర్జునుడు : ఎందుకంత కోపము? (ద్రౌపది పలకదు, మరికొంత దగ్గరికి జరుగుతూ) పూర్ణ చంద్రోదయాన్ని కలిసి చూడవచ్చు. 'సంజవేళకు ముందుగానే రండి" అని నీవు చెప్పిన మాట నేను మర్చిపోలేదు.

(ద్రౌపది మారు పలకకపోగా, ఆమె ముఖాన్ని తన వైపుకు త్రిప్పుకుంటూ)

చంద్రోదయాన్ని చూపలేదన్న విచారం నాకు దేనికి? కోపంతో ఎర్రబారిన నీ ముఖాన్ని చూస్తుంటే, ఉదయిస్తున్న పూర్ణచంద్రబింబాన్ని చూస్తున్నట్టుగానే వున్నది! (చెక్కిళ్ల వెంట ద్రౌపది కన్నీటి చుక్కలను జలజల రాల్చుతుంది.)

అర్జునుడు : కోపమే కాదు, బాధ కూడా కలిగించినట్టున్నాను! ఏ పరిస్థితులలో నేను నా వాగ్దానాన్ని నిలుపుకోలేక పోయానో తెలుసుకుంటే నన్ను తప్పక మన్నిస్తావు!

ద్రౌపది : (చివాలున లేచి) నేను మన్నించగలపాటిదాన్ని కాను!

అర్జునుడు : (ఆమెతో పాటు లేచి, గడ్డం పట్టుకుంటూ) ఇంత ఆగ్రహానికి నేనేమి మహాపరాధం చేశాను? (ఆమె కన్నీటిని చేతితో తుడుస్తూ) నీ కంటి తడి చూస్తే నేనెంత తల్లడిల్లిపోతానో నీకు తెలియదా?

ద్రౌపది : అంత దయగలవారైతే ఇంత జాగుచేస్తారా?

అర్జునుడు : ఎంత జాగు! నాలుగు గడియలే కాదా?

ద్రౌపది : నాలుగు గడియలేనా? అటు చూడండి ఆ పూలమాల ఎంతగా వాడిపోయిందో! ఆ చందనం ఎంతగా యెండిపోయిందో!

అర్జునుడు : (వంగి, పూలమాల పైకెత్తి) లేకలేక ఒక కన్ను కాగా, వేయి కళ్ళు విప్పుకుని, నా దారి కాస్తున్నావా? జాగును మరి సహించలేక కంటికంటి నుంచి కన్నీరు కురిపిస్తున్నావా? నీ పట్ల నిర్లక్ష్యంతో ఆలసించలేదు; గత్యంతరం లేకనే! ఏమైనా, జరిగిన దానికి నన్ను క్షమించు! నీ క్షమకు సూచనగా నీ మృదుహస్తాలతో నా గళసీమను కౌగలించుకో!

(పూలమాలను అర్జునుడు తానే మెడలో వేసుకుంటాడు, ద్రౌపది ముఖంపై చిరునవ్వు మొలకలెత్తుతుంది.)

అర్జునుడు : (తిరిగి వంగి, గంధకలశాన్ని అందుకుని) నిన్ను కూడా క్షమాభిక్ష వేడుకుంటున్నాను. నా పక్షాన పాంచాలిని ప్రార్థించు. నీ శీతల స్పర్శతో ఆమె కోపాగ్ని జ్వాలను చల్లార్చు.

(అంగుళీయంతో చందనాన్ని తీసి, ద్రౌపది చుబుకానికి పూస్తాడు)

ద్రౌపది : మరి చాలులెండి - సంతోషించాం! ఎంతకూ రాకపోతే, ఎక్కడికి వెళ్ళారో, ఏమో అని నేనెంత భయపడిపోయానో మీకేమి తెలుస్తుంది!

అర్జునుడు : (సుగంధ కలశాన్ని యథాస్థానంలో వుంచి, రెక్క పట్టుకుని ద్రౌపదిని భద్రాసనం పైన నెమ్మదిగా కూర్చోపెట్టి, ఆమె సరసన తాను కూర్చుంటూ) నన్ను గురించి భయం దేనికి? నాకు రాగల ప్రమాదాలు లేవే!

ద్రౌపది : లేకేమి? ఏ గంగలోనో మీరు స్నానం చేస్తుంటే, మరొక ఉలూచి హఠాత్తుగా రావచ్చు; అమాంతంగా మిమ్ము నాగభూమికి యెత్తుకుపోవచ్చు.

అర్జునుడు : (చిరునవ్వుతో) అంత పిచ్చిపిల్లలిప్పుడు లేరు.

ద్రౌపది : మరొక చిత్రాంగద మిమ్ము సమ్మోహితులను చేయవచ్చు. 'నా పుత్రునిపై నాకే అధికారం; మీకు లేదు' అనే నియమంపై మిమ్ము పరిణయమందవచ్చు.

అర్జునుడు : ఈ విధమైన విషమనియమాలకు ఎవరైనా రెండుసార్లు సమ్మతిస్తారా?

ద్రౌపది : బంధు రూపంలో మీరే మరొక సుభద్రాపహరణకై ఏ ద్వారకానగరికో తిరిగి వెళ్ళవచ్చు.

అర్జునుడు : నిజమే! బ్రాహ్మణ రూపంలో వెళ్ళి, మరొక మత్స్యయంత్రాన్ని ఛేదించినా ఛేదించవచ్చు.

ద్రౌపది : ఔను! తమ పేరే విజయులు! ఎన్ని విజయాలనైనా అవలీలగా సాధిస్తారు!

అర్జునుడు : అయితే, మరొక మత్స్యయంత్రాన్ని కూలగొట్టినా గెలుచుకొనడానికి మరొక ద్రౌపది లేదు!

ద్రౌపది : ద్రౌపదులు లేకపోతేనేమి? మీకు ప్రేయసులు తక్కువా? మీతో గడపగల భాగ్యం నాకు మరి రెండు వారాలు మాత్రమే! తిరిగి నాలుగేండ్లకు గాని నోచుకోను! అయితే, ఏ భాషా కంటబడి వుండకపోతే, నాకు చేసిన వాగ్దానాన్ని మర్చిపోయి, ఇంత జాగుచేసేవారా?

అర్జునుడు : (నేరం అంగీకరిస్తున్న వానివలె) తప్పించుకు పోదామన్నా, దొంగ దొరికిపోయాడు!

ద్రౌపది : (తల పంకిస్తూ) ఎవతి ఆ సుందరాంగి?

అర్జునుడు : పదహారు, పదిహేడేళ్ళ వయస్సు,.

ద్రౌపది : నవోఢ అన్నమాట!

అర్జునుడు : పసిడిఛాయ!

ద్రౌపది : అయితే, కుందనపు బొమ్మే!

అర్జునుడు : పెద్ద పెద్ద కళ్ళు.

ద్రౌపది : విశాలక్షి కూడానా?

అర్జునుడు : మంచి అంగసౌష్ఠవం!

ద్రౌపది : మరి వర్ణించ నక్కరలేదు లెండి! నా నూతన సపత్ని అతిలోక సుందరి!

అర్జునుడు : నాట్య విద్యలో అసాధారణ ప్రజ్ఞా ప్రాభవాలు,

ద్రౌపది : అందువల్లనే మీ మనస్సును మరింతగా ఆకర్షించింది!

అర్జునుడు : (ఒక్క క్షణం ఆగి, మాటలను నొక్కి పలుకుతూ) నూనూగు మీసాలు!

ద్రౌపది : (ఆశ్చర్యంగా) నూనూగు మీసాలేమిటి?

అర్జునుడు : పదహారు, పదిహేడేళ్ళ పడుచువానికి నూనూగు మీసాలుండవా?

ద్రౌపది : (నవ్వుతూ) నన్నెంత మాయ చేశారు!

అర్జునుడు : నా రాజ్యంలో ఎవరు నాట్య విద్య నేర్చినా ఇప్పుడు పరీక్షార్థం నా వద్దకు వస్తున్నారు! బృహన్నల అయినందుకు నాకిది శిక్ష.

ద్రౌపది : నాట్యవిద్యా పరీక్ష మీరు శిక్షగా భావిస్తారంటే నేను నమ్మకే! నాట్యాన్ని చూస్తుంటే మిమ్ము మీరే మరిచిపోతారు.

అర్జునుడు : ఆ దౌర్బల్యం నాకున్న మాట నిజమే! అందుకే ఈ పూట నీ కోపతాపాలకు గురికావలసి వచ్చింది. నేడు పరీక్షార్థం వచ్చిన యువకుడు సహజ ప్రజ్ఞాధురీణుడు. దానికితోడు గొప్ప గురువు వద్ద శాస్త్రీయ పద్ధతులలో చక్కని శిక్షణ పొందాడు. ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికాభినయాలన్నింటిలో సమానంగా ఘటికుడు. లోకధర్మిలో వలే నాట్యధర్మిలో...

ద్రౌపది : (నవ్వుతూ) తిరిగి బృహన్నల కాబోతున్నారా? అయితే ముందే చెబుతున్నాను నేను ఉత్తర కుమారుని కాలేను; మీ వద్ద నాట్యవిద్య నేర్చుకోలేను.

అర్జునుడు : ఎందుకు నేర్చుకోరాదు?

ద్రౌపది : నేర్చుకొనకపోయినా, నాకు నర్తకి అనే బిరుదు రానే వచ్చింది లెండి!

అర్జునుడు : అదెప్పుడు?

ద్రౌపది : ఎప్పుడేమిటి? కీచకుని భ్యం దుంది. ఆ పాదకలసిందిగా విరాటరా కొలువుకూటంలో నేను మొర పెట్టుకున్నప్పుడు మీ పాండవాగ్రజులు సర్వక గంట నిందించలేదా?

అర్జునుడు : ఓహో! ఆనాటి మాటా! న్ని సీఎం మంట తరుగుడు, వర! దానికేమిగాని ఆయన మాటను నీవు ఏం చేస్తే నేను ఎంతో సంగీస్తారు. ఒక ఆరునెలలు చాలు - నాట్యవిద్యలో నీవు నిధివి కావడానికి,

ద్రౌపదీ : (కన్నీటి గొంతుతో) అన్యాయపైబోయినా అయదుగురు బిడ్డలకు మారుగా మరిఅయిదుగురిని కన్న తరువాత నేర్చుకుంటాను లెండి.

అర్జునుడు : ఆ దుఃఖాన్ని మరచిపోవడానికైనా నీవు నా ముద్దు తీర్చవచ్చునే! అప్పుడు సౌతోపాటు నీవు కూడ నాట్యసభలకు రావచ్చు; పరీక్షాధికారిటీగా కూర్చోవచ్చు.

ద్రౌపది : (చిరునవ్వుతో) మరొకసారి బృహన్నల కావాలని మీకు ముచ్చటగా వున్న దేమో కాని ఆ రూపాన్ని మీరు తిరిగి ధరిస్తే నేను భరించలేను, అప్పుడు మీ పేడుమూతి చూసినా, ఆడంగి మాటలు విన్నా నాకు పుట్టెడు దుఃఖంతో పాటు పట్టరాని నవ్వు వచ్చేది.

అర్జునుడు : నాట్యాచార్యుడుగా నన్ను నీవు మెచ్చుకోకపోయినా మొదటిసారి మన చూపులు కలిసినప్పుడే నాట్యశాస్త్రంలో నీకు సహజపాండిత్యం వున్నట్టు నేను గుర్తించాను,

ద్రౌపది : అలాగా! దేన్ని బట్టి నా పాండిత్యాన్ని మీరు గుర్తింటారో సెలవిస్తారా?

అర్జునుడు : స్వయంవర సభకు నీవెంత సమయోచితంగా అలంకరించుకు వచ్చావు! పసిడి పళ్లెంలో పుష్పహారం పెట్టుకుని సభలో ప్రవేశించగానే నీకు కలిగిన లజా భయ సంభ్రమాలను కప్పిపుచ్చుకొనడానికై చేలాంచలంతో ముఖాన్ని సగం దాచుకుంటూ ఎంత లావణ్యాన్ని ప్రదర్శించావు. ఆహార్యాభినయం అంటే అదీకాక మరేమిటి?

ద్రౌపది : దానిలో యోగ్యతాపత్రం ఆనాడే నాకు ప్రసాదించారన్నమాట!

అర్జునుడు : మత్స్యయంత్రాన్ని కూలవేయడానికి కర్ణుడు ముందుకు వచ్చి, విల్లు వంచి, అల్లెత్రాడు కట్టగానే "సూతుని నేను పతిగా పరిగ్రహించనని ఉచ్చైస్వరంతో ఎంత గంభీరంగా పలికావు! ఆ పలుకులకు కర్ణుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు; అదే వాచికాభినయమంటే.

ద్రౌపది : దానిలో కూడా నేను పట్టభద్రనన్నమాట.

అర్జునుడు : నేను మత్స్యయంత్రాన్ని ఛేదించగానే తమకేదో ఘోరావమానం జరిగి నట్టు వికటాట్టహాసాలు చేసిన నృపతి

లోకం పైకి ఒక్కతృటి పాటు వెళ్ళిన నీ దృష్టిలో నిర్లక్ష్య తిరస్కారభావాలు ఎంతగా ప్రస్ఫుటమైనాయి! దాని పేరే సాత్వికాభినయం,

ద్రౌపది ; అయితే ఆంగికాభినయమేదో వివరిస్తారా?

అర్జునుడు : కల్లోలిత సముద్రంవలె స్వయంవర సభామండపం వున్నా, నిశ్చల జలనిధిపై తేలివచ్చే రాయంచవలె నీవు శ్వేతవస్త్రంతో పుష్పహారంతో నావద్దకు వచ్చి వాటిని నా మెడలో వేశావు. ఆంగికాభినయానికి అది పరాకాష్ఠ.

ద్రౌపది : (నవ్వుతూ) మీ మాటలను వింటూంటే నాట్యవిద్య మీరు నావద్ద నేర్చుకున్నట్టుగా తోస్తున్నది! అయినా నాకు గురు దక్షిణ ముట్టజెప్పనే లేదు.

అర్జునుడు : చెంతవున్నా, లేకపోయినా అనుదినం దాన్ని నీ పాదారవిందాల వద్ద సమర్పించుకుంటూనే వున్నాను.

ద్రౌపది : అనుదినం!

అర్జునుడు : ఔను! అనుదినం! ప్రతిక్షణం!

ద్రౌపది : లేదు.

అర్జునుడు : మరి నిట్టూర్పు దేనికి?

ద్రౌపది : ఆ! ఏమీలేదులెండి!

అర్జునుడు : అకారణంగా నిట్టూర్చుతారా?

ద్రౌపది : మీరు స్వయంవర సభాప్రసక్తి తెచ్చేసరికి ఏవేవో విషయాలు జ్ఞాపకానికే వచ్చాయి.

అర్జునుడు : ఏమిటవి?

ద్రౌపది : ఎందుకు పోనిద్దురూ!

అర్జునుడు : మనసు విప్పి నీవు మాట్లాడడానికి నేను తగనివాడినా?

ద్రౌపది : ఎంతమాట!

అర్జునుడు : అయితే చెప్పరాదా?

ద్రౌపది : చెప్పక తప్పదా? సరే! స్వయంవర సభామండపం నుంచి నన్ను వెంట పెట్టుకుని కుంభకారుని గృహానికి వెళ్ళిన మీరు వాకిలి తట్టిందే "అమ్మా! భిక్ష తెచ్చా" మన్నారు. లోపల ఎక్కడో పనిమీద వున్న మీ అమ్మ మీ మాటలలోని చమత్కారాన్ని గ్రహించలేక "అయితే మీ అన్నదమ్ములు అయిదుగురు సమానంగా అనుభవించండి" అనింది. ఇది మీకు జ్ఞాపకమేగా?

అర్జునుడు : మబ్బులేని పిడుగును పోలిన ఆ మాటను కావాలన్నా నేను మరిచిపోగలనా?

ద్రౌపది : తెలియకే తాను ఆ విధంగా పలికినా శుష్కంగా తానొక పలుకు పలికిన దోషం తనకు ఎక్కడ చుట్టుకుంటుందో అని మీ తల్లి విచారపడింది.

అర్జునుడు : ఔను.

ద్రౌపది : ఆమె విచారం మీకు విడ్డూరంగా తోచలేదా?

అర్జునుడు : కొంతవరకు అలాగే తోచిందే, కాని శుష్కంగా తానొక పలుకు పలికిన పాపం నిజంగానే తనకు...

ద్రౌపది : తెలియక తప్పుగా పలికినదాన్ని తెలిసిన తరువాత దిద్దుకొనక పోవడం వల్లనే ఎక్కువ పాపం చుట్టుకోదా!

అర్జునుడు : నిజమే.

ద్రౌపది : అయినా, మీ తల్లి తన తప్పును దిద్దుకోలేదంటే అందుకు అన్యకారణం లేదంటారా?

అర్జునుడు : అన్యకారణమా? ఏమిటది?

ద్రౌపది : ఎంతైనా మీరు తల్లీకొడుకులు. మీ మనస్సుకు నొప్పి కలుగుతుందేమో! నేనెందుకు చెప్పాలిలెండి!

అర్జునుడు : కలగదులే - చెప్పు!

ద్రౌపది : చెప్పవలసిందేనా?

అర్జునుడు : నిస్సందేహంగా!

ద్రౌపది : కర్ణ జనన వృత్తాంతం విన్నారుగా?

అర్జునుడు : (కొంతబాధతో) వినకేమి?

ద్రౌపది : ఆ తర్వాతనే కాదా స్వయంవరం ద్వారా ఆమె మీ తండ్రి పాండురాజును చేపట్టింది?

("ఔ" నన్నట్టు అర్జునుడు పంకిస్తాడు). వివాహం ద్వారా మరి ముగ్గురు ఆమెకు భర్తలు కాలేదా?

అర్జునుడు : అయితే?

ద్రౌపది : ఆ! ఏమీలేదు. తనవలె తనకోడలు కూడా పంచభర్తృక కావాలని మనస్సులో ఆమె కోరుకుని వుండవచ్చుకదా? (తన చెవులను తాను నమ్మలేక పోతున్నట్టు అర్జునుడు ద్రౌపది వంక చూస్తాడు) కోడలికి కూడా అయిదుగురిని కట్టబెట్టేసరికి లోకం తనవైపు వేలెత్తి చూపడం తగ్గిపోలేదా?

అర్జునుడు : ఇంత దురాలోచన మా అమ్మ నిజంగానే చేసిందంటావా?

ద్రౌపది : ఏమో! అది మీకు తెలియాలి. ధర్మపరులైన మీ అన్నగారికి తెలియాలి. ఆయన మీ అమ్మమాటలకు తాళం వేస్తూ పోయారుగా !

అర్జునుడు : ఏ మాటకామాటే చెప్పాలి. మొదట ఆయన మా అమ్మతో "ఈమె పార్థుడు జయించి తెచ్చిన కన్య, ఈమెను అతడు పరిణయమాడడమే సమంజసం" అన్నారు".

ద్రౌపది : అనలేక, అనలేక మొదట ఆ కాస్త ముక్క అన్నారనుకోండి. అంతట మీరేమన్నారు?

అర్జునుడు : అపుడు నామనస్సులో పెద్ద తుఫాను రేగుతున్నది; నానోట మాట పెగలి వుండకపోవచ్చు.

ద్రౌపది: లేదు. "అన్నలిద్దరు అవివాహితులై యుండగా నేను వివాహం చేసుకోవడం భావ్యం కాదు, మీ వివాహాలయ్యేవరకు నేనూ, పాంచాలీ వేచివుంటా" మన్నారు.

అర్జునుడు : ఆమాట నేనన్నానా?

ద్రౌపది : లేదు. (నిట్టూర్చుతూ) ఔను! తక్కిన మాటలన్నీ వినబడినా మీ అన్నగారికి ఈ ఒక్కదాని వద్దకు వచ్చేసరికి పుట్టెడు చెముడు వచ్చింది.

అర్జునుడు : (అశాంతితో చప్పున లేచి నిలబడుతూ) అప్రియమైన పలుకులు ఇప్పటికైనా ఆయనకు వినపడవు.

ద్రౌపది: (తాను కూడా లేచి, అర్జునునికి దగ్గరగా నిలిచి) మీకు అప్రియమైతే కావచ్చుగాని, మరొకసత్యాన్ని బయటపెట్టడం లేదా? మీరు ఏ క్షణాన మత్స్యయంత్రాన్ని కూలవేశారో ఆ క్షణం లోనే ఆయనకు మీ పై అసూయ పుట్టింది.

అర్జునుడు : ఇది మరీ అన్యాయపు మాటేమో!

ద్రౌపది : అయితే, ఈ మాటకు బదులు చెప్పండి, బ్రాహ్మణ వేషంలో వున్న మిమ్ము నిజంగానే బ్రాహ్మణ యువకునిగా భావించి తాము కూలవేయ లేకపోయినా మత్స్యయంత్రాన్ని మీరు కూలవేసినందుకు క్షత్రియ లోకం ఒక్కుమ్మడిగా మీపై ఘీంకారం చేయలేదా?

అర్జునుడు : ఔను!

ద్రౌపది : అది మీకు ప్రమాదసమయం కాదా? అయినా, సరిగా అపుడే నకుల సహదేవులను వెంట పెట్టుకుని మీ ధర్మరాజులు సభామండపం నుంచి ఎందుకు వెళ్ళిపోయారు?

అర్జునుడు : నాకు రాగల ప్రమాదం లేదన్న విశ్వాసంతో కావచ్చు. నాకు సహాయం కావలసివస్తే మా భీముడున్నాడన్న తలంపుతోనూ కావచ్చు.

ద్రౌపది : అయినా, సరిగా అప్పుడే ఎందుకు వెళ్ళాలి? అంత హుటాహుటిగా ఎందుకు వెళ్ళాలి? ఆయన తప్ప సభలో నుంచి అప్పుడు మరెవరైనా కదిలారా?

అర్జునుడు : (కొన్ని క్షణాలపాటు తటపటాయించి) ఏ కారణాన సరిగా... అప్పుడు... ఆయన... ఆ! అన్నట్టు, లాక్షాగృహం నుంచి తప్పించుకున్న నాటి నుంచి రహస్యంగా జీవిస్తున్న మా అన్నదమ్ములైదుగురిని ఒకే చోట, ఒకే తీరుగా చూస్తే దుర్యోధన దుశ్శాసనాదులు గుర్తించ గలరన్న భయం ఆయనకు హఠాత్తుగా కలిగి వుండవచ్చు. అందువల్లనే నకుల సహదేవులను వెంటబెట్టుకుని ఆయన చప్పున సభనుంచి లేచి పోయి వుండవచ్చు.

ద్రౌపది : అన్నగారిని చాలా గట్టిగా సమర్థిస్తున్నారు.

(అలిగినట్టు గిరుక్కున వెనక్కు తిరిగి, నాలుగడుగులు వేసి, ఒక భద్రాసనంపై కూర్చుంటుంది.)

అర్జునుడు : (చెంతకు వెళ్ళి, ప్రక్కన కూర్చుంటూ) నీ మాటలను నేను త్రోసి వేయడం లేదు. కాని, మనం ఒక తీర్మానానికి వచ్చేముందు మంచి చెడ్డలను పూర్తిగా వితర్కించు కోవాలిగదా! కోపం మాని, నీవే చెప్పు! - నేను మత్స్యయంత్రాన్ని కూలవేశానన్న సంతోషవార్తను మా అమ్మ చెవిని వేయడానికి ఆయన అంత తొందరగా బయల్దేరి వుండగూడదా?

ద్రౌపది : అందుకు తామే వెళ్ళాలా? నకుల సహదేవులను పంపితే సరిపోయేది కాదా? (అర్జునుడు మాటాడడు) పోనీ, తాము స్వయంగానే ఆ వార్త చెప్పగోరితే ఆ తర్వాత ఎంతసేపటి వరకు ఆయన ఇల్లు చేరుకోలేదేమిటి?

అర్జునుడు : నిజమే సుమీ!

ద్రౌపది : మనకంటే చాలా ముందుగా బయల్దేరిన మీ అన్నగారు ఏకాస్త ముందుగానైనా జరిగిన సంగతిని మీ అమ్మకు చెప్పివుంటే, మీ చతురోక్తిని ఆమె అపార్థం చేసుకుని వుండేదా? (అర్జునుడు ఆలోచనలో పడి బదులుచెప్పడు) "ఈమె పార్థుడు జయించిన కన్య, ఈమెను అతడు పరిణయమందడమే సమంజసం" అంటూనే మీ ధర్మజులు నావంక అదొక విధంగా చూచారు. ఆయన తమ మాట మార్చి వేసింది ఆ తర్వాతనే. (తిరిగి అర్జునుని మౌనం) "ఇది మీకు తగునా! అన్నయా?" అని మీరు వెంటనే అనివుంటే ఆయన బహుశా సర్దుకునే వారే! కాని, మీరు పూర్తిగా మౌనం వహించారు. మీ మౌనాన్ని అర్ధ అంగీకారంగా ఆయన భావించారు. ఆ తర్వాత మా నాన్నగారు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. (అర్జునుని ముఖకవళికలను గమనిస్తూ, కొన్ని క్షణాలపాటు మిన్నకుండె, ఆ పిమ్మట) "ఊ" అంటే ఒక పుక్కిటి పురాణగాథ, "ఆ" అంటే మరొకటి మీ ధర్మజులు చెప్పగలరయ్యే! గ్రుక్క తిప్పుకోకుండా వాటిని ఏకరువు పెట్టి, ఎంతటి విడ్డూరాన్నయినా సమర్థించగలరయ్యే! జటిల అంటూ పూర్వం ఎవతో వుండేదట. అది సప్తర్షులను పెండ్లాడిందట! ఊరు పేరూ లేని మరెవతో పదిమంది అన్న దమ్ములను వరస పెట్టి కట్టుకున్నదట! వీరిద్దరే ఆయన కంట ఎందుకు దూరారో? ఒకే భర్తతో హాయిగా సంసారాలు చేసుకుంటున్న కోటాను కోట్ల మంది ఆయన చూపుకు ఎందుకు ఆనలేదో? ఏ! మాట్లాడరే?

అర్జునుడు : మా ధర్మజుల ఈ కుంటి వాదాన్ని మీ ద్రుపదులు గట్టిగా ఖండించ వలసింది. ఆ పని ఆయన చేసివుంటే.....

ద్రౌపది : ఏ? ఇది వేదవిరుద్ధమని ఆయన చెప్పలేదా? మన ఆచార వ్యవహారాలకు విరుద్ధమని చెప్పలేదా?

అర్జునుడు : చెప్పకపోలేదుగాని, ఏమంత కరుకుగా చెప్పలేదు. "మత్స్యయంత్రాన్ని కూలవేసిన వానికే నా కుమార్తెనిస్తానని నేను దేశదేశాలలో చాటించాను. ఏమైనా సరే నామాట నిలబెట్టుకోవాలి" అని ఆయన ఖండితంగా చెప్పివుండవలసింది!

ద్రౌపది : ద్రోణాచార్యుల పక్షాన యుద్ధానికి వచ్చి, మీ అన్నదమ్ములు మీ చిన్నతనంలోనే మానాన్నగారిని ఒకసారి ఓడించారటగా! అందువల్ల మీకు కోపం తెప్పిస్తే మీరేమి ! అఘాయిత్యానికి దిగుతారో అని ఆయన భయపడి వుండవచ్చు.

అర్జునుడు : ద్రుపద మహారాజులు అంత పిరికికండ కలవారని నేననుకోవడం లేదు. మా అన్నదమ్ములను కూడగట్టుకుంటే, ద్రోణాచార్యుని శిష్యులుగా వచ్చి, తన నోడించిన మా ద్వారానే ఆయనపై తన పగ తీర్చుకొనవచ్చునని మీ నాన్నగారు ఆలోచించి వుండవచ్చు. మీ

ద్రౌపది : ఆ ద్రోణాచార్యులవారిపట్ల పగ మానాన్నగారి చేత చాలా పిచ్చిపనులు చేయించింది. లెండి!

అర్జునుడు : మా ధర్మజులను సంతోషపెట్టాలనే కావచ్చు. 'కావాలంటే మీరొక్కరే మా అమ్మాయిని చేసుకోండి" అని మీ ద్రుపదులన్నారు.

ద్రౌపది : ఉహు! ఆయన అలా అనలేదు. "అయిదుగురికి కలిపి వివాహమనడం విడ్డూరం. కావాలంటే అగ్రజులైన మీరొక్కరే చేసుకోండి; లేదా, మీ తమ్ములు నలుగురిలో ఏ ఒకరికో చేసుకోండి" అన్నారు.

అర్జునుడు : ఆ మాటలు విన్నప్పుడు "అయితే, నేనొక్కడినే చేసుకుంటా!" అని మా అన్నగారు ఎక్కడ అనగలరో అని నేను చాలా భయపడ్డాను.

ద్రౌపది : అయితే, మాటలో మాటగా "ద్రుపదమహారాజుల మనస్సు మనమెందుకు నొప్పించాలి. నేనొక్కడినే చేసుకుంటా!" అని మీరెందుకన్నారు కాదు? :

అర్జునుడు : మా ధర్మజులు స్వార్థానికి అతీతులు కారని నాకు తెలుసు. స్వాతిశయం, స్వోత్కర్ష మొదలైన ఇతర దౌర్బల్యాలు ఆయన కున్నాయని తెలుసు. అయినా, ఆయన సమక్షంలో నేనెందుకో నోరెత్తలేను.

ద్రౌపది : నిజమే! ఆయనలో ఏదో సమ్మోహన శక్తి వున్నది. అదే నన్ను కూడా ఆయనకు వశవర్తినిగా చేస్తుంది.

అర్జునుడు : నీవు గమనించావో, లేదో - నన్ను నీవు అధికంగా ప్రేమిస్తావని తాను లోలోపల పడే బాధను అన్ని సమయాలలో ఆయన దాచుకోలేరు.

ద్రౌపది : అదొక్కటే కాదు, చాలా విషయాలు గమనిస్తూ వుంటాను. మీకు తెలియక పోవచ్చు కాని, ఒక పుష్కరం పాటు అల్లంతదూరంనుంచైనా మిమ్ము కళ్లజూచుకోడానికి నేను నోచుకోలేనపుడు ఆయన లోలోన ఎంతో సంతోషించారు.

అర్జునుడు : అలాగా! కాని, నేను వనవాసానికి వెళ్ళనక్కర లేదని అప్పుడు నాకు చాలా చాలా చెప్పారు.

ద్రౌపది : ఏమేమి చెప్పారేమిటి?

అర్జునుడు : నీతో ఆయన శయ్యాగారంలో వుండగా నేను లోనికి ప్రవేశించింది క్షత్రియ ధర్మ పాలనకేనన్నారు. అప్పుడు నేను తిరిగి వచ్చి ఆయుధాలను తీసుకువెళ్లి వుండకపోతే, ఒక బ్రాహ్మణ కుటుంబం తన గోధనాన్ని కోల్పోయివుండే దన్నారు. చోరులబారి నుంచి భూసుర వర్గాన్ని రక్షించలేక పోయిన మహాపాపం తనకు చుట్టుకునేదన్నారు. నారదుని సూచనపై మేము పెట్టుకున్న విధి నిషేధాలకు వ్యతిరేకంగా నేను వెళ్ళానన్న ప్రశ్న ఈ పరిస్థితులలో అసలు ఉత్పన్నమే కాదన్నారు. ఏమైనా, ఈ విధమైన నిబంధనలను చిన్నవారి విషయంలో పెద్దవారు ఉల్లంఘిస్తే అది తప్పుగాని, చిన్నవారు ఆ పని చేస్తే అది దోషం కాదన్నారు. పన్నెండు సంవత్సరాలపాటు నేను తమకంటికి కనబడకపోతే....

ద్రౌపది : తాము సహించలేమన్నారు. (సంతాప ఘట్టంలో పడిన ధర్మరాజును అనుకరిస్తున్న ధోరణిలో) ముఖం చిన్న బుచ్చుకున్నారు; తల కొట్టుకున్నారు; కంట తడి పెట్టుకున్నారు; బిట్టు బిట్టు నిట్టూర్పులు గట్టి గట్టిగా విడిచారు....

అర్జునుడు : (చిరునవ్వుతో) ఆయనను చాలా చక్కగా అనుకరిస్తున్నావ్!

ద్రౌపది : (చిరుకోపంతో లేచి నిలబడి) అప్పటి నా బాధ తెలిస్తే మీకు నవ్వులెందుకు వస్తాయి? ఆ పన్నెండేళ్ళు మీ సహచర్య భాగ్యం నాకు తప్పింది. అప్పుడు ఆయన నాకేమి సూచించారో తెలుసా? ఒంటరితనం నాకు దుస్సహం అయితే, తాము అగ్రజులైనందున, తమతో నేను కాలం గడపడం ధర్మసమ్మతమే కాగలదన్నారు. "నేను ధర్మంగా భావించినదాన్ని నీవు పాటిస్తే మా పార్థుడు ఎంతో సంతోషిస్తా" డన్నారు.

అర్జునుడు : నిజంగానా?

ద్రౌపది : కాదు, అబద్ధంగా! నా పిచ్చి భ్రమలేకాని, మీ అన్నదమ్ములందరూ ఇంతేనేమో!

అర్జునుడు : అదేమిటి? ఆయనపై కోపం నాపై మరలిస్తున్నావ్!

ద్రౌపది : చేసుకున్న కట్టుబాటును ఏ పరిస్థితులలో తప్పినా పాపం చుట్టుకోగలదని పట్టుపట్టి, వనవాసం వెళ్ళిన తాము తమ మాటను ఏ పాటిగా నిలుపుకున్నారు?

అర్జునుడు : పన్నెండేళ్ళు పూర్తిగానే నేను వనవాసం చేసి రాలేదా?

ద్రౌపది : కాని, ఆ పన్నెండేళ్ళు బ్రహ్మచర్యం పాటించాలని కూడా నారదమహర్షి కట్టుబాటులో లేదా? ఆ భాగాన్ని పాటించారా? పై పెళ్ళి చేసుకురాలేదా?

అర్జునుడు : (అల్లరిగా లెంపలు వేసుకుంటూ) తప్పు చేశాను - మన్నించి!

ద్రౌపది : (బరువుగా) ఎవరిపై ఎక్కువగా మనసు పెట్టుకుంటామో వారే ఎక్కువగా దూరం అవుతుంటారు - మరి అదేమి విధివైపరీత్యమో! (క్షణం ఆగి) ఏమైనా, మీ సాహచర్య భాగ్యం ప్రస్తుతానికి నాకు మరొక పక్షమైనా లేదు! వచ్చేది నా జీవితానికే అమావాస్య! తిరిగి పౌర్ణమి నాలుగేళ్ళ తర్వాతే! అంతవరకు దినమొక యుగంగా గడపాలి.

అర్జునుడు : (లేచి ఆమె భుజంపై చేయి వేచి దగ్గరికి తీసుకుంటూ) నీకు దినమొక యుగంగా కదా, నాకు దినమొక కల్పం.

ద్రౌపది : (దూరానికి జరుగుతూ) అంత బాధ మీకు దేనికి? మిమ్ము రంజింప చేయటానికి మీ సుభద్ర వున్నదిగా! ఆమె నా కంటె వయసుకు చిన్న; అందచందాలకు మిన్న. మాటలు మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత...

అర్జునుడు : ఆమె వచ్చిననాటి నీ కరుకు

ద్రౌపది : "ఆమె వచ్చిననాడు" కాదు; మీరు అపహరించి తెచ్చిననాడు. ఆమె నీ హృదయాన్ని అపహరించబట్టే ఆమెను మీరు అపహరించుకు వచ్చారు!

అర్జునుడు : ఎలా వచ్చినా, రాగానే ఆమె మీ పాదాలకు యొక్క లేదా? నీ చరణదాసిగా వుంటాననలేదా?

ద్రౌపది : అది, వెనుక వుండి మీరాడించిన నాటకమేగా! సమయోచితంగా ఆ కాసేపు ఆమె చేత గొల్లభామ వేషం వేయించారులెండి! ఏమైనా అదృష్టమంటే ఆవిడదే. కనీసం ప్రపౌత్రుడు రారాజు కానున్నాడన్న సంతృప్తి ఆమెకు మిగిలింది. అటు చూసుకున్నా, నా బ్రతుకే సర్వనాశనమైపోయింది.

అర్జునుడు : మనం కామ్యకవనంలో వుండగా మన పరామర్శకై భర్త వెంట వచ్చిన సత్యభామకు సపత్నుల విషయంలో నీవు చెప్పిన నీతులు నీకు వర్తించవు కాబోలు!

(కన్నీరు నింపబోతున్నట్టు కనబడిన ద్రౌపదిని చెంతకు తీసుకుని)

ఈ పూట నీవు అనవసరంగా వ్యధ పెట్టుకుంటున్నావు. పద! కాసేపు ఉద్యానవనంలోకి పద! చల్లని వెన్నెలలో తిరిగితేనైనా నీ మనసు కొంత శాంతి పడుతుందేమో! (ఈ పలుకులను పలుకుతూనే పూలతోటవైపు ద్రౌపదిని భుజంపై చేయివేచి అర్జునుడు తీసుకువెడుతుండగా

- తెర).

(తెర లేచినప్పుడు నకులుడు నిలువుటద్దం ముందు నిలిచి మీసాల కొసలను మెలితిప్పుకుంటూ వుంటాడు. అవి తిన్నగా మెలితిరిగినట్టు సంతృప్తి కలిగిన పిమ్మట దువ్వెన అందుకుని గిరజాలను దువ్వుకుంటాడు. ఆ పైన చెక్కిళ్లకు సుగంధ లేపాన్ని పూసుకుంటాడు. నకులుని సౌందర్య పోషణ కృషి ఈ ఘట్టంలో వుండగా ద్రౌపది లోపలినుంచి ప్రవేశిస్తుంది. శయ్యాగారం వెనుకభాగంలో అద్దం ముందున్న నకులుని గమనించనందున సరాసరి భద్రాసనం వద్దకు వెళ్లి, దానిపై ఆమె కూర్చుంటుంది. ఒకటి, రెండు నిమిషాల తర్వాత ఏదో అలికిడైనట్టు తోచగా వెనుదిరిగి చూస్తుంది. తన లోకంలోనే తానున్నట్టు నకులుడు కంటి నొసలను కుడిచేతి మధ్య వేలుతో సవరించుకుంటూ వుంటాడు.)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఎప్పుడు దయచేశారు? (పలకకుండా నకులుడు కలశంలో నుంచి సుగంధాన్ని తీసుకుని ముంజేతులకు పలచగా పులుముకుంటూ వుంటాడు.)

ద్రౌపది : వచ్చి ఎంతసేపైంది?

నకులుడు : (ఆమె వైపుకు చూడకుండానే) ఇంతకు ముందే!

ద్రౌపది : ఇంకా మీ సౌందర్య పోషణ కలాపం పూర్తి కానేలేదా?

నకులుడు : (అద్దంలో ముఖం చూచుకుంటూ) పూర్తి కావస్తున్నది.

ద్రౌపది : అందుకు మనకు దినారాత్రాలైనా చాలవులెండి!

నకులుడు : (అద్దంలో చివరిసారిగా ముఖం చూచుకొని, ఇవతలికి వస్తూ) అద్దాన్ని మార్చరాదా?

ద్రౌపది : మార్చడమెందుకు? - అది నిక్షేపంలా వుంటే!

నకులుడు : బొత్తిగా కళావిహీనమైపోయింది.

ద్రౌపది : అన్ని వేళలలో కాదు; తమరు సమక్షాన నిలిచినప్పుడే!

నకులుడు : అదేమిటి?

ద్రౌపది : తమ దివ్య సుందర విగ్రహాన్ని చూడగానే అసూయతో దాని ముఖం వివర్ణమైపోతుంది.

నకులుడు : (ముసి ముసి నవ్వుతో ద్రౌపది చెంతగా భద్రాసనంపై కూర్చుంటూ)
అద్దానికి కూడా నేనంటే నిజంగానే కొంత అసూయ వుండవచ్చు.

ద్రౌపది : "అద్దానికి కూడా" అంటున్నారు. మరెవ్వరి కున్నదేమిటి?

నకులుడు : అది లేనివారెవరు?

ద్రౌపది : నాకు లేదే!

నకులుడు : నీకు వుండనక్కరలేదు.

ద్రౌపది : ఎందువల్ల?

నకులుడు : స్త్రీ జాతిలో సౌందర్యానికి నిన్ను మించినవారు లేరు కాబట్టి.

ద్రౌపది : పురుష జాతికి సంబంధించినంత వరకు ఆ ఘనత తమదే కాబోలు!

నకులుడు : (మీసంపై చెయ్యి వేసుకుంటూ) కాదా?

ద్రౌపది : (భయాన్ని నటిస్తూ) మీసం మెలివేస్తున్నారు, కొంప తీసి నా పై కత్తి దుయ్యరు కదా?

(పై చేయిని చప్పున తీసివేసుకుంటూ) అంత భయం నీకక్కర లేదు!

నకులుడు : (మీసం ద్రౌపది: ఏమో, ఎలా నమ్మడం! మీ మూడవ అన్నగారు తమ గాండీవాన్ని దూషిస్తే సహించలేరు. మీ
సౌందర్యాన్ని శంకించడం తమకు అంతకంటె దుస్సహం కావచ్చునేమో!

నకులుడు : నేను చెడ్డ కురూపినని నీవన్నా, నాకు కోపం రాదు.

ద్రౌపది : మా సోదరిక రేణుమతి ఆ మాట అన్నదనుకోండి!

నకులుడు : ఆమె అనదు!

ద్రౌపది : నిజమే! - ఆమె ఎందుకంటుంది? ఆ చేది రాజపుత్రిక తమ సౌందర్యాన్ని చూచే తమను వరించినదయ్యే!

నకులుడు : నిజమే కాని...

ద్రౌపది : "నిజమే కాని?"

నకులుడు : నేను చాలా స్వయంవరాలకు వెళ్లాను. అయినా...

ద్రౌపది : అయినా?

నకులుడు : ఆ! ఏమీ లేదు.

ద్రౌపది : చెప్పబోయిన మాట మధ్యలో త్రుంచివేయడం దేనికి? నేను అన్యనుకానుగదా!

నకులుడు : అన్యులకు నిస్సంకోచంగా చెప్పే కొన్ని విషయాలను ఆత్మీయులకు చెప్పలేము. అలాగే ఆత్మీయులకు చెప్పే

కొన్ని మాటలు అన్యులవద్ద బయట పెట్టలేము.
ద్రౌపది : సంతోషం! రాను రాను కొంత లోకజ్ఞులౌతున్నారు!
నకులుడు : నీకు కోపందేనికి? - చెబుతాలే! నేను చాలా స్వయంవరాలకు వెళ్లినా, ఒక్క రేణుక తప్ప మరెవ్వరు నన్ను వరించలేదు.
ద్రౌపది : నేను వరించాను గదా!
నకులుడు : నీవు నిజంగా వరించింది మా విజయుని మాత్రమే!
ద్రౌపది : ఓహో!
నకులుడు : మా విజయుడు ప్రతిస్త్రీని ఆకర్షిస్తాడు.
ద్రౌపది : మనస్సులో రెండవ సగాన్నే చెప్పారు. తమరు దాచిన మొదటి సగాన్ని నేను చెప్పనా?
నకులుడు : ఏమిటది?
ద్రౌపది : "నావలె ఆయన రూపసి కాకపోయినా..."
నకులుడు : ఆయన రూపసి కాకపోదు గాని...
ద్రౌపది : తమంత రూపసి కాదు!
నకులుడు : వెటకారంగా అంటున్నావా? నిజంగానేనా?
ద్రౌపది : (నవ్వుతూ) నిజంగానే!
నకులుడు : మా పార్థుడు మంచి పొడుగరి కావచ్చుగాని, నేనేమీ పొట్టి వాడిని కాదుగా!
ద్రౌపది : మీరు పొట్టివారని ఎవరన్నారు? : ?
నకులుడు : మహా అయితే నా కంటె ఆయన మరొక గుప్పెడు వుంటాడేమో! "కిరీటి" అనే బిరుదనామాన్ని నిలబెట్టుకోడానికి ఆయన మూరెడు కిరీటం పెట్టుకుంటాడు. దానితో మరింత పొడుగరిగా కనబడతాడు!
ద్రౌపది : (నవ్వుతూ) అయితే, మీరు బారెడు కిరీటాన్ని 'పెట్టుకోరాదా?
నకులుడు : హేళన చేస్తున్నావా?
ద్రౌపది : అబ్బే! లేదు!
నకులుడు : నీవు పొడగరివి కాదు; పొట్టీ కాదు. స్థూలం కాదు; సన్నమూకాదు. అందువల్లనే నీ మూర్తి...
ద్రౌపది : మధ్య నాప్రశంస దేనికి లెండి! మీ సంగతి, మీ మూడవ అన్నగారి సంగతి చెప్పండి.
నకులుడు : నా వక్షస్థలం కంటె ఆయనిది ఏ కొంచెమో విశాలమైందే కావచ్చు కాని, మధ్య భాగం మరీ అంత సన్నం కావడం...
ద్రౌపది : ఔనౌను! అదీ ఒక వికార లక్షణమే! ఆ నడుం సింహంనడుం కంటె సన్నం; చేతులు తొండంలాంటి పొడుగు; ఆ కాళ్ళు ఒంటెకాళ్ళకంటె వంకర!
నకులుడు : ఇది నిశ్చయంగా నన్ను హేళన చేయడమే!
ద్రౌపది : హేళనేమిటి? - ఉన్నమాట అంటూవుంటే!
నకులుడు : ఏమైనా, ఆయన నలుపు కాదా? నీవు నలుపే అనుకో! అయినా, ఆయన కంటె ఒకటి, రెండు చాయలు పెచ్చు.
ద్రౌపది : మీ పదహారు వన్నెల పసిడి చాయ అందరికీ ఎలా వస్తుంది లెండి. అందుకు పెట్టిపుట్టాలి!
నకులుడు : నలుపైనా నీ ముఖం ఎంతో కళగా వుంటుంది!
ద్రౌపది : (దీర్ఘం తీస్తూ) అలాగా!
నకులుడు : నీ కారు నల్లని జుట్టు నీ ముఖానికి మరింత శోభ తెస్తూవుంటుంది!
ద్రౌపది : (తిరిగి దీర్ఘం తీస్తూ) అలాగా!

నకులుడు : మా మూడవ అన్నగారికి కూడా నల్లని జుట్టే! పైగా తెగ బారెడు! అందువల్లనే బిరుదాలు చాలవన్నట్టు, "గుణకేశు"డంటూ ఆయనకు మరొకదాన్ని తగిలించారు. నాదే పాడు జుట్టు! ఎంత అణగదువ్వినా, అంతలో తిరిగి నిక్కబొడుచుకుంటుంది.

ద్రౌపది : జిగురు ఏదైనా వాడి చూడక పోయారా?

నకులుడు : జిగురు కాదు గాని, చాలా తైలాలను వాడాను. జుట్టు రాలిపోయి పలుచబడి పోవడం తప్ప వాటి వల్ల ప్రయోజనం కనబడలేదు. జుట్టు పలచబడే సరికి, వయస్సు ముదిరి పోయినట్టు కనబడుతున్నాను కాదూ?

ద్రౌపది : అబ్బే! లేదు! స్వయంవరాలకు వెళ్ళదగు వయస్సులో ఇంకా వున్నట్టే నాకంటికి కనబడుతున్నారు.

నకులుడు : ఆ! నేను స్వయంవరాలకు వెళ్ళినా, వెళ్ళకపోయినా ఒకటే! మా విజయుడు స్వయంవరాలకు కాక, తీర్థయాత్రలకు వెళ్ళినా, ఉలూచి, చిత్రాంగదలు ఆయనను వరించారు. సుభద్రాదేవి కూడా వరించే వుండాలి. లేకపోతే ఆమెను స్వజనం మధ్యనుంచి అంత సులభంగా అపహరించుకు రాగలిగేవాడా?

ద్రౌపది : (వస్తున్న నవ్వు ఆపుకుంటూ) తీర్థయాత్రలకు కాక, తాము జైత్ర యాత్రలకు వెళ్ళినా, తమను వరించిన భామే లేకపోయింది! మన రాజసూయ సందర్భంలో తమ జైత్రయాత్ర సామాన్యమైందా? ఎదురు నిలిచిన రాజులందరిని వరసపెట్టి ఓడించారు! కోశాగారాలను కొల్లగొట్టి, పదివేల లొట్టిపిట్టల పైన ధన కనక వస్తురాసులను తరలించుకు వచ్చారు! చక్కని రూపురేఖలతో పాటు గొప్ప శౌర్యప్రతాపాలున్నట్టు తమరు ఇంతగా నిరూపించుకున్నప్పుడైనా, ఏ ఉలూచి, ఏ చిత్రాంగద, ఏ సుభద్ర తమరిని వలచి వెంటబడలేదు. మా పాడు స్త్రీ జాతికి కళ్లు లేవు సరిగదా, మెదడైనా లేదు! వారి

నకులుడు : (ద్రౌపది పలుకులలోని వ్యంగ్యాన్ని గుర్తించలేక, తన ధోరణిలో తాను) మా రెండవ అన్నయ్య వెళ్ళక, వెళ్ళక ఒకే ఒక స్వయంవరానికి వెళ్ళగా, కాశీ రాజపుత్రిక ఆయనను వరించింది.

ద్రౌపది : జగన్మోహనులైన తాము సయితం ఆ స్వయంవరానికి వెళ్ళారు. అయినా, ఆ వృకోదరునే ఆమె వరించింది!

నకులుడు : (తలపంకిస్తూ) తక్కిన వారి మాటకేమిగాని, నీ విషయంలో ఆది నుంచీ నన్నొక సందేహం పీడిస్తున్నది సుమీ!

ద్రౌపది : ఓహో! ఎన్నడు చెప్పలేదేమి?

నకులుడు : ఎన్నోసార్లు చెప్పబోయి, మాట నాల్క చివరికి వచ్చిన మీదట సంక్షేపిస్తూ పోయాను.

ద్రౌపది : పోనీ, ఇప్పుడు చెప్పరాదా?

నకులుడు : చెబితే నాపై కోపం రాదు గదా?

ద్రౌపది : రావడం, రాకపోవడం మీరు వెలిబుచ్చే సందేహాన్ని బట్టి వుంటుంది.

నకులుడు : అయితే చెప్పను!

ద్రౌపది : లోపలనే మీరు దాన్ని దాచుకుంటే, ఇక మీదట అది నన్ను కూడా పీడిస్తుందేమో! చెప్పండి!

నకులుడు : ఏమంత పెద్ద సందేహం కాదుగాని...

ద్రౌపది : ఉపోద్ఘాతలు దేనికి? - చెప్పండి!

నకులుడు : నా రూపాన్ని గురించిన ప్రసక్తి వచ్చినప్పుడు నీవు నన్ను నిజంగా హర్షిస్తున్నావో, అపహసిస్తున్నావో తెలియదు!

ద్రౌపది : (నవ్వి) పెద్ద ధర్మ సందేహమే వచ్చింది. మీ పాండవాగ్రజులనడిగి తేల్చుకొనలేక పోయారా?

నకులుడు : ఆయన నడిగి లాభం లేదు.

ద్రౌపది : ఎందువల్ల?

నకులుడు : నీవు గమనించావో, లేదో గాని మన మందరం కలిసివున్నప్పుడు నీ చూపు నాపై నిలిస్తే చాలు ఆయన కళ్ళలో కొంత అసూయ కనబడుతుంది!

ద్రౌపది : (కొంత చురుకుగా) తప్పు లెన్నడానికి ఆ ధర్మప్రభువులో తమ్ములు నలుగురికి తలొక కారణం కనిపిస్తుంది! ఇది

ఆయన దౌర్భాగ్యం!

నకులుడు : ఆయనంటే మాకు భక్తి గౌరవాలు లేవనుకోకు! దైవసమానునిగా ఆయనను మేము పూజిస్తాము!

ద్రౌపది : ఔను! ఎదుట పూజిస్తారు; చాటున విమర్శిస్తారు!

నకులుడు : నీకు కోపం రానే వచ్చింది.

ద్రౌపది : మీ మాటలకు రాదా!

నకులుడు : మన్నించు. (కొన్ని క్షణాలపాటు ఉభయులు మౌనంగా వుంటారు.)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఆలోచనాముద్ర ధరించినప్పుడు మీ ముఖం మరింత అందంగా వుంటుంది.

(ముఖాన్ని నకులుడు ఒక పెడకు తిప్పుకుంటాడు)

ద్రౌపది : ఒక కోణం నుంచి చూచినప్పుడు మరింత మనోహరంగా వుంటుంది.

నకులుడు : (చప్పున ఆమె వైపుకు తిరిగి) ఈ మాటలే నన్ను బాధ పెట్టేవి

ద్రౌపది : మీ ముఖారవిందాన్ని మెచ్చుకుంటే మీకు బాధ దేనికి?

నకులుడు : అది మెచ్చుకోలు కావచ్చు. ఎగతాళి కావచ్చు.

ద్రౌపది : మన అరణ్యవాసానికి పూర్వమే ఇంద్రప్రస్థంలో మీతో ఒక మాట అన్నాను – అది జ్ఞాపకం లేదా?

నకులుడు : ఏమిటది?

ద్రౌపది : మీకు రూపం వున్నా, రసికత్వం లేదని, ఆ మాటకు కినిసి ఒక వారంపాటు మీరు నావంకైనా చూడలేదు. ఆ తర్వాతనైనా ఆవిధంగా నేనెందుకన్నానో అడిగి తెలుసు కొనడానికి మీరు ప్రయత్నించలేదు.

నకులుడు : సరే - ఇప్పుడడుగుతున్నాను - ఎందుకన్నావు?

ద్రౌపది : రసికుడైనవాడు తన రూపాన్ని భార్య ఎంత మెచ్చుకుంటున్నదో ఆమె నోటి ద్వారా వినగోరడు; ఆమె కళ్ళలోకి చూచి తెలుసుకుంటాడు!

నకులుడు : మరి రేణు నాతో అంటుందే? - మీరు నవమన్మధులని, నలకుబేరులని.

ద్రౌపది : నా సోదరి గడసరి! మీ దౌర్బల్యం ఆమెకు తెలుసు.

నకులుడు : (తలపంకిస్తూ) నీవు నన్ను అపహాస్యం చేస్తుంటే ఆమె ముఖస్తుతి చేస్తున్నది కాబోలు!

ద్రౌపది: (నవ్వి) అశ్వహృదయం తెలిసినంతగా మీకు నారీ హృదయం తెలియదు!

నకులుడు : అశ్వాలు నేనంటే ప్రాణాలు విడుస్తాయి; అతివల మెప్పునే పొందలేక పోతున్నాను.

ద్రౌపది : అద్దం ముందు కూర్చోవడం కాస్త తగ్గిస్తే, చాలా మెప్పు వస్తుంది!

నకులుడు : ఇతరులు నా రూపును మెచ్చుకోనప్పుడు నేనైనా మెచ్చుకోరాదా?

ద్రౌపది : అద్దం మెచ్చింది అందం కాదు; అతివ మెచ్చిందే అందం!

నకులుడు : (ఆమె కళ్ళలోకి చూస్తూ) నీ కళ్ళలో నాకు మెచ్చుకోలు కనబడటం లేదు.

ద్రౌపది : (చిరునవ్వుతో) అది కనబడాలంటే ఎప్పుడు చూడాలో, ఎలా చూడాలో తెలిసివుండాలి. అశ్వవిద్య కంటె ఇది కష్టసాధ్యమైన విద్య!

నకులుడు : నేనంత మూర్ఖుడనా?

ద్రౌపది : కాదు, నవయువకులు! కౌమారావస్థను దాటి, ఇప్పుడే యవ్వన ప్రాంగణంలో పాదం పెడుతున్నారు.

నకులుడు : ఇంత వయస్సు వచ్చినా, ఇంకా నేను నవయువకుడనా?

ద్రౌపది : ఔను! కొందరు జన్మతోనే వృద్ధులైనట్టు, కొందరు ఎంత వయస్సు వచ్చినా బాలాకుమారులుగానే మిగులుతారు.

వయస్సు ముఖ్యం కాదు; చిత్తవృత్తి ముఖ్యం. మీ పాండవాగ్రజులకు శైశవావస్థ వున్నట్టు మీరన్నా ఆ మాట నమ్మడం నాకు కష్టం. పుట్టుకతోనే ఆయన పరిణత బుద్ధితో వుట్టారు. (చిరునవ్వుతో) అలాగే మీరు... ఎందుకు లెండి. అనవసరమైన పోలికలు!

నకులుడు : ఎంత వయస్సు వచ్చినా నాకు పరిణత బుద్ధి రాదంటావు, అంతేనా?

ద్రౌపది : మీరెంత సూక్ష్మరాహులండీ!

(ఈ మాటలంటూ ఆమె నకులుని తలను ఒడిలోకి లాక్కుని అతని జుట్టును గజిబిజిగా రేపుతుంది.)

నకులుడు : (తప్పించుకుని లేచి) జుట్టు రేపి వేశావ్! జుట్టు మాసినా రేగినా, బట్ట మాసినా నాకు కంపరం!

(అద్దం వద్దకు దారితీయబడతాడు)

ద్రౌపది : (దారికి అడ్డు నిలిచి) మళ్లీ అద్దం వద్దకు వెళ్లడానికి వీల్లేదు!

నకులుడు : ఎందువల్ల?

ద్రౌపది : చెరిగిన జుట్టుతో నలిగిన బట్టలతో మిమ్ము చూడ్డమే నాకు ముచ్చట!

నకులుడు : మాసిన గడ్డంతో కూడానా?

ద్రౌపది : ఔను!

నకులుడు : నీ పలుకులు నాకు చిత్రంగా వున్నాయి!

ద్రౌపది : నారీ హృదయమే చిత్రమైనది!

నకులుడు : దాని రహస్యాలు నాకు విప్పి చెప్పరాదా?

ద్రౌపది : చెప్పకుండా వాటిని తెలుసుకునే వాడే రసికుడు!

నకులుడు : నా మనస్సును తిరిగి నొప్పిస్తున్నావ్!

ద్రౌపది : మెప్పులేని భార్య పతిని నొప్పించదు, నిర్లక్ష్యం చేస్తుంది.

నకులుడు : నీకు కష్టంకలిగినా సరేగాని, నీవు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నావనే నా నమ్మకం

ద్రౌపది : (నొసలెగరేస్తూ) అలాగా!

నకులుడు : ఏనాడూ నాకోసం నీవు అలంకరించుకోవు!

ద్రౌపది : నా బదులు మీరలంకరించికుంటున్నారుగా!

నకులుడు : (చిన్నబుచ్చుకున్న ముఖంతో) తిరిగి అపహాస్యం!

ద్రౌపది: అలంకరణతో నిమిత్తం లేనిదే నిజమైన అందమని మీకెన్నటికి తెలుస్తుందో!

నకులుడు : నాకిది తెలియజెప్పడానికేనా నీ వలంకరించికోంది!

ద్రౌపది : ఈనాటికైనా ఈ ప్రశ్న మీకు తోచింది - సంతోషం!

నకులుడు : సహజ సౌందర్యమైనా అలంకరణతో పెరగదా?

ద్రౌపది : మితిమీరితే తమ వంటి మన్మధాకారులనైనా అది మర్కటాలను చేస్తుంది

నకులుడు : సరే! రేపటి నుంచి స్నానమైనా చెయ్యను!

ద్రౌపది : దేనిలోనూ అతి తగదు! రండి, కూర్చోండి. (నకులుడు కూర్చున్న పిదప సరసన కూర్చుంటూ)

స్త్రీలైనా, పురుషులైనా తమ తమ వయస్సులకు తగినట్టు మెలగాలి. ఈ వయస్సులో నేను కొత్త పెళ్లి కూతురువలె కనబడ్డానికి ప్రయత్నించడం కంటే వికార చేష్ట వుంటుందా?

నకులుడు : ఏమైనా, నారీ హృదయం లోతులు నాకు తెలియవని ఇప్పుడిప్పుడే అర్థమౌతున్నది. ఎంత వికారినైనా కొందరు ప్రేమిస్తారు; మరి వారిలో తమ కేమి అందం కనబడుతుందో!

ద్రౌపది : (చిరునవ్వుతో) ముక్కు తీరు, ముఖం తీరు - ఇవేనా ఆకర్షించేది? ప్రేమకు పట్టుకొమ్మ కావడానికి చూపులోని

తళుకు చాలదా? గొంతులోని తేనె చాలదా? నవ్వులోని కవ్వింపు చాలదా? నా పలుకులు కలిగిస్తున్న మనో వికారాలతో క్షణక్షణ పరివర్తనలు పొందుతున్న మీ వదనం ఇప్పుడు నన్నెంతగా ఆకర్షిస్తున్నదో మీకెలా తెలుస్తుంది? (నకులుని గిరజాలను ఆమె తిరిగి గజిబిజి చేస్తుండగా - తెర) - -

(పైకి తెర లేచినప్పుడు సహదేవుడు క్రోధ విచారాలతో కూడిన వదనంతో నడయాడుతూ వుంటాడు. అదాటున కాలికొక బల్ల తగలగా, దాన్ని తన్ని వేస్తాడు. దానిపై వున్న చిన్న చిన్న శిల్పాలు వెళ్లి దూరంగా పడతాయి. ఆ చప్పుడు విన్న ద్రౌపది లోపలి నుంచి త్వరగా ప్రవేశిస్తుంది)

ద్రౌపది : (క్రింద పడివున్న ఒక శిల్పాన్ని ఒక తావు తన్నుతున్న సహదేవుని చూచి, ఆగిపోయి, చిరునవ్వుతో) ప్రళయకాల రుద్రుని వలె వున్నారు! ఏమిటి విశేషం? (మరొక శిల్పాన్ని తన్నడానికి సహదేవుడు పాదం ఎత్తుతాడు.)

ద్రౌపది : (చికాకుగా) సంతోషించాముగాని, మరి నిదానించండి! (ఎత్తిన పాదాన్ని ఎత్తినట్టే వుంచి, సహదేవుడు ఆగిపోతాడు)

ద్రౌపది : (చిరునవ్వుతో) ఈ దృశ్యం మన రాజసూయ యాగాన్ని జ్ఞప్తికి తెస్తున్నది. కృష్ణునికి అర్ఘ్యమిచ్చినందుకు ధర్మ రాజులపై అలిగిన నృపతి లోకం శిరస్సుపై పెట్టడానికి ఇంతటి కోపావేశాలతోనూ ఆనాడు మీరు పాదమెత్తారు! చూడ్డానికి ముచ్చటగా వున్నది - ఆ పాదాన్ని అలాగే ఎత్తిపట్టి వుంచండి! (సహదేవుడు చివాలున తన పాదం దించి వేసుకుంటాడు.)

ద్రౌపది : (దగ్గరికి వస్తూ) సరేగాని ఎందుకింత కోపం? ఎవరిపై కోపం? (సహదేవుడు మారు పలకడు.)

ద్రౌపది : (మరి నాలుగడుగులు ముందుకు వేసి) మీ కోపతాపాలను చూపవలసింది ఈ శిల్పాలపైనా? ఇవి మిమ్మేమి చేశాయి? (బల్ల సరిగా తీసి, వంగి అందుకుంటున్న శిల్పాలను దానిపై తిరిగి పెడుతూ) ముద్దు లొలికే ఈ బొమ్మ ముక్క విరిగి పోయింది - చూచారు? ఎంతటి కోపంలోనైనా ఇలాంటి చికాకుపనులు తగవు. (శిల్పాలన్నింటిని సరిగా సర్దుతూ) బల్ల కాలికి తగిలిందా? ముందుకు పడిపోలేదు గదా? దెబ్బ తగలలేదు గదా?

సహదేవుడు : లేదు.

ద్రౌపది : అయితే, ఈ పిచ్చి కోపమెవరిపై?

సహదేవుడు : ఆ గర్విష్ఠి, ఆ జూదరి, ఆ కపటి...

ద్రౌపది : (తీవ్రంగా) చాలు! మరి కట్టి పెట్టండి! (అతడు చప్పున తగ్గిపోయి, భద్రాసనంపై కూలబడి, రెండు చేతులతో ముఖం కప్పుకొని, పొరలివస్తున్న శోకాన్ని కప్పి పుచ్చుకొనడానికి ప్రయత్నిస్తాడు.)

ద్రౌపది : (అర నిమిషం పాటు అతనిని చూస్తూ మౌనంగా నిలిచిన మీదట, దగ్గరికి వెళ్లి, తల నిమురుతూ) అన్ని ఉరుములు, మెరుపులు తర్వాత ఈపాటి వాన చినుకులు తప్పవులెండి!

సహదేవుడు : (నెమ్మదిగా తలయెత్తి, సానుభూతి కోసం ఆమె కళ్లలోకి చూస్తూ) ఇక నేను బ్రతికీ, చచ్చి ఒక్కటే!

ద్రౌపది : ఏమి జరిగింది?

సహదేవుడు : దాన్ని చెప్పుకోడానికైనా సిగ్గుపడాలి.

ద్రౌపది : చిన్న పిల్లవాని వలె గొడవ చెయ్యక నాకు చెబుదురూ!

సహదేవుడు : నీవు కూడా నన్ను చిన్నపిల్లవాని వలె చూస్తున్నావన్న మాట.

ద్రౌపది : ఔను! "నా ముద్దులకొడుకు! జాగ్రత్తగా చూచుకో!" అని కుంతీదేవి మిమ్ము నాకు ఇల్లడ పెట్టలేదా? ఇంతకీ ఏమి జరిగిందో చెప్పండి.

సహదేవుడు : ఆ! ఏమీ లేదు, ఉద్యానం గుండా నేనిటు వస్తుంటే ఆయన పిలిచారు. తప్పదుగాబట్టి...

ద్రౌపది : ఆయనకు ఊరూ పేరూ లేదేమిటి?

సహదేవుడు : (వినిపించుకోకుండా) తప్పదుగాబట్టి, అటు వెళ్లాను. తమ వెంటనన్నొక నాలు గడియలు తిప్పుతూ తమ

సహజధోరణిలో నాకు ధర్మోపన్యాసమిచ్చారు. ఏ పూట దాన్ని తినేవారు లభించకపోతే, ఆ పూట ఆయనకు అన్న హితవు తప్పుతుంది!

ద్రౌపది : ఆ ధర్మ ప్రభువుల పట్ల ఇది మహాపచారం!

సహదేవుడు : ధర్మాధర్మాలు తమ కంటె నాకే బాగా తెలుసు. తమ దీర్ఘోపన్యాసాలతో నన్ను చంపడం దేనికి?

ద్రౌపది : ఇంత మాత్రానికేనా ఈ పూట మీరింతగా చిందులు తొక్కడం!

సహదేవుడు : మరి చాలా జరిగింది!

ద్రౌపది : అలాగా!

సహదేవుడు : ఔను! గ్రుక్క తిప్పుకోకుండా ఆయన నాకు ధర్మోపన్యాసమిస్తుండగా, నా ఖర్మం కాలి, ఎవడో జటాధారి ఎక్కడినుంచో హఠాత్తుగా ఊడిపడ్డాడు. వాడిని అర్ఘ్యపాద్యాలతో సత్కరించమంటే సత్కరించాను. ఆపైన వాడు...

ద్రౌపది : తాపసులను "వాడువా" డనడం తప్పు కాదా?

సహదేవుడు : మీసాలు గడ్డాలు పెంచిన ప్రతివాడు ఒక తాపసుడౌతాడా?

ద్రౌపది : ఎవరిలో ఏ మహాత్మ్యం వుంటుందో మనకెలా తెలుస్తుంది!

సహదేవుడు : తెలియదని, ప్రతి గడ్డపువాడిని ఒక గద్ద నెక్కించి కూర్చోబెట్టగలమా?

ద్రౌపది : పెద్దలపట్ల ఈ దూషణ తిరస్కారాలు తగవు.

సహదేవుడు : వాడేనా ఒక పెద్ద, వాడికి వాక్శుద్ధి అయినా లేదు.

ద్రౌపది : ఈ ధోరణిలో మాట్లాడుతూపోతే తమ వాక్శుద్ధిని నేను శంకించవలసి వస్తుంది. సరే! ఆ తర్వాత ఏమి జరిగింది?

సహదేవుడు : ఏవో అవాకులు చవాకులు ఆ చవట ప్రేలుతూ పోతుంటే ఈయన చిత్తం! చిత్తం!" అంటూ భక్తి వినయాలను ప్రదర్శిస్తూ పోయారు. విని విని మరి భరించలేక, వాడిపై నేను రెండు విసుర్లు విసిరి, వాడి నోరు కట్టించే సరికి, ఈయన నన్ను నానా చివాట్లు పెట్టి, ఆ త్రాష్టడికి నాచే క్షమాపణ చెప్పించారు.

ద్రౌపది : ఆయన ఎట్టివారైనా మన అతిథి. అతిథిని అమర్యాద చేస్తే నేనైనా క్షమాపణ చెప్పించేదాన్నే!

సహదేవుడు : పోనీ అని నేను క్షమాపణ చెప్పాను. అంతటితో నైనా నన్ను విడిచి పెడితేనా? వాడికి సాష్టాంగ పడమన్నారు. ఇది దుస్సాహం!

ద్రౌపది : అన్నగారి మాటప్రకారం చేసే వచ్చారా? చేయకుండా వచ్చారా?

సహదేవుడు : ఇకమీదట చేసేది లేదు.

ద్రౌపది : (చిరునవ్వుతో) ఇక మీదటి మాట ఇప్పుడు దేనికిలెండి!

సహదేవుడు : నా కృతనిశ్చయం ఎన్నటికీ మారదు.

ద్రౌపది : ఔనౌను! ఆయన తిరిగి ఆదేశించేవరకు! ఆ ధర్మప్రభువులు సమక్షంలో లేనప్పుడే మన ధిక్కరణ!

సహదేవుడు : "నా నోట అనృతం రాదు! నా మనస్సులో పాపచింత పెట్టదు" అని నాకై నేను అదేపనిగా చెప్పుకుంటూ పోతే నేను మాత్రం ఒక ధర్మప్రభువును కానా?

ద్రౌపది : ఆత్మస్తుతివల్ల ఎవరైనా గొప్పవారౌతారా?

సహదేవుడు : అదే చాలదు. మరొకటి కూడా కావాలి.

ద్రౌపది : ఏమిటది!

సహదేవుడు : పరనింద.

ద్రౌపది : (అల్లరిగా) అయితే త్వరలోనే తాము చాలా చాలా గొప్పవారుగా చెల్లబోతున్నారు.

సహదేవుడు : ఈ జన్మకు ఈ సహదేవునికి అంత భాగ్యం పట్టదు!

ద్రౌపది : లేకపోవడ మేమిటి? ప్రస్తుతం కొనసాగిస్తున్న పరనిందకు ఆత్మస్తుతిని జోడించండి!

సహదేవుడు : దేనికిదేన్ని జోడించినా, నా విషయంలో ప్రచారం నిరర్థకం.

ద్రౌపది : ఎందువల్ల?

సహదేవుడు : ప్రచారం వల్ల సులభంగా అల్లుకుపోయేది అబద్ధమే - నిజం కాదు, అబద్ధం ఎంత పెద్దదైతే అంత సులభంగా ఈ పాడులోకం దాన్ని నమ్ముతుంది.

ద్రౌపది : లోకం అంత గుడ్డిదా?

సహదేవుడు : గుడ్డిది మాత్రమే కాదు, చెవిటిది, కుంటిది, మూగది, పిచ్చిది.

ద్రౌపది : ఈ పూట ఇంత విడ్డూరంగా మాట్లాడుతున్నారే!

సహదేవుడు : గిట్టనిదానికి మనం చెడ్డ పేరు పెడతాము. వివేకమంటే మనకెంత మాత్రం గిట్టదు. అందువల్లనే దాన్ని విడ్డూరం అనివేస్తాము. నీకే కాదు; మీ ధర్మ ప్రభువులకు సయితం నా పలుకులు విడ్డూరంగానే తోస్తూ వుంటాయి.

ద్రౌపది : "మీ ధర్మ ప్రభువు" లంటున్నారు; తమ దృష్టిలో వారు ధర్మ ప్రభువులు కారు? ? వివేకమొక్కటే శూన్యం కాని, ఆయన ధర్మ ప్రభువులే.

సహదేవుడు : కాకేమి

ద్రౌపది : అదుగో! తిరిగి ఆయనను నిందిస్తున్నారు. దీన్ని మరి సహించేది లేదు.

సహదేవుడు : అదే ఆయనకు పట్టిన అదృష్టం! ఎవరిని చూడబోయినా, ఆయనను వెనక వేసుకు వచ్చేవారే!

ద్రౌపది : ఎందుకు రారు? - ఆయన ధర్మానికే ప్రభువైనప్పుడు! ఆయన ప్రతి పలుకు ఒక ధర్మసూక్తి!!

సహదేవుడు : శైశవంలో గురుపాదాల వద్ద నేనూ నేర్చుకున్నాను, "సత్యం వద, ధర్మం చర" అంటూ చాలా నీతుల్ని, మాటలు నేర్చిన చిలకవలె వాటిని వల్లించడానికి వివేకం అక్కరలేదు.

ద్రౌపది : వివేకం మీలోనే మూర్తీభవించిందనీ మీ భ్రమ! ఆయనెంత వివేకవంతులో మీకేమి తెలుసు!

సహదేవుడు : నిజమే! పరమ మూర్ఖునికి ఏమీ తెలియదు! పరమ మూర్ఖుడైనందువల్లనే ఇతడు శకునితో ద్యూతానికి సమ్మతించాడు.

ద్రౌపది : చీటికీ, మాటికీ ద్యూతం ప్రసక్తి తెచ్చి ధర్మ ప్రభువులను మీరు వెక్కిరించనక్కరలేదు. మీకు తెలియదేమో గాని, ద్యూతానికి ఆహ్వానిస్తే క్షత్రియుడైనవాడు దాన్ని తిరస్కరించ రాదు. ఇది మన క్షత్రియకుల సంప్రదాయం.

సహదేవుడు : అయితే, ద్యూతానికి పిలిచిన దెవరు? ధృతరాష్ట్రుడు కాడా? అయినప్పుడు శకునితో ఎందుకు ఆడవలసి వచ్చింది?

ద్రౌపది : చాలా తెలివైన ప్రశ్నే! కళ్లులేని ఆ ధృతరాష్ట్ర మహారాజు కావాలన్నా ద్యూత మాడగలడా?

సహదేవుడు : ఆహ్వానం ఒకరినుంచి కాగా, ఆట మరొకరితో ఇది కూడా క్షత్రియ సంప్రదాయమేనా? కళ్లులేని ధృతరాష్ట్రుడు మరొకనిని నియోగించినప్పుడు....

ద్రౌపది : మరొకరిని నియోగించింది దుర్యోధనుడు!

సహదేవుడు : సరే! దుర్యోధనుడే! పాచికలను పట్టడం తనకు చేతకాదని దుర్యోధనుడు మరొకరిని నియోగించినపుడు, వాటిని పట్టడంలో తనకు తగినంత నేర్పు లేదని మీ ధర్మప్రభువులు మరొకరిని ఎందుకు నియోగించలేదు?

ద్రౌపది : ఆయనకు నేర్పు లేకపోవడమేమిటి? శకుని మోసం చేసినందువల్లనే ఓడిపోయారు

సహదేవుడు : అయితే, "నీవు మోసం చేస్తున్నావని అతడిని వెంటనే ఎందుకు అల్లరి పెట్టలేదు? కౌరవ సభలోని పెద్దలచేత అతడికి ఎందుకు బుద్ధి చెప్పించలేదు?

ద్రౌపది : కానరాకుండా అతడు మోసం చేశాడు.

సహదేవుడు : ప్రతి జూదగొండి తానోడిపోయిన తర్వాత ప్రత్యర్థి మోసం చేసినందువల్లనే తనోడిపోయినట్టు చెబుతాడు.

ద్రౌపది : శకుని మోసం చేయలేదని మీరు నిజంగానే నమ్ముతున్నారా?

సహదేవుడు : నా మాటకేమిగాని, సాక్షాత్తు ఆ భీష్మ పితామహులేమన్నారు? ద్యూతంలో శకునికి సాటిరాగలవాడు ఈ భూమండలంలోనే లేడని అనలేదా? అయినా, స్వచ్ఛందంగా మన యుధిష్ఠరులు అతనితో ద్యూతాన్ని సాగించారని అనలేదా? అతని చేతిలో తానోడిపోయినట్టు స్వయంగా గుర్తించారని అనలేదా?

ద్రౌపది : ఆ! అవి తెలిసీ తెలియని మాటలు!

సహదేవుడు : పోనీ, శకుని నిజంగానే మోసం చేశాడనుకో; అయినప్పుడు రెండవసారి అతడితోనే ద్యూతానికి ఎందుకు సమ్మతించినట్లు? తిరిగి అతని చేతిలో ఎందుకు ఓడిపోయినట్టు? ఒకసారి మోసం చేసినవాడే మరొకమారు కవ్వించినా, వానితో ద్యూతాన్ని తిరస్కరించరాదని క్షత్రియసంప్రదాయం నిర్దేశిస్తున్నదా?

(సముచిత సమాధానం స్ఫురించక ద్రౌపది ఆలోచనలో పడుతుంది.)

సహదేవుడు : సమాధానం కోసం నీవు ఆలోచించనక్కరలేదు. మీ ధర్మప్రభువులు ద్యూత ప్రియులు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరితోనైనా, ఎన్నిమారులైనా - పిలవనిదే పాపంగా - ఆయన ద్యూతానికి దిగగలరు; చివరికి నిన్నైనా! శకుని మోసం చేసి గెలవలేదు; పాచికలను విసరడంలో...

ద్రౌపది : మరి ఎలా గెలిచాడు?

సహదేవుడు : నే చెప్పబోయింది అదే! ఇంతలో నా మాటకు అడ్డు వచ్చావ్. పాచికలను విసరడంలో అతనికున్న నేర్పులో ఆవగింజలో అరవయ్యో వంతు కూడా మీ ధర్మ ప్రభువులకు లేదు. శకుని చేతిలో రెండుసార్లు తుక్కుతుక్కుగా ఓడిపోయిన తర్వాతనే కాదా, మన అరణ్యవాస కాలంలో బృహదశ్వ మహర్షి వద్దపాచికలను విసరడంలో గల మెలకువలను మీ ధర్మ ప్రభువులు కొంతవరకు తెలుసుకున్నది! మహరులైన వారికి ఆ విద్యలో ఏ మాత్రం ప్రావీణ్యం వుంటుందో సందేహమే! అందువల్ల దానిలో ఇప్పటికైనా శకునిదే పై చేయి కావచ్చు. పిచ్చివాడై దుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధానికి తలపడ్డాడుగాని, మీ ధర్మప్రభువులను తిరిగి ద్యూతానికి పిలిచివుంటే, మన మధ్య ఈ సంభావణ ఈ హస్తినాపురాణమందిరంలో కాక ఏ మహారణ్యంలోనో జరుగుతూ వుండేది.

ద్రౌపది : ఈ భయంతోనే కాబోలు, పనికట్టుకుని మరీ ఆ శకునిని తాము యుద్ధంలో చంపింది!

సహదేవుడు : ఔను! లేకపోతే మీ ధర్మప్రభువుల ద్యూత ప్రియత్వం నుంచి మనకు రక్షణ వుండేది కాదు!

ద్రౌపది : ఈ వెక్కిరింపులే, ఈ వెటకారాలే తమ వివేకానికి తార్కాణాతా?

సహదేవుడు : నీ మాట నేనెందుకు కాదనాలి, ఇవే నా వివేకానికి తార్కాణాలనుకో! కాని మీధర్మప్రభువుల వివేకానికి నీవు చూపగల తార్కాణమేమిటో? మన సర్వస్వాన్ని బలి పెట్టి, కురుక్షేత్రంలో సాధించిన విజయాన్ని చివరిక్షణంలో దుర్యోధనుని చేతిలో పెట్టబోవడమా?

ద్రౌపది : మీరేమి మాట్లాడుతున్నారో మీకే అర్థం కావాలి; నాకు కావడం లేదు!

సహదేవుడు: అయితే, వివరిస్తానులే! కురుక్షేత్రం నుంచి పారిపోయిన దుర్యోధనుడు నీటి మడుగు కింద వున్న సొరంగంలో తలదాచుకోలేదా?

ద్రౌపది : ఔను!

సహదేవుడు : మా నిష్ఠుర వాక్కులను మరి సహించలేక దాని నుంచి వెలుపలికి వచ్చిన దుర్యోధనునితో మీ యుధిష్ఠర ప్రభువులు ఏమన్నదీ నీవు వినలేదేమో!

ద్రౌపది : వినకేమి? విన్నాను. "మా సోదరులైదుగురిలో నీవు కోరిన వానితో, నీవు కోరిన ఆయుధంతో పోరాడవచ్చు" నన్నారట.

సహదేవుడు : అంతేకాదు. "ఈ పోరులో నీవు గెలిస్తే, రాజ్యం నీదే" అనికూడా అన్నారు. ద్రౌపది : అది యుధిష్ఠర ప్రభువుల అంతస్తునే తెలుపుతున్నది. ఆయన ఔదార్యాన్నే తెలుపుతున్నది.

సహదేవుడు : అంతకంటె మిన్నగ ఆయన అవివేకాన్ని కూడా తెలువుతున్నది!

ద్రౌపది : (చికాకుగా తన స్థానంలో నుంచి లేస్తూ) ఈ పూటకు మరి చాలు! మీ సోదర నింద!

సహదేవుడు : నీకు కోపం రావడం సహజమే. వాదం పెరటి దారిని పట్టగానే కోపం సింహద్వారం గుండా ప్రవేశిస్తుంది.

ద్రౌపది : (సహదేవునికి ఎదురుగా వచ్చి నిలబడి) ఏమిటి? మీరు మహా చేస్తున్న వాదం! ఔదార్యాన్ని అవివేకమనడమా?

సహదేవుడు : చికాకు పడక, కాస్త శాంతంగా కూర్చుంటే, అదేమిటో నీకే తెలుస్తుంది. ఇలారా! కూర్చో!

(ద్రౌపదిని తన ప్రక్కన కూర్చోబెట్టుకుని) ఎంత చెడ్డా దుర్యోధనుడు ధీరోదాత్తుడైనందున మన భీమసేనులతో గదాయుద్ధం చేస్తానన్నాడు. అలా కాక, యుధిష్టర ప్రభువులతో గదా యుద్ధ మన్నాడనుకో! దాని ఫలితం ఏమైపోయేదో నేను చెప్పాలా?

ద్రౌపది : దుర్యోధనుని నోటివెంట.ఆమాటరాకపోవడం యుధిష్ఠరుల ధర్మప్రభావం వల్లనే!

సహదేవుడు : అంటే నీ తాత్పర్యం? "ఆయనలో వివేకం శూన్యమైనా, ఆయన ధర్మప్రభావం మనను రక్షిస్తోంది" అనేనా?

ద్రౌపది : నా తాత్పర్యం అది కాదు; ఆయన మీకంటె చాలా వివేకవంతులని!

సహదేవుడు: అయితే, మీ ధర్మప్రభువులు తమ వివేకాన్ని ప్రదర్శించిన ఒక సందర్భాన్ని దయచేసి వివరించండి - చూద్దాం!

ద్రౌపది : మీరు అడగ్గానే నాకు జ్ఞాపకం రావద్దా?

సహదేవుడు : ప్రయత్నించి జ్ఞాపకంచేసుకోవలసినంతటి చెదురుగా వున్నాయి కాబోలు ఆ సందర్భాలు!

ద్రౌపది : చెదురుగా ఖర్మమేమిటి? - కోకొల్లలుగానే వున్నాయి. ఒక క్షణంలో చెబుతా! ? (ఆలోచనలో పడి) అప్పుడు...

సహదేవుడు : ఎప్పుడు?

ద్రౌపది : ఆ! అప్పుడే... అలా తొందర పెడితే ఎలా?

సహదేవుడు : అయితే, ఈ లోగా ఆయన అవివేకానికి మరొక నిదర్శనాన్ని నన్ను చెప్పమంటావా?

ద్రౌపది : వద్దులెండి!

సహదేవుడు : ఏ! వినడానికి భయమా?

ద్రౌపది : నాకెందుకు భయం?

సహదేవుడు : ఆయన పట్ల నీ భక్తి గౌరవాలు ఎక్కడ దెబ్బ తినగలవో అని!

ద్రౌపది : అవి మీరనుకున్నంత సులభంగా దెబ్బతినవులెండి!

సహదేవుడు : అయితే, విను! మన రాజసూయయాగ సందర్భంలో దేశ దేశాల రాజులు మనకు ఇచ్చిన కప్పాన్ని, ప్రజలు తెచ్చిన కాన్కలను అందుకోడానికి మరెవ్వరూ దొరకనట్టు దుర్యోధనుని నియోగించడం శుద్ధ అవివేకం కాదా? అతడు అసూయాగ్రస్తుడని ఈయనకు తెలియదా? మన వినాశానికై అతడు మరింతగా తహ తహ లాడింది ఆ భాగ్యరాసులను చూసిన పిమ్మటనే కాదా? పోనీ, ఆ తర్వాతనైనా తక్కిన వారితో పాటు హస్తినాపురానికి దుర్యోధనుని తిరిగి వెళ్లనీయకుండా ఇంద్రప్రస్థంలో అతడిని ఎందుకు నిలిపినట్టు? మయసభా వైభవాన్ని చూచి, అతడు నిజంగా ఆనందిస్తాడనేనా? పైకి ఎంత నిరాడంబరులుగా కనబడినా, మీ ధర్మ ప్రభువులలో ఆడంబర ప్రియత్వం విశేషంగానే...

ద్రౌపది : సరే! మీరు ఆగండి!

సహదేవుడు : ఏఁ! ఎందుకు?

ద్రౌపది : ఆయన వివేకానికి తార్కాణం చెప్పమన్నారుగా! చెబుతా!

సహదేవుడు : సంతోషం - ఇప్పటికైనా నీ కొకటి తోచినందుకు! ఏమిటది?

ద్రౌపది : ప్రథమ ద్యూతం తర్వాత కౌరవసభకు ఏక వస్త్రనై నేనెందుకు వచ్చాను?

సహదేవుడు : అప్పుడు నీవు రజస్వలవు గనుక.

ద్రౌపది : అంతే మీకు తెలిసింది! ఏకవస్త్రంతో, అధోనీలితో, రోదిస్తూ కౌరవ సభకు రావలసిందిగా ధర్మప్రభువులు పరమ

రహస్యంగా నాకు సందేశం పంపించారు.

సహదేవుడు : (విస్తుపోతూ) అలాగా! పరమ రహస్యంగా నీకు...

ద్రౌపది : (చిరునవ్వుతో) సందేశం పంపించారు!

సహదేవుడు : ఇంత పాడు పని ఆయనెందుకు సేయమన్నట్టు? నీ వెందుకు చేసినట్టు?

ద్రౌపది : ఇంత పాడు పని కాదు; కౌరవుల తాడు తెంచిన పని. ఆయన మాటపై ఆ రీతిగా నేను రాబట్టే కదా ధృతరాష్ట్రుడు, ఆయన కుమారులు అంతగా అప్రతిష్ఠ పాలైంది!

సహదేవుడు : ఇప్పుడు నాకు తెలుస్తున్నది సంజయుడు మీ ధర్మ ప్రభువులను "మెత్తని పులి" అని ఎందుకన్నాడో!

ద్రౌపది : ఆ సూత పుత్రుని మాటలకేమిలెండి!

సహదేవుడు : క్షత్రియులుగా చెల్లుతున్నవారిలో చాలా మంది కంటె సూతపుత్రులే వివేకవంతులు, వారే ధీరోదాత్తులు.

ద్రౌపది : ఓహో! సూతపుత్రులంటే ఎప్పటినుంచి తమకు ఈ భక్తి గౌరవాలు?

సహదేవుడు : సూతపుత్రుడుగా ఈ గుడ్డి లోకం చులకన సేస్తూ పోయిన కర్ణుడే నిజంగా నాకు జ్యేష్ఠ సోదరుడని తెలుసుకొన్న నాటి నుంచి!

ద్రౌపది : (చిరునవ్వులో నుంచి చింతలోకి మారుతూ) ఆయనకు జరిగిన ఘోరాపచారానికి నిందించవలసింది లోకాన్ని కాదు మీ తల్లినే!

సహదేవుడు : ఆ నిందను నీవైనా కొంత పంచుకోవాలేమో!

ద్రౌపది : నేనా! ఎందుకు?

సహదేవుడు : మత్స్య యంత్రాన్ని కూలగొట్టడానికై ఆయన విల్లెత్తగా...

ద్రౌపది : అది నా తప్పు గాదు; మీ తల్లి తప్పే! మొన్న మొన్నటి వరకు నిజాన్ని ఆమె కప్పి పుచ్చిందయ్యె!

సహదేవుడు : (తల పంకిస్తూ) ఇంత కాలం నిజాన్ని ఆమె కప్పి పుచ్చి వుండకపోతే...

ద్రౌపది : కురుక్షేత్ర సంగ్రామమే తప్పేదేమో!

సహదేవుడు : నీకు పంచపతిత్వం కూడా తప్పేది. "సూతపుత్రుని చేబట్ట" నని నీవు తిరస్కరించి వుండకపోతే, ఆ ధనుర్విద్యాపారీణుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి వుండేవాడే!

ద్రౌపది : (మనస్సు ఎక్కడికో పోయినట్టు) బహుశా!

సహదేవుడు : బహుశా కాదు. నిశ్చయమే. అన్నట్టు, ఒక పెద్ద అనుమానం నాకు చిరకాలంగా వున్నది సుమీ!

ద్రౌపది : ఏమిటది?

సహదేవుడు : నీ స్వయంవర సభలో ఆయన హీనకులజుడని నిరసిస్తూ నీవన్న మాటలు కలిగించిన బాధతో పాటు మరొకటి కూడా కర్ణుని చివరి వరకు పీడించిందని!

ద్రౌపది : అదేమిటో సెలవివ్వండి!

సహదేవుడు : నిన్ను పత్నిగా పొందలేక పోతున్నానన్న బాధ!

ద్రౌపది : కొందరికి పరకాయ ప్రవేశ విద్య తెలిసినట్టు, తమకు పరహృదయ ప్రవేశ విద్య తెలుసు కాబోలు!

సహదేవుడు : ఆ విద్యా ప్రదర్శన మరి కొంత చేయమంటావా? కర్ణుని పతిగా పొందలేదన్న బాధ నీకైనా కొంత లేక పోలేదు!

ద్రౌపది : చాల్చాలు! మీ వివేకానికి చాలా సంతోషించాము!

సహదేవుడు : నీవు కాదన్నా నిజమంతే!

ద్రౌపది : ప్రతి కుశంకను ఒక పరమ సత్యంగా ప్రతిపాదించడమే తమ వివేకానికి నిదర్శనమా?

సహదేవుడు : నా మాటలో నిజం లేకపోతే నీవింత నిష్ఠూరంగా మాట్లాడవు!

ద్రౌపది : నా సపత్ని విజయకు గంగిగోవుకైనా వుండని సహనం వున్నదేమో! లేకపోతే, మీ నిత్య వివేక ప్రదర్శనను

భరించడం ఆ క్షుద్ర రాజపుత్రికకు సాధ్యపడేదా?

సహదేవుడు : నీ వలె ప్రౌఢ కాదు గనక, మనస్సు ఎలా దాచుకోవాలో ఆమెకు తెలియదు.

ద్రౌపది : నేను మనస్సు దాచుకుంటున్నానా?

సహదేవుడు : అన్నదమ్ములలో కడసారి వాడినైనందునే నా కెంత వివేకమున్నా, నేనెన్ని విద్యలు , నేర్చినా, వాటికి రాణింపు లేకుండా పోతున్నదని నాకు పూర్తిగా తెలుసు. అయినా....

ద్రౌపది : వివేకినని చెప్పుకొనడం వివేక లక్షణమా?

సహదేవుడు : చెప్పుకున్నా నాకు గుర్తింపు లేకుండా పోతున్నదిలే!

ద్రౌపది : గుర్తింపు లేకపోవడ మేమిటి? గోగణాలు తమ వివేక సంపదను గుర్తించబట్టే గాదా, తాము చెప్పినట్టు నడుచుకుంటాయి.

సహదేవుడు : ఔను! మానవుల కున్న జాడ్యం వాటికి లేదు.

ద్రౌపది : మీకు తెలుసో, లేదో, ఇలాంటి బాధ మీ నాల్గవ అన్నగారికి కూడా వున్నది. తన అందాన్ని చూచి, ధర్మప్రభువులు ఈర్ష్య పడతారట!

సహదేవుడు : ఈయన త్రిలోక సుందరుడని గుర్తిస్తే మీ ధర్మ ప్రభువులకు వచ్చే నష్టం లేదు. భీమార్జునులు జగదేక వీరులని గుర్తించినా, ఆయనకు నష్టమేమీ లేదు. వివేకినని నన్ను గుర్తిస్తే మాత్రం యుక్తా యుక్త విచక్షణపరులుగా, ధర్మాధర్మ నిర్ణేతలుగా తమకున్న విఖ్యాతి తగ్గి పోతుంది!

ద్రౌపది : మీకున్న ఈర్ష్యా దోషాన్ని ఆయనకు అంటగట్టడం దేనికి? మీరు పరిపాలనా దక్షులని ఆయన మిమ్ము ఎన్ని సార్లు మెచ్చుకోలేదు?

సహదేవుడు : ఇందుకే నిన్ను పోలిన ప్రౌఢ లేదని నేనడం! అయిదుగురు పతుల మధ్య అరమరలు రాకుండా కాపాడుకు రావడం నీకే తగు!

ద్రౌపది : (చిరునవ్వుతో) ఓహో!

సహదేవుడు : అయిదుగురు పతుల ప్రేమను సమానంగా నిలుపుకొనడం నీకే సాధ్యం?

ద్రౌపది : ఓహో!

సహదేవుడు : అయిదుగురు పతుల ద్వారా అభీష్ట కార్య సాధన సైతం నీకే చెల్లు.

ద్రౌపది : ఓహోహో!

సహదేవుడు : నీ "ఓహోలు" నా వివేకానికి జోహారులు!

ద్రౌపది : నిజంగా మీరు వివేకవంతులైతే మీ కోపాన్ని ఈ శిల్పాలపై చూపించే వారా? తాంబూలం పళ్లెరాన్ని ఇంత సేపటిగా కన్నెత్తి చూడకుండా వుండేవారా? లేచి దాన్ని అందుకోండి!

(సహదేవుడు లేచి వెళ్లి, తాంబూలం పళ్లెరాన్ని తెచ్చి, దగ్గరగా పెడతాడు)

సహదేవుడు : ప్రియమెరిగిన పతి ఈనెలు తీసి, సున్నం రాసి, ఆకు మడుపులను పతి నోటికి అందిస్తాదని వివేక వంతునికి చెప్పనక్కర లేదేమో!

(సహదేవుడు తమలపాకులందుకొని, ఈనెలు తీస్తుండగా - తెర).